1 C
1633

# BRAHMA SUTRARDHA DIPIKA

( A true and simple but Comprehensive Commentary in Telugu)

TELUGU

of

BRAHMA SUTRAS

by

VARANASI GANGADHARA S..STRY
*Principal*

B/S

SRI GAUTAMI VIDYA PITHAM
ORIENTAL COLLEGE
Sitampeta
RAJAHMUNDRY

LIBRARY
Rashtriya Sanskrit Sansthan
Shastry Bhawan, New Delhi.

R. SK. S. LIBRARY
Acc. No. 639
Class No.

TELUGU

శ్రీ

ब्रह्मसूत्रार्थ दीपिका

# బ్రహ్మసూత్రార్థదీపిక

రచయిత

వారణాసి గంగాధరశాస్త్రి

ప్రిన్సిపాల్

శ్రీ గౌతమీ విద్యాపీఠ సంస్కృత కళాశాల

రాజమహేంద్రవరము

కృతిపోషకులు

డాక్టరు. శ్రీ బెండపూడి పేర్రాజు పంతులుగారు

విశాఖపట్టణము.

1970

హక్కులన్నియు
రచయితవి.

మూల్యము
రు. 15-00

R. SK. S. LIBRARY
Acc. No. 1639
Class No.

ప్రథమ ముద్రణము : 1000

ముద్రాపకులు :

అడ్డేపల్లి నాగేశ్వరరావు,
సరస్వతీ పవర్ ప్రెస్, రాజమండ్రి.

అంకితము.

ధుర్యత్వంబున వేదశాస్త్రముల సందోహార్థి మందించి సం
సార్యాత్మైక్యసుబోధలంభపరిమృష్టద్వైతుఁడై సత్పుజా
హార్యాద్వైత మతంబుఁ బావఁగ సముద్ధర్తియుఁడౌ శంకరా
చార్యస్వామికి నంకితం బొనఁగుదున్ సద్భక్తి నిదివకన్.

ओम्

# ॥ श्री शृङ्गेरी श्रीजगद्गुरुसंस्थानम् ॥

श्रीमत्परमहंसपरिव्राजकाचार्यवर्य पदवाक्यप्रमाणपारावारपारीण, यमनियमासनप्राणायामप्रत्याहारध्यानधारणसमाध्यष्टाङ्गयोगानुष्ठाननिष्ठ, तपश्चक्रवर्त्यनाद्यविच्छिन्न श्रीशंकराचार्य गुरुपरम्पराप्राप्तषड्दर्शनस्थापनाचार्य, व्याख्यानसिंहासनाधीश्वर सकलनिगमागमसारहृदय सांख्यत्रयप्रतिपादक वैदिकमार्गप्रवर्तक सर्वतन्त्रस्वतन्त्रादिराजधानीविद्यानगरमहाराजधानीकर्णाटकसिंहासनप्रतिष्ठापनाचार्य श्रीमद्राजाधिराजगुरुभू-मंडलाचार्य ऋष्यशृङ्गपुरवराधीश्वर तुङ्गभद्रातीरवासि श्रीमद्विद्याशंकरपादपद्माराधक श्रीजगद्गुरु श्रीचन्द्रशेखरभारतीस्वामिगुरुकरकमलसञ्जात

## श्रीजगद्गुरु
## शृंगेरी श्रीमदभिनवविद्यातीर्थस्वामिभिः ॥

अस्मदत्यन्तप्रियशिष्य वाराणसि गंगाधरशास्त्रिविषये
नारायणस्मरणपूर्वकं विरचिताशिषस्समुल्लसन्तु ।

मानवं जन्म आत्मज्ञानेनैव हि कृतार्थम् भवेत् । आत्मतत्त्वस्वरूपावगमश्च श्रुतिशिरःपरिशीलनेनैवेति निश्चप्रचम् । तच्च वैयासिकब्रह्मसूत्रप्रतिपादितन्यायैरेव सुशकं भवतीत्यत्र समेषां विदुषां समानोभिप्रायः ।

तानि च सूत्राणि शंकरावतार शंकर भगवत्पादैः गम्भीरेण भाष्येण भूषितानि। तेषां च सभाष्याणां सम्यगनुसन्धानं आत्मज्ञानं ससाधनं जनयत्येव।

अनधिगतसुरसारस्वतानामपि आन्ध्रभाषाविदां सुलभं तदर्थावबोधो भवत्विति ब्रह्मामृत वर्षिणी मनुसृत्य भाष्यं आन्ध्रभाषया व्याख्याय लोकानां परमां उपकृति मातन्वन् भवन्तः।

ब्रह्मसूत्रार्थदीपिका नाम्ना प्रकाशं नीयमानोयं भाष्यतात्पर्यावगमको ग्रन्थः सर्वत्र सुप्रथितो भूयात, प्रणेतृणां भवतां शारदा चन्द्रमौलीश्वरौ भद्रपरम्परा देयास्तुरिति चाशास्महे।

शृंगगिरिः श्री

इतिनारायणस्मरणम्

सौम्य फाल्गुन शुद्ध दशमी
17 - 3 - 1970

॥ श्रीः ॥

श्रीमत्परमहंस परिव्राजकाचार्यवर्य श्रीमच्छङ्कर भगवत्पादप्रतिष्ठित श्रीकाञ्ची कामकोटि पीठाधिप जगद्गुरु श्रीमच्चन्द्रशेखरेन्द्र सरस्वती श्रीपादादेशानुसारेण श्रीमज्जयेन्द्रसरस्वतीश्रीपादैः आन्ध्रप्रदेशप्रसिद्ध राजमहेन्द्रवरपुरस्थ गौतमीविद्यापीठ संस्कृतकलाशालाध्यक्ष ब्रह्मश्री वारणासि गङ्गाधरशास्त्रिविषये क्रियते नारायणस्मृतिः ।

आन्ध्रभाषायां भवद्भिरचिता ब्रह्मसूत्रार्थदीपिका संस्कृतभाषास्थ ब्रह्मामृतवर्षिणी मनुसृत्य ब्रह्मसूत्राणामर्थं विवृण्वती आन्ध्रभाषाज्ञाना मद्वैत तत्त्वजिज्ञासूनां एतत्तत्त्वप्रकाशने अत्यन्त मुपकारावहा वर्तते ।

भवानेवमेवोत्तमग्रन्थान् विरचयन् निखिल प्रेयः श्रेयः परम्पराः प्राप्यादित्याशास्महे ।

श्रीकाञ्चीक्षेत्रम् | नारायणस्मृतिः
साधारणश्रावणामावास्या

---

శ్రీరస్తు

# ప్రస్తావన

ఒకనాఁడేనలక్ష్మణరాయుని కడుండోత్కంఠ పున్నిర్మలాం
ప్రకృతిన్ గీతనువిన్పుచుండఁగ యశోధన్యాగ్రగణ్యుండుని
ప్రకటాలంకృతి వెరరాజమున కుంభద్వైదర్శనాథుండును వ
చ్చికటన్ముట్టఁగ సంతసంబున్ విని నరశ్రీగార్ప్రశానిట్లనెన్

కం॥ భగవద్గీత తెలుంగుల
జగతీతముగఁ జదివినాఁ డనన్నిటఁగూడన్
సుగమమయి భావశుద్ధిని
మిగులన్ మీరచన గుణసమృద్ధినిమించున్.

చం॥ కలదొకకోర్కెనాకుఁ జిరకాలమునుండియు బ్రహ్మసూ
త్రముల్
తెలుఁగునఁ దేటతెల్లముగఁ దెల్పెడు టీకరచింపఁజేయఁగా
సులలిత వాక్యకౌశలము చూడఁగ నద్ది భవాదృశాళికిన్
సులువగు మన్మనోరథము సూరివరేణ్య! ఫలింపఁజేయవే!

వ॥ అనిపలుకుచు నరసింహా కృష్ణరాయునితో నేదిమో
మంతనమాడి,

ఉ॥ ఆకులువక్క లేలకులు నొసఁగుచున్ మఱికొంతరొక్కమున్
జేకొని శాస్త్రిగారు! ఇదిచేకొనుఁడంచును నాకొసంగఁగాఁ

గైకొని యీవదాన్యతకు ఖండ ముదంబున సంగ్రథనంబు
నన్
చైకొన సేవింపల్కుటకుఁ బల్కులతో దక నొప్పకేలకున్.

ఉ॥ గ్రంథములందు వర్ణనలఁ గాంచిన యీకృతికర్తృ
భర్తృసం
బంధము నేఁడు మీవలన స్పష్టముగాఁగనుపట్టినాకుని
గ్రంథిత సర్వశాస్త్రులగు మాన్యుల కీయది వ్రాయఁజెల్లుఁబ
వ్యంథయసాధ్యమౌ మధువు పల్కుట శక్యమయౌనె
యాఁగకున్?

చం॥ గురువరసత్కటాక్షమునఁ గూరిమిమీరెడు మీదు
నాదృతిన్
నరవర! మీమనోరథ మనశ్వరమై విలసిల్లుఁ, దెస్గలోఁ
బరిచయ మున్నవారలకు వ్యాసమహాముని బ్రహ్మ
సూత్రముల్
గరపఁగ వీలుగల్గు నోకో! కల్గదో! యంచు మనోక్క
పట్టునన్.

చం॥ పనిగొని నివృత్తి వ్రాసితి సభంగురరీతిని నాంధ్రభాషలో,
వినుఁడు శ్లోకసారిదాని నది విస్ఫుటభంగిని వర్ధమాను, మీ
రనుకొనినట్టులుండు, నదియుంతయు సద్గురువర్య
సత్కృపా
ఘనతరశక్తి సత్ఫలముగాని మదుద్యమమాత్ర సాధ్యమే!

వ॥ అనిపలికిన

శా॥ బ్రహ్మానందము నొంది నట్టులయు, యీ బ్రహ్మాత్ముండు సత్యజ్ఞనా
జిహ్మప్రక్రియ లెల్లఁ బోనడచు రాశీభూత శైవజ్యమా
బ్రాహ్మణ్య శ్రీదివౌక సేశ్వరుఁడు దీవ్యత్కాంతితోఁ బల్కెనా
బ్రహ్మార్థప్రతిపాదకంబయిన సూత్రవ్యాఖ్యవిన్పింపఁగన్.

వ॥ పలికినవట్ల కాశయుని యొక్క శుభ సమయంబున శ్రీ వీరరాజ ప్రభూత్తముని భవన ప్రాంగణంబునఁ బండిత వర్య శోభితంబగు పత్రాస్థలంబున బుద్ధిరచిత వృత్తిగ్రంథంబు నుండి జిజ్ఞాసాధికరణము మొదలు చతుస్సూత్రియు, ఆనంద మయ ప్రపత్త్యాధికరణంబులును దదనంతర ప్రతిపత్త్యాది తదభి మత శత్రుదధికరణంబులును, వినిపించిన విని హర్షోత్కర్షం బున, మీ వ్యాఖ్యకోలఁదిపాటి విజ్ఞానముగల జిజ్ఞాసువులకును నర్థబోధకంబయి యనవద్యశాంకరాద్వైత సిద్ధాన్త ప్రతి పాదకంబునునై యున్నది. శీఘ్రకాలంబున ముద్రణ ప్రయత్నం బొనరింపుఁడని దస్మదర్ణంబునకుఁగు ద్రవిణం బొసంగి నన్నుం బ్రోత్సహించె.

అంత నేను "అపరితోషాద్విదుషాంన సాధుమన్యే" అను కాళిదాస కవీంద్ర వచనంబును సంస్మరించి సంస్కృ తాంధ్ర ప్రవీణులును తర్క వ్యాకరణ వేదాన్త మీమాంసా

తత్త్వజ్ఞులును చతుస్తంత్రులును దర్శనబోధకులును దర్శ
నాలంకారులును కళాప్రపూర్ణులును విశ్వవిద్యాలయాధ్యాప
కులును నగు పలువురు పండిత ప్రకాండులకు నా టీకాగ్రంథమున్
వినిపించి తత్సమ్మతి వచనంబుల నెమ్మది సంతసించితి.
అద్వైత ప్రతిష్ఠాపకులును బూజ్యపాదులును నగు శ్రీ శంకరా
చార్య స్వాములకు నీకృతి సమర్పణంబు గావింపుఁడు నేను సేవ
లను కృతిపోషణ భారమును వహింతునని యుదార హృద
యంబునఁ బల్కిన కృతిపోషకులగు శ్రీ కొండపూడి వీర
రాజేంద్రుని వంశావతార క్రమమిందు వర్ణించెద

ప్రథమముఁగను వస్త్వంబాద్యుల
మథికామ్నాయముఁగను సమస్త మహామాన్వితుఁగన్
ప్రథిత చరిత్రుఁడు కశ్యపుఁ
డధిక తపశ్శాలి, అతని యన్వయమందున్

చం॥ సకల కళాబ్ధి రాములును సన్మతిశీలురు వంశకర్తలున్
ప్రకట యశోరుచి ప్రసరపాలిత సర్వ దిశాన్తరంగులున్
సుకృతవిశేష సత్కుసుమశోభిత దివ్యశిఖోత్తమాంగుల
క్షయకలుష సద్ద్విజేంద్రులుదయంబును గాంచిరి కొండ
కొండలో!

గీ॥ వారిలోపలఁ బేర్గొన్న వారు మిగుల
కొండపూడింటి వారలఖండ యశులు
దండితారాతి వరులు సద్దండసుకవి
మండితాపన తత్పరుల్ భక్తపరులు.

కం॥ ధనపతులు ధర్మదాతలు
ఘనవిజ్ఞానైక నిధులగాధ మనస్కుల్
వినయోపేతులు తేజో
ధనులగు సత్పురుషవరు లుదారచరిత్రుల్.

శా॥ అంశంబునఁబుట్టి విప్రుఁడొకఁడు ద్యద్వైదికాగ్రేసరుం
జీవేశం గనుగొన్న భక్తి వశుఁడై యాశాను శ్రీపార్వతీ
దేవీశ్లిష్ట నిజార్ధ దేహు సభవుండీశా పరత్వంబునన్
సేవింపంగను కార్యభారమున నిర్నిద్రస్థితిం గన్పడున్.

కం॥ విభవమునుగాని విద్యల
శుభచరిత కళత్రభవ్య సుఖమునుగానీ
ప్రభువిభ కుమారుఁ గానీ
లభియింపఁగ వాంఛగనఁడలంతిగ నైనన్.

కం॥ ఆతనివిశాంత భక్తికి
నీశా కాంతుఁతకు ప్రజలు విస్మయమందన్
ప్రాఁ తేమి! శివుఁడు హర్ష
ప్రీతుండయి యొక్క నాఁటి వేకువ వేళన్.

కం॥ శిరమందు నిందు రేఖా
భరితశ పద్మము సందు భాగీరథియున్
వరవామభాగ గౌరీ
తరుణీయుఁగల రూపుతోడ దర్శనమిచ్చెన్.

వ॥ అంతనయ్యనన్నాసురుండు పులకిత శరీరుండయి నిజాభీష్ట దైవతంబగు నయ్యష్టమూర్తికి సాష్టాంగ మెఱఁగి యద్భుతానంద పారవశ్యంబున గద్గదకంఠుండై

శా॥ స్వామీ! నీమహిమాతిరేకము బ్రశంసింపం జేయ నేనెంత! యు
ద్దామ ప్రజ్ఞులు బ్రహ్మవిష్ణువులు సుత్రామాది గీర్వా
ణులున్
రామే చాలమటంచు నోడుదురు తాత్పర్యంబుతోఁ
బ్రోవుమీ
శ్రీమద్దివ్య భవత్పదాంబుజరజశ్శ్రీ ప్రోత్తమాంగున్ ననున్.

గీ॥ రిక్తహస్తత రాజు దర్శింపరాదు
పేరురాజవె! వినుము నీపేరు రాజ
శేఖరుఁ డురంబు పేరు రాజిల్లఁ జన్న
పేరు రాజత రాజ! అర్పించువాఁడ

వ॥ అని ప్రార్థించి నిజకంఠ నిర్ముక్త సువర్ణ రుద్రాక్ష మాలికా కంఠాభరణంబును శ్రీ కంఠకంఠంబున నునిచి పరమేశ్వరు పాదాబ్జంబులు వినుమక యున్న నారాజశేఖరుండు భక్తశేఖరు లేవనెత్తి వత్సా! నీభక్తికి మెచ్చి దర్శనం బిచ్చితి

గీ॥ నాల్గు పర్యాయములు నీదు నాల్క నుండి
పేరు రాజను మాటలు వినఁగవచ్చు
నాల్గు తెఱనులవలెను నీ నడిగ్నుహాన
పేరు రాజులు వెలయుదుఁ జేరుగాంత్రు

క॥ అనియాపతిబ్బి హిమవ
జ్జనితోషత శంకరుఁడు సంహృతతనుఁడై
కనఁ బడకపోవ, కన్నులు
తనవాకో! నాథా! యనియుతఁడు కలంగెన్.

ఉ॥ ఇప్పుడుగూడఁ జూచితిని యింతటిలోపనె మాయమయ్యెనే!
యెప్పుర మేశ్వరుండు, కలరాయిది! భ్రాన్తిరాయి!
కంఠమాలికన్
దప్పను నాగకంబు విశకంబుగు కెట్టెది! నిక్కమాను, నే
నెప్పుడు హార్యతిహాసం వెదుతుఁ గోరిక కోరలేదుగా.

గీ॥ దైవసుహీమము చిత్రముల్ తలఁప మనుజ
మానసాగోచరము లను మాటనిజము.
ప్రబల భవితవ్యతా వశంవదములగుచు
వఱలుచుండు నటంచ్రు విద్వాంసులెలను.

గీ॥ వంశ విచ్ఛేదకుండనవతియ్యఁడనెడి
నామతిప్పను నాకుదైవంబువలన
అత్మతీరణంబున కుమారుమరయునగును
గాని యత్యుయాణమునుదీర్చఁగలదె! దారి

గీ॥ అనుచు నా రాజశేఖరుఁ డావిధిని
హర్షమందుచునుండఁగా సతినియతిని
గర్భవతియయ్యె దివ్యలగ్నంబునందు
శేరరాజాహ్వయునిగాంచెఁ బ్రియతనూజ.

కం॥ దీపమునఁ బుట్టు దీపం
బేపగిదిన్ దానిపోలె నెంతయు దీప్తిన్
జూపుచు వెలుంగునట్లే
పాపయు నిజజనకునట్లు ప్రౌఢుండయ్యెన్.

వ॥ పరమేశ్వర ప్రసాదాసాదిత సంభవులగుటం జేసి ప్రథమ ద్వితీయ తృతీయ వీరరాజులు సద్ధర్మకార్యా చరణ ధురీణులై యుత్తరోత్తరాధిక యశోవిభవాభిరాములైరి అందు నాల్గవ తరము వాఁడయిన యీ వీరరాజేంద్రుఁడు వివిధ విద్యావిశారదుఁడును బరోపకార తత్పరుఁడును నగదంకారకులాభరణంబునై వెలయు

సీ॥ చేయిపట్టినయంత చెనటిజ్వరంబైన
మూఁడుపూటలలో
కత్తిఁబూనినయంత గడ
వ్రణములు తెపు యుంతఁ బగిలిపోవు.
నరిగఁజూచినయంత నరుని రోగంబెల్ల
ఎక్కునేలేకుండ నేర్పరించు
కరుణఁగల్గినయంత కాలునిచేఁబడ్డ
బ్రతికింపఁ బ్రాణంబు నతఁడు నేర్చు

గీ॥ అపర ధన్వంతరి యటంచు, నాశ్వినేయ
లోకరూపైనవాఁడని, చక్కనైన
చరకుఁడేయని, వైశాఖ పురములోని
ప్రజలు కీర్తింతురీ వీరరాజభిషజు

సీ॥ అర్థింపవచ్చిన యతని మనోరథ
మాలించి నెఱవేర్చి యనుపువాఁడు
ధర్మసంస్థలనిల్పఁ దలపోయువారల
కగ్రేసరుండయి యలరువాఁడు
నిరుపమ భక్తితత్పరతను నిరతంబు
కోరి విద్వద్గోష్ఠి కూర్చువాఁడు
ఇహకామునిష్కాపేక్ష సత్కృతిరత్న
పోషణ భాగ్యంబు పూనువాఁడు

గీ॥ అహరహంబును ఖండేందుమౌళిపూజ
చెలఁగి పత్నీసమేతుఁడై చేయువాఁడు
ఎముక లేదను నంతటి యీవికాఁడు
రమ్యగుణ సాంద్రుఁడగు వీరరాజ విభుఁడు.

మ॥ పరభావంబులఁ జిక్కఁగా నెఱుఁగనుత్పన్న ప్రభావుండు దు
ర్భర బాధాయుత రోగి రోగఘన హార్యత్వవ్రణం బార్ప న
చ్చెరభాకారుఁడు వీరరాజన కపత్యశ్రేష్ఠుఁడైపుణ్య శ
క్తురలేరత్నముగూడ వైద్యపరతంత్రంబౌట సామాన్యమే!

ఉ॥ ఆతనినెన్నఁ బుట్టె నొకయాత్మజుఁడాతఁడు మల్లికార్జున
శ్రీతత దివ్యరూపుఁడు నశేషశుభావహ సద్గుణోత్తరుం
డాతత కీర్తిశాలి, తనయుద్యమమెల్ల సఫల్యసేయ వి
ఖ్యాతుఁడు తండ్రి కొల్పు దనయుంగనఁ గూడినిశ్చితవమున్.

శా॥ సీతారత్నము సాదిలక్ష్మి కనకస్వీతాకృతుల్ పుత్రికల్
చేతోజాత సమాన వల్లభుల సౌశీల్యాఢ్యులన్ నిత్యమున్
పాతివ్రత్యమువీడఁ గొల్చుచును బాపల్ బిడ్డలున్
గూడరాన్
యాతా యాతము లాచరింపఁగల రయ్యాన్దల్లి
వీక్షింపగ

వ॥ ఇవ్విధంబున నిఖిలబంధు సుహృజ్జన ప్రశంసా పాత్రుం
డగు చేరరాజ పృథివీ బృందారకుం గాంచి

శా॥ శ్రీనాథాది కవీంద్ర శేఖరుల యాశీర్వాద మర్థించి వి
జ్ఞానాధాయక భీమఖండముఖ నానాకావ్య సంపోషణం
బేనాఁడో కవి కొండవ్వాడికుల వార్ధీందుల్ యశఃకాములై
పూనంగల్గుట సర్వలోకవిదితంబో చేరరాజాగ్రణీ

శా॥ ఆవంశంబునఁ బుట్టినట్టి కవులేలా! సత్కృతి స్వామ్యము
శ్రీనాథింపరు! సర్వలోకులకు సుశ్రేయఃప్రద బ్రహ్మసూ
త్రావేద్యార్థము దీపికాముఖమునన్ దర్శింపఁగాఁజేసి వి
ద్యావైదుష్యము గల్గఁజేసితిరి శుద్ధాద్వైత భావంబునన్.

వ॥ కావున

చం॥ సకల శుభంబులన్ బడసి సన్నుతిగాంచుఁడు మీరు పుత్రపౌ
త్రకముగ సర్వలోకులకు దాత్తతమంబగు బ్రహ్మభావనా
మకరస (సుధ) మిచ్చి మోహమహిమ ప్రచురంబగు సంసృతి వ్యథన్
వికలముచేసినట్టి సువివేక శివగ్వర పీఠరాజ్ఞిణీ.

వ॥ అనిదీవించి తత్స్వభావముఖంబునఁ బూజ్యపాదులగు శంకరాచార్య స్వామికిఁ గృతిసమర్పణంబు గావించి తత్స్వరూపులగు శ్రీ శృంగగిరి కామకోటి పీఠాధిపతులగు శంకరుల శ్రీముఖ పురస్సరంబుగా గ్రంథంబు సాంతంబు నిట్లువినిపించితి.

---

శ్రీరస్తు

# విజ్ఞప్తి

**శివాయ గురవే నమః**

అచతుర్వదనో బ్రహ్మా ద్విబాహురపరో హరిః।
అఫాలలోచనః శంభుః భగవాన్ బాదరాయణః॥

అని బ్రహ్మవిష్ణుమహేశ్వరాత్మకుఁడుగాఁ బ్రశంసింపఁబడిన భగవంతుఁడగు బాదరాయణుఁడు ఈ శారీరకమీమాంసాసూత్రములను రచించెను. శారీరకుఁడనఁగా జీవుఁడు. శరీరశబ్దమునకు స్వార్థమున కప్రత్యయము చేసిన శరీరకమని యగును. శరీరకముననున్న వాఁడు శారీరకుఁడు. (జీవుఁడు) శారీరకుని గుఱించిన మీమాంస (విచారణ) కావున నీసూత్ర గ్రంథమునకు శారీరక మీమాంస యనిపేరు కలిగినది. "శరీరమేవ శరీరకమ్. శరీరకేభవః శారీరకోజీవః, తమధికృత్యకృతో గ్రన్థః శారీరకః" అని పద్మపాదాచార్య విరచిత పంచపాదికలోను, "శరీరమేవ శరీరకం. తత్రనివాసీ శారీరకో జీవాత్మా, తస్య త్వం పదాభిధేయస్య తత్పదాభిధేయ పరమాత్మరూపతామీమాంసా యా సా తథోక్తా." అని వాచస్పతిమిశ్ర ప్రణీత భామతిలోను శారీరక, శారీరకమీమాంసా, పదములకు నిర్వచనము గావింపఁబడినది.

శ్రీరామానుజ భాష్యటీకయగు శ్రుతప్రకాశికలో మాత్రము "శారీరకం బ్రహ్మమీమాంసా జగచ్ఛరీరకః పరమాత్మా శారీరః "తస్యైష ఏవ శారీర ఆత్మా" ఇతిశ్రుతేః తద్విషయకం శాస్త్రం శారీరక మిత్యుచ్యతే" అని చెప్పఁబడినది.

"అనుపపత్తేస్తు న శారీరః" బ్ర. సూ. 1-2-3 "శారీరశ్చోభయేపి హి భేదేనైన మధీయతే" బ్ర. సూ. 1-2-20 అను సూత్రములలో బాదరాయణులు శారీరపదమును జీవపరముగనే వ్యవహరించిరి. ఈసూత్రముల వ్యాఖ్యాన సందర్భమున శ్రీశంకర భగవత్పాదులును భాష్యములో శారీరపదమునకు జీవుఁడనియే యర్థమును జెప్పిరి.

జీవబ్రహ్మాభేద తాత్పర్యకముగనే సూత్రకారులు స్వప్రణీత సూత్రములను శారీరక మీమాంసా సూత్రములు, బ్రహ్మసూత్రములు, అనివ్యవహరించిరి. శారీరకుఁడగు జీవుఁడు బ్రహ్మభిన్నుఁడా! బ్రహ్మస్వరూపుఁడా! అని బ్రహ్మ విషయకమగు మీమాంస యీసూత్రములందుఁ జేయఁబడినది. జీవుని యొక్క శోధితతత్త్వమే బ్రహ్మస్వరూప మగుటవలన నీగ్రంథమునకు, శారీరక మీమాంస, బ్రహ్మమీమాంస, శారీరకము, బ్రహ్మసూత్రములు, అను నామములు ప్రసిద్ధముగా నున్నవి.

దేహమే యాత్మయని. మనస్సే, ఆత్మయని, క్షణిక మగు విజ్ఞానమే ఆత్మయనియు, దేహాదివ్యతిరిక్తుఁడగు ఆత్మ కర్తృత్వభోక్తృత్వ లక్షణములు కలవాఁడనియు,ఆత్మభోక్త, ప్రధానముకర్త, అనియుఁ బెక్కుమంది పెక్కురీతుల వచించు చుండఁ బరమకారుణికుఁడైన బాదరాయణుఁడు తత్త్వనిర్ణయ మొనరింప నీసూత్రగ్రన్థమును రచించెను.

ఇందు సూత్రకారులు ప్రధానకర్తృవాదమును బలు మారులు పలుతావుల సప్రమాణముగ నిరసించిరి. మిగిలిన వాదములనన్నిటిని ఆయెడఁ దత్తత్సందర్భములయందు నిరాకరించిరి. శ్రుతిప్రమాణ పూర్వకముగ జీవేశ్వరాద్వైత మును నిర్ణయించిరి.

ఈశారీరక మీమాంస నాలుగధ్యాయముల గ్రన్థము. అధ్యాయమునకు నాలుగుపాదములు. మొత్తమీగ్రన్థమునఁ బదునారు పాదములలోను, 191 అధికరణములును, 555 సూత్రములును గలవు. అధికరణ మనఁగా నొకవిమర్శనము.

ఇందు మొదటిది సమన్వయాధ్యాయము. ఇందును మొదటి నాలుగు సూత్రములకును చతుస్సూత్రియని పేరు. దీనిలో బ్రహ్మ జిజ్ఞాస్యమని చెప్పి, బ్రహ్మలక్షణమును, శాస్త్ర ప్రామాణ్యమును దెలిపి, వేదాన్తశాస్త్రమునకుఁ బరబ్రహ్మ మునందు సమన్వయము చూపఁబడినది. ఉపనిషద్వాక్యము లలోఁ గొన్నిటియందు బ్రహ్మలింగము స్పష్టముగ గోచ

రించుచున్నది. కొన్నిటిలో నస్పష్టముగ గోచరించుచున్నది. కొన్ని యుపనిషద్వాక్యము లుపాసనాపరములుగ నున్నవి. కొన్ని వాక్యములు జ్ఞానపరములుగా నున్నవి. ఇట్టి యీ వాక్యముల కన్నిటికిని ప్రత్యగభిన్నాద్వితీయపరబ్రహ్మ యందే తాత్పర్యమని తత్తద్వచనోదాహరణ పూర్వకముగ సమన్వయముచేయఁ బడినది.

ప్రధానపరముగ నర్థము చెప్పుటకు వీలుగానున్న "అవ్యక్త" "అజ" మొదలగు కొన్ని యుపనిషద్వాక్యస్థ పదములకుఁబరబ్రహ్మమే యర్థమని సప్రమాణముగ నీయధ్యాయము చివరవఱకును సమన్వయము చేయఁబడినది.

రెండవది అవిరోధాధ్యాయము. మొదటి యధ్యాయములో, వేదాన్త వాక్యములకుఁదాము పరబ్రహ్మమునందు సమన్వయము చేయుటవలన సాంఖ్య యోగ కాణాదాది స్మృతులతోను, వారియుక్తులతోను దమ సమన్వయమునకు విరోధము రాదాయన నట్టి విరోధమేమియును లేదని వారి మతములలో లోపములను జూపించుచు వానిని నిరసించి యుందు స్వమతమును ప్రతిష్ఠాపించిరి. సృష్టిశ్రుతులలోను జీవశ్రుతులలోను ఇంద్రియ విషయశ్రుతులలోను గల పరస్పర విరోధము పరిహరింపఁబడినది. కాన నిది యవిరోధాధ్యాయ మనఁ బడినది.

మూఁడవది సాధనాధ్యాయము. సాధనములనఁగాఁ బరికరములు. మానవుఁడు బ్రహ్మజ్ఞానము పొందుటకు ముఖ్యముగాఁ గావలయు సాధనముల విచారణ యిందుఁ జేయఁబడినది. బ్రహ్మజ్ఞాన సాధనములు నాలుగు. 1. నిత్యానిత్యవస్తు వివేకము 2. వైరాగ్యము 3. శమదమాది సంపద 4. ముముక్షుత్వము. అని. మొదటి రెండధ్యాయముల చేతను బ్రహ్మపదార్థమే నిత్యమని, తదితర మనిత్యమని యించుక వివేకము కలుగును గాన, ఇహాముత్ర ఫలభోగములందు వైరాగ్యము కలుగుటకై యిందు ముందుగఁ బరలోక గమనాగమన విచారణ చేయఁబడినది. ఆ, గమనాగమనముల యందు జీవుఁడు పొందు నవస్థ విన్నచోఁ దప్పక వైరాగ్యము కలుగును. తరువాత త్వంపద తత్పదశోధనము చేసి నిర్గుణ బ్రహ్మ విద్యలోను సగుణ బ్రహ్మవిద్యలోను శాఖాన్తరీయుల గుణోపసంహారానుప సంహారములు చెప్పఁబడినవి. పిదప బ్రహ్మప్రాప్తికి సాధనములలో బహిరంగ సాధనములగు ఆశ్రమధర్మములను యజ్ఞదానాదులను జెప్పి, తరువాత నంతరంగ సాధనములగు శమదమాదులను నిరూపించిరి.

నాల్గవది ఫలాధ్యాయము - ఇందు బ్రహ్మజ్ఞాన ఫలము తెలుపఁబడినది. సగుణ నిర్గుణ విద్యలలోఁ గల తారతమ్యము చెప్పఁబడినది. ఉపాసనావృత్తిచే సగుణ బ్రహ్మమును గాని శ్రవణాద్యావృత్తిచే నిర్గుణ బ్రహ్మమును గాని సాక్షాత్కా-

రము నొందిన వానికి జీవన్ముక్తియు, చనిపోవు నతని యుత్క్రమణ ప్రకారము, సగుణబ్రహ్మ జ్ఞానియై చనిపోయిన వాని యుత్తరమార్గ ప్రకారము బ్రహ్మలోక స్థితియు, నిర్గుణబ్రహ్మ జ్ఞానియైన వానికి విదేహ కైవల్య ప్రాప్తియు మున్నగు ఫలములు వివరింపఁబడినవి.

సంగ్రహముగ నిందుఁగల విషయము లివ్వియని యనుటయేకాని తత్త్వనిర్ణయమున కావశ్యకములగు నంశము లిందు వివరింపనివి లేవు. జిజ్ఞాసువులకుఁ గలుగు సందేహముల కన్నిటికి నిందు సమాధానములు కలవు. ప్రాకరణికముగ, ప్రాసంగికముగ సర్వవిషయములు నిందు విమర్శింపఁ బడినవి.

అధికారియగు పురుషుఁడు సాధనాధ్యాయమునఁ జెప్పఁబడిన సమ్యగ్జ్ఞాన సాధనముల ననుష్ఠించి సర్వవేదాన్త వచన పరమ తాత్పర్య గోచరమును నిర్విశేషము నిర్గుణము పారమార్థికమును నగు నద్వితీయ పరబ్రహ్మమును సాక్షాత్కరించి యిచ్చటనే సచ్చిదానంద బ్రహ్మస్వరూపావ స్థానరూపమగు సద్యోముక్తియను పరమముక్తిని బొంది యధిగతాధిగంతవ్యుఁడు కావలెనని కాని,

లేదా, సమ్యగ్జ్ఞాన సాధనానుష్ఠాన పూర్వకముగ సర్వ వేదాన్తవచనావాన్తర తాత్పర్య గోచరమును సవిశేషము సగుణము వ్యావహారికమును నగు అపరబ్రహ్మ స్వరూపమును

అహంగ్రహోపాసనముచే నావరణ ముపాసించి సాక్షాత్కారము నొంది యర్చిరాది మార్గమున బ్రహ్మలోకము నొంది యందు దివ్యభోగముల నంది భగవదనుగ్రహాలబ్ధమగు సమ్యగ్జ్ఞానక్రమ ముత్తరోపాయమగు నపరముక్తిని బడసి ప్రాప్త ప్రాప్తవ్యుండు కావలెనని కాని యీ గ్రన్థపరమ తాత్పర్యము.

వేదాన్త విషయజిజ్ఞాసువులకు శారీరక మీమాంసా సూత్రములు చక్కని రాచబాటను జూపి గమ్యమును బొందించుటకు మిక్కిలి సహకరించుననుట నిక్కము. ఈ సూత్రనిగూఢ భావములకు శ్రీ శంకరాచార్య విరచిత భాష్యము ప్రదీపాయమానమైనదనుట నిస్సంశయము. కాల వశమున సూత్రభావములనుగాని భాష్యాశయములనుగాని తెలిసికొనుట జిజ్ఞాసువులకు దుశ్శకమైనది. సంస్కృతభాష యందు శాస్త్రములందును బరిచయము గలవారికే కాని యన్యులకు బ్రహ్మసూత్రార్థజ్ఞానము దురవగాహమై పోయినది. భాష్యాదులను జదువలేకున్నను మూలామూలిగ సూత్రములకైన నర్థము తెలిసికొందమను నభిప్రాయముగల నాతిపరిచిత సంస్కృతభాషులగు జిజ్ఞాసువులకుఁ గొంతవఱకే నైన నుపయోగపడునేమో యని తెలుగున నీవృత్తిగ్రన్థము వ్రాయ సంకల్పించితిని. సంస్కృతములో బ్రహ్మామృత వర్షిణి, మితాక్షర, హరిదీక్షితకృత బ్రహ్మసూత్రవృత్తి మున్నగునవి గలవు. బ్రహ్మామృత వర్షిణి నవలంబముగాఁ జేసికొని, యితర వృత్తుల సహాకారములతో శ్రీశంకరాచార్య

స్వామివారి యుపనిషత్సూత్రభాష్యముల సహాయముతో విజ్ఞులగు పెద్దల తోడ్పాటుతో బ్రహ్మసూత్రార్థదీపికయను నీవృత్తిని వెలువరించితిని.

దీనికంతకును మూలము గురుకటాక్షము. గోష్పదీతీరమున శంకరమఠస్థాపకులును నృసింహ భారతీస్వాములవారి ప్రియ శిష్యులును నగు శ్రీసత్యానంద సరస్వతీస్వాములవారు దయాన్తఃకరణముతో నాకుఁ బ్రస్థానత్రయమును బోధించిన పరమ గురువులు. వారియనుగ్రహ విశేషమే నన్నీ కృషికిఁ బురికొల్పినది. పాఠకమహాశయు లిందుఁ గల స్ఖాలిత్యములను మదీయమతి విలసితములనుగాను, గుణములను గురువుల భాషణములనుగాను గ్రహించి వేదాన్త ప్రథమబోధినిగా నైన నియ్యది జిజ్ఞాసూపకారకమగు ననీ, ప్రోత్సహించి నన్ను మన్నింతురుగాకయని వేడుచున్నాను.

వ్రాసినగ్రన్థమును బ్రజానీకమున కందింపఁ గలుగుట యీదినములలో బహుకష్టసాధ్యము. అన్నిటికివలెఁ గాగితమునకు, ముద్రణమునకును గూడ విపరీత వ్యయమగుచున్న యీ సమయమున సహాయౌదార్య ధురంధరులును, అగదంకార వర శిరోమణులును నిజవంశానూనా నూచానసాంప్రదాయిక కృతివాల్లభ్యనిర్వహణలబ్ధమహా నాఽనసమాన యశోవిశేష శోభితులును నగు బ్రహ్మశ్రీ బెండపూడి వీరరాజ వదాన్యశేఖరులీకృతి నచ్చొత్తించి దీని కొక యాకృతి గల్పించి లోకమునకును నాకును మహోపకృతి గావించిరి.

పుత్ర పౌత్ర పారంపర్యముగ వీరు సకలైశ్వర్య శోభితులై యింకను పెక్కుకృతి రత్నములను ప్రకాశింపఁ జేయుఁ బరమోత్సాహమును భగవంతుఁడు వీరికిఁ బ్రసాదించుఁ గాక యని కోరుచున్నాను.

భగవద్గీత లను పేరితో వెలసిన శ్రీకృష్ణపరమాత్మ యొక్క వాగంశములను వ్యాయముగ నావిష్కరింపఁజేసియుఁ బరమార్థ ప్రకాశకమగు బ్రహ్మసూత్రార్థ కాంతిపుంజమును లోకమున వెలయింపఁ జేయుట రాజమాత్రైక సాధ్యమని శ్రీపేరరాజ భిషజ్జ్నాథులకుఁ బ్రతిష్ఠచే కూర్చిన కృష్ణసారథ్య మీసమయమున సంస్మరణీయము.

సాంతముగఁ బామరాగ్రంథమును జదివి భూమికను నుపోద్ఘాతమును, సదభిప్రాయములను వ్రాసియిచ్చిన విద్వదగ్రగణ్యులకు నా వినయ పూర్వక నమోవాకములు.

ముద్రణము విషయములో సాధ్యమైనంత వరకుఁ దప్పులుపడకుండ శ్రద్ధతీసికొని ముద్రింపించిన శ్రీ సరస్వతీ పవర్ ప్రెస్ యజమానులగు శ్రీనాగేశ్వరరావుగారెంతయుఁ బ్రశంసనీయులు.

సులభముగ నర్థమగుటకై కొన్ని యెడల సంధులు చేయకయు, చేసియు, వ్రాసిన నా యీ వ్రాతను బాఠక మహాశయులు మన్నింతురుగాక.

సీతంపేట శుభం భూయాత్. ఇట్లు

సౌమ్యసంవత్సర వారణాసి గంగాధరశాస్త్రి.

మార్గశీర్ష-వైకుంఠైకాదశి. *Principal*

ది-19-12-69 S. G. V. P. Oriental College

Rajahmundry-1.

శ్రీ

# భూమిక

సాహిత్య విద్యాప్రవీణ ఉభయ భాషాప్రవీణ.

బ్రహ్మశ్రీ కొల్లి. అనంత పద్మనాభ శాస్త్రిగారు,
ప్రిన్సిపాలు (రిటైర్డు)
శ్రీ గౌతమీ విద్యాపీఠ సంస్కృత కళాశాల
రాజమహేంద్రవరము.

పురుషార్థ చతుష్టయములో మోక్షము పరమపురుషార్థము. అది బ్రహ్మజ్ఞానైకసాధ్యమని శ్రీశంకరభగవత్పాదుల సిద్ధాంతము. బ్రహ్మజ్ఞాని బ్రహ్మస్వరూపుఁడగు చున్నాఁడు. 'బ్రహ్మవిదాప్నోతి పరమ్' 'తరతి శోకమాత్మవిత్' ఇత్యాది శ్రుతులు బ్రహ్మవేత్తకు ముక్తికలుగునని బోధించుచున్నవి. బ్రహ్మదర్శనము చేఁ పారమార్థిక బ్రహ్మాత్మస్థితియే మోక్షము. స్వాశ్రమ విహితకర్మములను, ఫలాభిసంధి రహితముగా నాచరించుటచేతను, నిషిద్ధ కర్మపరిత్యాగము వలనను, నితాంత పరిశాంతః కరణుఁడగువాఁడు సాధన చతుష్టయ సంపత్తి గలిగి సద్గురూపసదనమునఁ దత్కటాక్ష లబ్ధమయిన శ్రవణ మనన నిదిధ్యాసనములచే దృఢతర బ్రహ్మనిష్ఠ కలవాఁడే మోక్షార్హుఁడు.

బ్రహ్మవిద్యను బోధించునవియుపనిషత్తులు. వాని యర్థమును విభిన్న ప్రస్థానములలోఁ గొందఱు వ్యక్తులుకూడ

మునను, మహామహులగు మరికొందఱు భాష్యరూపమునను వివరించిరి. ఉపనిషత్సార భూతములగు వాక్యములనే విషయ వాక్యములుగాఁ గొని వేదవ్యాస మహర్షి చతురధ్యాయిగా సూత్రములను రచించెను. అవియే బ్రహ్మసూత్రములు. వానికి శ్రీ శంకర భగవత్పాదులవారు 'శారీరక భాష్యమను పేరితో నద్వైతపరముగా మహోత్కృష్ట మయిన భాష్య గ్రంథమును వెలయించిరి. మఱియు శ్రీ భగవత్పాదులవారు భగవద్గీతలకును, ఉపనిషత్తులకును, అద్వైత భాష్యములను రచించి, యీనాఁడు ఆసేతుహిమాచలము వ్యాప్తి గావించిరనునది విశ్వజనీనమే.

ఆ గ్రంథములన్నియును సంస్కృతభాషలో రచింపఁబడి, యనేక శాస్త్రీయ పారిభాషిక పదజాలముతో నిండి యుండుటచే జనసామాన్యమునకు దురవగాహములై యున్నవి. శాస్త్రీయసంస్కారము, సంస్కృతభాషా దృఢతర పరిజ్ఞానము లేని వారికవియందుబాటులో లేవు.

కావున నాంధ్రభక్త జిజ్ఞాసువులకు సుబోధకమై, వ్యాకరణ శిరోమణి, ఉభయభాషాప్రవీణ, బ్రహ్మశ్రీ వారణాసి గంగాధర శాస్త్రిగారు మృదుమధురమగు సులభశయ్యలో బ్రహ్మసూత్రములకు బ్రహ్మసూత్రార్థదీపిక యను చక్కని యాంధ్రానువాద మొనర్చిరి. వీరు తమరచనకు ప్రధానముగా 'బ్రహ్మామృత వర్షిణి' యనువృత్తి నాధారముగాఁ గైకొనియు

గొన్ని పట్టుల శంకర భాష్యములోని ముఖ్యాంశములను గైకొనియు సూత్రార్థమును సుస్పష్టముగు రీతిని వివరించిరి.

ఇందు ప్రతి సూత్రమునకును పదవిభాగము, ప్రతి పదార్థము, తర్వాత సూత్రార్థ వివరణము, ఇంకను నితర విశేషములను హృద్యమయిన పద్ధతిని వివరించుట యుందలి ప్రత్యేకత.

సూత్రార్థములను శాస్త్రీయ ప్రౌఢశయ్యలో వ్రాయఁబడిన గ్రంథము టీకాలును వారికి సుగ్రాహ్యములు కాకయుండుటచే వానియందు జనసామాన్యమున కాదరము లేకుండుట చూచుచున్నాము. అట్టి లోపముల నన్నిటిని నీవృత్తి గ్రంథము తీర్చివేయుననుట నిస్సంశయము.

సమన్వయాధికరణములోని శ్రుతులకు సమన్వయము నద్వైత పరముగాఁ జక్కఁగా, వీరు నిరూపించిరి. మరియు రచనానుపపత్త్యధికరణమున సాంఖ్యుల ప్రధానమునకు జగత్కారణత్వము సోపపత్తికముగ, సవివరముగ ఖండితమయినది. మహద్దీర్ఘాధికరణము నను వైశేషికుల పరమాణువుల వలన జగదుత్పత్తివాద (ఆరంభవాదము) ఖండనగ్రంథము చక్కఁగాఁ బ్రదర్శింపఁ బడినది. సముదాయాధికరణమున పూర్ణవైనాశికులగు బౌద్ధులమత స్వరూపము తత్ఖండనము హృద్యముగా సమాదితము. తదంతర ప్రతిపత్త్యధికరణమున జీవుఁడు దేహాంతరమును బొందుటలో భూతసూక్ష్మ

ములతోఁ గూడినవాఁడగుచునే వెళ్ళుచున్నాఁడు అను సిద్ధాంతమును, ప్రవహణ శ్వేత కేతువుల ప్రశ్న ప్రతివచనములచేను దీర్ఘముగాఁ జర్చించి దృఢపఱచిరి. ఇఁకను పెక్కులు చూడ వచ్చును.

శ్రీ శాస్త్రిగారు అథరణ్ మొదలుగ నాభాష్యము గురుకుల వాసపద్ధతిని సద్గురువుల దగ్గర నభ్యసించి యుత్తీర్ణులైన పండితులు. సంస్కృతాంధ్రముల రసజ్ఞతతోఁ గూడిన సాహితీసంపన్నులు. చిరకాలమునుండి విద్యార్థులకు వ్యాకరణాది విద్యలను బోధించుచు, విద్యార్థుల గౌరవమునకుఁ బాత్రులయిన సద్గురువులు. అష్టావధానచతురులు. శ్రీమద్భగవద్గీతను వివిధవృత్తములలో నాంధ్రపద్యానువాద మొనర్చిన కవులు. ప్రస్తుతము వీరు శ్రీగౌతమీ విద్యాపీఠ సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాలుగానున్నారు. ఒకముఖ్య విషయము, వీరు శ్రీసత్యానంద సరస్వతీస్వాములవారి దగ్గర ప్రస్థానత్రయమును నియమపూర్వకముగా నధ్యయనించిన పండితులగుటచే నింతమనోహరముగ నీగ్రంథము ననువదింపఁ గల్గిరనుట నిర్వివాదము. మఱియు శ్రీశంకరభగవత్పాద కృతములగు అద్వైతప్రకరణ గ్రంథములెన్నియో వెలువడ వలసియున్నవి. వానిని గూడ వీరువరుసగా దేశభాషలో ననువదించి యాంధ్రుల కచిరకాలములో నందింతురనికోరెద.

రాజమహేంద్రవరము
ది. 1-10-1969

కొల్లి అనంతపద్మనాభశాస్త్రి.

# ఉపోద్ఘాతము

వ్యాకరణ విద్యాప్రవీణ, వేదాన్తాచార్య
బ్రహ్మశ్రీ లంక నరసింహశాస్త్రిగారు

ఈలోకమున నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావమయిన పరమాత్మభావమే నిశ్శ్రేయసమనియు అదియేపురుషార్థ మూర్ధన్య మనియు అద్వైత వేదాంత సిద్ధాన్తము. ఆ స్థితి శ్రవణ మనన నిదిధ్యాసనా పరిపాకలభ్య మయిన ఆత్మసాక్షాత్కారాధీనము. కర్మోపాసనాదులు "కర్మణా చిత్తశుద్ధిః స్యాత్." "వశీకృతే మనస్యేషాం సగుణబ్రహ్మశీలనా" ఇత్యాది వచనానుసారమున చిత్తైకాగ్రతాదులయందు వినియోగించును. ఈ నిశ్శ్రేయసము కర్తృత్వభోక్తృత్వాది ధర్మముల నాత్మయందారోపింపక, అసంభావనా విపరీతభావనాది ప్రతిబంధకముల నుజ్జగించి ఆత్మతత్త్వమున పరినిష్ఠితులయిన పురుషధౌరేయులకు మాత్రము సముచితము. ఆత్మధర్మముల ననాత్మయందును ననాత్మ తద్ధర్మముల నాత్మయందును నధ్యసించి సుఖదుఃఖ ప్రవాహాత్మకమగు సంసారసాగరమున మునుంగుచున్న వారికి ఘటింపదు. దర్శనాంతరములు సమరసాఖండ సత్తత్త్వమునకు విరుద్ధములు - ఎట్లన - లోకాయతిక దర్శనము దేహమే యాత్మయని నిశ్చయించెను. బౌద్ధశాస్త్రము శూన్యమాత్మయని బోధించును. న్యాయమతము కర్తృత్వభోక్తృత్వాది ధర్మాశ్రయుండుగ నాత్మను వర్ణించెను. సాంఖ్యసిద్ధాంత

మున అసంగనిర్లేపాదులు ఆత్మస్వరూపముగ నిర్వచన చేసియు ద్వైతము సత్యమనియు భావింపఁబడెను. ఈవిధముగనాత్మ తత్త్వమున విరుద్ధవాదములు భ్రాంతికల్పితములు ఘటింప, పరమ కారుణికుఁడు-భగవదంశ సంభూతుఁడయిన బాదరాయణమహర్షి అపౌరుషేయములు ప్రమాణ మూర్ధన్యములు నయిన ఉపనిషద్వాక్యములచే మాత్రము తత్త్వము సమధిగమ్యమనియు ఆవాక్యము నంతయు అద్వైత బ్రహ్మమందె సమన్వయము గల్గియుండుననియు అదియే పరమ తాత్పర్యమనియు నిర్ణయించుటకై విచారాత్మక మయిన బ్రహ్మమీమాంసాశాస్త్రమును-"అథాతో బ్రహ్మజిజ్ఞాసా" ఇత్యాది క్రమమునసూత్రించెను. ఈసూత్రకదంబము అద్వైత బ్రహ్మము నందె లగించుననియు విశిష్టాద్వైతాది సిద్ధాంతములు సూత్రస్వారసికార్థములుగా వనియు - మహాత్ములనేకులు వ్యాఖ్యాన గ్రంథములు రచించి ధ్రువము చేసిరి. శ్రీశంకర భాష్యాదుల యందును పూర్వోత్తరమీమాంసా శాస్త్రములకు భేదమే గాని అభేదము సంభవింపదనియు నిర్ణయింపఁ బడెను.

ఈసూత్రసముదాయము చతురధ్యాయ పరిమితమై వెలయుచున్నది. ఇవియు సమన్వయము అవిరోధము సాధన, ఫలము ననునంశముల వివరించుచు నన్వర్థనామము గల్గియున్నవి. అందుఁ బ్రథమమున స్పష్టాస్పష్టాది లింగక పదవాక్యముల ద్వారమున తత్తదుపనిషత్ప్రకరణములకు అద్వితీయ బ్రహ్మము నందు సమన్వయము చూపఁబడెను - ఉపనిషదర్థ

నిర్ణయమునకుఁ బిమ్మట శాస్త్రాంతరములతో సంభవించున విరోధమును ఉపనిషత్తులయందు ఆపాతప్రతీత మయిన విరోధమును యుక్తిప్రమాణముల నిరాకరించిరి. అందుచే నీద్వితీయాధ్యాయము విరోధ పరిహారాత్మకము - ప్రమాణోపపత్తులచే నిర్ధారణ చేయబడిన అద్వితీయ బ్రహ్మభావమునకు గమముగను సాక్షాత్తుగను సాధనములను గ్రహించుచున్నఁ తృతీయాధ్యాయమును గూర్చిరి - తరువాత సిద్ధిరూపమయిన చతుర్థాధ్యాయమును సంతరించిరి. ఈ యుత్తర మీమాంసా శాస్త్రమునకు శ్రవణశాస్త్ర మనియు శారీరక మీమాంస యనియు ప్రసిద్ధి కలదు. ఈ సూత్రకదంబము తద్భాష్యాదులు అద్వైత వేదాంత శాస్త్రమున ప్రమాణ మూర్ధన్యములు ప్రమాణ మూలమున ప్రమేయసిద్ధియగును. కావుననే ద్వైత విశిష్టాద్వైతాది మత ప్రవక్తలందఱు భాష్యముల రచించి స్వమతము సిద్ధాంతములన్నియు బాదరాయణ మహర్షి సమ్మతము లనిపించుకొనఁ బ్రయత్నించిరి. కాని యవియేవియు సూత్రకారహృదయమునకు గాని ఉపనిషత్తులకు గాని అనుగుణములు కావనియె శ్రీశంకరానుయాయుల విశ్వాసము. శ్రీశంకరభగవత్పాదులు ప్రసన్న గంభీర భాష్యము రచించి జిజ్ఞాసులోకము ననుగ్రహించిరి. కాని కాలక్రమమున శాస్త్రాభ్యాసము క్షీణించినది. భాష్యాదిమూలమున సూత్రార్థము గుర్తించుట దుర్లభమాయెను, అప్పుడు భాష్యమున కనేక వ్యాఖ్య లుదయించెను. పండిత ప్రకాండులు శాస్త్రార్థ జటిల

నైన పరిష్కార పద్ధతితో సిద్ధాంతముల నిర్వచించిరి. శిష్యోపాధ్యాయుల ప్రణాళికలో నవగాహన మొనరించుకొని జిజ్ఞాసులోకము తృప్తినొందు చుండెను. మేధాసంపదలానాటి కానాడు క్షీణించుటతో దేశభాషామూలముగాని శాస్త్రార్థ పరిచయము గలుగుట లేదు.

తత్త్వజిజ్ఞాస మాత్రము పుణ్యవశమున ఆస్తికలోకమున క్షీణింపదయ్యెను. ఆసక్తి గలిగిన విద్వాంసులు ఆంధ్రభాషను భాష్యాదు లనువదించిరి. తన్మూలమున కొందరు శాస్త్రార్థ పరిచయము నార్జించుకొని వినోదించు చుండిరి - అదియు ఈనాటికి సులభోపాయమని గమనించి శ్రీ వారణాసిగంగా ధరశాస్త్రిగారు బ్రహ్మసూత్రములకు యథాతథముగ అద్వైత పక్షసిద్ధాంతానుగుణమగు టిప్పణిని సంతరించిరి. దీనియందు అధికరణాపేక్షితములగు విషయప్రయోజనములను పూర్వ సిద్ధాంత ప్రణాళికతో సంక్షేపముగ వివరించి సూత్రప్రమేయ మును స్ఫుటపరచిరి. - ఇది జిజ్ఞాసువులకు బ్రహ్మసూత్రార్థ మును కరతలామలకమువలె నందించి ప్రత్యర్థమును విశదము చేయును. భాష్యాదుల నధ్యయనము చేయని లోపమును దీర్చి ప్రమాణ ప్రమేయముల సమన్వయ పరచి అద్వైత వేదాంత సిద్ధాంతమును, సుబోధ మొనర్చును. ధర్మాధర్మ విచ క్షణ లేక పశుజీవికతో జీవయాత్రసాగు లౌకిక నాగరిక విజ్ఞానవంతుల కెంతయో నుపకరింప జాలిన మహాగ్రంథము ప్రాచీన వృత్తుల వ్యాఖ్యానముల నాధారము చేసుకొని శాస్త్ర తాత్పర్యము మనసున నిడుకొని సావధానముగ నీ గ్రంథ

మును సమకూర్చిరి., వీరు వ్యాకరణ వేదాంత శాస్త్రముల ను శుశ్రూషాపూర్వకముగ సద్గురుల యనుగ్రహమున నార్జించి పాఠప్రవచన క్రమమున విస్తరింపఁ జేసిన ధీమంతులు. శ్రీగౌతమీ విద్యాపీఠపక్షమున నడుచుచున్న సంస్కృత కలాశాల యం దధ్యక్షులుగను వ్యాకరణాధ్యాపకులుగను కీర్తి గడించుచున్నారు. సంస్కృతాంధ్ర భాషలయందు నిరుపమ మయిన చక్కని కవితాశక్తి గల్గి అష్టావధానాదికళలయందును పేరు గాంచిరి. శ్రీభగవద్గీతా శాస్త్రమును పద్యరూపమున వెలయించి ఆంధ్రావనియందు ప్రశస్తిగాంచిరి. పద్యకృతు లెన్నియో రచించి కవిలోకమునఁ బ్రసిద్ధి వడసిరి. ఆచారాను భవముల శాస్త్రార్థము నలవర్చుకున్న ఈ పండిత శ్రేష్ఠుల ఈ కృతి సర్వవిధముల జిజ్ఞాసువుల సంశయము బాపి అద్వైత సిద్ధాంతమును హృదయంగమముగ నందింపఁ జేయును. సర్వ కాలము నిట్టి వీరికృతుల యశశ్చంద్రిక లజ్ఞానాంధకార మపన యించుచు నీశ్వరాను గ్రహమున ఆచంద్రతారార్కముగ వెలయుగాత. గ్రంథరచనా పాటవమునితోధికముగ సమ కూర్చి పరమాత్మ ఆయురాది భాగ్యముల గ్రంథకారుల ధన్యుల నొనర్చుగాత

ఇతిశమ్

రాజమహేంద్రవరము  
గౌతమీవిద్యాపీఠ  
సంస్కృత కళాశాల.

లంక నరసింహశాస్త్రి  
వ్యాకరణవేదాన్తాచార్యులు  
ది-10-9-69

శ్రీః

# పండితాభిప్రాయములు

చతుస్తంత్రి, దర్శనభూషణ, రాష్ట్రపతి సన్మానిత

బ్రహ్మశ్రీ కొల్లూరి సోమశేఖరశాస్త్రిగారు

రిటైర్డ్ ప్రిన్సిపల్, మోడేకుర్రు

సంస్కృత కళాశాల

శ్రీ వారణాసి గంగాధర శాస్త్రి గారిచే నాంధ్రీకరింపఁ బడిన "బ్రహ్మసూత్రార్థ దీపిక" యను గ్రంథమును నేను జూచితిని. ఇది శాస్త్రీయ సిద్ధాంతముల కవిరుద్ధముగను, సామాన్య జ్ఞానముగల జిజ్ఞాసువులకు సుబోధముగను నున్నది. ఈ గ్రంథరచనమువలన నాంధ్రలోకమున కెంతేని మేలు సమాకరించిరి. మఱియు నిట్టి గ్రంథములను రచించి వీరాంధ్రుల మన్ననలకు పాత్రులగునట్లు భగవంతుఁడు వీరి కాయురారోగ్యముల ననుగ్రహించుగాక యని నేనా భగవంతుని ప్రార్థించు చున్నాను.

కె. సోమశేఖరశాస్త్రి

11 - 9 - 1969

వ్యాకరణశిరోమణి, వ్యాకరణాలంకార, కళాప్రపూర్ణ,

## బ్రహ్మశ్రీ పేరి వెంకటేశ్వరశాస్త్రిగారు

**Ex-principal, S. M. O. College, Agiripalli'**

శ్రీ గౌతమీ విద్యాపీఠ కళాశాలాధ్యక్షులగు బ్ర॥ శ్రీ వారణాసి గంగాధరశాస్త్రిగారిచే రచింపఁబడిన బ్రహ్మసూత్రార్థ దీపిక యను బ్రహ్మసూత్ర వృత్తిని నేను జూచితిని. శాంకర సిద్ధాన్త జిజ్ఞాసువులగు సామాన్య జనులకందఱకును అందుబాటులో నుండునట్లు బ్రహ్మసూత్రములకు అన్యూనానతిరిక్తముగ భగవత్పాదుల వారి యభిప్రాయము నావిష్కరించి యాంధ్రభాషకు ఆంధ్రలోకమునకు మహోపకారము గావించిరని నేను విశ్వసించుచున్నాను.

ఈ విధముగ శాస్త్రీయగ్రంథములను ఆంధ్రమున ననువదించి యాంధ్రలోకమునకు సేవచేయుటకుఁ బరమేశ్వరుఁడు వీరికి సంపూర్ణాయు రారోగ్యములను బ్రసాదించుఁగాక యని కోరుచున్నాను.

కొవ్వూరు

పేరి. వెంకటేశ్వరశాస్త్రి
5 - 10 - 69

న్యాయ, సాహిత్య విద్యాప్రవీణ

శ్రీ రామచంద్రుల కోటేశ్వరశర్మగారు

యస్. జివి. పి. ఓరియంటల్ కాలేజి

బ్రహ్మశ్రీ వారణాసి గంగాధరశాస్త్రిగారు వ్రాసిన "బ్రహ్మసూత్రార్థ దీపికా" యను నీగ్రంథమును బాగుగ పరిశీలించితిని. సంస్కృతాంధ్రములలో విశిష్ట ప్రజ్ఞాపాటవము గల శ్రీశాస్త్రిగారు బ్రహ్మసూత్రములకు నాంధ్రములో తాత్పర్యమును వ్రాయుట మిక్కిలి ప్రశంసింపదగినది.

శాస్త్రీయ గ్రంథముల నాంధ్రీకరించుట కష్టతరము. అందులోను సమన్వయ, అవిరోధ, సాధన, ఫలాధ్యాయ చతుష్టయాత్మకమగు నీబ్రహ్మసూత్రములలో ద్వితీయాధ్యాయ మనేక శాస్త్ర సంప్రదాయములతోను, తత్ఖండనలతోను నిండియుండుటచే గష్టతమము. అట్టి క్లిష్టస్థలములలో సైతము శాస్త్రసిద్ధాంతముల కెట్టి భంగములేకుండ స్పష్టముగ సులభముగ వివరించుట శ్రీశాస్త్రిగారి పాండిత్యమునకు వివరణ శైలికి దార్కాణము.

"ఆసుప్తేరామృతేః కాలంనయే ద్వేదాన్త చింతయా" అని మానవున కాత్మమనన మావశ్యకమగుటచే మనవోపయోగి। ఈగ్రంథమాంధ్రుల కవశ్య పఠనీయమై మహోపకార మొసంగునని విశ్వసించుచున్నాను.

రామచంద్రుల కోటేశ్వరశర్మ వ్రాలు

రాజమండ్రి 27-11-1969

Prof Veluri Subba Rao,
M.A., PH. D., B. O. L., B. ED.,
Professor and Head of the Department
of Sanskrit
ANDHRA UNIVERSITY

WALTIAR
ANDHRA PRADESH
INDIA,
*Date.* 7th April, 1970,

I had the pleasure of going through certain portions of the Brahmasutrarthadipika, a commentary in Telugu on the Brahmasutras of Badarayana. The author, Brahmasri Varanasi Gangadharasastri, Principal, Gowtami Vidyapeetham, Sanskrit College, Rajahmundry, is a reputed scholar of Vyakarana. The way in which he has tried to interpret the Sutras on the lines of the monistic theory of Sankara bears ample testimony to his erudition in Advaita Vedanta as well. The Telugu Language used by him in the work is chaste and simple, fluent and lucid. All the salient points of Sankara's commentary with the absolutely necessary Visayavakyas have been incorporated in the work and I have no doupt that it would draw the approval and appreciation of Telugu the world interested in Advaita Philosophy and would be of immense value to them in understanding the intricacies of the philosophical views of Badarayana in a nut-shell.

It is a desirable feature of this work that the highly cryptic sutras have all been taken up word by word with the necessary elipses supplied and translated into Telugu before their explanation is tried.

I wish to congratulate the author on this proud achievement of his which, in these days of vernacular medium in schools and colleges, is a welcome augury and a desideratum in the context of the all too-meagre translation of important Standard Sanskrit works in Telugu.

I have great pleasure in recommending this work to all the Educational institutions-schools, colleges and Universities in the State.

(V. SUBBA RAO)

శ్రీ రస్తు

శివాయ గురవే నమః

# బ్రహ్మసూత్రార్థదీపిక

## ప్రథమాధ్యాయ ప్రథమపాదము

స్పష్ట బ్రహ్మ లింగయుక్తములగు వాక్యముల విచారణ

## జిజ్ఞాసాధికరణము

జిజ్ఞాస యొక్క అధికరణము జిజ్ఞాసాధికరణము. జిజ్ఞాసయనగా తెలిసికొనుటకొఱకు కోరిక. అధికరణమనగా విషయము, సంగతి, సంశయము, పూర్వపక్షము, సిద్ధాన్తము, అను ఐదంశములు కలది.

ఈ వేదాన్తమీమాంసాశాస్త్రమునకు బ్రహ్మము విషయము. ఈ జిజ్ఞాసాధికరణమునకు "ఆత్మావారే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" అను బృహ. 4.5.6 శ్రుతి విషయము. ఏ శ్రుతివాక్యము నుద్దేశించి యొక యధికరణము రచింపబడునో, ఆ యధికరణమునకు ఆ వాక్యము విషయవాక్య మనబడును. ఈపై శ్రుతిలో ఆత్మదర్శనఫలము నుద్దేశించి తత్సాధనముగా శ్రవణము విధింపబడుచున్నది. శ్రవణ మనగా వేదాన్తవాక్యములకు అద్వితీయ పరబ్రహ్మమునందు తాత్పర్యమును నిర్ణయించుటకు అనుకూలములగు న్యాయముల విచారము. జిజ్ఞాసాపదమునకు

గూడఁ బర్యవసానములో విచారమనియే యర్థము. కాన నీ యధికరణమునకు నీశ్రుతివాక్యము విషయము.

సంగతి: — అనఁగా సందర్భము. ఈ యధికరణమే మొదటి దగుటచే దీనికిఁ బూర్వాధికరణముతో సంగతి యుండదు. ఉపోద్ఘాతరూపముగ నుత్తరాధికరణముల కుపయోగించును.

సంశయము: - అనఁగా సందేహము. ఈ బ్రహ్మమీమాంసాశాస్త్ర మారంభింపఁ దగినదా? కాదా? అని సందేహము. పూర్వపక్ష సిద్ధాన్తములయొక్క యుక్తులే సర్వత్ర సంశయమునకు బీజములు.

పూర్వపక్షము: - విషయప్రయోజనములు లేవు గావున నీ వేదాన్తమీమాంసాశాస్త్ర మారంభింప నక్కఱ లేదు. అని పూర్వపక్షము - ఏమనఁగా నెచ్చటనైనను విషయము సందిగ్ధముగ నున్నచో నది విచారణీయ మగును. ఇచ్చట విచారణీయ మగు విషయము బ్రహ్మస్వరూపము. అది సందిగ్ధము కాదు. "సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ" తై. 2-1-1 మున్నగు వాక్యములచే నది నిశ్చితమైయే యున్నది. అహంప్రత్యయముచే జీవాత్మస్వరూపముగూడ నిశ్చితమైయే యున్నది. జీవాత్మస్వరూపమునను పరమాత్మస్వరూపమునను నీశాస్త్రమునకు విషయ మగు ఆత్మ (బ్రహ్మము) నిశ్చితమే యగుటచే నిందు విచారణీయమగు విషయము లేదు. బ్రహ్మ

జ్ఞానము కలిగినను ముక్తి కనఁబడుట లేదు కనుక ప్రయోజనములేదు.

సిద్ధాన్తము: - "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" తై, 2- 1-1 మున్నగు వాక్యములచే బ్రహ్మస్వరూపము నిశ్చితమే యైనను "తత్త్వమసి" ఛాం - 6 - 8 -7 " అయమాత్మా బ్రహ్మ" బృ- 2 - 5 - 19 మొదలగు శ్రుతులచే నభేదమున్ను అహం ప్రత్యయముచే భేదమున్ను దోచుటచే జీవాభిన్న బ్రహ్మస్వరూప విషయము సందిగ్ధమే అయియున్నది. కనుక విషయము కలదు. అహం ప్రత్యయము భ్రాన్తిమూలకము. స్వయంప్రకాశమగు బ్రహ్మమునందు అనాద్యవిద్యావశమున అధ్యాస మనుభవసిద్ధ మగుటవలన స్వస్వరూపజ్ఞానము కొఱకు శాస్త్రారంభము సప్రయోజనము. "తరతిశోకమాత్మవిత్" అని ప్రయోజనము కనఁబడుచున్నది. విషయప్రయోజనములున్నవి కాన శాస్త్ర మారంభింపఁ దగినది. అనిసిద్ధాన్తము.

అథాతో బ్రహ్మజిజ్ఞాసా. 1

అథ, అతః, బ్రహ్మ జిజ్ఞాసా.

అథ = సాధనచతుష్టయసంపన్నుఁడైన తరువాత, అతః= ఆ హేతువు వలన (కర్మములవలనఁ గలిగిన ఫల మనిత్యమనియు, బ్రహ్మజ్ఞానమువలన, బరమాత్మప్రాప్తి కలుగుననియు శ్రుతి చెప్పిన హేతువువలన) బ్రహ్మజిజ్ఞాసా= బ్రహ్మ

యొక్క-జిజ్ఞాస, కర్తవ్యా= చేయఁదగినది. (అని యధ్యాహారము)

జ్ఞాతుం ఇచ్ఛా=జిజ్ఞాసా తెలిసికొనుటకొఱకు ఇచ్ఛ. ఇచ్చటజిజ్ఞాసాపదములో "జ్ఞా" ధాతువు, "సన్" ప్రత్యయము అని రెండు భాగములు కలవు. జ్ఞాధాతువునకు జ్ఞానము= తెలిసికొనుట, యనియర్థము. సన్ ప్రత్యయమునకు ఇచ్ఛ యని యర్థము. బ్రహ్మణః + జిజ్ఞాసా = బ్రహ్మయొక్క జిజ్ఞాస కావున బ్రహ్మజిజ్ఞాస యనఁబడినది. యొక్క అనునది కర్మణి షష్ఠి. అనఁగా నాషష్ఠికి కర్మము అర్థము. బ్రహ్మకర్మకమగు జిజ్ఞాస = బ్రహ్మమును దెలిసికొనుటకు ఇచ్ఛ = కోరిక, చేయఁదగినదియని యర్థము వచ్చినది. ఇచ్ఛ యత్నసాధ్యము కాదు. కావున ఇచ్ఛ కర్తవ్యమని చెప్పుట పొసఁగదు. కనుక లక్షణచే సన్ప్రత్యయమునకు ఇచ్ఛాసాధ్యమగు విచారమని యర్థము చెప్పికొనవలెను.

సాధనచతుష్టయసంపన్నుఁడు బ్రహ్మజ్ఞానముకొఱకు విచారము చేయవలయును. అనఁగా బ్రహ్మజ్ఞానార్థమై వేదాన్తవాక్యార్థవిచారము చేయవలయును. అని తాత్పర్యము.

బ్రహ్మము ప్రసిద్ధమా? అప్రసిద్ధమా? బ్రహ్మము ప్రసిద్ధమే యైనచోఁ దద్విచారము చేయనక్కఱలేదు.

అప్రసిద్ధమైనచోఁ దద్విచారముచేయుట అశక్యము, అని ప్రశ్నించిన:

బ్రహ్మము ప్రసిద్ధమే. అది నిత్యశుద్ధబుద్ధముక్త స్వభావమైనది. సర్వజ్ఞమైనది. సర్వశక్తిసమన్వితమైనది. బ్రహ్మపదమునకు వ్యుత్పత్తిని బరిశీలించినచో నది "బృహి వృద్ధౌ" అనుధాతువునుండి పుట్టినది. వృద్ధియనఁగా అంతము లేని సర్వజ్ఞత్వసహితమగు నిరవధికమహత్త్వమని శ్రుతిచే నిర్ణయింపఁబడుచున్నది కనుక బ్రహ్మము పైలక్షణములు కలదిగాఁ బ్రసిద్ధమై యున్నది.

అదికాక సమస్తము ఆత్మస్వరూపమే యగుటవలనను బ్రహ్మము ప్రసిద్ధమైనది. లోకములోఁ బ్రతివాఁడును ఆత్మాస్తిత్వమును గుర్తించుచున్నాఁడేకాని నేను లే నని యనుకొనఁడు. ఆత్మయనఁగా బ్రహ్మమే కావున నీరీతిగా బ్రహ్మము ప్రసిద్ధమే. ప్రసిద్ధమేనైనచో బ్రహ్మమును జిజ్ఞాస (విచారణ) చేయుట యెందులకు? అనిన - బ్రహ్మము ప్రసిద్ధమేనైనను దద్విశేషమును గురించి, పెక్కు విప్రతిపత్తులుండుటచే బ్రహ్మవిచారము చేయవలసియున్నది. అని సమాధానము.

ఆ విప్రతిపత్తులేవి ? అనిన

1. చైతన్యవిశిష్టమగు దేహమే ఆత్మ, అని పామరులు, లోకాయతికులును జెప్పుచున్నారు.

2. ఇంద్రియములే ఆత్మ అని కొందఱు తలఁచు చున్నారు.

3. మనస్సు ఆత్మయని కొందఱు తలఁచుచున్నారు.

4. క్షణికమగు విజ్ఞానమే ఆత్మయని " "

5. ఏమియునులేదు - శూన్యము- అని చెప్పువారు కొందఱు.

6. దేహాదివ్యతిరిక్తుఁడును, సంసారియు, కర్తయు భోక్తయు నైనవాఁడొకఁడు కలఁడని నైయాయికులు వైశేషికులుఁ జెప్పుదురు.

7. దేహాదివ్యతిరిక్తుఁడగు ఆత్మ కేవలభోక్తయే కాని కర్త కాఁడు- అని సాంఖ్యులు చెప్పుదురు.

8. భోక్తకంటె వేరుగా సర్వజ్ఞుఁడును సర్వశక్తియు నగు నీశ్వరుఁడు కలఁడని యోగు లందురు.

9. భోక్త యగు జీవుఁడే పరమాత్మ యని వేదాన్తు లందురు.

ఇట్లు పలువురు పలువిధములఁ బలుకుచుండుటచేఁ బరమపురుషార్థమగు మోక్షమును బడయుటకు సాధనమగు ఆత్మజ్ఞానమునకై బ్రహ్మవిచారము చేయువలయును.

"అథ" అనుదానికి సాధనచతుష్టయసంపన్నుఁడైన తరువాత అని యర్థము చెప్పఁబడినది. ఆ సాధనచతుష్టయ

సంపత్తి యెట్లు లభించును? అనఁగా "అనేక జన్మ సంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్" అన్న రీతిని గతబహుజన్మము లందు నిష్కామకర్మోపాసనాదులచే నుపాధిమాలిన్యము పరిపాకమునొంద సాధనచతుష్టయసంపన్ను లగుదురు. అట్టి వారికిఁ దత్త్వజ్ఞానము కలిగించుటకొఱకై "ఆత్మావారే ద్రష్టవ్య శ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" మొద లగు మోక్షశాస్త్రము ప్రారంభమైనది. అనన్తరార్థ బోధక మగు నిందలి అథ శబ్దము శ్రవణముచే మంగళసూచకము నగును.

సాధనచతుష్టయ మనఁగా, 1. నిత్యానిత్యవస్తువివేకము. 2. ఇహాముత్రార్థ భోగవిరాగము. 3. శమదమాది సంపద. 4. ముముక్షుత్వము. అనునవి.

1. నిత్య + అనిత్య + వస్తు + వివేకము = బ్రహ్మము నిత్యమైనది. స్వర్గాదులనిత్యములైనవి, అను వివేకము.

2. ఇహ + అముత్ర + అర్థ + భోగ విరాగము= భార్యాపుత్రపశుధనాద్యుపభోగ రూపమైన ఇహలోక ఫలము లందును, స్వర్గాద్యాముష్మిక ఫలములందును ఆసక్తి లేకుండుట.

3. శమ + దమ + ఆది + సంపదః - శమద మాదులు ఆఱు. శమ, దమ, ఉపరతి, తితిక్షా, శ్రద్ధా, సమాధానములు. అని. శమ మన నంతరింద్రియ నిగ్ర

హము. దమ మనఁగా బాహ్యేంద్రియనిగ్రహము. అంతరింద్రియ మనఁగా మనస్సు. మనోవ్యాపారములను = కామ సంకల్ప విచికిత్సాదులను నిగ్రహించుట (పూనకుండుట) అంతరింద్రియ నిగ్రహము.

బాహ్యేంద్రియములు - పది, త్వక్చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణము లను పంచజ్ఞానేంద్రియములును, వాక్పాణి పాదపాయూపస్థము లను పంచకర్మేంద్రియములును మొత్తము పది. జ్ఞానేంద్రియముల కైదింటికి వరుసగా, స్పర్శన దర్శన, శ్రవణ, స్వాదన, ఘ్రాణనములు వ్యాపారములు. కర్మేంద్రియములకు, వరుసగా వచన, దాన, గమన, విసర్జన, మైథునములు వ్యాపారములు. వీని నన్నిటిని మానుట ఇంద్రియనిగ్రహము.

ఉపరతి = చిత్తవిక్షేపము లేకుండుట (సన్యసించుట).

తితిక్ష = శీతోష్ణ సుఖదుఃఖ ద్వంద్వముల సహింపఁ గలుగుట.

శ్రద్ధ = అనఁగా ఆస్తిక్యబుద్ధి, పరలోకమున్నది. పరమేశ్వరుఁడున్నాఁడు. అనెడిబుద్ధి. సమాధాన, మనఁగా జ్ఞాతవ్య (తెలిసికొనఁదగిన) వస్తువునందు చిత్తమును గుదురు పఱచుట.

4. ముముక్షుత్వము :- మోక్షమును బొందవలె నను కోరిక.

ఈ విధముగ సాధనచతుష్టయ సంపన్నుఁడు బ్రహ్మజిజ్ఞాసకు అధికారి. "శాన్తో దాన్త ఉపరతస్తితిక్షు స్సమాహితః శ్రద్ధావిత్తో భూత్వా ఆత్మన్యేవాత్మానం పశ్యేత్" అని శ్రుతి.

బ్రహ్మజిజ్ఞాసకు బ్రహ్మజ్ఞానము ఫలము. బ్రహ్మజ్ఞానమునకు బ్రహ్మప్రాప్తిఫలము. బ్రహ్మప్రాప్తి యనఁగా బరమపురుషార్థమైన మోక్షము. "బ్రహ్మవి దాప్నోతి పరమ్"— "బ్రహ్మవి ద్బ్రహ్మైవ భవతి"- అని, శ్రుతి. విషయము- వేద్యమగు బ్రహ్మపదార్థము. అది "ఏక మేవాద్వితీయం బ్రహ్మ" అను శ్రుతివలన అద్వితీయస్వరూపము. "ముక్తోప సృప్య వ్యపదేశాచ్చ" అనుటవలన ముక్తప్రాప్యము నై యున్నది.

వేద్యమగు నీబ్రహ్మస్వరూపము వేదిత (తెలిసికొను వాతని) యొక్క స్వరూపముకంటె భిన్నముకాదు. "తత్స త్యమ్" "సఆత్మా" "తత్త్వమసి", "అయ మాత్మా బ్రహ్మ" "అహం బ్రహ్మాస్మి" మున్నగు శ్రుతులు జీవాత్మ పరమాత్మల కైక్యమునే బోధించుచున్నవి. కావునఁ బ్రత్యగభిన్న బ్రహ్మస్వరూపమే వేద్యము. ముముక్షువు, తనయందు అవిద్యచేఁ గల్పితమైన సంసారము నివర్తించుటకై, ఆత్మ (బ్రహ్మ) విచారము నొనరింపవలయును. విచారితబ్రహ్మ స్వరూపమే ఆత్మస్వరూపము, అని ప్రతిపాద్య ప్రతిపాదక

భావసంబంధము కలదు. అధికారి, ఫలము, విషయము, సంబంధము, అను నీనాలుగును అనుబంధ చతుష్టయ మనఁబడును.

బద్ధుఁడగు ఆత్మకు మోక్షము కలుగవలె నన్న, మోక్షప్రదుఁడైన భగవంతుని సేవింపవలెనే కాని యీ బ్రహ్మజిజ్ఞాసవలనఁ బ్రయోజన మేమి? అన్నచో, ఆత్మానాత్మల కన్యోన్య ధర్మాధ్యాసము చేయుటవలన నాత్మకు సంసారము సంభవించును. అందుచేఁ బద్ధుఁడయ్యెను. ఆత్మయేమో! అనాత్మయేమో! అధ్యాసమేమో! అను వివేకము కలిగిన బంధము దొలఁగి మోక్షము కలుగును. ఆ వివేకము కలుగుటకుఁ బ్రత్యగభిన్న బ్రహ్మజ్ఞానమును సంపాదింపవలెను.

అధ్యాస మనఁగా, అది కాని దానియందు అది యను బుద్ధి కలుగుట. చీఁకటిలోఁ ద్రోవ వాఁడు త్రాడును జూచి పా మనుకొనును. పాము కాని త్రాడునందుఁ బామను బుద్ధి కలుగుటయే యధ్యాసము. ఇట్లే సంసారి కాని బ్రహ్మస్వరూపమగు తనయందు సంసారియగు జీవుఁడను బుద్ధి కలుగుట యధ్యాసము. ఈ యధ్యాసము యథార్థజ్ఞానమునఁగాని తొలఁగదు. త్రాడునందు గలిగిన సర్పబుద్ధి, "ఇది సర్పము కాదు. త్రాడే" అను యథార్థజ్ఞానము కలిగినఁ దొలఁగును. అట్లే "నేను బ్రహ్మస్వరూపుఁడనే" అను యథార్థజ్ఞానము కలుగుట

వలన, సంసారాత్మ (జీవుఁడనను) భ్రమ నివర్తించును. తన్నివృత్తివలన సంసారబంధ (శోక) నాశనము, మోక్ష ప్రాప్తియుఁ గలుగును. కనుకనే "తరతి శోక మాత్మవిత్" పరమాత్మ స్వరూపము నెఱిఁగినవాఁడు సంసారశోకమును దరించును. "నాన్యః పన్థా విద్యతేఽయనాయ" మోక్ష ప్రాప్తి కింతకన్న వేఱు మార్గము లేదు. మున్నగు శ్రుతి వచనము లుపపన్నము లగును. కనుక బ్రహ్మవిచారము చేయ వలయును అని తాత్పర్యము.

అతః అనుదానికి ఈహేతువువలన అని యర్థము గదా! ఆహేతు వేమి? అనిన, "తద్యథేహ కర్మచితో లోకః క్షీయత ఏవ మేవాముత్ర పుణ్యచితో లోకః క్షీయతే" అని కర్మముల కనిత్యఫలమును, "బ్రహ్మవిదాప్నోతిపరమ్" అనిబ్రహ్మజ్ఞానము వలనఁ బరమపురుషార్థమగు మోక్షము కలుగు ననియును, శ్రుతి చెప్పుచున్నది కావున సాధనచతుష్టయ సంపన్నుఁడగు నధికారి బ్రహ్మవిచారము చేయవలయును. అని సూత్రార్థము.

ఇచ్చట బ్రహ్మపదమునకు, పరమాత్మ పరబ్రహ్మ యని యర్థము కాని చతుర్ముఖబ్రహ్మ యని యర్థము కాదు. (తెలుఁగు) భాష పద్ధతి ననుసరించి బ్రహ్మము అనియు వాడఁబడును.

## 2 జన్మాద్యధికరణము

బ్రహ్మజిజ్ఞాస చేయవలెనని చెప్పబడినది. బ్రహ్మ మన నేమి? ఎట్టి లక్షణములు కలది? అన, నీయధికరణ మారంభింపఁబడుచున్నది.

### జన్మాద్యస్య యతః. 2

జన్మాది, అస్య, యతః అని విభాగము.

సంగతి=పూర్వాధికరణములో బ్రహ్మవిచారము చేయవలె నని చెప్పఁబడినది. బ్రహ్మమన నేమో యీయధికరణమునఁ జెప్పఁబడుచున్నది. కాన దీనికి వెనుకటి యధికరణముతో సంగతి కలదు.

విషయము="యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి యత్ప్రయ న్త్యభిసంవిశన్తి" "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అనునవి విషయవాక్యములు.

సంశయము = ఈవాక్యమునఁ గల జన్మాదికము బ్రహ్మలక్షణమగునా! కాదా? యని సందేహము.

పూర్వపక్షము = ఇందుఁగల జన్మాదికము ప్రపంచనిష్ఠముకాని బ్రహ్మనిష్ఠముకాదు. కావున నిది బ్రహ్మకు లక్షణము కాదు. అని పూర్వపక్షము.

సిద్ధాన్తము-- బ్రహ్మమునకు జగజ్జన్మాది కారణత్వ మనునది తటస్థ లక్షణము. "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అనునది స్వరూప లక్షణము. అని సిద్ధాన్తము.

అర్థము— అస్య = ప్రత్యక్షముగాఁ గనిపించు నీప్రపంచమునకు, జన్మాది = జన్మము మొదలుగాఁగలది, యతః = ఎవ్వని వలనఁ గలుగుచున్నదో, అతఁడుబ్రహ్మ. జన్మాదు లనఁగా జన్మ, స్థితి, భంగములు అనఁగా సృష్టిస్థితిలయములు.

నామరూపములు కలిగి, యనేక కర్తృ భోక్తృ సంయుక్తమై, ప్రత్యేకముగా నియతములైన దేశకాలనిమిత్తములను క్రియాఫలముల కాశ్రయమై, మనస్సుచేతఁగూడ నూహింపరాని నిర్మాణవైభవము గలిగి, యొప్పుచున్న యీ మహాప్రపంచమునకు, సృష్టి స్థితి లయము లెవ్వఁడు కలిగించునో, ఎవ్వడు సర్వవిధ శక్తి సంపన్నుఁడో, సర్వజ్ఞుడో, అతఁడు బ్రహ్మ, అని బ్రహ్మలక్షణము చెప్పఁబడినది. "యతో వా ఇమాని భూతాని" అను విషయవాక్య శ్రుతిలో జన్మస్థితి నాశములు వరుసగాఁ జెప్పఁబడినవి. లోకములోఁ గూడ సృష్టి స్థితి లయములే వరుసగ సంభవించుచున్నవి. అందుచే నిందును నాక్రమమే పాటింపఁబడినది.

### 3 శాస్త్రయోనిత్వాధికరణము

పూర్వాధికరణములో జగత్కారణమని చెప్పుటచే బహ్మమునకు సర్వజ్ఞత్వము, అర్థసిద్ధమైనది. దానినే మతే

రమొక హేతువున నిందు దృఢపఱచుచున్నారు. పూర్వ సూత్రోక్త జగత్కారణత్వమును ఇందు సమర్థించుటచే సంగతికలదు.

“అస్య మహతో భూతస్య నిశ్శ్వసిత మేతత్ యదృగ్వేదో యజుర్వేద స్సామవేదోఽ థర్వాంగిరస ఇతి హాసః పురాణం విద్యా ఉపనిషద స్సూత్రాణి” బృ.2-4-10 అనువాక్యముదీనికి విషయము. నిత్యసిద్ధుఁడగు బ్రహ్మనుండి నిశ్శ్వాసమువలె ననాయాసముగ నీఋగ్వేదాదు లుదయించి నవని దీనిభావము.

పరబ్రహ్మ వేదములకుఁ గర్తయగునా ? కాఁడా ? అని సందేహము. పరబ్రహ్మ వేదములకుఁ గర్త కాఁడు. వేదములు నిత్యములు, “వాచా విరూపనిత్యయా” అనుమంత్రములో “నిత్యయా వాచా” అని చెప్పఁబడినది. నిత్యమైన వాక్కు- అనఁగా వేదము. ఇదిగాక “అనాదినిధనా నిత్యా వాగు త్సృష్టా స్వయంభువా ఆదౌ వేద మయీ దివ్యా యతః సర్వాః ప్రవృత్తయః” అనుదానిలోఁగూడ వేదమయ మగు వాక్కు ఆద్యన్తములు లేనిదియు నిత్యమైనదియు నని చెప్పఁబడినది. ఈ శ్రుతిస్మృతులచేఁగూడ వేదము నిత్యమైన దని తెలియుటచే వేదమునకు బ్రహ్మ కర్త కాఁడు. అని పూర్వపక్షము.

సిద్ధాన్తము:- బ్రహ్మ వేదమునకుఁ గర్త, నిశ్శ్వాసము వలె ననాయాసముగ వేదము బ్రహ్మనుండి యుదయించినదని చెప్పుటచేతను, "తస్మా ద్యజ్ఞా త్సర్వహుతః ఋచ స్సామాని జజ్ఞిరే" అను దానిలోఁ గూడ యజ్ఞశబ్దవాచ్యుఁడగు నీశ్వరునివలన ఋగాదులు పుట్టినవనుటచేతను, వేదములకు బ్రహ్మ కర్త. అని సిద్ధాన్తము.

అయినచో, అపౌరుషేయమని ప్రసిద్ధివడసిన వేదమునకు పౌరుషేయత్వము సంభవించుటలేదా? అనియనరాదు. "ధాతా యథాపూర్వ మకల్పయత్" అను శ్రుతిచేఁ బూర్వకల్పమునందలి యానుపూర్వితో సజాతీయమైన వేదరాశిని బ్రహ్మ కల్పించెనని తెలియుచుండుటచే, వేద మనాదియగుటచే నది యపౌరుషేయమే కాని, పౌరుషేయము కాదు. సజాతీయానాది ప్రవాహరూపమున వేదములు నిత్యములు. వాస్తవనిత్యత్వము నంగీకరించినచో నద్వైతశ్రుతికి భంగము కలుగును.

## శాస్త్రయోనిత్వాత్. 3

శాస్త్ర= శాస్త్రమునకు, శాస్త్రమనఁగా శాసించునది వేదము. మహత్తరమును సర్వార్థములను బోధించునదియు నగు ఋగ్వేదాదిశాస్త్రమునకు అని యర్థము. యోనిత్వాత్ - కారణమైనవాఁడగుటవలన, బ్రహ్మ సర్వజ్ఞుఁడు అనఁగా నంత గొప్పదైన (అనేకశాఖలుగలిగి, దేవ తిర్యఙ్మనుష్య వర్ణాశ్రమాది ప్రవిభాగహేతువై సర్వజ్ఞానాకర

మైన ఋగ్వేదాది శాస్త్రమునకుఁ గారణమైన ఆ బ్రహ్మ అంతకన్న నధికమైన జ్ఞానముకలవాఁడై యుండవలయును. గనుక ఇతఁడు సర్వజ్ఞుఁడు, సర్వశక్తి సంపన్నుఁడు నగునని యర్థము. శాస్త్రయోనిత్వాత్, అనుదానికి శాస్త్రమునకుఁ గారణమైనవాఁడగుటవలన అని షష్ఠీతత్పురుషసమాసముచే నీయర్థము చెప్పబడినది. షష్ఠీతత్పురుషకాక, శాస్త్రం = ఋగ్వేదాదికమగు శాస్త్రము, యోనిః=కారణం, యస్యసః= శాస్త్రయోనిః, తస్యభావః = శాస్త్రయోనిత్వాత్. అని బహువ్రీహిసమాసముచేతను అర్థము చెప్పవచ్చును. ఋగ్వేదాదిశాస్త్రము కారణము (ప్రమాణము) గాఁగలవాఁడు కనుక బ్రహ్మ, "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" అనుశ్రుతిచే నుపనిషద్వేద్యుఁడేగాని మానాన్తరగమ్యుఁడు కాఁడని యర్థము.

జగజ్జన్మాది కారణభూతుఁడగు బ్రహ్మ, శాస్త్ర ప్రామాణ్యముచేతనే తెలియఁబడనగును. బ్రహ్మయొక్క యథార్థ స్వరూపమును దెలియవలయు ననిన నుపనిషత్తుల వలనఁ దెలియవలసిన దేకాని ప్రత్యక్షాదిప్రమాణములవలనఁ గాదని తాత్పర్యము.

## 4 సమన్వయాధికరణము

పూర్వసూత్రములో రెండవ యర్థమున బ్రహ్మకు శాస్త్రప్రమాణకత్వము చెప్పఁబడినది. దాని నాక్షేపించుచు

సీయధికరణ మారంభింపఁబడుటచే నాక్షేపసంగతికలదు. వేదాన్తవాక్యములు విషయము. వేదాన్తములు కర్మశేషభూతకర్తృ ప్రతిపాదకములా? లేక నిత్య శుద్ధబుద్ధ ముక్త బ్రహ్మ స్వరూపప్రతిపాదనపరములా? అని సంశయము.

పూర్వపక్షము :- "ఆమ్నాయస్య క్రియార్థత్వా దానర్థక్య మతదర్థానామ్" జై, 1-2-1. అనుటచే వేదము క్రియాపరముకానఁ క్రియాపరములుకాని వాక్యము లనర్థకములు. కనుక వేదాన్తవాక్యములలో జీవప్రతిపాదకములగు నవన్నియుఁ గర్మాంగ కర్తృప్రతిపాదకము లనియు, బ్రహ్మప్రతిపాదకములు దేవతాప్రకాశన పరములనియు, సృష్టిప్రతిపాదకములు సాధనపరములనియుఁ జెప్పవలెను. అట్లు చెప్పినచో నవి యనుష్ఠానమున కుపయోగించునవి యగును. కాన వేదాన్తవాక్యము లప్రయోజనములగును. లేక అహేయము, ననుపాదేయము సిద్ధము నగు బ్రహ్మస్వరూపమునే వేదాన్తవాక్యములు ప్రతిపాదించునన్నచో నవి నిష్ప్రయోజనములగును. కనుక బ్రహ్మకు శాస్త్రప్రమాణకత్వము కుదరదు. అని పూర్వపక్షము గలుగఁగా సిద్ధాన్తము చెప్పఁబడుచున్నది.

(సూ) తత్తుసమన్వయాత్. 4

తత్ - తు - సమన్వయాత్.

తత్తు = ఆ శాస్త్రప్రమాణకత్వమైతే, (వేదాన్తము

లందు బ్రహ్మమే ప్రతిపాద్యము అనువిషయము స్థితే) సమన్వయాత్ = సమన్వయమువలనఁ దెలియఁదగినది. అని యర్థము.

సమన్వయ మనఁగా, వేదాన్త వాక్యములకుఁ బరస్పర విరోధము లేకుండ నేకాభిప్రాయమును గల్పించుట. వేదాన్త వాక్యములు భిన్న ప్రకరణము నందున్నవి కనుక కర్తృ ప్రతిపాదనపరములు కావు. బ్రహ్మతాత్పర్యకములు.

"సదేవ సోమ్య! ఇద మగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయమ్" ఛాం-6-2-1, "ఆత్మా వా ఇద మేక ఏవాగ్ర ఆసీత్" ఐత-2-1-1-1, తదేత ద్బ్రహ్మాపూర్వ మనపర మనన్తర మబాహ్యమ్, అయ మాత్మా బ్రహ్మ సర్వానుభూః" బృ. 2-5-19. "బ్రహ్మైవేద మమృతం పురస్తాత్" ముం. 2-2-11 మొదలగువాక్యములందంతటను, బ్రహ్మమే ప్రతిపాదింపఁబడుచున్నది కనుక బ్రహ్మకు శాస్త్రప్రమాణకత్వము కుదురును. అని సిద్ధాన్తము.

దేని నైనను నొకయర్థమును నిర్ణయింపవలె నన్నఁ దగినంత ప్రమాణసామగ్రి కావలయును. వేదాన్తములు, కర్మాంగ కర్తృ ప్రతిపాదకములా? సిద్ధ బ్రహ్మస్వరూప ప్రతిపాదకములా? అనువిషయమును నిర్ణయింపవలె నన్నను గొంత ప్రమాణసామగ్రి కావలయును. ఆసామగ్రి యేదియన

1. ఉపక్రమోపసంహారము లెట్లున్నవి? 2. విషయము అపూర్వమా? 3. మాటలమాటల నభ్యాసముచేయఁ

బడినదా ? 4. దీనిఫలమేమి ? 5. దీని నేమనిప్రశంసించెను ? 6. దీని కుపపత్తులు గలవా ? అనువిషయములు చూడవలయును.

1. ఉపక్రమోపసంహారములు:- ఆప్రకరణములోఁ జెప్పఁదలఁచిన ఒకా యర్థమునకు, ప్రారంభము, ముగింపు నొకమాదిరిగా నున్నవా ? అని విచారించుట. ఛాందోగ్యములో 6-2-1లో "సదేవ సోమ్యే ఇద మగ్ర ఆసీ దేక మేవాద్వితీయమ్" అనిప్రారంభించి, "ఐతదాత్మ్య మిదం సర్వం తత్సత్యం, స ఆత్మా, తత్త్వమసి" అనియుపసంహారములోఁగూడ అఖండాద్వితీయబ్రహ్మమే బోధింపఁబడినది. కనుక నుపక్రమోపసంహారములు సరిగా నున్నవి.

2. వేదాంతములన్నియు నొకే ప్రకరణమనియు నీ ప్రకరణముచేత బ్రహ్మ ప్రతిపాద్యమనియు, "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" అని యుపనిషచ్ఛ్రుతివాక్యంబు పరమపురుషుఁ డనియును విషయ మపూర్వము చెప్పఁబడినది.

3. "ఐతదాత్మ్య మిదం సర్వం" అని పలుమాఱుల విషయము తొమ్మిది పర్యాయము లభ్యాసము చేయఁబడినది.

4. "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" అని ఫలము చెప్పఁబడినది.

5. "యేనాశ్రుతం శ్రుతంభవతి అమతం మత మవిజ్ఞాతం విజ్ఞాతమ్" అని ప్రశంసింపఁబడినది.

6. "యథా సోమ్యైకేన మృత్పిండేన సర్వం మృన్మ యం విజ్ఞాతం స్యాత్" అని యుపపత్తులు కానంబడినవి.

ఇట్లనేక వేదాంతవాక్యములు కల్పుటచే, బ్రహ్మ ప్రతిపాదనమే తాత్పర్యమని, ఉపక్రమోపసంహారాదిషడ్విధములైన కార ణములవలన నిర్ణయము కలుగుచుండుటచే "బ్రహ్మశాస్త్ర ప్రమాణకము" అనుసమన్వయమువలన సిద్ధాంతము చేయం బడుచున్నది.

ఈ షడ్విధములగు కారణములనే షడ్విధ లింగములందురు.

చతుస్సూత్రి సమాప్తము.

## 5 ఈక్షత్యధికరణము.

మొదటి నాలుగు సూత్రములచేతను బ్రహ్మము సర్వ జ్ఞమనియు, సర్వశక్తియుక్తమనియు, జగత్కారణమనియు, వేదాంతప్రతిపాద్యమనియుఁ జెప్పఁబడినది.

దానిపైనియధికరణమున సాంఖ్యుల యాక్షేపమును దత్సమాధానమును జెప్పఁబడుచున్నవి. కనుక వెనుకటిదానితో దీనికి ఆక్షేపసంగతి కలదు.

పూర్వప్రతిపాదితమగు జగత్కారణము చేతనమా ? అచేతనమా ? అని సంశయము.

పూర్వపక్షము:— కూటస్థబ్రహ్మమునకు జ్ఞాన క్రియా శక్తులు లేవు కాన నాబ్రహ్మము జగత్కారణము కాదు.

సత్త్వరజస్తమోగుణ సమష్టిరూపమైన ప్రధానము సర్వజగత్కారణము. సత్త్వగుణముంబట్టి జ్ఞానశక్తియుఁ త్రిగుణముకనుక క్రియాశక్తియును ప్రధానమునకుంగలవు. కావున సర్వజ్ఞము సర్వశక్తియుతము నగునది ప్రధానముకాని బ్రహ్మము కాదు. వేదాన్తవాక్యము లన్నియును ప్రధానము జగత్కారణమని చెప్పునవేకాని బ్రహ్మము జగత్కారణ మని చెప్పునవి కావు. కనుక ప్రధానమే సర్వజగత్కారణమని సాంఖ్యులు పూర్వపక్షము చేయుఁగా దానికి సమాధానము చెప్పుచున్నారు.

### ఈక్షతేర్నాశబ్దమ్. 5

ఈక్షతేః, న, అశబ్దమ్:- ఈక్షతేః= "ఈక్షతి" వలన, అనఁగా "తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి" ఛాం 6-2-3 అను వాక్యములందు ఈక్షతి = (చూచుచున్నాఁడు = ఆలోచించుచున్నాఁడు) అనుధాతువును ప్రయోగించుటవలన, అశబ్దమ్=శబ్ద (వేద) = ప్రతిపాద్యము కాని ప్రధానము, న= జగత్కారణము కాదు.

ఛాందోగ్యములో-6-2-1. "సదేవ సోమ్యేద మగ్ర ఆసీ దేకమే వాద్వితీయమ్" అని ప్రారంభించి, "తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి" అని చెప్పఁబడినది. ఐక్షత= అనఁగా ఆలోచించెను అనియర్థము. ఈవాక్యము ప్రధానానువాదమే యన్నచో అచేతనమగు ప్రధానమునకు ఆలోచిం

చుట యను చేతనధర్మము ఎట్లుకుదురును? కుదరదు. కావునఁ ప్రధానము జగత్కారణము అను వాదము సరియైనది కాదు.

ఇట్లే ఐతరేయములో "ఆత్మా వా ఇద మేకఏవాగ్ర ఆసీత్ నాన్య త్కించన మిషత్ స ఈక్షత లోకాన్ను సృజా ఇతి. స ఇమాన్ లోకా నసృజత" అని ఐత-1-1-1 ఈక్షణపూర్వకమైన సృష్టినే చెప్పుటచేత చేతనధర్మమగు ఈక్షణము కల బ్రహ్మమే జగత్కారణముకాని అచేతన మగు ప్రధానము జగత్కారణముకాదు. అనిసిద్ధాన్తము.

గౌణశ్చేన్నాత్మశబ్దాత్. 6

గౌణః + చేత్ + న+ ఆత్మశబ్దాత్

పై వాక్యములయందలి "ఈక్షతి" వ్యవహారము, గౌణ శ్చేత్ = గౌణము = ఔపచారికము = అప్రధానము, అని చెప్పినచో, న = అట్లుచెప్పరాదు. ఎందుచేత? ఆత్మశబ్దాత్ = ఆత్మశబ్ద ప్రయోగమువలన. "తేజ ఐక్షత" "ఆప ఐక్షన్త" అన్నట్లు అచేతనములందును చేతనధర్మము నారోపించి యౌప చారికముగాఁ జెప్పవచ్చునుగానఁ పై వాక్యములయందలి "ఈక్షతి" వ్యవహారము, ప్రధానము జగత్కారణమనుటలో బాధకముకాదని పూర్వపక్షి యభిప్రాయము.

ఛాందోగ్యములో "సదేవ సోమ్య ఇద మగ్ర ఆసీత్" అని ప్రారంభించి, "తదైక్షత, తత్తేజోఽసృజత" అని క్రమ

ముగా, తేజోఽబన్నముల మూడింటిసృష్టిని చెప్పి వీనినన్నిటిని దేవతారూపముగాఁ బరామర్శించి చెప్పుచు "సేయం దేవతైక్షత హంతాహ మిమాస్తిస్రో దేవతా అనేనజీవేనాత్మనా నుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" ఛాం6-3-2అని చెప్పఁబడినది. "సదేవసోమ్య" అనుదానిలో సచ్ఛబ్దమునకు ప్రధానమర్థమని చెప్పినచో ఈ"సేయం దేవతా" అనువాక్యమునందలి సేయం దేవతా అనునది తత్పరామర్శకముగావున, దీనికిని సౌపచారికముగు ఈక్షణాధర్మముకల అచేతనముగు ప్రధానమే యర్థముగా చెప్పవలెను. అట్లుచెప్పినచో, "అనేన జీవేనాత్మనా నుప్రవిశ్య" = ఈ జీవాత్మస్వరూపముతోఁ బ్రవేశించి, నామరూపేవ్యాకరవాణి = నామరూపములను విస్తరింపఁజేయుదును. అన్నచోట తేజోఽబన్నము లను మూడు దేవతలను ప్రధానము ఈ జీవాత్మస్వరూపముతోఁ బ్రవేశించి యనిచెప్పుట కుదరదు.

జీవుఁడన ప్రాణధారకుఁడును, చేతనుఁడును నగు శరీరాధ్యక్షుఁడు. అచేతనమగు ప్రధానమునకు చేతనుఁడగు జీవుఁడు స్వరూపమెట్లగును? కాఁడు. అందుచేత, "అనేన జీవేనాత్మనా"అనుచోట చేతనుఁడగు బ్రహ్మమనియే యర్థము చెప్పిన ఈక్షణాధర్మము ముఖ్యమైనదే యగును. బ్రహ్మమునకు జీవుఁడుస్వరూపమనుటయుఁ గుదురును. మఱియు "స య ఏషోఽణిమా ఐతదాత్మ్యమిదం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వమసి

శ్వేతకేతో! ఛాం-6-14-3. అనికేతువునకు ఆత్మతాదాత్మ్యో పదేశము చేయఁబడినది. కనుక ఆత్మశబ్దప్రయోగమువలన ఈక్షతివ్యవహారము గౌణమని చెప్పుట కుదురదు. ప్రధానమునకు కారణము కాదు. అనిసిద్ధాన్తి సమాధానము.

అవ = పూర్వపక్షి మరల, ఇట్లు ప్రశ్నించుచున్నాఁడు - తనకు సర్వవిధములఁదోడ్పడు మంత్రినిజూచి మహారాజు "ఈభద్రసేనుఁడు నాఆత్మ అని వ్యవహరించినట్లు పురుషునకు భోగాపవర్గములఁ గూర్చు ప్రధానము అచేతనమయ్యును ఆత్మశబ్దముచేఁ జెప్పఁబడవచ్చును. కాన ఆత్మశబ్దప్రయోగమువలన నీక్షతివ్యవహారము గౌణమనుటకు భంగములేదు. అనినసిద్ధాన్తి సమాధానము చెప్పుచున్నాఁడు.

## తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్ - 7.

తన్నిష్ఠస్య = ఆత్మనిష్ఠునకు, మోక్షోపదేశాత్ = మోక్షము నుపదేశించుటవలన, అచేతనమగు ప్రధానము ఆత్మశబ్దముచేఁ జెప్పఁబడవచ్చునని యనరాదు.

ఛాందోగ్యములో - "సఆత్మా తత్త్వమసి శ్వేతకేతో!" అని శ్వేతకేతువునకు మోక్షోపదేశము చేయఁబడినది, "సఆత్మా =సద్రూపమైన అని ఆత్మ. తత్ త్వమసి శ్వేతకేతో! = ఓ శ్వేతకేతుఁడా! నీవు ఆయాత్మస్వరూపమవు. అని సద్రూప

మగు ఆత్మను గ్రహించి నీవు ఆ ఆత్మవు. అని యాత్మనిష్ఠను జూపి "ఆచార్యవాన్ పురుషో వేద" = గురువుగల పురుషుఁడు తెలిసికొనును, అనియుపదేశించెను. ఆత్మశబ్దమునకుఁ బ్రధానమనియే యర్థము చెప్పిన, చేతనుఁడగు శ్వేతకేతువుని నచేతనుఁడవని చెప్పినట్లగును. మోక్షోపదేశము లేదునరికదా! అనర్థకముకూడ తటస్థించును. కనుక అచేతనమగు ప్రధానము సచ్ఛబ్దవాచ్యముకాదు.

## హేయత్వావచనాచ్చ. 8

హేయత్వ= నిరాకరింపఁ దగినదనువిషయమును అవచనాచ్చ = చెప్పకపోవుట వలనను ప్రధానము సచ్ఛబ్దవాచ్యము కాదు. అనాత్మయైన ప్రధానమే సచ్ఛబ్దవాచ్యమైనయెడల ముందుగ గ్రహణ సౌకర్యార్థమై స్థూలారుంధతీ న్యాయముగ "సఆత్మా తత్త్వమసి" అని చెప్పినను మఱల యథార్థమైన దానిని గ్రహింపఁజేయుటకై దీనిని హేయముగాఁ జెప్పును. కాని యట్లుచెప్పుటను చెప్పకపోవుట వలన ప్రధానము సచ్ఛబ్దవాచ్యము కాదనియర్థము. స్థూలారుంధతీన్యాయ మనఁగా – అరుంధతీ నక్షత్రమును జూపించువాఁడు దానికి ప్రక్కనున్న పెద్దనక్షత్రమును ముందుచూపించి తరువాత దానిప్రక్కను మిణుకుమిణుకు మనుచున్న చిన్న చుక్కను జూడుము. అదియే యరుంధతి. అని చూపించును.

R. SK. S. LIBRARY
Acc. No. 1639
Class No. ........

## స్వాప్యయాత్ 9

ఛాందోగ్యములో "స్వపితి" యనుమాటకు నిర్వచనము చేయుచు "యత్రైతత్పురుషః స్వపితినామ సతా సోమ్య! తదా సంపన్నో భవతి స్వమపీతో భవతి తస్మాదేనం స్వపితీత్యాచక్షతే" అని ఛాం-5.8-1. చెప్పఁబడినది. ఎప్పుడీ పురుషుఁడు నిద్రపోవుచున్నాడో అప్పుడితఁడు సద్రూపునితోఁ గూడినవాఁడగుచున్నాఁడు. తన్ను బొందినవాఁడగుచున్నాఁడు. అందుచే నప్పుడితనిని స్వపితి యందురు. స్వం = సచ్ఛబ్దవాచ్యుఁడగు ఆత్మను అపీతః = పొందినవాఁడు అని యర్థము. పురుషుఁడు నిద్రపోవునపుడు సచ్ఛబ్దవాచ్యుఁడగు పరమాత్మను బొంది యతనిలో లీనమగుచున్నాఁడని చెప్పుటచే సచ్ఛబ్దవాచ్యుఁడు బ్రహ్మమేకాని ప్రధానముకాదు. ప్రధానమేయన్నచోఁ జేతనుఁ డచేతనమును బొందుచున్నాఁడని విరుద్ధార్థము తటస్థించును. "ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః" అని చేతనునియందు అప్యయమును(లయమును) దెలుపు శ్రుత్యంతరములకును విరోధము కలుగును కనుక సమస్త చేతనులకు నేచేతనమునందు లయముగలుగునో ఆ, చేతనమైన సచ్ఛబ్ద వాచ్యమైన బ్రహ్మస్వరూపము జగత్కారణముకాని ప్రధానము జగత్కారణముకాదు.

## గతిసామాన్యాత్ - 10

సమస్త వేదాంతము లయందును చేతనమైన పరబ్రహ్మమే జగత్కారణము అనెడి, గతిసామాన్యాత్ = అవ

గతిసామాన్యమువలన (జ్ఞానసామ్యమువలన) ప్రధానము జగత్కారణముకాదు. వేదాన్తవాక్యము లన్నిటియందును చేతనుడగు బ్రహ్మమే జగత్కారణమని తెలియుచున్నది కాన ప్రధానము జగత్కారణముకాదు. ఏతస్మా దాత్మనః సర్వే ప్రాణాః యథాయతనం విప్రతిష్ఠన్తే" కౌ 3-3. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః" తై 2-1-7. "ఆత్మత ఏవేదం సర్వమ్." ఛాం. 7-26-1. "ఆత్మన ఏష ప్రాణో జాయతే" ప్రశ్న. 3-3. మున్నగు శ్రుతులు బ్రహ్మ= పరమాత్మ - జగత్కారణమని చెప్పుచున్నవి.

## శ్రుతత్వాచ్చ. 11

బ్రహ్మ జగత్కారణమని వేదములందు వినబడుట వల్లను ప్రధానము జగత్కారణముకాదు. శ్వేతా... లో సర్వజ్ఞుడగు పరమేశ్వరు నుపక్రమించి "స కారణం కరణాధిపాధిపో నచాస్య కశ్చిజ్జనితా నచాధిపః" అని చెప్పబడినది. కరణ = ఇంద్రియములకు, అధిప = అధిపతియైనజీవునకు లేదా ఇంద్రియాధిష్ఠానదేవతలకు, అధిపః = అధిపతియైన, సః = ఆపరమాత్మ, కారణం = సర్వజగత్కారణము. అస్య = ఈపరమాత్మకు, కశ్చిత్ = ఏయొక్కడును, జనితా = పుట్టించువాడు. న= లేడు; అధిపః = అధిపతియైనవాడును, న= లేడు అని యర్థము. ఇట్లు చెప్పబడియుండుటచే సర్వజ్ఞుడగు పరబ్రహ్మ, పరమాత్మ, జగత్కా-

రణముకాని, అచేతనమగు ప్రధానము జగత్కారణముకాదు. అనిసిద్ధాన్తము.

### 6 ఆనందమయాధికరణము

అవతారిక:-"జన్మాద్యస్యయతః" అనుసూత్రము మొదలు కొని, "శ్రుతత్వాచ్చ" అనుసూత్రమువఱకుఁగల గ్రంథముచే సర్వజ్ఞుఁడగు నీశ్వరుఁడు, జగత్తునకు జన్మస్థితిలయకారణ మనియు వేదాంతవాక్యములు, చేతనకారణత్వమును దెలుపునవి యనియు, నిరూపింపఁబడినది.

జగత్కారణమగు నీశ్వరుఁడొక్కఁడేయైనను, విద్యా ఽవిద్యావిషయభేదముచే నుపాస్యుఁడని, జ్ఞేయుఁడని, రెండు విధములుగ వేదాంతములందుఁజెప్పఁబడుచున్నాఁడు. నామ రూప వికారభేదోపాధివిశిష్టుఁ డుపాస్యుఁడనియు నేవిధమైన యుపాధిసంబంధములేనివాఁడు జ్ఞేయుఁడనియు నర్థము. ఉపాస్యోపాసక లక్షణమగు వ్యవహారమంతయు నవిద్యాదశయందేకాని విద్యాదశయందుఁగాదు. ఈయుపాసనలలోఁ గొన్ని యభ్యుదయజనకములు, కొన్ని క్రమముక్తిదాయకములు. మఱికొన్ని కర్మసమృద్ధికరములు. గుణవిశేషము వలనను నుపాధిభేదములవలనను నీభేదములు కలుగును. పరమేశ్వరుఁడొక్కఁడే యైనను నానాగుణములు కలవాఁడుగా నుపాసింపఁబడి యాయా ఫలితముల నొసఁగును. స్థావర జంగమాది సర్వభూతములందు గూఢముగా నున్నవాఁడావర

మేశ్వరుండొక్కడే. అయినను చిత్తమను నుపాధివిశేషము యొక్క తారతమ్యము (హెచ్చుతగ్గు) వలనఁగూటస్థ నిత్యుఁడు నద్వితీయుఁడు, నైన యాపరమేశ్వరుని యావిష్కరణ తారతమ్యము గలుగుచున్నది. అదియే విభూతివిశేష మనఁబడును. ఎచ్చటెచ్చట నీవిభూత్యతిశయ ముండునో యది పరమేశ్వరరూపముగ నుపాసనచేయుమని చెప్పఁబడు చున్నది: "యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జిత మేవవా తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్" అని.గీ.

ఇటులనే, జ్ఞేయబ్రహ్మవిషయములో, సర్వోన్ముక్తికారణమైన యాత్మజ్ఞానముకూడ నుపాధివిశేషద్వారముగా నుపదేశింపఁబడుచున్నది. నుపాధివిశేషమును వివక్షసేయునిచోఁ బరమాత్మయగు జ్ఞేయబ్రహ్మను గూర్చిచెప్పినదా? ఉపాస్యుఁడగు నపర (కార్య) బ్రహ్మనుగూర్చి చెప్పినదా? యని సందేహముకలుగును. ఆసందేహమును వేదాంతవాక్యముల యుపగతిపాసహాన్యమును పరిశీలించి నిర్ణయింపవలెను. పరాపర బ్రహ్మ విషయక సందేహమును దొలఁగించుటకై యట్టి సందిగ్ధవాక్యములు ఇఁకముందు వివరింపఁబడును.

తైత్తిరీయకములో (2-5.) నన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయముల నుపక్రమించి "తస్మాద్వా ఏతస్మా ద్విజ్ఞానమయాత్ అన్యోఽన్తర ఆత్మాఽఽనందమయః" అని చెప్పఁబడినది. ఇచ్చట "ఆనందమయ" పదమునకు

"సత్యంజ్ఞాన మనంత బ్రహ్మ" తై 2.1 అని చెప్పఁబడిన పర బ్రహ్మము అర్థమా? ఉపాస్యుఁడగు నముఖ్యబ్రహ్మ యర్థమా? యనిసందేహము గలుగఁ దన్నివారణమునకై యీయధికరణ మారంభింపఁబడినది.

ఆనందమయోఽభ్యాసాత్. 12

అభ్యాసాత్ = అభ్యాసమువలన, పెక్కుతావులఁ బరమాత్మయందే యానంద శబ్దము వ్యవహరింపఁబడుట వలన, ఆనందమయః – ఆనందమయుఁడు పరమాత్మ.

ఆనందమయుని బ్రస్తుతించి "రసో వై సః" యని యతనికే రసత్వమును చెప్పి, "రసం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి. "కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందో న స్యాత్. "ఏష హ్యేవానందయాతి సైషానందస్య మీమాంసా భవతి. "ఏత మానందమయ మాత్మాన ముప సంక్రామతి" "ఆనందం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చన". "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" "విజ్ఞాన మానందం బ్రహ్మ." అని యీమాదిరిగాఁ బరబ్రహ్మమునందే యానందశబ్దము పలుమారులు వ్యవహరింపఁబడుటచేతఁ బరమాత్మ యానంద మయుఁడని తెలియుచున్నది. ఈయానందమయుఁడే ముఖ్యుఁడైనచో "తస్య ప్రియమేవ శిరః" అని యవయవకల్పన మేల చేయఁబడినది? అన్నమయ ప్రాణమయాద్యముఖ్యాత్మ ప్రవాహములోఁ బడిన దేల? యని ప్రశ్నింపరాదు. అన్నమయ

ప్రాణమయాదులకవయవకల్పన చేయుచు నాప్రక్రమములోఁ జెప్పఁబడిన దేకాని సాక్షాదవయవకల్పన కాదు. అరుంధతీ నక్షత్రమును జూపింపఁబోవువారు ముందు దానికి దగ్గరలో నున్న యితరనక్షత్రములను గొన్నిటిని జూపి చివరకు దానిని జెప్పినట్లు పరమాత్మ నుపదేశింపఁదలఁచిన శాస్త్రము ముందుగా నన్నమయాద్యనాత్మలను జెప్పి పిదప సర్వాంతరుఁడగు నానందమయుని జెప్పి యూరకున్నది. కనుక నానందమయుఁడు, పరమాత్మ.

వికారశబ్దాన్నేతి చేన్న ప్రాచుర్యాత్. 13

వికారశబ్దాత్ = వికారార్థబోధకమగు మయట్ ప్రత్యయమువలన, న + ఇతి చేత్ = ఆనందమయుఁడుపరమాత్మకాఁడన్నచో, ప్రాచుర్యాత్ = మయట్ప్రత్యయము ప్రాచుర్యార్థకమగుటవలన, న = ఆనందమయుఁడు పరమాత్మ కాఁడను వాదము సరికాదు.

అన్నమయ ప్రాణమయ మొదలగు పదములందు మయట్ప్రత్యయమునకు వికార మర్థము. అన్నవికారము, ప్రాణవికారము, అని; వికారము ప్రకృతికంటె విభిన్నము. కనుక ఆనందమయుఁ డన్నప్పుడుగూడ నానందముకన్న నితఁడు భిన్నుఁడని యర్థము వచ్చుచున్న దందురేమో యని యిచ్చటి మయట్ప్రత్యయమునకుఁ బ్రాచుర్య మర్థమనియు,

ఆనందము ప్రచురముగా (నెక్కువగాఁ) గలవాఁడనియు నది ప్రాయమని చెప్పుచున్నారు.

తద్ధేతు వ్యపదేశా చ్చ. 14

తద్ధేతు = ఆనందమునకు హేతువని, వ్యపదేశాచ్చ = చెప్పుటవలనఁగూడ ఆనందమయుఁడు పరమాత్మ యనుచోటి మయట్టు ప్రాచుర్యార్థకము "ఏష హ్యే వానందయాతి" ఇతఁడే యానందపఱచుచున్నాఁడు. అని చెప్పుటచే లోకములో నధికముగా ధనమున్నవాఁ డితరులను ధనవంతులను జేయఁగలుఁగునుగాని సామాన్యుఁడు చేయలేనట్లు విశేషానందమున్నవాఁడుకాని యితరుల నానందపఱుపలేఁడని యర్థమగుచున్నది. కనుక నిచ్చట మయట్ప్రత్యయమునకుఁ బ్రాచుర్యమనియే యర్థము చెప్పవలెను.

మాంత్రవర్ణిక మేవచ గీయతే. 15

మాంత్రవర్ణిక మేవ = మంత్రవర్ణములందుఁ జెప్పఁబడిన "సత్యం జ్ఞాన మనంతంబ్రహ్మ" అను బ్రహ్మమే, గీయతేచ = "అన్యోఽన్తర ఆత్మాఽఽనందమయః" అని బ్రాహ్మణములో గానము చేయఁబడుచున్నది. (చెప్పబడుచున్నది.) మూలమునకు మంత్రమనియు, వ్యాఖ్యానమునకు బ్రాహ్మణమనియుఁ బేర్లు. మంత్రబ్రాహ్మణములకు విరో

ర్థము తగదు కాన నానందమయుఁడు పరమాత్మయే యనుట సముచితము.

### నేతరోఽనుపపత్తేః. 16

ఇతరః = పరమేశ్వరునికన్న నితరుఁడు, అముఖ్యుఁడు సంసారి, జీవుఁడు, న = ఆనందమయపదమున కర్థముకాదు. ఏల?. అనుపపత్తేః = ఉపపన్నముకాదు కనుక.

ఆనందమయు నుపక్రమించి "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి. స తపోఽతప్యత. స తపస్తప్త్వా ఇదం సర్వమసృజత యదిదం కించ" అని సర్వమును సృజించెనని చెప్పఁబడినది. విపులమగు నీసర్వవిధసృష్టిని బరమాత్మ కంటె నన్యుఁడు సృజించెననుట యనుపపన్నము కాన నీయానందమయుఁడు పరమాత్మ.

### భేదవ్యపదేశాచ్చ. 7

భేద = జీవాత్మపరమాత్మలకు భేదమును, వ్యపదేశాచ్చ = చెప్పుటవలనఁగూడ నానందమయుఁడు జీవుఁడు కాఁడు.

ఆనందమయాధికారములో "రసో వై సః, రసం హ్యేవాయం లబ్ధ్వానందీ భవతి." తై 2.7. యని చెప్పఁబడినది. పరమాత్మ రసస్వరూపుఁడు (ఆనందస్వరూపుఁడు). అతనిని బొంది యీజీవుఁ డానందముకలవాఁ డగుచున్నాఁడు అనియర్థము.

ఆనందరూపుఁడు వేఱు, ఆనందమును బొందువాఁడు వేఱు, అంతేకాని పొందెడివాఁడే పొందఁదగినవాఁడు కాఁడు.

వాస్తవముగా జీవాత్మపరమాత్మలకు భేదము లేదు. కాని తత్త్వమెఱుఁగఁబోవుటచే లోకములో ఆత్మకాని దేహేంద్రియములయందాత్మయని భ్రాంతి చూపట్టుచున్నది. అందుచే దేహాధిభూతుఁడగు తనకు ఆత్మాన్వేషణమును "ఆత్మాన్వేష్టవ్యః" అనుశ్రుతులు బోధించుచున్నవి. వాస్తవదృష్టిలో "నాన్యోతోస్తి ద్రష్టా" అని భేదమును నిరసించుచునే యున్నవి. ఉపాధిపరిచ్ఛిన్నమగు ఘటాకాశము ఉపాధిపరిచ్ఛిన్నము కాని యాకాశముకంటె వేఱైనట్లు అవిద్యాకల్పితుఁడైన కర్తృభోక్తృస్వరూపుఁడగు జీవుఁడు అవిద్యారహితుఁడైన పరమేశ్వరుని కన్న వేఱు. ఈ కల్పిత భేదము ననుసరించియే "నేతరోనుపపత్తేః", "భేద వ్యపదేశాచ్చ" యనుసూత్రములు చెప్పఁబడినవి.

కామాచ్చ నానుమానాపేక్షా. 18

కామాచ్చ = కోరికవలనను, అనుమానాపేక్షా = సాంఖ్య లనుమాన ప్రమాణముచే సాధించిన యచేతనమగు ప్రధానము ఆనందమయ పదమున కర్థమను నుద్దేశము, న = లేదు.

ఆనంద మయాధికారము లో "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయ" అనికోరిక చెప్పఁబడినది.

అచేతనమునకు కోరిక యసంభవము కావున ప్రధాన మానందమయుమని కాని జగత్కారణ మనికాని కాదని యభిప్రాయము. ఈవిషయము వెనుక నిరాకరింపఁబడినను వెనుకటిసూత్రమున నుదాహరించిన "సో కామయత" అను శ్రుతి గుర్తువచ్చుటవలనఁ బ్రసంగసంగతిగా మరల నిరాకరింపఁబడెను.

అస్మి న్నస్యచ తద్యోగం శాస్తి 19

అస్మిన్ = ఈయానందమయునియందు, అస్య = ఈజీవునకు తద్యోగం = తత్స్వరూపమునొందుటను. అనఁగా ప్రతిబుద్ధుఁడగుజీవుఁడు ముక్తి నొందుటను. శాస్తిచ = శాస్త్రము చెప్పుచున్నది. కనుక నానందమయుఁడు జీవుఁడు కాఁడు.

తైత్తిరీయకములో 2-7 "యదా హ్యేవైష ఏతస్మి న్నదృశ్యే ఽనాత్మ్యే ఽనిరుక్తే ఽనిలయనే ఽభయం ప్రతిష్ఠాం విందతే. అథ సో ఽభయం గతో భవతి. యదా హ్యేవైష ఏతస్మి న్నుదర మంతరం కురుతే అథ తస్య భయం భవతి." అనియున్నది. అదృశ్యత్వాది గుణవిశిష్టుఁ డగు పరమాత్మయందుఁ దాదాత్మ్యసంబంధముతో నెవ్వఁ డుండునో యతఁడు సంసారభయము నొందఁడు. స్వల్పముగా నైనను భేదబుద్ధితో నుండువాఁడు సంసారభయమునే పొందు చుండు నని దీనిభావము. ఈప్రకరణమునందలి యానంద

మయుఁడు పరమాత్మయని చెప్పిననే యీ యదృశ్యత్వాది గుణ విశిష్టుఁడగు నానందమయుని బొందుటవలన సంసార నివృత్తి, పొందకపోవుటవలన అనివృత్తియు, గలుగుచున్న దనుటయుపపన్నము. కనుక నానందమయుఁడు పరమాత్మ యని సారాంశము.

ఈ యానంద మయాధికరణమున శంకరులు స్వాభి మతమగు నర్థాంతరమును వేఱువిధముగా వివరించి యున్నారు.

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ ము లను నాల్గుచోట్లను వరుసగా మయట్ప్రత్యయమునకు వికా రార్థమును జెప్పి యానందమయ యను నైదవచోట నొక్క- చోటఁ బ్రాచుర్యార్థమును జెప్పుట యర్థజరతీన్యాయము, అనుచితము. ఇచ్చట నానందమయ పదమునకుఁ బరమాత్మ యని యర్థముకాదు. మంత్ర బ్రాహ్మణముల కేకవాక్యత కల్పింపవలెనన్న నన్నమయాది పదములకును బరమాత్మ యని యర్థము చెప్పవలెను. కాని "అన్యోఽన్తర ఆత్మా" అని దానిలోపల మఱియొక యాత్మ యని చెప్పుటచే నన్నమయా దులకుఁ బరమాత్మయని యర్థము చెప్పుట కుదరదు. ఆనందమ యుని జెప్పి మఱియొక్క-యాత్మను జెప్పలేదు కనుక ఆనంద మయ పదమునకుఁ బరమాత్మయని యర్థము చెప్పవచ్చును" అనియన్నచో "తస్య ప్రియమేవ శిరః, మోదో దక్షిణః పక్షః, ప్రమోద ఉత్తరః పక్షః, ఆనంద ఆత్మా బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా"

అని యానందమయునికి శిరస్సు మొదలగు నవయవములను గల్పించుటచే నానందమయపదమునకు బ్రహ్మ యర్థము కాదని స్పష్ట మగుచున్నది. అవయవకల్పనచే బ్రహ్మ సవిశేషమగును. నిర్విశేషమని సిద్ధాంతము.

మఱియుఁ బ్రాచుర్యార్థమును జెప్పి విశేషముగా నానందము కలవాఁడని చెప్పినను స్వల్పముగా దుఃఖముకూడ నున్నదనియే స్ఫురించును.

అభ్యాసమువలన నానందమయుఁడు పరమాత్మ యని చెప్పుటయును సమంజసము కాదు. "రసం హ్యేవాయం లబ్ధ్వా నందీభవతి" "యదేష ఆకాశ ఆనందో నస్యాత్" "సైషానందస్య మీమాంసా" "ఆనందం బ్రహ్మణో విద్వాన్" "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని యున్నచోట్లను నానందపదమునకే యభ్యాసము కనిపించుచున్నది. ఆనందమయపదము బ్రహ్మవిషయ మైనచో నానందమయ పదమునకే యభ్యాసము కల్పించియుండును. కనుక, అన్నమయాదికము లైన యానందమయాంత పంచకోశములను వివరించి "బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా" అనుదానిచే "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" యనిమంత్రములోఁ జెప్పఁబడిన బ్రహ్మను వివరించుచున్నాఁడు. "బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" అనఁగా బ్రహ్మ (పరబ్రహ్మ) పుచ్ఛమువంటివాఁడు. పుచ్ఛము (తోఁక) ఏమాదిరిగాఁ బక్ష్యాదుల కాధారమై పడిపోకుండ

నిలఁబెట్టుచున్నదో యట్లే బ్రహ్మ సర్వజగములకు నాధార మైనవాఁడని యర్థము. ప్రతిష్ఠా = పరాయణము ముఖ్యమగు నాధారము లోకికమగు నానందమున కంతకు బ్రహ్మనందము పరమావధియని యర్థము. పుచ్ఛపదమునకుఁ బుచ్ఛమువంటివాఁడని యర్థముకాని యవయవమని యర్థము కాదు. కనుక "ఆనందమయుని కవయవముగాఁ జెప్పినాఁడు, బ్రహ్మ స్వప్రధానుఁడు కాఁడు" అను ప్రశ్న కవకాశము లేదు.

సూత్రముల కిట్లర్థము చెప్పవలెను.

"బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా" అనుచోట బ్రహ్మ యానందమయావయవమా? స్వప్రధానమా? అని సందేహము కలుగ స్వప్రధానమే అని నిర్ణయించుచున్నారు. ఏలయన? అభ్యాసాత్ = అసన్నేవ స భవతి. అసద్బ్రహ్మేతి వేదచేత్. అస్తి బ్రహ్మేతి చేద్వేద సంత మేవం తతో విదుః" అని నిగమన శ్లోకములోఁ గేవలుఁడగు బ్రహ్మకే యభ్యాస ముండుటవలన.

వికారశబ్దా న్నేతిచేత్ = అవయవవాచకమగు పుచ్ఛపదము వలన బ్రహ్మ స్వప్రధానము కాదన్నచో, న=అట్లన రాదు. ప్రాచుర్యాత్ = అవయవప్రాయమగు వచనమువలన, అనఁగా అన్నమయాదులకు శిరఆదిపుచ్ఛాంతములగు నవయవములను జెప్పి, యానందమయునికిఁగూడ శిర ఆద్యవయవ

ములను జెప్పి పుచ్ఛమువలె నాధారమైనదని చెప్పుటకుఁ జెప్పినదికాని కేవల మవయవమును జెప్పు నుద్దేశముతోఁ జెప్పినది కాదు. కనుక బ్రహ్మ స్వప్రధానమే యని భావము. మిఁగిలిన సూత్రములకును నిట్లే పుచ్ఛవాక్య నిర్దిష్ట బ్రహ్మోపపాదకముగా నర్థమును గ్రహింపవలెను.

### 7. అన్తరధికరణము. (20-21)

అవ:- అథయ ఏషో౽న్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే। హిరణ్యశ్మశ్రుః, హిరణ్యకేశః। ఆప్రణఖాత్సర్వ ఏవ సువర్ణః। తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ। తస్యోదితి నామ స ఏష సర్వేభ్యః పాప్మభ్య ఉదితః, ఉదేతి హ వై సర్వేభ్యః పాప్మభ్యః। య ఏవం వేద 1-6-7-8 అనియు, "అథ య ఏషో౽న్తరక్షిణి పురుషో దృశ్యతే" 1-7-1-5 అనియును ఛాందోగ్యములోనున్నది. సూర్యునిలోపల జ్యోతిర్మయుఁడగు పురుషుఁడెవ్వఁడు గనఁబడుచున్నాఁడో యతఁడు జ్యోతిస్స్వరూపములగు మీసములు కేశములు గలవాఁడు. కాలిగోరుచివరనుండి యంతయు జ్యోతిస్స్వరూపుఁడు. (హిరణ్య= జ్యోతిస్సు) కోతిపిఱుదువలె నెఱ్ఱనైన తామరపువ్వువంటి కన్నులుగలవాఁడు. అనఁగా నెఱ్ఱతామరలవంటి కన్నులు గలవాఁడని యర్థము. అన్ని పాపములనుండి యుత్థితుఁడుగనుక

వతనికి 'ఉత్', అనిపేరు. ఈవిధముగా నతని నెఱింగినవానికిని పాపములన్నియుఁబోవును. ఇట్లే కంటిలోపలఁగనిపించు పురుషుఁడును, పాపములులేనివాఁడు. అనియర్థము.

ఇచ్చట నాదిత్యునియందును నక్షియందును గనఁబడు పురుషుఁడు తనయొక్క విద్యాకర్మాతిశయమువలన నుత్కర్ష గడించినజీవుఁడా? పరమాత్మస్వరూపుఁడా? యని సందేహము గలుగ, వారించుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

అన్తస్తద్ధర్మోపదేశాత్ 20.

అన్తః = ఆదిత్యుని యొక్కయు నక్షి (కన్ను) యొక్కయు లోపలనున్నవాఁడు, తద్ధర్మోపదేశాత్ = ఆ పరమాత్మయొక్క ధర్మముల నుపదేశించుటవలనఁ బరమాత్మ స్వరూపుఁడేకాని ప్రాప్తోత్కర్షుఁడగు జీవుఁడుకాఁడు.

"య ఆత్మాఽపహతపాప్మా" అని పరమాత్మయం దేవిధమగు పాపములు లేవనిచెప్పెను. అధర్మమును నిక్కడ నున్నవానికిని నుపదేశించుటవలన నితఁడును నాపరమాత్ముఁడేయని యభిప్రాయము.

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయమ్" అని భగవంతునికి రూపము లేదనియు "స్వేమహిమ్ని ప్రతిష్ఠితమ్" తన మహిమయందుఁ బ్రతిష్ఠింపఁబడియుండెననియు భగవంతుని గూర్చి చెప్పఁబడినదికదా! యిచ్చట జ్యోతిరూపముకల వాఁడనియు, సూర్యునిలోపల, కంటిలోపల నున్నాఁడనియుఁ జెప్పుట విరుద్ధముకాదా! యన నుపాసనచేయుటకు, వీలుగా

నందుటకై యాకారమును నాధారమును గల్పించనేకాని సహజముగా నతనికి రూపములేదు. ఆధారమును లేదు.

భేదవ్యపదేశాచ్చాన్యః 21.

భేదవ్యప దేశాచ్చ = భేదమును చెప్పుటవలనను, అన్యః = ఇతఁడు వేఱొకఁడు. 'అన్తర్యామిబ్రాహ్మణములో "య ఆదిత్యేతిష్ఠ న్నాదిత్యాదంతరో యమాదిత్యో నవేద" ఆదిత్యునికిలోఁగనున్నను నాదిత్యుఁడితని నెఱుఁగడని చెప్పఁబడియున్నది. దానిచేత నాదిత్యునికన్న నితఁడు విభిన్నుఁడనుట స్పష్టము. ఆదిత్యునికన్న భిన్నుఁడై యపహతపాప్మత్వాది ధర్మములు కలయితఁడు పరమాత్ముఁడేయని యభిప్రాయము.

8. ఆకాశాధికరణము (22)

అవ:- ఛాందోగ్యము (1-9-1) లో శాలావత్యుఁడు జైవలిరాజును "అస్యలోకస్యకాగతిః ?" ఈలోకమునకు గతియేమి ? (అధిష్ఠానమేమి?) అనియడుగ "ఆకాశ ఇతిహో వాచ, సర్వాణిహవా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్తే ఆకాశం ప్రత్యస్తంయన్తి, ఆకాశో హ్యేవైభ్యో జ్యాయా నాకాశః పరాయణమ్." ఈలోకమున కాకాశము గతి, సర్వభూతములు నాకాశమునుండి పుట్టుచున్నవి. ఆకాశమునందే లయమగుచున్నవి. వీనియన్నిటికంటెను నాకాశమే గొప్పది. పరాయణమైనది. అనియతఁడు బదులుపలికెను.

ఇచ్చట నాకాశపదమునకు భూతాకాశమనియర్థమా, పరమాత్మయనియర్థమా! అని సందేహము. ఆకాశపదమునకు భూతాకాశమను నర్థము శీఘ్రముగస్ఫురించును. "యదేష ఆకాశ ఆనందోనస్యాత్" "ఆకాశోహవై నామరూపయోర్నిర్వహితా" అని పరమాత్మయనునర్థమునందును నాకాశపదమునకుఁ బ్రయోగముకలదు. "ఆకాశాద్వాయుః వాయోరగ్నిః," అని మిగిలిన భూతములకన్నిటికిని నాకాశము కారణముకనుక "ఆకాశాదేవసముత్పద్యన్తే, ఆకాశంప్రత్యస్తం యన్తి" అనువచనము భూతాకాశమను నర్థమునకు బాధకముగాదు. అందువలన సందేహముకలుగుచుండ వారించుటకై యీయధికరణమారంభింపఁ బడినది.

## ఆకాశస్తల్లింగాత్ ౨౨.

ఆకాశః = శాలావత్యజైవలిరాజ సంవాదములోని భూతాకాశపదము తల్లింగాత్ = పరమాత్మబోధకమగు లింగమువలనఁ బరమాత్మబోధకము అని యర్థము.

భూతములన్నియు నాకాశమునుండి పుట్టుచున్నవి. ఆకాశమునందస్తమించుచున్నవి. ఆకాశము జ్యాయస్సు (పెద్దది) పరాయణము, "ఆకాశమనంతము" ననువచనములన్నియుఁ బరమాత్మబోధకములగు లింగములు. భూతాకాశము మిగిలినభూతములకన్నిటికిని గారణమైనను దానికిఁ

పరమాత్మకారణము. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః" అని చెప్పఁబడినది. "జ్యాయాన్ పృథివ్యాః, జ్యాయానంతరిక్షాత్" భూమికంటెను, నాకాశముకంటెను, బరమాత్మ పెద్దవాఁడని చెప్పుటచే నన్నిటికంటెను బరమాత్మయే పెద్దవాఁడు. పరాయణుఁడును అనంతుఁడును ననునవి గూడ లింగములు,

పరమాత్మయను నర్థమున నాకాశపదమే గాక, ఆకాశమను నర్థమునిచ్చు, వ్యోమ, ఖం, అనుపదములుకూడ వాడఁబడినవి.

## 9. ప్రాణాధికరణము (23)

చాక్రాయణుఁడనుఋషి ధనార్థియై యొక రాజయజ్ఞము చేయుచుండగా నటకువెళ్ళి "ప్రస్తోత ర్యా దేవతా ప్రస్తావమన్వాయత్తా! కతమా సా దేవతా ? హే ప్రస్తోతః = ఓ స్తోత్రము చేయురాజా! యా దేవతా = ఏ దేవత, ప్రస్తావంనామ సముదాయమును అన్వాయత్తా = అనుగతమైనదో సాదేవతా కతమా = ఆ దేవత యేది ? అని ప్రశ్నింప, "ప్రాణ ఇతి హోవాచ ప్రాణమేవాభిసంవిశన్తి ప్రాణమభ్యుజ్జిహతే, సైషా దేవతా ప్రస్తావమన్వాయత్తా" ఈప్రస్తావమున కనుగతమైన దేవత ప్రాణము. ప్రాణమునే పొందుచున్నవి. ప్రాణమునే విడుచుచున్నవి. అని రాజబదులుచెప్పెను. అని ఛాందోగ్యములో (1-11-4-5) చెప్పఁబడినది.

ఇచ్చటఁగూడఁ బ్రాణశబ్దమునకు శీఘ్రోపస్థితివలన ప్రాణాపానాదిపంచవృత్తియగు వాయురూపమగు ప్రాణమని యర్థమా! "ప్రాణబంధనంహి సోమ్యమనః "ప్రాణస్య ప్రాణమ్" అనుస్థలములందుఁ బ్రాణపదము బ్రహ్మ విషయముగా వాడఁబడినదికనుక నిచ్చటను నాపరబ్రహ్మమని యర్థమా! అని సంశయముకలుగ వారించుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

### అతఏవప్రాణః 23

అతఏవ = ఈలింగమువలననే, ప్రాణః = చాక్రాయణర్షి రాజసంవాదములోని, ప్రాణపదము, పరమాత్మబోధకము. వాక్యశేషములో ప్రాణమునేపొందుచున్నవి. ప్రాణమునేవీడుచున్నవి. యని సమస్తభూతములకు నుత్పత్తిప్రళయములు ప్రాణనిమిత్తములుగాఁ జెప్పుటచే నాప్రాణము పరబ్రహ్మమే యని యర్థము.

నిద్రపోవునపుడు సకలేంద్రియములు ప్రాణములో లయముచెంది మెలకువగాంచునపుడు మరలనటనుండి పుట్టుచున్నను సేంద్రియములు సశరీరములు, జీవాధిష్టములు నగు సకలభూతములకుఁ బరమాత్మయందే యుత్పత్తిప్రళయములు చెప్పఁబడుటచే నీప్రాణపదమునకుఁ బరమాత్మయని యే యర్థము.

## 10 జ్యోతిశ్చరణాధికరణము (24-27)

అవ:- "అథ యదతఃపరో దివోజ్యోతిర్దీప్యతే విశ్వతఃపృష్ఠేషు సర్వతఃపృష్ఠే ష్వనుత్తమేషులోకే ష్విదంవావ తద్యదిద మస్మిన్నంతఃపురుషే జ్యోతిః" అని గాయత్రీబ్రహ్మోపాసనానన్తరమున ఛాందోగ్యములోఁ (3-1-3-7) చెప్పఁబడినది. విశ్వతఃపృష్ఠేషు = సమస్తప్రాణి వర్గముకంటె నుపరిభాగమున, సర్వతఃపృష్ఠేషు = భూరాదిసర్వలోకములకంటె నుపరిభాగమున, అనుత్తమేషూత్తమేషులోకేషు = సర్వోత్తమములగు (అన్నిటికంటెను పైనున్న) లోకములందు, యదతఃపరోదివఃజ్యోతిర్దీప్యతే = ద్యులోకమునకుఁబరముగా నేజ్యోతిస్సు వెలుఁగుచున్నదో, తద్యదిదమస్మిన్నంతఃపురుషే =పురుషుని లోపల వెలుఁగుజ్యోతిస్సును నదియే యనియర్థము. ఆదిత్యాదిజ్యోతిస్సు జాఠరజ్యోతిస్సునం దధ్యాసమునర్చి చెప్పఁబడెను.

ఇచ్చట జ్యోతిశ్శబ్దమునకు, మామూలు తేజస్సు అర్థమా! పరమాత్మయర్థమా! యనిసంశయము కలుగుచున్నది.

ద్యులోకముకంటెఁ బరముగాఁబ్రకాశించునది యని ద్యులోకము నవధిగాఁజెప్పుటచే మామూలుజ్యోతిస్సుఅనియే యర్థమగుచున్నది. పరమాత్మకవధిలేదు. "దీప్యతే=ప్రకాశించుచున్నది యనిచెప్పుటచే రూపాదులుకలదియని తెలియు

చున్నది. రూపాదులులేక ప్రకాశించుట యసంగతము. పర బ్రహ్మకు "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయమ్" అనుటచే రూపాదులులేవని తెలియుచున్నది. కనుక నిచ్చటజ్యోతిష్పదము తేజోమాత్రార్థకమేయని తెలియుచున్నది. అని పూర్వపక్షము కలుగ సమాధానముచెప్పబడుచున్నది.

జ్యోతిశ్చరణాభిధానాత్ 24

జ్యోతిః = పై వాక్యమునందలి జ్యోతిష్పదము, చరణాభిధానాత్ = పాదములనుజెప్పుటవలనఁ బరమాత్మబోధకము.

ఈమంత్రమునకుఁ బూర్వమంత్రములో "తావానస్య మహిమా అతో జ్యాయాగ్ంశ్చ పూరుషః పాదోస్యసర్వాభూతాని త్రిపాదస్యామృతందివి" అని చెప్పఁబడి యున్నది. బ్రహ్మకుసర్వభూతములు నొకపాదమనియు, మిగిలినమూఁడు పాదములు ద్యులోకమున నున్నవనియుఁ జెప్పి "అథ యదతఃపరో దివో జ్యోతిర్దీప్యతే" అని యీమంత్రమును జెప్పుటచే నచ్చటద్యులోకముతో సంబంధముకల పరమాత్మయే యిక్కడద్యులోకముతో సంబంధముకలవాఁడుగాఁ జెప్పఁబడుచున్నాఁడనుట సమంజసము. పూర్వమంత్రములో బ్రహ్మనాల్గుపాదములు గలవాఁడని నిర్దేశింపఁబడినది. ఆ నిర్ణయింపఁబడిన యాతఁడే యిక్కడ జ్యోతిశ్శబ్దముచే గ్రహింపఁబడఁదగును. పూర్వవాక్యమునుండి యీవాక్యములోనికే

గాక దీనిముందు వాక్యములోనికిఁ గూడ (శాండిల్యవిద్యలోనికి) బ్రహ్మపదము ననువర్తింపఁ జేయవలెను. కనుక నిచ్చట బ్రహ్మయను నర్థమునే చెప్పితీరవలెను.

"జ్యోతిర్దీప్యతే" యనుపదములవలనఁ దేజోమాత్రార్థకమేయని చెప్పుట సరియైనది కాదు. ప్రకరణమునుబట్టి బ్రహ్మయని యర్థము నిర్ణయమగుచుండఁ దావన్మాత్రము ప్రతిబంధకము కాదు. "యేనసూర్యస్తపతి తేజసేద్ధః" అని కార్యజ్యోతిరుపలక్షిత బ్రహ్మవిషయక ప్రయోగములును గలవు.

జ్యోతిశ్శబ్దమునకుఁ గేవలము చక్షుర్వృత్త్యనుగ్రాహకమగు తేజస్సు ఒక్కటే యర్థము కాదు. "వాచైవాయం జ్యోతిషాఽఽస్తే." "మనోజ్యోతిర్జుషతామ్" అని యొక్కొక్కదానిని ప్రకాశింపఁజేయునదెల్ల యర్థమనునట్లు ప్రయోగములున్నవి. కనుక సమస్తజగదవభాసకుఁడైన బ్రహ్మ, జ్యోతిష్పదమునకర్థమను టెంతయు నుపపన్నమైయున్నది.

బ్రహ్మ నిరవధికమైనను. ద్యులోకమవధియనుట (ద్యుమర్యాదాత్వకథనము) ఉపాసనార్థమై ప్రదేశవిశేషమును జెప్పుటకాన నదియును బ్రతిబంధకము కాదు.

ఛందోభిధానాన్నేతి చేన్న తథా, చేతోర్పణనిగదా త్తథాహి దర్శనమ్ 25

ఛందోభిదానాత్ = పూర్వమంత్రము గాయత్రీఛందస్సును జెప్పుటవలన, నేతిచేత్ = బ్రహ్మము జెప్పునది కాద

చున్నది. రూపాదులులేక ప్రకాశించుట యసంగతము. పర బ్రహ్మను "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయమ్" అనుటచే రూపాదులులేవని తెలియుచున్నది. కనుక నిచ్చటజ్యోతిష్పదము తేజోమాత్రార్థకమేయని తెలియుచున్నది. అని పూర్వపక్షము కలుగ సమాధానము చెప్పబడుచున్నది.

### జ్యోతిశ్చరణాభిధానాత్ 24

జ్యోతిః = పై వాక్యమునందలి జ్యోతిష్పదము, చర ణాభిధానాత్ = పాదములను జెప్పుటవలనఁ బరమాత్మబోధకము.

ఈమంత్రమునకుఁ బూర్వమంత్రములో "తావానస్య మహిమా అతో జ్యాయాగ్ంశ్చ పూరుషః పాదోఽస్య సర్వాభూతాని త్రిపాదస్యామృతం దివి" అని చెప్పఁబడి యున్నది. బ్రహ్మకుసర్వభూతములు నొకపాదమనియు, మిగిలినమూఁడు పాదములు ద్యులోకమున నున్నవనియుఁ జెప్పి "అథ యదతః పరో దివో జ్యోతిర్దీప్యతే" అని యీమంత్రమును జెప్పుటచే నచ్చటద్యులోకముతో సంబంధముకల పరమాత్మయే యిక్కడద్యులోకముతో సంబంధముకలవాఁడుగాఁ జెప్పఁబడుచున్నాఁడనుట సమంజసము. పూర్వమంత్రములో బ్రహ్మనాల్గుపాదములు గలవాఁడని నిర్దేశింపఁబడినది. ఆ నిర్ణయింపఁబడిన యాతఁడే యిక్కడ జ్యోతిశ్శబ్దముచే గ్రహింపఁబడఁదగును. పూర్వవాక్యమునుండి యీవాక్యములోనికే

గాక దీనిముందువాక్యములోనికిఁ గూడ (శాండిల్యవిద్యలోనికి) బ్రహ్మపదము ననువర్తింపఁ జేయవలెను. కనుక నిచ్చట బ్రహ్మయనియర్థమునే చెప్పితీరవలెను.

"జ్యోతిర్దీప్యతే" యనుపదములవలనఁ దేజోమాత్రార్థకమే యని చెప్పుట సరియైనది కాదు. ప్రకరణమునుబట్టి బ్రహ్మయని యర్థము నిర్ణయమగుచుండఁ దావన్మాత్రము ప్రతిబంధకము కాదు. "యేనసూర్యస్తపతి తేజసేద్ధః" అని కార్యజ్యోతిరుపలక్షిత బ్రహ్మవిషయక ప్రయోగములును గలవు.

జ్యోతిశ్శబ్దమునకుఁ గేవలము చక్షుర్వృత్త్యనుగ్రాహకమగు తేజస్సు ఒక్కటే యర్థము కాదు. "వాచైవాయం జ్యోతిషాఽఽస్తే." "మనోజ్యోతిర్జుషతామ్" అని యొక్కొక్కదానిని ప్రకాశింపఁజేయునదెల్ల యర్థమనునట్లు ప్రయోగము లున్నవి. కనుక సమస్తజగదవభాసకుఁడైన బ్రహ్మ, జ్యోతిష్పదమునకర్థమను చింతయు నుపపన్నమైయున్నది.

బ్రహ్మ నిరవధికమైనను. ద్యులోకమవధియనుట (ద్యుమర్యాదాత్వకథనము) ఉపాసనార్థమై ప్రదేశవిశేషమును జెప్పుటకావ నదియును ప్రతిబంధకము కాదు.

ఛందోభిధానాన్నేతిచేన్న తథా. చేతోర్పణనిగదాత్తథాహిదర్శనమ్ 25

ఛందోభిధానాత్ = పూర్వమంత్రము గాయత్రీఛందస్సును జెప్పుటవలన, నేతిచేత్ = బ్రహ్మమును జెప్పునదికాద

న్నచో, న = అట్లనరాదు. తథా = ఆవిధముగా, చేతోర్పణనిగదాత్ = మనస్సును నుంచవలెనని చెప్పుటవలన, తథాహిదర్శనమ్ = ఆవిధముగా నితరత్రకూడ కనిపించుచున్నది.

వెనుకటిమంత్రములో బ్రహ్మచతుష్పాదములు కలిగినట్లు నిర్దేశింపఁబడినదని పైసూత్రమునఁ జెప్పఁబడినది. దానిమీఁదఁ బూర్వపక్షి ప్రశ్నించుచున్నాఁడు. "గాయత్రీవా ఇదంసర్వమ్" అనియుపక్రమించి వెనుకటిమంత్రములో ననేకభేదములతో గాయత్రీఛందస్సును వ్యాఖ్యానముచేసి, గాయత్రినాల్గుపాదములుకలది, అరువిధములైనది యని చెప్పెనేకాని బ్రహ్మనుజెప్పియుండలేదు. దానినిబట్టి జ్యోతిశ్శబ్దమునకు బ్రహ్మార్థకత్వము కుదరదు.

సిద్ధాంతి సమాధానమిచ్చుచున్నాఁడు. గాయత్రీఛందోద్వారా తదనుగతమైన బ్రహ్మమందు మనసునిలిపి యదియే సర్వముఅని యుపాసనచేయ వలసినదన్నట్లు "గాయత్రీవా ఇదంసర్వమ్" అనుమంత్రము చెప్పుచున్నదికాని, యక్షరసన్నివేశరూపమగు గాయత్రీమాత్రము సర్వస్వరూపమని యర్థముకాదు. కాన నందుబ్రహ్మమునుగూర్చి చెప్పలేదని నుడువఁదగదు. "గాయత్రీవా ఇదంసర్వం" అనునప్పుడు సర్వపదమునకు "సర్వంఖల్విదంబ్రహ్మ" అన్నచోటవలెనే బ్రహ్మమనియర్థము. వికారద్వారా బ్రహ్మము నుపాసనచేయుట

ఇతరత్ర కనఁబడుచున్నది. కనుక పూర్వమంత్రమునందుఁ జతుష్పాద్బ్రహ్మము నిర్దిష్టమని యర్థము.

భూతాది పాదవ్యపదేశోపపత్తేశ్చైవమ్ 26

భూతాదిపాదవ్యపదేశోపపత్తేశ్చ = పృథివ్యాది భూతములను పాదములుగాఁ జెప్పుటయొక్క యుపపత్తివలనఁ గూడ, ఏవమ్ = ఈమాదిరిగాఁ బూర్వమంత్రమున బ్రహ్మ నిర్దిష్టమనియే చెప్పవలెను.

"సైషా చతుష్పదా షడ్విధా గాయత్రీ" యని "పాదోస్య సర్వాభూతాని, త్రిపాదస్యామృతందివి" యనియుఁ జెప్పఁబడిన వెనుకటిమంత్రములో బ్రహ్మమని యర్థము చెప్పకపోయినచో పృథివ్యాదిసర్వభూతములు గాయత్రికిఁ (అక్షరసన్నివేశమునకు) పాదమనుట యుపపన్నము కాదు. పాదవ్యపదేశముచేతనుగూడ బ్రహ్మనిర్దిష్టమనుటయే యుపపన్నము. ఈమంత్రము పురుషసూక్తములోఁ గూడ బ్రహ్మపరముగాఁ జెప్పఁబడినది.

"విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్" అని భగవద్గీతలోఁ గూడ, నొకయంశముచేత నీప్రపంచము నంతను వ్యాపించియుంటినని చెప్పియున్నారు.

ఉపదేశభేదాన్నేతి చేన్నోభయస్మిన్నప్యవిరోధాత్. 27

ఉపదేశభేదాత్ = వెనుకటిమంత్రములో "త్రిపాదస్యామృతందివి" యని సప్తమ్యంతముగాను, ఈమంత్రములో

"అథయదతఃపరోదివః" అని పంచమ్యంతముగాను, నుపదే
శము భేదముగానుండుటవలన, నేతిచేత్ = అచ్చటిబ్రహ్మ
ముచ్చటఁబరామర్శింపఁ బడుచున్నాఁడని చెప్పుట తగదని
నచో, న = అట్లనరాదు, ఉభయస్మిన్నపి = రెండువిధము
లగు నుపదేశమునందును, అవిరోధాత్ = విరోధములేక
పోవుటవలన.

లోకములో వృక్షాగ్రమునందున్న డేగనుజూచి వృక్షా
గ్రమందు శ్యేనమున్నదని, వృక్షాగ్రముకంటెఁ బరముగా శ్యేన
మున్నదనియు రెండువిధముల వ్యవహరించుట గనిపించు
చున్నదిగనుక, దివి, దివః అని యుపదేశభేదమువలన నచ్చటఁ
జెప్పినబ్రహ్మ మిచ్చటఁగాదనరాదు. ఇంతకును సారాంశము
"అథయదతఃపరోదివోజ్యోతిర్దీప్యతే" యనుమంత్రములోని
జ్యోతిశ్శబ్దమునకుఁ బరబ్రహ్మయనియే యర్థము చెప్పవలె
ననుట.

### 11 ప్రతర్దనాధికరణము (28-31)

అవః- కౌషీతకిబ్రాహ్మణములో నింద్రప్రతర్దనాఖ్యా
యిక యొకటికలదు. అందు "దివోదాసునికుమారుఁడగు
ప్రతర్దనుఁడు తనపౌరుషముచేతను యుద్ధములం దింద్రునకు
సహాయముచేయుటచేతను నింద్రునకుఁ బ్రేమపాత్రుఁడయ్యెను.
ఒకప్పుడతఁ డింద్రలోకమునకేగ నీకేమివరము కావలయునో
కోరుకొనుమని యింద్రుఁడుపలికెను. ప్రతర్దనుఁడు పరమపురు
షార్థమును దెలుపుమని కోరుచు మనుజున కేది హితతమమో

దానినుపదేశింపుమనియడిగెను. అపుడింద్రుఁడిట్లుపదేశించెను. "సహోవాచ ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా తంమామాయు రమృత మిత్యుపాస్స్వ'' "అథఖలు ప్రాణఏవప్రజ్ఞాత్మా ఇదంశరీరం పరి గృహ్యోత్థాపయతి'' కౌ.3.1 23. "నవాచంవిజిజ్ఞాసీత వక్తారం విద్యాత్'' "సఏషప్రాణఏవ ప్రజ్ఞాత్మాఽఽనందోఽజరోఽ మృతః'' కౌ 3.8 నేనుబ్రహ్మస్వరూపమగు ప్రాణమను. అట్టి నన్ను, ఆయువని, యమృతమని,యుపాసనచేయుము. ప్రాణమే యీశరీరమును గ్రహించి లేపఁదీయుచున్నది. వాక్కును దెలిసికొనరాదు. వక్తను దెలిసికొనవలెను. ఆప్రాణమే ప్రజ్ఞ స్వరూపము. ఆనందస్వరూపము. అజరస్వరూపము, అమృత స్వరూపము అని చెప్పఁబడియున్నది.

ఇచ్చటఁ బ్రాణశబ్దమునకు వాయువనియర్థమా! దేవతాత్మయనియర్థమా! జీవుఁడనియర్థమా! పరబ్రహ్మయని యర్థమా! అనిసంశయము గలుగ వారింప నీయధికరణ మారంభింపఁబడినది.

"అతఏవప్రాణః" అనుసూత్రములోఁ బ్రాణశబ్దార్థ మును విచారించినను నిచ్చటఁగూడ సంశయమునకు నావకా శము బ్రహ్మలింగము నుండుటచే విచారించుచున్నారు.

ఇచ్చట "శరీరంపరిగృహ్యోత్థాపయతి" అనుటచే శరీర ధారకమగు ప్రాణవాయువని యర్థమగుచున్నది. "మాము పాస్స్వ" అనుటచేత, నింద్రుఁడు చెప్పుటచేతను దేవతాత్మ

యనియర్థమగుచున్నది. "వక్తారంవిద్యాత్" అనుటచే జీవుఁడనియు, "ఆనందో౽జరో౽మృతః" అనుటచే పరబ్రహ్మమనియు నర్థమగుచున్నది కనుక సంశయము కలుగుచున్నది.

ప్రాణ స్తథానుగమాత్ 28

ప్రాణః = ఇంద్రప్రతర్దనాఖ్యాయికలోని ప్రాణశబ్దము తథా = ఆవిధముగా బ్రహ్మపరముగా, అనుగమాత్ = పౌర్వాపర్యములను విచారించినసమన్వయము చేయుటవలనఁ బరబ్రహ్మార్థకము.

హితతమము నుపదేశింపు మని ప్రతర్దనుఁడడుగ నింద్రుఁడు ప్రాణము నుపదేశించెను. పరబ్రహ్మకన్న హితతమమగునుపదేశ్యము మఱొకటిలేదు. కనుక ప్రాణపదమునకుఁ బరబ్రహ్మయనియేయర్థము. ప్రజ్ఞాత్మా, ఆనందః, అజరః, అమృతః, అనుధర్మములు పరబ్రహ్మయను నర్థముచెప్పిననే సరిపడునుగాని వాయుమాత్రమర్థము చెప్పిన నుపపన్నములు గావు.

న వక్తురాత్మోపదేశాదితిచే దధ్యాత్మసంబంధభూమా హ్యస్మిన్ 29

వక్తుః = చెప్పునటువంటి యింద్రునియొక్క, ఆత్మోపదేశాత్ = ఆత్మోపదేశమువలన (తననుగుఱించి చెప్పుటవలన) న = ఇచ్చటఁ బ్రాణశబ్దము బ్రహ్మపరముకాదు. ఇంద్రుఁడు దేవజాతివాఁడుకనుక దేవతాత్మపరము ఇతిచేత్ =

అన్నచో, అస్మిన్ = ఈయధ్యాయమునందు, అధ్యాత్మ సంబంధభూమా = ప్రత్యగాత్మసంబంధముయొక్క బాహుళ్యము (విశేషముగా ప్రత్యగాత్మనుద్దేశించి చెప్పుట) కలదు.

ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా, మాముపాస్వ, అని యింద్రుఁ డుపదేశించుటచేతను, త్వాష్ట్రవధ, త్రిశీర్షవధ మున్నగు తనపరాక్రమ కృత్యముల నుగ్గడించుటచేతను, నిచ్చటఁ బ్రాణశబ్ద మింద్ర దేవతాపరమే కాని పరబ్రహ్మపరము కాదని ప్రశ్న యభిప్రాయము.

"యావదస్మిన్ శరీరే ప్రాణో వసతి తావదాయుః" ఈశరీరమునఁ బ్రాణ మెంతవఱకు నుండునో యంతవఱకు నాయువుండును. అని యాయువునైనఁ బ్రాణమునకు స్వాతంత్ర్యమును దెల్పుచున్నాఁడు "ప్రాణఏవ ప్రజ్ఞాత్మా" అని ప్రాణమునే ప్రజ్ఞస్వరూపునిగాను, ఆనందాజరామృతస్వరూపునిగాను, జెప్పి "సమఆత్మా" (అదే) ఆప్రాణమే నాయొక్క ఆత్మ "అని యుపసంహరించెను. అందువలన నీసందర్భము నందంతటను బరమాత్మసంబంధమునే చెప్పియుండుటచే నిచ్చటి ప్రాణశబ్దమునకుఁ బరబ్రహ్మయని యేయర్థము అని సమాధానాభిప్రాయము.

శాస్త్రదృష్ట్యా తూపదేశో వామదేవవత్. 30

ఉపదేశస్తు = ఆత్మోపదేశమైతే, వామదేవవత్ = వామదేవ వచనమువలె, శాస్త్రదృష్ట్యా = శాస్త్రదృష్టిచే నుపపన్నమగును.

"తద్ధైతత్పశ్యన్ ఋషిర్వామదేవః ప్రతిపేదే, అహం మనురభవం సూర్యశ్చ, తద్యోయో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్" అని బృహదారణ్యకము లోనున్నది. వామదేవుడను ఋషి యీ పరబ్రహ్మ దర్శనము చేయుచు, "నేను మనువునైతిని, సూర్యుఁడనైతిని" అని తెలిసికొనెను. దేవతలలో నెవని క[illegible] నా[illegible]నకొనెనో వానివాని స్వరూప మయ్యెను అనియర్థము.

పరబ్రహ్మజ్ఞానము కలవాఁడు పరిపూర్ణస్వరూపుఁడు కనుక, సర్వము తానేయగును. కనుకనే వామదేవుఁడు "తాను సర్వస్వరూపుఁడనైతినని తెలిసికొనె"నని శ్రుతి తెలుపుచున్నది. అట్లే యింద్రుఁడును "నేనే పరమాత్మస్వరూపుఁడను" అను శాస్త్రదృష్టిచే నన్ను సేవింపుమని తెలిపెనుగాని, యింద్రుఁడ నగునన్ను సేవింపుమని వ్యక్తిగతముగఁ జెప్పియుండలేదు. త్వాష్ట్రవధమున్నగునవి యేల చెప్పెననఁగా, "తస్య మే తత్ర లోమచన మీయతే" అని ముందుఁ జెప్పబడియుండుటచే (అట్టి వధలుచేసిన నాయొక్క రోమము కూడనూడలేదు.) అహం బ్రహ్మాస్మి యనుజ్ఞానముకలవాఁడనగుటచేతనే నట్టిదారుణ కృత్యములయొక్క ఫలముకూడ నాకుఁ జెందలేదు. అనిచెప్పుటకై చెప్పెను. కనుక నిటఁ బ్రాణశబ్దమునకుఁ బరబ్రహ్మ యర్థము.

జీవ, ముఖ్యప్రాణ, లింగాన్నేతిచే న్నోపాసాత్రైవిధ్యా
దాశ్రితత్వా దిహతద్యోగాత్ 31

జీవ = జీవునియొక్క, ముఖ్యప్రాణ, = ముఖ్యప్రాణముయొక్క, లింగాత్ = లింగమువలన, పరబ్రహ్మయని యర్థముకాదు. ఇతిచేత్ = అన్నచో, న = కాదు. ఉపాసాత్రైవిధ్యాత్ మూడువిధములగు నుపాసన సంభవించుట వల్లను, ఆశ్రితత్వాత్ = ప్రాణపదమునకు బరబ్రహ్మయను నర్థము లోగడ "అతఏవప్రాణః" అనుచోటనాశ్రయించి యుండుట వలనను, ఇహ=ఈసందర్భములో తద్యోగాత్ = పరబ్రహ్మ యనుటకు లింగముండుటవలనను, బరబ్రహ్మయనియే యర్థము.

"నవాచం విజిజ్ఞాసీత, వక్తారంవిద్యాత్" అని జీవ లింగము కనిపించుటచే జీవుడనికాని, అథఖలు ప్రాణఏవ ప్రజ్ఞాత్మా ఇదంశరీరం పరిగృహ్యోత్థాపయతి" అని వాయు రూపమగు ముఖ్యప్రాణలింగము కనిపించుటచే ముఖ్యప్రాణ మనికానియర్థము చెప్పవలెను. జీవుడు చేతనుడు కనుక ప్రజ్ఞాత్మత్వము విరుద్ధముకాదు. ప్రజ్ఞాసాధనము ప్రాణాంత రమునాశ్రయించుటచే ముఖ్యప్రాణపక్షమునను ప్రజ్ఞాత్మత్వము విరుద్ధముకాదు. అనిప్రశ్నింప, నొకవాక్యములో మూడు విధములగు నుపాసన చెప్పుట తగదు. (జీవోపాసన, ముఖ్య ప్రాణోపాసన, బ్రహ్మోపాసన అని మూడువిధముల ఉపాసన)

"ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా తం మామాయురమృతమిత్యు పాస్స్వ" అను నుపక్రమవాక్యమువల్లను. "సఏష ప్రాణఏవ

ప్రజ్ఞాత్మా నందో ఽజరో ఽమృతః" అనునుపసంహార వాక్యము వలనను, పరబ్రహ్మ యను నర్థమునే యిటఁ జెప్పవలెను. "నప్రాణేన నాపానేన, మర్త్యోజీవతికశ్చన ఇతరేణతు జీవంతి యస్మిన్నేతావుపాశ్రితౌ" "మర్త్యుఁడు, ప్రాణముచేతఁగాని, యపానముచేతఁగాని జీవించుట లేదు. ప్రాణాపానములు రెండును నెవ్వనినాశ్రయించియున్నవో వానివలన జీవించుచున్నాఁడు. అని కాఠకవచనమువలన, ముఖ్యప్రాణవ్యాపారముకూడ పరమాత్మాధీనముకనుక ప్రాణలింగమును బరమాత్మయం దుపచరింపఁ జేయవచ్చును.

ఉపాధికృతము భేదమే కాని, జీవబ్రహ్మలకుఁ బరస్పరభేదములేదని "తత్త్వమసి" "అహంబ్రహ్మాస్మి" యను శ్రుతులవలనఁ దెలియుచున్నది కాన జీవలింగమును బరమాత్మయందు సమన్వయముచేయవచ్చును.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి విరచితమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను బ్రహ్మసూత్ర
వృత్తి యందుఁ బ్రథమాధ్యాయ
ప్రథమపాదము
అధి 11 సూ 31

---

శ్రీ రస్తు

# బ్రహ్మసూత్రార్థదీపిక

## ప్రథమాధ్యాయమున ద్వితీయపాదము

ఉపాస్యబ్రహ్మకుఁ జెందినవి. బ్రహ్మలింగము స్పష్టముగ లేనివియు నగు వాక్యములిందు విమర్శింపఁబడును.

## సర్వత్ర ప్రసిద్ధ్యధికరణము (1-8)

అవ:- ప్రథమపాదమున, బ్రహ్మ, జగత్తునకంతకుఁ గారణమనియు నతఁడు, సర్వజ్ఞుఁడు, సర్వవ్యాపి, నిత్యుఁడు, సర్వశక్తులుకలవాఁడు, ననియును దెలుపఁబడినది.

అర్థాంతరమందుఁ ప్రసిద్ధముగ వాడఁబడుచున్న, ఆకాశ, ప్రాణ, జ్యోతి, శబ్దములకు, ఆయాస్థలములందుఁ బర బ్రహ్మయే యర్థమని స్పష్టములగు బ్రహ్మలింగములను జూపుచు సహేతుకముగ నిరూపింపఁబడెను. స్పష్టముగా బ్రహ్మలింగములులేని మఱికొన్ని యుపనిషద్వాక్యములలోని పదములకు సందేహనివారకమగు విమర్శ యిందుఁ జేయఁబడుచున్నది.

ఛాందోగ్యములో (3-14-1-2) "సర్వంఖల్విదం బ్రహ్మ, తజ్జలానితి శాన్త ఉపాసీత, అథఖలు క్రతుమయః పురుషః, యథాక్రతురస్మిన్‌లోకే పురుషోభవతి తథేతః ప్రేత్య భవతి, సక్రతుంకుర్వీత" "మనోమయః ప్రాణశరీరో భారూ

వః" సర్వంఖల్విదం = ఈ, కనబడు ప్రపంచమంతయు, బ్రహ్మ=బ్రహ్మస్వరూపము. ఎందుచేతననగా, తజ్జలానితి,= తత్ =ఆబ్రహ్మమునుండి, జ = పుట్టినది, ల = ఆబ్రహ్మయందు లయమునొందునది, అన్ ఇతి = ఆబ్రహ్మయందుజీవించునది (అన ప్రాణనే) కనుక. బ్రహ్మమునుండిపుట్టుచు, బ్రహ్మయందులయమునొందుచు, బ్రహ్మయందుజీవించుచుండుటవలనే ప్రపంచము బ్రహ్మకంటె వ్యతిరిక్తము కాదు కనుక నీప్రపంచమంతయు బ్రహ్మస్వరూపమని యభిప్రాయము. (తజ్జం + తల్లం + తదనం=తజ్జలాన్) అని యగును. శాన్తః = రాగద్వేషములు లేక శాన్తుండై, ఉపాసీత = ఉపాసన చేయవలెను. అథఖలు క్రతుమయఃపురుషః = పురుషుండు క్రతుమయుండుకనుక, నిశ్చయస్వరూపుండుకనుక, (క్రతువనగా ఇదియిలాగుననే, అనెడు నిశ్చయజ్ఞానము) అస్మిన్ లోకే = ఈలోకమందు పురుషః = పురుషుండు యథాక్రతుః = ఏవిధమగు నిశ్చయము కలవాండు, భవతి = అగుచున్నాండో, ఇతః = ఈలోకమునుండి, ప్రేత్య = చనిపోయి, తథాభవతి = అలాగుననే యగుచున్నాడు. అనంగా తన నిశ్చయమున కనురూపమగు ఫలము పొందువాండగుచున్నాండు. కనుక, సక్రతుంకుర్వీత = ఆపురుషుండు నిశ్చయమును జేసికొనవలెను "యం, యంవాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం, తంతమేవైతి కౌంతేయ" (భగ 8-6) ఏయేభావమును స్మరించుచు నవసానసమయమున శరీరమును విడుచునో, ఆయాభావమున కనురూపమగు

ఫలమునే పొందునని భగవద్గీతలోఁ జెప్పినట్లు పురుషుఁడు స్వనిశ్చయాను రూపమగు ఫలమునుబొందునని శాస్త్రము వలనఁ దెలియుచున్నది కనుక తప్పక యతఁడు నిశ్చయమును జేసికొనవలెనని యభిప్రాయము. ఎటువంటినిశ్చయమును జేసికొనవలెననఁగా, "మనోమయః, ప్రాణశరీరో, భారూపః = మనస్స్వరూపుఁడు, ప్రాణమే (ప్రజ్ఞయే) శరీరముగాఁగల వాఁడు, చైతన్యస్వరూపుఁడునగు ఆత్మ హృదయములోనున్నాఁడు. అతఁడే బ్రహ్మ. నే నతనిని బొందుదును. అని నిశ్చయమును జేసికొనవలెను. అనియున్నది. ఈవిషయము శాండిల్యుఁడు తెలిసికొని యుపాసనచేయుటచే దీనిని శాండిల్య విద్యయందురు. ఇట్టినిశ్చయమును జేసికొనవలెను. అనఁగా నీవిధముగా నుపాసనచేయవలెనని యర్థము.

ఇందుపాస్యుఁడని చెప్పిన, మనోమయత్వాది ధర్మములు గల ఆత్మ, జీవాత్మయా? పరమాత్మయా? అని సందేహము.

పరమాత్మ "అప్రాణో హ్యమనా శ్శుభ్రః" ప్రాణము లేనివాఁడు, మనస్సులేనివాఁడు శుద్ధస్వరూపుఁడునని చెప్పఁబడుటచే నిచ్చట, మనోమయుఁడు, ప్రాణశరీరుఁడు అని చెప్పబడినయతఁడు జీవాత్మయని యర్థమగుచున్నది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనియుపక్రమించుటచేఁ బరమాత్మయని యర్థమగుచున్నది. కాన సందేహముకలుగ వారించుటకీ యధికరణ మారంభింపఁబడినది.

## సర్వత్రప్రసిద్ధోపదేశాత్. 1

సర్వత్ర = వేదాన్త వాక్యములన్నిటి యందును, ప్రసిద్ధ = "జగత్కారణము బ్రహ్మ" అని ప్రసిద్ధముగానున్న బ్రహ్మము, ఉపదేశాత్ - "సర్వంఖల్విదం బ్రహ్మ" అని యిచ్చట నుపదేశించుటవలన నిచ్చటి యాత్మ పరమాత్మ యనియే యర్థము. సర్వం ఖల్విదం బ్రహ్మయని ప్రారంభములోఁ జెప్పిన పరమాత్మ ఉపాసనార్థమై మనోమయత్వాదిధర్మములు కల వాఁడుగా నుపదేశింపఁబడుచున్నాఁడనుట యుక్తము.

## వివక్షిత గుణోపపత్తేశ్చ 2

వివక్షిత = ఉపాసనావస్థయందు గ్రహింపఁదగినవిగాఁ జెప్పఁబడిన, గుణ - సత్యకామత్వ, సత్యసంకల్పత్వ, ఆకాశాత్మత్వాది గుణములయొక్క, ఉపపత్తేః = ఉపపత్తివలనను ఇచ్చటియాత్మ, పరమాత్మయనియే యర్థము.

"మనోమయః ప్రాణశరీరో భారూపః" అని మొదలిడి "సత్యకామ స్సత్యసంకల్పః ఆకాశాత్మా" అని మఱికొన్ని గుణములను జెప్పిన, ఆగుణములన్నియుఁ బరమాత్మయందే యుపపన్నము లగును. సృష్టి, స్థితి, సంహారములయందు, అప్రతిహతమైన శక్తికలవాఁడుకనుక, సతనియొక్క కామము (కోరిక) సత్యమనియు, సంకల్పము సత్యమైనదనియుఁ జెప్ప వచ్చును. అట్లే, ఆకాశమువలె సర్వవ్యాపకమైన యాత్మకల వాఁడనియుఁ జెప్పినగుణములు సర్వవ్యాపకుఁడగు పరమాత్మ

యం దుపపన్నములగును. పరమాత్మ సర్వవ్యాపకుఁడగుటవలన, మనోమయత్వాదిధర్మములుగూడ నతనియం దుపపన్నములగును. భగవద్గీతలోఁగూడ "సర్వతః పాణిపాదం, సర్వతోఽక్షిశిరోముఖం" అనిసర్వప్రదేశములందుఁ బాణిపాదాద్యవయవములు కలిగినట్లుగాఁ బరమాత్మ చెప్పఁబడెను. ప్రాణములేనివాఁడు, మనస్సులేనివాఁడునని వెనుకఁజెప్పిన "అప్రాణోహ్యమనాశ్శుభ్రః" అనువాక్యము కేవలశుద్ధబ్రహ్మవిషయము. ఇదిసగుణబ్రహ్మవిషయము కనుక దోషముకాదు.

అనుపపత్తేస్తు న శారీరః 3

అనుపపత్తేః = ఈగుణము లుపపన్నములు కాకపోవుటవలన, శారీరః = జీవుఁడు (శరీరమందుండువాఁడు) న= కాఁడు, తు = నిశ్చయము. సత్యకామత్వ, ఆకాశాత్మత్వాది ధర్మములు పరబ్రహ్మయం దుపపన్నములగునుగాని, జీవునియం దుపపన్నములుకావు. కనుక మనోమయత్వాదిగుణవిశిష్టుఁడుగఁ జెప్పఁబడినయీయాత్మ పరమాత్మయని యర్థము. ఈశ్వరుఁడుకూడ శరీరమందున్నను "ఆకాశవత్సర్వగతశ్చనిత్యః" ఆకాశమువలె సర్వత్రనుండువాఁడును నిత్యుఁడును నని చెప్పుటచే శరీరమందుమాత్రమే యుండఁడు. జీవుఁడు భోగాధిష్ఠానమగు శరీరమునకంటె మఱొకచోట నుండఁడు. కనుక శారీరపదమునను శరీరమందుమాత్రమే యుండుజీవుఁడని యర్థము.

## కర్మకర్తృవ్యపదేశాచ్చ. 4

కర్మ = కర్మయొక్క, కర్తృ - కర్తయొక్క, వ్యపదేశాచ్చ - చెప్పుటవలనఁగూడ, మనోమయత్వాదిగుణ విశిష్టుఁడు శారీరుఁడుకాఁడు.

ఈశ్రుతిలో "మనోమయః ప్రాణశరీరో భారూపః" అని "సత్యకామః సత్యసంకల్పః" అనియుఁజెప్పి, "ఏత మితః ప్రేత్యాభిసంభవితాస్మి" ఈగుణములుకల పరమాత్మను, ఈలోకమునుండిపోయి (చనిపోయి) పొందుదును. అని చెప్పఁబడియున్నది. ఈయుపాసనలో మనోమయత్వాదిగుణములు కలవాఁడు ప్రాప్యుఁడగుకర్మగను, ఉపాసకుఁడగు జీవుఁడు, ప్రాపించు (పొందెడు) కర్తగను నిర్దేశింపఁబడియున్నది. కాన మనోమయత్వాది గుణములుకలవాఁడు పరమాత్మయే కాని శారీరుఁడుకాఁడు.

## శబ్దవిశేషాత్. 5

శబ్దవిశేషాత్ - శబ్దభేదమువలన, మనోమయత్వాదిగుణ విశిష్టుఁడు శారీరుఁడుకాఁడు.

ఈశాండిల్య విద్యతో సమానార్థకమగు శతపథ బ్రాహ్మణములో (10-6-3-2) "యథా వ్రీహిర్వా యవోవా శ్యామాకోవా శ్యామాకతండులోవా ఏవ మయ మంతరాత్మన్ పురుషో హిరణ్మయః" ధాన్యపుగింజ

కాని, చూవ గింజకాని, చామగింజకాని, చామబియ్యపుగింజకాని, దేవతాదులకు లోపలనుండునో, అట్టియాహిరణ్మయుఁడగుపురుషుఁడు (పరమాత్మ) కూడ, అంతరాత్మయందుండెను. అని చెప్పఁబడెను. అంతరాత్మయందనఁగా ఆత్మయొక్క లోపలిభాగముననియర్థము. ఆధారమును దెలుపునీపదము సప్తమ్యంతముగను, ఆధేయుఁడగు హిరణ్మయపురుషుని ప్రథమాంతముగను జెప్పుటచే నాత్మకంటె, హిరణ్మయపురుషుఁడు వేరని శబ్దవిశేషమువలనఁ దెలియుచున్నది. ఆత్మయనఁగా జీవుఁడనియు, హిరణ్మయపురుషుఁడనఁగా మనోమయత్వాది గుణవిశిష్టుఁడని చెప్పిన పరమాత్మయనియు నర్థము.

## స్మృతేశ్చ 6

స్మృతివలనఁగూడ శారీరుని (జీవుని) కంటెఁబరమాత్మ వేరని తెలియుచున్నది. భగవద్గీత (18-61) "ఈశ్వరస్సర్వభూతానాంహృద్దేశేఽర్జున! తిష్ఠతి" ఓయర్జునా! జీవరాసులన్నిటియొక్కహృదయప్రదేశమునం దీశ్వరుఁడున్నాఁడు, అని చెప్పఁబడియున్నది.

"అనుపపత్తేస్తు న శారీరః" అను సూత్రము మొదలుకొని యింతవఱకు శారీర పరమాత్మలకు భేదమును జెప్పుచు నిరువురు వేఱని చెప్పఁబడినది. శ్రుతి "నాన్యోఽతోఽస్తి ద్రష్టా, నాన్యోఽతోఽస్తి శ్రోతా" బృహ (3.1.23) అని యీపరమాత్మకంటె మఱియొక ద్రష్టకాని, మఱియొక శ్రోతకాని లేఁ

దని చెప్పుచున్నది. భగవద్గీతలోఁ గూడ "క్షేత్రజ్ఞంచాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత" సర్వక్షేత్రములందు (సర్వశరీరములందు) క్షేత్రజ్ఞుని నన్నుగా నెఱుంగుము" అని చెప్పుటచేఁ జీవకంటె నన్యుఁడు లేఁడని యర్థమగుచున్నది. కనుక శ్రుతిస్మృతులతో నీసూత్రములకు విరోధము వచ్చుచున్నది, అని ప్రశ్నింతురేని వినుఁడు.

ఆకాశము, అపరిచ్ఛిన్నమైనను ఘటాకాశము, మఠాకాశము, అని, ఉపాధులనుబట్టి పరిచ్ఛిన్నముగా వ్యవహరింపఁ బడినట్లు పరమాత్మ యపరిచ్ఛిన్నుఁడైనను, దేహేంద్రియ మనోబుద్ధులనెడి యుపాధుల సంబంధము వలనఁ బరిచ్ఛిన్నుఁడై శారీరుఁడని (జీవుఁడని) చెప్పఁబడు చున్నాఁడు. ఔపాధిక భేదము ననుసరించియే కర్మకర్తృత్వాదిభేదవ్యవహారము కలుగుచున్నది. "తత్త్వమసి" అని యాత్మైకత్వోపదేశము గ్రహింపఁబడ నంతవఱకే యీభేదవ్యవహారము కాని గ్రహింపఁబడిన తరువాత భేదవ్యవహారములేదు. బంధమోక్షవ్యవహారమును లేదు. అని సమాధానము. "నాన్యోఽతోఽస్తి ద్రష్టా" అనునది విద్యాదశలోఁ జెప్పినది. ఈభేదవ్యవహార మవిద్యాదశలోఁ జెప్పినది కనుక విరోధములేదని సమాధానము.

అర్భకౌకస్త్వాత్తద్వ్యపదేశాచ్చ, నేతిచేన్న నిచాయ్యత్వా
దేవం వ్యోమవచ్చ 7

అర్భకౌకస్త్వాత్ = అర్భక + ఓకస్త్వాత్ ; అర్భక = చిన్నదైన, ఓకస్త్వాత్ = స్థానము కలవాఁ డగుటవలన, తద్వ్యపదే

శాచ్చ=(తత్ - వ్యపదేశాత్ + చ) తత్ = దానిని అనఁగా చిన్నవాఁడు అనుటను (సూక్ష్మమగు రూపము కలవాఁడని టన్న) వ్యపదేశాచ్చ = చెప్పుట వల్లను, నేతిచేత్ = (న - ఇతి చేత్) మనోమయత్వాదిగుణవిశిష్టుఁడుగఁ జెప్పఁబడిన యీ యాత్మ పరమాత్మ కాఁడు అనినచో, న = కాదు. నిచాయ్యత్వాత్ = వెదకఁదగినవాఁడు (చూడఁదగినవా. ఇ) అగుటవలన, వ్యోమవచ్చ = ఆకాశమునకువలె. ఏవం = ఈమాదిరిగాఁ జెప్పుట.

"మనోమయః ప్రాణశరీరో భారూపః" అని మొదలిడి గుణములను జెప్పి, "ఏష మే ఆత్మా అంతర్హృదయే" ఈగుణములుకల యీయాత్మ నాహృదయములోపల నున్నాఁడనియు "అణీయాన్ వ్రీహేర్వా యవాద్వా" వడ్లగింజ కంటెను, యవగింజ (వడ్లబియ్యపుగింజ) కంటెను సూక్ష్మమైన వాఁడు అనియుఁ జెప్పఁబడియున్నది.

హృదయమనెడి చిన్న స్థానములో నుండుట, వడ్లగింజ కంటెసూక్ష్మముగ నుండుటయు, సర్వగతుఁడు, సర్వవ్యాపకుఁడు, నగు పరమాత్మకుఁ గుదరదు. కనుక నిచ్చటి యాత్మ ఆరాగ్రమాత్రుఁడగు జీవాత్మయే కాని పరమాత్మ కాఁడు. అందు కేనియట్లనరాదు.

గ్రహించుట కనువగుబుద్ధి, విజ్ఞానము హృదయమున నుండుటచే భగవంతుని దెలిసికొనుటకు హృదయము స్థానమని చెప్పినేకాని, యంతటి చిన్న ప్రదేశముననే యున్నాఁడని

చెప్పఁటయర్థముకాదు. సర్వగతుఁడైనను భగవంతుఁడు సాల గ్రామమున నుపాసనచేయఁబడి ప్రసన్నుఁడైనట్లు హృదయ పుండరీకమున నుపాసనచేయఁబడి తెలియనగును.

ఆకాశ మంతట నిండియుండి కడుపెద్దదయినను సూచ్యాకాశము (సూదిబెజ్జము) కడుసూక్ష్మమైనదని వ్యవహరించినట్లు, ఔపాధికమగు సూక్ష్మవ్యవహారము దోషముకాదు. ఉపాసనార్థమై యట్లు హృదయాయతనత్వము, సూక్ష్మత్వము చెప్పఁబడినది.

అవ:- పరమాత్మ హృదయ దేశమున నున్నాఁడనినచో నొక్కొక్క శరీరమున నొక్కొక్క హృదయముండును గాన నీహృదయము లన్నిటితోను నతనికి సంబంధముండుటచేతను చిద్రూపుఁడగుటచేతను, వానియందలి గుణదోషము లతని కేల చెందవు? అని ప్రశ్నించి నిరాకరించుచున్నారు.

సంభోగప్రాప్తిరితి చేన్న వైశేష్యాత్. 8

సంభోగప్రాప్తిరితిచేత్=పరమాత్మకు, సుఖదుఃఖముల భోగముప్రాప్తించుచున్నదనినచో, న=లేదు, వైశేష్యాత్=విశేషముండుటవలన.

"నాన్యోఽతోఽస్తి" మొదలగు శ్రుతులవలనఁ బరమేశ్వరుఁడొక్కఁడే కాని మరొకఁడెవ్వఁడునులేఁడని తెలియుచున్నది. అతఁడు సర్వగతుఁడైనను, సర్వప్రాణులయొక్క హృద

యసంబంధమువలన నితనికి భోగానుభవము కలుగుచున్నదని పూర్వపక్షము.

జీవుఁడు వేఱు, పరమాత్మ వేఱు. జీవుఁడు, కర్త, భోక్త సుఖదుఃఖాదిధర్మములు కలవాఁడు. పరమాత్మ; ఈగుణములు లేనివాఁడు పరమాత్మకన్న వేఱేమియులేదని శ్రుతులుబోధించుట, జీవాత్మపరమాత్మల నైక్యమునుబోధించు సమ్యగ్జ్ఞానములోనిమాట. ఆసమ్యగ్జ్ఞానములో, నైక్యమును బోధించుచు జీవునకుఁ గర్తృత్వభోక్తృత్వాదులు లేవనియే శాస్త్రము చెప్పుచున్నది. అప్పుడు జీవునకే లేనిభోగానుభవము పరమేశ్వరున కెట్లువచ్చును? జీవేశ్వరుల నైక్యము గ్రహింపనిపరిస్థితిలో, జీవుఁడు భోగము ననుభవించుచున్నాఁడనుట మిథ్యాజ్ఞానము. మిథ్యాజ్ఞాన నిమిత్తమగు జీవుని భోగానుభవమువలనఁ బరమాత్మకు భోగానుభవ మెట్లువచ్చును? అజ్ఞానులగు బాలురు, ఆకాశము నల్లగా (మలినముగా) నున్నదనిన దానికి మాలిన్యమంటునా? అంటదు. అట్లే మిథ్యాజ్ఞాన దశలో, ఆత్మైకత్వము పట్టుబడనిపరిస్థితిలో జీవుని భోగానుభవము పరమార్థస్వరూపుఁడగు పరమేశ్వరునికి రాదు. భోగ మనుభవించుచున్నాఁడనుట మిథ్యాజ్ఞానము. పరమేశ్వరుఁడొక్కఁడే కాని యన్యములేదనుట సమ్యగ్జ్ఞానము. కనుక నిట్టివిశేషమువలనఁ బైపూర్వపక్షమునరికాదు. అని సిద్ధాంతము.

## 2 అత్త్రధికరణము 9-10

అవః- కఠవల్లిలో యముడు నచికేతునకు ఆత్మోపదేశము సేయుచు " యస్య బ్రహ్మచ క్షత్రంచ, ఉభే భవత ఓదనః! మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః "

యస్య = ఎవనికి బ్రహ్మచక్షత్రంచ = బ్రహ్మక్షత్రములనెడి ఉభే = రెండుజాతులును, ఓదనః = అన్నము (ఆహారపదార్థము) భవతః = అగుచున్నవో, యస్య = ఎవనికి, మృత్యుః = సర్వసంహారకుడగు మృత్యువు, ఉపసేచనం = భోజనముచేయునపు డన్నమును దడుపు (కలుపు) కొనుటకుపయోగించు, కూర, పులుసు, నెయ్యి వంటి పదార్థమైనవాడో - ! అట్టివానిని, కః = ఆత్మజ్ఞానసాధనములులేని దెవడును, ఇత్థా = సాధనములు గలవాడు తెలిసికొన్నట్లుగా, వేద = ఎఱుగును? సః = అతడు, యత్ర = ఎక్కడున్నాడో అని, కః వేద = ఎవ్వడెఱుగును! అని చెప్పెను.

సర్వధర్మములను రక్షించుటకు సమర్థము లైనవను నభిప్రాయముతో బ్రహ్మక్షత్రములను రెండింటినే చెప్పెను. కాని యవి మిగిలినజాతుల కన్నిటికి నుపలక్షణములు. మృత్యువును నంజుకొనుచు జీవరాసుల నన్నిటిని భుజించువాడని యర్థము. ఈ అత్త (భుజించెడివాడు) ఎవరు? అగ్నియా! జీవుడా! పరమాత్మయా! అని సందేహము కలుగుచున్నది.

"అగ్ని రన్నాదః" అన్నమును దినువాఁడు, అగ్ని: అను శ్రుతివలన నగ్ని దేవుఁడు కావచ్చును. లేదా "తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి" జీవేశ్వరులలో నొకఁడైన జీవుఁడు, మధురమగు నాహారమును దినుచున్నాఁడు. అనెడి శ్రుతివలన జీవుఁడైనఁగావచ్చును. అంతియేకాని "అనశ్నన్నన్యోఽభిచాకశీతి" ఈశ్వరుఁడు తినకుండఁగఁ బ్రకాశించుచున్నాఁడను శ్రుతివలనఁ, బరమాత్మ కాఁడని పూర్వపక్షము కలుగ దానిని వారింప నీయధికరణ మారంభింపఁ బడినది.

## అత్తా చరాచర గ్రహణాత్. 9

అత్తా = భుజించెడివాఁడు, చరాచర గ్రహణాత్ = స్థావర జంగమాత్మకమగు ప్రపంచమును గ్రహించుటవలన పరమాత్మయని యర్థము. ఇచ్చట బ్రహ్మ క్షత్ర పదములు స్థావర జంగ మాత్మక మగు ప్రపంచమున కంతకు నుపలక్షకములని చెప్పుటచే, మృత్యూపసేచనముగ నింతటి మహాహార పదార్థమును దినఁగలిగిన వాఁడు పరమేశ్వరుఁడు తక్క మఱొకఁడుకాఁడని యభిప్రాయము. పరమాత్మ ప్రళయ సమయములో వికారజాతము నంతను దనలో లయముచేసి కొనును గాన దీనినంతను నతఁడు తినుచున్నాఁడనుట యుపపన్నమగును. పరమాత్మ భుజింపకుండగనే ప్రకాశించుచున్నాఁడను వెనుకటి శ్రుతి, ప్రకరణమునుబట్టి కర్మఫలోపభోగమును నిషేధించునదే కాని, సంహారక్రమమును నిషేధిం

చునది కాదు. వేదాన్తము లన్నిటియందును బరమాత్మ సృష్టి స్థితి సంహార కారణమని ప్రసిద్ధముగ నంగీకరింపబడినది. కనుక నిచ్చట భుజించువాఁడు పరమాత్మయనియే సిద్ధాన్తము.

### ప్రకరణాచ్చ 10

ప్రకరణాచ్చ = సందర్భము వలనఁగూడ నిచ్చటి యత్త(భోక్త) పరమాత్మయనియే యర్థము. "న జాయతే మ్రియతే వా విపశ్చిత్" అని ప్రారంభించి, ఆత్మపుట్టఁడనియు, నశింపఁడనియుఁజెప్పి "క ఇత్థా వేద యత్రసః" అని దుర్జ్ఞేయత్వమును జెప్పెను. ఈదుర్జ్ఞేయత్వము (తెలిసికొనఁబడనేరక పోవుట) కూడఁ బరమాత్మ యగుటకు లింగము.

### 3 గుహాప్రవిష్టాధికరణము. 11-12

అవః- కఠవల్లిలో యమధర్మరాజు నచికేతున కాత్మోపదేశము సేయు సందర్భములో సుఖముగాఁ దెలియుటకై ప్రాప్తృ ప్రాప్తవ్యుల వివేకము కలుగుటకొఱకు ఆత్మలిద్దఱని చెప్పుచున్నాఁడు.

"ఋతం పిబన్తౌ సుకృతస్య లోకే, గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే। ఛాయాతపౌ బ్రహ్మవిదో వదన్తి పంచాగ్నయో యే చ త్రిణాచికేతాః" (లోకే = ఈశరీరమందు) సుకృతస్య = తాముచేసికొన్న కర్మమునకు ఫలమైన

ఋతం=సత్యమైన (తప్పనిసరిగా ననుభవింపవలసిన) ఫలమును, పిబన్తౌ = అనుభవించుచు, పరమే = శ్రేష్ఠమైన, పరార్ధే= పరబ్రహ్మయుండెడుస్థానమైన హృదయమునందలి, గుహాం = గుహను, ప్రవిష్టౌ = ప్రవేశించినవారై, ఛాయాతపౌ = ఛాయాతప (ఛాయా + అతప = నీడ, ఎండ) ములవలెఁ బరస్పరవిరుద్ధమైన వారని, బ్రహ్మవిదః = బ్రహ్మవేత్తలు, పంచాగ్నయః = గృహస్థులు, త్రిణాచికేతాః = నాచికేతాగ్నిచయన మొనర్చినవారును, వదన్తి = చెప్పుచున్నారు.

ఇచ్చట ఋతంపిబన్తౌ అని గుహాంప్రవిష్టౌ అని, ఛాయాతపౌ, అని ద్వివచనాన్త నిర్దేశములవలన గుహాప్రవిష్టులిద్దఱని స్పష్టముగానర్థ మగుచున్నది. ఆయిద్దఱు బుద్ధి,జీవులా? జీవ, పరమాత్మలా? అని సందేహము కలుగుచున్నది.

ఇంతకుముందు నచికేతుఁడు యముని "యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే నాయమస్తీతి చైకే, ఏతద్విద్యా మనుశిష్ట స్త్వయాహమ్" మనుష్యుఁడు చనిపోయిన తరువాత, నీశరీరేంద్రియ మనోబుద్ధులకు వ్యతిరిక్తముగా, దేహాంతరమునకు సంబంధించిన యాత్మయున్నాఁడని కొందఱును, లేఁడనికొందఱును చెప్పుటచే సంశయముగనున్నది నీచే బోధింపఁబడినవాఁడనై యీసంశయము తీర్చికొందును అని యడిగెను. ఆప్రశ్నకు సమాధానముగ యముఁడు ప్రస్తుతశ్రుతిని చెప్పినచో నిది బుద్ధిజీవులనుగూర్చి చెప్పిన

దగును. "ఛాయాతపౌ" అనుటచే పరస్పరవిరుద్ధ స్వభావులను దెల్పుచున్నది. కనుక బుద్ధి యచేతనము, జీవుఁడు చేతనుఁడు, కనుక విరుద్ధస్వభావములు గల యీయిరువురిని చెప్పినదనుట యుక్తము. కాని "ఋతంపిబన్తౌ" అని ఋతపానము (కర్మ ఫలానుభవము) చేతనధర్మ మగుటచే నచేతనమగు బుద్ధికిఁ గుదురదు. అయినను కరణమునందుఁ గర్తృత్వము నారోపించి చెప్పినదని గ్రహింపవలెను. లోకములోఁ గూడఁ గరణమునందు కర్తృత్వోపచారముగలదు. కట్టెపుల్లలు బాగుగ నెండినవై మండుచున్నప్పుడు "పుల్లలే యన్నమునువండినవి" అని యందుము. మన ప్రయత్నము విశేషముగా నక్కఱలేకయే పుల్లలమంటచేతనే యన్నము సిద్ధమైనదని పుల్లలను మెచ్చుకొనుచుఁ జెప్పెడిమాట.

నచికేతుఁడు

"అన్యత్ర ధర్మా దన్యత్రాధర్మా దన్యత్రా స్మాత్కృతా
కృతాత్ । అన్యత్రభూతాచ్చ భవ్యాచ్చ యత్తత్ప
శ్యసి తద్వద"

ధర్మాధర్మములకు, కార్యకారణములకు, భూతభవిష్య ద్వర్తమానములకు నతీతముగ దేనినిజూచుచున్నావో నాకు దానిని జెప్పుము. అని యముని మఱియొకప్రశ్న వేసినాఁడు. ఈప్రశ్నకు సమాధానముగఁ బ్రస్తుత ఋతపానశ్రుతిని జెప్పినచో జీవపరమాత్మలనుగూర్చి చెప్పినదగును. ఈపక్షము

సందును గొన్నియుపపత్తులుకలవు. "ఋతంపిబన్తౌ" అని ద్వివచననిర్దేశముచే నిద్దరు ఋతపాన మొనర్చుచున్నట్లర్థమగుచున్నది. "అనశ్నన్నన్యోఽభిచాకశీతి" యని వెనుక నుదాహరించినశ్రుతి పరమాత్మను ఋతపానమును నిరాకరించుచున్నది.

"గుహాంప్రవిష్టౌ" అనునదికూడ సర్వవ్యాపియగు పరమాత్మునకు బరిమితప్రదేశస్థితిని జెప్పుచు విరోధించుచున్నది.

రెండుపక్షములందును నుపపత్త్యనుపపత్తు లుండుటచే నిందు బుద్ధిజీవులా! జీవపరమాత్మలా! యనిసంశయము కలుగుచున్నది. దానిని వారింప నీయధికరణ మారంభింపబడినది.

గుహాం ప్రవిష్టావాత్మానౌహి తద్దర్శనాత్. 11

గుహాంప్రవిష్టౌ = "ఋతంపిబన్తౌ" యనుశ్రుతిలో హృదయమును బ్రవేశించియున్నారని చెప్పిన యిద్దరును, ఆత్మానౌ = జీవాత్మ పరమాత్మలు. హి = ఎందుచేతన నగా, తద్దర్శనాత్ = సంఖ్యాశ్రవణమందు సంఖ్యేయుల కేకరూపత్వము లోకములో గనబడుటవలన.

ద్వివచన నిర్దేశముల వలన నిద్దరని సంఖ్య వినిపించుచున్నది. ఈసంఖ్యచే దెలుపబడు సంఖ్యేయు లిరువురు నొక్కరకమువారై యుండవలె ననుట లోకమర్యాద. ఒక యెద్దు

కలవాఁడు తనయెద్దునకు జతే సంపాదింపవలెనని ప్రయత్నించి సజాతీయమగు నెద్దునే తెచ్చునుగాని గుఱ్ఱమునో, గాడిదనో తీసికొనిరాఁడు.

"ఋతంపిబన్తౌ" అని ఋతపానము చేయుట యను ధర్మమునుబట్టి చేతనుఁడగు జీవాత్మనొకనిని బరిగ్రహింపవలెను. తత్సాహచర్యముచే రెండవవానినిగూడఁ జేతనుఁడగు పరమాత్మనే గ్రహింపవలెనుగాని యచేతనమగు బుద్ధిని గ్రహింపరాదు.

పరమాత్మకు ఋతపానము, సుకృతలోకవర్తిత్వము నసంగతము లయ్యును ఛత్రిన్యాయమునఁ జెప్పినవని గ్రహింపవలెను. కొందఱు ఛత్రములధరించియు, కొందఱుధరింపకయు జట్టుగా నేఁగుచున్నపుడు, ఛత్రధారు లేఁగుచున్నారని సామాన్యముగాఁ జెప్పుదుము. ఋతపానధర్మ మొకనికేఁ గలిగి రెండవవానికి లేకున్నను నట్లే సుకృతలోకవర్తిత్వమునొక్కనికే సంభవించినను సామాన్యముగఁ జెప్పఁబడెనని యభిప్రాయము.

ఆత్మోపలబ్ధి కుచితమగు స్థానమని హృదయాకాశ గుహలో నున్నాఁడని చెప్పుటకాని పరిమిత ప్రదేశ కథనము కాదు. పరమాత్మ హృదయాకాశములో నున్నాఁడని శ్రుతిలోఁ బలుతావులఁ జెప్పఁబడినది.

అవిద్యాదశలో జీవుఁడు, విద్యాదశలో పరమాత్మయని వ్యవహారముకనుక, వీరు ఛాయాతపములవలెఁ బరస్పరవిరుద్ధ స్వభావులు.

ఈశ్రుతి నచికేతుని రెండవప్రశ్నకే సమాధానమని యభిప్రాయము.

విశేషణాచ్చ. 12

విశేషణాచ్చ = విశేషణమువలనఁగూడ నీశ్రుతి యందు గుహాప్రవిష్టులు జీవాత్మ,పరమాత్మ లనియే తెలియు చున్నది.

దీనికి ముందుగ్రంథమునందు "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు" ఆత్మను(జీవుని)రథికునిగాను, శరీరమును రథమునుగాను, గల్పించిచెప్పి, "సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోఃపరమంపదమ్" ఆరథికుడగు జీవుఁడు మార్గము యొక్క అంతమును బొందుచున్నాఁడు. అది పరమాత్మ యొక్క పరమపదము అని పరమాత్మను గంతవ్యునిగాను (పొందఁదగినవానినిగాను) విజ్ఞానాత్మను (జీవాత్మను) గంతను (పొందెడువానిని) గాను చెప్పెను. దీనికిఁ బూర్వమంత్రములో, మంత, మంతవ్యుఁడు, (ఆలోచించువాఁడు, ఆలోచింపదగిన వాఁడు) అనియు, తరువాతమంత్రములో, ద్రష్ట,ద్రష్టవ్యుఁడు, ననియు నీ జీవాత్మపరమాత్మలనే విశేషించిచెప్పుటవలన నిచ్చటఁగూడ జీవాత్మపరమాత్మలేయనియర్థము.

## ౪ అంతరాధికరణము. (13-17)

అవ:- ఛాందోగ్యమున నాల్గవయధ్యాయమున నుప కోసలవిద్యయని యొకకథకలదు. కమలునికుమారుఁ డుప కోసలుఁడనువాఁడు జాబాలునియొద్ద బ్రహ్మచర్యము గడు పుచు గురువునాజ్ఞచే నగ్నిపరిచర్య చేయుచుండెను. ఇట్లాతఁడు పండ్రెండుసంవత్సరములు గడపెను. జాబాలుఁడు మిగిలిన బ్రహ్మ చారుల కుపదేశముచేసి పంపెనుగాని యాతనిని బంపలేదు. గురుభార్య వీనికుపదేశించిపంపుఁడన్నను నాతఁడు వినిపించుకొన లేదు. అంతట నగ్నులు తమభక్తుఁడు చింతాక్రాంతుఁడయి యుండుటఁజూచి తాము బ్రహ్మవిద్యను గొంతవఱ కుపదేశించి యాచార్యుఁడు నీకుపదేశించునని చెప్పినవి. తరువాత గురువు (జాబాలుఁడు) వానికుపదేశించుచు నిట్లుచెప్పెను.

“య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హోవాచ ఏతదమృత మభయ మేతద్బ్రహ్మ తద్యద్యప్యస్మిన్ సర్పిర్వా ఉదకం వా సించతి వర్త్మనీఏవ గచ్ఛతి” ఛాం(౪ 15-1)

కంటియందుఁ గనిపించుచున్న పురుషుఁడు, ఆత్మ. అతఁడమృతుఁడు, అభయుఁడు. బ్రహ్మస్వరూపుఁడు. నేతినిగాని యుదకమునుగాని యుతనియందుఁ బోసినను నతనికంటక ప్రక్క లకే పోవును అనియర్థము.

ఇచ్చట, కంటియందుఁ గనిపించుచున్న పురుషుఁడు జీవుఁడా! పరమాత్మయా! ప్రతిబింబస్వరూపుఁడా? యని సంశయము గలుగ వారించుట కీయధికరణ మారంభింపఁబడినది.

### అంతర ఉపపత్తేః. 13

అంతరః=ఇచ్చటఁ జెప్పఁబడిన, కంటిలోపలఁగనిపించుచున్న పురుషుఁడు, ఉపపత్తేః=ఉపపత్తివలన, పరమాత్మస్వరూపుఁడని యర్థము. ఉపపత్తి యేమనఁగా:- ఆత్మపదము ముఖ్యవృత్తిచేఁ బరమాత్మనుబోధించును. అమృతత్వాఽభయత్వాది గుణము లతనికిఁ జెల్లును. నేయిగాని, యుదకముగాని యతని కంటికి ప్రక్కలకే పోవుననుట, పరమాత్మ కేపాపములు నంటవనుట. సంయద్వాముఁడని ముందుఁ జెప్పెడు మాటఁగూడ నితని యందే సరిపడును. సంయద్వాముఁడనఁగా సమస్తమైన శుభములు పొందువాఁడని యర్థము.

### స్థానాది వ్యపదేశాచ్చ. 14

స్థానాది=స్థానము,నామరూపములు మొదలగువానిని, వ్యపదేశాచ్చ=చెప్పుటవలనఁగూడ నితఁడు పరమేశ్వరుఁడు.

నిర్గుణస్వరూపుఁడగు పరబ్రహ్మకు, ఒకస్థానమనియు, నొకపేరనియు లేదు. కాని యుపాసన కొఱకు స్థానమును, నామరూపములను జెప్పుట కలదు. ఉపాసనార్థమై యట్లు చెప్పుటచే నితఁడు పరమాత్మయని యర్థము.

సుఖవిశిష్టాభిధానా దేవచ. 15

సుఖవిశిష్ట = సుఖముతోఁగూడినదిగా, బ్రహ్మను, అభిధానా దేవచఽ చెప్పుటవల్లనే, యిచ్చటిపురుషుఁడు పరమాత్మయని యర్థము. అగ్నులుపకోసలుని కుపదేశించు సందర్భములో "కంబ్రహ్మ ఖంబ్రహ్మ "యని చెప్పినవి. సుఖస్వరూపము నాకాశమువలె వ్యాపకము నగునది బ్రహ్మ యనియర్థము. ఆ యుపక్రమములోఁ జెప్పఁబడిన పరబ్రహ్మస్వరూపమే యిచ్చట గురువుచేతను నుపదేశింపఁబడిన దనుట యుచితము.

శ్రుతోపనిషత్క- గత్యభిధానాచ్చ. 16

శ్రుతోపనిషత్క- = ఉపనిషత్తులయందలి రహస్యములను వినినవానియొక్క, గత్యభిధానాచ్చ = దేవయానమార్గమును జెప్పుటవలనఁగూడ నితఁడు పరమాత్మస్వరూపుఁడేయని యర్థము.

"య ఏషోఽక్షిణి పురుషో దృశ్యతే యని చెప్పి ఆపురుషుని దెలిసికొన్నవానికి దేవయానాదిమార్గము నుపదేశించుటచేత నీపురుషుఁడు పరబ్రహ్మస్వరూపుఁడేయని ధ్రువపడుచున్నది.

అనవస్థితేరసంభవాచ్చ నేతరః 17

అనవస్థితేః = నిలకడలేకపోవుట వలనను, అసంభవాచ్చ = అమృతత్వాభయత్వాదిగుణములు సంభవింపక

పోవుటవలనను నీయక్షిగతపురుషుఁడు ఇతరః = జీవాత్మ కాని ఛాయాత్మకాని, న = కాఁడు.

ఛాయాత్మయనఁగా ప్రతిబింబరూపుఁడు, ఎవఁడైన మనకంటెదుట నిలఁబడిన మనకంటియందుఁ ప్రతిబింబము కనఁబడును. అతఁడు ఛాయాత్మ. మన ముపాసనచేయునప్పు డెదుట నెవనినో యుంచుకొని యుపాసనచేయుదుమను నియమము లేదు. కనుక ఛాయాత్మ యెప్పుడును కంటియందుం డదు. విజ్ఞానాత్మకూడ సకలశరీరమందు వ్యాపించి యుండును గాని యొక్కకంటియందే యుండదు. పరమాత్మ కుపాస నార్థమై స్థానవిశేషము చెప్పఁబడినది కాని మిగిలినజీవాత్మ కట్లు చెప్పుటలేదు. అమృతత్వము, అభయత్వము ననుగుణ ములు ఛాయాత్మకుగాని, జీవాత్మకుఁగాని సంభవింపవు. అందుచేత నిచ్చట నక్షిగతపురుషుఁడు పరమాత్మయనియే చెప్పవలెను.

## 6 అన్తర్యామ్యధికరణము 18-20

అవ:- బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్కీయ కాండలో నుద్దాలకుఁడు యాజ్ఞవల్క్యుని, నంతర్యామిని గూర్చి ప్రశ్నింప, నాతఁడిట్లు చెప్పెను. "యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అంతరో యం పృథివీ న వేద, యస్య పృథివీ శరీరం, యః పృథివీ మంతరో యమయతి, ఏష తే ఆత్మాఽంత ర్యామ్యమృతః" భూమిమీఁదనుండి యెవఁడు భూమికి లోపలి

వాఁడో, భూమివానికి శరీరమయ్యును నెవనినెఱుంగలేదో, ఆభూమిలోపలనే యుండి దానినెవఁడు నియమించుచున్నాఁడో యతఁడే నీలోననుండు నమృత స్వరూపుఁడగునాత్మ అని యర్థము.

ఇచ్చట నీ యంతర్యామియని చెప్పఁబడువాఁడు శక్తి దభిమానియగు దేవతావిశేషుఁడా! పరమేశ్వరుఁడా! అను సందేహము గలుగుచున్నది. దానినివారింప నీయధికరణ ముపక్రమింపఁబడినది.

అంతర్యామ్యధిదైవాదిషు తద్ధర్మవ్యపదేశాత్. 18

అధిదైవాదిషు = అధిదైవము, అధియజ్ఞము మొదలగువానియందు, అంతర్యామీ = లోపల నున్నవాఁడుగాఁ జెప్పఁబడినయాతఁడు, తద్ధర్మవ్యపదేశాత్ = సర్వాత్మత్వ, సర్వద్రష్టృత్వములు అమృతత్వము మొదలగు గుణములు కలవాఁడుగాఁ జెప్పఁబడుటవలనఁ, బరమేశ్వరుఁడని యర్థము.

సర్వాత్మత్వాదిగుణములు పరమాత్మకు మాత్రమే సరిపడునుగాన నిచ్చట నంతర్యామియని చెప్పఁబడిన యాతఁడు పరమాత్మయనియే యర్థము.

నచ స్మార్త మతద్ధర్మాభిలాపాత్. 19

స్మార్తం = సాంఖ్యస్మృతిలోఁ దెలుపఁబడిన ప్రధానము, నచ = ఈయంతర్యామిపదమున కర్థముకాదు. అతద్ధ

ర్యాఖిలాపాత్ = ప్రధానముకంటె నితరమైన చేతనము యొక్క, ద్రష్టృత్వాదిధర్మములను జెప్పుటవలన.

అంతర్యామి సర్వద్రష్టయని చెప్పుటచేతను నచేతనమగు ప్రధానమునకు ద్రష్టృత్వములేదు కనుకను నంతర్యామిపదము నకుఁ బ్రధానమని యర్థము కాదని భావము.

శారీర శ్చోభయేఽపిహి భేదేనైన మధీయతే. 20

శారీరశ్చ = శారీరుఁడు (జీవుఁడు) కూడ, న = అంతర్యామిపదమున కర్థము కాదు. ఉభయేఽపి = కాణ్వులు, మాధ్యందినులనను నిరుశాఖలవారును ఏనం = ఈశారీరుని, భేదేన = అంతర్యామికన్న భేదముతో అధీయతేహి = చెప్పుచున్నారుగదా!

శారీరునకు ద్రష్టృత్వాది గుణము లుపపన్నము లగునుకాని పృథివ్యాదులయందుఁ బూర్తిగాలోనని యుండియుండుట, వానిని నియమింపఁగల్గుట సంభవింపవు. కనుక విజ్ఞానమయుఁడగు శారీరునికన్న నంతర్యామిస్వరూపుఁడు వేఱుఅని ఫలితము.

అయినచో 'నాన్యోఽతోఽస్తి ద్రష్టా' "ఈపరమాత్మకంటెఁ జూచువాఁడు మఱియొకఁడు లేఁడు అని చెప్పిన శ్రుతికి విరోధము గల్గదా? యనిన వాస్తవికదృష్టిలో జీవపరమాత్మ

లోకమందే కాని జీవుడని వేరుగాలేదు. ఈభేద మవిద్యా కల్పితము. ఘటాకాశము, మహాకాశము, వంటివి. ఔపాధి కముగు భేదమే కాని యథార్థము కాదు. అని భావము.

## ౭ అదృశ్యత్వాధికరణము. 21-23

అవ:- ముండకోప నిషత్తులో శౌనకు డంగిరసుని దగ్గరకువెళ్లి బ్రహ్మవిద్య చెప్పుమన్న శ్లోకకథ గలదు. అంగిరసుని “అయ్యా! ఏది తెలిసిన సర్వము తెలియునో నాకావిద్య నుపదేశింపుమని శౌనకుడడిగెను. దాని కాతడు సమాధాన మిచ్చుచు, పరావిద్య అపరావిద్య యని రెండువిద్యలుకలవు. ఋగ్వేదాదిశాస్త్రములన్నియు నపరవిద్య. అక్షరస్వరూపము నొందించునది పరవిద్య యనిచెప్పుచు, “యత్త దద్రేశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణ మచక్షుశ్శ్రోత్రం తదపాణిపాదం, నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్భూత యోనిం పరిపశ్యన్తి ధీరాః” అని చెప్పినాడు. చూచుటకు శక్యముకానిది, గ్రహించుటకుశక్యముకానిది, నామరూప ములులేనిది, ఇంద్రియములులేనిది, నిత్యము, వ్యాపకము, సూక్ష్మము నగునక్షరస్వరూపము సర్వభూతములకు గారణ మని బుద్ధిమంతులు చెప్పెదరు. అనియక్షరమునకు లక్షణ మును జెప్పినాడు.

ఇందు, అదృశ్యత్వాది లక్షణములుకల భూతయోని యైన యక్షరమనగా, ప్రధానమా! జీవుడా! ఈశ్వరుడా!

యనిసందేహముకలుగుచున్నది. ఆసందేహమును వారించు టకై యీయధికరణ మారంభింపఁబడినది.

అదృశ్యత్వాది గుణకో ధర్మోక్తేః. 21

ధర్మోక్తేః = సర్వజ్ఞత్వాది ధర్మములను చెప్పుట వలన, అదృశ్యత్వాదిగుణకః = అదృశ్యత్వము మొదలగు గుణములుకలవాఁడు, పరమాత్మయే కాని ప్రధానమని, జీవుఁడని కాదు.

అనఁగా దీనివాక్యశేషములో "యస్సర్వజ్ఞ స్సర్వ విత్" అని యక్షరస్వరూపుని, సర్వజ్ఞుఁడని, సర్వవేత్తయని చెప్పినారు. ఈ సర్వజ్ఞత్వాది లక్షణములు, అచేతనమగు ప్రధానమునకు సరిపడవు. జీవునకుసరిపడవు. కాన నీధర్మములు పరమేశ్వరునకే సరిపడును. అనియభిప్రాయము.

విశేషణ భేద వ్యపదేశాభ్యాం చ నేతరౌ. 22

విశేషణ = విశేషణముచేతను, భేదవ్యపదేశాభ్యాం =భేదమునుచెప్పుటచేతను, ఇతరౌ = జీవుఁడు, ప్రధానము, నని యర్థము, న = కాదు. ఇచ్చట భూతయోని నుద్దేశించి, "దివ్యో హ్యమూర్తః పురుషః" అని విశేషించి చెప్పుటవలన నితఁడుజీవుఁడు కాఁడనియు నుపనిషత్ప్రతిపాద్యుఁడగు నీశ్వరుఁడనియు నర్థమగుచున్నది.

"అక్షరా త్పరతః పరః" అని చెప్పుటచేఁ బ్రధానము కాదని యర్థమగుచున్నది. అక్షరమనఁగా నవ్యాకృతము,

నామరూపబీజశక్తిరూపము నీశ్వరాశ్రయమునగు భూత సూక్ష్మము సర్వవికారజాతమునకుఁ బరమైనది యవికార రూపము. దానికిని మిక్కిలిపరమైనవాఁడు అనిచెప్పుటచే నిచ్చట భూతయోనిశబ్దవాచ్యుఁడు పరమేశ్వరుఁడు కాని ప్రధానముకాదు.

## రూపోపన్యాసాచ్చ 23

రూపోపన్యాసాత్ + చ = రూపమును జెప్పుట వలనఁగూడ, నిచ్చట భూతయోనిపదమునకుఁ బరమేశ్వరుఁ డనియే యర్థము.

"అక్షరాత్పరతః పరః" అనిచెప్పిన తరువాతఁ బ్రాణము మున్నగువానియొక్క సృష్టిని జెప్పి యీభూత యోనికి "అగ్ని శిరస్సు, సూర్యచంద్రులు నేత్రములు, దిక్కులు శ్రోత్రములు, వేదములువాక్కులు" అని వికారస్వరూపము నంతయు నతనికి స్వరూపమునుగాఁ జెప్పినాఁడు. సర్వవికారము నకుఁ గారణమైనవాఁడు పరమేశ్వరుఁడేగనుక నీరూపోపన్యాస మునుబట్టి యిచ్చటిభూతయోని పరమేశ్వరుఁడనియే యర్థ మగుచున్నది. స్వల్పమహిమగల శారీరుఁడుకాఁడు. సర్వభూత ములకు నంతరాత్మయగుట సంభవింపదుగనుక ప్రధానముఁ గూడ భూతయోనిపదమున కర్థముకాదు. కనుక పరమేశ్వరుఁ డనియే యర్థము.

## 7 వైశ్వానరాధికరణము. (24-32)

అవ:- ఛాందోగ్యములో పంచమాధ్యాయమున నొకకథ కలదు. ప్రాచీనశాలుఁడు, సత్యయజ్ఞుఁడు, ఇంద్రద్యుమ్నుఁడు, జనుఁడు, బుడిలుఁడు నను మహాశ్రోత్రియ గృహస్థులు గుమిగూడి "కోన ఆత్మా? కింబ్రహ్మ?" యనగా ఆత్మ ఎవరు? బ్రహ్మస్వరూపమేది? యని విమర్శించిరి. వారికిఁ దెలియకపోవుటచే నుద్దాలకుని కడకేగిరి. అతఁడు తనకును దెలియదని యశ్వపతియను రాజు యజ్ఞము చేయుచుండ నాతనివద్దకు వీరినందఱిని దీసికొనిపోయెను. రాజువీరి నాదరించి ధనమీయఁబోయెను. మాకు ధనమక్కఱలేదు. ధనార్థులమై మేము రాలేదు. వైశ్వానర జిజ్ఞాసచే వచ్చితిమి. నీవు వైశ్వానరాత్మ స్వరూపమును మాకుఁ దెలుపుమని, వేడిరి. అంత నాయశ్వపతి వీరికెంతవఱకుఁ దెలిసినదో విమర్శించి మిగిలినది చెప్పఁదలఁచి వీరిలో నొక్కొక్కని నీవు దేనిని వైశ్వానరస్వరూపముగ నుపాసనచేయుచుంటివని ప్రశ్నింప వారొక్కరొక్కరు, ద్యులోకము, సూర్యుఁడు, వాయువు, ఆకాశము, జలము, పృథివి, యనునవి వైశ్వానరస్వరూపములని రొక్కొక్క దానిని నుడివిరి.

అంత నాయశ్వపతి వారల మిథ్యాజ్ఞానమును బోఁగొట్టి వైశ్వానరవిద్య చెప్పుటకై యిట్లనెను. గ్రుడ్డివారు ఏనుఁగును దెలిసికొనఁదలంచి మూపటేనిపాయమున నొకఁడు

తొండమును, నొకఁడు చెవిని, వేఱొకఁడు పాదమును బట్టుకొని యాయవయవము మాత్రమే యేనుఁగనుకొన్నట్లు మీరు వైశ్వానరునియొక్క యొక్కొక్క యవయవమును మాత్రమే వైశ్వానరుఁడని తలఁచుచుంటిరి. అది మిథ్యాజ్ఞానము. ద్యులోకము మొదలు పృథివీలోక పర్యంతము గల ప్రదేశములెల్ల తనపరిమాణముగా నాతఁడు వైశ్వానరుఁడు. "ఆవైశ్వానరునికి ద్యులోకము శిరస్సు, సూర్యుఁడు నేత్రము, వాయువు ప్రాణము బహుళప్రదేశమగు ఆకాశము దేహమధ్యభాగము, ధనము వస్తి, పృథివి పాదములు, అని చెప్పినాఁడు.

ఇచ్చట వీరిప్రశ్నోత్తరములలో నాత్మయని వైశ్వానరయని రెండుపదములు వినవచ్చుచున్నవి. ఆత్మపదమునకు, జీవుఁడు, పరమేశ్వరుఁడునని రెండర్థము లుండుటచేతను, వైశ్వానరపదమునకు జఠరాగ్నియనియు, అగ్నియనియు, అగ్న్యభిమానిదేవతయనియు నర్థములుండుటచే ప్రకృతమున నేది యర్థమని సంశయముకలుగుచున్నది. దానిని వారించుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

### వైశ్వానర స్సాధారణ శబ్దవిశేషాత్ 24

వైశ్వానరః = ఇచ్చటి వైశ్వానరుఁడు పరమాత్మ. ఎందుచేత? అనఁగా, సాధారణశబ్దవిశేషాత్ = సాధారణ శబ్దములయొక్క విశేషమువలన, అనఁగా నీవైశ్వానర

పదము పరమాత్మవాచకము. వైశ్వానరపదము, అగ్నిత్రి గ్న్యభిమానిదేవతా, జాఠరాగ్ని సాధారణము. ఆత్మపదము శారీర పరమేశ్వరసాధారణము. "తస్యహవా ఏతస్య వైశ్వానరస్య మూర్ధైవ సుతేజాః" అని ద్యులోకమూర్ధత్వకథనము పై పదములకు రెండింటికిఁ బరమేశ్వరుఁడని యర్థము చెప్పిననాఁడే యుపపన్నమగును. కనుక సాధారణశబ్దములకు నర్థవిశేషము తోఁచుచున్నదికనుక నిట పరమాత్మయనియే వైశ్వానర పదమునకర్థము.

స్మర్యమాణ మనుమానం స్యాదితి. 25

స్మర్యమాణం = స్మృతిలోఁ జెప్పఁబడినరూపము, అనుమానం స్యాదితి = మూలభూతమగు శ్రుతికి గమకమగుచు నిచ్చుటే వైశ్వానరపదము, పరమాత్మ వాచకమని నిరూపించుచున్నది.

"యస్యాగ్నిరాస్యం ద్యౌర్మూర్ధా ఖంనాభి శ్చరణౌ క్షితిః, సూర్యశ్చక్షు ర్దిశశ్శ్రోత్రం తస్మై లోకాత్మనేనమః" ఎవనికి, అగ్ని-ముఖము, ద్యులోకము-శిరస్సు, ఆకాశము - నాభి, భూమి-పాదములు, సూర్యుఁడు - నేత్రము, దిక్కులు-శ్రోత్రమున్ను నైయున్నవో యతనికి నమస్కారము. ఈ స్మృతి మూలభూతమగు శ్రుతిని యూహింపఁజేయుచున్నది కనుక నీవైశ్వానరపదము, పరమేశ్వర బోధకము.

శబ్దాదిభ్యో ఽన్తః ప్రతిష్ఠానాచ్చ, నేతిచేన్న. తథా దృష్ట్యుపదేశా దసంభవా త్పురుషమపి చైన మధీయతే. 26

ఇదిపూర్వపక్షసూత్రము:-

శబ్దాదిభ్యః = శబ్దాదులవలనను, "సఏషో౽గ్ని ర్వైశ్వానరః" అని వైశ్వానరశబ్ద మగ్నియందు రూఢముగా నున్నదను శబ్దములవల్లను, అంతఃప్రతిష్ఠానాచ్చ = పురుషుని యొక్క లోపలఁ బ్రతిష్ఠితమైయున్నదని చెప్పుటవల్లను, నేతి చేత్ = వైశ్వానరపదము పరమాత్మవాచకము కాదు. జాఠరవాచకమే యనినచో, న, = కాదు. తథాదృష్ట్యుపదేశాత్ =ఆమాదిరిగా జాఠరాగ్నియందుఁ బరమేశ్వరబుద్ధినుపదేశించుటవలన, "మనో బ్రహ్మేత్యుపాసీత" "యన్నచోట మనస్సునందు బ్రహ్మబుద్ధినుంచి యుపాసనచేయవలెనన్నట్లు, జాఠరమందు వైశ్వానరబుద్ధినుంచి యుపాసనచేయవలెనని యుపదేశించుటవలన) అసంభవాత్ = "ద్యులోకముశిరస్సు" అను మాట జాఠరాగ్నియందు సంభవింపదుకనుకను, పురుషమపిచైన మధీయతే = వాజసనేయశాఖయులు, వైశ్వానరుని "సఏషో౽గ్ని ర్వైశ్వానరో యత్పురుషః" అనిపురుషునిగా నధ్యయనముచేయుటచేతను, ఇచటి వైశ్వానరపదము పరమేశ్వర పరమేకాని జాఠరాగ్నిపరముకాదు.

అతఏవ న దేవతా భూతంచ. 27

అతఏవ = ద్యులోకముశిరస్సు "అని చెప్పినమాట కుదరదుకనుకనే, న, దేవతా = వైశ్వానరపదమునకు,

అగ్న్యభిమాని దేవతయని యర్థముకాదు, భూతంచ = అగ్ని యనియునర్థము కాదు.

అనఁగా, అగ్నికిఁగాని, అగ్న్యభిమాని దేవతకుఁగాని ద్యులోకమూర్ధత్వకథనము కుదరదని యభిప్రాయము.

## సాక్షాదప్యవిరోధం జైమినిః 28

సాక్షాదపి = ప్రత్యక్షముగానిది పరమేశ్వరోపాసనమేయనినను జైమినిః = జైమిన్యాచార్యుఁడు, అవిరోధం= విరోధములేకుండుటను దలఁచుచున్నాఁడు. అనఁగా నిదివరలో జాఠరాగ్నియందు వైశ్వానరబుద్ధియుంచి యుపాసనచేయుమని చెప్పఁబడినది. ఉపాధికల్పన లేకుండఁగ కేవలపరమేశ్వరోపాసనమే యిది యన్నను దోషములేదని జైమిని యభిప్రాయము.

పూర్వాపర సందర్భమును బట్టి పరమాత్మయని యర్థము నిశ్చయింపఁబడుచున్నదికావున వైశ్వానరపదమున కిట్లర్థము చెప్పవచ్చును.

1. విశ్వ శ్చాయం నరః = సమస్తమునయిన మనుష్యుఁడు విశ్వానరుఁడు (సర్వాత్మకుఁడు)

2. విశ్వేషాంవా అయంనరః సమస్తజీవులకు నేతఁడు నరుఁడు కనుక = విశ్వానరుఁడు (సర్వకారణభూతుఁడు)

3. విశ్వే నరా అస్య = సమస్తజీవులు వీనికిసంబంధించినవారుకనుక = విశ్వానరుఁడు (పరమేశ్వరుఁడుకనుక) విశ్వానరుఁడే వైశ్వానరుఁడు.

అభివ్యక్తే రిత్యాశ్మరథ్యః 29

అభివ్యక్తేరితి = అభివ్యక్తివలననని ఆశ్మరథ్యః = ఆశ్మరథ్యుఁడనునాచార్యుఁడు తలఁచుచున్నాఁడు.

పరమేశ్వరుఁ డంతటనిండియున్నవాఁడైనను నుపాసకులకొఱకై ద్యుమూర్ధాదరాది ప్రదేశములం దభివ్యక్తుఁడగును గనుక ప్రాదేశమాత్రశ్రుతి యుపపన్నమగునని, యాశ్మరథ్యాచార్యుని యభిప్రాయము.

అనుస్మృతే ర్బాదరిః 30

అనుస్మృతేః = ధ్యానమువలన, ప్రాదేశమాత్రుఁడని చెప్పఁబడుచుండెనని, బాదరిః = బాదర్యాచార్యుఁడు తలఁచుచున్నాఁడు.

పరమేశ్వరుఁ డపరిచ్ఛిన్నుఁడైనను, పరిచ్ఛిన్నమగు మనస్సుతో ధ్యానించుటచేత పరిచ్ఛిన్నుఁడని చెప్పఁబడుచుండెను. కుంచముతోఁ గొలవఁబడిన ధాన్యము కుంచెఁ డన్నట్లు పరిచ్ఛిన్నమగు మనస్సునందు స్మరింపఁబడుచుండుటచే నాపరమేశ్వరునికిఁ బ్రాదేశమాత్రకథనముగాని సహజ

ముగ నపరిచ్ఛిన్నుడు పరిపూర్ణస్వరూపుడునని యభిప్రాయము.

సంపత్తేరితి జైమిని స్తథాహి దర్శయతి 31

జైమినిః = జైమిన్యాచార్యుడు, సంపత్తేరితి = సంపత్తివలన (అనగా వాజసనేయి బ్రాహ్మణములోని) ప్రాదేశమాత్రసంపత్తివలననని, చెప్పె, తథాహిదర్శయతి = ఆప్రకారముగా నా బ్రాహ్మణమును గనబఱచు చున్నాడు. వాజసనేయిబ్రాహ్మణములో ద్యులోకము మొదలు, పృథివీపర్యంతముకలవానిని త్రైలోక్యాత్మకుడగు వైశ్వానరునికి శిరస్సు మొదలు గడ్డమువఱకుగల యవయవములనుగా గల్పించి చెప్పబడినది. ఈ చెప్పబడినరీతిగా ప్రాదేశమాత్రకథనము సంపన్నమగునని జైమిని యభిప్రాయము.

ఆమనన్తి చైనమస్మిన్ 32

ఏనం = ఆపరమేశ్వరుని, అస్మిన్ = శిరస్సునకు గడ్డమునకుమధ్యగల యాప్రదేశమునందు, ఆమనన్తిచ = జాబాలురు చెప్పుచున్నారు. "అనంతుడు, నవ్యక్తుడునగు పరమాత్మ అవిముక్తమునం బ్రతిష్ఠింపబడెను. అవిముక్తము, వారణాసియందు బ్రతిష్ఠింపబడినది. ఇంద్రియకృతములగు సర్వపాపములను వారించునది వరణయనియు (భ్రూభాగము) ఇంద్రియకృతములగు సర్వపాపములను నాశనముచేయునది నాసి

(నాసిక) యనియు, భ్రూనాసికలనుద్దేశించి చెప్పి కనుబొమలకును నాసికకును మధ్యభాగము వారణాసియనియు నదిద్యులోకపర లోకములకు సంధియనియు జాబాలశ్రుతిలోఁ జెప్పఁబడెను. కనుక పరమేశ్వరునియందుఁ బ్రాదేశమాత్రశ్రుతి యుపపన్నమగుచున్నది. ఈయధికరణమునఁ జెప్పఁబడిన వైశ్వానరపదమునకుఁ బరమేశ్వరుఁడనియే యర్థము

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి కృతమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్ర వృత్తియందుఁ
ప్రథమాధ్యాయమున
ద్వితీయపాదము.

అధికరణములు - 7, సూత్రములు - 32

శ్రీ రస్తు

# బ్రహ్మ సూత్రార్థ దీపిక

## ప్రథమాధ్యాయ తృతీయపాదము

ఈపాదమునందును అస్పష్టబ్రహ్మలింగములు, జ్ఞేయబ్రహ్మవిషయములు నగు వేదాన్తవాక్యములు విచారణచేయఁబడుచున్నవి.

### 1 ద్యుభ్వాద్యధికరణము. (1-7)

ఈపాదమునఁ గొన్ని వేదాన్తవాక్యములకు నిర్విశేష బ్రహ్మమునందు సమన్వయమును బ్రతిపాదించుటవలన వెనుకటిపాదములతో సంగతికలదు. వెనుక వైశ్వానరాధికరణమునఁ త్రైలోక్యాత్మయగు వైశ్వానరుఁడు పరమాత్మయని చెప్పఁబడినది. అయినచో త్రైలోక్యాయతనము మఱియొకటియా? యని యాశంకించియిందు సమాధానము చెప్పుటచే నీయధికరణమున కాక్షేపసంగతియునుగలదు.

అవ:- విషయవాక్యము:- అథర్వణమగు ముండకోపనిషత్తులో "యస్మిన్ ద్యౌః పృథివీ చాన్తరిక్షమోతం మనస్సహ ప్రాణైశ్చ సర్వైః, తమేవైకం జానథ ఆత్మాన మన్యా వాచో విముంచథ అమృతస్యైష సేతుః (ముం. 2. 2, 5. 1) అని యున్నది.

వేదమాత ముముక్షువుల నుద్దేశించి చెప్పుచున్నది. స్వర్గము, భూమి, ఆకాశము సమస్తప్రాణములతోఁ (ఇంద్రి-

యూధిష్ఠాన దేవతలతో) గూడిన మనస్సు, ఎవనియందు ఓతమై = వస్త్రమునం దంతువులవలె నల్లఁబడియున్నవో! ఆయొక్కనినే ఆత్మనుగాఁ దెలిసికొనుఁడు. మిగిలినమాటలను విడిచిపెట్టుఁడు. ఈయాత్మ అమృతత్వమునకు సేతువు. అని యర్థము.

ఇచ్చట ద్యులోక భూలోకాదులకు ఓతత్వమును జెప్పుటవలన వానికి, స్థానమగునది (ఆయతనమగునది) ఏదో యొకటి యున్నదని తోచుచున్నది. ఆ ఆయతనము, ప్రధానమా? జీవుఁడా? పరమాత్మయా? అనిసంశయము. (సాంఖ్యమతమున) కారణమగుటవలన, ప్రధానము, ఆయతనము కావచ్చుననియు, జీవుఁడుభోక్తయగుటవలన, భోగ్య ప్రపంచమును గురించి యతఁడాయతనము కావచ్చుననియును, పూర్వపక్షములు రాఁగా సిద్ధాంతము చెప్పుచున్నారు.

ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్ .1

ద్యు + భూ + ఆది + ఆయతనం = ద్యుభ్వాద్యాయతనం, ద్యులోక, భూలోకములు మొదలుగాఁగల సమస్త ప్రాణములతో, గూడిన మనస్సు, అంతరిక్షము, అనుసమస్త జగత్తునకు ఆయతనమగునది, పరబ్రహ్మము. ఎందువలన? అనఁగా, స్వశబ్దాత్, = స్వ = తనకు = పరబ్రహ్మమునకు, వాచకమైన, శబ్దాత్ = ఆత్మశబ్దమువలన, "తమేవైకం

జానథ ఆత్మానం" అని ఆత్మశబ్దముండుటవలన నీవాక్యమునఁ చెప్పఁబడిన ఆయతనము పరబ్రహ్మము.

ముక్తోపసృప్యవ్యపదేశాచ్చ. 2

ముక్త + ఉపసృప్య + వ్యపదేశాత్, చ = ముక్తులచేఁ బొందఁదగినది అని యీద్యుభ్వాద్యాయతనము నుద్దేశించి యీప్రకరణమునఁ జెప్పుటవలన నీద్యుభ్వాద్యాయతనము పరబ్రహ్మమే.

ఆత్మస్వరూపము కాని దేహాదులయందు "అహమస్మి" యను ఆత్మబుద్ధి, అవిద్యయనఁబడును. అవిద్యవలన రాగద్వేషములు, భయమోహములు మొదలగు సవర్థములు సంభవించుట ప్రత్యక్షమే. ఈయవిద్యా రాగద్వేష భయమోహముల నుండి ముక్తులైన = విడువఁబడిన, వారిచే నీద్యుభ్వాద్యాయతనము పొందఁదగినది. అని దీనినుద్దేశించి, ముండకోపనిషత్తులో "భిద్యతే హృదయగ్రంథి, ఛిద్యన్తే సర్వసంశయాః, క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్దృష్టే పరావరే" ముం 2-2-8 అనిచెప్పి, "తథా విద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్" ముం 3-2-8 అని ముక్తోపసృప్యత్వము చెప్పఁబడినది. ప్రధానము మున్నగువాని కిచ్చుటను నీవిధముగ ముక్తోపసృప్యత్వము చెప్పఁబడలేదు. కావున, ద్యుభ్వాద్యాయతనము పరబ్రహ్మమే.

## నానుమాన మతచ్ఛబ్దాత్. 3

న, అనుమానం, అతచ్ఛబ్దాత్.

అనుమానం = సాంఖ్య పరికల్పిత మగు ప్రధానము (అనుమానింపఁబడునది అనుమానము, న = ద్యుభ్వాద్యాయతనము కాదు. ఎందువలన! అతచ్ఛబ్దాత్ = ఆప్రధానమును ప్రతిపాదించుశబ్దము ఇందు లేకుండుటవలన.

అచేతనమగు ప్రధానమును జెప్పుశబ్దము ఇందు లేదు. "యః సర్వజ్ఞః సర్వవిత్" ముఁ 1-1-9 అని చేతనుఁడగు పరమాత్మను దెలుపు శబ్దమున్నది.

## ప్రాణభృచ్చ 4

ప్రాణభృత్ + చ = ప్రాణమును భరించువాఁడగు జీవుఁడున్ను (విజ్ఞానాత్మయును) ద్యుభ్వాద్యాయతనము కాఁడు. జీవునకు ఆత్మత్వము, చేతనత్వము ఉన్నను, ఉపాధిపరిచ్ఛిన్నుఁడగు నీతనికి సర్వజ్ఞత్వము సంభవింపదు.

## భేదవ్యపదేశాత్ 5

భేదమును జెప్పుటవలన జీవుఁడు ద్యుభ్వాద్యాయతనము కాఁడు. "తమేవైకం జానథ ఆత్మానమ్" అని పరమాత్మను జ్ఞేయునిగను, ముముక్షువగు జీవుని జ్ఞాతగను, భేదము చెప్పఁబడినది.

ప్రకరణాత్ . 6

ప్రకరణమువల్లను ప్రాణభృత్తు (జీవుఁడు) ద్యుభ్వాద్యాయతనముగాఁ జెప్పఁబడరాదు. "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతంభవతి" ముం 1-1-3 ఏదొక్కటి తెలిసిన సర్వము తెలియఁబడిన దగును? అను సందర్భములో నిది చెప్పఁబడినది. పరమాత్మ తెలిసినచో సర్వము తెలియఁబడును గాని ప్రాణభృత్తు తెలిసిన సర్వము విజ్ఞాతము కాదు.

స్థిత్యదనాభ్యాంచ. 7

స్థితి = ఉదాసీనుఁడై యుండుట, అదనాభ్యాం = కర్మఫలమునను భవించుట, యనుగుణములవలనను, ప్రాణభృత్తు ద్యుభ్వాద్యాయతనము కాఁడు. ఇతనిను ద్దేశించి "ద్వాసుపర్ణా సయుజా సఖాయా" ముం 3-1-1 అనుమంత్రములో "తయో రన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి" అని జీవునకు అదనము = తినుటయు (కర్మఫలానుభవము) పరమాత్మకు ఔదాసీన్యస్థితియును, నిర్దేశింపఁబడినవి.

2 భూమాధికరణము (8-9)

వెనుకటి యధికరణములో "ఆత్మశబ్ద ప్రయోగము వలన ద్యుభ్వాద్యాయతనము పరమాత్మయని చెప్పఁబడినది. ఆత్మశబ్దము "తరతి శోకమాత్మవిత్" ఛాం. 7-1-3 లో, అనుచోట పరమాత్మ కానిదానియందును ప్రయోగింపఁబడి

వదే యని యాక్షేపముతో నీయధికరణ మారంభింపఁబడినది. కనుక ఆక్షేపసంగతి గలదు.

దీనికి విషయవాక్యము ఛాం 7-1-3 లోని "శ్రుతం హ్యేవ మే భగవద్దృశేభ్యః, తరతి శోక మాత్మవిదితి. సోహం భగవః శోచామి, తంమా భగవాన్ శోకస్య పారం తారయతు. తంహోవాచ నామ్నైవైతత్." అనునది.

నారదుఁడు సనత్కుమారుని దగ్గఱకువెళ్ళి! "అయ్యా! తమవంటి పెద్దలవలన ఆత్మవేత్త శోకమును దరించునని వింటిని. నేను శోకమునుబొందుచున్నాను నన్ను నీవు ఈశోక పారమును దరింపఁజేయుము" అనిప్రార్థించెను. అతఁడు నామమే పరమాత్మయని చెప్పెను. నారదుఁడు దానినుపాసన చేసి యింతకన్న నధికమైనది గలదా? యనియడిగెను. వాక్కు ఇంతకన్న నధికమని చెప్పెను. అంతకన్న నధికము గలదాయని యడిగెను. మనస్సుగల దనెను. మఱలనడిగెను. మరలఁజెప్పెను. ప్రాణ మింతకన్న గొప్పది. అన్నింటి వఱకు ప్రశ్నోత్తరములు జరిగెను. ప్రాణము గొప్పదని చెప్పినతరువాత, నారదుని ప్రశ్న లేకుండఁగనే "భూమాత్వేవ విజిజ్ఞాసితవ్యః భూమానం భగవో విజిజ్ఞాస (7-23-1-ఛాం) అనిచెప్పి, "యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి, నాన్యద్విజానాతిసభూమా, అథ యత్రాన్యత్పశ్యతి అన్యచ్ఛృణోతి, అన్యద్విజానాతి, తదల్పం," అని. 7-24-1 చెప్పెను.

భూమమే తెలిసికొనదగినది. దానిని తెలిసికొనుము. నిరతిశయ సుఖమును గోరుకొనువాడు భూమమునే తెలిసికొనవలెను. ఏది తెలిసిన తరువాత మరియొక్కదానిని జూడడో, వినడో, తెలిసికొనడో, అదిభూమము. ఏది తెలిసినను నింకొకదానిని జూచునో, తెలిసికొనునో అదియల్పము. అని సనత్కుమారుడు చెప్పగా ముముక్షువగు నారదుడు భూమమునే తెలిసికొనగోరుదును అని చెప్పెను.

ఇచ్చట భూమ అనునది ప్రాణమా! పరమాత్మా! అని సంశయము. దగ్గఱలో "ప్రాణము" అన్నది యుండుట వలన ప్రాణమే భూమ అని పూర్వపక్షము రాగా, ఈయధికరణ మారంభింపబడినది.

భూమా సంప్రసాదా దధ్యుపదేశాత్ . ౮.

భూమా, సంప్రసాదాత్, అధ్యుపదేశాత్.

సంప్రసాదాత్ =సమ్యక్ ప్రసీదతి అస్మిన్ జీవస్స్వరూపమితి సంప్రసాదః. అనగా సుషుప్త్యవస్థ. ఆ యవస్థయందు జాగరూకమైయుండు ప్రాణము సంప్రసాదమనబడును. సంప్రసాదాత్ = ప్రాణముకంటె, అధ్యుపదేశాత్ = పైనుపదేశించుటవలన, భూమా, = భూమము (విస్తారము, అధికము) పరమాత్మయే.

ధర్మోపపత్తేశ్చ. 9

"నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి" అనుశ్రుతిచే, సర్వ వ్యవహారాభావ రూపమైన ధర్మముయొక్క, ఉపపత్తి వలనను, ఇచ్చటి భూమపదవాచ్యుఁడు పరమాత్మయే.

ఇతనికి సర్వము ఆత్మస్వరూపమే యైనపుడు దేనితో నెవనిని జూచును. అని మఱియొక శ్రుతిలోఁ, గూడ సర్వ వ్యవహారాభావము పరమాత్మధర్మముగాఁ, జెప్పఁబడినది. ఇట్లే యింకనుజెప్పఁబడిన సత్యత్వ, స్వమహిమప్రతిష్ఠితత్వ, సర్వగతత్వ, సర్వాత్మత్వాది ధర్మములు పరమాత్మయందే యుపపన్నములగుచుగాన నిచ్చటి భూమపదార్థము పరమాత్మయే యనిసిద్ధాన్తము.

3 అక్షరాధికరణము. (10-12)

అవ: "కస్మిన్ను ఖల్వాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి, సహోవాచ ఏతద్వై తదక్షరం గార్గి! బ్రాహ్మణా అభివద న్త్యస్థూల మనణు" బృ - 3-8-7-18.

బృహదారణ్యకములో - గార్గి యాజ్ఞవల్క్యుని దగ్గఱకువెళ్లి, అయ్యా! స్వర్గమునకుఁ బైన, భూమికిఁ గ్రింద, ద్యావాపృథివులు, అన్తరిక్షము, భూతభవిష్యత్తులు నీసర్వము నెవ్వనియం దోతప్రోతములుగా నున్నవి? అనిప్రశ్నింప ఆకాశమున నోతప్రోతములుగా నున్నవని యాతఁడు బదులు

చెప్పెను. గార్గి మరల అవ్యాకృతమగు ఆకాశ మెవ్వనియం దోతప్రోతమై యున్నది! అని యడిగెను. అప్పు డాతం డో గార్గి! నీవడిగిన యాకాశాధికరణము "అక్షరము అస్థూలము" అని బ్రహ్మవిదులు చెప్పుదురు అని చెప్పెను.

ఇచ్చటి అక్షరపదమునకు అకారా ద్యక్షర మర్థమా! బ్రహ్మ మర్థమా! అని సంశయము గలుగుచున్నది. అక్షర సమామ్నాయమని యక్షరపదము అకారాదివర్ణములందుఁ బ్రసిద్ధముగాన అక్షరపదమునకు వర్ణములే యర్థమని పూర్వ పక్షము రాఁగా సిద్ధాన్తము చెప్పుచున్నారు.

అక్షర మంబరా న్త ధృతేః. 10

అంబరా న్తధృతేః = భూమి మొదలు ఆకాశమువఱకుఁ గల వస్తువికారజాతమును ధరించుటవలన, అక్షరం = ఇచ్చటియక్షరము పరబ్రహ్మమే. సర్వము ఆకాశమునం దోతప్రోతమై యున్నదని చెప్పి యా యాకాశము అక్షర మం దోతప్రోతమై యున్నదనుటచే అక్షరపదమునకుఁ బర మాత్మయే యర్థము.

సాచప్రశాసనాత్. 11

సాచ = ఆధరించుటయు, ప్రశాసనాత్ = ప్రశాసన మువలన, "ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి! సూర్యా చంద్రమసౌ విధృతౌ తిష్ఠతః" బృ. 3-8-9 అని,అక్షరుని

యాజ్ఞమీఁద సూర్యచంద్రులు ధరింపఁబడియున్నారు. అని ప్రశాసనము = ఆజ్ఞ, వినఁబడుచుండుటవలన, ఆయాజ్ఞ చేతన ధర్మ మగుటచే, చేతనుఁడైన పరమాత్మయే యక్షరుఁడు కాని, ప్రధానముకాదు. సాంఖ్యపరికల్పితమైన యచేతనమగు ప్రధానము అక్షరపదవాచ్యము కాదని యభిప్రాయము.

అన్యభావ వ్యావృత్తేశ్చ. 12

అన్య = ఇతరమైనప్రధానాదికముయొక్క, భావ = ధర్మముయొక్క, వ్యావృత్తేశ్చ = వ్యావర్తనము = మరలించుట = తద్విపరీతధర్మశ్రవణము — వల్లను నీఅక్షరపదమునకుఁ బరబ్రహ్మమేయర్థము గాని ప్రధానము అర్థముకాదు. “తద్వా ఏతదక్షరం గార్గి! అదృష్టం ద్రష్టృ, అశ్రుతం శ్రోతృ, అని, ద్రష్టృత్వ శ్రోతృత్వాది ధర్మసమానాధికరణ ప్రశాసనము చేతనధర్మముకాన ప్రధానముకాదు. “నాన్య దతోఽస్తి ద్రష్టృ” అని మఱియొకద్రష్టను నిషేధించుటవలన అక్షరపదమునకు జీవుఁడును అర్థముకాదు. పరమాత్మయే. అనిసిద్ధాన్తము.

4 ఈక్షతికర్మవ్యపదేశాధికరణము. (13.)

ఆథర్వణమగు ప్రశ్నోపనిషత్తులో. (5-2-)“ఏతద్వై సత్యకామ పరం చాపరంచ బ్రహ్మ, యదోంకారః తస్మా ద్విద్వా నేతేనై వాయతనే నైకతర మన్వేతి” అనిమొదలు

పెట్టి, "యః పున రేతం త్రిమాత్రేణోమిత్యనేనైవాక్షరేణ పరం పురుష మభిధ్యాయీత" అని చెప్పఁబడినది. ఇది విషయ వాక్యము. సుకేశుఁడు, శైబ్యుఁడు, సత్యకాముఁడు మున్నగు వారు బ్రహ్మనిష్ఠులై, బ్రహ్మాన్వేషణపరులై పూజ్యుఁడగు పిప్పలాదుని కడకు వెళ్ళిరి. వారొక్కొక్కరు ప్రశ్నించిరి. ఆతఁడు సమాధానము చెప్పెను. సత్యకాముఁడు "భగవన్ మనుష్యేషు ప్రాయణాన్త మోంకార మభిధ్యాయీత, కతమం వావ స తేన లోకం జయతి?" ప్ర-5-1. "అయ్యా! మనుజులలో నెవ్వఁడు చనిపోవువఱకు (యావజ్జీవము) నోంకారము నుపాసనము చేయునో యతఁడే లోకమును జయించును?" అని ప్రశ్నించెను. దానికిఁ బిప్పలాదుఁడు "ఓ సత్యకామా! ఓంకారమే పరబ్రహ్మము అపరబ్రహ్మమును. (పరబ్రహ్మము నిర్విశేషము. అపరబ్రహ్మము కార్యబ్రహ్మము) ఈ రెండింటికిని, విష్ణువునకుఁ బ్రతిమవలె ఓంకారము ప్రతీకము. ఓంకారధ్యానముచే మహా నరుఁడు పరాపరబ్రహ్మములలో నొకదానిని బొందును. ఏకమాత్రికము ద్విమాత్రికము నగు నోంకారమునకు వేర్వేఱు ఫలములు చెప్పి త్రిమాత్రికమగు ఓం అను నక్షరముచేఁ బరమపురుషుని ధ్యానించువాఁడు సూర్యలోకమున సూర్యునిఁ బొంది, కుబుసమునుండి పాము విడువఁబడినట్లు సర్వపాపములనుండి విడువఁబడినవాఁడై, ఓంకార తృతీయమాత్రారూపములైన సామములచే బ్రహ్మలోకము పొందింపఁబడును. అచ్చట బ్రహ్మ (హిరణ్యగర్భుని) కన్న పరుఁడైన, పురుషుని జూచును. అనికలదు.

ఇచ్చట ధ్యానముచేయఁదగినదిగా నుపదేశింపఁబడిన బ్రహ్మము పరమా! అపరమా! అనిసంశయము. అపరబ్రహ్మమే యని పూర్వపక్షము రాఁగా సిద్ధాన్తమునకై యీయధికరణము చెప్పఁబడినది.

### ఈక్షతికర్మ వ్యపదేశాత్సః 13.

ఇచ్చట ధ్యాతవ్యుఁడుగాఁ జెప్పఁబడినది-సః = అపర మాత్మయే (పరబ్రహ్మమే) ఎందుచేతననఁగా- ఈక్షతికర్మవ్యపదేశాత్ = దీనితరువాతవాక్యశేషములో ఉపాసకుఁడు బ్రహ్మలోకమునుబొంది హిరణ్యగర్భునికన్నఁ, బరుఁడైన పురుషుని జూచునని చూచుటకుఁ, గర్మగా,బరమపురుషుని జెప్పుట వలన, నిచట ధ్యేయుఁడు పరమపురుషుఁడు (పరమాత్మ)అని సిద్ధాన్తము.

## 5- దహరాధికరణము. (14-21)

అవి ఛాందోగ్యములో భూమవిద్యను చెప్పినతరువాత "అథ యదిద మస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ, దహరోఽస్మి న్నన్తరాకాశః తస్మిన్ యద న్తః తద న్వేష్టవ్యం, తద్వావ విజిజ్ఞాసితవ్యమ్" ఛాం-8-1-1.అనియున్నది.

బ్రహ్మపురమైన (బ్రహ్మకుఁబురమువంటిదైన) యీశరీర మునందు దహరం = సూక్ష్మమైన, పుండరీకం వేశ్మ = తామరపువ్వుఆకారముగల హృదయవేశ్మము (ఇల్లు)

గలదో, ఆహృదయములోపల ఏదహరాకాశముగలదో, ఆహృదయాకాశమునందు లోపల నున్నయతఁడు వెదకఁదగినవాఁడు, తెలిసికోఁదగినవాఁడు, అనియున్నది. ఇందు దహరపుండరీకములో, నేదహరాకాశముగలదో యని చెప్పఁబడినది. ఈచెప్పఁబడినదహరాకాశము, భూతాకాశమా? పరమాత్మా? బ్రహ్మపురమనఁగా శరీరముకనుక తదధిష్ఠాతయైన జీవుఁడా? యని సందేహముకలుగుచున్నది. ప్రసిద్ధవ్యవహారముచే భూతాకాశమనియు, శరీరస్వామియగుటచే జీవుఁడనియు చెప్పవచ్చునని పూర్వపక్షము కలుగఁగా సిద్ధాంతము చేయఁబడుచున్నది.

### దహర ఉత్తరేభ్యః 14

దహరః = ఈశ్రుతియందుఁ జెప్పఁబడిన దహరాకాశపదము పరమాత్మవాచకమే! ఎందుచేతననఁగా, ఉత్తరేభ్యః = ముందువాక్యశేషమునఁ జెప్పఁబడిన హేతువులవలన,

"యావాన్ వా అయమాకాశః తావా నేషో న్తర్హృదయ ఆకాశః, ఉభే అస్మిన్ద్యావాపృథివీ అన్తరేవ సమాహితే, ఏష ఆత్మా అపహతపాప్మా" ఛాం. 8-1-3-5. ఈ బాహ్యాకాశమెంతటిదో యీదహరాకాశమంతటిది. అని భూతాకాశమును దహరాకాశమున కుపమానముగాఁ జెప్పుటచే నీదహరాకాశము భూతాకాశమనుట పొసఁగదు. ఈద్యావాపృథివులు (భూమ్యాకాశములు) రెండును ఈలోపలనున్న

దహరాకాశమునందే యున్నవని భూతాద్యాకాశములకు దహరాకాశము ఆధారమని చెప్పుటయు, ఏష ఆత్మా అపహతపాప్మా = కొట్టఁబడిన పాపములుకల వాఁడు అనఁగా నేవిధమైనపాపములు లేని వాఁడు అని చెప్పుటయు నీ దహరవాక్యోక్తుఁడు జీవుఁడు కాఁడు పరమాత్మయే యని తెలుపుచున్నవి. ద్యావాపృథివ్యాధారత్వము అపహతపాప్మత్వము అనునవి పరమాత్మకే గాని జీవున కుపపన్నములు కావు. పరమాత్మకు శరీరాయతనత్వ ముపాసనార్థము చెప్పఁబడినది కాన నుపపన్నమగును.

గతిశబ్దాభ్యాం తథాహి దృష్టం లింగంచ. 15

పూర్వసూత్రమునందున్న "ఉత్తరేభ్యః" అనుదానికి యిదివివరణము.

గతిశబ్దాభ్యాం, తథా, హి, దృష్టం, లింగం, చ.

గతిశబ్దాభ్యాం = గమనము, బ్రహ్మలోక శబ్దము, అనెడి రెండింటిచేతను, దహరపదవాచ్యుఁడు పరబ్రహ్మ అని యర్థము. "ఇమాః సర్వాః ప్రజాః అహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం న విన్దన్తి" ఛాం-8-3-2 అని దహరవాక్యమునఁ జెప్పఁబడిన పరమాత్మను బ్రహ్మలోకశబ్దముచేత నిర్దేశించి, ప్రజలు (జీవులు) అందఱును ప్రతిదినము ఈ బ్రహ్మను పొందుచున్న వారయ్యును నితని నెఱుఁగరు. అనఁగా సుషుప్తికాలమున జీవులు ప్రతిదినము పరమాత్మను పొందు

దురుగాన, అహరహర్గమనమను గతిచేతను, పరమాత్మను బోధించు బ్రహ్మలోకశబ్దముచేతను, దహరపదవాచ్యుఁడు పరమాత్మయని నిర్ణయము. జీవులు ప్రతిదినము పరమాత్మను పొందుచున్నవిషయము, తథాహిదృష్టం = శ్రుతిలో ఆవిధముగాఁ జూడఁబడినది. "సతా సోమ్య తదా సంపన్నో భవతి" ఛాం. 6-8-1. సుషుప్త్యవస్థయందు సోమ్యుఁడా! జీవుఁడు పరమాత్మను పొందినవాఁడగుచున్నాఁడు, అని చెప్పఁబడినది. లింగంచ = ఈ అహరహర్గమనమే బ్రహ్మలోక పదమునకు బ్రహ్మైవలోకః = బ్రహ్మలోకః, అని సమానాధికరణసమాసము చెప్పవలెనుగాని బ్రహ్మణోలోకః బ్రహ్మలోకః, అని వ్యధికరణసమాసము చెప్పరాదు అనుటలో లింగము = గమకము (హేతువు) బ్రహ్మణోలోకః = బ్రహ్మయొక్క లోకము అని యర్థముచెప్పినచో - అహరహము చతుర్ముఖ బ్రహ్మలోక గమనము సంభవింపదు కాన బ్రహ్మైవలోకః = బ్రహ్మమే యనెడిలోకమును అని యర్థమును చెప్పవలెను. సుషుప్తిలోఁ బరమాత్మను పొందుట యనిభావము.

ధృతేశ్చ మహిమ్నోఽస్యాస్మిన్నుపలబ్ధేః. 17

ధృతేః, చ, మహిమ్నః, అస్య, అస్మిన్, ఉపలబ్ధేః.

ధృతేశ్చ = ధృతివల్లనున్ను, దహరవాక్యమందు పరమేశ్వరుఁడు. ఈప్రకరణమునందే,

"అథ య ఆత్మా స సేతు ర్విధృతి రేషాం లోకానాం అసంభేదాయ" ఛాం. 8-4-1 అని శ్రుతిగలదు. ఆ యాత్మ సేతువు. అసంకీర్ణముగా లోకములనుంచుటకొఱకు విధారకుఁడు, అనఁగా లోకములధరించువాఁడు, అని యర్థము. ఈ లోకవిధారకత్వము పరమేశ్వరునికన్న నన్యునికి సంభవింపదు. అస్యచ మహిమ్నః = ఈ విధారణలక్షణమైన సామర్థ్యమునకు, అస్మిన్నుపలబ్ధేః = ఈ పరమేశ్వరునియందే కనఁబడుటవలన; లోకవిధారణలక్షణమైన యీ సామర్థ్యము పరమేశ్వరునియందే కలదని చెప్పుచున్న "ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి! సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః" బృ. 3-8-9 "ఏష సర్వేశ్వర ఏష భూతాధిపతి రేష భూతపాల ఏష సేతు ర్విధరణ ఏషాం లోకానా మసంభేదాయ" బృ. 4-4-22 అనెడి యీ శ్రుతులప్రామాణ్యమున నిచ్చటిధృతివల్లనుగూడ దహరవాచ్యుఁడు పరమాత్మయే యని భావము.

## ప్రసిద్ధేశ్చ. 17

ఆకాశ శబ్దముకూడ పరమేశ్వరునియందే ప్రసిద్ధమగుటవలన నిచ్చట దహరాకాశపదవాచ్యుఁడు పరమాత్మయే కాని జీవుఁడుకాఁడు. "ఆకాశో వై నామ నామరూపయో ర్నిర్వహితా" ఛాం 8-14. "సర్వాణి, హవా ఇమాని భూతా న్యాకాశాదేవ సముత్పద్యన్తే." ఛాం. 1-9-1, అనుచోట్ల ఆకాశపదము పరమేశ్వరునియందే ప్రసిద్ధముగా నున్నది.

"యావాన్వా అయమాకాశః" ఛాం 8-1-3 అని ఉపమానముగాఁజెప్పఁబడుటవలన నిచ్చటి యాకాశపదార్థము భూతాకాశముగాదని నిరూపింపఁబడినది.

ఇతరపరామర్శాత్ స ఇతిచే న్నాసంభవాత్. 18

ఇచ్చటిదహరాకాశ పదవాచ్యుఁడు జీవుఁడుకాకూడదా! అని మరలఁబ్రశ్నించి, నిరాకరించుచున్నారు.

ఇతరపరామర్శాత్ = "యఏష సంప్రసాదోఽస్మాచ్ఛరీరా త్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య, స్వేన రూపే ణాభినిష్పద్యతే" ఛాం 8-3-4 అనుశ్రుతిలో సంప్రసాదశబ్దముచే జీవునిపరామర్శించుటవలన, స ఇతిచేత్ = ఆదహరపదవాచ్యుఁడుజీవుఁడు అన్నచో, న = కాదు, అసంభవాత్ = అపహతపాప్మత్వాదిలక్షణములు జీవునియందు సంభవింపకపోవుటవలనఁ జీవుఁడుకాఁడని భావము.

ఉత్తరాచ్చే దావిర్భూతస్వరూపస్తు 19

ఉత్తరాత్, చేత్, ఆవిర్భూతస్వరూపః, తు,

పూర్వసూత్రములో — దహరపదవాచ్యుఁడు జీవుఁడనినచో అపహతపాప్మత్వాది లక్షణములతనికి సంభవింపవు కావున నతఁడుపరమాత్మయేయని నిర్ణయింపఁ బడినది. ఇప్పుడు మరల నీసూత్రమున జీవునియందును అపహతపాప్మ

త్వాది గుణములు సంభవించును ఎట్లనగా, ఉత్తరాత్ = దహరవిద్యకు ఉత్తరమునందున్న ప్రజాపతి విద్యవలన, చేత్ = దహరాకాశవాచ్యుఁడు జీవుఁడేయున్నచో, అనిమరల జీవవాదమును టంకించినాఁడు.

ప్రజాపతి విద్యలో, దేవతా ప్రభువైన ఇంద్రుఁడు, రాక్షసప్రభువైన విరోచనుఁడును నాత్మజ్ఞానాపేక్షతో బ్రహ్మ వద్దకు వెళ్లి ముప్పదిరెండుసంవత్సరములు బ్రహ్మచర్యముతో నుండ వారికాత్మజ్ఞాన ముపదేశింపఁదలఁచి ప్రజాపతి "య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి హోవాచ, ఛాం 4-15-1 కంటియందు దేపురుషుఁడు కనఁబడుచున్నాఁడో అతఁడు ఆత్మ అని జాగ్రదవస్థాపన్నుని," య ఏష స్వప్నే మహీయమాన శ్చరతి ఛాం 8-10-1, అని స్వప్నావస్థాపన్నుని, తద్యత్రైతత్సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నం న విజానాతి, ఏష ఆత్మా" ఛాం-8-11-1అని, నిద్రించినవాఁడై సమస్త స్వరూపమునుబొందినవాఁడై ఎవ్వఁడు స్వప్నమునుగూడ నెఱుఁగఁడో అతఁడుఆత్మ, అని సుషుప్త్యవస్థాపన్నుని క్రమక్రమముగాబోధించెను. ఈమూఁడవస్థలను బొందినవాఁడు జీవుఁడే, అజీవునేమఱలమఱలఁబరామర్శించి "ఏతదమృత మేతదభయ మేతద్బ్రహ్మ" ఛాం-4-15-1-అని మఱేనియందు అపహతపాప్మత్వాదికము చెప్పెను. కావున జీవునియందు అపహతపాప్మత్వాదిగుణములు సంభవించును. కావునదహరవాచ్యుఁడు జీవుఁడేయున్నచోఁ గాదు. అని సమాధానమును చెప్పుచున్నారు.

ఆవిర్భూతస్వరూపస్తు = 'తు' అనుదానిచే నాక్షేపపరిహారమును సూచించుచున్నారు. ఇచ్చటజీవుఁడు ఆవిర్భూతస్వరూపుఁడుగా వివక్షించఁబడినాఁడు. కేవలజీవుఁడు వివక్ష చేయఁబడలేదు. "పరంజ్యోతిరుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే" ఛాం-8-12-3. అను ఉపసంహారములోఁ బరమైన జ్యోతిస్స్వరూపమునుబొంది, స్వీయరూపముతో నిష్పన్నుఁడగుచున్నాఁడు" అనిజీవుఁడు పొందెడిపారమార్థికస్థితిని జెప్పుటచే నిచ్చటిజీవుఁ డావిర్భూతస్వరూపుఁడు. జీవమాత్రుఁడుగాఁడు. అందుచే, వెనుకటిసూత్రములోఁజెప్పిన అసంభవాత్, అని చెప్పిన హేతువునకు దోషములేదు.

అన్యార్థశ్చ పరామర్శః - 20.

దహరుఁడీశ్వరుఁడేయైనచో "ఏషసంప్రసాదః" ఛాం-8-3-4. అనిజీవుని బరామర్శించుట వ్యర్థముకాదాయనఁగా, చెప్పుచున్నారు- పరామర్శః = ఏషసంప్రసాదః అని జీవుని బరామర్శించుట, అన్యార్థః = ముందు పొందఁదగిన" పరంజ్యోతిరుపసంపద్య" అని చెప్పినట్లు, పరమాత్మపరమైనది.

అల్పశ్రుతేరితిచేత్తదుక్తమ్. 21

అల్పశ్రుతేః-ఇతి-చేత్-తత్-ఉక్తమ్-

"దహరోఽస్మిన్నన్తరాకాశః" అని చెప్పినదహరాకాశము, సూక్ష్మమైనది. దహరమనఁగా సూక్ష్మము, అల్పము,

అనియర్థముకదా, పరమాత్మబోధకముగా దానినిచెప్పుట కంటె అదిజీవబోధకమనుటయే యుచితము, అనుఅభిప్రాయ ముతోఁ బ్రశ్నించుచున్నారు.

అల్పశ్రుతేరితిచేత్ = అల్పత్వశ్రుతివలన (దహార = సూక్ష్మము, అని చెప్పుటవలన) నిదిపరమాత్మవాచకముకాద న్నచో, తత్ = అది = దానిసమాధానము, ఉక్తం = చెప్పఁబడినది. వెనుక – "అర్భకౌకస్త్వాత్ తద్వ్యపదేశాచ్చ" అనుబ్రహ్మ. 1-2-7వ సూత్రమువద్ద, ఉపాసనార్థమై యౌపాధి కమైన అల్పత్వము, ఈశ్వరునియందును సంభవించును. అని చెప్పఁబడినది. కనుక దహరాకాశము పరమాత్మయనియే ఉపాసింపఁదగును, అనిసిద్ధాన్తము.

### 6 అనుకృత్యధికరణము. (22-23)

అవ॥ "పరంజ్యోతి రుపసంపద్య" అనువాక్యార్థమును విచారణచేయు ప్రసంగములో "తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః" అను పరజ్యోతిష్ట్వసాధకమగు ముండకోపనిషచ్ఛ్రుతి విచారణచేయఁబడుచున్నదని వెనుకటియధికరణముతో, ప్రసం గసంగతికలదు.

"ముండకోపనిషత్తులో, నతత్ర సూర్యోభాతి నచంద్ర తారకం, నేమా విద్యుతో భాన్తి కుతోఽయ మగ్నిః,

తమేవ భాన్త మనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి" ముండక (2-2-10) ఇచ్చట తత్రఅనునది విషయ సప్తమి. కావున ఆ బ్రహ్మవిషయములో, సూర్యుఁడు ప్రకాశింపఁడు, చంద్రనక్షత్రములు ప్రకాశింపవు, ఈ విద్యుత్తులు (మెఱుపులు) ప్రకాశింపవు, ఇక నీయగ్ని యెట్లుప్రకాశించును? ప్రకాశించుచున్నయతని ననుసరించి సర్వము ప్రకాశించుచున్నది. అతనికాంతిచేతనే యీసర్వము ప్రకాశించుచున్నది. అని చెప్పఁబడినది.

ఇందు సూర్యాదిజగద్భాసకముగాఁ బ్రకాశించునది యేదైన తేజోవిశేషమా? పరబ్రహ్మమా? అని సందేహము. ప్రకాశించుటయనునది తేజోధర్మము. ప్రబలమైన తేజముచే దుర్బలమైన తేజము నిరాకరింపఁబడినట్లు ప్రబలమగు తేజోవిశేషముచే సూర్యాదులు నిరాకరింపఁబడినట్లు చెప్పవచ్చును గాన, నిందు జగద్భాసకముగాఁ బ్రకాశించునది తేజోవిశేషమేయని పూర్వపక్షము కలుగ నీయధికరణ మారంభింపఁబడినది.

### అనుకృతేస్తస్య చ. 22

ఈశ్రుతిలో సూర్యాదిజగద్భాసకముగాఁ దోఁచునది పరబ్రహ్మమే. ఎందుచేతననఁగా, అనుకృతేః = అనుకరించుటవలన, అనఁగా "తమేవభాన్త మనుభాతి సర్వం"అని

ప్రకాశించుచున్న యతని ననుసరించి సర్వము ప్రకాశించు
చున్నదని చెప్పుటచే నిది తేజోవిశేషముకాదు. పర
బ్రహ్మమే అని సిద్ధాన్తము.

సూర్యుఁడు ప్రకాశించుచుండఁగా ఘటము మొదలగు
వస్తుసముదాయము ప్రకాశించును. ఘటాదికముచే సూర్యుఁడు
ప్రకాశింపఁడు. అట్లే బ్రహ్మప్రకాశ్యులగు సూర్యాదులచే
బ్రహ్మము ప్రకాశింపదు. తప్తాయఃపిండగతమగు దాహక
త్వము ఎట్లువహ్నిగతమో అట్లే సూర్యాదిగతమగు ప్రకాశ
మును బ్రహ్మగతమే. స్వయంప్రకాశముగా భాసించు చైతన్య
మును (బ్రహ్మము) అనుసరించి సూర్యాదికము భాసించు
చున్నది.

ఈసూత్రములో తస్యచ, అనుమాటకు, "తస్య భాసా
సర్వమిదం విభాతి" అనియర్థము. అతని కాంతిచేతనే సర్వము
భాసించుచున్నది. చైతన్యముగల బ్రహ్మము సర్వజగద్భాసక
మనుట కుదురును. ఈశ్రుతిలోని 'తత్ర, అనుచోట నున్న
తచ్ఛబ్దము ప్రకృతమగు "హిరణ్మయే పరేకోశే విరజం
బ్రహ్మ నిష్కలం, తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్య
దాత్మవిదో విదుః" అను, ముం 2-2-9 శ్రుత్యుక్తచైతన్య
గ్రాహకమనుట యుక్తము.

## అపిచ స్మర్యతే 23

ఈ విషయము స్మృతిలోఁగూడ స్మరింపఁబడుచున్నది. భగవద్గీతలో — 15-6 మరియును శ్రీకృష్ణవాగంశా విష్కరణములో —

పరిశీలింపఁగ నాపదమ్ము మఱి యుద్భాసింపఁగాఁ జేయఁజా
లదు సూర్యుండు శశాంకుఁ డగ్నియును నారా! యెట్టిదో!
కంటె! పొం
దిరి యేస్థానముఁ బొందువారు పునరావృత్తిం గనంబోరొ, ఆ
పరమోత్కృష్టపదంబు నాదియగుమీ! పాండుక్షితీ
శాత్మజా!

## 7 ప్రమితాధికరణము. (24-25)

కఠవల్లిలో — "అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి, ఈశానో భూతభవ్యస్య స ఏవాద్య స ఉ శ్వః ఏతద్వై తత్, కఠ, 2-4-12

నచికేతుఁడు యముని "ధర్మాధర్మములకంటె నతిరిక్తముగ కృతాకృతములకంటె నతిరిక్తముగ, భూతభవ్యములకంటె నతిరిక్తముగ దేనిని జూచుచుంటివో దానిని నాకుఁ జెప్పుము, అనియడిగెను. అతనిప్రశ్నకు సమాధానము చెప్పుచు యముఁడిట్లు చెప్పెను. అంగుష్ఠమాత్రుఁడు = చేతి బొటనవ్రేలంతపరిమాణముగల పురుషుఁడు శరీరమధ్యమున

నున్నాఁడు. అతఁడు భూతమునకు భవ్యమునకు నంతకు నీశ్వరుఁడు, అతఁడే యిప్పుడు రేపును నున్నవాఁడు, నీవడిగినది ఇదియే. అనిచెప్పెను. ఈ చెప్పిన సమాధానవాక్యములోని అంగుష్ఠమాత్రపురుషుఁడు జీవుఁడా! ఈశ్వరుఁడా? అనిసందేహము. ఈశ్వరునికి అంగుష్ఠపరిమాణత్వము సంభవింపదు గాన నీపురుషుఁడు జీవుఁడు అని పూర్వపక్షము కలుగుచుండ నిందుసిద్ధాన్తము చేయఁబడుచున్నది.

శబ్దాదేవప్రమితః 24

ప్రమితః = అంగుష్ఠ పరిమితుఁడైన యీపురుషుఁడు, శబ్దాదేవ = "ఈశానోభూతభవ్యస్య" అను ఈశాన శబ్దము వలననే ఈశ్వరుఁడు కాని జీవుఁడుకాఁడు. అని సిద్ధాన్తము. జీవున కీశ్వరత్వము, భూతభవ్యముల కీశితృత్వము, కుదురదు.

హృద్యపేక్షయాతు మనుష్యాధికారత్వాత్ 25

ఈశ్వరుఁడు సర్వగతుఁడుగదా అతఁడంగుష్ఠమాత్రుఁ డనుటెట్లు? అనఁగా,

హృద్యపేక్షయాతు = ఈశ్వరుఁడు సర్వగతుఁడైనను అంగుష్ఠపరిమాణముకల హృదయ దేశావచ్ఛిన్నుఁ డగుటచే అంగుష్ఠమాత్రత్వము సంభవించును. హస్తిమశకాది శరీరములందు హృదయము అంగుష్ఠమాత్రముగా నియతమై యుండదే యనిన, మనుష్యాధికారత్వాత్ = శాస్త్రము

మనుష్యులను నుద్దేశించి చెప్పఁబడినది కావున మనుష్యహృదయ మంగుష్ఠపరిమితమనుటలో విరోధములేదు. శాస్త్రము మనుష్యాధికారమని 6-1-8 జైమినీయసూత్రమునఁ దిర్యగధికరణములోఁ జెప్పఁబడినది.

### 8. దేవతాధికరణము. (26-33)

శాస్త్రము మనుష్యాధికారమని చెప్పుటచేఁ దత్ప్రసంగసంగతిగా నీయధికరణము చెప్పఁబడుచున్నది. బృహదారణ్యకములో -"తద్యో యో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్ తథర్షీణాం, తథా మనుష్యాణామ్" (1-4-10. బృ.దా) దేవతలలో నేయే దేవుఁడు పరబ్రహ్మమును దెలిసికొనెనో అతఁడే పరబ్రహ్మ మాయెను. అట్లే ఋషులలోను మనుష్యులలోను అని చెప్పఁబడినది. ఇందు దేవతలకు బ్రహ్మవిద్యాధికారమున్నదా! లేదా! అనిసందేహము కలుఁగ, శాస్త్రము మనుష్యాధికారము కావున దేవతలకు బ్రహ్మవిద్యాధికారము లేదు. అని పూర్వపక్షము రాఁగా, నిందు సిద్ధాన్తము చేయఁబడుచున్నది.

**తదుపర్యపి బాదరాయణ స్సంభవాత్. 26**

తదుపరి + అపి = తత్ = ఆమనుష్యుల యొక్క, ఉపరి = పై భాగమునందున్న యే దేవతలుగలరో, అపి = వారికిన్ని, బ్రహ్మవిద్యాధికారము కలదు అని, బాదరాయణః =

బాదరాయణాచార్యులు, (వ్యాసులు) తలంచుచున్నారు. ఏమన! సంభవాత్ = దేవతలు పరాభోగశాలులైనను, భోగ్యవస్తువులందనిత్యత్వమును జూచుటచే వైరాగ్యమున్ను, నిరతిశయానంద మోక్షార్థిత్వమున్ను సంభవించుటవలన వారికిని బ్రహ్మవిద్యాధికారము కలదని యభిప్రాయము.

విరోధః కర్మణీతిచే న్నానేకప్రతిపత్తే ర్దర్శనాత్. 27

శరీరము లేనిచే బ్రహ్మవిద్యాధికారములేదు కనుక దేవతలకు బ్రహ్మవిద్యాధికారమున్నదన్నచో శరీరమున్నదనియు, నంగీకరింపవలెను. అట్లు విగ్రహవత్త్వమును (శరీరముకలిగియుండుటను) అంగీకరించినచో, మానవులుచేయు పశుపురోడాగాది కర్మములందు అన్నిట నొకేపర్యాయము, ఋత్విజులవలె దగ్గఱకువచ్చియే హవిర్భాగములను గ్రహింతురు. అట్లుకనంబడుటలేదు. కనుక కర్మణి = యజ్ఞాదికర్మమునందు, విరోధః ఇతిచేత్ = విరోధము కలుగుచున్నది, అనియన్నచో, న = విరోధములేదు. ఎందువలన? అనఁగా, అనేక ప్రతిపత్తే ర్దర్శనాత్ = అనేక ప్రతిపత్తి కనఁబడుటవలన, అనఁగా, ఒకదేవుఁడు ఒకేపర్యాయము అనేకశరీరములను బొందినట్లు వేదములోఁ గనఁబడుచున్నది. యాజ్ఞవల్క్యుని శాకల్యుఁడు, దేవతలెందఱు అని ప్రశ్నింప నాతఁడు ముప్పదిమూఁడువేల ముప్పదిమూఁడు వందలు అనిసమాధానము చెప్పెను. మఱల నాతఁడు, వారె

స్వరూప అయినను గ, దేవతలు ముప్పదిమూగ్గురే. మిగిలిన వీరందఱు వారిమహిమలనను. దీనిచే నొక్కొక్క దేవత కనేక రూపత్వము గన్పడుచున్నది. పెక్కు రూపములు దాల్చి పెక్కు స్థలములం దొక్క పర్యాయమే హవిస్సు గ్రహింతురు గాన కర్మ విరోధము లేదు. 'లేదా' ఒకండొకే పర్యాయము పదిమందిచే భుజింపంజేయంబడలేక. కాని పదిమందిచే నమస్కరింపబడం గలండు. అట్లే శరీరమైన యొక దేవత నుద్దేశించి పెక్కుమంది యొకే పర్యాయము హవిర్ద్రవ్యములను విడువవచ్చును. కనుక కర్మవిరోధము లేదు.

శబ్ద ఇతి చేన్నాతః ప్రభవాత్ ప్రత్యక్షానుమానాభ్యామ్. 28

మునుపటి సూత్రముచే కర్మణివిరోధము పరిహరింపబడి నది. కాని, శబ్ద ఇతి చేత్: శబ్దమునందు విరోధము కలుగు చున్నది. ఎట్లనగా వేదము, నిత్యము, దేవతావిగ్రహములు అన్నవాది న్యాయముచే అనిత్యములు, నిత్యవేదమునకు అని త్యశరీరములగల దేవత యర్థమన్నచో, శబ్దమున కర్థముతో నిత్యసంబంధము లేదు కనుక నిత్యానిత్య సంయోగ విరోధము కలుగును. అన్నచో, న = అవిరోధము లేదు. ఎందుచేత? అతః ప్రభవాత్ = నిత్యాకృతి వాచకమైన యీ వేదము నుండియే దేవాదులు పుట్టుటవలన, వేదమునుండి దేవతాదులు పుట్టినట్లు ప్రమాణముగలదా? అనిన, ప్రత్యక్షానుమా

నాభ్యాం = శ్రుతిస్మృతులు గలవు. వానివలనఁ దెలియు చున్నది. ప్రత్యక్షమన శ్రుతి, అనుమానమనఁగా - స్మృతి.–

శ్రుతి – "ఏత ఇతి వై ప్రజాపతిర్దేవా నసృజత అసృగ్ర మితి మనుష్యాన్ ఇందవ ఇతి పితౄన్" అనియు, స్మృతి–అనాది నిధనా నిత్యా వాగుత్సృష్టా స్వయంభువా ఆదౌ వేదమయీ దివ్యా యతస్సర్వాః ప్రవృత్తయః" "నామరూపంచ భూతానాం కర్మణాంచప్ర వర్తనమ్ వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః–" అనియును. ఇట్టిశ్రుతిస్మృతుల వలన సృష్టి వేదశబ్దప్రభవమని తెలియుచున్నది. గవాది శబ్దము లెట్లు నిత్యాకృతివాచకములో యట్లే వైదికశబ్దము లును నిత్యాకృతివాచకములు కావ నిత్యశబ్దముల కనిత్యార్థ ములతో సంబంధము కలుగుచున్నదనెడి శబ్దవిరోధమును లేదు.

అత ఏవ చ నిత్యత్వమ్. 29

అత ఏవ చ=నిత్యమగు ఆకృతి శబ్దార్థముకనుకనే, నిత్య త్వం = వేదమునకు నిత్యత్వముపపన్నము.

సమాన నామరూపత్వాచ్చావృత్తావప్యవిరోధో
దర్శనాత్ స్మృతేశ్చ. 30

శబ్దమునకు (పదమునకు) ఆకృతియే యర్థమైనను ప్రళ యమునందు సర్వాకృతివ్యక్తులు నశించుటచే మరలఁ దరా

కృతివ్యక్తులే పుట్టుచునుండుటలోఁ బ్రమాణములేదు గాన, పైనఁ జెప్పిన నిత్యానిత్యసంయోగవిరోధము అట్లేయున్నదనిన

సమాన నామరూపత్వాచ్చ = ప్రళయమందు నశించినను మఱలఁ బుట్టుటలో సమానమైన నామరూపములే కలవి యగుటవలన. ఆవృత్తావపి = సృష్టిప్రళయముల ఆవృత్తి (మఱలమఱలవచ్చుట) యుండినను, అవిరోధః=విరోధములేదు. అనఁగా ప్రళయములో నశించుటయున్నది నిరన్వయధ్వంసము గాదు. సంస్కారావశేషమైననాశము. సంస్కారము అనాది. కావునఁ బ్రతిసృష్టియుండును. ఆయాకృతి కలదియేపుట్టును గాని విలక్షణముగాఁ బుట్టదు. అందుచేత మఱలఁబుట్టినది పూర్వసమాన నామరూపము కలదికనుక, సృష్టిప్రళయావృత్తులు కలిగినను విరోధములేదు. సమాననామరూపత్వము నంగీకరించుటకు, దర్శనాత్ = శ్రుతికనఁ బడుటవలన, స్మృతేశ్చ = స్మృతియుండుటవల్లను బాధకములేదు.

శ్రుతి - "సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్, ఋ. సం. 10 - 190.3 స్మృతి - యథర్తుష్వృతులింగాని నానారూపాణి పర్యయే. దృశ్యన్తే తాని తాన్యేవ తథాభావా యుగాదిషు"

మధ్వాదిష్వసంభవాదనధికారం జైమినిః 31।

ఇదిశంకాసూత్రము —

మధ్వాదిషు = మధువిద్య మొదలగు విద్యలందు, అసం

భావాత్ = అధికారము సంభవింపదుగాన, జైమినిః = జైమిన్యాచార్యుఁడు, అనధికారం = దేవతలకు బ్రహ్మవిద్యయందు అధికారము లేకపోవుటను. తలంచుచున్నాఁడు అనియర్థము.

ఛాందోగ్యమున – "అసౌ వా ఆదిత్యో దేవమధు" 3. 1.1. అని ప్రారంభించి మధువిద్య నుపదేశించెను. ఈసూర్యుఁడే దేవతలకు మధువు. – దేవతలను సంతోషపెట్టుటవలన మధువువంటివాఁడు కనుక మధువు. (తేన) అని ఆదిత్యోపాసన చెప్పఁబడినది. ఈమధువిద్యయందు ఆదిత్యున కధికారము లేదు. అందాదిత్యుఁడే ఉపాస్యుఁడుగాన అతని నుపాసనచేయుట కాదిత్యున కధికారము లేదు. ఒకనికే ఉపాస్యోపాసకత్వము సంభవింపదు. మధువిద్యయం దాదిత్యునకధికారము లేదు, బ్రహ్మవిద్యయందు దేవతల కధికారమున్న, దన్నచో విద్యాత్వసామాన్యముచే మధువిద్యయందును నధికారముండును. అందు అధికారము లేదుగాన బ్రహ్మవిద్యయందును వారికధికారము లేదు.

## జ్యోతిషి భావాచ్చ 32

జ్యోతిషి = సూర్యచంద్రాది దేవశబ్దములకు జ్యోతిస్సునందు అనఁగా, గానఁబడు సూర్యచంద్రమండలములందు, భావాత్ = ప్రయోగము, వ్యవహారము నుండుటవలన, మండలము అచేతనముగావున విగ్రహవత్త్వముగాదుకనుక, ఇక్క

వాయువు, అగ్నియును మండలములే యగుటచేతను, చేతనధర్మమగు సామర్థ్యము లేమికతనను అర్థవాదలకు స్వార్థమునందుఁ బ్రామాణ్యములేదు కనుకను, దేవతలకు విగ్రహవత్త్వమును లేదు. బ్రహ్మవిద్యయందధికారమునులేదు. అని జైమినితలంచుచున్నాఁడు.

భావన్తు బాదరాయణోఽస్తి హి. 33

బాదరాయణస్తు = బాదరాయణాచార్యుఁడయితే, భావన్తు = బ్రహ్మవిద్యయందు దేవతల కధికారముండుటను దలంచుచున్నాఁడు. దేవతామిశ్రోపాసనలయం దధికారము లేదుగాని నిర్గుణబ్రహ్మవిద్యయందు దేవతలకున్ను అధికారము కలదు. ఒకచోట అధికారములేదని సర్వత్ర అధికారము లేకపోదు. రాజసూయమున లేకున్నను బ్రాహ్మణునికి జ్యోతిష్టోమమునం దధికారముకలదు.

సూర్య చంద్రాది దేవతాశబ్దములు మండలములందుఁ బ్రయోగింపఁబడుచున్నను, తదభిమాన దేవతాపరములై, ఆయా దేవతాస్వరూపమునే తెలుపుచున్నవి. దేవతలకు ఐశ్వర్యయోగమువలన జ్యోతిస్స్వరూపమున నుండుటకు, శరీరము ధరించివ్యవహరించుటకును సామర్థ్యముకలదు. ఇట్లు చెప్పుటకు, అస్తిహి = ప్రమాణముకలదు. సుబ్రహ్మణ్యార్థవాదములో "మేధాతిథేర్మేష" అని, కాణ్వాయనుఁడగు మేధాతిథిని ఇంద్రుఁడు మేషమై హరించెను. అని షడ్వింశబ్రా. 1-1.లోఁ గలదు. సూర్యుఁడు పురుషరూపము పొందినవాఁడై కుంతి

దేవిని బొందెను. అని స్మృతిలో గలదు. అచేతనములయిందును, మృదబ్రవీత్ = మట్టిపలికినది. ఆపోఽబ్రువన్ = జలములు పలికినవి. అని తదధిష్ఠాన దేవతలు చెప్పఁబడుచున్నవి. ఇవి యర్థవాదములుకదా స్వార్థమునందు వీనికిఁ బ్రామాణ్యము లేదు. అనినచో — అర్థవాదములకును, శబ్దశక్తిచే లభించిన యర్థమునకు బాధకము లేనప్పుడు ప్రామాణ్యము కలదు. వేదమూలకములైన స్మృతీతిహాస పురాణాదులవలన దేవతలకును విగ్రహవత్త్వము అర్థిత్వము ఉన్నట్లు తెలియుచున్నది కనుక దేవతలకును బ్రహ్మవిద్యయందధికారము కలదు. అని బాదరాయణుని సిద్ధాన్తము.

## 9 అప శూద్రాధికరణము. (34-38)

వెనుకటి దేవతాధికరణములో మనుష్యాధికారాపవాదముగ దేవతలకు బ్రహ్మవిద్యాధికారము కలదని నిరూపింపఁబడినది. ఇట్లే ద్విజాత్యధికార నియమాపవాదముగ శూద్రులకును అధికారము కలదాయని దృష్టాన్తసంగతిగా నీయధికరణ మారంభింపఁబడినది.

ఛాందోగ్యములో చతుర్థాఽధ్యాయములో నొకకథ కలదు. జానశ్రుతియను నొకరాజు గలఁడు. అతని కతిథులన్న ప్రేమ, మంచియన్నదాత, సద్గుణములుకలవాఁడు. అతని గుణగణములకు సంతోషించినవారై దేవర్షులు హంసరూపమున వేసవికాలములో నొకనాఁటిరాత్రి మేడపైఁబరుండియున్న యా

రాజుపైఁ బిండుగట్టి వెడలసాగిరి. అందు ముందువెళ్ళుచున్న హంసనుజూచి వెనుక వెళ్ళుచున్న యొకహంస, ఓభల్లాక్ష! భల్లాక్ష! ఆకాశమునావరించియున్న యీజానశ్రుతిమహారాజయొక్క తేజస్సుకనఁబడుటలేదా! అదికాల్చివేయును. దానిని దాటిపోరాదు. అనిపలికెను. భల్లాక్ష! అన్నది భద్రాక్షయను దానికి వెక్కిరింతమాట. ముందికన్నులుండియుఁ, జూచుకొనకుండ, బోవుచుంటివేమి యని పరిహాసముగఁ బలికెను. ముందుఁబోవుచున్న యీహంస, యీమాటవిని, ఆ,వీని అల్పుఁడైన యీజానశ్రుతిని మహాతేజశ్శాలియైన భగవంతుఁడగు రైక్వునివలెఁ జెప్పుచున్నావు." అనెను. బ్రహ్మజ్ఞానియగు రైక్వునివలన నీజానశ్రుతి బ్రహ్మవిద్యనేర్చుకొని ధన్యుఁడగావలెనను నభిప్రాయముతో హంసరూపులైన మును లిట్లుసంభాషించిరి.

మేడపై యంతస్తుమీఁదఁ బరుండియున్న జానశ్రుతి వారల మాటలువిని రైక్వుఁడు తనకంటెఁ జాలగొప్పవాఁడనుకొని తనయల్పత్వమునకు దుఃఖించి యారాత్రి యెట్లోగడిపి తెల్లవారుఁగనే రథసారథిని బిలిచి రైక్వుఁ డెచ్చటనున్నాఁడో వెదకి నాకుఁజెప్పుమని యాదేశించెను. అతఁ డెట్లో రైక్వుని వెదకిపట్టుకొని జానశ్రుతికిఁ జెప్ప నాతఁడు కొన్నిగోవులను సాశ్వముగురథమును, హారములను దీసికొనివెళ్ళి రైక్వునిదర్శించి అయ్యా! ఈగోవులను రథమును హారములను దీసికొని

నాకు బ్రహ్మవిద్యను దెల్పుము అనియడిగెను. అప్పుడా రైక్వుఁడు జానశ్రుతినిజూచి, ఓరిశూద్రుఁడా! ఈహారములు రథములు గోవులు నీవేయుంచుకొనుము నాకెందులకు? అనెను. "అహహారే త్వా శూద్ర! తవైవ సహ గోభిరస్తు" ఛాం-4-2-3-. ఇది యీయధికరణమునకు విషయవాక్యము.

ఇందు శూద్రునికి బ్రహ్మవిద్యయం దధికారమున్నదా? లేదా? అనిసందేహము. బ్రహ్మవిద్యార్థిత్వము సంభవించుట వలన. కర్మాధికారము లేకపోయినను దేవతలకువలె బ్రహ్మవిద్యాధికారముండవచ్చును. రైక్వుఁడు బ్రహ్మవిద్యార్థియైవచ్చిన జానశ్రుతిని శూద్రఅని సంబోధించి నీగోవులను నీవే యుంచుకొనుము. బ్రహ్మవిద్య యిట్టియుపాయనములతోఁ దెప్పునదికాదు, అనిచెప్పెను. శూద్ర అని సంబోధించుటచే నతనికిని విద్యయందధికారమున్నదని పూర్వపక్షము కలుగ, దానివివారించి సిద్ధాన్తముచేయుట కీయధికరణ మారంభింపఁబడినది.

శూద్రునకు నుపనయనాధికారము లేదు. ఉపనయనము లేనిచో వేదాధ్యయనము లేదు. వేదాధ్యయనములేకపోవుటచే, వేదాన్తవిచారసాధ్యమగు బ్రహ్మవిద్యయందధికారములేదు. పైవిషయవాక్యమునందు శూద్రశబ్దమునకు శూద్రుఁడని యర్థము కాదు.

శుగస్య తదనాదరశ్రవణాత్ తదాద్రవణాత్
సూచ్యతే హి. 34

శుక్, అస్య, తదనాదరశ్రవణాత్, సూచ్యతే, హి.

జానశ్రుతి క్షత్రియుఁడు, ఇతనిని శూద్ర! అని సర్వజ్ఞుఁడగు రైక్వుఁడు సంబోధించెనుగాన ఈశూద్రపదము యౌగికముగాని రూఢముకాదు. దీనికి శూద్రుఁడా అని యర్థము కాదు. ఏమియర్థమనిన - తత్ + అనాదరశ్రవణాత్ = అహంసలయొక్క, అనాదరసూచక వచనమును వినుటవలన, అస్య = ఈజానశ్రుతికి శుక్ = విచారము, కలిగెను అనియభిప్రాయము, తదా = అప్పుడు, ద్రవణాత్, రైక్వునుద్దేశించి వెళ్ళుటవలన జానశ్రుతిరాజునకు విచారముకలిగినదను నర్థము ఈశూద్ర శబ్దముచే, సూచ్యతేహి = సూచింపఁబడుచున్నదికదా! అనఁగా "శుచా ద్రావకః" విచారముతోఁ బరుగిడివచ్చెను, అనునర్థమును సూచించుటకై ప్రయోగింపఁబడినది. కాని ఈపదము శూద్రపరముకాదు. కాన దీనిఁబట్టి శూద్రునకు బ్రహ్మవిద్యాధికారములేదు.

క్షత్రియత్వగతేశ్చోత్తరత్ర చైత్రరథేన లింగాత్. 35
జానశ్రుతి శూద్రుఁడే అని చెప్పరాదు. అనిన

ఉత్తరత్ర = ముందు సంవర్గవిద్యా వాక్యశేషములో, క్షత్రియత్వగతేశ్చ = జానశ్రుతి క్షత్రియుఁడని తెలియుట

వలన నతఁడు శూద్రుఁడు కాఁడు. ఎట్లు తెలియుచున్నది అనిన, చైత్రరథలింగమువలనఁ దెలియుచున్నది. సుప్రసిద్ధ క్షత్రియుఁడైన చైత్రరథునితో అభిప్రతారియను క్షత్రియునికి, అభిప్రతారితో జానశ్రుతికి సమభివ్యాహార ముండుట చేతను సజాతీయులకే సమభివ్యాహారము సముచితము గనుకను చైత్రరథ సమభివ్యాహార (కలిసి చెప్పుట) లింగము వలన జానశ్రుతి క్షత్రియుఁడు.

సంస్కార పరామర్శాత్ తదభావాభిలాపాచ్చ. 36

సంస్కార పరామర్శాత్ = "తం హోపనిన్యే" "అధీహి భగవః" ఛాం. 7-1-1 మొదలగు వాక్యములచే విద్యాస్థానములయందు, ఉపనయనసంస్కారమును బరామర్శించుటవలన. ఆసంస్కారము లేని శూద్రునకు బ్రహ్మవిద్యాధికారము లేదు. తదభావాభిలాపాచ్చ = శూద్రున కుపనయన సంస్కారములేదని చెప్పుటవలన నతని కాసంస్కారమును లేదు. "నశూద్రే పాతకం కించిత్ నచసంస్కార మర్హతి" శూద్ర శ్చతుర్థోవర్గ ఏకజాతిః" అని అతనికి భక్ష్యాభక్ష్య విభాగాభావ కృతమైన పాతకముకాని సంస్కారముకాని లేదు. అతఁడేకజాతి యని చెప్పఁబడినది.

తదభావనిర్ధారణేచ ప్రవృత్తేః. 37

తదభావ = శూద్రత్వాభావముయొక్క, నిర్ధారణేచ = నిర్ణయమునందు, ప్రవృత్తేః = విద్యోపదేశప్రవృత్తి

యుండుటవలన, శూద్రునకు బ్రహ్మవిద్యోపదేశాధికారము లేదు.

జాబాలుఁడను నొకబాలుఁడు గురూపసదనముచేసి విద్యఁబడయుఁదలచి గౌతమునొద్దకు వెళ్లి "అయ్యా! తమవద్ద బ్రహ్మచర్యము చేయుదును. నన్ననుగ్రహింపుఁడు" అని కోరెను. "నీగోత్రమేమి? అనిగౌతముఁ డతనినడిగెను. అంత నతఁడు "ఏమిగోత్రమో నాకుఁదెలియదు. మాతండ్రి చని పోయినాఁడు, మాతల్లినడిగితిని. ఆమెయు గోత్రము తెలియ దని చెప్పినది. అని సత్యకాముఁడను జాబాలుఁడుపలికెను. అతఁడు యథార్థము చెప్పుటచే నితఁడు బ్రాహ్మణుఁడే యగును. అబ్రాహ్మణుఁడైనచో నిట్లు నిశ్చయముగా సత్యమును జెప్పఁ లేడు, అనితలఁచి శూద్రత్వాభావమును నిర్ణయించి గౌతముఁ డాతనికుపనయనముచేసి విద్య చెప్పెను.

శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ స్మృతేశ్చ. 38

వేదశ్రవణాధ్యయనాదులను శూద్రునకు నిషేధించుటవలన, స్మృతివలనను, శూద్రునకు అధికారములేదు.

10 కంపనాధికరణము. (39)

అవ॥ ప్రాసంగికమగు ప్రస్తావమునుముగించి ప్రకృతమగు వాక్యార్థవిచారమును బ్రారంభించుచున్నారు. కఠవల్లిలో.

"యదిదం కించ జగత్సర్వం ప్రాణఏజతినిస్సృతమ్,
మహద్భయం వజ్రముద్యతం యఏతద్విదురమృతాస్తేభవన్తి
కఠ 2-6-2 అని యున్నది.

ఉత్పన్నమైన ఈసమస్త జగమును నిమిత్తమైనప్రాణముగలిగియుండఁగనే కంపించుచున్నది = చలించుచున్నది. ఉద్యతమైన వజ్రమువలె భయహేతువైన యీప్రాణమును నెవ్వరెఱుంగుదురో వారమరణరహితులగుచున్నారు.

ఇచ్చటప్రాణము ప్రాణమా? వజ్రశబ్దమువలన వజ్రాయుధమా? లేకపరమాత్మయా! అనిసంశయము. వజ్రశబ్దము వలన అశనియని పూర్వపక్షము కలుగ, సిద్ధాన్తమునకై యీయధికరణము ప్రారంభింపఁబడినది.

కమ్పనాత్. 39

"శబ్దాదేవ ప్రమితః" అనుసూత్రము మండూకప్లుతిగా నిచ్చటకనువృత్తివచ్చును. ఇచ్చటి ప్రాణశబ్దవాచ్యుఁడు పరమాత్మయేఅని శబ్దమువలన, ప్రమితుఁడగుచున్నాఁడు - ఎందుచేతననఁగా, కంపనాత్ = కంపనమువలన, అనగా "ప్రాణ ఏజతి నిస్సృతమ్" అనుచోటనున్న "ఏజతియన్నది ఏజృధాతువునుండి వచ్చినరూపము. ఆధాతువునకుఁ గంపింపఁజేయుట అనఁగా చేష్టకలదిగాఁజేయుట యనియర్థము ఈసర్వజగమును అనుటలో ప్రాణవాయువుకూడకలఁడు. అతనినిఁ గూడఁ

గంపింపఁజేయువాఁడని యర్థమగుచున్నది. అందుచేఁ బ్రాణపదమునకు మామూలుగాఁ బ్రాణవాయువని వజ్రమని యర్థము కాదు. పరమాత్మయని యర్థము పరమాత్మయందును బ్రాణశబ్దమువిరుద్ధముకాదు. "అమృతా స్తే భవన్తి" అని యమృతత్వసిద్ధి పరమాత్మయనినప్పుడే కుదురును.

## 11 జ్యోతి రధికరణము. (40)

పూర్వాధికరణములోఁ బ్రాణశబ్దము ప్రకరణమువలన బ్రహ్మపరమని నిర్ణయింపఁబడినది. ఇముందుఁజెప్పఁబోవు విషయవాక్యములో జ్యోతిశ్శబ్దమును బ్రహ్మపరముగా నిర్ణయించుటకు అట్టి ప్రకరణములేదు. అని ప్రత్యుదాహరణసంగతిగా నీయధికరణము చెప్పఁబడుచున్నది.

ఛాందోగ్యములోఁ బ్రజాపతివిద్యయందు "యఏష సంప్రసాదోఽస్మాత్ శరీరా త్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే, స ఉత్తమఃపురుషః,
ఛాం 8-12-3

సంప్రసాద శబ్దమునకు, సుషుప్తియనియర్థము. (సంప్రసీదత్యస్మిన్ = దీనియందుఁబ్రసన్నుఁడు = నిర్మలుఁడు అగుచున్నాఁడు, అని) అయినను సుషుప్తికల జీవుఁడనిలక్షణచే నర్థము చెప్పవలెను. ఏయీజీవుఁడు ఈశరీరమునుండి లేచి ఉత్కృష్టమైన జ్యోతిస్సునుబొంది స్వీయరూపముతో నిష్పన్నుఁడగుచున్నాఁడో అతఁడుత్తమపురుషుఁడు. అనియున్నది.

ఈ వాక్యములో జ్యోతిశ్శబ్దమునకు సూర్యాదిజ్యోతిస్సు అర్థమా ? పరమాత్మయర్థమా ? అనిసంశయము. ప్రసిద్ధివలన సూర్యాదిజ్యోతిస్సే అర్థమని పూర్వపక్షము ప్రాప్తించు చుండఁగా సిద్ధాన్తమునకై యీయధికరణ మారంభింపఁబడినది.

జ్యోతిర్దర్శనాత్ 40

జ్యోతిః, దర్శనాత్.

జ్యోతిః = పై వాక్యమునందలి జ్యోతిః, అనుపదము పరమాత్మబోధకము. ఎందుచేతననఁగా, దర్శనాత్ = "య ఆత్మా అపహతపాప్మా" ఛాం 8-7-1 అని ఉపక్రమమును ఆలోచించుటచేత ఇచ్చటబ్రహ్మమే ప్రతిపాద్యమన్నట్లు కనఁబడుటవలన,

ప్రకరణమువలన, పరంజ్యోతిః, ఉత్తమఃపురుషః అను విశేషణమువల్లనునిచ్చటి జ్యోతిష్పదము బ్రహ్మవాచకము. అని సిద్ధాన్తము.

## 12 అర్థాన్తరత్వాది వ్యపదేశాధికరణము (41)

అర్థాన్తరమందుఁ బ్రసిద్ధమైన జ్యోతిశ్శబ్ద ముపక్రమవశమునఁ బరమాత్మబోధకముకాని స్వార్థబోధకము కాద న్నట్లు ఈపై వాక్యములో బ్రహ్మపదము ఆకాశోపక్రమము

వలన, స్వార్థమును విడిచి యాకాశబోధకమే యనుకొందు రేమోయను దృష్టాన్తసంగతిచే నీయధికరణము ప్రాప్తమైనది.

ఛాందోగ్యములో "ఆకాశోహవై నామరూపయో ర్నిర్వహితా తే యదన్తరా తద్బ్రహ్మ తదమృతం స ఆత్మా" ఛాం 8-14 ఆకాశము నామరూపములకు నిర్వాహకము. ఆనామరూపములు దేనికంటెభిన్నములో అదిబ్రహ్మము అమృతము. అది ఆత్మస్వరూపము అనియున్నది.

ఇచ్చట ఆకాశశబ్దము భూతాకాశపరమా! పరమాత్మపరమా! అనిసంశయము. ప్రసిద్ధిచే భూతాకాశపరమేఅని పూర్వపక్షముకలుగుచుండ సమాధానమునకై యీయధికరణ మారంభింపఁబడినది.

ఆకాశోఽర్థాన్తరత్వాదివ్యపదేశాత్ . 41

ఆకాశః = ఇచ్చట ఆకాశశబ్దము పరమాత్మపరము. ఎందువలననఁగా అర్థాన్తరత్వాదివ్యపదేశాత్ = తేయదన్తరా = ఆనామరూపములు బ్రహ్మముకంటె భిన్నములు లేక బ్రహ్మములో మధ్యనున్నవి యని, అర్థాన్తరత్వమును = మఱి యొకయర్థమును చెప్పుటవలన, "తద్బ్రహ్మ, తదమృతమ్" అనిచెప్పుటవలనను, ఆకాశపదము బ్రహ్మబోధకము. అని సిద్ధాన్తము.

## 13 సుషుప్త్యుత్క్రాన్త్యధికరణము. (42-43)

బృహదారణ్యకములో జనకయాజ్ఞవల్క్యసంవాదమున షష్ఠప్రపాఠకములో-

"కతమ ఆత్మేతి యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృది అన్తః జ్యోతిః పురుషః స సమానస్సన్నుభౌ లోకావనుసంచరతి" బృ-4-3-7.

జనకమహారాజు యాజ్ఞవల్క్యుని ఆత్మయన నేది? దేహము, ఇంద్రియములు, మొదలగువానిలో నేదియో యొకటియా! వీనికన్న నతిరిక్తమా, అని ప్రశ్నించెను. దానికి యాజ్ఞవల్క్యుఁ డిట్లు సమాధానము చెప్పెను. విజ్ఞానమయుఁడు, ఆత్మ. విజ్ఞానమనఁగా బుద్ధి. తన్మయుఁడు, అనగా లింగశరీరమయుఁడు, ప్రాణేషు=చక్షురాదీంద్రియములయందు, హృది=మనస్సునందు, లోపలనున్న జ్యోతిస్స్వరూపుఁడైన పురుషుఁడు. అని చెప్పెను. ఇందు ప్రాణేషు, హృది, అని అధారసప్తమిచే ఆధేయుఁడగు విజ్ఞానమయుఁడు వీనికన్న భిన్నుఁడు అని చెప్పబడినది. అన్తః = లోపలనున్నవాఁడు, అనుటచే బుద్ధివృత్తికంటెవిభిన్నుఁడు, జ్యోతిః= తేజోరూపుఁడు అనుటచే, అజ్ఞానభిన్నుఁడు, పురుషః = పూర్ణస్వరూపుఁడు.

అనఁగా, స్థూలదేహముకంటెను, ఇంద్రియములకంటెను, ప్రాణవాయువులకంటెను, అంతఃకరణముకంటెను,

అన్తఃకరణవృత్తులకంటెను, వ్యతిరిక్తుఁడై వీనికన్నిటికిసాక్షియై చిజ్జ్యోతిస్స్వరూపుఁడైన పురుషుఁడు ఆత్మ అనిచెప్పెను. అట్టి యీపురుషుఁడు లింగశరీర తాదాత్మ్యాధ్యాసమునే లింగశరీరముతో సమానుఁడై యిహలోకపరలోకముల రెండింటివి సంచరించును.

ఇచ్చట నీవాక్యము సంసారియగు జీవానువాదకమా! అసంసారిపరమాత్మ ప్రతిపాదకమా! అనిసంశయముకలుగుచున్నది.

ఇది సంసారిజీవస్వరూపానువాదపరమే, ఈసందర్భములో ఉపక్రమమునందు యోఽయం విజ్ఞానమయః "అనుజీవలింగము వల్లను, ఉపసంహారములో "సవా ఏష మహానజ ఆత్మా" విజ్ఞానమయః మనోమయః ప్రాణమయః ఆత్మా, అని ఆజీవలింగమును విడిచిపెట్టకపోవుటచేతను, మధ్యయందును సంప్రసాద స్వప్నా ద్యవస్థలను చెప్పుటచేతను నిది జీవానువాదకమేయని పూర్వపక్షముఁరాఁగా, సిద్ధాన్తముచేయుటకీయధికరణము ప్రారంభింపఁబడినది.

అసంసారియగుపరమాత్మయే యిందుఁ ప్రతిపాదింపఁబడుచున్నాఁడు. ఏమనిన

సుషుప్త్యుత్క్రాన్త్యోర్భేదేన 42

ఈసూత్రములోనికిఁ బూర్వసూత్రమునుండి వ్యపదేశాత్ అనుపదము అనువృత్తివచ్చును. సుషుప్తి + ఉత్క్రా-

న్త్యోః, భేదేన,వ్యపదేశాత్, అనిసమాధానము. సుషుప్తి యందు, ఉత్క్రాన్తి యందును శారీరునికంటె భేదముగా నీశ్వరునికి (పరమాత్మకు) ప్రాజ్ఞశబ్దముచే వ్యపదేశముచేయుట వలన నిది పరమాత్మప్రతిపాదకము.

సుషుప్తిలో – ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః న బాహ్యం కించన వేద నాన్తరమ్, – ప్రాజ్ఞాత్మతోఁ గలిసి కొన్నవాఁడై బాహ్యమునుగాని అంతరమునుగాని యేకొంచెమును నెఱుఁగఁడు అనియు, ఉత్క్రాన్తిలోఁగూడ "శారీర ఆత్మా ప్రాజ్ఞేనాత్మనా న్వారూఢః ఉత్సర్జన్ యాతి" జీవుఁడు ప్రాజ్ఞుఁడైన పరమాత్మచే నధిష్ఠింపఁబడినవాఁడై ప్రాణోత్క్రమణసమయములో బాధవలన ధ్వనిచేయుచు (మూలుగుచు) వెళ్లుచున్నాఁడు. అనియును. ఈ రెండవస్థలయందును జీవునికంటె వేఱుగా ప్రాజ్ఞపదవ్యపదేశము చేయుటచే నిది పరమాత్మప్రతిపాదకమే కాని జీవానువాదకముగాదు.

ఉపక్రమము నుండియు జీవుని అనువాదముచేసి పరబ్రహ్మతో నైక్యము చెప్పుట యిందుముఖ్యము మాటిమాటికి "అతఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహి. = మోక్షముకొఱకే చెప్పుము. అని జనకుని ప్రశ్న, అనన్వాగత స్తేన భవత్యసంగో హ్యయం పురుషః" ఈపురుషుఁడసంగుఁడు అని యాజ్ఞవల్క్యునిసమాధానమును చెప్పఁబడినవి. సంసారివలెఁగనఁబడునుగాని యితఁడు అజుఁడు పరమేశ్వరుఁడు, అని యిందు

పసంహారమునఁ బ్రతిపాదింపఁబడినది కావ నిందుఁబర మాత్మయే చెప్పఁబడెను.

పత్యాది శబ్దేభ్యః 43.

ఈవాక్యమునందు "సర్వస్యవశీ సర్వస్యేశానః, సర్వస్యాధిపతిః "బృ 4-4-22 అని అసంసారిత్వపరములగు పత్యాదిశబ్దములున్ను "స నసాధుకర్మణా భూయాన్ నో ఏవాసాధునా కనీయాన్'' 4-2-22 అని సాధుకర్మముచే గొప్పవాఁడును అసాధుకర్మముచేనల్పుఁడును గాఁడు'' అని సంసారిత్వనిషేధకములును నగుశబ్దములున్ను కనఁబడుచున్నవి. కనుక వీనివలన నిచట జీవబ్రహ్మైక్యము ప్రతిపాద్యమని తాత్పర్యము.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి కృతమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్ర వృత్తియందుఁ
బ్రథమాధ్యాయమునఁ
దృతీయ పాదము

అధికరణములు – 13, సూత్రములు – 43

శ్రీ రస్తు

శివాయ గురవే నమః

# బ్రహ్మసూత్రార్థదీపిక

## ప్రథమాధ్యాయ చతుర్థపాదము

ఇంతవఱకు బ్రహ్మజిజ్ఞాసను ప్రతిజ్ఞచేసి, బ్రహ్మకు లక్షణమును జెప్పి, ఆలక్షణము ప్రధానమునకును సరిపడునని అతివ్యాప్తినాశంకించి, యాప్రధానము అశాబ్దము (వేదమూలము కానిది) కనుక దానికి జగత్కారణత్వము సంభవింపదని "ఈక్షతేర్నాశబ్దమ్" అనుసూత్రముచే నిరాకరింపఁబడినది.

వేదాన్తములకు గతిసామాన్యమున బ్రహ్మకారణ వాదము గతపాదత్రయముచేతను వివరింపఁబడినది. ఇఁక నీపాదమునందు, "ప్రధానముకూడ వేదప్రతిపాదితమే. అది యశబ్దముకాదు. కొన్నిశాఖలయందుఁ బ్రధానప్రతిపాదక శబ్దములు గనఁబడుచున్నవి" అను వాదము నాశంకించి, ఆ శబ్దముల కర్థము వేఱు, అని యాయర్థమును వివరించి ప్రధాన వాదమును నిరాకరించుచున్నారు.

### 1 ఆనుమానికాధికరణము. (1-7)

కఠవల్లిలో "మహతః పరమవ్యక్తం అవ్యక్తాత్పురుషః పరః" కాఠ 1-3-11 అనియున్నది. ఇందలి అవ్యక్త

పదము ప్రధానవాచకమా ? లేక పూర్వప్రక్రాన్తమైన శరీర పరమా ? అని సందేహముకలుగుచున్నది. సాంఖ్యశాస్త్రములో మహత్ , అవ్యక్త, పురుష శబ్దములు మూడింటికి మూడుతత్త్వములయందుఁ ప్రసిద్ధియుండుటవలన వానికే యుచట ప్రత్యభిజ్ఞానమువలన నీయవ్యక్తశబ్దము ప్రధానవాచకమే. అని పూర్వపక్షముగలుగ నీయధికరణమున దానిని నిరాకరించుచున్నారు.

ఆనుమానిక మప్యేకేషా మితిచేన్న శరీరరూపక విన్యస్తగృహీతే ర్దర్శయతిచ. 1

ఆనుమానికమపి = అనుమానగమ్యమగు ప్రధానము కూడ, ఏకేషాం = కొంతమందిశాఖీయులకు, ప్రసిద్ధము. అది అవ్యక్తశబ్దముచేఁ బఠింపఁబడుచున్నది. కనుక అశబ్దత్వము అసిద్ధము, ఇతిచేత్ = అని యన్నచో, న = అట్లుకాదు. ఎందుచేతననఁగా, శరీరరూపక విన్యస్తగృహీతేః = పూర్వవాక్యములో శరీరరూపకముచేసి చెప్పఁబడిన శరీరమునకే యిందుగ్రహణముకనుక, దర్శయతిచ = పూర్వోత్తరవాక్య సందర్భము అవ్యక్తశబ్దమునకు శరీరమేయర్థమని కనఁబఱచుచున్నది. ఎట్లనఁగా.

కఠోపనిషత్తులో "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు

బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవచ.

ఇంద్రియాణి హయానాహుః విషయాం స్తేషు గోచ
రాన్
ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తే త్యాహు ర్మని
షిణః " కఠ 1-3-3,4

అని ప్రారంభించి, అసంయతములైన (నిగ్రహింపఁబడని) ఇంద్రియములచే సంసారమునుబొందును. సంయతములైన యింద్రియములచే విష్ణుపదమునుబొందును. అని చెప్పి, ఆవిష్ణుపద మేదియనఁగా,

ఇంద్రియేభ్యః పరాహ్యర్థా, అర్థేభ్యశ్చ పరంమనః,
మనసస్తు పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః"
మహతఃపరమవ్యక్తం అవ్యక్తాత్పురుషః పరః,
పురుషాన్న పరంకించి త్సాకాష్ఠా సాపరాగతిః 1-3-10

అని ప్రకృతములయిన యింద్రియములకంటెఁ బరమ గతిని జూపించుచున్నాఁడు.

ఇందుఆత్మను రథికునిగను, శరీరమును రథమునుగను ఆరోపించి రూపకముచేసి, చెప్పినాఁడు. పూర్వము రథముగా ఆరోపింపఁబడిన శరీరమునకే ఉత్తరశ్రుతిలో అవ్యక్తపదముచే గ్రహణముకనుక, నీయవ్యక్తపదము శరీరబోధకమేకాని సాంఖ్యప్రసిద్ధమగు ప్రధానబోధకముకాదు. అనిసిద్ధాన్తము.

సూక్ష్మంతు తదర్హత్వాత్. 2

స్థూలశరీరము వ్యక్తముగదా అవ్యక్తశబ్దముచే దానిని జెప్పుటయెట్లు? అనిన, సూక్ష్మంతు = స్థూలశరీరారంభక భూతసూక్ష్మమే. తదర్హత్వాత్ = అవ్యక్తశబ్దార్హముకనుక చెప్పఁబడుచున్నది. సూక్ష్మమగు కారణశరీరమే యిట అవ్యక్తశబ్దమున కర్థము. "గోభి శ్రీణీత మత్సరమ్" అన్న చోటవలె ప్రకృతివాచకశబ్దముచే వికృతి చెప్పఁబడుచున్నది. గోభిః = అనుదానికి గోవికారములగు క్షీరములని యర్థము.

తదధీనత్వా దర్థవత్. 3

అవ్యక్తపదమునకు భూతసూక్ష్మమని యర్థమునంగీకరించినచో, ప్రధానవాదము సిద్ధమేయైనది. సాంఖ్యులుభూతసూక్ష్మమునే ప్రధానమందురు. అనిన, తదధీనత్వాత్ = అని సమాధానము. తదధీనత్వాత్ = ఈశ్వరాధీనమైనది అగుటవలన, అనఁగా జగత్తు చేతనుఁడగు నీశ్వరునిచేనధిష్ఠితమని యభిప్రాయము. స్వతంత్రము చేతనానధిష్ఠితమునగు అవ్యక్తము జగత్కారణమని సాంఖ్యులమతము. సిద్ధాన్తములో చేతనుఁడగు నీశ్వరునిచేనధిష్ఠితమైన మాయజగత్కారణము. ఈమాయయే, అవిద్య, అవ్యక్త, అక్షర, ఆకాశాది శబ్దములచేఁ జెప్పఁబడును. ఈశ్వరునివలననే జగదుత్పత్తియగుచుండఁగా మఱల నీమాయ (అవ్యక్తము) నంగీకరించుటయెందులకు? అనిన,

అర్థవత్ = మాయనంగీకరించుట యర్థముకలది. ప్రయోజనముకలది "మాయాంతుప్రకృతిం విద్యాత్" శ్వేతా. 4-10. అని శ్రుతిప్రసిద్ధమైన, ఈశ్వరునకు సహకారియైన, అవ్యక్తమును (మాయను) దప్పకయంగీకరింపవలయును. శక్తిరహితుఁడైన యీశ్వరుఁడు కార్యము నేదియుఁ జేయలేఁడు.

అవ్యక్తము అవిద్యయొక్క కార్యమైన అవ్యక్తవికారములయిన యింద్రియాదులనువిడిచి శరీరమునే యవ్యక్తమని యేల గ్రహింపవలెననిన నింద్రియములను స్వశబ్దములచే గ్రహించుటచే దీనినే యవ్యక్తపదముచే గ్రహించెను.

ఈ, రెండుసూత్రములకును మఱియొకవిధమగు వ్యాఖ్యయును గలదు. శరీరము, స్థూలము, సూక్ష్మము, అని రెండువిధములు. ఈరెండువిధములయిన శరీరము పూర్వసూత్రమునందలి శరీరపదమునకర్థము. సూత్రములో సూక్ష్మశరీరమే అవ్యక్తశబ్దముచే గ్రహింపఁబడును. అదియే అవ్యక్తపదమున కర్థము. కనుక, ఆయవ్యక్తము అవశ్యము గ్రహింపఁదగినది. బంధమోక్షవ్యవహారము తదధీనమైనదికనుక అని, యిట్లు ఈరెండుసూత్రములకును వ్యాఖ్యాన్తరమును చేయఁబడినది.

### జ్ఞేయత్వా వచనాచ్చ. 4

సాంఖ్యులు ప్రకృతి పురుషవివేకమువలన మోక్షము కలుగుననియంగీకరించి,ప్రకృతికూడ ఆ మోక్షముకొఱకు జ్ఞేయ

మని చెప్పుదుము. ఇచ్చట అవ్యక్తపదము ఆ ప్రకృతి (ప్రధానము) అనునర్థమును జెప్పునదే యన్నచో నిచ్చటఁగూడ నది జ్ఞేయము అని చెప్పవలసియుండును. అట్లు ఈ ప్రకరణమున నెచ్చటను అవ్యక్తమునకు జ్ఞేయత్వము చెప్పఁబడియుండలేదు. అందుచేత నీ అవ్యక్తము ప్రధానముగాదు.

వదతీతిచేన్న ప్రాజ్ఞో హి ప్రకరణాత్. 5

వదతీతిచేత్ = అవ్యక్తము జ్ఞేయమని చెప్పకపోవుట యేమి? ఉత్తరత్ర "అశబ్దమస్పర్శ మరూప మవ్యయం తథా రసం నిత్య మగంధవచ్చ యత్, అనాద్యనన్తం మహతః పరంధ్రువం నిచాయ్య తన్మృత్యు ముఖా ప్రముచ్యతే" కఠో 1. 3. 15. శ్లో. శబ్దస్పర్శరూప రసగంధములు లేనిది, ఆద్యన్తములు లేనిది, మహత్తుకంటెఁబరమైనది యేధ్రువముకలదో దానిని వనకి తెలిసికొని మృత్యుముఖమునుండి విముక్తుఁడగుచున్నాఁడు. అని ప్రధానమే చెప్పఁబడుచున్నదే. అన్నచో, న = కాదు, ప్రధానము చెప్పఁబడుటలేదు. ప్రకరణాత్ = సందర్భమువలన, అనఁగా, "పురుషాన్న పరం కించిత్, సా కాష్ఠా సా పరాగతిః" పురుషునికంటెఁ బరమైనదేదియును లేదు. అతఁడేఅవధి. అతఁడేపరమగతి. అనియు, "ఏష సర్వేషు భూతేషు గూఢోత్మా న ప్రకాశతే" సమస్తభూతములయందు గూఢమైన ఆత్మస్వరూపుఁడగు నితఁడు, పైకిఁబ్రకాశింపఁడు. సూక్ష్మదృష్టిచే గ్రహింపఁబడును. అనియు, "యచ్ఛేద్వాఙ్మ

నసీప్రాజ్ఞః" అతనిని దెలిసికొనుటకు వాగాదినియమము చేయవలయును. అని, కాఠ. -3. 11. 12. 13. చెప్పిన సందర్భమువలన, ప్రాజ్ఞోహి = ప్రాజ్ఞుడు = పరమాత్మ జ్ఞేయుఁడుగాఁ జెప్పఁబడినాఁడు. కాని ప్రధానము జ్ఞేయముగాఁ జెప్పఁబడలేదు.

త్రయాణా మేవ చైవ ముపన్యాసః ప్రశ్నశ్చ. 6

ఏవం = ఈవిధముగా వరదానసామర్థ్యమువలన ప్రశ్నః, ఉపన్యాసశ్చ = ప్రశ్నోత్తరములు, త్రయాణా మేవ = మూఁడింటికే, కనఁబడుచున్నవి. తదతిరిక్తమగు ప్రధానమునకుఁ బ్రశ్నోత్తరములులేవు. యమధర్మరాజు నచికేతునికి మూఁడువరములిచ్చెను. వానిని నచికేతుఁడిట్లుకోరుకొనెను.

1. సత్వమగ్నిం స్వర్గ్య మధ్యేషి మృత్యో! ప్రబ్రూహి త్వం శ్రద్దధానాయ మహ్యమ్, = ఓమృత్యుదేవా! నీవుస్వర్గహేతువైన అగ్నిని అధ్యయనముచేయుచుంటివి. శ్రద్ధాయుక్తుండనైన నా కాయగ్నిని జెప్పుము. అనిఅగ్నివిషయకమగు నొకవరమునడిగెను. కఠో.1-1-13.

2. "యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతి చైకే, ఏతద్విద్యా మనుశిష్ట స్త్వయాహం వరాణా మేషవర స్తృతీయః" = మనుజుఁడు చనిపోయినతరువాత ఉన్నాఁడనికొందఱు లేఁడనికొందఱు చెప్పుచున్నారు, ఆసంగతిని నీచేశిక్షింపఁబడినవాఁడనై తెలిసికొందును ఇది

మూడవవరము. అనియడిగెను. ఇదిజీవవిషయకప్రశ్న. కఠో. 1_1-20.

3. "అన్యత్ర ధర్మా దన్యత్రాధర్మాత్ అన్యత్రాస్మా త్కృతాకృతాత్ । అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్ప శ్యసి తద్వద "ధర్మాధర్మముల కతిరిక్తముగను, కృతాకృత ములకతిరిక్తముగను, భూతభవ్యములకతిరిక్తముగను దేనిని జూచుచున్నావో దానిని జెప్పుము. అనిపరమాత్మవిషయక మగు ప్రశ్నమడిగెను 1-2-14.

ఈమూడుప్రశ్నలకును, వరుసగా నిట్లుసమాధానము చెప్పెను.

1, లోకాదిమగ్నిం తమువాచ తస్మై యా ఇష్టకా యావతీర్వా యథావా, = లోకమునకు హేతువైన అగ్నిని, ఎట్టియిటుకలు ఎన్ని కావలెనో ఎట్లుచయనము చేయవలెనో అని అగ్నివిషయము చెప్పెను.1-1-15

2. హంత త ఇదం ప్రవక్ష్యామి గుహ్యం బ్రహ్మ సనాతనమ్, యథా వా మరణం ప్రాప్య ఆత్మా భవతి గౌతమ!" యోని మన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః, స్థాణు మన్యే నుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్" క.2-6-7 ఇప్పుడు చని పోయి ఏమగుచున్నాడో యనురహస్యము నీకుఁ జెప్పెదను. వారివారికర్మానుగుణముగఁ గొందఱు మఱలమఱియొకశరీర

తును బొందుదురు. కొందఱు స్థాణువు(చెట్టు) మొదలగుదాని నిబొందుదురు. అని జీవవిషయకసమాధానము చెప్పెను.

3. నజాయతే మ్రియతే వా విపశ్చిత్'' ఆత్మ పుట్టదు. చావదు-అని ఆత్మవిషయకమగు సమాధానము చెప్పినాఁడు. ఇంతియేకాని ప్రధానవిషయకమైన ప్రశ్న కాని సమాధానముకాని యుండుటలేదు. కావున నిచ్చట అవ్యక్తము ప్రధానము కాదు.

యముఁడిచ్చిన మూఁడు వరములకు నచికేతుఁడు, తన తండ్రికి సౌమనస్యము 2. అగ్నివిద్య 3. "యేయం ప్రేతే'' అని ఆత్మవిద్యను గోరెను. ఈ యాత్మవిద్య, జీవవిషయకముగను, పరమాత్మవిషయకముగను వేఱుగాఁ జెప్పఁబడినది. కాని జీవపరమాత్మల యైక్యమునే యంగీకరించుటవలన నిదియంతయు మూఁడవ ప్రశ్నకు సమాధానమే.

మహద్వచ్చ. 7

మహత్తువలె, అవ్యక్తమును సాంఖ్యపరిభాషిత తత్త్వముగాఁ జెప్పరాదు.

అనఁగా, "బుద్ధేరాత్మా మహాన్ పరః'' కఠ.1.3-10, "మహాన్తం విభు మాత్మానమ్'' క.1-2-22 వేదాహ మేతం పురుషం మహాన్తమ్'' శ్వే.3-8. ఈ మొదలగు శ్రుతులలో మహత్పదమునకు సాంఖ్యమతసిద్ధమైన మహత్తు అనుద్దిష్టము

తత్త్వవాచకత్వము ఎట్లు అంగీకరింపఁబడలేదో అట్లే వైదిక
మైన అవ్యక్తపదమునకును ప్రధానవాచకత్వము అంగీకరింపఁ
బడదు.

## 2 చమసాధికరణము (8-10)

పూర్వాధికరణములో అవ్యక్తశబ్దము ప్రత్యభిజ్ఞా
మాత్రముచేఁ ప్రధానబోధకమని చెప్పఁబడినది. ఇపుడు అజా
పదము అర్థమువలనను ప్రత్యభిజ్ఞవల్లను ప్రధానవాచ
కము కనుక ప్రధాన మశబ్దమనుటతగదు అని ప్రత్యుదాహ
రణసంగతితో నీయధికరణము ప్రారంభమైనది.

శ్వేతాశ్వతరోపనిషత్తులో "అజా మేకాం లోహిత
శుక్లకృష్ణాం బహ్వీః
ప్రజాః సృజమానాం సరూపాః । అజో హ్యేకో జుష
మాణో నుశేతే
జహాత్యేనాం భుక్తభోగా మజోన్యః" శ్వే 4-5

లోహిత శుక్ల కృష్ణాం = ఎఱుపు, తెలుపు, నలుపు
రంగులుగలదియు, సరూపాః బహ్వీః ప్రజాః = సరూపమైన
బహుసంతానములను, సృజమానాం=పుట్టించుచున్నదియునగు
ఏకాంఅజాం = ఒకఅజను, ఏకః అజః = ఒకఅజుఁడు,
(జీవుఁడు) జుషమాణః = ప్రీతితోసేవించుచున్నవాఁడై అను
శేతే = దానినేఆత్మనుగాఁబొంది సుఖవంతుఁడను, దుఃఖ
వంతుఁడను, మూఢుఁడను, అని అవివేకముచే అనుసరించు

చున్నాఁడు. అన్యః, అజః = మఱియొకయజుఁడు (వివేకి) వివేకములుకలవాఁడై, విరక్తుఁడై, భుక్తభోగాం-అనుభవింపఁబడినభోగములుకల ఆయజనను జహాతి = విడిచిపెట్టుచున్నాఁడు. (ముక్తుఁడగుచున్నాఁడు.)

ఇందు లోహితశుక్లకృష్ణాం = అనుటచే రజస్సత్త్వతమోగుణాత్మకమైనదనియు, అజాం = నజాయతఇత్యజాం = పుట్టుకలేని త్రిగుణాత్మకమైన మూలప్రకృతిని ప్రధానమును అని అర్థముచేసి సాంఖ్యులు ప్రధానము వేదశబ్దప్రతిపాదితమే అని యనుచున్నారు. కావున ఇందలి అజాపదము — సాంఖ్యాభిహితప్రధానవాచకమా? లేక ఛాందోగ్యసిద్ధమైన తేజోబన్నాత్మకమైన (తేజః + అప్=నీరు, + అన్నం, తేజోబన్నస్వరూపము) అవాన్తరప్రకృతివాచకమా? అనిసందేహము. నజాయత ఇత్యజా, అనువ్యుత్పత్తిచేతను, లోహితశుక్లకృష్ణామ్, అని రజస్సత్త్వతమోగుణాత్మక మనుటచేతను నిచ్చట అజాపదము సాంఖ్యసిద్ధప్రధానవాచకమే అని పూర్వపక్షము, వచ్చుచుండ నిందు సిద్ధాన్తమును జేయుచున్నారు.

## చమసవదవిశేషాత్ 8

చమసవత్, అవిశేషాత్; అవిశేషాత్ = ఇచ్చట అజాశబ్దముచేఁ బ్రధానమునే గ్రహింపవలెనుఅని విశేషము = ప్రత్యేకనిర్ణయ మేమియును లేకపోవుటవలన, నజాయత

ఇత్యజాఅనువ్యుత్పత్తి మఱియొకచోటను పరిపఠనముగనుకను, లోహితాదిశబ్దములు రూపవాచకములు కాని రజోగుణాది వాచకములు కాకపోవుటచేతను, ఇది ప్రధానవాచకము కాదు. విశేషములేదుఅనుటకు దృష్టాంతము. చమసవత్ — అని, అనగా,

"అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నః" బృ. 2-2-3 అను మంత్రములో 'ఇదిచమసము, అనినిర్ణయించుటకుఁ దగినవిశేషము ఏమియులేదు. యజ్ఞపాత్రములన్నిటియందును నేదోవిధముగ నర్వాగ్బిలత్వము కలదు. అట్లే అజాపదమునందును విశేషములేదు. నహాయత ఇత్యజాఅను వ్యుత్పత్తియితరత్ర కూడకలదు. ఇదిప్రధానమేయనిచెప్పుటకుఁ దగినవిశేషమేమియును లేదు. కనుక ప్రధానము అశబ్దమే.

జ్యోతిరుపక్రమాతు తథా హ్యధీయత ఏకే. 9

"ఇదంతచ్ఛిర ఏష హ్యర్వాగ్బిల శ్చమస ఊర్ధ్వబుధ్నః" బృ 2-2-3 అనువాక్యశేషమువలన నచ్చట శిరస్సు చమసమని నిర్ణయమగుచున్నది. ఇచ్చట "అజామేకాం" అనుమంత్రములో అజయనగా దేనిని గ్రహింపవలెను? అనగా,

జ్యోతిరుపక్రమాతు = జ్యోతిస్సుఅనగా తేజస్సు, ఉపక్రమమునందుఁగల, తేజోబన్నలక్షణమైన అజను గ్రహిం

పవలెను. ఎందుచేతననగా, ఏకే = కొందఱు ఛందోగులు, తథాహ్యధీయతే - అలాగున తేజోబన్నములకే లోహిత శుక్లకృష్ణరూపత్వమును చెప్పుచున్నారు. "యదగ్నే రోహితం రూపం తేజస స్తద్రూపం, యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్య" ఛాం 6-4-1 అని

సర్వవేదాన్త ప్రత్యయమువలన, శాఖాన్తరప్రసిద్ధ లోహితాదిశబ్దముల ప్రత్యభిజ్ఞవలన, ఆశబ్దములు రూపవిశేషమునందు ముఖ్యములగుటవలనను, తేజోబన్నాత్మికయైన యజయే యిచ్చటగ్రహింపఁబడును.

ఈప్రకరణమునందే "మాయాంతు ప్రకృతింవిద్యాత్ మాయినంతు మహేశ్వరమ్" శ్వే 4-10 అని చెప్పుటవలన ప్రకృతివికృతుల కభేదమునువివక్షచేసి, లోహితాదివర్ణములు కలదియగుటచే అనిర్వాచ్యమైన అవిద్యయే యిచ్చట అజా పదముచే గ్రహింపఁదగినది. సాంఖ్యసిద్ధమైన ప్రకృతికాదు.

కల్పనోపదేశాచ్చ మధ్వాదివ దవిరోధః. 10

తేజోబన్నముల కుత్పత్తిశ్రవణమువలన, ఛాగము(మేక నందు రూఢమగుటవలన, యోగముకాని రూఢికాని సంభవింపదుకదా! అజాపదము తేజోబన్నలక్షణప్రకృతియందెట్లు సంగతమగును? అనఁగా

కల్పనోపదేశాచ్చ = కల్పన నుపదేశించుటవలన (సంగతమగును) ఎట్లు!- మధ్వాదివత్ = మధ్వాదిపక్షము

లందువలె, అనఁగా, "అసౌవా ఆదిత్యో దేవమధు" ఛాం. -3.1. "వాచం ధేను ముపాసీత" బృ. 5. 8. అన్యస్థలము లందు ఆదిత్యునియందు మధుత్వమును, వాక్కునందు ధేనుత్వ మును గల్పించినట్లు, తేజోబన్నాత్మక ప్రకృతియందు అజాత్వ మునుగల్పించుటవలన, అవిరోధః = విరోధములేదు.

3. న సంఖ్యోప సంగ్రహాధికరణము. (11 - 13)

పూర్వము అజాపదము సాంఖ్యసిద్ధ ప్రకృతిబోధకము కాదని నిరాకరింపఁబడినది. తద్దృష్టాన్తసంగతిచే పంచజన శబ్దము వ్యుత్పత్తిచే సాంఖ్యాభిమతమైన పంచవింశతి తత్త్వ బోధకము కాదని నిరూపింపఁబడుచున్నది.

బృహదారణ్యకములో — "యస్మిన్ పంచపంచజనా ఆకాశశ్చ ప్రతిష్ఠితః తమేవ మన్యే ఆత్మానం విద్వాన్ బ్రహ్మామృతో ఽమృతమ్" బృ - 4 - 4 - 17.

యాజ్ఞవల్క్యుఁడు జనకునితో ఆత్మతత్త్వము చెప్పుసందర్భము

లోనిది. సూర్యాది జ్యోతిస్సులకుఁగూడ భాసకమైన జ్యోతిస్సును దేవతలు బ్రహ్మమని యుపాసింతురు. అని జ్యోతిస్సునుజెప్పి వాక్యశేషములో, ప్రాణమునకుఁ బ్రాణము, చక్షుస్సునకు చక్షువు, శ్రోత్రమునకు శ్రోత్రము, మనస్సునకు మనస్సుఅగు బ్రహ్మము దెలిసికొనిరి. అని చెప్పఁబడినది. పైనఁజెప్పిన జ్యోతిస్సు వాక్యశేషములోనున్న ప్రాణాదులు

నాలుగు మొత్తమిూ ఐదునుగలిపి 'పంచజనాః' అని వ్యవహరింపఁబడినవి.

ఎవనియందు, పంచ పంచజనాః = ఐదైదైన ప్రాణాదులు ఆకాశము, ప్రతిష్ఠింపఁబడియున్నవో అతనినే ఆత్మనుగాఁ దలఁతును. అనిచెప్పఁబడినది. పంచజనశబ్దమునకు రూఢిచేఁ బురుషుఁడర్థమైనను, ఇచ్చటఁ బురుషసంబంధిప్రాణాదులను గ్రహింపవలెను. ఆ ప్రాణాదులెన్నియని ప్రశ్న కలుగ, పంచ = ఐదు అని చెప్పఁబడినది.

ఇచ్చట పంచజనశబ్దమునకు సాంఖ్యాభిమతమైన పంచవింశతితత్త్వములు అర్థమా? వాక్యశేషగతమైన ప్రాణాదులర్థమా? అని సంశయము గలుగుచున్నది. తత్త్వములే యర్థమని పూర్వపక్షము. "మూలప్రకృతి రవికృతిః మహదాద్యాః ప్రకృతి వికృతయస్సప్త। షోడశకశ్చ వికారః న ప్రకృతి ర్న వికృతిః పురుషః" అని చెప్పఁబడిన పంచవింశతితత్త్వములు, పంచ=ఐదైన, పంచజనములు = ఐదుతత్త్వములు అనఁగా 5 × 5 = 25 తత్త్వములని యర్థము. జనశబ్దము తత్త్వోపలక్షకము.

మూలప్రకృతి అనఁగా ప్రధానము, వికృతిలేనిది, మహదాదులు = మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలు అను నీయేడును పూర్వములకు వికృతులు పరములకు ప్రకృతులునగును. ప్రధానము, మహత్తు, అహంకారము, పంచ

తన్మాత్రలు, పంచ భూతములు, పంచాంతరేంద్రియములు పంచ బాహ్యేంద్రియములు, మనస్సు, పురుషుఁడు, అనునవి పంచవింశతి (25) తత్త్వములు. వీనిలో మూలప్రకృతియగు ప్రధానము (అవ్యక్తము) వికారము కాదు. మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలునను నేడును ప్రకృతులు వికృతులును నగును. పృథివ్యాది పంచభూతములు దశేంద్రియములు, మనస్సు అను పదునారును వికారములు, ఇవి (1+7+16=24) 25 వ తత్త్వము పురుషుఁడు. ఇతఁడు ప్రకృతియును గాఁడు వికృతియును గాఁడు, కూటస్థుఁడు. ఇవి సాంఖ్యమతసిద్ధపంచవింశతి తత్త్వములు.

ఈ పంచజనశ్రుతిలో వినఁబడుచున్న పంచవింశతి (25) సంఖ్యను సాంఖ్యస్మృతిసిద్ధమైన పంచవింశతితత్త్వములను గ్రహించుటవలన ప్రధానమునకు శబ్దవత్త్వము వచ్చుచున్న దని పూర్వపక్షము రాఁగాఁ జెప్పుచున్నారు.

న సంఖ్యోపసంగ్రహాదపి నానాభావాదతిరేకాచ్చ. 11

సంఖ్యోపసంగ్రహాదపి = పంచజనశ్రుతిలో, పంచవింశతిసంఖ్యను గ్రహించుటవలనను, న = ప్రధానమునకు శబ్దవత్త్వము లేదు. ఎందువలన ననఁగా, నానాభావాత్ = నానాత్వమువలన, "యస్మిన్ పంచ పంచజనా" అను మంత్రములో, యస్మిన్, అను సర్వనామము, 'ఆకాశశ్చ', అను ఆకాశపదము

వేఱుగాఁ జెప్పఁబడుటవలన, నైదుపంచజనములని యర్థము కుదరదు. అవాన్తరసంఖ్యకు అనుగమకధర్మములేదు. అతిరేకాచ్చ = పంచజనములకంటె ఆకాశము ఆత్మ అధికముగానుండుట వల్లను, నిచ్చటసాంఖ్యుల పంచవింశతితత్త్వములర్థము కాదు.

## ప్రాణాదయో వాక్యశేషాత్. 12

ఇఁక, ఇచ్చటిపంచజనశబ్దముచే నేవి గ్రహింపఁబడును? అనఁగా మాధ్యందినశాఖయందలి ప్రాణాదయః = ప్రాణ చక్షుశ్శ్రోత్రాన్నమనస్సులు, గ్రహింపఁబడును. ఎందుచేత? వాక్యశేషాత్ = "ప్రాణస్య ప్రాణ ముత చక్షుష శ్చక్షుః" అను వాక్యశేషములో నీయైదింటికిని గ్రహణముండుటవలన,

## జ్యోతిషైకేషా మసత్యన్నే. 13

మాధ్యందినశాఖీయులకు ప్రాణాదిపంచకములో అన్నము చెప్పఁబడినదికాని కాణ్వశాఖీయులకు వానిలో అన్నములేదుకనుక ప్రాణాదిపంచకమనుట యెట్లుకుదురును! అనఁగా, ఏకేషాం = ఒకరైనకాణ్వులకు, అన్నే అసతి = అన్నము ఆయైదింటిలో లేకున్నను, జ్యోతిషా = పూర్వవాక్యమునందలి "తద్దేవా జ్యోతిషాం జ్యోతిః" అను వాక్యములోని, జ్యోతిశ్శబ్దముచే ప్రాణాదులకు పంచసంఖ్యాత్వముసిద్ధించును. కనుక ప్రధానమశబ్దము అనిసిద్ధాన్తము

## 4 కారణత్వాధికరణము. (14-15)

గడచిన మూడుపాదములున్నరచేతను జగత్కారణ బ్రహ్మవిషయకముగ వేదాన్తవాక్యముల సమన్వయము చేయఁబడినది. ఆసమన్వయము నాక్షేపించి సమాధానము చెప్పుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

ఈచెప్పినసమన్వయము కుదరదు. వేదాన్తములందు బహువిధములైన విరోధములు గనఁబడుచున్నవి. దానిచేఁ బ్రామాణ్యము గలుగదు. తైత్తిరీయకములో "ఆత్మన ఆకాశస్సంభూతః" తై-2-1. అని ఆకాశాదులనుగుఱించి ఆత్మ స్రష్టయని చెప్పఁబడినది. ఛాందోగ్యములో, "తత్తేజోఽసృజత" ఛాం-6-2-3. అని తేజఆదుల సృష్టి చెప్పఁబడినది ఐతరేయకములో "సఇమాన్ లోకానసృజత" ఐ.4-1-2. అని, లోకసృష్టియు, ముండకోపనిషత్తులో "ఏతస్మాజ్జాయతే ప్రాణః "ముం-2-1-3. అని ప్రాణసృష్టియుఁ జెప్పఁబడినది. ఈవిధముగా వేదాన్తములలోఁ బరస్పరవిరుద్ధముగాఁ గార్యసృష్టి చెప్పఁబడినది.

ఇట్లే కారణమువిషయమునను, "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" ఛాం-6-2-1, అని ఛాందోగ్యమునను, "అసద్వా ఇదమగ్ర ఆసీత్" అని తైత్తిరీయకములోను.2.7 "ఆత్మా వా ఇదమేకఏ వాగ్ర ఆసీత్" ఐ.తరేయకములోను, వేర్వేఱువిధముగఁ జెప్పఁబడినది. కనుక కార్యకారణములవిషయములో

ఆయావేదాన్తములందు విభిన్నముగాఁ జెప్పుటవలన, నిశ్చయ జ్ఞానము కలుగకున్నది.

కార్యసృష్టిలో, ఆకాశాదికముగుసృష్టి యొకచోట, తేజఆదికముగుసృష్టి యొకచోట, ప్రాణాదికముగుసృష్టి యొక చోట, క్రమములేకయే లోకసృష్టియని యొకచోట విభిన్న ముగఁ జెప్పఁబడినది.

కారణములో, ఒకచోట సద్రూపమనియున్నది. మఱొకచోట అసద్రూపమనియున్నది. కాన ఇట్లుండుటచే సందేహముగలుగుచున్నది. జగత్కారణము బ్రహ్మమని యింతవఱకుఁ జేసిన సమన్వయము కుదురుటలేదు. అనిపూర్వపక్ష ముగలుగఁగా సమాధానము చెప్పఁబడుచున్నది.

కారణత్వేన చాకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః. 14.

"న వియదశ్రుతేః" (బ్రసూ. 2-3-1 అనుసూత్రము మొదలుకొని కార్యసృష్టిలోఁగల విరోధము ముందుపరిహరింపఁ బడుచున్నది. ఇందు కారణమువిషయమునను విరోధములేదని చెప్పఁబడుచున్నది.

కారణత్వేనచ = కారణత్వముచేతను విరోధములేదు. ఎందుచేతననఁగా, ఆకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః = ఒకవే దాన్తమునందు, ఆకాశాదులవిషయమున ఏలాటియీశ్వ రుఁడు కారణమని చెప్పఁబడినదో, ఇతరవేదాన్తములయందును

సత్తైయీశ్వరుఁడే కారణమని చెప్పఁబడినది. కనుక విరోధము లేదు.

సమాకర్షాత్ . 15

ఒకచోట సత్తునుండియు, ఒకచోట అసత్తునుండియు, ఒకచోట స్వభావమునుండియు జగదుత్పత్తి కనఁబడుచుండుటచే విరోధముగాదాయనిన.

సమాకర్షాత్ = సమాకర్షణమువలన నీవిరోధము లేదు అనఁగా, "అసన్నేవ సభవతి" అస ద్బ్రహ్మేతి వేదచేత్, అని అసద్వాదమును త్రోసి, "అస్తి బ్రహ్మేతి చేద్వేద," అని సదాత్మత్వమును నిర్ధారణచేసి, "సోకామయత" అని సత్తునుండి సృష్టియైనదని చెప్పి, "తత్సత్యమిత్యాచక్షతే" అని సదాత్మను ఉపసంహరించి "తదప్యేష శ్లోకో భవతి" అని ప్రకృతమైన సదాత్మవిషయకశ్లోకమును "అసద్వా ఇదమగ్ర ఆసీత్" అని ఉదహరించుచున్నారు. కనుక ఇందలియసచ్ఛబ్దముచే సత్తునకే సమాకర్షణము కనుక అసత్తుకారణము అనుశంక లేదు.

ఈ యుదాహరింపఁబడిన "అసద్వాఇదమగ్రఆసీత్ అనుదానిలోని యసచ్ఛబ్దమునకు నిరాత్మకమైన అసత్తుఅనియే యర్థము చెప్పిన ఒకదానిని సమాకర్షణముచేసి మఱియొకదానిని నుదాహరించుటవలన ప్రకరణము అసంబద్ధమగును.

ఇట్లే "అసదేవేదమగ్ర ఆసీత్" అనుచోటఁగూడ

"తత్సదాసీత్" అను దానిని సమాకర్షించుటవలన, నామ రూపాభివ్యాక్తి లేని అసచ్ఛబ్దము బ్రహ్మమే.

ఇట్లే "తద్ధేదంతర్హి అవ్యాకృత మాసీత్ తన్నామ రూపాభ్యామేవ వ్యాక్రియతే" అనుచోటఁగూడ "స ఏష ఇహ ప్రవిష్టః ఆనఖాగ్రేభ్యః" అని ప్రకృతపరామర్శకమగు "సః అను తచ్ఛబ్దముచే ఆత్మకేసమాకర్షణము కనుక స్వభావమువలన జగదుత్పత్తి యనియు అనరాదు. కనుక సర్వత్ర బ్రహ్మమే కారణము అని సమన్వయము కుదురుసుగాన నేమియును విరోధము లేదు.

5 జగద్వాచిత్వాధికరణము. (16 - 18)

కౌషీతకిబ్రాహ్మణములో బాలాక్యజాతశత్రు సంవాదములో నిట్లున్నది.

బ్రహ్మజ్ఞుఁడగు అజాతశత్రువుతో బాలాకియను బ్రాహ్మణుఁడు బ్రహ్మసంవాదము చేయఁబూని "బ్రహ్మతే బ్రవాణి" అని ప్రారంభించి ఆదిత్యాది పురుషులను బదునార్వురను జెప్పి యూరకుండెను.

అంత నజాత శత్రుఁ డాతనిని మృషావాది (అసత్యమాడువాఁడు) అనిపలికి తాను బ్రహ్మోపదేశము చేయుదునని, యిట్లు పలికెను. "యో వై బాలాక! ఏతేషాం పురుషాణాం కర్తా, యస్యవా ఏతత్కర్మ సవై వేదితవ్యః" కౌ. బ్రా. 4-19.

ఓ బాలాకీ! "ఆదిత్యేపురుషః" "చన్ద్రమసిపురుషః" అని నీవు ఆదిత్యాద్యన్తర్గతులగు పదునార్వురు పురుషులను బ్రహ్మయని చెప్పితివే! వీరు బ్రహ్మకాదు. వీరికి, కర్తయెవ్వఁడో! ఇది యంతయు నెవ్వనికర్మమో? అతఁడు తెలిసికొనఁ దగినబ్రహ్మ అని చెప్పెను.

ఇచ్చట వేదితవ్యుఁడని చెప్పఁబడినది ముఖ్యప్రాణమా! జీవుఁడా! పరమాత్మయా! అని సంశయముగలుగుచున్నది.

ఇక్కడ వేదితవ్యుఁడని చెప్పఁబడినది ముఖ్యప్రాణము. ఏమన "యస్యవా ఏతత్కర్మ" ఈకర్మమెవ్వనిదో అనిచెప్పఁబడినది, ఇచట కర్మపదముచే చలనరూపమగు కర్మము చెప్పఁబడును. అది ప్రాణవాయువునందు సంభవించును. వాక్యశేషమునందును "ప్రాణఏవైకధా భవతి" కౌ. బ్రా. 4-19. అని ప్రాణశబ్దము శ్రుతమగుచుండుటచే ప్రాణమే వేదితవ్యమని తెలియుచున్నది.

లేదా జీవుఁడు వేదితవ్యుఁడు. ఏమన, కర్మపదముచే ధర్మాధర్మరూపమైన కర్మ ముపదేశింపఁబడవచ్చును. కర్తా అనుటచే భోగోపకరణభూతులైన ఆదిత్యాద్యన్తర్గతపురుషులకు, భోక్తయగు జీవునకు, కర్తృత్వము సంభవించుటచేతను, జీవుఁడే వేదితవ్యుఁ డనవచ్చును. జీవుఁడేయనుటకు మఱియొకలింగముకూడఁ గలదు.

వేదితవ్యుఁడగు పురుషుని దెలిసికొనుటకు బాలాకి యసమర్థుఁడై యున్నందున బాలాకిని అజాతశత్రువు నిద్రించుచున్న యొకపురుషునిదగ్గఱకుఁ దీసికొనివెళ్లి వానిని పిలువుమని చెప్పెను. బాలాకిపిలిచెను. ఆనిద్రించువతఁడు లేవలేదు. అంత నజాతశత్రువు వానినొకకఱ్ఱదెబ్బకొట్టెను. దానితో నతఁడు లేచెను. అప్పు డతనినిజూపి చూచితివా! ప్రాణాదులకంటె నతిరిక్తుఁడగు జీవుఁడుకలఁడు. అని ప్రతిపాదించెను. కావ దీనివలనను నిట వేదితవ్యుఁడు జీవుఁడుఅనియును బూర్వపక్షముఁగలుగుచుండ సిద్ధాన్తము చేయఁబడుచున్నది.

జగద్వాచిత్వాత్. 16

ఈవాక్యమున వేదితవ్యుఁడని చెప్పఁబడినవాఁడు పరమాత్మ. ఏమనఁగా "బ్రహ్మతే బ్రవాణి" అని యుపక్రమించి యాదిత్యాదులయందున్న పురుషులను జెప్పి యూరకొన్న బాలాకిని, అసత్యము చెప్పకుము. వారుబ్రహ్మకారు. అని యాపురుషులను నిరాకరించి తానుబ్రహ్మమును జెప్పుదునని అజాతశత్రుఁడు, ఆపురుషులకుఁ గర్తయైనవాఁడు వేదితవ్యుఁడు అని చెప్పుటచే నిట వేదితవ్యుఁడని చెప్పఁబడినవాఁడు పరమాత్మ కానిచోఁ దానును మృషావాదియే యగును. "బ్రహ్మతేబ్రవాణి" అన్న యుపక్రమమునకు విరోధము వచ్చును. కనుక వేదితవ్యుఁడు పరమాత్మ. అయినచో "యస్యవై తత్కర్మ" అని చెప్పిన కర్మపదము ప్రతిబంధకముకాదా

యనినఁ గాదు. జగద్వాచిత్వాత్ = జగద్వాచకము కనుక, అనఁగానిచట కర్తృపదమునకు, క్రియత ఇతి కర్మ, అనువ్యుత్పత్తిచే జగము అర్థము. కాని చలనరూపము, ధర్మాధర్మరూపము నగు కర్మము కాదు.

ఎవ్వఁ డీపురుషులకుఁ గర్తయో, యీపురుషుల కీయననేల! ఈప్రపంచమునకంతకు నెవ్వఁడు కర్తయో! అతఁడు వేదితవ్యుఁడు. అని చెప్పుటచే సమస్తజగత్కర్తృత్వము వచ్చినది. అది, పరమాత్మకుఁగాక యన్యునకు సంభవింపదు. జగత్కర్తృత్వముచేతనే జగదన్తఃపాతులగు ఆదిత్యాదిపురుషులకును గర్తృత్వము సిద్ధించుచుండ మరల "పురుషాణాం" అని యనుట బాలాకి చెప్పినవారు వేదితవ్యులుగారని తెలుపుటకు, అని తెలియునది. గోబలీవర్దన్యాయమున వేఱుగాఁ జెప్పఁబడినది.

జీవముఖ్యప్రాణలింగా న్నేతిచే త్తద్వ్యాఖ్యాతమ్. 17

జీవ, ముఖ్యప్రాణలింగాత్ = జీవునకు సంబంధించిన లింగమువలన, ముఖ్యప్రాణమునకు సంబంధించిన లింగము వలనను, నిచ్చట వేదితవ్యుఁడు, న + ఇతిచేత్ = పరమాత్మ కాఁడు, అన్నచో, తత్ = ఆవిషయము, వ్యాఖ్యాతమ్ = వెనుక ప్రతర్దనాధికరణములో "ఉపాసాత్రైవిధ్యాత్" అను సూత్రమువద్ద, జీవముఖ్యప్రాణలింగమున్ను బ్రహ్మపరముగా వ్యాఖ్యానము చేయఁబడినది. జీవప్రాణపరత్వ మంగీకరించిన,

బ్రహ్మపరత్వ మెట్లుఅంగీకరింపవలెను? గనుక వాక్యత్రైవిధ్య దోషము కలుగునని చెప్పఁబడినది. అస్థితియే యిచ్చటను సంభవించును. అచ్చట కర్మపదవిచారము చేయఁబడలేదు. ఇందుఁజేయఁబడినది. కాన నిది దానిచే గతార్థముకాదు.

అన్యార్థంతు జైమినిః ప్రశ్నవ్యాఖ్యానాభ్యామపి చైవ మేకే18

జైమినిః = జైమిన్యాచార్యుఁడు. అన్యార్థం = ఈప్రకరణములో జీవపరామర్శమును, అన్యార్థకొఱకు = బ్రహ్మప్రతిపత్తికొఱకు. అని తలఁచుచున్నారు. కావున నీవాక్యము బ్రహ్మపరము. అతఁ డట్లేలతలఁచుచున్నాఁడు? అనిన, ప్రశ్న ప్రతివచనాభ్యాం - ప్రశ్నసమాధానములవలన,

ప్రః- నిద్రపోవుచున్న వానివద్దకు బాలాకిని దీసికొని వెళ్ళి అజాతశత్రుఁడు వానినిలేపుమనిన నతఁడుపేరుపెట్టి పిలిచెను. కాని యతఁడులేవలేదు. అప్పుడు వానినిగొట్టి లేపెను. అంతనతఁడులేచెను. అజాతశత్రుఁడు బాలాకిని ఓ బాలా! "క్వైష ఏతద్బాలాకే పురుషో ఽ శయిష్ట? క్వైతదభూత్" కుతఏతదాగాత్" కౌ. బ్రా. 4-18. అనిప్రశ్నించెను. బాలాకీ! ఈపురుషుఁడెచ్చటఁబరుండెను? ఎవనితో నేకీభావమును బొందియుండెను? ఇప్పుడెచ్చటనుండివచ్చెను? అనిప్రశ్నించెను... ఈప్రశ్నలకు బాలాకిసమాధానము చెప్పలేకపోయెను అప్పు డజాతశత్రుఁడే సమాధానముచెప్పెను.

సమాధానము:- "యదా సుప్తః స్వప్నం న కంచన పశ్యతి అథాస్మిన్ ప్రాణ ఏవైకధా భవతి" కౌ.4-18 నిద్రించుటకు, ఏకీభావమును బొందియుండుటకు సాధారమును, లేచి వచ్చుటకు అపాదానమును నైనవాఁడు ప్రాణశబ్దవాచ్యుఁడగు పరమాత్మ. (ఏవిధమైనస్వప్నమును గాంచకుండ నిద్రించునపుడు జీవుఁడు పరమాత్మతో నైక్యమును బొందును. ప్రాణశబ్దవాచ్యుఁడగు పరమాత్మ యొక్కరీతిగానుండును. ఈప్రశ్నప్రతివచనములవలన, ఈజీవుఁ డెవ్వనియం దేకీభావమును బొంది నిద్రించి మరల నెవ్వనినుండి వచ్చుచున్నాఁడో ఆపరమాత్మ వేదితవ్యుఁడని చెప్పఁబడినది.

అపిచ = మఱియును, ఏకే = వాజసనేయులుకొంత మంది, ఈప్రకరణములో, ఏవమ్- ఈరీతిగనే విజ్ఞానమయుఁడగు నీజీవుని తద్వ్యతిరిక్తుఁడగు పరమాత్మనుగాఁ జెప్పుచున్నారు. "యఏష విజ్ఞానమయః పురుషః క్వైష తదాభూత్? కుత ఏతదాగాత్? విజ్ఞానమయుఁడగు నీజీవుఁ డెక్కడనున్నాఁడు. ఎచ్చటినుండివచ్చెను. అనిప్రశ్నింప, బృ-2-1-16: య ఏషో౽న్తర్హృదయ ఆకాశః తస్మిన్ శేతే" బృ.2-1-17అని సమాధానము చెప్పఁబడినది. ఇందలి యాకాశశబ్దము బ్రహ్మరూపార్థమున, బ్రసిద్ధము. సుషుప్తిలో జీవుఁడు పరబ్రహ్మస్వరూపమునుబొంది యుండుననియు నచ్చటనుండివచ్చుననియును వీరును జెప్పుచున్నారు.

## 6 వాక్యాన్వయాధికరణము. (19-22)

బృహదారణ్యకములో మైత్రేయీబ్రాహ్మణములో "నవా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి, అని మొదలుపెట్టి, పతి జాయా పుత్ర పశు విత్తాది ప్రపంచమంతయు ఆత్మార్థము ప్రియమైనదే యనిచెప్పి, నిరుపాధికము నిరతిశయానందమును నగు ఆత్మస్వరూపము అనన్యార్థముగా (స్వార్థముగా) వెలి యుదగినది. అని, యాజ్ఞవల్క్యుఁడు మైత్రేయి యను తన భార్యకు నిట్లుపదేశించెనని యున్నది.

"ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిది ధ్యాసితవ్యః, మైత్రేయ్యాత్మనోవా అరేదర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానేన ఇదంసర్వం విదితమితి" బృ. 4-5-6 పతి యొక్క కామముకొఱకు పతిభార్యకిష్టుఁడగుటలేదు. తన యొక్క కామముకొఱకు పతిభార్యకిష్టుఁడగుచున్నాఁడు. ఇట్లే జాయాపుత్ర పశువిత్తాదికమంతయును దన కామముకొఱకు, దనకిష్టమగుచున్నది. కాన (తాను) ఆత్మ జూడఁదగినది వినఁ దగినది మననముచేయఁ దగినది ధ్యానముచేయఁ దగినది. మైత్రేయీ యిట్లు దర్శన శ్రవణ మనన విజ్ఞానములచే సకలము విదితమగును. అని యుపదేశింపఁబడినది.

ఇందుపదేశింపఁ బడినఆత్మ, జీవుఁడా! పరమాత్మయా! అనిసంశయము. పతిజాయాది భోగ్యజాతముకల

భోక్తనో నుపగ్రహించుటవలన నిందలియాత్మ జీవుడు. పరమాత్మ యసంగుఁడగుటచే నతనికిభోగము సంభవింపదు. అని పూర్వపక్షము రాఁగానిర్ణయము చేయఁబడుచున్నది.

## వాక్యాన్వయాత్ 19

ఇందుపదేశింపఁబడిన యాత్మ పరమాత్మయే. ఎందుచేతననగా, వాక్యాన్వయాత్ = ఉపక్రమోపసంహారములను బర్యాలోచనము చేయుటవలన నీవాక్యములకు బ్రహ్మము నందే యన్వయము గలుగుచున్నది.

ఉపక్రమములో – విత్తసాధ్యములగు కర్మములతో నమృతత్వముసిద్ధించునా ? అని మైత్రేయి యడుగ, "అమృతత్వస్యతు నాశాస్తి విత్తేన" బృ 4-5-8 అమృతత్వమునకు విత్తముతో ఆశలేదు అనిచెప్పెను. అంత మైత్రేయి మోక్షమును గోరుచున్నదై అమృతత్వసాధనముగాని యావిత్తాదికముతో నాకుఁబనిలేదు. అమృతత్వసాధక మగునది యేదో దానినే నాకుఁజెప్పుము. అనియడుగ యాజ్ఞవల్క్యుఁడీ యాత్మజ్ఞానము నుపదేశించెను. ఉపసంహారములో బ్రాహ్మణావసానమున "ఏతావదరే ఖల్వమృతత్వమ్" బృ 4-5-15. అమృతత్వమనఁగా నింతటిది. అనియుపసంహరించెను.

ఇచ్చటఁ జెప్పఁబడినది జీవుఁడేయైనచో జీవజ్ఞానము వలన నమృతత్వము లభించుననుట చెల్లుబోవఁగును. పోనఁ

## 6 వాక్యాన్వయాధికరణము. (19-22)

బృహదారణ్యకములో మైత్రేయీబ్రాహ్మణములో "నవా అరే పత్యుః కామాయ పతిః ప్రియోభవతి ఆత్మనస్తు కామాయ పతిః ప్రియోభవతి, అని మొదలుపెట్టి, పతి జాయా పుత్ర పశు విత్తాది ప్రపంచమంతయు ఆత్మార్థము ప్రియమైనదే యని చెప్పి, నిరుపాధికము నిరతిశయానందమును నగు ఆత్మస్వరూపము అనన్యార్థముగా (స్వార్థముగా) తెలియదగినది. అని, యాజ్ఞవల్క్యుఁడు మైత్రేయి యను తన భార్యకు నిట్లుపదేశించెనని యున్నది.

"ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిది ధ్యాసితవ్యః, మైత్రేయ్యాత్మనోవా అరేదర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానేన ఇదంసర్వం విదితమితి'' బృ. 4-5-6 పతి యొక్క కామముకొఱకు పతిభార్యకిష్టుఁడగుటలేదు. తన యొక్క కామముకొఱకు పతిభార్యకిష్టుఁడగుచున్నాఁడు. ఇట్లే జాయాపుత్ర పశువిత్తాదికమంతయును దనకామముకొఱకు, దనకిష్టమగుచున్నది. కాన (కాను) ఆత్మ జూడఁదగినది వినఁ దగినది మననముచేయఁ దగినది ధ్యానముచేయఁ దగినది. మైత్రేయీ యిట్లు దర్శన శ్రవణ మనన విజ్ఞానములచే సకలము విదితమగును. అని యుపదేశింపఁబడినది.

ఇందుపదేశింపఁ బడినఆత్మ, జీవుఁడా! పరమాత్మయా? అనిసంశయము. పతిజాయాది భోగ్యజాతముకల

భోక్తతో నుపక్రమించుటవలన నిందలిరాత్మ జీవుఁడు. పరమాత్మ యసంగుఁడగుటచే నతనికి భోగము సంభవింపదు. అని పూర్వపక్షము రాఁగా నిర్ణయము చేయఁబడుచున్నది.

### వాక్యాన్వయాత్ 19

ఇందుపదేశింపఁబడిన యాత్మ పరమాత్మయే. ఎందుచేతననగా, వాక్యాన్వయాత్ = ఉపక్రమోపసంహారములను బర్యాలోచనము చేయుటవలన నీవాక్యములకు బ్రహ్మమునందే యన్వయము కలుగుచున్నది.

ఉపక్రమములో — విత్తసాధ్యములగు కర్మములతో నమృతత్వము సిద్ధించునా ? అని మైత్రేయి యడుఁగ, "అమృతత్వస్యతు నాశాస్తి విత్తేన" బృ 4-5-3 అమృతత్వమునకు విత్తముతో నాశలేదు అని చెప్పెను. అంత మైత్రేయి మోక్షమును గోరుచున్నదై అమృతత్వసాధనముగాని యావిత్తాదికముతో నాకుఁబనిలేదు. అమృతత్వసాధక మగునది యేదో దానినే నాకుఁజెప్పుము. అనియడుఁగ యాజ్ఞవల్క్యుఁడీ యాత్మజ్ఞానము నుపదేశించెను. ఉపసంహారములో బ్రాహ్మణావసానమున "ఏతావదరే ఖల్వమృతత్వమ్" బృ 4-5-15. అమృతత్వమనఁగా నింతటిది. అనియుపసంహరించెను.

ఇచ్చటఁ జెప్పఁబడినది జీవుఁడేయైనచో జీవజ్ఞానము వలన నమృతత్వము లభించుననుట నొల్లుపోవఁగును. పోనఁ

గదు. ఆత్మవిజ్ఞానముచే సర్వము విదితమగును అన్నది. పరమాత్మవిజ్ఞానమువలన సర్వము విదితమగునుగాని జీవవిజ్ఞానముచే సర్వము విదితముగాదు. కాన నిందలి యుపక్రమోపసంహారములవలన నిందు ద్రష్టవ్యుఁడు పరమాత్మయే యని సిద్ధాన్తము.

ప్రతిజ్ఞాసిద్ధే ర్లింగ మాశ్మరథ్యః 20

పతిజాయాది భోగ్యజాత, లింగముచే జీవోపక్రమము గనఁబడుచున్నదికదా! అదియెట్లు పొసఁగును? అనిన, ప్రతిజ్ఞాసిద్ధేః = ఏకవిజ్ఞానముచే సర్వము విజ్ఞాతమగునన్న ప్రతిజ్ఞయొక్క సిద్ధికి, ఈజీవోపక్రమము లింగం = లింగము (గమకము)

కార్య కారణ రూపులగు జీవబ్రహ్మలకు భేదాభేదములు రెండును గలవు. అత్యన్తభేదమునే చెప్పినచో నేకవిజ్ఞానప్రతిజ్ఞకు విరోధము కలుగును. అందుచే నభేదాంశమును గ్రహించి చెప్పిన యీజీవోపక్రమణము ఆప్రతిజ్ఞాసిద్ధికి లింగమగునని ఆశ్మరథ్యాచార్యులు తలఁచుచున్నారు.

ఉత్క్రమిష్యత ఏవంభావా దిత్యౌడులోమిః 21

ఉత్క్రమిష్యతః = సంసారదశలో బ్రహ్మకన్న మిక్కిలి భిన్నుఁడై యుండి బ్రహ్మాత్మత్వ సాక్షాత్కారము కలిగి కార్యకరణ సంఘాతమునుండి యుత్క్రమణము పొందఁబోవుచున్న జీవునికి, ఏవంభావాదితి = పరమా

నైక్యభావము గలుగునుగాన, నా భావివ్యపదేశమును దీసి కొని జీవోపక్రమము చేయఁబడినదని యౌడులోమ్యాచార్యులు తలంచుచున్నారు.

అవస్థితేరితి కాశకృత్స్నః 22

అవస్థితేః = పరబ్రహ్మమే అవిద్యాకల్పితభేదముచేత జీవుఁడుగానుండుటవలన జీవోపక్రమణము చేయఁబడినదని కాశకృత్స్నాచార్యులు తలంచుచున్నారు. ఆశ్మరథ్యునిమతములో జీవపరమాత్మలకు భేదాభేదములు. ఔడులోమిమతములో ముక్తికిఁబూర్వము జీవపరమాత్మలకుభేదము తదనన్తరము భేదము. కాశకృత్స్నమతములో జీవపరమేశ్వరులకు భేదములేదు. పరమేశ్వరుఁడేజీవుఁడు తదుపాధులు మిధ్య. ఈ మతము శ్రుతిననుసరించినది.

7 ప్రకృత్యధికరణము (23-27)

"జన్మాద్యస్యయతః" అనుసూత్రమున బ్రహ్మకు జగత్కారణత్వముచెప్పఁబడినది. ఇంతవఱకు బ్రహ్మప్రతిపాదకవాక్యసమన్వయముచే బ్రహ్మకు జగత్కారణత్వము దృఢపఱుపఁబడినది. జగత్తునకు బ్రహ్మకారణమనిన నిమిత్తకారణమా? ఉపాదానకారణమా? అని సంశయముకలుగుచున్నది. (ఏదియైనను గారణమేకదా?)

బ్రహ్మ జగమునకు నిమిత్తకారణము. ఎందుచేతన నఁగా "తదైక్షత" ఛాం. 6-2-3 "స ఈక్షాంచక్రే" ప్ర 6-3. "తదైక్షత బహు స్యాం ప్రజాయేయ" అని సర్వత్ర ఈక్షాపూర్వకమైన కర్తృత్వమే కనఁబడుటవలన. సృజింపఁ దగిన కార్యమును బర్యాలోచనముచేసి చేయుటలోఁ గులాలాదు లందు నిమిత్తకారణత్వమే లోకమునఁ గనబడుటచే జగత్తునకు బ్రహ్మము నిమిత్తకారణమే యగుచున్నది యని పూర్వపక్ష ముగలుగ సిద్ధాన్తమునకై యీయధికరణ మారంభింపఁబడి నది.

## ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాన్తా నుపరోధాత్ — 23

ప్రకృతిశ్చ = జగమునకు బ్రహ్మము ఉపాదానకారణ మున్ను. అగుచున్నది. చకారమువలన నిమిత్తకారణమును అగుచున్నది. ఎందుచేతననఁగా, ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్ = ప్రతిజ్ఞాదృష్టాన్తములయొక్క సామంజస్యమువలన, ప్రతిజ్ఞ యనఁగా, "యేనాశ్రుతం శ్రుతంభవతి అమతంమతమ విజ్ఞాతంవిజ్ఞాతమ్" ఛాం 6-1-2 అన్నది. ఇందు ఆత్మజ్ఞానముచే సర్వము విజ్ఞాతమగును అనుటవలన ఆత్మ ఉపాదానకార ణమని తెలియుచున్నది. నిమిత్తకారణమే యైనచో సర్వజ్ఞాన ము కలుగదు. నిమిత్తకారణమైన కులాలుఁడు తెలిసినంత మాత్రమున ఘటాదికము సర్వము తెలియదు. ఉపాదానో

పాదేయము లవ్యతిరిక్తములుగనుక నుపాదానము తెలిసిన దత్కార్యమగు నుపాదేయమును దెలియును.

దృష్టాంతముగాఁగ:— "యథా సోమ్య! ఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యా ద్వాచారంభణం వికారో నామధేయం మృత్తికే త్యేవ సత్యమ్" ఛాం-6-1-4 అని ఉపాదానవిషయకముగనే యున్నది. మృత్పిండ మొకటి తెలిసినచోఁ దత్కార్యములైన ఘటాదులన్నియును మృణ్మయములేయని తెలియును, వికారమగు ఘటాదికము వాగాలంబనమాత్రమేకాని వాస్తవమున మృత్తికయే సత్యము అనుటచే నుపాదానజ్ఞానముచే నుపాదేయమంతయుఁ దెలియునని చెప్పఁబడినది. కనుక నీప్రతిజ్ఞాదృష్టాంతముల సామంజస్యము గల బ్రహ్మ జగమున కుపాదానకారణమును నిమిత్తకారణమును నగుచున్నాఁడు. అభిన్ననిమిత్తోపాదానకారణమని యర్థము.

అభిధ్యోపదేశాచ్చ. 24

బ్రహ్మ జగమునకభిన్ననిమిత్తోపాదానము అని, అభిధ్యోపదేశాచ్చ = ధ్యానోపదేశమువలనను, దెలియుచున్నది. "సోఽకామయత బహుస్స్యాం ప్రజాయేయ" తై 2-1. అని కామనచే (అభిధ్యానముచే) కర్తృత్వము "బహుస్స్యాం" అనుటచే నుపాదానత్వమును బ్రహ్మకు సంభవించుచున్నవి.

బ్రహ్మ జగమునకు నిమిత్తకారణము. ఎందువేతన నఁగా "తదైక్షత" ఛాం. 6-2-3 "స ఈక్షాంచక్రే" ప్ర 6-3. "తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" అని సర్వత్ర ఈక్షాపూర్వకమైన కర్తృత్వమే కనఁబడుటవలన. సృజింపఁ దగిన కార్యమును బర్యాలోచనముచేసి చేయుటలోఁ గులాలాదు లందు నిమిత్తకారణత్వమే లోకమునఁ గనబడుటచే జగత్తునకు బ్రహ్మము నిమిత్తకారణమే యగుచున్నది యని పూర్వపక్షముగలుగ సిద్ధాన్తమునకై యీయధికరణ మారంభింపఁబడి నది.

## ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాన్తా నుపరోధాత్ — 23

ప్రకృతిశ్చ = జగమునకు బ్రహ్మము ఉపాదానకారణమున్ను, అగుచున్నది. చకారమువలన నిమిత్తకారణమును అగుచున్నది. ఎందుచేతననఁగా, ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్ = ప్రతిజ్ఞాదృష్టాన్తములయొక్క సామంజస్యమువలన, ప్రతిజ్ఞ యనఁగా, "యేనాశ్రుతం శ్రుతంభవతి అమతంమత మవిజ్ఞాతంవిజ్ఞాతమ్" ఛాం 6-1-3 అన్నది. ఇందు ఆత్మజ్ఞానముచే సర్వము విజ్ఞాతమగును అనుటవలన ఆత్మ ఉపాదానకారణమని తెలియుచున్నది. నిమిత్తకారణమేయైనచో సర్వజ్ఞానముకలుగదు. నిమిత్తకారణమైన కులాలుఁడు తెలిసినంత మాత్రమున ఘటాదికము సర్వము తెలియదు. ఉపాదానో

పాదేయము లవ్యతిరిక్తములగుటచే నుపాదానము తెలిసిన దత్కార్యమగు నుపాదేయమును దెలియును.

దృష్టాంతముకూడ:- "యథా సోమ్య! ఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యా ద్వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" ఛాం-6-1-4 అని ఉపాదానవిషయకముగనే యున్నది. మృత్పిండ మొకటి తెలిసినచోఁ దత్కార్యము లైన ఘటాదులన్నియును మృణ్మయము లేయని తెలియును, వికారమగు ఘటాదికము వాగాలంబనమాత్రమే కాని వాస్తవమున మృత్తికే సత్యము అనుటచేను పాదానజ్ఞానముచే నుపాదేయమంతయుఁ దెలియునని చెప్పఁబడినది. కనుక నీప్రతిజ్ఞాదృష్టాంతముల సామంజస్యము వలన బ్రహ్మ జగమున కుపాదానకారణమును నిమిత్తకారణమును నగుచున్నాఁడు. అభిన్ననిమిత్తోపాదానకారణమని యర్థము.

## అభిధ్యోపదేశాచ్చ. 24

బ్రహ్మ జగమునకభిన్ననిమిత్తోపాదానము అని, అభిధ్యోపదేశాచ్చ = ధ్యానోపదేశమువలనను, దెలియుచున్నది. "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయ" తై 2-1. అని కామనచే (అభిధ్యానముచే) కర్తృత్వము "బహుస్యాం" అనుటచే నుపాదానత్వమును బ్రహ్మకు సంభవించుచున్నవి.

### సాక్షాచ్చోభయామ్నానాత్. 25

సాక్షాత్ + చ = సాక్షాత్తుగా, ఉభయామ్నానాత్ = ఉత్పత్తిప్రళయములను రెండింటిని చెప్పుటవలన, బ్రహ్మ జగమున కుపాదానకారణము. "సర్వాణి హ వా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యన్తే, ఆకాశం ప్రత్యస్తం యన్తి" ఛాం 1-9-1 అని ఆకాశపదముచే బ్రహ్మనుగ్రహించి యీసర్వభూతములకు నుత్పత్తిప్రళయము లాకాశమువలననే కలుగుచున్నవని చెప్పఁబడినది. ఏకార్యమున కెచ్చట నుత్పత్తివినాశములు కలుగునో యది దాని కుపాదానకారణము. మృత్తునుండి ఘటము పుట్టును మృత్తునందే యిది లయమగును గాన ఘటమునకు మృత్తు ఉపాదానకారణము. ఆకాశమునుండి సర్వభూతములు పుట్టుచు నాకాశమునందే లయమగుచున్న వనుటచే ఆకాశము అనఁగా ఆకాశపదవాచ్యమగుపరబ్రహ్మ జగమున కుపాదానకారణము.

### ఆత్మకృతేః పరిణామాత్. 26

ఆత్మకృతేః = ఆత్మసంబంధినీ కృతిః = తస్యాః, ఆత్మసంబంధమైన కృతివలన, బ్రహ్మ జగమునకు నిమిత్తకారణము ఉపాదానకారణము నగుచున్నాఁడు, "తదాత్మానం స్వయమకురుత" తై 2-7. ఆత్మను స్వయముగాఁ జేసెను (సృజించెను) స్వయముగా ననుటచేఁ గర్తృత్వము చెప్పఁబడినది. "ఆత్మానం" అనుద్వితీయాన్తముచే కర్మత్వముఁ జెప్పఁబడినది. కర్మత్వముచే నుపాదానత్వమును, కర్తృత్వముచే నిమి

ర్తృత్వమును సిద్ధించుచున్నది. కనుక బ్రహ్మ ప్రపంచమునకు నిమిత్తకారణము నుపాదానకారణమును నగుచున్నాఁడు.

కర్తగాఁ బూర్వము సిద్ధుఁడై యున్న యాత్మకుఁ గర్మత్వ మెట్లుగలుగును? అనఁగా, పరిణామాత్ = పరిణామమువలన, పరిణామమనఁగా వివర్తము. సిద్ధమైనదియు వివర్తరూపమున సాధ్యమగుచుండుటచేఁ గర్మత్వమునొందును.

లేదా పరిణామాత్ అనునది వేఱేసూత్రము. "సచ్చ త్యచ్చాభవత్" తై. 2-6 అని పరిణామ సమానాధికరణముగా ఆత్మ శ్రుతమగుటవలన బ్రహ్మ ఉపాదానకారణము.

### యోనిశ్చహి గీయతే. 27

యోనిశ్చహి = యోనియనికూడ, గీయతే = చెప్పఁబడుచున్నది. "యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః" ముం 1-1-6. యోనిశబ్దము ప్రకృతిపర్యాయముగా లోకమునఁ బ్రసిద్ధముగా నుండుటచే బ్రహ్మ భూతములకుఁ బ్రకృతి =ఉపాదానకారణము. అని చెప్పఁబడుచున్నది.

## 8 సర్వ వ్యాఖ్యానాధికరణము. (28)

"ఈక్షతే ర్నాశబ్దమ్" అను సూత్రము మొదలుకొని యింతవఱకు అశబ్దత్వాది హేతువులవలనఁ బ్రధానకారణవాదమును నిరాకరించినారు. శ్రుతులలో, అణువులు కారణమనినట్లును స్వభావాదులు కారణమన్నట్లును వాదములుగనఁబడుచున్నవి. ఎట్లనఁగా, ఛాందోగ్యములో శ్వేతకేతువునుద్దేశించి యుద్దాలకుఁడు స్థూలజగత్తునకు సూక్ష్మతత్త్వమునం

దంతర్వ్యాఖ్యానమును జెప్పఁదలంచి "న్యగ్రోధఫల మత ఆహర, ఇదంభగవః, భింధీతి, భిన్నంభగవఇతి, కిమత్రపశ్యసి, అణవ ఇవేమాధానాః, ఆసా మంగ ఏకాం భింధి, భిన్నా భగవః, కిమత్రపశ్యసి, నకించన భగవః, తగ్ంహోవాచ [illegible]ం వై సౌమ్య ఏత మణిమానం న నిభాలయస ఏతస్యైవ ఖలు సోమ్య ఏషోణిమ్నః ఏవం మహాన్ న్యగ్రోధ స్తిష్ఠతీతి, ఛాం 6-12-1. (అర్థము :- ఈ రావిపండు నిటు తెమ్ము, తెచ్చితిని. బ్రద్దలుగొట్టుము, కొట్టితిని. ఏమిచూచుచున్నావు? అణువులవంటి గింజలను, ఒకదానిని బ్రద్దలుకొట్టుము. కొట్టితిని. ఏమున్నది ఏమియును లేదు, నీవు గుర్తింపలేని యీసూక్ష్మమువంటే యీ మహాన్యగ్రోధ వృక్షమున్నది. అని ప్రశ్నోత్తర రూపముగు నీసంవాదమున జగముయొక్క ప్రాగవస్థలో అణువులు, ఏమియును లేదని, శూన్యస్వభావము దృష్టాంతముగాఁ జూపఁబడినది. ఇట్లే తైత్తిరీయములో "అసద్వా ఇద మగ్ర ఆసీత్, తై 2|- అని అసద్వాదము కనఁబడుచున్నది. ఈవాదములందు శ్రుతులకుఁ దాత్పర్యమున్నదా ? లేదా ? అని సంశయము గలుగుచున్నది. తాత్పర్యమున్నది. జగమునకు అణ్వాదులునుగారణమే యని పూర్వపక్షము వచ్చుచుండ నీయధికరణ మారంభింపఁబడినది.

ఏతేన సర్వే వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః 28

ఏతేన = ఈప్రధానకారణవాద నిరాకరణముచేత, సర్వే = అణ్వాదికారణవాదములన్నియును, వ్యాఖ్యాతాః= నిరాకరింపఁబడినవిగా వ్యాఖ్యానముచేయఁబడినవి. ప్రధా

సము కారణ మనుటలో, అశబ్దత్వము అచేతనత్వము, ఏక విజ్ఞానప్రతిజ్ఞావిరోధములను నేదోషములు చూపింపఁబడినవో ఆదోషములు అణ్వాదులు కారణమనువారిలోను దుల్యములే గనుక నామతములును నిరాకృతములనియే భావము. నకించన, అనుపది = ఏమియును లేదు, అనువాల అభివ్యక్తనామ రూపపరము. అభివ్యక్తమైన నామరూపములుకలది యేదియును లేదనిభావము. కాని శూన్యస్వభావమని కాదు. అసద్వ్యాఅనువాదము "కథ మసతః సజ్జాయేత?" = అసత్తు నుండి సత్తు ఎట్లుపుట్టును? అని నిరాకరింపఁబడినది. అను పదము సూత్రమైనదనునర్థములో గౌణము. "వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః" అని రెండుమారులుచ్చరించుట యధ్యాయ పరిసమాప్తిసూచకము.

ఇతి శ్రీమద్భగవ ద్బాదరాయణ ప్రణీత
శారీరకమీమాంసా సూత్రములకు
భారద్వాజసగోత్ర పవిత్ర వారణాస్య
న్వవాయ సుధాపయోధిరాకా కౌముదీ
సుధాకరులగు శ్రీమదచ్యుతాంబా
వేంకటేశ్వరుల యాత్మజుఁడగు
గంగాధరశాస్త్రి రచించిన బ్రహ్మ
సూత్రార్థదీపికయను
బ్రహ్మసూత్రవృత్తియందుఁ
ప్రథమాధ్యాయమునఁ జతుర్థపాదము
ప్రథమాధ్యాయము ముగిసెను.

ఈపాదమున 8- అధికరణములు 28 సూత్రములు
మొత్తమీయధ్యాయమున39-అధి- 134 సూత్రములు.

శ్రీరస్తు

# ద్వితీయాధ్యాయము-ప్రథమపాదము.

(ఈరెండవదగువిరోధాధ్యాయమునఁ బ్రథమపాదమున సాంఖ్య యోగ కాణాదాది స్మృతులతోను, సాంఖ్యాదిప్రయుక్త తర్కములతోను వేదాన్తవాక్యసమన్వయములోఁగల విరోధము పరిహరింపఁబడుచున్నది.)

ప్రథమాధ్యాయమున సర్వజ్ఞుఁడు సర్వశక్తియు నగు పరమేశ్వరుఁడు జగజ్జన్మాదికారణమనియు, వేదాన్తవాక్యము లన్నిటికిని నతనియందే సమన్వయమనియును నిరూపింపఁబడినది. వేదప్రతిపాదితములు కావుటచేఁ ప్రధానాదులు జగత్కారణములు కావని నిరాకరింపఁబడినవి. ఇప్పుడు స్వపక్షమునకు సాంఖ్యాదిస్మృతితోను తర్కములతోను గలుగు విరోధమును బరిహరించుచున్నారు.

పూర్వాధ్యాయమునఁ జెప్పినసమన్వయమునకు ఇందు స్మృతివిరోధమును జూపించి నిరసించుచున్నారుగాన నీరెండధ్యాయములకును విషయవిషయిభావసంబంధము కలదు సంగతియుగలదు.

## 1 స్మృత్యధికరణము. (1-2)

"బ్రహ్మమే సర్వజగత్కారణము, అను విషయమున సాంఖ్యాదిస్మృతితో విరోధమున్నదా? లేదా? అని సంశయము.

విరోధమున్నది. ఏమనగా, కపిలమహర్షి సర్వజ్ఞుడు. అతడు రచించినదగుటచే స్మృతి ప్రమాణము. శ్రుతికూడ, "ఋషిం ప్రసూతం కపిలం యస్తమగ్రే, జ్ఞానై ర్బిభర్తి జాయమానంచ పశ్యేత్" సృష్ట్యాదియందు బుట్టినవాడును, స్థితికాలమునఁ బ్రసూతుఁడును నగు కపిలుడు భూత భవిష్య ద్వర్తమాన విషయక జ్ఞానము కలవాడు. అతనిని పరమేశ్వరునిగా గ్రహింపవలెను; అని చెప్పుటచే నట్టి కపిలప్రోక్తమగు స్మృతికిఁ బ్రాబల్యము కలదు. కనుక బ్రహ్మమే జగత్కారణమనుట తగదు. అని పూర్వపక్షము కలుగ సిద్ధాన్తముచేయుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

స్మృత్యనవకాశ దోషప్రసంగ ఇతిచేన్న
అన్యస్మృత్యనవకాశ దోషప్రసంగాత్.1

స్మృతి+అనవకాశ+దోషప్రసంగః, ఇతిచేత్ =స్మృతి = కపిలమహర్షి రచించిన సాంఖ్యస్మృతికి, అనవకాశదోష ప్రసంగః = అవకాశము లేకపోవుట యను దోషప్రసంగము, ఇతిచేత్ = కలుగుచున్నది యన్నచో- కపిలుడు, ప్రధానము జగత్కారణముఅని రచించిన స్మృతి నిరవకాశమగుచున్నది. బ్రహ్మమేకారణము, ప్రధానముకాదు, అన్నచో అన్యస్మృతి కవకాశములేదు కాన అస్మృతిప్రాబల్యముచే వేదాన్తములను ప్రధానకారణవాదమునకు అనుకూలముగా మార్చవలయును, అన్నచో, అని యర్థము.

న = అట్లు కాదు, ఏమి? అన్యస్మృత్యనవకాశ దోష ప్రసంగాత్ = కపిలుని సాంఖ్యస్మృతిననుసరించి ప్రధాన కారణవాదమును చెప్పిన, ఇతరములయిన స్మృతులకు అనవకాశత్వ రూప దోషము ప్రసక్తమగుచున్నది. అందువలన అనవకాశత్వరూప దోషముచే ప్రధానము కారణమనరాదు.

యత్త త్సూక్ష్మ మవిజ్ఞేయం పరం బ్రహ్మ "అని ప్రారంభించి.

"స హ్యన్తరాత్మా భూతానాం క్షేత్రజ్ఞశ్చేతి కథ్యతే తస్మా దవ్యక్త ముత్పన్నం త్రిగుణం ద్విజసత్తమ! అని యవ్యాకృతి నామరూపమగు ప్రపంచము బ్రహ్మజన్యమని పాత్మ్యమునను, "అహం సర్వస్య జగతః ప్రభవః ప్రళయ స్తథా" అని భగవద్గీతలో 7-6-లోను జగమునకు చేతన కారణత్వము చెప్పబడుచున్నది. ఇట్లు స్మృతిద్వయమునకు విరోధము సంభవించినచో శ్రుత్యనుగుణమైన స్మృతి ప్రబలము అనిచెప్పవలెను. కాన సాంఖ్యస్మృతి ప్రమాణముకాదు.

ఇతరేషాం చానుపలబ్ధేః. 2

ఇతరేషాం=సాంఖ్యస్మృతిసిద్ధములైన మిగిలిన మహదహంకారాది తత్త్వములకు, అనుపలబ్ధేశ్చ = లోకమునందు, వేదమునందును నెచ్చటను గనబడకపోవుట వల్లను గూడ సాంఖ్యస్మృతి ప్రమాణముకాదనుట దోషముకాదు.

కనుక తదేకదేశమైన ప్రధానస్మృతియును ప్రమాణము కాదు.

### 2 యోగప్రత్యుక్త్యధికరణము. (3)

సాంఖ్యమతమును నిరాకరించుటచే యోగమతమును గూడ నిరాకరించినట్లేయని చెప్పుచున్నారు.

### ఏతేన యోగః ప్రత్యుక్తః. 3

ఏతేన = ఈసాంఖ్యమతనిరాసముచేత, యోగః = యోగమతమున్ను ప్రత్యుక్తః =నిరాకరింపఁబడినది. కాపిల (సాంఖ్య) మత నిరాసముచేత, పాతంజల (యోగ) మతమును నిరసింపఁబడినదని యర్థము. యోగులు సేశ్వరులు = (ఈశ్వరుఁడున్నాఁడని చెప్పుదురు) సాంఖ్యులు, ప్రధాన వాదులు. అన్నది భేదము. మిగిలిన ప్రధానాదిప్రక్రియ సమానము.

సాంఖ్యమతమును నిరాకరించినట్లుగ, యోగమతమును నిరాకరించుట తగదు. యోగము శ్వేతాశ్వతరాదిశాఖలయందుఁ జెప్పఁబడినది. ఇది జ్ఞాన సాధనము. శ్రుతిసిద్ధమైన ఆత్మజ్ఞానమునకు సాధనముగా యోగముచెప్పఁబడినది. "త్రిరున్నతం స్థాప్య సమంశరీరమ్" శ్వే. శా. 2-8. కాయము, శిరస్సు, కంఠము, నీమూఁడింటిని సున్నతముగనుంచునట్లు శరీరమును నిలిపి యోగమును బూనవలెను. అనియు, "శాం

యోగమితి మన్యన్తే స్థిరా మింద్రియధారణామ్'' కఠ 2-3-12.విద్యా మేతాం యోగవిధిం చకృత్స్నమ్'' అని బ్రహ్మ విద్యను యోగప్రకారమును నచికేతుఁడు యమునివలనఁ బొందినట్లును శ్రుతులలోఁ జెప్పఁబడినది. కాన నిది ప్రమాణ మేయగును, అన్నచో నిజమే శ్రుతిసిద్ధమగుటచే యోగము ప్రమాణమే. కాని ఇది యవైదికమగు ప్రధానము నాలంబనముగాఁజేసికొని చెప్పఁబడినది. అందుచేత నావిషయమున నిది యప్రమాణము. మిగిలినవిషయములఁ బ్రమాణము. సాంఖ్యము యోగము అను నీరెండును గూడ వేదాన్తములకు విరోధింపనివిషయములోఁ బ్రమాణములు. విరోధించువిషయములో అప్రమాణములును అని యెఱుంగవలయును.

### 3 విలక్షణత్వాధికరణము.(4-12)

బ్రహ్మ జగత్కారణమగుటలో వచ్చిన సాంఖ్య యోగ స్మృతి విరోధము పరిహరింపఁబడినది. తర్కవిరోధమును బరిహరించుటకై యీయధికరణ మారంభింపఁబడు చున్నది.

తర్కము, స్వతంత్రముగ శ్రుతిని విరోధించునది కాక పోయినను, మననమును విధించుచున్న, "శ్రోతవ్యో మన్తవ్యః'' అను, బృ.2-4-5. శ్రుతి, తర్కము నాదరింపవలెనని తెలుపుచున్నది. మనన మనుమాట చేతనే తర్కము చెప్పఁబడుచున్నది. "యుక్తిభి రనుచిన్తనం మననం''యుక్తులతో

నను చింతనముచే జూటనే మననము గనుక మననమనఁగా 'తర్కమని'యే యర్థము. బలవత్తర తర్క విరోధము సంభవించినచో దానిని వారింపవలెను గనుక తర్కవిషయకముగ ఆక్షేపము చేయఁబడుచున్నది.

న, విలక్షణత్వా దస్య తథాత్వం చ, శబ్దాత్. 4

న = "చేతనమగు బ్రహ్మ జగత్కారణము" అను మాట కుదరదు (కాదు)ఎందుచేత? అస్య = ఈజగము, విలక్షణత్వాత్ = స్వకారణమైన బ్రహ్మముకంటె విలక్షణము కనుక. బ్రహ్మము; చేతనము, ప్రకాశరూపము, ఆనందాత్మకము, శుద్ధము నైనది. జగము; అచేతనము అప్రకాశము, దుఃఖరూపము, అశుద్ధమైనదియును గనుక, రెండింటికిని వైలక్షణ్య మున్నది. తథాత్వంచ = వైలక్షణ్యమున్నదను సంగతియును, శబ్దాత్ = వేదశబ్దమువలననే తెలియుచున్నది. "విజ్ఞానం చావిజ్ఞానంచ" తై. 2-6-అను శ్రుతి బ్రహ్మ చేతనమనియు జగమ చేతన మనియుఁ దెలుపుచున్నది.

అచేతన మగుజగత్తు చేతనమగు బ్రహ్మనుండి పుట్ట లేదు. విలక్షణముకనుక. ఏది దేనికంటె విలక్షణమో అది దానినుండిపుట్టలేదు. మట్టినుండి బంగారుకుండలములు పుట్ట నట్లు. కనుక బ్రహ్మ జగత్కారణము కాదు. అని తర్కప్రయోగము.

యోగమితి మన్యన్తే స్థిరా మింద్రియధారణామ్'' కఠ 2-3-12. విద్యా మే తాం యోగవిధిం చకృత్స్నమ్'' అని బ్రహ్మ విద్యను యోగప్రకారమును నచికేతుఁడు యమునివలనఁ బొందినట్లును శ్రుతులలోఁ జెప్పఁబడినది. కావ నిది ప్రమాణ మేయగును, అన్నచో నిజమే శ్రుతిసిద్ధమగుటచే యోగము ప్రమాణమే. కాని ఇది యవైదికమగు ప్రధానము నాలంబనముగాఁ జేసికొని చెప్పఁబడినది. అందుచేత నావిషయమున నిది యప్రమాణము. మిగిలినవిషయములఁ బ్రమాణము. సాంఖ్యము యోగము అను నీరెండును గూడ వేదాన్తములకు విరోధింపనివిషయములోఁ బ్రమాణములు. విరోధించువిషయములో అప్రమాణములును అని యెఱుఁగవలయును.

### 3 విలక్షణత్వాధికరణము.(4-12)

బ్రహ్మ జగత్కారణమగుటలో వచ్చిన సాంఖ్య యోగ స్మృతి విరోధము పరిహరింపఁబడినది. తర్కవిరోధమును బరిహరించుటకై యీయధికరణ మారంభింపఁబడు చున్నది.

తర్కము, స్వతంత్రముగ శ్రుతిని విరోధించునది కాక పోయినను, మననమును విధించుచున్న, "శ్రోతవ్యో మన్తవ్యః" అను, బృ. 2-4-5. శ్రుతి, తర్కము నాదరింపవలెనని తెలుపుచున్నది. మనన మనుమాట చేతనే తర్కము చెప్పఁబడుచున్నది. "యుక్తిభి రనుచిన్తనం మననం"యుక్తులతో

వను చింతనము చేయుటయే మననము గనుక మననమనఁగా 'తర్కమని'యే యర్థము. బలవత్తర తర్క విరోధము సంభవించినచో దానిని వారింపవలెను గనుక తర్కవిషయకమగు ఆక్షేపము చేయఁబడుచున్నది.

న, విలక్షణత్వా దస్య తథాత్వం చ, శబ్దాత్. 4

న = "చేతనమగు బ్రహ్మ జగత్కారణము" అను మాట కుదరదు (కాదు) ఎందుచేత? అస్య = ఈజగము, విలక్షణత్వాత్ = స్వకారణమైన బ్రహ్మముకంటె విలక్షణము గనుక. బ్రహ్మము; చేతనము, ప్రకాశరూపము, ఆనందాత్మకము, శుద్ధము నైనది. జగము; అచేతనము అప్రకాశము, దుఃఖరూపము, అశుద్ధమైనదియును గనుక, రెండింటికిని వైలక్షణ్య మున్నది. తథాత్వంచ = వైలక్షణ్యమున్నదను సంగతియును, శబ్దాత్ = వేదశబ్దమువలననే తెలియుచున్నది. "విజ్ఞానం చావిజ్ఞానంచ" తై.2-6-అను శ్రుతి బ్రహ్మ చేతనమనియు జగ మచేతన మనియుఁ దెలుపుచున్నది.

అచేతనమగుజగత్తు చేతనుఁడగు బ్రహ్మనుండి పుట్టలేదు. విలక్షణముగనుక. ఏది దేనికంటె విలక్షణమో అది దానినుండిపుట్టలేదు. మట్టినుండి బంగారుకుండలములు పుట్టనట్లు. కనుక బ్రహ్మ జగత్కారణము కాదు. అని తర్కప్రయోగము.

అపః-=వైలక్షణ్యము లేదు. బ్రహ్మవలె జగమును చేతనమే. "మృదబ్రవీత్" "ఆపోఽబ్రువన్" శ.బ్రా. 6-1-3. "తత్తేజ ఐక్షత" "తా ఆప ఐక్షన్త" ఛాం-6-2-3-4. మృత్తుపలికినది, ఉదకములు పలికినవి (చెప్పినవి) తేజస్సు చూచెను, ఉదకములు చూచినవి, అని, పృథివ్యప్తేజస్సు లను భూతములకు పలుకుట చూచుట యను చేతనవ్యవహారము కనిపించుచున్నది. ఇది కాక "తేహేమే ప్రాణాః అహంశ్రేయసే వివదమానాః" బృ. 6-1-7 "నేను శ్రేయస్సునకు మూలము. నేను శ్రేయస్సునకు మూలము," అని యింద్రియములు వివాదపడుచున్నవని యున్నది. వివాదముపడుటయును చేతనధర్మమే. భూతములందు నింద్రియములయందును నిట్లు చేతనవ్యవహారము గనఁబడుటచే బ్రహ్మమువలె జగమును చేతనమే. వైలక్షణ్యము లేదు. అన్నచో

అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్. 5

అభిమానివ్యపదేశస్తు - "మృదబ్రవీత్", ఆపోఽబ్రువన్, తేజఐక్షత, మున్నగు శ్రుతులవలన భూతేంద్రియములకు చేతనత్వము నాశంకింపరాదు. ఆవ్యవహారము అభిమాని దేవతల వ్యపదేశము. మృదభిమాని దేవత జలాభిమాని దేవత, తేజోఽభిమాని దేవత, యని అభిమాని దేవతలు చెప్పఁబడుచుండిరి కాని, కేవల భూతేంద్రియ మాత్రము చెప్పఁబడుటలేదు. ఎందుచేత ననఁగా, విశేషానుగతిభ్యామ్ = విశేషము, అనుగతి యను

రెండింటిచేతను, నిచ్చట నింద్రియ భూతవిషయమున అభి మాని దేవతలని యర్థము చెప్పవలెను. విశేషము:- "తేహేమే ప్రాణా అహం శ్రేయసే" అనుచోట, "ఏతా హ వై దేవతాః" అని దేవతాశబ్దము విశేషింపబడి యున్నది. "అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" ఐత.ఆర.24-2-4. మొదలగు శ్రుతి ఇంద్రియములందు దేవతానుగతిని తెలుపుచున్నవి. ఇట్లే మంత్రార్థవాదేతిహాసాదుల యందు అంతటను తత్తదభిమాని దేవతలు చేతనలుగాఁ జెప్పఁబడినట్లున్నది. కనుక జగ మచేతనము. బ్రహ్మచేతనుఁడు. జగత్తు బ్రహ్మప్రకృతికము కాదుఅని పూర్వపక్షము రాగా సిద్ధాన్తము చేయఁబడుచున్నది.

## దృశ్యతే తు. 6

ఇచ్చటి తుశబ్దము పూర్వపక్షనిరాసకము. అనఁగా వైలక్షణ్యముండుటచేత జగము బ్రహ్మప్రకృతికము కాదు అని యనరాదు - దృశ్యతే = వైలక్షణ్యమున్నను ప్రకృతి వికృతిభావము గనిపించుచున్నది. లోకములోఁ జేతనుఁడగు పురుషునినుండి యచేతనములగు నఖలోమాదులు పుట్టుచున్నవి. అచేతనములగు గోమయాదులనుండి చేతనములగు వృశ్చికాదులు పుట్టుచున్నవి. ప్రకృతి స్వభావ మంతయు వికృతియం దుండవలెనని యనరాదు. అట్లున్నచో నది వికృతియేగాదు. ఏదోకొంత స్వభావము మాత్రమున్న

అవః-=వైలక్షణ్యము లేదు. బ్రహ్మమువలె జగమును చేతనమే. "మృదబ్రవీత్" "ఆపోఽబ్రువన్" శ.బ్రా. 6-1-3. "తత్తేజ ఐక్షత" "తా ఆప ఐక్షన్త" ఛాం-6-2-3-4. మృత్తు పలికినది, ఉదకములు పలికినవి (చెప్పినవి) తేజస్సు చూచెను, ఉదకములు చూచినవి, అని, పృథివ్యప్తేజస్సు లను భూతములకు పలుకుట చూచుట యను చేతనవ్యవహారము కనిపించుచున్నది. ఇది కాక "తేహేమే ప్రాణాః అహంశ్రేయసే వివదమానాః" బృ. 6-1-7 "నేను శ్రేయస్సునకు మూలము. నేను శ్రేయస్సునకు మూలము," అని యింద్రియములు వివాదపడుచున్నవని యున్నది. వివాదముపడుటయును చేతనధర్మమే. భూతములందు నింద్రియములయందును నిట్లు చేతనవ్యవహారము గనంబడుటచే బ్రహ్మమువలె జగమును చేతనమే. వైలక్షణ్యము లేదు. అన్నచో

అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్. 5

అభిమానివ్యపదేశస్తు - "మృదబ్రవీత్, ఆపోఽబ్రువన్, తేజఐక్షత, మున్నగు శ్రుతులవలన భూతేంద్రియములకు చేతనత్వము నాశంకింపరాదు. ఆవ్యవహారము అభిమాని దేవతల వ్యపదేశము. మృదభిమాని దేవత జలాభిమాని దేవత, తేజోభిమాని దేవత, యని అభిమాని దేవతలు చెప్పఁబడుచుండిరి కాని, కేవల భూతేంద్రియ మాత్రము చెప్పఁబడుటలేదు. ఎందుచేత ననఁగా, విశేషానుగతిభ్యామ్ = విశేషము, అనుగతి యను

కొండింటిచేతను, నిప్పుల నింద్రియ భూతవిషయములను తదభిమాని దేవతలని యర్థము చెప్పవలెను. విశేషము:- "తేహేమే ప్రాణా అహం శ్రేయసే" అనుచోట, "ఏతాహ వై దేవతాః"అని దేవతాశబ్దము విశేషితమై యున్నది. "అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" ఐత.ఆర.2-2-4. మొదలగు శ్రుతి ఇంద్రియములందు దేవతానుగతిని దెలుపుచున్నవి. ఇట్లే మంత్రార్థవాదేతిహాసాదుల యందు అంతటను తత్తదభిమాని దేవతలు చేతనలుగాఁ జెప్పఁబడినట్లున్నది. కనుక జగ మచేతనము. బ్రహ్మచేతనుఁడు. జగత్తు బ్రహ్మప్రకృతికము కాదుఅని పూర్వపక్షము రాగా సిద్ధాన్తము చేయఁబడుచున్నది.

### దృశ్యతే తు. 6

ఇచ్చట తుశబ్దము పూర్వపక్షనిరాసకము. అనఁగా వైలక్షణ్యముండుటచేత జగము బ్రహ్మప్రకృతికము కాదు అని యనరాదు - దృశ్యతే = వైలక్షణ్యమున్నను ప్రకృతి వికృతిభావము గనిపించుచున్నది. లోకములోఁ జేతనుఁడగు పురుషునినుండి యచేతనములగు నఖలోమాదులు పుట్టుచున్నవి. అచేతనములగు గోమయాదులనుండి చేతనములగు వృశ్చికాదులు పుట్టుచున్నవి. ప్రకృతి స్వభావ మంతయు వికృతియం దుండవలెనని యనరాదు. అట్లున్నచో నది వికృతియేగాదు. ఏదోకొంత స్వభావము మాత్రమున్న

అవః-=వైలక్షణ్యములేదు. బ్రహ్మమువలె జగమును చేతనమే. "మృదబ్రవీత్" "ఆపోఽబ్రువన్" శ.బ్రా. 6-1-3. "తత్తేజ ఐక్షత" "తా ఆప ఐక్షన్త" ఛాం-6-2-3-4. మృత్తుపలికినది, ఉదకములు పలికినవి (చెప్పినవి) తేజస్సుచూచెను, ఉదకములు చూచినవి, అని, పృథివ్యప్తేజస్సు లను భూతములకు పలుకుట చూచుట యను చేతనవ్యవహారము కనిపించుచున్నది. ఇది కాక "తేఽహేమే ప్రాణాః అహంశ్రేయసే వివదమానాః" బృ. 6-1-7 "నేను శ్రేయస్సునకు మూలము. నేను శ్రేయస్సునకు మూలము," అనియింద్రియములు వివాదపడుచున్నవని యున్నది. వివాదముపడుటయును చేతనధర్మమే. భూతములందు నింద్రియములయందును నిట్లు చేతనవ్యవహారము గనఁబడుటచే బ్రహ్మమువలె జగమును చేతనమే. వైలక్షణ్యము లేదు. అన్నచో

అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్. 5

అభిమానివ్యపదేశస్తు = "మృదబ్రవీత్, ఆపోఽబ్రువన్, తేజఐక్షత, మున్నగు శ్రుతులవలన భూతేంద్రియములకు చేతనత్వము నాశంకింపరాదు. ఆవ్యవహారము అభిమాని దేవతల వ్యపదేశము. మృదభిమాని దేవత జలాభిమాని దేవత, తేజోభిమాని దేవత, యని అభిమాని దేవతలు చెప్పఁబడుచుండిరికాని, కేవల భూతేంద్రియ మాత్రము చెప్పఁబడుటలేదు. ఎందుచేత ననఁగా, విశేషానుగతిభ్యామ్ = విశేషము, అనుగతి యను

కొండలింటివేశను, ఇచ్చట నింద్రియ భూతవిషయమున తదభి మానిదేవతలని యర్థము చెప్పవలెను. విశేషము:- "తేహేమే ప్రాణా అహంశ్రేయసే" అనుచోట, "ఏతాహ వై దేవతాః" అని దేవతాశబ్దము విశేషింపబడి యున్నది. "అగ్ని ర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" ఐత.అర.2-2-4. మొదలగు శ్రుతి ఇంద్రియములందు దేవతానుగతిని దెలుపుచున్నవి. ఇట్లే మంత్రార్థవాదేతిహాసపురాణముల యందు అంతటను తత్తదభిమానిదేవతలు చేతనలుగాఁ జెప్పఁబడినట్లున్నది. కనుక జగ మచేతనము. బ్రహ్మచేతనుఁడు. జగత్తు బ్రహ్మప్రకృతికము కాదుఅని పూర్వపక్షమురాగా సిద్ధాంతము చేయఁబడుచున్నది.

## దృశ్యతే తు. 6

ఇచ్చటి తుశబ్దము పూర్వపక్షనిరాసకము. అనఁగా వైలక్షణ్యముండుటచేత జగము బ్రహ్మప్రకృతికము కాదు అని యనరాదు - దృశ్యతే = వైలక్షణ్యమున్నను ప్రకృతి వికృతిభావము గనిపించుచున్నది. లోకములోఁ జేతనుఁడగు పురుషునినుండి యచేతనములగు నఖలోమాదులు పుట్టుచున్నవి. అచేతనములగు గోమయాదులనుండి చేతనములగు వృశ్చికాదులు పుట్టుచున్నవి. ప్రకృతి స్వభావ మంతయు వికృతియం దుండవలెనని యనరాదు. అట్లున్నచో నది వికృతియేగాదు. ఏదోకొంత స్వభావము మాత్రమున్న

జాలును. అది ప్రకృతమునఁ బ్రపంచమునందు, సత్తే (బ్రహ్మ సత్తే) యున్నది.

కనుక ప్రపంచరూపమగు సర్వవికారము బ్రహ్మప్రకృతికమే యనవలెను. ఏది చేతనాన్వితముకాదో అది బ్రహ్మప్రకృతికము కాదు. అని చెప్పుటకు, (ఎట్లనఁగా అని చూపుటకు) దృష్టాన్తములేదు. బ్రహ్మవిషయములోఁ గేవలమాగమమేకాని తర్కము పయోగింపదు. శ్రోతవ్యోమంతవ్యః అనుచోట మన్తవ్యః అనునది తర్కము నాదరింపవలెనని తెలుపుచున్నదియనుట, శ్రుత్యనుగృహీత మగుతర్కము అనుభవమునకు అంగముగా గ్రహింపఁబడుననుటకు మాత్రమే సూచకము. కావుననే, "నైషా తర్కేణ మతిరాపనేయా ప్రోక్తాన్యేనైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ!" కాఠ. 1. 2. 9. (ప్రేష్ఠ; = ఓహితుఁడా; ఈబ్రహ్మవిషయమగు బుద్ధి తర్కముచేఁ బొందించుటకు వీలుకానిది. వేదజ్ఞుఁడగు నొకగురువుచేఁ జెప్పఁబడినదై చక్కని జ్ఞానముకొఱ కుపయోగించును. అని చెప్పఁబడినది. స్మృతిలో, గూడ "అచిన్త్యాఃఖలు యే భావాః న, తాంస్తర్కేణ యోజయేత్" అచిన్త్యములగు భావములను దర్కముతో యోజింపరాదు. అని చెప్పఁబడినది.

అసదితిచేన్న ప్రతిషేధమాత్రత్వాత్. 7

అసత్, ఇతి, చేత్, న, ప్రతిషేధ మాత్రత్వాత్.

నామ రూపాది హీనమగు చేతనమైన బ్రహ్మము నామరూపాదులుకల జగమునకుఁ గారణమన్నచో ఉత్పత్తికిఁ

బూర్వము జగత్తు, అసదితిచేత్ = అసత్తేయగు నన్నచో. న = కాదు. ఎందుచేత; ప్రతిషేధమాత్రత్వాత్ = ప్రతిషేధమాత్రమేయగుట వలన, అనఁగా, కేవలప్రతిషేధమేకాని ప్రతిషేధ్యమగు అర్థములేదు. కారణసత్తచేతనే కార్యము యొక్క సత్త కాని, = కారణముండుటచేతనే కార్యముండుట కాని, కారణములేనిది కార్యసత్తలేదు. ఉత్పత్త్యనన్తరము కార్యము (జగము) కారణరూపముననే యున్నట్లు ఉత్పత్తికిఁబూర్వమునను గార్యము కారణమగు బ్రహ్మరూపముననే యున్నది.

అపీతౌ తద్వత్ప్రసంగా దసమంజసమ్.

సావయవము, అచేతనము, పరిచ్ఛిన్నము, అశుద్ధి, యగు జగద్రూపకార్యము బ్రహ్మకారణకమైనచో, అపీతౌ = ప్రళయమునందు, తద్వత్ప్రసంగాత్ = తనలో లయమైన జగము యొక్క సావయవత్వాచేతనత్వాది ధర్మములు కలిగి బ్రహ్మకూడ దూషింపఁబడుటవలన, అసమంజసమ్ = నిరవయవము, చేతనము, అపరిచ్ఛిన్నము, పరిశుద్ధము నగుబ్రహ్మము, జగత్కారణమనుట సమంజసముగాదు.

నతు దృష్టాన్తభావాత్. 9

నతు = అటువంటిఅసామంజస్యములేదు. కార్యము యొక్క దోషములు కారణమును దూషించుననునదిలేదు. దృష్టాన్తభావాత్ = కార్యము కారణములో లయ

మగునపుడు తనధర్మములచే, కారణమును దోషయుక్తముగాఁ జేయుననుటకుఁ జెల్లు. దృష్టాన్తము లుండుటవలన నట్టి యసామంజస్యమేమియును లేదు. ఘట శరావా(మూకుడు)దులు తమ కారణమగు మృత్తి(మట్టి)లో లయమగునపుడు స్వధర్మములచే మృత్తును దోషయుక్తముగాఁ జేయుటలేదు. కంకణకుండలాదులు స్వకారణమగు బంగారములో లయమగునపుడు బంగారమును దోషముకలదానినిగాఁ జేయుటలేదు. "ఇదం సర్వం యదయమాత్మా" బృ.2-4-6. "బ్రహ్మైవేద మమృతం పురస్తాత్" ముం.2.2.11. "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఛాం.3-14-1. మొదలగు శ్రుతులచేఁ గార్యము త్రికాలములందును గారణాభిన్నమని తెలియుచున్నది. మాయావి తాను జేయుమాయలచేఁ దానుదూషింపఁబడనట్లు పరమాత్మ తనయందధ్యస్తమగు జగము(కార్యము)చే దాను దూషింపఁబడఁడు.

## స్వపక్షదోషాచ్చ. 10

స్వపక్షమందును, దోషముండుటవలన నీయాక్షేపము సరియైనదికాదు. బ్రహ్మకన్న జగము విలక్షణమగుటవలనఁ బ్రకృతివికృతిభావము కుదరదనియు, ఉత్పత్తికంటెఁబూర్వము జగత్తున కసత్త్వముకలుగుననియు, ప్రళయమునందు జగము బ్రహ్మములో లీనమగునపుడు జాడ్యాశుద్ధ్యాది గుణములు కలజగముచే బ్రహ్మ దూషితుఁడగుననియును, సాం

ఖ్యులు మహానుదోషములు సూచించి, ఆదోషములచే బ్రహ్మ జగమునకు కారణము కాదని చెప్పిరి. ఆమూడు దోషములును (ప్రధానము జగత్కారణమను) సాంఖ్యులకును సమానములే. శబ్దాదిహీనమగు ప్రధానమునుండి శబ్దాదులుకల ప్రపంచము పుట్టినదని వారంగీకరించుటచే ప్రపంచము ప్రధానముకంటె విలక్షణము. వాస్తవముచే ప్రపంచము సత్యమని చెప్పునట్టి సాంఖ్యునకే యాదోషములు కాని, అనిర్వచనీయమని చెప్పువారికి (వేదాంతులకు) ఆదోషములు లేవు.

తర్కాప్రతిష్ఠానా దప్యన్యథానుమేయ మితి చేత్

ఏవ మప్యనిర్మోక్షప్రసంగః. 11

తర్కాప్రతిష్ఠానాత్ + అపి = తర్కముయొక్క అప్రతిష్ఠితత్వమువలనను = అవ్యవస్థితివలనను, తర్కముచే సమన్వయవిరోధాశంక పనికిరాదు. (తగదు) ఏమన, ఒక తార్కికునిచే ననుమితమగునర్థము మఱియొక తార్కికునిచే మఱియొకవిధముగఁ జెప్పబడును. దాని నింకొక బుద్ధిమంతుఁడగు తార్కికుఁడు వేఱొకవిధముగఁ జెప్పును. కనుక తర్కము అప్రతిష్ఠితము. అట్టితర్కముచే విరోధాశంక తగదు.

"తర్కమాత్రము అప్రతిష్ఠితమైనచో, ధూమమును జూచినవానికి వహ్న్యర్థమైన ప్రవృత్తి కలుగకపోవును. ఒక సందిగ్ధవిషయమునఁ దర్కముచే నిర్ణయముకలుగకపోవును.

“తర్కాప్రతిష్ఠానాత్” అనునదికూడ తర్కమేకనుక దీనికిని ప్రతిష్ఠానము లేకపోవును, లేకపోయినచో దీనిచే బరమత నిరాకరణముకాదు.” అనినచో, తర్కమంతయు నప్రతిష్ఠితము కాదు. ఒకతర్క మప్రతిష్ఠితమైనను మఱియొకతర్కము ప్రతిష్ఠితముకావచ్చునుకనుక విరోధాశంక తగదు. అని “అన్యథా అనుమేయ మితిచేత్” = ప్రతిష్ఠితతర్కముచే అనుమానము చేయవచ్చును, అని యున్నచో, ఏవమపి = ఈలాగున తర్కమునకొకచోట ప్రతిష్ఠితత్వము నంగీకరించినను, “అనిర్మోక్ష ప్రసంగః” = ప్రకృతమున లింగాదిరహితమగు బ్రహ్మమునందు వేదనిరపేక్షమగు తర్కము ప్రతిష్ఠితముకాదు కనుక మోక్షములేకపోవుట తటస్థించును.

“అనిర్మోక్షప్రసంగః” అనుదానికి మఱియొకవిధముగా నర్థము, చెప్పవచ్చును. మహాత్ములగు కపిలకణాదాదులయొక్క పరస్పరవిప్రతిపన్నములైన ఆగమనిరపేక్షములైన తర్కములచేఁ దత్త్వనిర్ణయము కలుగకపోవుటవలన అనిర్మోక్షప్రసంగము కలుగును, కనుక ఆగమ (వేద) విరోధియగు తర్కము ప్రమాణము కాదు. దానితో విరోధమునులేదు. అని యర్థము.

### 4 శిష్టాపరిగ్రహాధికరణము. (12

ప్రధానకారణవాద నిరాసముతో మిగిలిన యణ్వాదికారణవాదములును నిరస్తములయినట్లయని యీయధికరణమున నిరూపింపఁబడుచున్నది.

ఏతేన శిష్టా పరిగ్రహా అపి వ్యాఖ్యాతాః. 12

ఏతేన = ఈ ప్రధానకారణవాద నిరాకరణముచేత, శిష్టాపరిగ్రహాఃఅపి = శిష్టులగుమన్వాదులచేత ఏయంశమాత్రముగను గ్రహింపఁబడని అణ్వాదికారణ వాదములున్ను, వ్యాఖ్యాతాః = నిరాకృతములుగా వ్యాఖ్యానముచేయఁబడినవి.

కణాదమహర్షి పరమాణువులు జగత్కారణ మని చెప్పెను. బుద్ధుఁడు అభావము జగత్కారణ మని చెప్పెను. ఇట్లే ఇంకను చెప్పఁబడినవాదము లన్నియును, ప్రధానకారణ వాదనిరాకరణముతోనే నిరాకృతము లని యర్థము.

5 భోక్త్రాపత్త్యధికరణము. 13

ఈయధికరణమున బ్రహ్మకారణవాదమును మఱియొకవిధముగ నాక్షేపించి సమాధానము చెప్పుచున్నారు. లోకములో భోక్త, భోగ్యము, అనువిభాగము ప్రసిద్ధముగానున్నది. భోక్తచేతనుఁడగుజీవుఁడు, భోగ్యము శబ్దాదివిషయజాతము. మూలకారణమగు అద్వితీయబ్రహ్మము జగదుపాదానమన్నచో బ్రహ్మముకంటె జగము భిన్నముకాదు. కనుక భోక్తృభోగ్యవిభాగము కుదురదని యాక్షేపించుచున్నారు.

భోక్త్రాపత్తే రవిభాగశ్చే త్స్యా ల్లోకవత్. 13

భోక్త్రాపత్తేః = బ్రహ్మమే జగదుపాదాన మన్నచో, భోక్తృభోగ్యరూపమైన జగమంతయు బ్రహ్మముకన్న భిన్న

ముకామకునకు భోగ్యమైన శబ్దాదివిషయజాతమునకు భోక్త్రా పత్త్యము=భోక్తృస్వరూపత్వము ఆపన్నమగును. దానిచే, అవిభాగశ్చేత్ = లోకప్రసిద్ధమైన భోక్తృభోగ్యవిభాగము లేకపోవలసివచ్చును, అనియనినచో, సమాధానము చెప్పఁబడుచున్నది. స్యాత్ + లోకవత్ = లోకమునందువలె విభాగముగలుగును. అనఁగా లోకములో మృత్తు కారణముగాఁగల ఘటశరావాదులకు మృద్రూపమున, నభేదమున్నను ఘటశరావాదిరూపమున భేదమున్నట్లు, సముద్రమునందు ఫేనఁబుద్బుద, తరంగములకు కారణరూపమున, భేదములేకున్నను కార్యములగు ఫేనబుద్బుద, తరంగములకుఁ బరస్పరము భేదమున్నట్లును, బ్రహ్మోపాదానకమైన ప్రపంచము బ్రహ్మకంటెభిన్నము కాకపోయినను ప్రపంచరూపములగు (బ్రహ్మకార్యములయిన) భోక్తృభోగ్యములకును బరస్పర భేదముండవచ్చును.

## 6 ఆరంభణాధికరణము. (14-20)

ప్రపంచమునకు బ్రహ్మభేదము నంగీకరించి, భోక్త్రాపత్తిరూప దోషమును, "స్యాల్లోకవత్" అని లోకదృష్టాన్తముచేఁ బరిహరించిరి. లోకదృష్టాన్తముచే, కార్యకారణములకు భేదము గోచరించుచున్నదికాన బ్రహ్మప్రపంచములకు భేదమే యేలచెప్పఁగూడదు? అని యాశంకించి యీయధికరణమున సమాధానము చెప్పుచున్నారు.

## తదనన్యత్వ మారంభణ- శబ్దాదిభ్యః 14

తదనన్యత్వం, ఆరంభణశబ్దాదిభ్యః,

ఆరంభణశబ్దాదిభ్యః = ఆరంభణ శబ్దాదులవలన, తదనన్యత్వం=ప్రపంచమునకు ఆ బ్రహ్మముతో నభిన్నత్వము. బ్రహ్మముకంటె ప్రపంచము భిన్నముకాదనుటకు ఆరంభణ శబ్దాదులు హేతువులు. ఆరంభణశబ్దాదులనఁగా, ఛాందోగ్యములో - ఒకదానిని దెలిసికొన్నచో సర్వము తెలియును, అని ఏకవిజ్ఞానముచే సర్వవిజ్ఞానమును బ్రతిజ్ఞచేసి, దానికి దృష్టాంతముగా, "యథా సౌమ్య ఏకేన మృత్పిండేన సర్వం మృన్మయం విజ్ఞాతంస్యా ద్వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" ఛాం-6-1-4. అని చెప్పినమాటలు. మృత్పిండమనునది (మట్టిముద్ద) యొకటి తెలిసినచోఁ దద్వికారము లయిన ఘట,శరావాదులన్నియును మృత్పిండములేయని తెలియును. మృత్పిండమొకటి తెలిసినచో ఘటము, శరావము, మొదలగునవన్నియును నెట్లు తెలియుననఁగా, ఘటము, శరావము అనుపేరు వాచారంభణమైన వికారము = వాగాలంబన మాత్రము. అనఁగా, ఘటము శరావము అనుపేరుతప్ప వికారమున మృత్తుకంటె నితరమేమియును లేదు. అందుచేత మృత్తు తెలిసినచోఁ దద్వికారమగు ఘటాదికమును దెలియును. అని చెప్పి, వికారమంతయు అసత్యము. కారణముసత్యము. కారణ కార్యములకభేదము. (అనన్యత్వము) కనుక మృత్తికయనునదే

సత్యము. అక్లే బ్రహ్మవికారమగు ప్రపంచము తదనన్యము= బ్రహ్మముకంటె భిన్నము కాదు. ఆరంభణశబ్దాదిభ్యః" అన్న చోటనున్న ఆదిశబ్దమువలన "బ్రహ్మైవేదం సర్వం" ముం. 2-2-11. "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఛాం.3.14-1 "నేహ నానాస్తి కించన" బృ.4-4-19- మొదలగునవి గ్రాహ్యములు.

## భావే చోపలబ్ధేః. 15

తదనన్యత్వములో మఱొకహేతువు చెప్పఁబడు చున్నది.

భావేచ = కారణభావమునందే, ఉపలబ్ధేః = కార్యము యొక్క ఉపలబ్ధివలన, అనఁగా, కారణమున్నపుడే కార్యము కనఁబడుచున్నది. కారణములేనపుడు కార్యముకనఁబడుట లేదు. కావున కార్యకారణములకభేదము. మృత్తు ఉన్నచో ఘటముకనఁబడుచున్నది. తంతువులున్నచో పటముకనఁబడు చున్నది. తదభావమునందుఁ దత్కార్యములేదు. కావున నీకార్యకారణములు రెండింటికి నభేదము.

## సత్త్వాచ్చావరస్య. 16

ఈ హేతువువలనను కార్యకారణముల కనన్యత్వము.

అవరస్య = కార్యమునకు, సత్త్వాత్ = ఉత్పత్తికిఁ బూర్వము కారణరూపముగాఁ గారణమున నుండుటవినపించుట వలన, కార్యకారణములకనన్యత్వము సిద్ధము. పుట్టకపూర్వము

కారణరూపమున నున్న కార్యము, పుట్టినతరువాతఁ గూడ దానికంటె భిన్నము కాదు. అని భావము. "సదేవ సోమ్య ఇద మగ్ర ఆసీత్" ఛాం. 6-2-1. "ఆత్మావా ఇద మేకఏవాగ్ర ఆసీత్" ఐ. 2-4-1-1. "బ్రహ్మవా ఇద మగ్రఆసీత్" బృ. 1-4-10. మొదలగు వాక్యములలో, ఇదంపద వాచ్యమగు ప్రపంచమునకుఁ గారణమగు బ్రహ్మపదముతో సామానాధికరణ్య ముండుటవలనఁ గార్యకారణముల కనన్యత్వము తెలియుచున్నది. బ్రహ్మాత్మనా ప్రపంచము పూర్వముండక పోయినచో దానినుండి పుట్టుటయే కుదరదు. ఇసుకలోలేని తైలము ఇసుకనుండి పుట్టుటలేదుగదా.

అసద్వ్యపదేశా న్నేతిచే న్న ధర్మాన్తరేణ వాక్యశేషాత్ 17

అసద్వ్యపదేశాత్ = "అసద్వా ఇద మగ్ర ఆసీత్" తై 2-7 అని ఉత్పత్తికిఁ బూర్వము, అసత్త్వమును వ్యపదేశించుట (చెప్పుట) వలన, న + ఇతిచేత్ = ఉత్పత్తికిఁ బూర్వము కార్యము కారణరూపముగా లేదన్నచో. న = కాదు. ధర్మాన్తరేణ = అవ్యాకృతత్వధర్మముచే, అసత్త్వ వ్యపదేశముకాని, కేవల మసత్తని యభిప్రాయము కాదు. ఏమన, వాక్యశేషాత్ = వాక్యశేషమువలన వాక్యశేషములో "తత్సదాసీత్" అని సద్వ్యపదేశము చేయఁబడినది. ఇంతకుఁ బూర్వము చెప్పిన అసద్వ్యపదేశమునకుఁ గేవలము అసత్తు లేనిది) అని యర్థము చెప్పినచో నీవాక్యశేషమువిరో

ధించును, వాక్యమునం దుపక్రమములో నందిగ్ధార్థముగాఁ జెప్పఁబడినది వాక్యశేషములో నిశ్చయింపఁబడును. కనుక ఈ వాక్యశేషమునందలి సద్వ్యపదేశమువలన, పూర్వము చెప్పఁబడిన అసద్వ్యపదేశమునకు అవ్యాకృతమని యర్థము. అనఁగా విస్తరింపనిది అనియర్థము. వ్యాకృతము సత్తు. అవ్యాకృతము అసత్తు కావున కార్యకారణములకు అనన్యత్వము సిద్ధము.

యుక్తేః శబ్దాంతరాచ్చ. 18

యుక్తేః = యుక్తివల్లను, శబ్దాన్తరాచ్చ=శబ్దాంతరము వల్లనున్ను, కార్యము కారణముకంటె అనన్యమును, ఉత్పత్తికంటె, పూర్వము సత్త్వముకలదియు నగుచున్నది.

యుక్తిః— "ఘటము పుట్టుచున్నది" అను ప్రతీతిచే, ఘట ముత్పత్తికిఁ గర్తయని తెలియుచున్నది. ఉత్పత్తికిఁ బూర్వము ఘటమత్యంతము అసత్తేయయినచో నుత్పత్తి కర్తృత్వ మెట్లుకుదురును! కుదురదు. కనుక ఉత్పత్తికిఁ బూర్వము ఘటము కారణరూపమున నున్నది. మఱియు, మృద్రూపముగా ఘటము పూర్వములేకపోయినచో ఘటమును నిర్మింపఁదలఁచిన కుమ్మరి మృత్తునే యేల గైకొనును? అసత్త్వవిశేషమున మఱియొకదానిని దేనినైన గ్రహించి ఘటమును నిర్మింపఁగలుగును. ఇష్టే దధి సపేక్షించువారు క్షీరములనే యేలఅపేక్షింపవలెను! ఈయుక్తులచేఁ గార్యము కారణాత్మనా ముందే యున్నదనుట నిశ్చయము.

శబ్దాన్తరము:- అనగా, పూర్వసూత్రములో చెప్పిన అసత్ శబ్దముకంటె భిన్నమగు శబ్దాన్తరము, "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" అనుదానిలోనున్న సత్ శబ్దము. దీనివలనం గూడ కార్యముత్పత్తికిం బూర్వమునను ఉన్నదని తెలియు చున్నది.

పటవచ్చ 19

ముడతపెట్టంబడిన పటమునకు (వస్త్రమునకు) విప్పి పరవంబడిన పటమునకు భేదా, యున్నట్లున్నను వాస్తవముగా వానికి భేదమెట్లు లేదో అట్లే మృద్ఘటములకును భేదము లేదు. తంతుపటములకును భేదము లేదు.

యథాచ ప్రాణాదిః 20

ప్రాణాదిః = ప్రాణాపానాది వాయువు, యథా = ఏరీతిగనో, అనగా ప్రాణాయామముచే నిరోధింపంబడిన ప్రాణవాయువు జీవనమాత్రకార్యమును నెఱవేర్చుచున్నది. అట్లు ప్రాణాయామముచేత నిరోధింపంబడని వాయువు ఆకుంచన ప్రసారణాది కార్యమును చేయుచున్నది. ఇంతమాత్రమున నా ప్రాణవాయువునకు భేదము లేదు. కనుక కార్యకారణములకు అనన్యత్వమే. (అభేదమే) యని సిద్ధాన్తము ఈయనన్యత్వముచేత, ఏకవిజ్ఞానముచే సర్వవిజ్ఞానప్రతిజ్ఞ సిద్ధించును.

### 7 ఇతర వ్యపదేశాధికరణము 21-23

ఇంతకుఁబూర్వము ఏకవిజ్ఞానప్రతిజ్ఞాసిద్ధికై కార్యము కారణముకంటె అన్యముకాదు. అని సమర్థింపఁబడినది. ఆసమర్థనముచే, జీవుఁడు బ్రహ్మకంటె భిన్నుఁడు కాఁడుకనుక, జీవధర్మములగు హితాకరణాదులు బ్రహ్మయందుఁ బ్రసక్తములగునని ఆక్షేపసంగతిగా నీయధికరణ మారంభింపఁబడుచున్నది.

ఇతరవ్యపదేశాద్ధితాకరణాది దోషప్రసక్తిః 21

ఇతరవ్యపదేశాత్ = ఇతరుఁడగుజీవునకు "తత్త్వమసి" త్యాదికముచే బ్రహ్మత్వవ్యపదేశమువలన, అనికాని ఇతరుఁడగు బ్రహ్మకు "అనేన జీవే నాత్మనా నుప్రవిశ్య" మున్నగు దానిచే శారీరత్వ వ్యపదేశమువలన, అనికాని యర్థము. ఇతరపదముచే జీవుని, బ్రహ్మనుగూడ గ్రహింపవచ్చును. జీవునకుబ్రహ్మత్వమును, బ్రహ్మకు శారీరత్వమును జెప్పిన శ్రుతులుకలవు. ఇట్లు జీవబ్రహ్మల కభేదము చెప్పుటవలన బ్రహ్మయొక్క స్రష్టృత్వము జీవునిస్రష్టృత్వమే యగును. అయినచో బ్రహ్మకు హితాకరణాదిదోషము సంభవించును. అనఁగా హితమైనదానిని జేయకపోవుట యనుదోషము అనఁగా దనకుహితముకాని జన్మజరామరణాది బహువిధానర్థ కరణరూప దోషము సంభవించునని యర్థము. ఆదిపదముచే "జీవునకు నాచే జ్వరముకల్పింపఁబడినది. నాచే నుపసంహరింపఁ

బడును, అనిష్టానము కలుగవలసివచ్చునను దోషమనుగ్రహింపఁదగును. జీవాభిన్నుఁడగు బ్రహ్మ భ్రాంతిలేని చేతనుఁడు కనుక, అనిష్టమగు జన్మజరామరణాదిదోష దూషితమగు ప్రపంచమును బుట్టింపఁడు ప్రపంచము జరామరణాదిదోష దూషితమై యున్నదికనుక దీనిని బుట్టించినవాఁడు చేతనుఁడు కాఁడు. అని ఈయాక్షేపసూత్రమునకర్థము.

### అధికంతు భేదనిర్దేశాత్ 22

ఆయాక్షేపమున కీసూత్రముచే సమాధానము చెప్పఁబడుచున్నది.

అధికంతు = జీవునకంటె నధికుఁడు, సర్వశక్తియు నగుపరబ్రహ్మ జగదుపాదానము. అతఁడు స్రష్ట. కనుక హితాకరణాదిదోషప్రసక్తిలేదు. జీవునకంటె నధికుఁడగు బ్రహ్మ జగత్కారణమనుట యెట్లు? భేదనిర్దేశాత్ = జీవునకును బ్రహ్మకును భేదమును జెప్పుటవలన. "ఆత్మావా అరే ద్రష్టవ్యః, బృ 2-4-5 సతా సోమ్య తదా సంపన్నో భవతి. ఛాం 6-8-1 అని జీవబ్రహ్మలకు భేదము చెప్పఁబడినది. అయినచోఁ బూర్వోక్తములగు "తత్త్వమసి" మున్నగునభేద శ్రుతులతో విరోధము కలుగదా? యనవచ్చును. వేదాంతములందు జీవబ్రహ్మలకు, ఆకాశఘటాకాశములకువలె వాస్తవమగునైక్యము ఔపాధికమగు భేదమును పెక్కుపర్యాయములు తిరిగితిరిగి చెప్పఁబడినవి. నిత్యముక్తుఁడగు బ్రహ్మకు

హితము అహితము అని భేదము లేదు కనుక హితాకరణాది దోషప్రసక్తియును లేదు.

### అశ్మాదివచ్చ తదనుపపత్తిః. 23

ఏకరూపమగు బ్రహ్మమే జగత్కారణమన్నచోఁ గార్యవైచిత్ర్యముగలుగదే యనుదోషమును దృష్టాంతమూలకముగా ఖండించుచున్నారు.

అశ్మాదివచ్చ = రాళ్లకువలె, తదనుపపత్తిః = వైచిత్ర్యముకలుగదను దోషమున కనుపపత్తికలుగును. అనఁగా, ఒకే పృథివినుండి జన్మించిన రాళ్లకు వజ్ర. వైడూర్య, పద్మరాగేంద్రనీలాది భేద వైచిత్ర్యము ఎట్లుగలదో, అట్లే ఏక బ్రహ్మకార్యములకు స్వరూపవైచిత్ర్య ముండవచ్చును.

ఏకపృథివ్యాశ్రితబీజములకు బహువిధముల పత్రపుష్ప ఫలగంధరసాది వైచిత్ర్యమున్ను, ఏకమగు అన్నమునకు కేశనఖాదివిచిత్రార్థక్రియాకారిత్వము నున్నట్లుగా, ఏకబ్రహ్మాశ్రితకార్యములందు ధర్మవైచిత్ర్యము, అర్థక్రియావైచిత్ర్యము కలుగవచ్చునని అశ్మాదివచ్చ అనుపదముచే సూచింపఁబడినది. కనుక, కార్యవైచిత్ర్యముకలుగదను దోషములేదు.

### 8 ఉపసంహారదర్శనాధికరణము. 24-25

చేతనమగు బ్రహ్మము జగత్కారణమనుట యుపపన్నముకాదని మరల నాక్షేపించుచు సమాధానముచెప్పుచున్నారు.

ఉపసంహారదర్శనాన్నేతి చేన్న క్షీరవద్ధి. 24

ఉపసంహారదర్శనాత్ = సాధనాన్తరసహాయదర్శనమువలన, నేతిచేత్ = బ్రహ్మకు జగత్కారణత్వము లేదన్నచో, న = కాదు. క్షీరవద్ధి = క్షీరమువలెనే కారణత్వము ఉపపన్నమగును. లోకములో ఘటాదికార్యమును జేయఁదలఁచిన కులాలాదికర్త దండచక్రాద్యుపసంహారములను (ఉపకరణములను) గైకొనియే చేయుచున్నాఁడు. బ్రహ్మకు జగన్నిర్మాణములో నట్టియుపకరణములు ఉన్నట్లు లేదు. కనుక బ్రహ్మ జగత్కర్త గాఁడు అనిపూర్వపక్షముగలుగ, కరణములు లేకపోయినను గార్యము కలుగవచ్చును. క్షీరములు దధిగానగుట కుపకరణములక్కఱలేకయే యగుచున్నవి కదా, యట్లే బ్రహ్మమును జగముగానగుట కుపకరణములక్కఱలేదని భావము.

క్షీరములుకూడ దధిగా (పెరుఁగుగా) అగుటకు క్షీరములను గాచవలయును గదా. యన్నచో, తొందరగా దధియగుటకుఁ గాచుట కాని లేనిచోఁ గాచనక్కఱలేదు. అట్లే పరబ్రహ్మయును బాహ్యసాధనానపేక్షముగనే జగమును జేయుచున్నాఁడు. శ్రుతికూడ నీవిషయమునే చూపించుచున్నది.

"న తస్య కార్యం కరణంచ విద్యతే, న తత్సమ
శ్చాభ్యధికశ్చ దృశ్యతే,

పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే, స్వాభావికీ జ్ఞాన
బలక్రియాచ "శ్వే.6-8.

బ్రహ్మమునకుఁగార్యము,కరణములేదు. అతనితో సముఁడు కాని యధికుఁడుగాని లేఁడు. జ్ఞానబలాశ్రయమగు నతనిశక్తియే వేఱు.

దేవాదివదపి లోకే. 25

క్షీరములు అచేతనములు. చేతనులగు కులాలాదులు సహాయులతో కార్యములనుజేయుచున్నారు. చేతనుఁడగు బ్రహ్మయును సహాయుఁడతో కార్యమునుజేయును అనినచో చేతనులందుఁ గూడ సహాయము లేకయే కార్యకరణముకలదని యీసూత్రమునఁ జెప్పఁబడుచున్నది.

లోకే = మంత్రార్థవాదేతిహాసాదికమునందు. దేవాదివదపి = దేవతలు, పితృదేవతలు ఋషులు, మున్నగువారు (చేతనులు సాధనాన్తరాపేక్ష లేకయే సంకల్పమాత్రము చేతనే నానావిధకార్యములను జేయుచున్నారన్నట్లు వినఁబడుచున్నది. అట్లే బ్రహ్మయును సహాయాన్తరములేకయే కార్యమును జేయుచున్నాఁడు.

9 కృత్స్నప్రసక్త్యధికరణము. (26-29)

పూర్వాధికరణములో క్షీరదధిదృష్టాన్తముచే బ్రహ్మ జగదాకారముగఁబరిణమించుచున్నాఁడని తెలియుచున్నది. అప

రిణామము పూర్తిగాఁ బరిణామమా? ఏకదేశపరిణామమా? అని యీయధికరణమునఁ బూర్వపక్షముచేయఁబడుచున్నది.

కృత్స్నప్రసక్తిర్నిరవయవత్వ శబ్దకోపో వా. 26.

క్షీరము దధిగాఁబరిణామముపొందినట్లు బ్రహ్మ జగదాకారముగాఁ బరిణమించుచున్నాఁడనిన బ్రహ్మ పూర్తిగా జగద్రూపముగాఁ బరిణామమును బొందుచున్నాఁడా? బ్రహ్మలో ఏకదేశము జగముగాఁ బరిణమించుచున్నదా? బ్రహ్మయంతయు జగముగా కృత్స్నపరిణామమును బొందెననినఁ గార్యాతిరిక్తముగా బ్రహ్మ లేకపోవలసివచ్చును. ఏకదేశపరిణామమన్నచో నపరాంశము మిగులునుగాన నిరవయవత్వశబ్దమునకు వ్యాకోపముగలుగును. బ్రహ్మసావయవమన్నచో అనిత్యత్వముకలుగును. బ్రహ్మకుఁ బరిణామిత్వ ప్రమాణాలకి యీపూర్వపక్షము.

శ్రుతేస్తు శబ్దమూలత్వాత్. 27

కృత్స్నప్రసక్తిరూపదోషములేదని సిద్ధాన్తముచేయఁబడుచున్నది. ఎందుచేతనన, శ్రుతేస్తు = శ్రుతివలన నాదోషములేదు. శ్రుతి- "బ్రహ్మజగదుపాదానమని" చెప్పినట్లుగా, "కార్యవ్యతిరేకముగా బ్రహ్మమున్నట్లును చెప్పుచున్నది. "ఏతావా నస్య మహిమా" అనిశ్రుతిఛాం. 3-12-6.కనుక కార్యమునకన్న నతిరిక్తముగా బ్రహ్మమున్నదను దోషములేదు.

వివర్తవాదము శ్రుతిచేతనే చెప్పబడినది. శబ్దమూలత్వాత్ - బ్రహ్మము శబ్ద(వేద)ప్రమాణకము కనుక, శబ్దము "బ్రహ్మ జగదుపాదానమనియును, జగముకంటె నతిరిక్తముగా బ్రహ్మమున్నదనియును జెప్పుచున్నది. కనుక దోషము లేదు.

ఆత్మని చైవం విచిత్రాశ్చ హి 28.

జగము బ్రహ్మముయొక్క వివర్తము (పరిణామము) కాన, స్వప్నప్రపంచమువలె మాయికము. అందువలన బ్రహ్మ జగదుపాదానమైనను స్వప్నసాక్షివంటివాఁడు. కావునఁ గృత్స్నప్రసక్త్యాదిదోషము లేదని చెప్పుచున్నారు.

ఏవం - ఈబ్రహ్మయందువలె, ఆత్మని చ = స్వప్న ద్రష్టయగు ఏకాకియగు ఆత్మయందును విచిత్రాశ్చహి = విచిత్రములైన సృష్టులు, స్వరూపోపమర్దము లేకుండ శ్రుతములగుచున్నవి. "న తత్ర రథా న రథయోగా న పంథానో భవన్త్యథ రథాన్ రథయోగాన్ పథః సృజతే" బృ 4-3-10. అనుచోట స్వప్నమునందు రథములు రథమార్గములు లేవు కదా అవి యెట్లు కనఁబడుచున్నవి? అని ప్రశ్నించుకొని రథయోగములను రథమార్గములను సృజించుచున్నాఁడు. అని సమాధానము చెప్పఁబడినది. లోకములో మాయావియందు స్వరూపోపమర్దము లేకయే గుఱ్ఱములు ఏనుఁగులు మొదలగు మాయసృష్టి కనిపించుచున్నట్లు, స్వప్నమున ఏకాకియగు ఆత్మయందు స్వరూపానుపమర్దమునఁ బెక్కు రథాదులు కని

పించుచున్నట్లును బ్రహ్మమునందు స్వరూపోపమర్దము లేకయే వివిధసృష్టి కనిపించుచున్నది.

## స్వపక్షదోషాచ్చ. 29

స్వ పక్షదోషాచ్చ – మీమతమునందును దోషము లుండుటవలన.

సాంఖ్యులు నిరవయవము, అపరిచ్ఛిన్నము, అగు ప్రధానము, సావయవము పరిచ్ఛిన్నశబ్దాదియుక్తమునగు కార్యమున కుపాదానకారణమని చెప్పుదురు. వారిమతమునందును, కృత్స్నప్రసక్తి, నిరవయవత్వవ్యాకోపము అనుదోషములు కలవు. అణువాదులును రెండుపరమాణువులు కలిసిన ద్వ్యణుక మగునని చెప్పుదురు. ఒకపరమాణువు మఱియొక పరమాణువుతోఁ గలియునపుడు, నిరవయవముగనుక సంపూర్ణసంయోగమును బొందుచోఁ గార్యమగు ద్వ్యణుకమునందు మహాపరిమాణ మనుపపన్నమగునని దోషము. ఏకదేశ సంయోగమన్నచో నిరవయవత్వమునకు వ్యాకోపము కలుగును. కనుక పై రెండు మతములందునుగూడ నీదోషములుకలవు. బ్రహ్మకారణ వాది మాయాశక్తులను బురస్కరించుకొని స్వపక్షదోషమును వారించెను. సాంఖ్యపరమాణువాదులకు దోషనిస్తారములేదు. పరమాత్మకారణవాదము అత్యన్తము పపన్నము.

## 10 సర్వోపేతాధికరణము. (30-31)

బ్రహ్మమునకు విచిత్రకార్యశక్తి కలదని చెప్పఁబడినది. అది యీయధికరణమున సమర్థింపఁబడుచున్నది.

### సర్వోపేతాచ తద్దర్శనాత్. 30.

సర్వోపేతాచ = పరాదేవత (బ్రహ్మము) సర్వవిధములైన శక్తులతోను గూడినది. ఎందుచేతననఁగా, తద్దర్శనాత్ = శ్రుతియందు సర్వశక్తియోగమున్నట్లు కనఁబడుటవలన, "సర్వకర్మా సర్వకామః సర్వగంధః సర్వరసః" ఛాం 3-14-4 "సత్యకామః సత్యసంకల్పః" ఛాం- 8-7-1 అని శ్రుతి.

### వికరణత్వాన్నేతిచే త్తదుక్తమ్. 31

వికరణత్వాత్ = "అచక్షుష్క మశ్రోత్ర మవాగమనాః" బృ. 3. 8. 8 అనుశ్రుతివలన బ్రహ్మము, చక్షురాదీంద్రియములు లేనిదగుటవలన, నేతిచేత్ = జగత్తునకుఁ గర్త కాదన్నచో, సర్వశక్తియుక్తులయినను చక్షురాదికరణములున్న వారికే (దేవతలకు) విచిత్రకార్యకర్తృత్వము కనిపించుచున్నదికనుక. వికరణత్వశ్రుతివలన చక్షురాదీంద్రియములు లేని బ్రహ్మకు జగత్కర్తృత్వము లేదన్నచో అట్లు కాదు. అని సమాధానము చెప్పుచున్నారు. తదుక్తమ్ = దీనికిసమాధానము, "నవిలక్షణత్వాత్" "దేవాదివదపిలోకే" అని సను

కనే చెప్పఁబడినది. సర్వశక్తిసమన్వితమగు పరబ్రహ్మమునకు సర్వము సంభవించును. "అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః" శ్వే. 3. 19. అని అకరణమైనను బ్రహ్మమునకు సర్వసామర్థ్యములుకలవని శ్రుతి చెప్పుచున్నది.

### 11 (ప్రయోజనవత్త్వాధికరణము. 32-33)

పరబ్రహ్మయొక్క జగత్కర్తృత్వము నీయధికరణమున మఱియొకవిధముగ నాక్షేపించుచున్నారు.

### న ప్రయోజనవత్త్వాత్. 32

న = బ్రహ్మకు జగత్కర్తృత్వము కుదురదు, ఎందుచేతననగా, ప్రయోజనవత్త్వాత్ = ప్రవృత్తిప్రయోజనము కలదికనుక, "ప్రయోజన మనుద్దిశ్య న మందోఽపి ప్రవర్తతే" అనుటచే ప్రయోజనములేక పరబ్రహ్మ జగత్సృష్టి నేలచేయును? ఏమైన నతనికిఁ బ్రయోజనమున్నదని కల్పించుదమన్నచో అవాప్తసకలకాముఁడగు పరమాత్మకు శ్రుతిప్రమాణములగు పూర్ణకామత్వాదులు బాధింపఁబడును. కనుక నతఁడు జగత్కర్తకాఁడు అని పూర్వపక్షము.

### లోకవత్తు లీలాకైవల్యమ్. 33

లోకవత్తు = లోకములో రాజులు, మంత్రులు మొదలగువారికి ప్రయోజనములేకయే కేవలలీలారూపము

లగు ప్రవృత్తులు ఎట్లో, ఉచ్ఛ్వాసాదులు వ్యథానమునఁ బ్రవర్తిల్లుట యెట్లో, అట్లే బ్రహ్మకు ఈవిచిత్ర జగత్కార్య రచన, లీలాకైవల్యమ్ = కేవలలీలామాత్రము. ఫలాపేక్షము కాదు. అని సమాధానము.

## 12 వైషమ్యనైర్ఘృణ్యాధికరణము. (34-36)

మఱియొకవిధముగా బ్రహ్మకారణత్వము నాక్షేపించి సమాధానము చెప్పుచున్నారు.

పరబ్రహ్మ ప్రాణుల కర్మము నపేక్షించి జగత్సృష్టి చేయుచున్నాఁడా? తన్నిరపేక్షముగ సృష్టిచేయుచున్నాఁడా? కర్మసాపేక్షముగ సృష్టిచేయుచున్నాఁడనిన అతని కనీశ్వరత్వము సంభవించును. కర్మనిరపేక్షముగ సృష్టిచేయుచున్నాఁడనిన అతనికి వైషమ్యము = పక్షపాతము = భేదము — అనఁగా పశుపక్ష్యాదుల నత్యంతదుఃఖముకలవానిని గాను దేవతలను అత్యంతసుఖము కలవారినిగాను మనుష్యులను మధ్యములనుగాను సృజించుచున్నాఁడను దోషమువచ్చును. పైగా సంతతిని సంహరించుచున్నాఁడని నైర్ఘృణ్యము = నిర్దయత్వరూపదోషమును సంభవించుచున్నది. కనుక నిరవద్యుఁడగు నీశ్వరునికి జగత్కర్తృత్వము లేదు. అని పూర్వపక్షము కలుగ సమాధానము చెప్పఁబడుచున్నది.

వైషమ్యనైర్ఘృణ్యే న సాపేక్షత్వా త్తథాహి దర్శయతి. 34

వైషమ్య నైర్ఘృణ్యే = పక్షపాతనిర్దయత్వములు, న = బ్రహ్మకు లేవు. ఎందుచేతననగా, సాపేక్షత్వాత్ = వారివారికర్మములనపేక్షించి సృష్టిచేయుటవలన, అయినచో అనీశ్వరత్వము కలుగదా! యనిన తనదగ్గరపనిచేయుచున్న భృత్యులకు వారివారి సేవానుగుణముగ ఫలమునిచ్చుచున్న రాజున కరాజత్వము సంభవింపనటుల నీతనికిని అనీశ్వరత్వము సంభవింపదు. ఇతనిసృష్టి కర్మసాపేక్షమనుటకుఁ బ్రమాణమేమి యనిన, తథాహిదర్శయతి = శ్రుతియు స్మృతియును అట్లు ప్రామాణ్యమును జూపుచున్నవి. "ఏష హ్యేవ సాధుకర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే. ఏష ఉ ఏవా అసాధుకర్మ కారయతి తం యమధో నినీషతే" కౌ. 3-8. భగవంతుఁ డెవ్వని నీలోకములనుండి వారి వారికర్మవశమున నూర్ధ్వలోకమును బొందింపఁదలఁచునో వానిచే సాధుకర్మములు చేయించును, ఎవ్వని నధోలోకము లుపొందింపఁదలఁచునో వానిచే, నసాధుకర్మములు చేయించును. స్మృతి:- "యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్" భగ.

న కర్మావిభాగాదితి చేన్న అనాదిత్వాత్. 35

"సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్ ఏక మేవాద్వితీయమ్" ఛాం.6-2-1అనుశ్రుతివలన సృష్టికిఁబూర్వము, అవిభాగాత్ -

విభాగములేకపోవుటవలన, కర్మ,న = కర్మయే లేదు. ఇతి చేత్ = అనిఅన్నచో న = కాదు. అనాదిత్వాత్ = సంసారము బీజాంకురన్యాయముగా అనాదికనుక, సృష్టికిబూర్వము అవిభాగమువలన కర్మమే లేదు. అని యనరాదు పూర్వసృష్టి యందలి పుణ్యపాపములు పూర్తిగా నశింపక యుత్తరసృష్టికి హేతువులగును.

ఉపపద్యతే చాప్యుపలభ్యతేచ. 36

సంసారమనాదియనుట, ఉపపద్యతేచ = ఉపపన్నమగును. కర్మములేనిదే శరీరములేదు. శరీరములేనిదే కర్మము లేదు. సంసారమనాదియనుటచే బీజవృక్షన్యాయముచే నన్యోన్యాశ్రయము పోవునుకనుక సంసారమున కనాదిత్వ ముపపన్నమగును. అదికాక అకస్మాత్తుగా సృష్టినంగీకరించినచో, ముక్తునకుఁగూడ మరలజన్మము రావలసివచ్చును. పూర్వసృష్టిసాదృశ్యము చెప్పుటయుఁ గుదురదు.

ఉపలభ్యతేచ = సంసారమనాదియనునది శ్రుతిస్మృతులయం దుపలబ్ధమగుచున్నది. "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అన్నచోట, ప్రాణధారణనిమిత్తమైన జీవశబ్దముచే సృష్ట్యాదియందు శారీకుని జెప్పుచు శ్రుతి ప్రాణధారణాదిసంసారమున కనాదిత్వమును సూచించుచున్నది. "ధాతా యథాపూర్వ మకల్పయత్" ఋ. సం. 10-190-3 అనుశ్రుతి పూర్వకల్పముండ్నదని

చెప్పుచున్నది. "న రూప మస్యేహ తథోపలభ్యతే నాన్తో న చాది ర్న చ సంప్రతిష్ఠా" అని భగవద్గీతాస్మృతియు. 15-3 ఉపసంహారవృక్షమునకు రూపముగాని ఆదిమధ్యాన్తములుగాని లేవని యనాదిత్వమును తెల్పుచున్నది.

### 13 సర్వధర్మోపపత్త్యధికరణము (37)

ఇఁక ముఖ్యముగాఁ బరపక్షములను ప్రతిషేధింప సంకల్పించి స్వపక్షమున నిర్దుష్టత్వమును ఉపసంహరించుచున్నారు.

**సర్వధర్మోపపత్తేశ్చ. 37**

సర్వజ్ఞత్వ జగత్కారణత్వాది సర్వ ధర్మములును బ్రహ్మయందుపపన్నము లగుటవలన బ్రహ్మమే జగత్కారణము. అని యౌపనిషదసిద్ధాన్తము నిర్దోషము. ఉపపత్తిప్రకారము గడచినయధికరణములలో వివరింపఁబడినది.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి కృతమగు
బ్రహ్మసూత్రార్థదీపికయను
బ్రహ్మసూత్రవృత్తియందు
ద్వితీయాధ్యాయ
ప్రథమపాదము.
అధి13—సూ37

శ్రీరస్తు

# బ్రహ్మసూత్రార్థదీపిక

## ద్వితీయాధ్యాయ ద్వితీయపాదము.

(ఇందుసాంఖ్యాదిమతములు సరియైనవి గావని నిరూపింపఁబడును)

### 1 రచనానుపపత్త్యధికరణము (1-10)

వెనుకటి పాదములో సాంఖ్యమతమున కనుకూలముగా సమన్వయింపఁ బడిన వేదాన్తవాక్యములకు సరియగు నర్థమును జెప్పి యిందు వారియుక్తులను ఖండించుచున్నారు.

సాంఖ్యులచేతనమగు ప్రధానము జగత్కారణమనియు, నది చేతనుఁడగు పురుషుని కర్థము సాధించుటకు విచిత్ర వికార రూపమునఁ బరిణమించుననియుఁ, బురుషుఁడు పుష్కరపలాశము (తామరాకు) వలె నిర్లిప్తుఁడనియు నందురు.

కుండమట్టితోఁ గూడినది (తయారైనది) అగుటచేఁ, గుండకు మట్టి కారణమైనట్లు, జగత్తు సుఖదుఃఖ మోహములతోఁ గూడినదగుటచే జగత్తునకు సుఖదుఃఖమోహములు కారణము. ఏది దేనితోఁ గూడియుండునో దానికది కారణము. జగత్తునకుఁ గారణమైన సుఖదుఃఖమోహములనఁగా సత్త్వరజస్తమోగుణములు. సత్త్వరజస్తమోగుణాత్మకమైనది ప్రధానము. కావునఁ బ్రధానము సర్వజగత్కారణము. అని వారియుక్తి.

రచనానుపపత్తేశ్చనానుమానమ్. 1

రచనా + అనుపపత్తేశ్చ = రచనముయొక్క అనుపపత్తివల్లను, అనఁగా, చిత్రవిచిత్రమగు నీజగద్రచనము (సృష్టి) ప్రజ్ఞాలక్షణశూన్యము, నచేతనము, నగు ప్రధానముచేఁ గాదుకనుక, "ఏది దేనితోఁ గూడినదో దానికది కారణము" అను అనుమానము, న = కాదు. (కుదరదు) లోకములో మహామహాలు సౌధములయొక్క నిర్మాణమెంతో బుద్ధిమంతులగు శిల్పులకుఁగాని సాధ్యమగుట లేదుకదా! అచేతనమగు ప్రధానమున కింతటి జగద్రచనమెట్లు కుదురునని యభిప్రాయము.

ప్రవృత్తేశ్చ. 2

ప్రవృత్తేశ్చ = ప్రవృత్తివల్లను ప్రధానము జగత్కారణముకాదు. లోకములోఁ జేతనములకుఁ బ్రవృత్తియున్నది కాని యచేతనములకులేదు. ప్రధానమచేతనము. జగమచేతన కర్తృకమైనచో ఘటపటాదులవలెఁ బ్రవృత్తిలేనిదై యుండవలెను.

అనఁ:- అచేతనములకును స్వయంప్రవృత్తి కలదు. ఎట్లనఁగా

పయోంబువచ్చేత్తత్రాపి. 3

పయోంబువత్, చేత్, తత్ర, అపి,

పయోంబువచ్చేత్ = పయః = పాలు, అంబు = నీరు, వత్ + చేత్ = వలె నచేతనమైనను ప్రధానము

స్వయంప్రవృత్తికలదన్నచో, తత్రాపి = అచ్చటను చేతన కర్తృకత్వమే కలదు "యోఽప్సు తిష్ఠన్" బృ. 3. 7. 4. అను శ్రుతివలన నుదకములందున్నవాఁడై పరమాత్మ ప్రేరణ చేయుచుండెనని తెలియుచున్నది. పాలు, నీరు, అను వాని ప్రవృత్తికూడఁ బరాపేక్షమే కాని నిరపేక్షము కాదు. అవునకు దూడపైఁగల వాత్సల్యము క్షీరప్రవృత్తికిని, పల్లపుఁబ్రదేశము దకప్రవృత్తికిని గారణము. అని యభిప్రాయము.

మఱియు స్వతంత్రమగు ప్రధానము జగత్కారణము కాదు. ఎందుచేతననఁగా,

వ్యతిరేకానవస్థితేశ్చానపేక్షత్వాత్. 4

వ్యతిరేకానవస్థితేశ్చ = సాంఖ్యులమతములో సామ్యావస్థనుబొందిన సత్త్వరజస్తమోగుణములే ప్రధానము కనుక, అప్రధానము వానికన్న వేఱుగా నుండకపోవుట వల్లను, అనపేక్షత్వాత్ = ఇతరాపేక్ష లేనిదగుట వల్లను జగత్కారణము కాదు. ఒకప్పుడు ప్రధానము మహదాద్యాకారముగాఁ బరిణమించుననియు, నొకప్పుడు పరిణమించదనియు, ఒకప్పుడు దీనికిఁ బ్రవృత్తికలుగుననియు నొకప్పుడు ప్రవృత్తియుండదనియును ననుట యుపపన్నము కాదు.

అన్యత్రాభావాచ్చ న తృణాదివత్. 5

అన్యత్ర = ఆవుకన్న నితరములైన, ఎద్దు, పోతులు మొదలగు వానియందు, అభావాచ్చ = తిన్నగడ్డి పాలుగా

పరిణామము చెందుట లేదు కనుక, తృణాదివత్ = ఆవు మేసిన తృణము (గడ్డి) పాలుగా మార్పు చెందినట్లు ప్రధానము నిరపేక్షముగానే జగదాకారముగాఁ బరిణామము చెందునన రాదు.

అభ్యుపగమే ప్యర్థాభావాత్. 6

అభ్యుపగమేపి = ప్రధానము పరిణామము చెందునని యన్నను, అర్థాభావాత్ = ప్రయోజనము లేదు కనుక, పరిణామము పొందదు. అచేతనముగు ప్రధానము చేతనుఁడగు పురుషున కేవిధముగు ప్రయోజనమును గలిగింపలేదని భావము.

అవః- పురుషుఁడే ప్రధానమును బ్రవర్తింపఁ జేయును. తాను బ్రవర్తింపక యితరు నెట్లు ప్రవర్తింపఁ జేయును అనిన

పురుషాశ్మవదితిచే త్తథాపి. 7

పురుషాశ్మవదితి చేత్ = పురుషుని వలెను రాయివలెను, నితరుని బ్రవర్తింపఁ జేయునన్నచో, అనఁగా గ్రుడ్డివాని బుజములపై నెక్కిన కుంటివానివలె, ఇనుముకొక్క సన్నిధానమున సూదంటురాతివలని ప్రవృత్తియున్నట్లు, పురుషప్రేరణమునఁ బ్రధానమునకును బ్రవృత్తి గలుగునన్నచో, తథాపి = అయినను దోషముపోలేదు. పురుషప్రేరణమునఁ బ్రవృత్తమైన ప్రధాన మస్వతంత్రమని యొకదోషము, కూటస్థుఁడగు పురుషుఁడు ప్రవర్తకుఁ డెట్లయ్యెనని యొకదోషము, ప్రధాన పురుష సన్నిధానము నిత్యముకాన, నెప్పుడును బ్రవృత్తియుండుటచేఁ

ప్రధానము ప్రవృత్తమైన దనుమాటచేఁ యుండదని మహా దోషము వచ్చును.

అంగిత్వానుపపత్తేశ్చ. 8

అంగిత్వానుపపత్తేః = ముఖ్యమని చెప్పుటకు వీలులేక పోవుటవల్లను, ప్రధానమునకుఁ బ్రవృత్తి కుదురదు. సామ్యావస్థనొందిన సత్త్వరజస్తమోగుణములు ప్రధానమనుటచే నిందొకటి యంగి (ముఖ్యము) యనియు, మిగిలినవంగము లనియుఁ జెప్పుట కుదురదు.

అన్యథానుమితౌ చ జ్ఞశక్తివియోగాత్. 9

అన్యథానుమితౌ చ = కార్యోత్పత్త్యనుకూలముగా నీసత్త్వరజస్తమోగుణము లంగాంగిభావము నొందునని చెప్పినను నీగుణములు, జ్ఞశక్తివియోగాత్ = జ్ఞానశక్తిహీనములగుట వలనఁ బ్రధానమునకు జగద్రచనము కుదురదు.

విప్రతిషేధాచ్చాసమంజసమ్. 10

విప్రతిషేధాచ్చ = పరస్పరవిరుద్ధముగ నుండుటవలన నీసాంఖ్యమతము అసమంజసమ్ = సమంజసముకాదు. ఈశ్వరుఁడు కారణమను శ్రుతిస్మృతులతో నీమతము విరోధించుచున్నది. ఈసాంఖ్యమతములో మహత్తునుండి పంచతన్మాత్రసృష్టియని యొకచోట, అహంకారమువలన సృష్టియని యొకచోటను

ఒకచోట నింద్రియములేకనియు (కర్మేంద్రియములు 5 త్వక్కు, మనస్సు) నొకచోట పంచకర్మేంద్రియములు, పంచజ్ఞానేంద్రియములు, మనస్సు కలిసి పదునొకండింద్రియములనియు, నొకచోట, బుద్ధి అహంకారము, మనస్సు, అని మూడంతఃకరణములనియు, నొక్కచోట, బుద్ధియొక్కటే యంతఃకరణమనియుఁ బరస్పరవిరుద్ధముగఁ జెప్పఁబడినది.

### ౭ మహద్దీర్ఘాధికరణము.

వెనుకటి యధికరణములోఁ బ్రధానము జగత్కారణమను సాంఖ్యుల మతము నిరాకరింపఁబడినది. ఇందుఁ, బరమాణువులు జగత్కారణ మను వైశేషికుల మతమును నిరసించుచున్నారు.

వైశేషికులు పరమాణువులవలన జగదుత్పత్తిని జెప్పుదురు. కారణ ద్రవ్యము లందుండు గుణములు కార్యద్రవ్యములందు సమాన జాతీయములగు గుణములను గల్గించునని చెప్పుదురు. వస్త్రమునకుఁ గారణములయిన తంతువులయందున్న, తెలుపు, నలుపు, మొదలగు గుణములే తంతుకార్యమగు వస్త్రమునందుఁ తెలుపు, నలుపు, మొదలగు గుణములను గల్పించుచున్నవని యుదాహరించి, చేతనుఁడగు బ్రహ్మ జగత్కారణమన్నచోఁ గారణధర్మములు కార్యమునందుండవలెనుగనుక ప్రపంచము చేతనముకావలయును. అట్లుకాక ప్రపంచ మచేతనముగ నుండుటచే, దీనికి బ్రహ్మ

కారణము కాదు. పరమాణువులు కారణము అని చెప్పుదురు.

వేదాంతిమతరీత్యా ప్రపంచము విద్యాదశలో, చేతనమయ్యెను, అవిద్యాదశలో అవిద్యాగత జాడ్యాదులు, బ్రహ్మగతచైతన్యము, కలదికాన, స్వమతానుసారముగా వారి యాక్షేపము దోషము కాకపోయినను, వారిమతమే కుదరదని చెప్పుచు వారిమతముచేతనే వారిమతమును ఖండించుచున్నారు. కారణగుణములు కార్యమందు రావలెనను నియమము వారిమతమునందే భగ్నమైనదని నిరూపించుచున్నారు.

మహద్దీర్ఘవద్వా హ్రస్వపరిమండలాభ్యామ్ ।

హ్రస్వపరిమండలాభ్యామ్ = హ్రస్వపరిమండలములవలన, మహద్దీర్ఘవద్వా = మహద్దీర్ఘములవలె చేతనునివలన అచేతనము, జగము పుట్టెను.

రెండు పరమాణువులు కలిసినదానికి ద్వ్యణుక మని పేరు. దీనిని "అణువు, హ్రస్వము" అని చెప్పుదురు. మూడు ద్వ్యణుకములు కలిసినదానికి త్ర్యణుక మనిపేరు దీనిని మహత్తు, "దీర్ఘము" అని చెప్పుదురు. ద్వ్యణుకమువలన త్ర్యణుకము పుట్టునని వీరిమతము. అణువు – హ్రస్వము, నైన దానివలన, మహత్తు – దీర్ఘము, నైనది జన్మించునని చెప్పుటవలన, కారణధర్మములు కార్యమందుండవలెనను నియమము భగ్నమైనదని యభిప్రాయము.

## 3 పరమాణు జగదకారణత్వాధికరణము. (12-17).

ఉభయథాపి నకర్మాతస్తదభావః 12

ఉభయథాపి = రెండువిధములుగాను, నకర్మ = కర్మములేదు. అతః = కనుక, తదభావః = సృష్టి ప్రళయములు లేకపోవును కనుక పరమాణువాద మనుపపన్నము.

పరమాణువులతో జగము సృజింపఁబడునని వైశేషికుల యభిప్రాయము. రెండణువులు వస్త్రముగాఁ దయారగుటకు సంయోగము గావింపఁబడునప్పుడు కర్మముకనిపించుచున్నది. అట్లే సృష్టికిఁ బరమాణువులు సంయోగము నొందవలెనన్న కర్మ ముండవలెను. కర్మ మనునదియొక కార్యమే కనుక, దానికి నిమిత్త మేదైన నుండవలెను. ఆది సృష్టిలో నట్టి నిమిత్త మేదియు నుండదు కనుక సంయోగోత్పత్తినిమిత్తమైన కర్మమేమియుఁ బరమాణువులలో నుండదు. ఇట్లే మహాప్రళయములో విభాగోత్పత్తికనుకూలమైన కర్మ ముండదు. ఈ రెండువిధములుగను కర్మసంభవింపదు. కాన సృష్టిప్రళయములు సంభవింపవు. కనుక పరమాణుకారణ వాదము సరికాదు. అనియభిప్రాయము.

సమవాయాభ్యుపగమాచ్చ సామ్యాదనవస్థితేః 13

సమవాయసంబంధము నంగీకరించుటవలన, భేదము సమమగుటవలన, ననవస్థాదోషము గలుగును.

రెండు పరమాణువుల వలన ద్వ్యణుకము పుట్టున నియు ఆద్వ్యణుక మాపరమాణువులకంటె విభిన్నమనియు, పరమాణావులయందా ద్వ్యణుకము సమవాయసంబంధమున నున్నదనియు, వైశేషికుల సిద్ధాంతము.

పరమాణువులకంటె విభిన్నమైన ద్వ్యణుకము, పరమాణువులయందు సమవాయసంబంధమున నున్నదన్నపుడు ఆ సమవాయసంబంధము, ద్వ్యణుకమువలెఁ బరమాణువుల కంటె వేరయినదేకదా. నిది యేసంబంధముతో నున్నది? అనఁగా నేదో మరొకసంబంధమును జెప్పవలెను. అది మరల నేసంబంధమున నున్నది? అని యిట్లనవస్థాదోషము కలుగునని యభిప్రాయము.

## నిత్య మేవచ భావాత్ 14

పరమాణువులు ప్రవృత్తిస్వభావములో, నివృత్తి స్వభావములో యని యేదోవిధముగఁ జెప్పిన, నాస్వభావము వానియందు, నిత్యమేవచభావాత్ = నిత్యముగా నుండుటవలనఁ, ప్రళయముకాని, సృష్టికాని యేదియొ నిత్యముగా నుండవలసివచ్చును.

## రూపాదిమత్త్వాచ్చ విపర్యయో దర్శనాత్. 15

రూపాదిమత్త్వాచ్చ = రూపము మొదలగునవి కలిగినవగుటవలన దర్శనాత్ = లోకదృష్టాంతమువలనఁ విపర్యయః = పరమాణువులయందు వ్యత్యాసము కలుగును.

లోకములో రూపాదులుగల వస్తువు, స్వకారణముకన్న స్థూలముగను, ననిత్యముగను గాన్పించుచున్నది. పరమాణుసిద్ధాంతములోఁ జివరకు మిగిలినవి వాయ్వగ్ని, జల పృథివీ పరమాణువులు నాలుగు. వీనిలో వాయుపరమాణువులకంటె వహ్ని పరమాణువు, రూపముం గలది. జల పరమాణువు దానికంటె రూపము, స్పర్శ, యనునవి గలది. అనఁగా నొక దానికంటె నొకటి స్థూలమైనది యనిత్యమైనదియునని యభిప్రాయము. అనిత్యములు, స్థూలములునగు వీనివలన జగత్సృష్టి యనుపపన్నమని యుద్దేశము.

ఉభయథాచ దోషాత్ 16

ఉభయథాచ = ఒకదానికంటె నొకటి స్థూలసూక్ష్మతారతమ్యములు గలవని చెప్పినను, లేవని చెప్పినను రెండువిధములచేతను దోషాత్ = దోషమేయుండుటవలనఁ బరమాణువాద ముచితముగాదు.

పృథివియందు — గంధ, రస, రూప, స్పర్శములు నాల్గు నుండుటచేఁ బృథివిస్థూలము

జలములందు, — రస, రూప, స్పర్శములు, మూఁడు గుణములు మాత్రమే యుండుటచే జలములు పృథివికన్న సూక్ష్మములు.

తేజస్సునందు, — రూప, స్పర్శములు రెండుగుణములు మాత్రమే యుండుటవలన నిది దానికంటె సూక్ష్మతరము,

వాయువునందు — స్పర్శ మొక్కటిమాత్రమే యుండుటచేత నది యన్నిటికంటెను సూక్ష్మతమము.

భూతము లిట్లు తారతమ్యము కలిగియున్నపుడు వాని పరమాణువులును నీతారతమ్యము కలిగియే యుండును. హెచ్చుతగ్గులుగల యాకారములతోఁ గూడిన వీనిని బరమాణువులనుట యెట్లుపొసఁగును? అని తారతమ్య మున్నదను పక్షములో దోషము.

ఒకవేళ పృథివీపరమాణువునందు గంధము, జల పరమాణువునందు రసము, తేజఃపరమాణువునందు, రూపము, వాయుపరమాణువునందు స్పర్శమును నొక్కొక్కగుణము మాత్రమే యున్నదనినఁ బృథివియందు రస, రూప, స్పర్శ ములు లేకపోవలసివచ్చును. ఇట్లే జలమునందు రూప స్పర్శములు, తేజస్సునందు స్పర్శమునునవి లేకపోవలసివచ్చును. కారణ ములగు పరమాణువులలో లేని యీగుణములు కార్యములగు భూతములందు రావని యభిప్రాయము, తారతమ్యము లేద న్నచో నీదోషము సంభవించును. అని రెండువిధములను దోషము కలదనుట.

అపరిగ్రహా చ్చాత్యంత మనపేక్షా. 17

అపరిగ్రహాచ్చ = మన్వాదిమహర్షు లెవ్వరును నీపర మాణువాదము నెచ్చటను గ్రహింపకుండుట వలననీనియందు,

అత్యన్తం = మిక్కిలి, అనపేక్షా - అపేక్షలేకపోవుట, (పరమాణువాదమునందనాదరమని) యభిప్రాయము.

### 4 సముదాయాధికరణము. (18–27)

ఇంతవఱకు నర్ధవైనాశికులగు వైశేషికుల మతమును ఖండించి యింకముందు పూర్ణవైనాశికులగు బౌద్ధులమతమును ఖండించుచున్నారు.

వైశేషికులు పరిణామభేదముచే దేహములు క్షణికములనియు, ఆత్మ, స్థిరమైనదనియుఁ జెప్పుటచే వీరి నర్ధవైనాశికులని చెప్పుదురు. బౌద్ధులు సర్వము క్షణికమే యని చెప్పుటచే వీరిని పూర్ణవైనాశికు లందురు.

బుద్ధముని యుపదేశించిన యాగమమును విని శిష్యులు నలుగురు, నాలుగువిధములుగా గ్రహించిరి. వైభాషికులు, సౌత్రాంతికులు నను మొదటివారిరువురు, సర్వాస్తిత్వవాదులు. (అంతయు నున్నదని చెప్పెడివారు) మూడవవారు విజ్ఞానవాదులు. నాల్గవవారు సర్వశూన్యవాదులు. వైభాషికులు, సౌత్రాంతికులు ననువిరుతెగలవారును, జ్ఞానము, తదతిరిక్త పదార్థములన్నియును, క్షణికములు, సత్యములైనవి యని చెప్పుదురు. కాని వైభాషికులు, ఘటాదిపదార్థములు ప్రత్యక్షములని యందురు. సౌత్రాంతికులు, జ్ఞానము ఘటాద్యాకారముగా నుత్పన్నమైనతరువాత, నంతవఱకు నప్రత్యక్షము

లైన ఘటాదులు, అవయవాకారముగఁ బ్రత్యక్షమగునని చెప్పుదురు. ఎట్లైనను. వీరిరువురును బాహ్యార్థాస్తిత్వవాదు లగుటచే నిరువురను గలిపి ఖండించుచున్నారు.

వీరు పరమాణుసమూహముకంటె వేరుగా అవయవి భూతమగు (అవయవములుకలదై తయారయిన) కార్యమేదియు లోకములోలేదు. పరమాణు హేతుకమైన పృథివ్యాదిసమూహము బాహ్యపదార్థమనియు, రూప, విజ్ఞాన, వేదనా, సంజ్ఞాసంస్కారములను పంచస్కంధములయొక్క సముదాయము ఆధ్యాత్మికపదార్థ మనియు రెండు విధములగు పదార్థములను చెప్పుదురు. ఆవిషయ మీయధికరణములో నిరసింపఁబడుచున్నది.

సముదాయ ఉభయహేతుకేపి తదప్రాప్తిః 18.

ఉభయహేతుకేపి సముదాయే తదప్రాప్తిః = పరమాణువులు, పంచస్కంధములు, అను రెండుహేతువులతోను సముదాయము సిద్ధింపదు.

పరమాణుహేతుకమైన పృథివ్యాది బాహ్యసముదాయముకాని, పంచస్కంధహేతుకమైన యాధ్యాత్మిక సముదాయముకాని సిద్ధించుటకు చేతనుఁడొకఁ డుండవలెను. చేతనుఁడులేనిచో యచేతనములగు నవి తమంతట సముదాయముగాఁ గాలేవని యర్థము.

ఇతరేతర ప్రత్యయత్వా దితిచే న్నోత్పత్తి
మాత్రనిమిత్తత్వాత్. 19

ఇతరేతర ప్రత్యయత్వా దితిచేత్ = ఒకదాని కొకటి కారణమగుటవలనఁ జేతనుఁడు లేకున్నను సంఘాతము పుట్టవచ్చును. అని యన్నచో న = కాదు, ఉత్పత్తిమాత్ర నిమిత్తత్వాత్ = అవిద్యాదికలాప మొకదానినుండి యొకటి పుట్టుటకుమాత్రమే హేతువులుగాని సముదాయోత్పత్తికిఁ గారణములు కావు. (సముదాయోత్పత్తికిఁ జేతనుఁ డుండవలె ననుట)

అవిద్య, రాగసంస్కారము, నామము, రూపము, మొదలగునవి యవిద్యాకలాపమనియు, నివి పరస్పరకారణములగుటవలన ఘటీయంత్రమువలెఁ దిరుగుచుండుటచేఁ దమంతటనే సముదాయముగ నేర్పడుననియు, బౌద్ధులు చెప్పుదురు.

ఉత్తరోత్పాదేచ, పూర్వనిరోధాత్ 20

ఉత్తరోత్పాదేచ = సర్వము క్షణికమని చెప్పు వీరిమతములో ముందటి కార్యము జనించునరికి, పూర్వనిరోధాత్ = వెనుకటి కారణము నశించునుగాన హేత్వధీనమగు కార్యోత్పత్తి కుదురదు.

అసతిప్రతిజ్ఞోపరోధో, యౌగపద్యమన్యథా 21

అసతి = కారణము లేకయే కార్యము కల్గుననినను, కార్యము కలుగువఱకుఁ గారణ ముండుననినను, ప్రతిజ్ఞోపరోధః

= వారిప్రతిజ్ఞాభంగము కలుగును. అన్యథా = అట్లు కానిచో, యౌగపద్యమ్ = కార్యకారణముల కేకకాలిక త్వము కల్గును.

పూర్వజ్ఞానము, చక్షుస్సు, ఆలోకము, విషయము, ననునాలుగు హేతువులున్నచో నీలాదివిజ్ఞాన రూపమగు కార్యము కలుగునని వారిప్రతిజ్ఞ. కారణములేకయే కార్యము కలుగునన్న నీప్రతిజ్ఞకు భంగముకలుగును, కార్యము కలుగు వఱకుఁ గారణముండుననిన యౌగపద్యము, క్షణికవాదప్రతిజ్ఞా భంగము కలుగును.

## ప్రతిసంఖ్యాఽప్రతిసంఖ్యా నిరోధాప్రాప్తి రవి చ్ఛేదాత్. 22

అవిచ్ఛేదాత్ = క్షణికములుగాఁ గాక ఘటపటాదులు కన్పించుచుండుటవలన, ప్రతిసంఖ్యాఽప్రతిసంఖ్యా నిరోధా ప్రాప్తిః = ప్రతిసంఖ్యా నిరోధము, అప్రతిసంఖ్యా నిరోధము ననువాని ప్రాప్తి లేదు.

ఎదురుగానున్న వస్తువులు లేవని బుద్ధిపూర్వకమగు నాశనము నారోపించుట, ప్రతిసంఖ్యానిరోధము, అబుద్ధిపూర్వ కమగు నాశనమున కప్రతిసంఖ్యానిరోధ మనియు నర్థము. వైనాశికులు, అప్రతిసంఖ్యా ప్రతిసంఖ్యా నిరోధములును, ఆకాశమును అనుమూడును, నిశ్శ్వేతుకములు నిరుపాఖ్యములు తుచ్ఛములునని చెప్పుదురు.

ఉభయథా చ దోషాత్. 23

ఉభయథాచ = రెండువిధములను, దోషాత్ = దోషముండుటవలన సౌగతమతము సరియైనదికాదు.

ప్రతిసంఖ్యా నిరోధాంతర్గతమగు అవిద్యాది నిరోధము, సదోక్షజ్ఞానమువలనఁ గలుగునా? లేక స్వతః కలుగునా? సదోక్షజ్ఞానమువలన నన్నచో నిర్హేతుక నాశాభ్యుపగమహాని ప్రసంగమును, స్వతః కలుగు నన్నచో సమ్యగ్జ్ఞానోపదేశానర్థక్యము నని రెండువిధములను దోషమున్నది.

ఆకాశే చావిశేషాత్. 24

అవిశేషాత్ = వస్తుత్వప్రతీతిలో విశేషము లేదుగనుక ఆకాశేచ = ఆకాశమునందును, నిరుపాఖ్యత్వము లేదు. ప్రతిసంఖ్యా నిరోధము, అప్రతిసంఖ్యా నిరోధము, ఆకాశము, అనుమూడును, నిరుపాఖ్యములు, (స్వరూపములేనివి) అని బౌద్ధుల సిద్ధాంతము. "ఆత్మన ఆకాశ స్సంభూతః" అని శ్రుతియుండుటచే స్వరూపము లేకపోవుటయనునది ఆకాశమునందును లేదు. (ప్రతిసంఖ్యా-ఉప్రతిసంఖ్యా నిరోధము లందెట్లును లేదని యుక్తి(ప్రాయము) ఇదియు నిరుపాఖ్యము కాదని యర్థము.

అవ:- సర్వము క్షణికమని యంగీకరించు వైనాశికులు ఆత్మనూడ క్షణికమందురు. అది కుదరదని ఖండించుచున్నారు.

## అనుస్మృతేశ్చ 25

అనుస్మృతేశ్చ = అనుభవానంతరము గలుగు స్మృతి అనుస్మృతి. ఆ యనుస్మృతివలన, అనుభవము ననుసరించి స్మరణముగలుగుటవలన నాత్మ క్షణికుఁడనుట యొప్పదు. ఒకఁడనుభవించిన, మఱొకఁడు దానిని స్మరించుట యసంభవము.

## నాసతోఽదృష్టత్వాత్ 26

అదృష్టత్వాత్ = ఎచ్చటను గన్పడకపోవుటవలన, అసతః = అభావమువలన, న = కార్యము పుట్టదు.

సర్వము క్షణికమనుటచే బౌద్ధులమతములో స్థిరమయిన దేదియును లేదు. బీజమునుండి యంకురము పుట్టునప్పుడును, బీజము స్వస్వరూపమును గోల్పోయి యభావరూపము నొందును, తరువాత నంకుర ముదయించుటచే నభావము నుండి భావము పుట్టుచున్నదని వారియభిప్రాయము. అట్లయినచో నిరుపాఖ్యములయిన శశనరవిషాణాదికములగు అభావము వలన గార్యమేల పుట్టరాదు ?

## ఉదాసీనానామపి చైవం సిద్ధిః 27

ఉదాసీనానామపి = ఉదాసీనులకున్న ఏవం = ఇట్లు సిద్ధిః = కార్యసిద్ధి యగును. అభావమువల్లనే భావము పుట్టినచోఁ గృష్యాది వ్యాపారములను జేయక యుంటఁ గూర్చు

న్నను స్వాభిమత కార్యము సిద్ధింపవలెను. కాన సౌగత మతము గ్రాహ్యముకాదని యభిప్రాయము.

5 అభావాధికరణము (28-32)

అవ = బౌద్ధులలో యోగాచారులని యొక తెగవారు కలరు. వీరు విజ్ఞానముతప్ప బాహ్యార్థ మేమియు లేదందురు. "నల్లని కుండ" అనునపుడు, నలుపు, తెలుపు మొదలగు ధర్మములను దెలుపుటకై బాహ్యార్థవాదులుకూడ విజ్ఞానము నకు నీలాద్యాకారము నంగీకరింపవలెను. అట్లు సర్వత్రవిజ్ఞానమే బాహ్యాకారము నొందుచున్నదని చెప్పినచో సరిపడు చుండఁగా బాహ్యార్థము నంగీకరించుట యనుచితమని వీరి మతము. దానిని ఖండించుచున్నారు.

నాభావ ఉపలబ్ధేః 28

ఉపలబ్ధేః = బాహ్యార్థము కనఁబడుచుండుటవలన అభావః, న = లేదని చెప్పుట కుదురదు. విజ్ఞానాతిరిక్తముగ ఘటపటాది బాహ్యార్థములు కనిపించుచుండ విజ్ఞానముతప్ప బాహ్యార్థమేమియు లేదని చెప్పుట కుదురదని యర్థము

వైధర్మ్యాచ్చ న. స్వప్నాదివత్ 29

వైధర్మ్యాచ్చ = స్వప్నజాగ్రదవస్థలకు భేద ముండుట వలన, స్వప్నములోఁ గన్పడిన యర్థములు విజ్ఞానముతప్ప

వేరుగా లేవట్లు జాగ్రదవస్థలోఁ గూడ విజ్ఞానమే కాని బాహ్యార్థ మేమియు లేదనరాదు.

స్వప్నములోఁ జూచిన వస్తువు మేల్కొనినతరువాతఁ గన్పడదు. జాగ్రదవస్థలోఁ జూచిన వస్తువు కనఁబడుచున్నది.

న భావో ఽనుపలబ్ధేః 30

అనుపలబ్ధేః=నీమతములో బాహ్యవస్తువులు లేకపోవుట వలన, భావః = వాసనలుకలుగుట, న = లేదు. అనగా, బాహ్యవస్తువులు లేకున్నను, వాసనా వైచిత్ర్యమువలన జ్ఞానవైచిత్ర్యము కలుగునని వారుచెప్పెడుమాట కుదురదని యర్థము.

క్షణికత్వాచ్చ 31

విజ్ఞానము క్షణికమని చెప్పుటవలన, వాసనాశ్రయమై, అహంఅను ఆలయ (చనిపోవునంతకునుండెడు) విజ్ఞానము కలుగునని చెప్పుటకుఁగూడ వీలులేదు.

సర్వథా ఽనుపపత్తేశ్చ 32

సర్వవిధముల ననుపపన్నముకాన శూన్యవాదమును గుదురదు. పశ్యన (దర్శన) తిష్ఠన (స్థాన) అను నపశబ్దముల వల్లను, అపార్థముల వల్లను సర్వథా సౌగతమత మనుపపన్నము. అనియభిప్రాయము.

బాహ్యార్థవాదులు, విజ్ఞానవాదులు, శూన్యవాదులు నగుబౌద్ధుల మతములన్నియు నిరాకరణీయములే యని యర్థము.

## 6. నైకస్మిన్నసంభవాధికరణము. (33-36)

అవ = బౌద్ధమతమును నిరాకరించి, ప్రసంగసంగతిగా జైనమతమునుగూడ ఖండించుచున్నారు. ఈజైనులకు దిగంబరులనికూడ వ్యవహారముకలదు. జీవ, అజీవ, ఆస్రవ, సంవర, నిర్జర, బంధ, మోక్ష, యనిసేడ్లుకల యేడుపదార్థములు కలవని వీరుచెప్పుదురు. జీవ యనఁగాభోక్త, అజీవ యనఁగా భోజ్యము, ఈరెండును ముఖ్యములు. విషయాభిముఖ మగు ప్రవృత్తి యాస్రవము. దానిని నియమించుట సంవరము. పాపముల నశింపఁజేయు తప్తశిలారోహణాదికము నిర్జరము. బంధ మనఁగాఁ గర్మము. మోక్ష మనఁగా నూర్ధ్వగమనము. కొలదిపాటి బరువుకట్టి నీటిలో విడిచిపెట్టిన యానపకాయ బుఱ్ఱ యెట్లు పైకిఁదేలుచుండునో యట్లు ఊర్ధ్వలోకగమనమునకు మోక్షమనిపేరు.

ఈపదార్థముల కేడింటికి సప్తభంగీనయము నవలంగింతురు. 1 వస్తువుండుట, 2 వస్తువు లేకుండుట, 3 ఉండుట లేకుండుట, 4 చెప్పుటకు వీలులేకపోవుట, 5 ఉన్నదన వీలు లేకుండుట, 6 లేదన వీలులేకుండుట, 7 ఉన్నది లేదు అని యన వీలులేకుండుట. యనునవి సప్తభంగులు, ప్రతివస్తువు

నీవ సప్తవిధమగు భంగములుకలవని వీరియభిప్రాయము. ఈ యధికరణమున నామతమును ఖండించుచున్నారు.

### నైకస్మిన్నసంభవాత్ 33

ఏకస్మిన్ = పరమార్థరూపమగు నొకేవస్తువునందు, అసంభవాత్ = సప్తభంగీనయముచే నున్నది, లేదు, అని విరుద్ధ ధర్మకథనము కుదురదు. కాన, న = వస్తువున కనేక రూపత్వము రాదు.

### ఏవంచాత్మాఽకార్త్స్న్యమ్. 34

ఏవంచ = ఒకదానియందు విరుద్ధధర్మములు సంభవింపనిరీతిగా, ఆత్మాఽకార్త్స్న్యమ్ = ఆత్మయొక్క అపరిపూర్ణతయనునదికూడ వీరిమతమున దోషము.

“ శరీర మెంత యుండునో ఆత్మ, అంతయుండును. శరీర పరిచ్ఛిన్నుఁడుఆత్మ,” అని వీరందురు. అట్లుచెప్పినచో ఆత్మకుఁ బరిపూర్ణతపోయి, పరిచ్ఛిన్నత యనుదోషము కలుగును. అనియభిప్రాయము.

అదికాక, మనుష్యుఁడు ప్రారబ్ధవశమున మఱలజన్మములో నేనుఁగై పుట్టినచో, మనుష్యశరీర పరిమితమగు నాత్మ యేనుఁగు శరీరమందంతట లేకుండును. క్రిమిరూపుఁ డైనచో మనుష్య శరీర పరిచ్ఛిన్నుఁడగు నాత్మయంతయుఁ గాక యేకొంచమో యాక్రిమిలోఁ బ్రవేశింపవలసి వచ్చును.

న చ పర్యాయాద ప్యవిరోధో వికారాదిభ్యః. 35

పర్యాయాదపి = జీవునకు సావయవత్వము నంగీకరించి అవయవములు, కొన్ని క్రొత్తగావచ్చుట, కొన్ని పోవుట యని పర్యాయమును అంగీకరించినచో గజాదిస్థూల సూక్ష్మ శరీరములు కలిగినను, అవిరోధః న చ = విరోధము లేక పోవుట లేదు. ఎందుచేతననగా వికారాదిభ్యః = వికారాదుల వలన. ఆత్మ సావయవి, యనిత్యము, అని దోషము కలుగును. బంధ మోక్ష వ్యవస్థ కుదురదు.

మనుష్యుడు దేవుడై పుట్టునపుడు క్రొత్తగా వచ్చెడు నవయవము లెక్కడనుండి వచ్చును? చీమయై పుట్టునపుడు పోయెడియవయవము లెక్కడికి బోవును? అను నవియు దోషములే.

అత = మోక్షావస్థాభావియగు జీవపరిమాణము (అంత్యమని, నిత్యమని యాజైనులసిద్ధాన్తము. కనుక

అంత్యావస్థితే శ్చోభయనిత్యత్వా దవిశేషః 36

అన్త్యావస్థితేశ్చ = అంత్యపరిమాణము నిత్యమన్నచో ఉభయనిత్యత్వాత్ = ఆద్యమధ్యమపరిమాణములును, తద్దృష్టాంతముచే నిత్యములే యగుట వలన, అవిశేషః = ఆద్య మధ్య మాంత్యపరిమాణముల భేదము లేకపోవును.

## 7 పత్యధికరణము. (37–41)

అథ = ఈయధికరణమున, "ఈశ్వరుఁడు కేవలనిమిత్త కారణమే కాని, ఉపాదాన కారణము కాఁడు, అనెడు, సేశ్వరసాంఖ్య, (పాతంజల) తార్కిక, మతములను ఖండించుచున్నారు.

### పత్యురసామంజస్యాత్. 37

అసామంజస్యాత్ - హీనులు, మధ్యమజాతీయులు ఉత్తములు, అని యనేకవిధములుగాఁ బ్రాణులను సృష్టిచేయుటలో నీశ్వరుఁడు రాగద్వేషాది దోషములు కలవాఁడనెడి యసామంజస్యము కలుగుటవలన, పత్యుః = ఈశ్వరునకు, ప్రధానపురుషాధిష్ఠాతృత్వేన జగత్కారణత్వము = కేవల నిమిత్తకారణత్వము, కుదురదు.

### సంబంధానుపపత్తేశ్చ. 38

ప్రధాన పురుషుల కంటె వ్యతిరిక్తుఁడైన యీశ్వరుఁడు ఏసంబంధము లేకయే ప్రధానపురుషుల కీశుఁడుగాఁడు. ఇరువురు నిరవయవులగుటచే సంయోగసంబంధము లేదు. అవయవావయవ్యాది భావము లేకపోవుటచే సముదాయసంబంధమును లేదు. సిద్ధాన్తములో తాదాత్మ్య సంబంధము కలదు.

### అధిష్ఠానానుపపత్తేశ్చ. 39

అధిష్ఠాన + అనుపపత్తేశ్చ = అప్రత్యక్షమగు ప్రధానమధిష్ఠానమనుటయు నుపపన్నము కాదు.

కరణవచ్చే న్న భోగాదిభ్యః 40

కరణవచ్చేత్ = అప్రత్యక్షములైనను జీవుఁ డింద్రియములను ప్రేరణచేసినట్లు, ఈశ్వరుఁడు ప్రధానాదులను ప్రేరణ చేయుచున్నాఁడనిన, భోగాదిభ్యః = ఈశ్వరునకుభోగాది దోషములు గలుగుటవలన, న = అట్లు చెప్పుటకువీలులేదు.

జీవుఁ డింద్రియములఁ బ్రేరణచేయుట భోగార్థముకాన నీదృష్టాంతముచే నీశ్వరునికి భోగాదిప్రసక్తి కలుగును.

అంతవత్త్వ మసర్వజ్ఞతా వా 41

ప్రధానపురుషేశ్వరుల సంఖ్యాపరిమాణములను ఈశ్వరుఁడు తెలిసికొనగలఁడా? లేడా? తెలిసికొనగలఁడన్నచో, నంతములేని వారని చెప్పఁబడు ప్రధానపురుషు లంతము గలవార లగుదురు. వారిస్థితిని ఈశ్వరుఁడు తెలిసికొనలేఁడన్నచో నీశ్వరుఁడు సర్వజ్ఞుఁడుకాఁడని హైన దోషము కలుగును.

8 ఉత్పత్త్యసంభవాధికరణము (42-45)

ఈయధికరణమున భాగవతమతమును ఖండించుచున్నారు. "నిర్వికార నిరంజన స్వరూపుఁడు భగవంతుఁడగు వాసుదేవుఁ డొక్కఁడే పరమార్థతత్త్వము. అతఁడు తనను వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధ, వ్యూహములని (స్వరూపములని) నాలుగువిధముల విభజించుకొనెను.

అందు వాసుదేవుఁడనఁ బరమాత్మ, సంకర్షణుఁడన జీవుఁడు, ప్రద్యుమ్నుఁడన మనస్సు, అనిరుద్ధుఁడన నహంకారము. వాసుదేవవ్యూహమొక్కటి పరప్రకృతి, మిగిలిన మూఁడు వ్యూహములును కార్యములు. ఇట్టి భగవంతుని సేవించువాఁడు సకలక్లేశములను విడచి భగవంతుని బొందును. అని వీరు చెప్పుదురు. ఈశ్వరుఁడు, నిమిత్తము, ఉపాదానము, కూడ, నగునని వీరును జెప్పుదురు" వీరిమతములోఁగల కొన్ని విరుద్ధాంశములను నిరాకరించుచున్నారు.

ఉత్ప_త్త్యసంభవాత్ 42

ఉత్పత్తి + అసంభవాత్ = వాసుదేవవ్యూహము (పరప్రకృతి, కారణము) వలన సంకర్షణ వ్యూహము (కార్యము) పుట్టుచున్నదనుట సంభవింపదు కనుక నీమతము సరియైనది కాదు.

పుట్టుచున్నట్లు చెప్పినచో జీవుఁ డనిత్యుఁడే యగును. అతనికి భగవత్ప్రాప్తి రూపమగు మోక్షము లభింపదు.

నచ కర్తుః కరణమ్ 43

కర్తుః = కర్తనుండి, కరణమ్ = కరణముజనించుట, నచ = లేదు. అసంభవము. భాగవతులు "సంకర్షణసంజ్ఞకల, కర్తయగు జీవునివలన, ప్రద్యుమ్న సంజ్ఞకమైన కరణమగు మనస్సున్ను దానినుండి యనిరుద్ధ సంజ్ఞకమైన యహంకార

మున్నుబుట్టెనని చెప్పుదురు. లోకములో నెచ్చటను కర్త నుండి కరణము జన్మించుట యనునది లేదనియర్థము.

విజ్ఞానాదిభావే వా తదప్రతిషేధః 44

విజ్ఞానాదిభావేవా = సంకర్షణ, ప్రద్యుమ్నానిరుద్ధులు, ముగ్గురును, వాసుదేవునివలెనే విజ్ఞానైశ్వర్య బల శక్తులు కలవారేయనినను, తదప్రతిషేధః = ఆదోషమునకుప్రతిషేధము లేదు.

వాసుదేవాదులు నలుగురును సమానధర్మము గల యీశ్వరులే యనిచెప్పిన, నొక్క యీశ్వరునితోనే యీశ్వరకార్య మంతయు నిర్వర్తింపఁబడుచుండ నలుగుర నీశ్వరులఁ గల్పించుట యనర్థకము. అదికాక, వాసుదేవుఁ డొక్కఁడే పరతత్త్వమని వారుచెప్పెడిమాట పోయినది. ముగ్గురును వాసుదేవునివలనఁ బుట్టిరన్నచో నుత్పత్త్యసంభవ రూపమగు దోషము తదవస్థమే. అని యభిప్రాయము.

విప్రతిషేధాచ్చ 45

విప్రతిషేధాత్ + చ = పరస్పర విరోధమువల్లనున్ను నీమతము సరిదైనదికాదు.

ఒకచోట, జ్ఞానైశ్వర్య శక్తి బల వీర్య తేజస్సులు గుణములనిచెప్పి, వేఱొకచోట నీగుణములే భగవత్స్వరూపమని, వాసుదేవుఁడని చెప్పఁబడినది. అదికాక, నాల్గువేదము

లందు నుత్తమమైన శ్రేయోమార్గమును గానక, శాండిల్యుఁ డీశాస్త్రమును గనిపెట్టెనని చెప్పుటచే వేదనిందకూడ గని పించుచున్నది. వేదవిరుద్ధమైన యీకల్పన మసంగతమని యభిప్రాయము,

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి విరచితమగు
బ్రహ్మసూత్రార్థదీపిక యను
బ్రహ్మసూత్రవృత్తియందు
ద్వితీయాధ్యాయమున
ద్వితీయపాదము
అధి-8-సూ 45

శ్రీ ర స్తు

# బ్రహ్మసూత్రార్థ దీపిక

## ద్వితీయాధ్యాయ తృతీయపాదము

(ఇందు పంచమహాభూత సృష్ట్యాది శ్రుతులకును జీవ విషయ శ్రుతులకును బరస్పర విరోధ పరిహారము చేయఁబడు చున్నది.)

### 1 వియదధికరణము. (1-7)

వెనుకటి పాదమున శ్రుతివిరుద్ధము లగుటచేఁ బరపక్షములు నిరాకరణీయములని చెప్పఁబడినది. శ్రుతులుగూడఁ బరస్పర విరుద్ధములుగా నున్నందున బ్రహ్మకారణ వాద మెట్లు కుదురును? అను నాశంకను నిరసింప నీపాద మారంభింపఁబడినది. ముందు ఆకాశమునాశ్రయించి సృష్టివాక్య విరోధమును విచారించుచున్నారు.

కొన్ని శ్రుతులయం దాకాశసృష్టి లేదు. కొన్నిటియం దున్నది. కనుక ఆకాశమున కుత్పత్తియున్నదా? లేదా? అను శంక కలుగ నేక దేశి మతముచే సమాధానము చెప్పుచున్నారు.

న వియ దశ్రుతేః. 1

అశ్రుతేః = ఆకాశోత్పత్తిని దెలుపు శ్రుతి లేకపోవుట వలన, వియత్ = ఆకాశము, న = పుట్టుటలేదు. —ఛాందో

గ్యములో “ సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్, ఏకమే వాద్వితీయమ్” 6. 2. 1. అని ప్రారంభించి, తత్తేజోఽసృజత, అని చెప్పెను. ఆకాశోత్పత్తిని చెప్పలేదు. కనుక ఆకాశమున కుత్పత్తి లేదు.

అస్తితు. 2

ఉన్నది. ఛాందోగ్యమున లేకపోయినను తైత్తిరీయకములో “ సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ” అని ప్రారంభించి “ తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః” తై.2-1. అని యాకాశోత్పత్తి యున్నది.

గౌణ్య సంభవాత్. 3

గౌణీ, అసంభవాత్, – ఈ చెప్పిన ఆకాశోత్పత్తిశ్రుతి, గౌణి = అప్రధానము, ముఖ్యమైనదికాదు. ఎందుచేతననఁగా, అసంభవాత్ = సమవాయికారణాది సామగ్రి లేకపోవుటవలనను, విభువగుటచే నిత్యత్వా నుమానము వల్లను ఆకాశమున కుత్పత్తిసంభవించదు కనుక.

శబ్దాచ్చ. 4

శబ్దాచ్చ = వాయు శ్చాన్తరిక్షం చైత దమృతమ్. బృ. 2. 3. 3. అను శబ్దము వల్లను, ఆకాశమున కుత్పత్తి లేదు. అమృతమనఁగా, మృతి = చావు, లేనిది. ఉత్పత్తియున్నఁగదా మృతి గలుగుట, అని యభిప్రాయము.

స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్. 5

స్యాత్, చ, ఏకస్య, బ్రహ్మశబ్దవత్.

" ఆత్మన ఆకాశ స్సంభూతః" అను వాక్యములో నున్న సంభూత పదమునకు, ఆకాశవిషయమున గౌణత్వము, తేజస్సు మొదలగు వానివిషయమున ముఖ్యత్వము, అని చెప్పవచ్చునా? ఒకేవాక్యములో నొకేపదమునకు గౌణత్వ ముఖ్యత్వముల నాశ్రయించుట తగునా? యనిన, బ్రహ్మశబ్దవత్ = బ్రహ్మశబ్దమునకువలె, "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" అనుచోట అన్నాదులయందు బ్రహ్మశబ్దము గౌణముగను, "ఆనందో బ్రహ్మ" అనుచోట ముఖ్యముగను, ఒకే ప్రకరణమున విషయ భేదము ననుసరించి బ్రహ్మశబ్దమునకు గౌణత్వముఖ్యత్వములు చెప్పినట్లు, ప్రకృతమున, ఏకస్య = ఒకేసంభూతశబ్దమునకు, స్యాత్ = గౌణత్వముఖ్యత్వాశ్రయణము కలుగును.

ప్రతిజ్ఞాఽహాని రవ్యతిరేకాచ్ఛబ్దేభ్యః 6

ప్రతిజ్ఞాఽహానిః, అవ్యతిరేకాత్, శబ్దేభ్యః,

ఇంతవఱకుఁ జెప్పిన ఏకదేశిమతమును దూషించి సిద్ధాన్తము చేయుచున్నారు. అవ్యతిరేకాత్ = వేదమువలనఁ దెలియఁదగిన బ్రహ్మముకంటె సమస్తవస్తుజాతము వ్యతిరిక్తము కాదుకనుక, ప్రతిజ్ఞా అహానిః = ప్రతిజ్ఞకు, హానిలేదు.

బ్రహ్మముకన్న వేఱుగా నిత్యమగు ఆకాశ మున్నదన్నచో, ఆప్రతిజ్ఞకు హానికలుగును. కనుక ఆకాశోత్పత్తిని అంగీకరింప వలెను. అంగీకరించిన ఆకాశమును బ్రహ్మాధీనసత్తాకమే కనుక ఆప్రతిజ్ఞ సమర్థితమగును. ఆప్రతిజ్ఞయేమిటి? అనిన ఏకవిజ్ఞానముచే సర్వము విజ్ఞాతమగును, అనునది. ఒక్క బ్రహ్మస్వరూపము తెలిసినచో సమస్తప్రపంచము బ్రహ్మకంటె వేఱుకాదు కనుక నదియును తెలియును. ఒక్క మృత్తు తెలిసినచో మృత్కార్యములగు ఘటాదికము లన్నియుఁ దెలియును, అని కార్యకారణముల కభేదము దృష్టాంతపూర్వకముగాఁ జెప్పఁబడినది. ఈ ప్రతిజ్ఞాఽహాని = ప్రతిజ్ఞాసమర్థనము, శబ్దేభ్యః = వేదశబ్దములవలన "ఏక మేవాద్వితీయమ్" "ఐతదాత్మ్య మిదం సర్వమ్" మున్నగు వానివలనఁ గలుగుచున్నది. ఆకాశము పుట్టలేదు. అది నిత్యము. బ్రహ్మకన్న భిన్నము అన్నచో నీప్రతిజ్ఞకు భంగముకలుగును. కనుక ఆకాశము పుట్టినదని చెప్పవలెను.

ఛాందోగ్యములో తేజస్సృష్టిని, తైత్తిరీయకములో ఆకాశసృష్టిని జెప్పుటచే నిందేది మొదటిసృష్టి? ఏది తరువాతది? అని శంక కలుగుచున్నది. అందుచే వీని కేకవాక్యత కలుగుటకై తైత్తిరీయకమున నున్న "ఆత్మన ఆకాశ స్సంభూతః ఆకాశా ద్వాయుః, వాయో రగ్నిః" అను దాని ననుసరించి ఛాందోగ్యములోని "తత్తేజోఽసృజత" అనుదానికి ఆకాశవాయువులను సృజించి తేజస్సును సృజించెనని

యర్థము చెప్పుకొనవలెను. కనుక నివాక్యములకు విరోధము లేదు.

యావద్వికారస్తు విభాగో లోకవత్. 7

యావద్వికారం,తు,విభాగః,లోకవత్.

లోకవత్ = లోకమునందువలె, యావద్వికారంతు= వికారసముదాయము నంతంతటను, విభాగః=విభాగము కనంబడుచున్నది. అనగా వికృతులయందే విభాగముకాని ప్రకృతియందు లేదు. మృద్వికారములగు ఘట, శరావోదంచనాదులయందే విభాగముకాని ప్రకృతియగు మృత్తునందు విభాగములేదు. సువర్ణవికారములగు, కటక కేయూర కుండలములందే విభాగముకాని ప్రకృతియగు సువర్ణమునందు విభాగములేదు. ఇట్లే ఆకాశ దిక్కాలాదులగు వికృతులయందే విభాగముకాని ప్రకృతియగు బ్రహ్మమునందు విభాగము లేదు. కాన బ్రహ్మము నిత్యము. ఆకాశాదిక మనిత్యము. కార్యము. అని భావము.

3 మాతరిశ్వాధికరణము. (8)

ఛాందోగ్యములో వాయూత్పత్తి లేదు. తైత్తిరీయకములో నున్నది. ఏనికి రెండింటికిని విరోధములేదా? యనిన

ఏతేన మాతరిశ్వా వ్యాఖ్యాతః. 8

ఏతేన = ఈ ఆకాశవిమర్శనముచేత, మాతరిశ్వా = వాయువున్ను, వాయువునకుత్పత్తియున్నది యను విషయము,

వ్యాఖ్యాతః = వ్యాఖ్యానింపఁ బడినది. తైత్తిరీయక శ్రుతి ననుసరించి, ఆకాశోత్పత్తిని చెప్పినట్లు వాయూత్పత్తిని చెప్ప వలెను.

3 అసంభవాధికరణము. (9)

అసంభవస్తు సతో ఽ నుపపత్తేః. 9

ఆకాశమునకు వాయువునకును ఉత్పత్తి చెప్పినట్లుగా బ్రహ్మకును బ్రహ్మాంతరమునుండి పుట్టుక చెప్పరాదా? యనిన నిందుఁ జెప్పుచున్నారు.

అసంభవః, తు, సతః, అనుపపత్తేః.

సతః = సద్రూపుఁడగు బ్రహ్మకు (పరబ్రహ్మకు) అసంభవస్తు = ఉత్పత్తి సంభవము లేదు, ఎందుచేత? అనుపపత్తేః- ఉపపన్నముకాదుకనుక విశేషమైన ఘటమునకు సామాన్యమగు మృత్తునుండి పుట్టుక కనిపించుచున్నది. అట్లు బ్రహ్మకు జనకమగు సామాన్యమేదియును లేదు. ఇందుకు "నచాస్య కశ్చి జ్జనితా" మొదలగు వాక్యములు ప్రమాణములు.

4. తేజోఽధికరణము. (10)

తేజోఽత స్తథా హ్యాహ 10

తేజః, అతః, తథాహి, ఆహ. అతః = ఈ వాయువువలన, తేజః=అగ్ని పుట్టినది. తథాహ్యాహ = "వాయో రగ్నిః" అని తైత్తిరీయశ్రుతి యీవిధముగఁ జెప్పుచున్నది.

"తత్తేజోఽసృజత" అని ఛాందోగ్యములో (తేజస్సు సన్మూలకమని (సత్తునుండి పుట్టినదని) చెప్పుట తేజస్సునకు సత్తు పరంపరాజనక మను నర్థముకలది.

5 అబధికరణము (11)

ఆపః 11

అగ్నివలన నుదకము జనించినది అని "అగ్నే రాపః" తై 2-1 శ్రుతి చెప్పుచున్నది.

6. పృథివ్యధికారాధికరణము (12)

అవః- ఉదకమునుండి పృథివి జనించినదని చెప్పుటలో ఛాందోగ్యశ్రుతికూడ సమకూలమే యని తెలుపుట కీయధికరణ మారంభింపఁబడినది.

పృథివ్యధికారరూపశబ్దాన్తరేభ్యః 12

అధికార రూప శబ్దాన్తరేభ్యః = అధికారము, రూపము, శబ్దాన్తరము, అను వానివలన, ఛాందోగ్యములోని "తా అన్న మసృజన్త" 6-2-4 అను వాక్యములోని యన్న పదమునకు, పృథివియని యర్థము.

అధికార మనఁగా ప్రకరణము. పైన వాయువును, నగ్నిని జెప్పినతరువాతఁ గ్రమముగాఁ బృథివిని జెప్పవలయును

రూపము:- "కృష్ణం తదన్నస్య" అనెడు వాక్యశేషములో అన్నము యొక్క రూపము నలుపు అని చెప్పఁబడినది.

పృథివి వల్లగానుండుటగాని, అన్నము వల్లగానుండదు. కనుక, యీ రూపకథనముకూడ నన్నపదమునకు బృథివియను నర్థమునే తెలుపుచున్నది.

శబ్దాన్తరః- "అద్భ్యః పృథివీ" యను నితరశ్రుతి శబ్దములు,

## 7 తదభిధ్యానాధికరణము (13)

అవ:- ఆకాశమువలన వాయువు, వాయువువలన నగ్ని, అగ్నివలన నుదకము, నుదకమువలనఁ బృథివి యనునవి సృజింపఁబడినని తెలినది. ఇందుఁ బరమేశ్వరుఁడే వీని నన్నిటిని సృష్టిచేసెనా? అచేతనములగు నాకాశాదులు స్వవికారములగు వాయ్వాదులను సృష్టిచేసెనా? అను సందేహమును దొలగింప నీయధికరణ మారంభింపఁబడినది.

### తదభిధ్యానాదేవతు తల్లింగాత్సః 13

తదభిధ్యానాదేవతు - స్రష్టవ్యములగు వాయ్వా పదార్థములను ధ్యానమాత్రమువలననే, సః = ఆపరమాత్మ సృజించెను. తల్లింగాత్ - యః పృథివ్యాంతిష్ఠన్, అని సర్వనియతృత్వ లింగము వలనఁ బరమేశ్వరుఁడే వీనిని సృజించెనుగాని, యచేతనములగు నాకాశాదులు సృజింపలేదు.

అయాసృష్టి చేయుటకుఁ బరమేశ్వరుఁ డాయాస్వరూపము నొందెనని యుద్దేశము. "పూసెను, కాసెను" అను

వ్యవహారముకూడ చేతనాధిష్ఠితము లగుటచేతనే యుపపన్నములగును.

## 8 విపర్యయాధికరణము. (14)

అవ:- పృథివ్యాది భూతముల యుత్పత్తిక్రమము ననుసరించి లయము కలుగునా? సోపానపరంపర నెక్కినవాఁడు దిగుటలో వ్యుత్క్రమముగా దిగినట్లు, వీనికిఁ గూడ వ్యుత్క్రమముగా లయముగలుగునా? అన నీయధికరణ మారంభింపఁబడినది.

విపర్యయేణ తు క్రమో௨ త ఉపపద్యతే చ. 14

అతః విపర్యయేణతు = పృథివ్యాదిభూతములు, లయమగునపుడు దీనికంటె వ్యుత్క్రమముచేత లయమగును. కార్యమునశించి కారణములోఁ గలియునుగాన, నీవ్యుత్క్రమలయ ముపపన్న మగుచున్నది.

## 9 అంతరావిజ్ఞానాధికరణము (15)

అవ:- ముండకోపనిషత్తులో "ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః స్సర్వేంద్రియాణిచ, వాయుర్జ్యోతి రాపః పృథివీ విశ్వస్య ధారిణీ "2-1-3 అని యున్నది. దీనినిబట్టి యాత్మనుండి భూతసృష్టికిని మధ్య నింద్రియసృష్టి, మనస్సృష్టి, కలదు. అది యిందుఁ జెప్పఁబడలేదే యన నీయధికరణ మారంభింపఁబడినది.

అంతరా విజ్ఞానమనసీ క్రమేణ తల్లింగా దితిచే న్నావిశేషాత్ 15

అంతరా విజ్ఞానమనసీ క్రమేణ=ఆత్మకును, భూతసృష్టికిని మధ్యక్రమముగ విజ్ఞానేంద్రియ, మనస్సుల సృష్టిని, ఉపనిషలోఁ జెప్పలేదే, యదికూడకలవనుటకు, తల్లింగాత్ = ఏతస్మా జ్జాయతే ప్రాణః అను వాక్యము ప్రమాణమన్నచో, న, అవిశేషాత్ = ఇంద్రియములకు భూతములకు విశేషము లేదు కాన నట్లుచెప్పలేదు.

మనస్సు, అన్నమయమని, ప్రాణ ముదకమయమని, వాక్కు తేజోమయమని, ఛాందోగ్యములో నున్నదికాన నింద్రియములు భౌతికములేకాన వానికిఁ బరస్పరవిశేషము లేదు.

### 10 చరాచర వ్యపాశ్రయాధికరణము. (16)

అవ:- దేవదత్తుఁడు పుట్టెను. వానికి జాతకర్మము మొదలగునవి జరిగినవి. వాఁడు చనిపోయెను. మొదలగు వ్యవహారమువలన, జీవున కుత్పత్తిలయము లున్నట్లు కనిపించుచున్నదికాని అది యథార్థము కాదని యీయధికరణమునఁ దెలుపుచున్నారు.

చరాచర వ్యపాశ్రయస్తు స్యా త్తద్వ్యపదేశో
భాక్త స్తద్భావభావిత్వాత్ 16

జీవునకు జననమరణము లున్నవని చెప్పుట చరాచర వ్యపాశ్రయః = చరాచరాత్మకమగు శరీరమునాశ్రయించి

వని. శరీరమువచ్చినఁ బుట్టెననియుఁ శరీరముపోయిన జీవుఁడు పోయెననియుఁ జెప్పుటచే నది జీవునియందు, భాక్తః = గౌణముకాని ముఖ్యముకాదు. వాస్తవముగా జీవునకు జనన మరణములు లేవని యభిప్రాయము. తద్భావభావిత్వాత్ = శరీరభావమువలనఁ గలుగునవియగుటవలన జీవునకు వాస్తవములుగావు.

## 11 ఆత్మాధికరణము (17)

అవ:- ఇందు జీవాత్మకు జననమరణములు లేవని చెప్పుచున్నారు.

నాత్మాశ్రుతే ర్నిత్యత్వాచ్చ తాభ్యః 17

న, ఆత్మా, అశ్రుతేః, నిత్యత్వాత్, చ, తాభ్యః.

ఆత్మా = జీవుఁడు, న = పుట్టుటలేదు, ఎందుచేత?, అశ్రుతేః = ఉత్పత్తి ప్రకరణములందు జీవాత్మయొక్క పుట్టుక వినఁబడకపోవుటవలన. తాభ్యః = అశ్రుతులవలన, నిత్యత్వాచ్చ = జీవుఁడునిత్యుఁడగుటవలనను నతఁడు చని పోవుటయును లేదు, "నజాయతే మ్రియతేవా విపశ్చిత్"

"అజో నిత్య శ్శాశ్వ తోయం పురాణః"

మొదలగు శ్రుతివాక్యములు, ఆత్మకు నిత్యత్వమును చెప్పుచున్నవి. కాన ఆత్మ నిత్యుఁడగుటవలన, నాతనికిజనన మరణములులేవు.

## 12 జ్ఞాధికరణము (18)

### జ్ఞోఽత ఏవ. 18

అతఏవ = నిత్యుఁడుకనుకనే యితఁడు చైతన్యస్వరూపుఁడు. జీవుఁడుపుట్టుఁడని చెప్పుటచే సవికృతుఁడగు పరమాత్మయే జీవుఁడుకాన నితఁడు నిత్యజ్ఞానస్వరూపుఁడని యర్థము.

## 13 ఉత్క్రాన్తిగత్యధికరణము. (19-32)

అవ:- జీవుని పరిమాణమును విమర్శించుటకై యీ యధికరణము ప్రారంభింపఁబడుచున్నది. జీవుఁడు విభువు (సర్వమూర్తద్రవ్యసంయోగి) అను వాదముపై ఁబూర్వ పక్షము చేయుచున్నారు.

### ఉత్క్రాన్తిగత్యాగతీనామ్. 19

ఉత్క్రాన్తి = మరణసమయమున నీశరీరమునుండి జీవుఁ డుత్క్రమించెననియు (లేచిపోయెనని) గత్యాగతీనాం = మఱొకలోకమునకు వెళ్ళెననియు, నటనుండి యిచ్చటకు వచ్చెననియును శ్రుతివాక్యములయొక్క శ్రవణమువలనఁ దదనుగుణముగ జీవుఁ డణుపరిమాణుఁడని తెలియుచున్నది.

### స్వాత్మనా చోత్తరయోః 20

ఉత్తరయోః = ఉత్క్రాన్తికిఁ దరువాతఁ జెప్పఁబడి నటువంటి గత్యాగతులకు స్వాత్మనా = జీవాత్మతో, సంబంధముండుటవలనజీవుఁ డణు పరిమాణుఁడనవలెను.

విభువని చెప్పినను దేహస్వామ్య నివృత్తిమూలకముగా నుత్క్రాంతి కలుగవచ్చునుగాని, గత్యాగతులుకలుగవు. రాకపోకలు పరిమితమగు పరిమాణముకలవానికే గాని సర్వ వ్యాపియగు వానికిఁ గలుగవు. ఉద్యోగి యుద్యోగమునుండి నివృత్తుఁడైనట్లు సర్వవ్యాపియైనను జీవుఁడు శరీరమునుండి తనది యనునభిమానమును విడిచిపోవుననఁ బోవచ్చును.

నాణురతచ్ఛ్రుతేరితిచే న్నేతరాధికారాత్ 21

న, అణుః, అతచ్ఛ్రుతేః, ఇతి, చేత్, న, ఇతరాధి కారాత్,

అతచ్ఛ్రుతేః = “సవా ఏష మహానజ ఆత్మా” అని అణుత్వవ్యతిరేకముగ మహత్త్వశ్రుతివలన అణుఃన = జీవుఁ డణువు కాఁడు. ఇతి చేత్ = అన్నచో, న = కాదు, ఇతరాధి కారాత్ = మహత్త్వశ్రుతి ఇతరుని (పరమాత్మ) యధి కారములోని దగుటవలన.

స్వశబ్దోన్మానాభ్యాంచ 22

స్వశబ్దముచేతను, పరిమాణనిర్దేశముచేతను జీవుఁ డణు పరిమాణుఁడు. ఉన్మాన మనఁగా సత్యల్పాపకృష్టపరిమాణము. “ఏషోఽణు రాత్మా చేతసా వేదితవ్యః” అణుస్వరూపుఁడగు నీయాత్మ మనస్సుచేఁ దెలిసికొనఁ దగినవాఁడు. అనునది స్వశ

ర్థము. శ్వేతాశ్వతరోపనిషత్తునందలి "వాలాగ్ర శతభాగస్య శతధా కల్పితస్యచ, భాగో జీవ స్సవిజ్ఞేయః" అనునది పరిమాణకథనము. కేశాగ్రమును నూరుతునకలుగాఁ జేసి యందొక్క-తునకను మఱల నూరుతునకలుగాఁ జేసిన నది యెంతపరిమితికలదో జీవుని పరిమితి యంతే యని యర్థము. ఇదియే యున్మానము. ఈ రెండింటిచేతను జీవుఁ డణుపరిమాణుఁడు.

అః:- జీవుఁ డణువే యైనచో గంగాతోయముల మునిగినవానికి శరీరమునందెచ్చటనో చల్లదనము కలుగవలెను గాని శరీరమునందంతటను నెట్లుగలుగును? అన్నచో.

## అవిరోధ శ్చందనవత్ 23

చందనవత్ = చందనబిందువువలె అవిరోధః = విరోధములేదు. అనఁగా,

మంచిగంధపుబిందువును శరీరమం దెచ్చట నుంచి నొన్నను శరీరమునకంతకు శైత్యసౌరభములు కలిగినట్లు, జీవుఁ డణుపరిమాణుఁడై శరీరమందెచ్చటనున్నను శరీరమునకంతకు శైత్యము కలుగుట విరుద్ధము కాదు.

దీనివలన, జీవుఁ డణుపరిమాణుఁడై శరీరమం దెచ్చటనోయున్న గంగాదిప్రవాహమందు మునిఁగిన శరీరమునకంతకు శైత్యముకలిగిన జ్ఞానముకాని, వేసవియందు శరీరమునకంతకుఁ దాపజ్ఞానముకాని, కలుగదనెడి యాపత్తిపోయినది.

అవః- చందనదృష్టాంతము కుదురదు. చందనబిందువును శరీరమునకొకచోట నున్నట్లు చూచుచున్నాము. జీవుని శరీరైకదేశమున నున్నట్లు మనముచూచుటలేదు.

అవస్థితివైశేష్యా దితిచే న్నాభ్యుపగమా ద్ధృది హి. 24

అవస్థితివైశేష్యాత్, ఇతి, చేత్, న, అభ్యుపగమాత్ హృది, హి.

అవస్థితివైశేష్యాదితిచేత్ = ఉండుటలోఁగల భేదము వలన, అనఁగా, జీవుఁడు శరీరమునం దేభాగమున నున్నాఁడని నిశ్చయములేదుకనుక, దృష్టాంతము సరియైనదికా దన్నచో, న = అట్లనరాదు. హృది, అభ్యుపగమాద్ధి = హృదయభాగమున నున్నాఁడని శ్రుతి యంగీకరించినందువలన, దృష్టాంతము కుదురునని భావము. "సవాఏష ఆత్మా హృది, ఛాం 8-3-3 "హృద్యంతర్జ్యోతిః పురుషః" బృ 4-3-7 అని జీవుఁడు హృదయదేశమున నున్నట్లు తెలియుచున్నది.

గుణాద్వా లోకవత్ 25

గుణాద్వా = జీవుఁడణుపరిమాణుఁడైనను చైతన్యగుణవ్యాప్తివలన సకలదేహవ్యాపకముగు జ్ఞానము కలుగును. ఎటువలెనఁగా? లోకవత్ = లోకమునందువలె అనఁగా గూటిలో నొకమూల దీపముంచినను గృహమునంతను ప్రకాశింపఁజేయుట లోకములో మనము చూచుచుంటిమి.

అవ:- గుణిని విడిచి గుణము వ్యాపించుట యసంభవము. కనుక జీవుఁ డణువనుట తగదనిన.

### వ్యతిరేకో గంధవత్ 26

గంధవత్ = పుష్పగంధము పుష్పమునువిడిచి దూరముగా వెళ్లినట్లు, వ్యతిరేకః = జ్ఞానమునకును గుణివ్యతిరేకము కలదు. జీవుఁడణువైనను నతనిజ్ఞానము సర్వదేహవ్యాపి కావచ్చును.

### తథాచ దర్శయతి. 27

తథాచ = జీవుఁ డణుపరిమాణుఁడై హృదయమునందుండి చైతన్యగుణముచే సర్వశరీరమును వ్యాపించుననుటను, దర్శయతి = "ఆలోమభ్యః": "ఆనఖాగ్రేభ్యః" ఛాం 8-8-1 అను శ్రుతి చూపించుచున్నది.

### పృథగుపదేశాత్. 28

పృథక్ = జీవుఁడు వేఱు, ప్రజ్ఞ వేఱు. అని, ఉపదేశాత్ = శ్రుతిచెప్పుటవలన, జీవుఁడణుపరిమాణుఁడు. "ప్రజ్ఞయా శరీరం సమారుహ్య" కౌషీ. 3-6-అనుచోటఁ బ్రజ్ఞచేత శరీరము నారోహించి యని చెప్పఁబడినది. ఇందు ఆరోహించుజీవుఁడు కర్తగను ప్రజ్ఞ సాధనముగను, వేర్వేఱుగఁ జెప్పఁబడినవి. అందువలన జీవునకు శరీరవ్యాప్తి జ్ఞానగుణద్వారా కలుగును.

అవ.- ఇంతవఱకు జీవుఁ డణుస్వరూపుఁడని నిరూపింపఁబడినది. జీవుఁ డణువైనను జ్ఞానగుణముచే సర్వశరీరవ్యాప్తియగు, అనుభవము కలుగునుగాన నిందులకై జీవునకు వ్యాపకత్వము చెప్పనక్కఱలేదు. అని ప్రశ్న కలుగఁగాఁ జెప్పుచున్నారు.

తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్. 29

తద్గుణసారత్వాత్,తు,తద్వ్యపదేశః, ప్రాజ్ఞవత్. తత్+గుణ+సారత్వాత్, తు = తత్ = ఆబుద్ధియొక్క,గుణ= గుణములైన అణు, త్వోత్క్రాన్తిగత్యాగతి సుఖదుఃఖాదులు, సారత్వాత్తు = ప్రధానముగాఁ గలవాఁడగుటవలన,ను, ప్రాజ్ఞవత్ = ప్రాజ్ఞుఁడగు పరమాత్మకువలె (దహరాది సగుణోపాసనలయందుఁ బరమాత్మకు ఔపాధికమగు అణుత్వాదికమును జెప్పినట్లు,) తద్వ్యపదేశః = ఆ యణుత్వాదులను జెప్పుట, బుద్ధిగుణప్రాధాన్యమువలనఁ బరమాత్మకువలెనే జీవునకును అణుత్వాదినిర్దేశ మని భావము.

వాస్తవముగాఁ బరమాత్మ కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములు లేనివాఁడయ్యును బుద్ధిగుణములవలనఁ గర్తృత్వ భోక్తృత్వములు కలిగినట్లు, జీవుఁడు పరమాత్మకంటె వేఱు కాకపోయినను నౌపాధికముగఁ బుద్ధిగుణములవలన అణుస్వరూపుఁడనియు, ఉత్క్రాన్తిగత్యాగతులు కలవాఁడనియుఁ జెప్పఁబడుచున్నాఁడు.

అవః— ఆత్మకు బుద్ధిగుణములవలన సంసారిత్వము కలుగునని చెప్పఁబడెను. బుద్ధి, ఆత్మ, విభిన్నులుకాన, వారి సంయోగమున కెడఁబాటు కలిగినపుడు ఆత్మకు సంసారిత్వము కాని, కనఁబడకపోవుటచే వసత్త్వముకాని కలుగునని యాపత్తి రాఁగా వారించుచున్నారు.

యావదాత్మభావిత్వాచ్చ నదోష స్తద్దర్శనాత్. 30

యావదాత్మ భావిత్వాచ్చ = సంసార్యాత్మ యున్నంతవఱకు బుద్ధిసంయోగముండునుగాన, నదోషః = బుద్ధివియోగమువలనఁ గలుగు దోషము లేదు. బుద్ధిసంయోగము సంసార్యాత్మ యున్నంతవఱకు నుండుననుటకు శాస్త్రము ప్రమాణముగా, తద్దర్శనాత్ = కనఁబడుటవలన. "ధ్యాయతీవ లేలాయతీవ" అని చెప్పఁబడినది. బుద్ధి ధ్యానము చేయుచుండగా నితఁడు ధ్యానముచేయుచున్నట్లును. బుద్ధిచలించుచుండగా నితఁడుచలించుచున్నట్లును గనఁబడును. అనఁగా సహజముగా నితనికి (ఆత్మకు) ధ్యానచలనములు లేకున్నను బుద్ధిసంయోగమువలనఁ గలుగుచున్నవని యభిప్రాయము.

"ఉభౌ లోకా వనుసంచరతి" రెండులోకములను సంచరించుచున్నాఁడు. అని చెప్పుటచే, దేహవియోగకాలమున సమ్యగ్దర్శనము కలుగక యున్నంతవఱకు బుద్ధివియోగము కాని, యసంసారిత్వముకాని కలుగదని యభిప్రాయము దేహమున్నంతవఱకు నీలోకమువనుండి, తరువాత స్వర్గాదిలోకము

లలో ఫలానుభవమునకై సంచరించుచుండుటచే రెండులోక
ములను సంచరించిన వాఁడగుచున్నాఁడు. సమ్యగ్దర్శనముకలిగి, బుద్ధినశించినచో నీలోకము నాలోకమునులేదు సంచరణమును లేదు. "అత్ర బ్రహ్మసమశ్నుతే" అనుశ్రుతిః వచ్చును. బుద్ధ్యుపాధిసంబంధము వలననే జీవుఁడనిపేరుకాని, పరమేశ్వరుని కన్న జీవుఁడని వేఱుగా నొకఁడు లేఁడని సిద్ధాంతము.

అవ:- బుద్ధి సంయోగము యావదాత్మభావియని చెప్పఁబడినది. సుషుప్తియందును నాత్మసద్రూపునితోఁ గలియుననియు నాత్మకు బుద్ధిసంబంధము లేదనియు ఛాందోగ్యము వలనఁ దెలియుచున్నదికదా! యావదాత్మభావియనుట యెట్లు? అనఁ జెప్పుచున్నారు.

పుంస్త్వాదివత్త్వస్య సతోఽభివ్యక్తియోగాత్. 31

పుంస్త్వాదివత్, తు, అస్య, సతః, అభివ్యక్తియోగాత్ - పుంస్త్వాదివత్తు = యౌవనమునం దభివ్యక్తమగు పుంస్త్వాది ధర్మము బాల్యము నందును బీజరూపముగా నున్నట్లు, ప్రబోధ సమయమున వ్యక్తముగనున్న అస్య = ఈబుద్ధిసంయోగమునకు, సుషుప్తిప్రళయముల యందును బీజరూపముగా నుండుట వలన, సతః, అభివ్యక్తియోగాత్ = ఉన్నదాని కభివ్యక్తి యోగమువలన - లేని దభివ్యక్తముకాదని భావము.

అవ:- ఆత్మకుపాధిభూతమగు నంతఃకరణము, నంశయాదివృత్తికమైనపుడు మనస్సు, అనియు, నిశ్చయాదివృత్తిక

మైనపుడు, బుద్ధియనియుఁ జెప్పఁబడును. ఇదియే విజ్ఞానమనియు చిత్తమనియుఁగూడ వ్యవహరింపఁబడును. ఇట్టియుపాధిభూతమగు నంతఃకరణ మున్నదని తప్పక యంగీకరింపవలయును. అంగీకరింపనిచో దోషము గలుగునని చెప్పుచున్నారు.

**నిత్యోపలబ్ధ్యనుపలబ్ధిప్రసంగో న్యతరనియమో**
**వాన్యథా 32**

అన్యథా, నిత్యోపలబ్ధి + అనుపలబ్ధిప్రసంగః=

ఉపాధిభూతమగు నంతఃకరణములేదన్నచో, ఆత్మేంద్రియవిషయము లను జ్ఞానసాధనము లుండుటచే నెల్లప్పుడును, జ్ఞానము కలుగుచునేయుండవలెను. జ్ఞానసాధనములున్నను, జ్ఞానముకలుగదన్నచో నెప్పుడును గలుగకనైనఁ బోవలయును. అన్యతరనియమోవా = ఆత్మేంద్రియములలో నొకదానికి శక్తిప్రతిబంధకమునైనఁ జెప్పవలెను. అదియును గుదురదు. నిర్ధర్మకుఁడగు ఆత్మకు శక్తిలేదు. ఇంద్రియములకు శక్తిప్రతిబంధకమునులేదు. కాక, మనస్సు ఇతరత్ర ఉండుటచే నేనుజూడలేదు, వినలేదు, అనిమనమువ్యవహరించుచుందుము. దానివలన, మనస్సుయొక్క యవధానానవధానములవలన నుపలబ్ధ్యనుపలబ్ధులు కలుగునని తెలియుచున్నది. కనుక మనస్సును దప్పక యంగీకరింపవలెను.

మనస్సంబంధముచేతనే యాత్మకు సంసారిత్వము కలుగుచున్నది.

## 14 కర్త్రధికరణము. (33-40)

అవ:-వేదములోఁ గొన్నిచోట్ల, ఆత్మ అసంగుఁడని యున్నది. కొన్నిచోట్ల "స్వర్గకామో యజేత" అని కర్తృత్వ బోధకవాక్యములున్నవి. ఇవి పరస్పరవిరుద్ధములగుటచే సమర్థించుట కీయధికరణ మారంభింపఁబడినది.

### కర్తా శాస్త్రార్థవత్త్వాత్. 33

శాస్త్రార్థవత్త్వాత్ = శాస్త్ర మర్థవంత మగుటవలన, అనఁగా" యజేత, జుహుయాత్ " అని(యజ్ఞముచేయవలెను, హోమముచేయవలెను,) విధివాక్యములుగల శాస్త్రము సార్థక మగుటకై, జీవుఁడు కర్తయని చెప్పవలెను, కర్తలేనిచో కర్తవ్యవిశేషమును శాస్త్ర మెవ్వనికివిధించును? బుద్ధికర్త, జీవుఁడు భోక్త, యన్నచోఁ గర్తృత్వభోక్తృత్వములకు సామానాధికరణ్య ముండదు. కాన బుద్ధికర్త గాదు. "ఏషహి ద్రష్టా శ్రోతా" ఇతఁడు చూచువాఁడు వినువాఁడు, అని చెప్పు వాక్యములును సార్థకములగును.

### విహారోపదేశాత్. 34

విహారోపదేశాత్ = "స్వే శరీరే యథాకామం పరివర్తతే "బృ.2-1-18. స ఈయతే అమృతో యత్రకామమ్ "బృ.4-3-12. అని స్వప్నావస్థలో నీజీవుఁడు స్వశరీరమునందు

యథేచ్ఛముగా సంచరించుచున్నాఁడని చెప్పుటచేతను జీవుఁడుకర్త. బుద్ధికర్త్రి కాదు.

ఉపాదానాత్. 35

ఉపాదానాత్ = గ్రహించుటవల్లను జీవుఁడుకర్త. శ్రుతిలో "తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ, "బృ.21-1-17" ప్రాణాన్ గృహీత్వా" బృ.2-1-18. అనియుఁ గ్రహణము చెప్పఁబడినది. కర్తకేగాని యకర్త కుపాదానము సంభవింపదు.

వ్యపదేశాచ్చ క్రియాయాం నచేన్నిర్దేశవిపర్యయః 36

క్రియాయాంవ్యపదేశాచ్చ = క్రియయందుఁ గర్తృత్వమును జెప్పుటవలన జీవునకుఁ గర్తృత్వము సిద్ధించుచున్నది. "విజ్ఞానం యజ్ఞం తనుతే కర్మాణి తనుతేఽపి చ." అను తైత్తిరీయక వాక్యములోని విజ్ఞానపదమునకు జీవుఁడనియర్థము చెప్పవలెను. నచేన్నిర్దేశవిపర్యయః = అట్లుకాక లోగడ చెప్పినట్లు విజ్ఞానపదమునకు బుద్ధియనియే యర్థము చెప్పినచో "విజ్ఞానేన"యని కరణనిర్దేశము చేసియుండును. ప్రథమాంతనిర్దేశమునే చేసియుండుటచే జీవుఁడనియే యర్థము. జీవుఁడు యజ్ఞమును జేయుచున్నాఁడు లౌకికకర్మములను జేయుచున్నాఁడు అని పై వాక్యమునకర్థము. ఆవాక్యములో యజ్ఞరూపమగు వైదికక్రియయందు లౌకికక్రియయందును జీవునకు

"తనుతే" యని కర్తృత్వము చెప్పఁబడినది. కనుక జీవుఁడు నిస్సంగుఁడుకాక, కర్తయని యభిప్రాయము.

అవ:- జీవుఁడుకర్తయైనచో క్రియయందు స్వతంత్రుఁడుకాన నెప్పుడును దనకుహితమునుమాత్రమే చేసికొనును. అహితమును జేసికొనఁడు. కాని అహితమునుగూడఁ జేసికొనుచున్నట్లు కనఁబడుచున్నది యని యాక్షేపముకలుగ వారించుచున్నారు.

ఉపలబ్ధివ దనియమః 37

ఉపలబ్ధివత్ = ఉపలబ్ధియందువలె, అనియమః = నియమములేకపోవుట.

హితము, అహితము, అని తెలిసికొనుటలో నియమములేనట్లు చేసికొనుటలోను నియమములేదు.

శక్తివిపర్యయాత్. 38

శక్తియందలి వ్యత్యాసమువల్లను విజ్ఞానవ్యతిరిక్తుఁడగు జీవుఁడు కర్తయవవలెను.

సాంఖ్యులుచెప్పినట్లు విజ్ఞానపదవాచ్యమగు బుద్ధియే కర్త్రియనిన నాబుద్ధికిఁ గర్తృత్వశక్తియేకాని కరణశక్తియుండదు. కర్త యెంతటినేర్పరి యైనను కరణములేనిదే పని చేయలేఁడు. కనుక కర్త్రియగుబుద్ధికి మఱొక్క-కరణమును గల్పిం

చవలెను. అట్లు కల్పించినచో మేము చెప్పెడుదానికి వికల్ప
నకు నామమాత్రభేదమే కాని వాస్తవిక భేదములేదు.

సమాధ్యభావాచ్చ 39

సమాధిలేక పోవుట తటస్థించుట వల్లను, ఆత్మకుఁ
గర్తృత్వము చెప్పవలెను.

ఉన్నను లేనిదానితో సమానమగు నాత్మాకార చిత్త
వృత్తికి సమాధియని పేరు. ఉపనిషత్ప్రతిపాద్యుఁడైన పర
మాత్మను దెలిసికొనుటకు వేదాంతములం దీసమాధి చెప్పఁ
బడినది. ఆత్మకుఁ గర్తృత్వములేనిచో యీసమాధి సంభవిం
పదు. కనుక, ఆత్మకుఁ గర్తృత్వము సిద్ధమని యభిప్రాయము.
బుద్ధికరణమే.

ఈయధికరణమున జీవునికిఁ గర్తృత్వము సాధింపఁబ
డినది. పరమార్థదృష్టిలోఁ గర్తృత్వభోక్తృత్వాదు లన్నియు
నౌపాధికములు కావ సిద్ధాంతమునకు భంగములేదు. ఈవిష
యము ముందధికరణములో విమర్శింపఁ బడుచున్నది.

15 తక్షాధికరణము. (40)

అవః- పూర్వాధికరణమున సాధింపఁబడిన కర్తృ
త్వము జీవునికి స్వాభావికమా! ఔపాధికమా! అని యిందు
విచారించుచున్నారు.

యథా చ తక్షోభయథా 40

తక్షా = వడ్రంగి, యథా = ఏవిధముగా, ఉభయథా = సుఖ దుఃఖ యని రెండువిధముల నగునో అట్లే జీవుఁడు కర్తయు నకర్తయుఁ గూడ నగును.

ఉలి చేబాడిసె యను సాధనములఁ దాల్చి వడ్లాబత్తుఁడు గ్రామములోనికిఁ బోయి పనిచేయుచుఁ గర్తయయి, యింటికివచ్చి సాధనములవదలి పనిమాని యకర్తయై స్వస్థచిత్తుఁడై యానందించును.

ఆత్మ, యవిద్యాకల్పితమగు ద్వైతసంపర్కము కలవాఁడై జాగ్రత్స్వప్నములందు కర్తయై, దుఃఖ మొందుచు శ్రమపడి, సుషుప్త్యవస్థలోఁ బరబ్రహ్మస్వరూపమగు స్వస్వరూపమును బొంది కార్యకరణ సంఘాతమును విడనాడి యకర్తయై సుఖమునొందును. ఇట్లే ముక్తావస్థయందును విద్యాప్రదీపముచే నవిద్యాంధకారమును బోనాడి, కేవలుఁడై నిర్వృతి నొందును.

తక్ష, ఉలి, బాడిసె గ్రహించి కర్తయగుచుండెనేకాని స్వశరీరమాత్రముచేత, నకర్తయే. ఆత్మ, మనస్సు మొదలగు సాధనముల గ్రహించి కర్తయగుచున్నాఁడు వానిని గ్రహింపక కేవలుఁడై యకర్తయే యగుచున్నాఁడు. కనుక ఆత్మకుఁ గర్తృత్వ ముపాధికల్పితముగాని స్వాభావికముకాదు.

## 16 పరాయత్తాధికరణము. (41-42)

అవ:-జీవుని కర్తృత్వ మౌపాధికమని నిరూపింపఁబడి నది. అది యీశ్వరసాపేక్షమా! నిరపేక్షమా! అని యిందు విమర్శింపఁబడుచున్నది.

### పరాత్తు తచ్ఛ్రుతేః. 41

పరాత్తు = జీవకర్తృత్వము పరమేశ్వరునివల్లనే కల్గు చున్నది. తచ్ఛ్రుతేః = ఇట్లనుటకు శ్రుతినిదర్శనముకలదు.

శ్రుతి"ఏష హ్యేవ సాధుకర్మ కారయతి యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే, ఏష హ్యేవాసాధుకర్మ కారయతి తం యమధో నినీషతే, కౌషీ. 3.8.

ఎవనిని ఊర్ధ్వలోకములు పొందిపఁదలఁచునో వానిచే సత్కర్మముచేయించును. ఎవని నధోలోకములుపొందింపఁద లఁచునో వానిచే దుష్కర్మముచేయించును.

జీవుఁడవిద్యాంధకార నిమగ్నుఁడై యుండఁ గర్మాధ్య క్షుఁడును సర్వభూతాధివాసుఁడును, సాక్షిస్వరూపుఁడు, నగు పరమేశ్వరు ననుజ్ఞచేఁ గర్తృత్వ భోక్తృత్వ లక్షణములుకల సంసారము సిద్ధించును. తదనుగ్రహముచేతనే లభించిన జ్ఞాన ముచే మోక్షముఁను లభించును. కనుక జీవకర్తృత్వము పర మేశ్వరహేతుకమైనదేయని యభిప్రాయము.

అవ :- పైనుదాహరించిన శ్రుతిరీతిగ నీశ్వరుఁడు హేతుకర్త (కారయితి)యని చెప్పినచో నతనికిఁ బక్షపాతము, నిర్దయ యనునవి. వైషమ్యనైర్ఘృణ్యములు కలుగుచున్నవే యన, సమాధానము చెప్పుచున్నారు.

కృతప్రయత్నాపేక్షస్తు విహితప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః 42

కృత = చేయఁబడిన, ప్రయత్నాపేక్షస్తు = కర్మము ననుసరించినదే యీశ్వరునిచేఁ జేయించఁబడును. జీవుఁడు పూర్వజన్మములందుఁ జేసికొనిన పుణ్యపాపముల కనుగుణముగ ఫలమును నీశ్వరుఁడు పంచియిచ్చునే కాని, లేనిది కల్పింపఁడు. తనంత తానే యీశ్వరుఁడు ఫలముకల్పించు నన్నచో, విహిత + ప్రతిషిద్ధ + అర్థ + అవైయర్థ్యాదిభ్యః= వేదవిహితములగు విధినిషేధములు (యజ్ఞముచేయవలెను, హింసచేయరాదు మొ॥) వ్యర్థములగును. స్వతంత్రుఁడై తన యిచ్ఛవచ్చినట్లు తానే పుణ్యపాపముల నొసఁగుచుండఁ బుణ్యపాప హేతుకములగు విధినిషేధము లనర్థకము లని యభిప్రాయము, పూర్వజన్మకృత పుణ్యపాపముల ననుసరించి ఫలమునిచ్చునన్నచో నీనికి వైయర్థ్యముకలుగదు, అతనికిఁ బక్షపాతాదులునుకలుగవు.

తమతమ బీజములనుండి, తామున్న ప్రదేశము ననుసరించి, తరులతాగుల్మాదులు వ్రీహియవాదులు ప్రభవించు

టకు మేఘుఁడెట్లు నిమిత్తమాత్రుఁడో యీశ్వరుఁడును నట్లె నిమిత్తమాత్రుఁడు.

## 17 అంశాధికరణము, (43-53)

అవ:- పూర్వాధికరణములో జీవేశ్వరుల కుపకార్యోపకారకభావమున్నట్లు తెలుపఁబడినది. అట్టిభావము ఏవిధమగుసంబంధములేనివారికిఁ బొసఁగదు కనుక జీవేశ్వరులకును నేకవిధమగు సంబంధ ముండవలెను. అది స్వామిభృత్యుల సంబంధమువంటిదా? అగ్నివిస్ఫులింగముల సంబంధమువంటిదా? యని యీయధికరణమున విమర్శించుచున్నారు.

అంశో నానావ్యపదేశా దన్యథా చాపి
దాశకితవాదిత్వ మధీయత ఏకే 43

నానావ్యపదేశాత్-భేదమును జెప్పుటవలన అన్యథా చాపి-అభేదమును జెప్పుటచేతను, అంశః = జీవుఁడీశ్వరాంశము. భేదాభేదముల రెండింటిని దెల్పు వేదవాక్యములవలన జీవేశ్వరుల కగ్నివిస్ఫులింగములకువలె నంశాంశిసంబంధము కనుక జీవుఁ డీశ్వరుని యంశమువంటివాఁడు. "ఆత్మావాఽరే ద్రష్టవ్యః" "సోఽన్వేష్టవ్యః" మొదలగునవి నానావ్యపదేశ శ్రుతులు (అనగాభేదశ్రుతులు.)

“బ్రహ్మదాశా బ్రహ్మదాసా బ్రహ్మైవేమే కితవాః” “తత్త్వమసి” “నాన్యోఽతోఽస్తి ద్రష్టా” మొదలగునవి యభేదశ్రుతులు. (ఏకే-శాంఖలు అథర్వణికులు), ఇమే = ఈ, దాశాః = కైవర్తులు, దాసాః = భృత్యులు, కితవాః = ధృష్టులు నందఱును. బ్రహ్మైవ = బ్రహ్మమే. అని అధీయతే = చెప్పుచున్నారు. భేదమును ననువదించి యభేదమును జెప్పుచున్నారు.

## మంత్రవర్ణాచ్చ 44.

“పాదోఽస్య విశ్వాభూతాని” అనుమంత్రవర్ణమువలనను జీవుఁ డీశ్వరుని యంశమని తెలియుచున్నది, స్థావర జంగమాత్మకము లగు జీవము లన్నియు నీశ్వరుని యొక్క యొక భాగము. అని దానియర్థము.

## అపిచ స్మర్యతే 45,

మఱియు భగవద్గీతయందును “మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః” నాయొక్క అంశమే జీవలోకములో జీవుఁడై యున్నది యని స్మరింపఁబడుచున్నది.

అన :- పై సూత్రమువలన జీవుఁ డీశ్వరాంశమని నిర్ణయింపఁబడినది. దేహియొక్క యంశములైన కరచరణాదులకుఁ గలిగినబాధవలన దేహి బాధనొందుచున్నట్లు, తన

యంశమగు జీవునికిఁ గలిగిన సుఖదుఃఖములవలన నీశ్వరునికిని సుఖదుఃఖములు కలుగును. అని యాక్షేపము గలుగ సమాధానము చెప్పుచున్నారు.

ప్రకాశాదివ న్నైవం పరః 46.

ప్రకాశాదివత్ =సూర్యచంద్రుల ప్రకాశము మొదలగు వానివలె, పరఃఏవంన=పరమేశ్వరుఁడిట్లు జీవగతసుఖదుఃఖములను బొందఁడు.

సూర్యచంద్రుల ప్రకాశము ప్రసరించుచున్నపుడు మనము మనచేతినిగాని వ్రేళ్లనుగాని వంకరగాఁ జూపినచోఁ బ్రతిబింబమును వంకరగానే కనఁబడును. కాని ప్రకాశమున కేవిధమగు వంకరయుండదు. ఖాళీగానున్న కుండ మొదలగు వాని నొకచోటు నుండి మఱొకచోటికిఁ దీసికొనిపోవునపుడు ఘటాకాశముకూడఁ దీసికొనిపోఁబడినట్లు కనఁబడునుగాని తీసికొనిపోఁబడదు. కనుక స్వాంశమైనను జీవగతి సుఖదుఃఖాదులు పరమేశ్వరునికిఁ గలుగవు. జీవునికైనను నవిద్యావశమున నౌపాధికమగు దుఃఖమేకాని, పారమార్థికముగ లేదు.

స్మరన్తిచ 47.

(వ్యాసుఁడు మొదలగువారు) పెద్దలగు ఋష్యాదులును జీవగతదుఃఖముచేఁ బరమాత్మకు దుఃఖములేదని చెప్పుచుండిరి.

అవ :- భేదాభేదశ్రుతులవలన జీవేశ్వరుల కంశాంశిత్వము లోఁగడఁ జెప్పఁబడినది. జీవుఁడీశ్వరుని యంశమనుటకుఁ గూడ నంగీకరింపని యభేదశ్రుతులు "తత్సృష్ట్వా తదే వానుప్రావిశత్" "నాన్యోతోఽస్తి ద్రష్టా" "మృత్యోస్సమృత్యుమాప్నోతి యఇహ నానేవ పశ్యతి" "తత్త్వమసి" "అహం బ్రహ్మాస్మి" మొదలగునవి పెక్కుగలవు బ్రహ్మాత్మైక్య ప్రతిపత్తియే పురుషార్థము కాన, వేదాన్తశాస్త్రమునందు ముఖ్యముగాఁ జెప్పఁదలఁచినవిషయము అభేదమే కాని, భేదాభేదములు రెండును కావు. లోకసిద్ధమగు భేదము ననువాదచేసి శాస్త్ర మభేదమును జెప్పుచున్నది. నిరవయవుఁడగు నీశ్వరునకు జీవుఁ డంశమనుటయుఁ దగదు. కనుక నాపరమేశ్వరుఁ డొక్కఁడే సర్వభూతాన్తరాత్మయై జీవభావమున నున్నాఁడనుట నిర్వివాదాంశము. సర్వభూతములకు నంతరాత్మయైన వాఁ డొక్కఁడేయయినపుడు, "ఈపని నీవుచేయుము, ఈపని నీవుచేయవద్దు" అనెడి లౌకికములు వైదికములు నగు ననుజ్ఞాపరిహారము లెట్లుకుదురును? అని ప్రశ్నకలుగ సమాధానము చెప్పుచున్నారు.

అనుజ్ఞాపరిహారౌ దేహసంబంధా జ్జ్యోతిరాదివత్. 48

అగ్నియొక్కఁటియయినను శ్మశానాగ్ని పరిత్యజింపఁబడి పవిత్రప్రదేశమునందలి యగ్ని (యజ్ఞాగ్ని) గ్రహింపఁబడుచు నౌపాధికమగు భేదము నొందినట్లు, సర్వభూతాంతరాత్మ

యగు నీశ్వరుఁ డొక్కఁడే యగునను దేహసంబంధాత్ = అవిద్యాకల్పితమగు దేహాభిమానమునే నుపాధికృతమగు బహుత్వము కలిగినందున, అనుజ్ఞాపరిహారౌ = లౌకిక వైదికములగు ననుజ్ఞాపరిహారము లుపపన్నము లగును. సమ్యగ్దర్శనము కలుగునంతవఱకు దేహాభిమానము పోదు.

అవ:- సర్వభూతాన్తరాత్మ యొక్కఁడేయని సిద్ధాంతమైనచో నొకశరీరమున నొనర్చిన కర్మమునకు మఱొకశరీరమున ఫలమేల కలుగదు? వీనికన్నిటికిని స్వామి యొక్కఁడే కదా! యను ప్రశ్నకు సమాధాన మిచ్చుచున్నారు.

### అసంతతేశ్చావ్యతికరః. 49

అసంతతేః = సంబంధము లేదు కనుక-అవ్యతికరః= సాంకర్యము లేదు. కర్త. భోక్త, యగునాత్మకు సర్వశరీరములతో నెడతెగని సంబంధము లేదుకనుక, అనగా ఒకశరీరములోనున్న జీవునకు శరీరాన్తరముతో సంబంధము లేదుకనుక, కర్మఫలానుభవ విషయములో సాంకర్యము లేదు.

### ఆభాస ఏవచ. 50

నీటిలో ప్రతిఫలించిన సూర్యునివలె జీవుఁ డీశ్వరుని యాభాసరూపుఁడు. జలసూర్యుఁడు సాక్షాత్తుసూర్యుఁడును గాఁడు, సూర్యునికంటె భిన్నుఁడును గాఁడు.

నీటితో నిండిన ఘటములను నాల్గింటిని వరుసగాఁ బెట్టి నచో సూర్యుఁ డానాల్గింటియందును బ్రతిఫలించును. అందొ కఘటమును మనముకదిల్చిన నందుఁ బ్రతిఫలించిన సూర్యుఁడు మాత్రమే కదులును. కాని మిగిలినఘటములందున్న సూర్యుఁను కదలఁడు. అట్లే పరమాత్మయొక్క యాభాసరూపుఁడైన యొకశరీరమందున్న జీవుఁ డొకకర్మముచేసిన, అట్టి యాభాస రూపుఁడైన మఱొకశరీరమందున్న జీవుఁడు కర్మ ఫలము నెట్లుపొందును? పొందఁడని తాత్పర్యము.

## అదృష్టానియమాత్ . 51

అదృష్టనియమము లేకపోవుటవలన నీసాంకర్యదో షము, సాంఖ్యులకుఁ గాణాదులకు సంభవించునుగాని మాకు సంభవింపదు.

సాంఖ్యులమతములో, ఆత్మలు, అనేకములనియు, అన్నియు సర్వత్రవ్యాపించియుండునవియనియు, చైతన్యమా త్రస్వరూపములనియు, నిర్గుణములు నిరతిశయములు ననియుఁ జెప్పుదురు. ఈయాత్మల కన్నింటికిఁ బ్రధానము సాధారణ మైనదనియు నాప్రధానము మూలకముగా నీయాత్మలకన్ని టికి భోగాపవర్గములు సిద్ధించుననియు వారిమతము.

ఈమతములో నాత్మలన్నియుఁ జైతన్యస్వరూపములై యంతటను నావరించి యుండుటచే నొకయాత్మకు సుఖదుఃఖ

సంబంధముకలిగిన సన్నియు నొకచోటనే యుండుటచే నన్ని యాత్మలకు సుఖదుఃఖసంబంధముకలుగవలెనను దోషము సంభవించును. ప్రధానప్రవృత్తివలన నియమముకలుగునని చెప్పుదమనిన, నదియును గుదురదు. ప్రధానప్రవృత్తి యాత్మలకన్నిటికిని సాధారణమైనదగుటవలన, నేయాత్మకాయాత్మకే, వేఱుగా సుఖదుఃఖభోగములను గల్పించునట్టి శక్తి, ప్రధానమందుమాత్రమే యున్నదనుట యనుపపన్నము.

కాణాదులమతములోఁగూడ నాత్మలనేకములు. సర్వత్ర వ్యాపించియుండునవి. ఇవి, గోడ, తలుపు, వలె, నచేతనములైనవి. ద్రవ్యమాత్రస్వరూపములు. ఇట్టి యీయాత్మలకు అచేతనములును, అణుస్వరూపములును నైనమనస్సు లుపకారకములు. ఆత్మద్రవ్యములకు, మనోద్రవ్యములకు సంయోగమువలన, ఇచ్ఛ, మొదలయిన తొమ్మిది వైశేషికములగు నాత్మగుణము లుద్భవించును. ఆగుణము లసంకీర్ణముగ నాత్మలయందు వేర్వేరుగాఁ గలియును. అట్లాగుణము లాత్మలయందుఁ జేరుటయే సంసారము. ఇచ్ఛాప్రభృతులగు నవ (తొమ్మిది) గుణములు జనింపకుండుటయే మోక్షము. అని చెప్పుదురు. వీరి మతములోఁగూడ, నాత్మద్రవ్యములు, మనోద్రవ్యములు, సర్వత్ర నిండి దగ్గరగనే యుండుటచే నొకమనోద్రవ్యమునకు నాత్మద్రవ్యమునకు సంయోగముకలిగిన, మిగిలిన మనోద్రవ్యములకు నాత్మద్రవ్యములకుఁగూడ సంయోగముకలిగితీ

దును. సన్నిధానమను హేతువు సర్వద్రవ్యములకు సమానమే యైనపుడు కొన్నిటికిమాత్రమే సంయోగముకలుగును కొన్నిటికిఁగలుగదు. అనిచెప్పుట యెట్లు? హేతువిశేషము లేదుకనుక ఫలవిశేషము లేక యన్నియాత్మలకు సమానముగ సుఖదుఃఖములు సంభవించును. ఈయాత్మకే మనస్సంయోగము నొందెడు నదృష్టమున్నది. ఈయాత్మకులేదు. అనిచెప్పుటకుఁ దగిన నియామకము లేదుకనుక నీమతమునందును పైనఁజెప్పిన సాంకర్యదోషము సంభవించునని యాశయము.

అవ:- నేనీఫలముపొందుదును ఈపనిచేయుదును ఈఫమునేఁగోరను ఇదిచేయను. అని యనేకవిధములుగాఁ గలుగు నభిసంధ్యాదులు (నిశ్చయములు)ఏయాత్మ కాయాత్మకే గలుగును, నదృష్టమునకుఁ నాత్మలకుఁ నొకవిధమైన సంబంధమును నియమించునన రాదా? యన

అభిసంధ్యాదిష్వపి చైవమ్. 52

అభిసంధ్యాదులకును నాత్మమనస్సంయోగము కావలయునుగాన, సన్నియాత్మలు, మనస్సులు, నొకేచోట నుండగా, నేయాత్మమనస్సులకు సంయోగముకలుగునని చెప్పనగును?

ప్రదేశా దితిచే న్నా న్తర్భావాత్. 53

అన్తర్భావాత్ = ఆత్మలుసర్వవ్యాపకములగుటచే, సన్నిశరీరములందును నంతర్భూతములై యుండునుగాన, ప్రదే

శాదితిచేన్న = శరీరమునకే యొకప్రదేశమునఁ జేరిన యాత్మమనస్సులకే సంయోగముకలుగుననియుమఁ జెప్పుట కువీలుపడదు.

ఇది శ్రీ వారణాసి గంగాధరశాస్త్రి విరచితమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్ర వృత్తియందు
ద్వితీయాధ్యాయమునఁ
తృతీయపాదము.
అధి 17-సూ-53.

శ్రీరస్తు

# బ్రహ్మసూత్రార్థ దీపిక

## ద్వితీయాధ్యాయ చతుర్థపాదము

ఇందు లింగశరీరవిషయక శ్రుతివిరోధమును బరిహరింపఁబోవుచు ముందుగాఁ బ్రాణోత్పత్తి, ప్రాణసంఖ్యానములను విషయములలోఁగల విప్రతిషేధమును బరిహరించుచున్నారు.

### 1 ప్రాణోత్పత్త్యధికరణము. (1-4)

అవ:- కొన్ని యుపనిషత్తులలో, తేజస్సు, ఆకాశము మొదలగువాని యుత్పత్తిమాత్రమే చెప్పఁబడినది కాని ప్రాణముల, యుత్పత్తి చెప్పఁబడలేదు. కొన్నిటిలో సృష్టికిఁ బూర్వమందును ప్రాణములున్నట్లు చెప్పఁబడినది. కొన్నిటిలోఁ బ్రాణసృష్టియున్నది, కనుక యీవిప్రతిషేధమును బరిహరింప నీయధికరణ మారంభింపఁబడినది.

#### తథా ప్రాణాః 1

ఆకాశము మొదలగునవి యెట్లు బ్రహ్మవికారములో ప్రాణములును నట్లే బ్రహ్మవికారములే. అనఁగా బ్రహ్మనుండి పుట్టినవని యర్థము.

అవ:- ఉత్పత్తికిఁ బూర్వముకూడఁ బ్రాణము లున్నవనెడు శ్రుతిబలముచే, ప్రాణములు బ్రహ్మనుండిపుట్టినవని చెప్పెడుశ్రుతి గౌణి యనరాదా? అవ

గౌణ్యసంభవాత్. 2

ఏకవిజ్ఞానముచే సర్వవిజ్ఞాన మను ప్రతిజ్ఞకు భంగము కలుగునుగనుక ప్రాణోత్పత్తిశ్రుతి గౌణి (అముఖ్యము) అన వీలుపడదు.

తత్ప్రాక్ శ్రుతేశ్చ. 3

ఆకాశము మొదలగువానికంటె ముందుగఁ బ్రాణము లనుచెప్పిన శ్రుతివలనను, ప్రాణోత్పత్తిశ్రుతి గౌణియనరాదు.

"ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణిచ
ఖం వాయుర్జ్యోతి రాపః, పృథివీ విశ్వస్య ధారిణీ"

అను ముండకశ్రుతిలో, ముందు, ప్రాణముపుట్టుచున్న దని చెప్పి తరువాత మనస్సు, సర్వేంద్రియములు, ఆకాశాది భూతములు పుట్టుచున్నవని చెప్పెను. "జాయతే" అనఁగా, పుట్టుచున్నది యని యర్థము. సృష్టికిఁ బూర్వమందును బ్రాణములున్నవనెడు శ్రుతినిబట్టి ప్రాణోత్పత్తి గౌణియన్నచో, నీశ్రుతివిరోధించును. ఇచ్చట "జాయతే" అను నొక్క పదమే, మనస్సు ఇంద్రియములు, ఆకాశము మొదలగుభూతములు, పుట్టుచున్నవియనునర్థమును చెప్పుచున్నది. ఆకాశాదుల యొక్క పుట్టుక ముఖ్యమనియు, ప్రాణములపుట్టుక గౌణి (అముఖ్యమనియు) నొకేపదముచేఁ జెప్పుట సమంజసము కాదని యభిప్రాయము.

తత్పూర్వకత్వా ద్వాచః 4

వాచః = వాక్ప్రాణమనస్సులు, తత్పూర్వకత్వాత్ = బ్రహ్మప్రకృతికములైన తేజోబన్నములు పూర్వమందుఁ గల వికాన నివియు బ్రహ్మప్రకృతికములే.

ఇచ్చటవాచః అనుదానికి వాక్ప్రాణమనస్సులని యర్థము "అన్నమయంహి సౌమ్య! మనః, ఆపోమయః ప్రాణః, తేజోమయీవాక్ అనిశ్రుతి.

2 సప్తగత్యధికరణము (5-6)

ఇందుఁ బ్రాణసంఖ్యను వివరించుచున్నారు. ప్రాణము లనఁగా నింద్రియములని యర్థము

సప్తగతే ర్విశేషితత్వాచ్చ. 5

గతేః, విశేషితత్వాచ్చ = శ్రుతిచేనవగతమగుటవల నను, విశేషించిచెప్పఁబడుటవలనను, సప్త=ప్రాణము లేడు.

"సప్తప్రాణాః ప్రభవంతి తస్మాత్" శ్రుతి.

"సప్తవై శీర్షణ్యాః ప్రాణాః" —విశేషకథనము.

అవః- "దశేమే పురుషే ప్రాణాః" అనియుండుటచేఁ బ్రాణములు సప్త యనిచెప్పుట సరికాదని యాక్షేపించు చున్నారు.

హస్తాదయస్తు స్థితేఽతో నైవమ్. 6

హస్తాదయస్తు = హస్తములు మొదలగు నింద్రియములుకలవు. స్థితేఅతో నైవమ్ = హస్తములు మొదలగునవి యధికముగానుండ ప్రాణములు సప్త యనుట సరికాదు.

"దశేమే పురుషే ప్రాణాః, ఆత్మైకాదశః, తే యదా ఉస్మాచ్ఛరీరా న్మర్త్యా దుత్క్రామ న్త్యథ రోదయన్తి" అను బృహ...శ్రుతివలన పంచజ్ఞానేంద్రియములు + పంచకర్మేంద్రియములు + ఆత్మ (మనస్సు) కలిపి, పదునొకండు ప్రాణములని సిద్ధాంతము. "సప్తవై శీర్షణ్యాః" అనుదానికి శిరస్సునందున్నవి యేడింద్రియములనియే కాని యింద్రియములన్నియు నేడని యభిప్రాయము కాదు.

3 ప్రాణాణుత్వాధికరణము (7)

ఇందు ప్రాణపరిమాణమును నిర్ణయించుచున్నారు.

అణవశ్చ. 7

ఈప్రాణములు, సూక్ష్మములు వల్పములును. సూక్ష్మములనగా అనద్భూత రూపస్పర్శములు. ఇచ్చటియణు పదమునకు, పారిభాషికమైన పరమాణువని యర్థము కాదు.

4 ప్రాణశ్రేష్ఠత్వాధికరణము (8)

శ్రేష్ఠశ్చ 8

శ్రేష్ఠమగు ప్రాణముకూడ మిగిలినప్రాణములవలె బ్రహ్మవికారమైనదే.

శ్రేష్ఠమనఁగా ముఖ్యప్రాణము. ఏది లేనిచో నింద్రియములెవ్వియు నిలువలేవో యది ముఖ్యమైనప్రాణము.

5. వాయుక్రియాధికరణము (9-12)

అవ:- "వాయుః ప్రాణః" అనియు, "సామాన్యా కరణవృత్తిః ప్రాణాద్యా వాయవః" అనియు, వాయువే ప్రాణమని, ఇంద్రియవ్యాపారమే ప్రాణమని చెప్పెడు వాక్యములను నిరాకరించుచున్నారు.

న వాయుక్రియే పృథగుపదేశాత్. 9

ప్రాణముకంటె వేరుగా నిర్దేశించుటచే వాయుక్రియలు, ప్రాణముకావు.

"ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణిచ ఖం వాయుర్జ్యోతి రాపః పృథివీ విశ్వస్యధారిణీ" అని పృథగుపదేశము.

అవ:- ప్రాణముకూడ జీవునివలె నీశరీరమున స్వతంత్రమైనదే యనునభిప్రాయమును నిరాకరించుచున్నారు.

చక్షురాదివత్తు తత్సహశిష్ట్యాదిభ్యః 10

తత్సహశిష్ట్యాదిభ్యః = ఆ యింద్రియములతో పాటు సమానముగాఁ జెప్పుటవలన ముఖ్యప్రాణముకూడ చక్షురాది

వత్తు = చక్షురాదీంద్రియములవంటి దేకాని జీవునివలె శరీర మందు స్వతంత్రమైనదికాదు.

అవ:- ప్రాణము చక్షురాదికము వంటిదేయనిన, చక్షుస్సునకు రూపము, శ్రోత్రమునకు శబ్దమువలె దీనికి నసాధారణవిషయ మేదైన నుండవలదా! యన వారించు చున్నారు.

అకరణత్వాచ్చ నదోష స్తథాహి దర్శయతి 11

అకరణత్వాచ్చ = ప్రాణము చక్షురాదికమువలె నింద్రియముకాదు కనుక, నదోషః = నైజాపినదోషము లేదు. తథాహిదర్శయతి= అట్లు శ్రుతి ప్రామాణ్యమును జూపు చున్నది.

దేహధారణ రూపమైన యసాధారణకార్యమును నిర్వహించుటచేతను మాత్రమే ప్రాణము కరణమని యభిప్రాయము. దేహమునకు జీవుఁడురాజు ప్రాణముమంత్రి చక్షురాదులు ప్రకృతివర్గము. అనిబృహ. ప్రాణేనరక్షన్నవరం కులాయమ్. బృ 4-3-12 ప్రాణముచే దేహమును రక్షించు కొనుచు జీవుఁడు నిద్రించుచున్నాఁడనియును గలదు.

పంచవృత్తిర్మనోవ ద్వ్యపదిశ్యతే 12.

మనోవత్ =మనస్సువలె, అనఁగా మనస్సు శ్రోత్రాది నిమిత్తములైన శబ్దాదివృత్తులఁగలిగినట్లు ముఖ్యప్రాణము

కూడ, ప్రాణాపాన వ్యానోదాన సమానములను పంచ వృత్తులుకలదిగా, వ్యపదిశ్యతే = చెప్పఁబడుచున్నది.

## 6 శ్రేష్ఠాణుత్వాధికరణము. 13.

### అణుశ్చ 13,

మిగిలినచక్షురాదులవలెనే యీముఖ్యప్రాణముకూడ అణుస్వరూపము. సూక్ష్మమైనదని యర్థము.

## 7 జ్యోతిరాద్యధికరణము. (14-16)

### జ్యోతిరాద్యధిష్ఠానంతు, తదామననాత్ 14,

తదామననాత్ = అగ్ని మొదలగు నభిమాన దేవతలచేఁ బ్రాణము లధిష్ఠింపఁబడినవని వేదము తెల్పుచున్నది కాన, జ్యోతిరాద్యధిష్ఠానంతు = అగ్న్యాది దేవతాధిష్ఠానము కలవియై యింద్రియములు స్వస్వవిషయముఁ గ్రహించుచున్నవి. అగ్ని ర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" అగ్ని వాగ్రూపమై ముఖమును బ్రవేశించెను. అనఁగా వాక్కునకు, అగ్ని అభిమాన దేవత యనియర్థము. ఇట్లే మిగిలినప్రాణములును నారాయి యభిమాన దేవతలచే నధిష్ఠితములై స్వస్వకార్యములను నిర్వహించుచున్నవి.

అవ :- దేవతాధిష్ఠితములైన ప్రాణములకే స్వస్వ కార్య నిర్వహణము చెప్పినచో భోక్తృత్వమును నా దేవతలకే

చెందునుగాని శారీరుఁడగు జీవునికిఁ జెందదు. అని దోషము శాఁగా వారించుచున్నారు.

## ప్రాణవతా శబ్దాత్ 15.

శబ్దాత్ = వేదమువలన, ప్రాణవతా=ఇంద్రియములకుజీవునితోనే సంబంధము. అనఁగా, ప్రాణముల కధిష్ఠాన దేవతలున్నను, ప్రాణవంతుఁడైన (ప్రాణముకల జీవునితోనే యీప్రాణములకు సంబంధమని శ్రుతివలనఁ దెలియుచున్నది. "దర్శనాయ చక్షుః, గంధాయ ఘ్రాణమ్" దర్శనము కొఱకు-చక్షుస్సు, గంధము-కొఱకు-ఘ్రాణమును, ఆత్మకుపయోగపడును. అనుటచే నీప్రాణములకు శారీరునితోనే సంబంధమని తెలియుచున్నది. అదికాక యింద్రియాధిష్ఠాతృ దేవతల కందఱికిని భోక్తృత్వము చెప్పుటకన్న శరీరస్వామియగు జీవుని కొక్కనికే భోక్తృత్వము చెప్పుట సుకరము.

## తస్యచ నిత్యత్వాత్ 16.

ఈశరీరమునఁ బుణ్యపాపములసంపర్కముకలిగి సుఖదుఃఖముల ననుభవించుటకు జీవుఁడునిత్యుఁడు. కనుక నతనికే భోక్తృత్వము.

## 8 ఇంద్రియాధికరణము. (17-19)

ఇంద్రియములని వేరుగానున్నచో నింద్రియాధిష్ఠాన దేవతలనుగూర్చి విచారింపవచ్చును. ప్రాణములనియే కాని యింద్రియములని వేఱుగా లేవే యన, నీయధికరణ మారంభించుచున్నారు.

### 17 త ఇంద్రియాణి తద్వ్యపదేశా దన్యత్ర శ్రేష్ఠాత్.

తద్వ్యపదేశాత్ = "ఏతస్మాజ్జాయతే ప్రాణః, మనస్సర్వేంద్రియాణిచ, అను శ్రుతిలో వేఱుగా చెప్పుటవలన, శ్రేష్ఠాదన్యత్ర = ముఖ్యప్రాణముకన్న మిగిలిన, తే = ఆ వాగాదులు, ఇంద్రియాణి = ఇంద్రియములు. ముఖ్యప్రాణమునుదప్ప మిగిలిన వాగాదుల నింద్రియములని వ్యవహరించుటచే నవి యింద్రియములు. అనఁగా నవి తత్త్వాంతరములే కాని ముఖ్యప్రాణముయొక్క వృత్తిభేదములు కావు. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనస్సర్వేంద్రియాణిచ" అని ప్రాణమును వేఱుగాను నింద్రియములను వేఱుగాను చెప్పెను. మనస్సును గూడ ప్రాణములకన్నను నింద్రియములకన్నను విడిగాఁ జెప్పెను. కాని, గీతలో "మనష్షష్ఠానీంద్రియాణి" అని యింద్రియములతోఁ గలిపెను. ప్రాణమునుమాత్రము ఇంద్రియముగ నెచటను చెప్పలేదు.

18 భేదశ్రుతేః

వాగాదీంద్రియములకన్న ముఖ్యప్రాణము వేఱుగాఁ జెప్పఁబడుటవలన, నవి తత్త్వాన్తరములనుట నిశ్చయము.

19 వైలక్షణ్యాచ్చ.

సుషుప్తికాలములో వాగాదీంద్రియములన్నియు నుపరతములైనను ప్రాణమొక్కటి యుండుటను వైలక్షణ్యము (భేదము ఉండుటవలనను నవి తత్త్వాంతరములు.

౫ సంజ్ఞామూర్తి క్లృప్త్యధికరణము. (20-22)

శరీరమున జీవుఁడు రాజువంటివాఁడని ప్రశంసింపఁబడెను.

సత్ప్రకరణములో, తేజోఽబన్న సృష్టిని చెప్పి, "అనేన జీవే నాత్మనా నుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అని చెప్పఁబడినది. ఇందు నామరూపవ్యాకరణము చేసినది జీవుఁడా! ఈశ్వరుఁడా? యను సందేహమును వారింప నీయధికరణ మారంభింపఁబడినది.

సంజ్ఞామూర్తి క్లృప్తిస్తు త్రివృత్కుర్వత ఉపదేశాత్ 20.

సంజ్ఞామూర్తి క్లృప్తిస్తు = నామ రూప వ్యాకరణ మొనర్చుట త్రివృత్కుర్వతః = త్రివృత్కరణ మొనర్చిన

పరమేశ్వరునియొక్క పని. జీవుని పనికాదు. "సేయం దేవతైక్షత" యని ప్రారంభించి, "వ్యాకరవాణి" అని యుండుటచే దేవతాపదముచేఁ జెప్పఁబడిన పరమేశ్వరుఁడే యని వేదముపదేశించుచున్నది కాన నతఁడే నామరూపవ్యాకర్త.

మాంసాది భౌమం యథాశబ్దమితరయోశ్చ 21.

మాంసాది = శరీరమందలి మాంసాదికము, భౌమం = పురుషునిచే ననుభవింపఁబడిన త్రివృత్కృతమైన భూమియొక్క భాగము (భుజింపఁబడిన యన్నాది పార్థివద్రవ్య భాగము) ఇతరయోశ్చ = మిగిలిన తేజస్సు, ఉదకము, యొక్క భాగములను యథాశబ్దమ్ = వేదశబ్దానుగుణముగ నెఱుంగునది. అనఁగాఁ బురుషునిచే భుజింపఁబడిన యాహారము మూఁడువిధములుగ విభజింపఁబడును. స్థూలభాగము—పురీషము, మధ్యమభాగము, — మాంసాదికము, సూక్ష్మభాగము — మనస్సు, గను మారును. ఇట్లే జలము—మూత్ర రక్త ప్రాణములుగ మారును. నెయ్యిమొదలగు తేజఃపదార్థము, అస్థి, మజ్జ, వాగ్రూపములుగా మారును. ఇదియే త్రివృత్కరణము.

వైశేష్యాత్తు తద్వాదస్తద్వాదః 22.

వైశేష్యాత్తు = త్రివృత్కృతములైన వానిలోఁ (తేజోబన్నములలో) నేభాగము హెచ్చుగానుండునో తద్వాదః =

ఆపేదున వ్యవహారము. ద్విరుక్తి యధ్యాయసమాప్తి సూచకము.

ఇతి శ్రీమద్భారద్వాజస గోత్రపవిత్ర
వారణాస్యన్వవాయ కలశపాథోరాశి
రాకాకౌముదీ సుధాకరాయమాన
శ్రీమదచ్యుతశాంభవ వేంకటశాస్త్రుల
కూరాత్మజుండును వేంకటనరసింహ
సూర్యనారాయణ లక్ష్మీనారాయణశాస్త్రి
వర్యులయనుజుండును నగు
శ్రీగంగాధరశాస్త్రిచే విరచితమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్రవృత్తియందు
ద్వితీయాధ్యాయమునం
జతుర్థపాదము
ద్వితీయాధ్యాయము ముగిసెను
ఈపాదమున - అధి 9 - సూ 22
ఈయధ్యాయమున అధి 47 సూ 157

---

సరస్వతీ పవర్ ప్రెస్ - రాజమహేంద్రవరము.

శ్రీరస్తు

# బ్రహ్మసూత్రార్థదీపిక

## తృతీయాధ్యాయ ప్రథమపాదము

### 1 తదన్తరప్రతిపత్త్యధికరణము:- 1-7

వెనుకటి యధ్యాయమున, వేదాన్తవిహితమగు బ్రహ్మదర్శనమున స్మృతిన్యాయవిరోధము పరిహరింపఁబడినది. పరపక్షము లపేక్షింపరానివని చెప్పఁబడినది. జీవున కుపకరణములగు జీవ వ్యతిరిక్త తత్త్వములు బ్రహ్మమునుండి పుట్టునని చెప్పఁబడినది.

ఇప్పు డీయధ్యాయమున నుపకరణ సహితుఁడైన జీవునికి సంసారగతి ప్రకారము, తదవస్థలు, సమ్యగ్దర్శనము వలనఁ బురుషార్థసిద్ధి, సమ్యగ్దర్శనోపాయములు, మున్నగునవి వివరింపఁబడుటచే సంగతికలదు. అందును ప్రథమపాదమున వైరాగ్యసిద్ధికై పంచాగ్ని విద్యామూలకముగా సంసారగతి ప్రభేదములు చెప్పఁబడును. అవి విన్నచోఁ బరలోకభోగములు పగవానికైన వద్దనిపించును.

"అథైన మేతే ప్రాణా అభిసమాయన్తి" అని మొదలుపెట్టి "అన్య న్నవతరం, కల్యాణతరం రూపం కురుతే" బృ. 4-4-14 అను వచనములవలన జీవుఁడు ముఖ్య ప్రాణేంద్రియసహితుఁడై అవిద్యా కర్మ పూర్వప్రజ్ఞాసహితుఁడై యా-

దేహమునుండి మఱియొక చక్కని క్రొత్త దేహమును బొందు
నని తెలియుచున్నది.

ఈ దేహమును విడిచి మఱియొక దేహమును బొందఁ బోవు జీవుఁడు దేహాన్తరారంభకములైన భూతసూక్ష్మములతోఁ గూడకయే వెళ్లునా? కూడికొనివెళ్లునా? అని సందేహము గలుగుచున్నది. భూతసూక్ష్మములు సర్వత్ర లభించునుగాన వీనిని గూడఁదీసికొనివెళ్ళుట నిష్ప్రయోజనముగాన వీనితో అసంపరిష్వక్తుఁడై (కూడనివాఁడై) వెళ్ళుచున్నాఁడు. అని పూర్వపక్షముగలుగ వారించుటకై యీ యధికరణము ప్రారంభమైనది.

తదన్తరప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్న
నిరూపణాభ్యామ్. 1-

తదన్తరప్రతిపత్తౌ = దేహాన్తరమునుబొందుటలోఁ, సంపరిష్వక్తః = దేహబీజభూతములైన భూతసూక్ష్మములతోఁ బరివేష్టింపఁబడినఁ (కూడిన) వాఁడయియే, రంహతి = వెళ్ళుచున్నాఁడు. ఎందుచేతననఁగా, ప్రశ్ననిరూపణాభ్యామ్=ప్రవాహణశ్వేతకేతువుల ప్రశ్నసమాధానములవలన, శ్వేతకేతువు ప్రవాహణుఁడను రాజసభకు వెళ్లెను. రాజు శ్వేతకేతువును ఇట్లుప్రశ్నించెను.

ప్ర:- వేత్థయథా పంచమ్యా మాహుతా వాపః పురుష
వచసో భవన్తి? అయిదవ యాహుతియందు ఉదక

ములు పురుషశబ్దవాచ్యము లెట్లగునో తెలుఁగు దువా? అనియడిగెను. దానికతఁడు సమాధాన మెఱుఁగక తనతండ్రియగు గౌతముని వద్దకు వెళ్ళి, రాజు నన్నిట్లడిగెను. నాకుఁదెలియలేదు. దానికి సమాధాన మేమి? యనియనెను. గౌతముఁడును దాని సమాధానము నాకును దెలియదు అనియిరువురును రాజుదగ్గఱకు వెళ్ళి రాజునే దానికి సమాధానము చెప్పుమని కోరిరి. అంత నాప్రవాహణుఁ డిట్లుచెప్పెను.

సమా:- ద్యు, పర్జన్య, పృథివీ, పురుష, యోషిత్తు లనునవి పంచాగ్నులు, వీనియందు వరుసగా, శ్రద్ధా, సోమ, వృష్టి, అన్న, రేతో, రూపములగు నైదాహుతులను హోమముచేసిన పురుషు, డగును.

ఈలోకములో జనులు తా మాచరించు నగ్నిహోత్రాది కృత్యములందు శ్రద్ధతో హోమముఁ జేయు ద్రవరూపములయిన పయో దధి ప్రభృతి ద్రవ్యములయొక్క ద్రవరూపమగు జలము అపూర్వద్వారా యజమానుని బొంది యతనితోపాటు ద్యులోకమను నగ్నినిబొందును. అచ్చట యజమాను నింద్రియాధిష్ఠాతృదేవతలు, ఈశ్రద్ధాఖ్యాహుతి రూప జలమును ద్యులోకాగ్నిలో హోమముచేయుదురు.

ఆ హోమముచేయఁబడిన జలము సోమరూపమగు దేహముగా నగును. జలమయమైన యాసోమరూపమైన దేహము

వృష్ట్యభిమాని దేవతావిశేషమగు పర్జన్యాగ్నిలో హోమము చేయఁబడి వృష్టియగును. ఆ హోమముచేయఁబడిన జలమే సోమరూపమగు దేహాభావమును వృష్టిభావమును బొంది, పృథివి యను నగ్నిలో హోమముచేయఁబడినదై, వ్రీహియవాది (ధాన్యము బియ్యము మొదలగు) రూపమగు నన్నమగును. అన్నరూపమును బొందిన యాజలమే పురుషుఁడను నగ్నియందు హోమముచేయఁబడినదై (ఇతనిచే భక్షింపఁబడినదై) రేతోభావమును (శుక్రభావమును) బొందును. ఇట్లు రేతోభావమును బొందిన యాజలమే, ఐదవరూపాహుతిలో యోషిత్తను, (భార్యయను) అగ్నియందు హోమము చేయఁబడి గర్భరూపమును బొంది పురుషాకారముగా మార్పు చెందును. అప్పుడు ఆ యుదకములకు (జలమునకు) పురుషవచస్త్వము గలుగుచున్నది. అని యీ పంచాగ్ని విద్య నుపదేశించెను.

ఈ ప్రశ్న నిరూపణములవలన అబాది (జలము మొదలగు) భూత సూక్ష్మములతోఁ బరివేష్టింపఁబడియే పురుషుఁడు దేహాంతరమును బొందునని తెలియుచున్నది. అనిసిద్ధాంతము.

### త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాత్. 2

ఈ ప్రశ్న నిరూపణములవలన జీవుఁడుదకములతో సంపరిష్వక్తుఁడై వెళ్లుచున్నాఁడని తెలియుచున్నది. కాని

జలముకంటె నితరములగు భూతసూక్ష్మములతోఁగూడి వెళ్లుచున్నట్లు శేదేయనివఁ జెప్పుచున్నారు. త్రి + ఆత్మ కత్వాత్, తు, భూయస్త్వాత్.

త్ర్యాత్మకత్వాత్తు = ఉదకములు త్ర్యాత్మకములు= పృథివ్యప్తేజస్సులయొక్క స్వభావమైన వగుటవలన, యజ మానద్వారా నిర్గతములగు జలములవలన దేహాన్తరము పుట్టినదని యంగీకరించినప్పుడు త్రివృత్కరణ శ్రుతివలన నీ జలములు మిగిలిన భూతసూక్ష్మములతోఁ గూడినవే యగుట వలన శరీరారంభకములగు నన్నిభూతసూక్ష్మములతోను గూడియే వెళ్లుచున్నాఁడు.

"ఆపః పురుష వచసోభవన్తి" అని యొక్కయుదకము లనే చెప్పుటకుఁ గారణము, భూయస్త్వాత్ = జలభాగము హెచ్చుగానుండుటవలన.

## ప్రాణగతేశ్చ - 3

ప్రాణములయొక్క గతివల్లను భూతసూక్ష్మములతోఁ గూడియే వెళ్లుచున్నాఁడు. జీవించియున్నకాలములో దేహా రూపముననున్న భూతముల నాశ్రయించియున్న ముఖ్యప్రాణచ క్షురాదులును జీవునితోపాటు పోవుచున్నవి "తముత్క్రామన్తం ప్రాణోఽనూత్క్రామతి, ప్రాణ మనూత్క్రామన్తం సర్వే ప్రాణా అనూత్క్రామన్తి" బృ-4-4-2 జీవుఁడుత్క్రమణము

(శరీరమునుండి లేచిపోవుట) బొందుచున్నప్పుడు ముఖ్యప్రాణమతనిననుసరించి యుత్క్రమించును. దానిననుసరించి సర్వప్రాణములును నుత్క్రమించును. నిరాశ్రయములగు ప్రాణములు పోలేవు గనుక తదాశ్రయముగా భూతసూక్ష్మముల గమనమును నంగీకరింపవలెను.

### అగ్న్యాది గతిశ్రుతేరితిచేన్న భాక్తత్వాత్. 4

అగ్న్యాదిగతిశ్రుతేఃఇతిచేత్ = "యత్రాస్య పురుషస్య మృతస్య అగ్నిం వాగప్యేతి వాతం ప్రాణః చక్షురాదిత్యమ్" బృ. 3-2-13. అను శ్రుతివలన, పురుషుఁడు చనిపోయినప్పుడు వాగింద్రియము, దానికధిష్ఠాన దేవతయైన అగ్నిని, ప్రాణము వాయువును, చక్షుస్సూర్యుని బొందునని చెప్పుచున్న శ్రుతివలన ప్రాణములు తత్తదధిష్ఠాన దేవతలయందు లయమగుచున్నట్లు తెలియుచున్నది. ఇచ్చట లోకాన్తరమునకుఁ బోవుచున్నట్లు చెప్పఁబడినది. ఇది విరుద్ధముగాదా! అనియన్నచో, న=కాదు. భాక్తత్వాత్= ఇంద్రియాధిష్ఠాన దేవతలను బొందునని చెప్పిన వాక్యము భాక్తము=గౌణము= అప్రధానము. ఎందుచేతననఁగా, ఆశ్రుతిలో, లోమములు ఓషధులను బొందుచున్నవి. కేశములు వనస్పతులను బొందుచున్నవి యని కూడ చెప్పఁబడినది. లోమములు కేశములు అట్లు ఓషధులను వనస్పతులను బొందుచున్నట్లు గనఁబడుటలేదు. కావున నిదియౌపచారిక మన

వలెను. జీవించియున్నంతవఱకు అగ్న్యాదిదేవతలు వాగాదుల కుపకారమొనర్చి మరణమునుబొందినతరువాత నిక నుపకారముచేయక విరమించుకొందురనిమాత్రమే దానికర్థము" చెప్పవలెను. కాన అగ్న్యాదులయందు వాగాదిలయము గౌణము. భగవద్గీతలోఁగూడ "గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్" 15.8. అని వీనిని దీసికొనియే వెళ్లునని యున్నది- కాన నింద్రియములు జీవునితో వెళ్లును.

ప్రథమేఽశ్రవణాదితిచేన్న తా ఏవ హ్యుపపత్తేః. 5

ద్యులోకాది పంచాగ్నులయందు, ఉదకములు కాహుతిత్వము, సిద్ధమైనచో పంచమాహుతియందు ఉదకములు పురుషశబ్దవాచ్యము లెట్లైనవో నిర్ణయింపవచ్చును. ప్రథమాహుతియందు శ్రద్ధను ద్యులోకాగ్నియందు హోమము చేయుచున్నట్లున్నదికాని ఉదకములను హోమముచేయుచున్నట్లు లేదు. "అసౌవావ లోకో గౌతమాగ్నిః, తస్మిన్నగ్నౌ దేవాః శ్రద్ధాం జుహ్వతి" ఛాం-5-4-2. అనియున్నది కనుక, ప్రథమే అశ్రవణాదితిచేత్ = మొదటిఆహుతియందు ఉదకమునకు ఆహుతిత్వము వినఁబడలేదు అన్నచో, న=అట్లుకాదు. తా ఏవహి=ఆయుదకములే శ్రద్ధాశబ్దముచేఁ జెప్పఁబడుచున్నవి. ఎందుచేతననఁగా, ఉపపత్తేః= ఉపపత్తివలన అనఁగా మనోవృత్తివిశేషరూపమైన శ్రద్ధను మనస్సునుండి వేఱుచేసి హో

మముచేయుట కుదురదు. ఉదకములను హోమముచేయుట కుదురును. శ్రద్ధయను మాటకు ఉదకములనియే యర్థము "ఆపోహాస్మై శ్రద్ధాం సన్నమంతే పుణ్యాయ కర్మణే" అను శ్రుతిలో ఉదకములకు శ్రద్ధాజనకత్వము కనఁబడుటచే లక్షణచే శ్రద్ధాశబ్దమున కుదకములనియే యర్థము. "శ్రద్ధా వా ఆపః" తై సం.1-6-8-1.లోఁగూడనుండుటచే శ్రద్ధాశబ్ద ముదకముల యందుపపన్నము.

అశ్రుతత్వాదితి చేన్నేష్టాది కారిణాం ప్రతీతేః. 6

అశ్రుతత్వాత్ = ఈప్రశ్న ప్రతివచన వాక్యములలో జీవుఁడు భూతసూక్ష్మములతోఁ గూడి వెళ్లుచున్నట్లు వినఁబడ కపోవుటవలన, "రంహతిసంపరిష్వక్తః" అనుట ఉపపన్నము కాదన్నచో, న= అట్లనరాదు. ఎందువలన? ఇష్టాదికారిణాం ప్రతీతేః= "అథయఇమే గ్రామ ఇష్టాపూర్తే దత్త మిత్యుపాసతే, తేధూమ మభిసంభవన్తి" అని, ఛాం-510-3. గృహస్థులు ఇష్టాపూర్తాదికర్మను లాచరించి ధూమాదిమార్గము ద్వారా చంద్రలోకమును బొందుదురని, "ఆకాశాచ్చంద్రమస మేష సోమోరాజా" చంద్రలోకముపొందిన వారిని సోమరాజశబ్దముచే శ్రుతి చెప్పుచున్నది. ఇచ్చట పంచాగ్ని విద్యలోఁగూడ "తస్మి న్నేతస్మి న్నగ్నౌ దేవాః శ్రద్ధాంజుహ్వతి, తస్యా ఆహుతేః సోమోరాజా సంభవతీతి" ఛాం.5.4.2. శ్రద్ధాహోమమువలన సోమరాజగునని యుం

చుటవలన, ఆ యిష్టాపూర్తాదికారులే సోమరాజులు, అని తెలియుటచే జీవుఁడు భూతసంపరిష్వక్తుఁడై వెళ్లుచున్నాఁడనుట ఉపపన్నమే యగును.

భాక్తం వా నాత్మవిత్త్వాత్ తథాహి దర్శయతి. 7

అవ. ఇష్టాపూర్తము లాచరించిన వారు సూక్ష్మభూత సంపరిష్వక్తులై కర్మఫల మనుభవించుటకుఁ జంద్రలోకమునకుఁ బోవుదురు అని చెప్పుట సంగతముగా లేదు. "చంద్రం ప్రాప్యాన్నం భవన్తి" బృ. 6.2.16. "తాం స్తత్ర దేవా యథా సోమం రాజానం ఆప్యాయస్వ అపక్షీయస్వేత్యేవమేనాం స్తత్ర భక్షయన్తి" అని ఇష్టాపూర్తాదికారులు చంద్రలోకమునకు వెళ్లి యచ్చట దేవతల కాహారము (అన్నము) అగుదురనియు, ఆ దేవతలు, యజ్ఞములో చమసస్థుఁడగు సోమముల ఋత్విజులు తృప్తిగాఁ బూర్తిగా నెట్లు భక్షింతురో అట్లే ఈయిష్టాపూర్తాదికారులను భక్షింతురనియు శ్రుతిలోఁ గనఁబడుచుండుటచే వీరు దేవతల కాహారమగుట కే వెళ్లుచున్నారు కాని ఫలభోగమునకుఁ గాదు. అని యాక్షేపణముకలుగ నీసూత్రముచే సమాధానము చెప్పుచున్నారు.

భాక్తం, వా, అనాత్మవిత్త్వాత్ తథాహి దర్శయతి

ఇందలి వాశబ్దమునకు చెప్పినదోషమును నిరసించుటయర్థము. భాక్తం = ఇష్టాదికారులు దేవతల కన్నము

గుదురు అనిచెప్పుట భాక్తము = అప్రధానము లేనిచో "స్వర్గకామో యజేత" అనుశ్రుతి బాధితమగును. "తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" భగ-9-21- అనుభగవద్గీతా వచనమున్ను విరోధించును. దేవతలకన్నమనఁగా ఉపభోగ సాధనములగుదురని యర్థము. పుత్రభార్యాదులవలె వీరు దేవతలకు భోగసాధనములై ఆనందముగలిగింతురు. ఎందుచేతనన, అనాత్మవిత్త్వాత్ = వీరు ఆత్మవిదులుగారు కనుక, దేవతలకు భోగ్యులు అగుదురు. తథాహిదర్శయతి = ఈయర్థమును శ్రుతిచూపించుచున్నది. "అథయోఽన్యాం దేవతా ముపాస్తే అన్యోఽసావన్యోఽహమస్మీతి నసవేద. యథాపశురేవం స దేవానామ్" బృ. 1-4-10 ఈ దేవుడు (దేవత) వేఱు. నేనువేఱు. అను భేదబుద్ధితో నెవ్వఁడు దేవతోపాసనచేయునో వాఁడు తెలియనివాఁడు = ఆత్మజ్ఞుఁడు కాఁడు. వాఁడు దేవతలకుఁ బశువువలె భోగ హేతువగును. అనిశ్రుతి చెప్పుచున్నది.

అనాత్మవిత్త్వాత్ - అనుదానికి పంచాగ్నివిద్య నెఱుఁగనివారగుటచే యనియునర్థము చెప్పవచ్చును. ఎట్లైనను దేవతల కన్నమగుదురు అన్నచోట అన్నపదమునకు ముఖ్యార్థము కాదు. భోగ్యులు అనియే యర్థము. ఇష్టాదికారులు సోమలోకమున విభూతిననుభవించి మరలఁ దిరిగివత్తురు. అనియు శ్రుతిచెప్పుటచే అన్నపదమునకు ముఖ్యార్థము కాద

నిదే తెలియుచున్నది. కానిచో విభూతిననుభవించుట కుప రము కనుక ఫలభోగార్థము చంద్రలోకమునకుఁ బోవుదురు అన్నది యసంగతముకాదు.

## 2 కృతాత్యయాధికరణము (8-11)

స్వర్గమును బొందినవారు ఫలభోగానన్తరము తిరిగి వచ్చుటను జెప్పు సందర్భములో ఛాందోగ్యమున నిట్లున్నది "తస్మిన్ యావత్సంపాతముషిత్వాఽథైతమేవాధ్వానం పునర్నివర్తన్తే" ఛాం. 5-10-5 అని మొదలుపెట్టి "రమణీయచరణా రమణీయాం యోని మాపద్యేరన్ కపూయచరణాః కపూయాం యోనిమ్" స్వర్గఫలమనుభవించుటకుఁ దాముచేసిన కర్మ మెంతవఱకు నుండునో అంతవఱకు స్వర్గమున నుండి పిదప నీమార్గమున (ఆకాశ వాయుధూమాభ్రాదిరూప మార్గమున) తిరిగివత్తురు. వారు పుణ్యకర్మము నాచరించిన వారైనచో బ్రాహ్మణాది పుణ్యయోనిని ప్రవేశింతురు. పాపకర్ములయినచోఁ బశుపక్ష్యాదియోనిని బొందుదురు. అనియున్నది.

ఇందు వారు తిరిగివచ్చుటలో అనుశయముతో= స్వర్గమును బొందుటకుఁ దాముచేసిన కర్మముకంటె నతిరిక్తమగు కర్మముతోఁ దిరిగివత్తురా! లేక ఏవిధమగుకర్మలేశము లేకయే తిరిగివత్తురా! యనిసందేహముకలుగుచున్నది. పై శ్రుతిలో "యావత్సంపాత ముషిత్వా" అనుటచే సంపాత

మనఁగా కర్మము) కర్మమంతయుఁ బూర్తియైన తరువాత నిరను శయులై వత్తురని పూర్వపక్షము గలుగుచున్నది. దానిపై సిద్ధాన్తమును నిరూపించుటకై యీయధికరణ మారంభింపఁ బడినది.

కృతాత్యయేఽనుశయవాన్ దృష్టస్మృతిభ్యాం
యథేతమనేవంచ. 8

కృతాత్యయే= కృత = స్వర్గసుఖప్రాప్తికొఱకై చేసిన కర్మముయొక్క, అత్యయే = నాశమునందు, అనుశయవాన్ = కర్మశేషముకలవాఁడయియే స్వర్గమునుండి దిగివచ్చును. ఎందు చేత? అనగా! దృష్టస్మృతిభ్యాం = ప్రత్యక్షదృష్టమైన శ్రుతి చేతను, స్మృతిచేతను సానుశయుఁడై వచ్చును. అని తెలియు చున్నది.

శ్రుతి:- తద్య ఇహ రమణీయచరణా అభ్యాశోహ యత్తే రమణీయాం యోని మాపద్యేరన్ బ్రాహ్మణయో నింవా క్షత్రియయోనింవా, అథయ ఇహ కపూయచరణా అభ్యాశోహయత్తే కపూయాం యోని మాపద్యేరన్ శ్వయోనింవా, సూకరయోనింవా చండాలయోనింవా. స్వర్గమునుండి దిగివచ్చువారు రమణీయ = మంచి, చరణాః = ఆచరణము = కర్మముకలవారు, అభ్యాశోహ=వెంటనే, రమణీయమైన బ్రాహ్మణాది జన్మమును బొందుదురు. కపూయ = కుత్సితమైన = నింద్యమైన, చరణాః = కర్మము

కలవారు, నింద్యములగు; శ్వ = కుక్క, సూకర = పంది, చండాలయోనులను బుట్టుదురు.

స్మృతి:- "వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మనిష్ఠాః ప్రేత్య, కర్మఫల మనుభూయ తతశ్శేషేణ విశిష్ట దేశ జాతి కులరూపాయుః శ్రుత విత్త వృత్త సుఖ మేధసో జన్మప్రతిపద్యన్తే" గౌ. ధ. 11-31 వర్ణములవారు. ఆశ్రమములవారును (బ్రాహ్మణాది వర్ణములు, బ్రహ్మచర్యాది, ఆశ్రమములును) తమతమ విహిత కర్మములను నిష్ఠకలవారై యాచరించి, చనిపోయినపిదప స్వర్గాదిలోకములందుఁ దత్తత్కర్మానుగుణముగుఫలము లను భవించి, మిగిలినకర్మములచే నుత్తమములగు దేశ, జాతి, కుల, రూప, వయః, శ్రుత, విత్త, సుఖ, శీల, బుద్ధి యుతములగు జన్మములఁబడయుదురు. అని గౌతమధర్మసూత్రములలో నున్నది. ఈశ్రుతి స్మృతులవలన భుక్తఫలమగుకర్మముకంటె శిష్టమగు కర్మముతోఁ దిరిగివత్తురని తెలియుటచే, సాను శయులై తిరిగివత్తురని తేలుచున్నది. తైలభాండన్యాయముగాఁ గొంత కర్మము శేషించియే యుండునని కొందరియుక్తి ప్రాయము. భాండములోని తైలము నంతను వంచివేసినను దాని నంటుకొని కొంత యుండినట్లు కర్మశేషముండునని యుక్తి ప్రాయము.

"యావత్సంపాత ముషిత్వా" అనుమాటకు అచ్చట ఆఫలము ననుభవించుటకుఁ జేసినకర్మమనియే యర్థము కాని యావత్కర్మమని యర్థము కాదు.

ఇఁకఁదిరిగివచ్చునపుడీజీవుఁడు వెళ్ళినమార్గముననే వత్తురా! వేరొకమార్గమున వత్తురా! అను సమాధానము సూత్రములోఁ జెప్పుచున్నారు. "యథేతమనేవంచ" యథేతం=వేలా వెళ్లిరో అలాగేవత్తురు. వెళ్లుటలోను వచ్చుటలోనుగూడ ధూమాకాశములు వినవచ్చుటచే, వెళ్లిన పితృయాణాదిమార్గముననే వత్తురని యర్థము. ఆరోహణములోఁ జెప్పిన రాత్ర్యాదులు అవరోహణములో లేకపోవుటచేతను, అభ్రాదులధికముగా నుండుటచేతను. అనేవంచ = వెళ్ళినమార్గముననే కాక వేఱు మార్గమునను వత్తురనియు నర్థము.

చరణాదితిచేన్నోపలక్షణార్థేతి కార్ష్ణాజినిః. 9

చరణాదితిచేత్ = "రమణీయచరణాః, అనుశ్రుతిలో "రమణీయాం యోని మాపద్యన్తే" అనియున్నది. చరణము వలన యోన్యాపత్తి= జన్మాపత్తి తెలియుచున్నదికాని కర్మము కాదు, చరణము వేఱు, కర్మము వేఱు, అన్నచో, న= కాదు. ఏమనఁ? ఉపలక్షణార్థేతి=ఈ చరణశ్రుతి కర్మమునకును ఉపలక్షణార్థము అని, కార్ష్ణాజినియను నాచార్యులు చెప్పు చున్నారు.

అనర్థక్యమితిచేన్న తదపేక్షత్వాత్ -10

అనర్థక్యమితిచేత్ = చరణపదమునకు అనర్థకత్వము వచ్చుచున్నది. అనియున్నచో, అనఁగా చరణమనఁగా ఆచా

రము, ఇది అనుశయరూపమైన కర్మమునకుపలక్షణముకాదు. సదాచార, దురాచారాత్మకమగు చరణమే సదసద్యోనిప్రాపకము, ఇది కర్మమున కుపలక్షణ మన్నచోఁ గర్మమే సాధ్వసాధుజన్మ ప్రాపకమగును గాన, చరణపదమును శ్రుతిలోఁ జెప్పుట యనర్థక మేయగును. అనియర్థము.

స॥ అట్లనర్థకమని చెప్పరాదు. ఎందుచేత? తదపేక్షత్వాత్ = ఇష్టాదికర్మములు చరణసాపేక్షము లగుటవలన, ఆచారముకలవానికిఁగాని ఆకర్మములయం దధికారము లేదు. "ఆచారహీనంనపునన్తివేదాః" అని "ఆచార విహీనస్య సమస్తా నిష్ఫలాః క్రియాః," అనియు స్మృతికలదు.

సుకృతదుష్కృతే ఏవేతితు బాదరిః. 11

బాదరిః=బాదర్యాచార్యులు. సుకృతదుష్కృతే ఏవ= సుకృతదుష్కృతములే, చరణశబ్దమున కర్థములు. చరణము, ఆచారము, అనుష్ఠానము, కర్మము, అనునవిపర్యాయములు, లోకములో ఇష్టాదుల నాచరించువానిని ఈమహాత్ముఁడు ధర్మమాచరించుచున్నాఁడు అని వ్యవహరింతురు. అందుచే దీనికి భేదములేదు. ఇష్టాపూర్తాదికారులు చంద్రలోకమున కేఁగి తిరిగివచ్చుటలో సానుశయు లైవత్తురని సారాంశము.

## 3 అనిష్టాది కార్యధికరణము (12–21)

### అనిష్టాదికారిణా మపిచ శ్రుతమ్. 12

అనిష్టాది కారిణా మపిచ = ఇష్టా పూర్తాది పుణ్య కర్మములను చేయనివారికిఁ గూడ, శ్రుతం = చంద్రలోకగమన మున్నట్లు వినఁబడినది.

"ఇష్టాది పుణ్యకర్మముల నాచరించినవారి కెట్లును చంద్రలోకప్రాప్తి యున్నదనుట సిద్ధము. అట్టికర్మముల నాచరింపనివారికిఁ జంద్రలోకప్రాప్తి యున్నదా? లేదా? యని సందేహముకలుగఁగా, ఉన్నదని శ్రుతిమూలమునఁ దెలియుచున్నది. కౌషీతకిబ్రాహ్మణములో "యేవై కే చాస్మాల్లోకా త్ప్రయన్తి చంద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి." 1-2 ఏరెవ రీవరీలోకమునుండి పోవుచున్నారో వారందఱును జంద్రలోకమునే పొందుచున్నారు. అనియున్నది.

ఇదికాక, "పంచమ్యా మాహుతా వాపః పురుషవచసో భవన్తి" అయిదవయాహుతియందు ఉదకములు పురుష వ్యవహారముకలవియగునని, ఐదవయాహుతియందు అని సంఖ్యానియమము చేయుటచేఁ దిరిగిజన్మించువారి కందఱికిని జంద్రలోకప్రాప్తి లేనిదే దేహారంభ మేలేదని తెలియుచున్నది. కావున నందఱికిని చంద్రలోకప్రాప్తి కలదు.

సంయమనే త్వనుభూ యేతరేషా మారోహావ
రోహౌ తద్గతిదర్శనాత్ 13

సంయమనే,తు, అనుభూయ, ఇతరేషాం, ఆరోహావరోహౌ, తద్గతిదర్శనాత్,తు= ఇష్టాదిపుణ్యకర్మములు చేయని వారికందఱికి, చంద్రలోకప్రాప్తిలేదు. ఇతరేషాం = ఇతరులకు సంయమనే = యమలోకమునందు, అనుభూయ = తమ కర్మానుగుణములగు యాతనల, ననుభవించి, ఆరోహావరోహౌ = ఆరోహావరోహములు(ఊర్ధ్వలోకగమనాగమనములు) కలుగును. ఏమన; తద్గతిదర్శనాత్ = వారుయమలోకమును బొందుదురను శ్రుతి కనిపించుచున్నందున.

తా॥ ఇష్టాదిపుణ్యకర్మములు చేయనివారికిఁ జంద్రలోకప్రాప్తి లేదు. చంద్రలోకగమనము భోగార్థముకాని యూరకగాదు పుణ్యముచేయని వారికి భోగములేదు. అట్టివారు యమలోకమును బొంది యచట తమ కర్మానుగుణములగు యాతనల ననుభవించి మరలఁ బుట్టుచుఁ జచ్చుచు యమునికి వశులగుదురని శ్రుతి చెప్పుచున్నది. కనుక వారి యారోహావరోహణము లిటువంటివి.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతునిగూర్చి చెప్పిన సందర్భములో "నసాంపరాయః ప్రతిభాతిబాలం, ప్రమాద్యన్తం విత్తమోహేనమూఢం। అయంలోకో నాస్తి పర ఇతిమానీ, పునః పునర్వశమాపద్యతే మే"

అర్థము:- బాలుని, (అవివేకిని) ప్రమాదములాచరించువానిని, ధనమోహముచేఁ గన్నులుగాననివానినిగుఱించి పరలోకము భాసింపదు. ఈ లోకమేగాని యింకఁబరలోకము లేదని తలఁచువాఁడు మరల మరలఁ జచ్చుచుఁ బుట్టుచు నావశ మగుచుండును.

స్మరన్తిచ 14

స్మరన్తి. చ. = చెప్పుచుండిరి కూడను.

మనువు వ్యాసుఁడు మొదలగువారు యమలోకమున యముఁడు పాపకర్మములకుఁ దగినఫలమును విధించునని చెప్పుచున్నారు.

అపి చ సప్త 15

అపిచ=మఱియు, సప్త=ఏడునరకములు గలవని చెప్పుచున్నారు.

పౌరాణికులు రౌరవాదినరకలోకము లేడుగలవనియు, నవి పాపఫలమనుభవించుప్రదేశములనియు, ఇష్టాదిపుణ్యకర్మములుచేయనివారాలోకములను బొందుదురనియు, చెప్పుచున్నారు.

ఆవ: రౌరవాది నరకలోకములందు చిత్రగుప్తుఁడు మొదలగు నధికారు లున్నట్లు పురాణాదులయం దున్నదే, యిచ్చట యముఁడే వారిని పాపఫల మనుభవింపఁ జేయునని చెప్పుట యెట్లు పొసఁగును? అన

తత్రాపిచతద్వ్యాపారాదవిరోధః 16

తత్ర, అపి, చ, తద్వ్యాపారాత్, అవిరోధః.

తత్రాపిచ= ఆ రౌరవాది నరకలోకములయందును, తద్వ్యాపారాత్ =యమధర్మరాజుయొక్క వ్యాపారముండుట వలన, అవిరోధః= విరోధములేదు.

రౌరవాదినరకలోకములయందు, కూడ యమధర్మ రాజే అధికారి, చిత్రగుప్తాదులీతనిచే నియమింపఁబడిన వారేయగుటచే విరోధములేదు.

విద్యాకర్మణో రితితు ప్రకృతత్వాత్. 17

విద్యాకర్మణోః, ఇతి, తు, ప్రకృతత్వాత్.

ప్రకృతత్వాత్ = ప్రకృతమైనదగుటవలన (సందర్భము నకుఁ దగినదగుటవలన) విద్యాకర్మణోః ఇతితు = విద్యా కర్మణోః అనునదియే యభిప్రాయము.

పంచాగ్నివిద్యయందు "వేత్థ ! యథాసౌలోకోనసంపూ ర్యతే?" ఎఱుఁగుదువా? ఈలోకమేలపూరింపఁబడుట(నిండింపఁ బడుట) లేదో? (ఛాందో 5.3.3) అను ప్రశ్నమునకు సమా ధానము చెప్పుసందర్భమున, "అథైతయోః పథోః నకతరేణ చనతానీమాని క్షుద్రాణి అసకృదావర్తీని భూతానిభవన్తి;

జాయస్వ! మ్రియస్వేత్యేత త్తృతీయంస్థానం. తేనాసౌ లోకో నసంపూర్యతే (ఛాం.5. 10 8.) (అర్థము, ఈరెండుమార్గములలో నేయొక మార్గముచేతను నీక్షుద్రభూతములు పాటిమాటికివచ్చుచుఁ బోవుచునుండునవి కావు. పుట్టుము, చావుము, అనునది మూఁడవస్థానము. అందుచేత ఈలోకము నిండింపఁబడుటలేదు. అనిచెప్పఁబడినది. ఇచట ఈరెండుమార్గములు అనుమాటకు, "విద్యాకర్మమార్గము"లను నర్థము, ప్రకృతము గనుక, విద్యాకర్మమార్గములఁ బోఁగలిగినవారికే చంద్రలోకప్రాప్తికాని పుట్టిపోలేనివారికి చంద్రలోకప్రాప్తిలేదు. అందుచే నాలోకము హెచ్చుచుండిచే నెప్పుడునునిండింపఁబడదు. విద్యచేత (జ్ఞానముచేత) దేవయానమార్గము ననుసరించియు, నిష్టాపూర్తాది కర్మములఁ జేయుటచేతఁ బితృయాణమార్గము ననుసరించియుఁ జంద్రలోకమునకుఁ బోవుదురు. ఆరెండు మార్గము లను బోలేని జ్ఞానకర్మహీనులు మూఁడవస్థానము (మార్గము) ననుసరించి పోదురు. వారు క్షుద్రులు. ఎల్లపుడు, పుట్టుక, చావు, అనువానిని బొందుచుండుటయే ఆమార్గము. అని చెప్పబడినది.

ఇందు దేవయాన పితృయాణ మార్గములఁ బోవుట కర్హతలేని క్షుద్రులకు మూఁడవస్థానమును చెప్పుటచేత వారికిఁ జంద్రలోకప్రాప్తి లేదని భావము. కౌషీతకిబ్రాహ్మణములోని "తేసర్వే చంద్రమసం గచ్ఛన్తి" యున్నచోట సర్వే = (అం

దటు; అన్నదానికి ఇష్టాపూర్తాదికర్మములాచరించిన యుం దటు అని యర్థము.

అవ:- "పంచమ్యా మాహుతా వాపః పురుషవచసో భవన్తి" అన్నచోట నైదవయాహుతియుండు, అని సంఖ్యానియమముచేయుటచే దేహారంభమున కందఱును ఇంద్రలోకమును బొందవలయునని చెప్పబడినదిగదా! యన

18 వ తృతీయే తథోపలబ్ధేః.

తృతీయే=తృతీయస్థానమునందు మూఁడవదైనమార్గముననుసరించిపోవువారి విషయములో, న=దేహముపొందుటకు, ఆహుతిసంఖ్యా నియమము లేదు. ఏమన, తథా=అప్రకారముగా, ఉపలబ్ధేః= కనఁబడుటవలన.

జాయస్వ. మ్రియస్వ. అనుమూఁడవస్థానమును జెందు ప్రాణులకు ఆహుతిసంఖ్యానియమము లేకుండఁగనే పుట్టు చావులు సంభవించు చుండుటచేత వానికి దేహారంభమునకై చంద్రలోకప్రాప్తి యక్కఱలేదు. "పంచమ్యా మాహుతా వాపః పురుషవచసో భవన్తి" అన్నచోట "పురుష"పదముచే మనుష్యశరీరహేతుకముగా ఆహుతిసంఖ్య చెప్పఁబడినదికాని, కీటపతంగాదిశరీరహేతుకముగాఁ జెప్పఁబడలేదు.

పంచమాహుతియందు పురుషవచస్త్వము పదేశింపఁ బడుచున్నదికాని యంతకుఁబూర్వ మపంచమాహుతియందు

పురుషవచస్త్వము ప్రతిషేధింపఁబడుటలేదు. కావున ఆరోహావరోహణములుకలవారికి పంచమాహుతియందు దేహారంభముకలుగును. తృతీయస్థానమువారికి ఆహుతిసంఖ్యానియమములేకయే దేహారంభముకలుగును.

## స్మర్యతేఽపిచ లోకే. 19

లోకే=లోకమునందు. స్మర్యతేపిచ=స్మరింపఁబడుచున్నదికూడను.

> లోకములో ద్రోణాచార్యుఁడు, ధృష్టద్యుమ్నుఁడు సీత, ద్రౌపది మున్నగువారు అయోనిజులుగా స్మరింపఁబడుచుండిరి. వారిలో యోషిత్పురుష విషయకమగు ఆహుతిలేదుగావున, సంఖ్యానియమములేదు.

## దర్శనాచ్చ 20

దర్శనాచ్చ= లోకములో గనఁబడుటవల్లను సంఖ్యానియమములేదు.

జరాయుజములు, అండజములు, స్వేదజములు, ఉద్భిజ్జములు, అను నాల్గువిధములైన ప్రాణులలో స్వేదజములందును, ఉద్భిజ్జములందును స్త్రీపురుష సంయోగములేకయే పుట్టుక కనఁబడుచున్నది కావన ఆహుతిసంఖ్యా నియమము ఆదరణీయముకాదు.

అవ:- "తేషాం ఖల్వేషాం భూతానాం త్రీణ్యేవ బీజాని భవన్తి. అండజం జీవజ ముద్భిజ్జమ్. (ఛాం 6.3.1)

ఈభూతములలో, అండజములు, జీవజములు, ఉద్భిజ్జములు, అనిమూడు విధములేయున్నవని చెప్పఁబడినది. స్వేదజములను మాటలేదే; అవిభాగమెట్లుకలిగినది? అన

తృతీయశబ్దావరోధ స్సంశోకజస్య. 21

ప్ర, అ। సంశోకజస్య=స్వేదజమునకు, తృతీయశబ్దావరోధః= తృతీయమైన ఉద్భిజ్జశబ్దముచేత, సంగ్రహము.

స్వేదజము జలమును భేదించుకొని పుట్టును, ఉద్భిజ్జము భూమిని భేదించుకొనిపుట్టును. ఈరెండింటికిభేదించుకొనిపుట్టుట సమానమగుటచే శ్రుతిలో నుద్భిజ్జపదముచే నీరెండును జెప్పఁబడినవి. స్వేదజము, జంగమమని, వేఱుగావిభజించి చతుర్విధములనియుఁజెప్పుటకలదు.

4 సాభావ్యాపత్త్యధికరణము. 22

సాభావ్యాపత్తి రుపపత్తేః.

ఉపపత్తేః=ఉపపత్తివలన, సాభావ్యాపత్తిః=సాదృశ్యముమబొందుటయే యని యర్థము.

ఇష్టాపూర్తాదికర్మములాచరించినవారు చంద్రమండలమును బొందుదురనియు నచ్చటభోగముల ననుభవించి మరల భూలోకమునకు దిగివత్తురనియుఁ జెప్పఁబడినది. దిగివచ్చుట "అథైతమే వాధ్వానంపునర్నివర్తన్తే యథేత మాకాశం,

ఆకాశాద్వాయుం. వాయుర్భూత్వా ధూమో భవతి, ధూమో భూత్వా అభ్రం భవతి, అభ్రం భూత్వా మేఘో భవతి, మేఘో భూత్వా ప్రవర్షతి. (ఛాం. 5-10-5) అని చెప్పఁబడినది. (అర్థము) చంద్రమండలమునుండి దిగిపోవుచుంటిమే యని దుఃఖముకలవారై, వెళ్లినరీతినే యామార్గము ననుసరించియే తిరిగివత్తురు. ఆకాశమును, ఆకాశమునుండి వాయువునుబొందును. వాయువై ధూమమగును. ధూమమై అభ్రమగును, అభ్రమై మేఘమగును. మేఘమై వర్షించును. అని.

ఇందు- చంద్రమండలమునుండి తిరిగివచ్చునీతఁడు, ఆకాశము, వాయువు ధూమము, అభ్రము, మేఘమునై పోవునని చెప్పఁబడుచున్నది. నిజముగా ఆకాశాదిస్వరూపమునే పొందునా? లేక తత్సాదృశ్యమును బొందునా? యని సందేహము కలుఁగగా, తత్సాభావ్యమును అనఁగా తత్సాదృశ్యమునుబొందునుగాని తత్తాదాత్మ్యమును (తద్రూపత్వమును) బొందఁడని నిర్ణయించుచున్నారు. ఏమన-ఒకఁడింకొకని సామ్యమును బొందునేగాని తత్స్వరూపమునే పొందలేఁడు. ఒకవేళ అట్లు ఆకాశరూపమును బొందినయెడల వాయురూపమును, ధూమాభ్రాదిరూపములను నెట్లు బొందును. కనుక, దిగివచ్చుటలో దుఃఖతప్తుఁడగునుగాన కరిగిపోయి యాకాశమువలె సూక్ష్మరూపమును, క్రమక్రమముగా వాయు ధూమాభ్రమేఘరూపములఁబొంది వర్షరూపమున భూమికి దిగునని భావము.

### 5 నాతిచిరాధికరణము.

### నాతిచిరేణ విశేషాత్. 23

చంద్రమండలమునుండి దిగినచ్యుతజీవుఁడు ఆకాశవాయుధూమాభ్రమేఘసాదృశ్యములనుబొంది కొంతకాలమైనా సాదృశ్యముతోనుండుననఁగా విశేషాత్=విశేషమువలన, నాతిచిరేణ= శీఘ్రకాలములోనే యుత్తరోత్తర సాదృశ్యమును బొందుననియర్థము.

ఆకాశవాయ్వాదిసాదృశ్యము పొంది చిరకాలమక్కడ యుండఁడు. శీఘ్రముగా నుత్తరోత్తరసాదృశ్యమునుబొందుచు వర్షరూపమున భూమిపైఁబడి, వ్రీహి (సస్య) భావమును బొందును. అటుతరువాత "అతోవై ఖలుదుర్నిష్ప్రపతరమ్" (ఛాం 5-10-6) ఈవ్రీహిభావమునుండి జీవుఁడుమనుష్యరూపమును బొందుట చాలకష్టము. చాల యాలస్యము, అని విశేషమును చెప్పుటచే పూర్వరూపములందు ఆలస్యములేదని తెలియుచున్నది. ఈజీవునికి ఈసందర్భములో స్థూలశరీరములేదుకావున, చిరకాలస్య నాలస్యములే కష్ట సుఖములు.

### 6 అన్యాధిష్ఠితాధికరణము- (24-27)

### అన్యాధిష్ఠితేషు పూర్వవదభిలాపాత్. 24

అన్యాధిష్ఠితేషు= ఇతరజీవులచేనధిష్ఠింపఁబడిన వ్రీహియవాదులందు, పూర్వవత్ = వెనుక చెప్పిన ఆకాశవాయ్వాదు

లందువలె సంబంధమాత్రమే కాని, కర్మానుభవము లేదు. ఎందుచేత? పూర్వవదభిలాపాత్. వెనుకటి వానియందువలెనే చెప్పుటచేత. ఇచట పూర్వవత్-అన్న దానికి వెనుకకు ముందు నకుఁ గలిపి యర్థద్వయాభిప్రాయముగ వ్యాఖ్యానము చేయఁ బడినది.

చంద్రమండలమునుండి దిగివచ్చువారు, వర్షరూపమున నేలపైఁ బడిన తరువాత, "త ఇహ వ్రీహియవా ఓషధివనస్పతయః తిలమాషా ఇతి జాయన్తే" (ఛాం 5-10-6) వ్రీహి, యవ ఓషధి, వనస్పతి, తిల, మాష, రూపములలో జన్మింతురు. అని చెప్పఁబడినది. ఇందు- ఇష్టాపూర్తాది పుణ్యకర్మములుచేసి చంద్రలోకమున భోగములనుభవించితిరిగివచ్చు వీరు, పాపాత్ములవలె, వ్రీహియవాది హీనరూపములఁ బొందుదురా? యను సందేహము కలుగ నీయధికరణమున నిర్ణయింపఁ బడుచున్నది.

వీరు, పాపాత్ములవలె వ్రీహియవాది నీచజన్మములను బొందరు. కాని తాముపొందఁబోవు జన్మములకుఁ బోవుచు మార్గమధ్యమున నన్యాధిష్ఠితములైన యీవ్రీహియవాదుల యందుఁ దలదాచుకొనుచుఁబోవుదురు. ఎవ్వరోజీవులు తమ పాపకర్మములకు ఫలముగా నీ వ్రీహియవాది రూపములఁ బొందియుండ నందు వీరుసంసర్గమాత్రమును బొందుదురే కాని యందలి సుఖదుఃఖములను బొందరు. సుఖదుఃఖములను-

బొందుటకు "రమణీయచరణాః, కపూయచరణాః" అని వారు చేసిన సుకృతదుష్కృత కర్మములను బరామర్శించుచు. వీరు ఆకాశవాయ్వాదిరూపములఁ బొందుటలో నేవిధముగ కర్మసంబంధము నెట్లులేదో యట్లే వ్రీహియవాదిరూపములందును కర్మసంబంధములేదు. అందుచే వ్రీహియవాదులుకోయఁబడినను నరుకఁబడినను భక్షింపఁబడినను కలుగుబాధలు వీరికి కలుగవు. మార్గవశమున కేవలసంశ్లేషమునుమాత్రమే పొందుచు భావిభోగస్థానమును బడయుదురు.

అశుద్ధమితిచేన్న శబ్దాత్. 25

అశుద్ధం, ఇతి, చేత్, న, శబ్దాత్.

అవ:- చంద్రమండలమును బొందుటకై వీరుచేసిన యజ్ఞాది(ఇష్టాపూర్తాది) కర్మములలోఁ బశుహింసనముండుట చేత, నాకర్మముపరిశుద్ధమైనదికాదు. అపరిశుద్ధము. అందుచేత నీచంద్రమండలమునుండి తిరిగివచ్చువారు, వ్రీహియవాదిరూపమునుబొందుట సంబంధమాత్రముకాదు కర్మానుగుణమే యున్నచో నట్లుకాదని నిర్ణయింపఁబడుచున్నది.

అశుద్ధమితిచేత్ = జ్యోతిష్టోమాది యజ్ఞకర్మము అపరిశుద్ధమైనదియున్నచో, న = అట్లుకాదు. శబ్దాత్ = శబ్దము వలన, విధిరూపముగ వేదమువలన నాహింస ధర్మమనిచే

తెలియుచున్నది. "నహింస్యాత్సర్వాభూతాని" అని సామాన్యముగ హింస అధర్మమని చెప్పినను, "అగ్నీషోమీయం పశుమాలభేత" అని పశ్వాలంభనమునుగూడ వేదము చెప్పుచున్నది. అందుచే నది యశుద్ధముకాదు.

### రేతస్సిగ్యోగోఽథ. 26

రేతస్సిగ్యోగః, అథ.

అథ = తరువాత, రేతస్సిగ్యోగః = రేతస్సును విడుచునట్టి వానియొక్క యోగము (భావము) కలుగును.

చంద్రమండలమునుండివచ్చు నాతఁడు వ్రీహ్యాదిభావమునుబొందినపిదప రేతస్సేకము చేయుపురుషుని భావమును బొందును. "యో యోహ్యన్న మత్తి యో రేతః సించతి తద్భూయఏవభవతి" (ఛాం5-10-6) వ్రీహిభావమును నన్నరూపమునుబొంది పురుషునిచేఁదినఁబడి యాతనిలోఁబ్రవేశించి, తద్భావమును బొందును. అనఁగా నతనిలో సంసర్గరూపమున నుండును.

### 27 యోనేశ్శరీరమ్.

యోనేః, శరీరమ్.

యోనేః = యోనినుండి, శరీరం = శరీరమునుబొందుచున్నాఁడు.

చంద్రమండలమునుండివచ్చు నాతఁడు క్రమక్రమముగా వ్రీహి, అన్న రేతో రూపములఁ బొందును, ఆ రేతస్సు పురుషునిచే స్త్రీయోనియం దుంచఁబడి నపుడు ఆ యోనినుండి, ఫలోపభోగయోగ్యమగు శరీరమును బొందును. "తద్య ఇహరమణీయ చరణాః రమణీయాం యోనిమాపద్యన్తే" పుణ్యకర్మములుచేసినవారు పుణ్యమైన జన్మమును బొందుదురు, అని చెప్పుటచే, చంద్రమండలాది స్వర్గలోకమునుండి భోగావసానమున భూలోకమునకు వచ్చువారు ఆకాశవాయుధూమాభ్రాది సాదృశ్యమునొంది వర్షరూపమున భూలోకమునకుఁ జేరి వ్రీహియవాది రూపమును నన్నరూపమును రేతోరూపమునుబొంది భూలోకమున భోగముల ననుభవించుటకుత్తమ జన్మమును బొందుదురు. ఆశరీరమును బొందిన తరువాత వీరికి ఫలోపభోగమేకాని మార్గమధ్యమున సంశ్లేషమాత్రమునయున్న వ్రీహియవాదులయందు ఫలోపభోగములేదు.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి కృతమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్ర వృత్తియందుఁ
దృతీయాధ్యాయమునఁ
బ్రథమ పాదము.
అధి-6, సూ-27

---

శ్రీ రస్తు

# బ్రహ్మ సూత్రార్థ దీపిక

## తృతీయాధ్యాయ ద్వితీయ పాదము

### సంధ్యాధికరణము. (1-6)

### సంధ్యే సృష్టి రా[illegible] హి.

అవ:- పూర్వపాదములోఁ బంచాగ్ని విద్య, జీవుఁడు కర్మ ఫలోపభోగమునకై చంద్రమండలమునకుఁ బోవుట, భోగానంతరము తిరిగివచ్చుట, జన్మప్రాప్తి, వివరింపఁబడినవి. కర్మఫలము [illegible]రూప మగుటచేతను, మఱల జన్మ హేతువగుటచేతను దుఃఖాకరమైనదని మనుజునకు విరక్తి కలుగును. అట్లు విరక్తుఁడైన వానికిఁ దత్, త్వం పదార్థములను దెలుపుటకై యీ ద్వితీయపాద మారంభింపఁబడుచున్నది. కాన నీరెండు పాదములకు హేతు హేతుమద్భావ సంగతి కలదు. ఇందు "నస్థానతో౽పి" అను 11వ సూత్రమువఱకు 'త్వం' పదార్థ నిరూపణము చేయఁబడును. తరువాత తత్పదార్థ వివేకము తెలుపఁబడును. ఈ యధికరణములో జీవుఁడు స్వయంప్రకాశుఁడని తెలియుటకై "స్వప్నసృష్టి మిథ్య" యని నిరూపింపఁబడుచున్నది. జాగ్రదవస్థయందు సూర్యప్రకాశ సాంకర్యమువలన ఆత్మయొక్క స్వప్రకాశత్వము తెలియఁ బడదు. స్వప్నమందు సూర్యాది ప్రకాశ ముండదు. కనుక స్వప్నము స్వయంప్రకాశత్వమునకు సాధకము.

బృహదారణ్యకములో "యత్రప్రస్వపితి" అని ప్రారంభించి "న తత్రరథా నరథయోగా నపంథానో భవన్తి. అథ రథాన్ రథయోగాన్ పథ స్సృజతే" (బృ4-3-10) అనియున్నది. ఇందు జాగ్రదవస్థలోవలె స్వప్నమందలి సృష్టియు యథార్థమైనదా? మాయామాత్రమా? అని సందేహము కలుగఁగా నిర్ణయించుటకీయధికరణ మారంభింపబడినది. ఇది పూర్వపక్ష సూత్రము.

సంధ్యే, సృష్టిః, ఆహ. హి. సంధ్యే=స్వప్నమునందు, సృష్టిః=సృష్టి. యథార్థమైనది. హి=ఎందుచేతననఁగా ఆహ =వేదమే చెప్పినదికనుక.

జాగ్రదవస్థకు సుషుప్త్యవస్థకు మధ్యను సంధిలో నున్నదగుటచే సంధ్య మనఁగా స్వప్నమని యర్థము. స్వప్నమందలి సృష్టి పరమార్థమైనది. వేదములో స్వప్నము నుపక్రమించి స్వప్నమునందు రథములు, రథయోగములు, రథమార్గములును లేవు. రథములను రథయోగములను రథమార్గములను సృజించుచున్నాఁడు, అని చెప్పుటచే నీసృష్టి యథార్థము.

నిర్మాతారంచైకే పుత్రాదయశ్చ. 2

ఏకే=కొందఱు, నిర్మాతారంచ=నిర్మాతనుగాఁగూడ, చెప్పుచున్నారు. ఈస్వప్నమందుఁ గామములను నిర్మించువానినిగా, బరమాత్మను దెలుపుచున్నారు. పుత్రాదయశ్చ = పుత్రులు మొదలగువారున్ను కామములే.

“య ఏషు సుప్తేషు జాగర్తి కామం పురుషో నిర్మిమాణః” అని శ్రుతి కలదు. చక్షురాదీంద్రియము లన్నియు సుప్తములై (నిర్వ్యాపారములై) యుండఁగా నెవ్వఁడు ప్రతి కామమును నిర్మించుచు మెలకువతో నున్నాఁడో, అని యర్థము. ఇందలి కామపదమునకు కామ్యన్త ఇతి కామాః అను వ్యుత్పత్తిచేఁ బుత్రాదులన్న అర్థమే యగునుగాన, స్వప్నమందు పుత్రాదిసృష్టికర్త యని పరమాత్మను చెప్పుచున్నారు. అందుచే స్వప్నసృష్టి యీశ్వరకర్తృక మగుటచే మిగిలిన ఆకాశాదిసృష్టివలె సత్యమైనదని తాత్పర్యము.

మాయామాత్రంతు కార్త్స్న్యేనానభివ్యక్త
స్వరూపత్వాత్. 3

మాయామాత్రంతు= స్వప్నమునందలి సృష్టిమాయామాత్రము. ఎందుచేతననగా, కార్త్స్న్యేన = పూర్తిగా అనగా తగిన దేశకాలాదిసంపదతో నిర్బాధితముగా, అనభివ్యక్తస్వరూపత్వాత్ = అభివ్యక్తమైన స్వరూపముకలది కాకపోవుటవలన, స్వప్నసృష్టి శుక్తిరజతమువలె మాయామాత్రము. యథార్థము కాదు. రథములను రథమార్గములను సృజించుచున్నాఁడని చెప్పితిరే, శరీరము లోపలనున్న యీచిన్న హృదయదేశమునందు రథములు పట్టుటయెట్లు? రథమార్గములు కల్పించుటయెట్లు? శరీరమునుండి బయటికివెళ్లి యే యీసృష్టి చేయుచున్నాఁడందమనినను, కొన్ని నెలలతరబడి చేసినఁగాని సిద్ధములు కాని యీ రథాదులు రథమార్గములు

నిర్మించిన యీస్వల్పకాలములో సృష్టించుట యెట్లు? ఈతఁడు నిద్రించినచోటనే యుండెనుగాని యెచ్చటికిని బోయినట్లులేదు. ఇట్టికారణములచే స్వప్నసృష్టి మాయామాత్రమే అనవలయును. శ్రుతికూడ, రథములునులేవు. రథమార్గములునులేవు. అనియే చెప్పుచున్నది.

సూచకశ్చ హి శ్రుతే రాచక్షతేచ తద్విదః. 4

శ్రుతేః = వేదమువలన, సూచకశ్చహి = స్వప్నము, శుభాశుభసూచకమైనది అని తెలియుచున్నది. తద్విదః=ఆస్వప్నాధ్యాయమెఱిగినవారు ఆచక్షతేచ= చెప్పుచున్నారుకూడను. గజారోహణాది స్వప్నములు శుభములనియు, ఖరయానాదు లశుభములనియు స్వప్నవేత్తలు చెప్పుచున్నారు.

"యదా కర్మసు కామ్యేషు స్త్రియం స్వప్నేషు పశ్యతి సమృద్ధిం తత్ర జానీయాత్ తస్మిన్ స్వప్ననిదర్శనే" (ఛాం-5-2-9) కామ్యకర్మముల నొనర్చుకాలమున స్వప్నములందు స్త్రీని దర్శించినచో నాకర్మములందు సమృద్ధికలుగునని యర్థము. అని శ్రుతిచెప్పుచుండుటచే, స్వప్నము సత్యములైన శుభాశుభములను సూచించుచున్నది. స్వప్నవేత్తలు గజారోహణాది స్వప్నములు శుభఫలదాయకములనియు ఖరారోహణాదిస్వప్నములు అశుభఫలదాయకము లనియును చెప్పుచున్నారు. కనుక స్వప్న మసత్యము, మాయామాత్రము నైనచో సత్యవిషయము నెట్లుచెప్పును? అనియనుకొనరాదు.

స్వప్నము "సూచకశ్చహి" సూచకమైనదికదా! సూచకము సత్యముకాకున్నను సూచ్యము సత్యమగుట విరుద్ధముకాదు. శుక్తిరజతము సత్యముకాకున్నను సత్యహర్షమును గలిగించుచున్నది.

పరాభిధ్యానాత్తు తిరోహితం తతో హ్యస్య బంధవిపర్యయౌ

అవః- ఈశ్వరుఁడు సంకల్పమాత్రమున జగత్తును సృష్టించుచున్నట్లు ఈశ్వరాంశమైన జీవుఁడును సంకల్పమాత్రమున స్వప్నజగత్తును సృష్టించుచున్నాఁడు అనరాదా? స్వాప్న సృష్టి మిథ్యయని యేల యనవలయును?

పరాభిధ్యానాత్, తు, తిరోహితం, తతః, హి, అస్య బంధవిపర్యయౌ॥ విస్ఫులింగము (నిరుసు) అగ్ని యంశమైనట్లు జీవుఁడు ఈశ్వరాంశమే యగును. అయినను, సంకల్పమాత్రమున నీతఁడు స్వప్నజగత్తును సృష్టించుచున్నాఁడని యనఁగూడదు. ఏమన?- తిరోహితం= జీవుఁడీశ్వరునితో సమానముగు శక్తి కలవాఁడైనను, ఆశక్తి ఇపుడు తిరోహితమైనది. అవిద్యాది వ్యవధానమువలన నంతర్హితమైనది. పరాభిధ్యానాత్ + తు= పరమేశ్వరునియొక్క నిరంతరధ్యానమువలన నవిద్య తొలఁగి యాశక్తి యావిర్భవించును. అస్య=ఈజీవునికి, తతో హి= ఆయీశ్వరునివల్లనేగదా, బంధవిపర్యయౌ= బంధమోక్షములు గలుగుచున్నవి.

జీవుఁ డీశ్వరాంశమే యైనను తత్సమానశక్తి కలవాఁడైనను నీజీవావస్థలో నవిద్యావశమున నాశక్తి యంతర్హిత మైనది. అది "అహం బ్రహ్మాస్మి"యను నభేదాభ్యాసరూపధ్యానము వలనఁగాని మరలఁగలుగదు. ఆయీశ్వరునివలననే యీతనికి బంధమోక్షములు గలుగుచున్నవి. ఈశ్వరస్వరూపమును గుర్తింపకపోవుటచే బంధమున్ను గుర్తించుటచే మోక్షమున్ను కలుగుచున్నవి. "జ్ఞాత్వా దేవం సర్వపాశాపహానిః" అని శ్రుతిచెప్పుచున్నది.

దేహయోగాద్వా సోఽపి. 6

అవ :- జీవుని కీశ్వరత్వ మేల తిరోహిత మగుచున్నది?

సోఽపి = ఆ యీశ్వరత్వతిరోభావమున్ను, దేహయోగాత్ = దేహేంద్రియాది సంయోగమువలన ఈజీవునికి గలుగుచున్నది.

నివురుగప్పుటవలన నిప్పునకు ప్రకాశనశక్తి తిరోహితమైనట్లు దేహేంద్రియాది సంయోగమువలన జీవునకు ఈశ్వరత్వము (జ్ఞానైశ్వర్యశక్తి) తిరోహితమగుచున్నది. "సేయం దేవ తైక్షత" అనేన జీవేన ఆత్మనా ఽనుప్రవిశ్య "తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో" మొదలగు పెక్కుశ్రుతుల వలన జీవేశ్వరుల కభేదము చెప్పఁబడుటచే జీవేశ్వరులు విభిన్నులుకారు. కాని జీవునికి దేహయోగమువలన నీశ్వరత్వశక్తి

తిరోహిత మగుచున్నది. ఆకారణముచే జీవుఁడు సంకల్పమాత్రమున స్వప్నమందు రథాదిసృష్టి చేయుచున్నాఁడనుట సమంజసముకాదు. అది మిథ్యయే యనవలెను. మిథ్యకానిచోఁ దనంతఁదాను జేసికొనుసృష్టిలోఁ దన కనిష్టఫలదాయకములగు దుస్స్వప్నముల సృష్టిని గూడ నేలచేసికొనును? కాన స్వప్న సృష్టి మాయామాత్రము.

## 2 తదభావాధికరణము. (7-8.

తదభావో నాడీషు తచ్ఛ్రుతే రాత్మనిచ.

అవ :- స్వప్నావస్థ మాయామాత్రమని నిరూపించి దానితరువాతిదగు సుషుప్త్యవస్థను బరీక్షించుచున్నారు.

తత్ + అభావః = తదభావః = ఆ స్వప్నదర్శనము యొక్క యభావరూపమగు సుషుప్త్యవస్థ, నాడీషు = నాడుల యందును, తత్ + శ్రుతేః = అట్టిశ్రుతియుండుటవలన ఆత్మనిచ = ఆత్మయందును గలుగును.

సుషుప్తినిగుఱించి "త ద్యత్రైత త్సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నం నవిజానాతి ఆసు తదా నాడీషు సృప్తో భవతి" ఛాం8-6-3 స్వప్నము నెఱుఁగక నిద్రించినపుడు నాడులయందు వ్యాపించినవాఁడై యుండును. -అనియొక్కచోటను,

"తాభిః ప్రత్యవసృప్య పురీతతి శేతే" (బృ2-1-19) ఆనాడులతో వ్యాపించి పురీతత్తునందు నిద్రించుచున్నాఁడు,

అని యొకచోటను, "య ఏషోఽన్తర్హృదయ ఆకాశః తస్మిన్ శేతే" (బృ2-1-17) హృదయములోపల నున్న యాకాశమున నిద్రించుచున్నాఁడు అని యొకచోటను చెప్పఁబడియున్నది. ఇట్లు వివిధములగు స్థానములను చెప్పుటచేత సుషుప్తిస్థానము నాడులా? పురీతత్తా? హృదయాకాశరూపుఁడగు పరమాత్మయా? లేక యీమూఁడును కలిసియా? అని సందేహము కలుగఁగా నాడులందును, పురీతత్తునందును, ఆత్మయందును సుషుప్తి కలుగునని సముచ్చయముగా నీమూఁడును సుషుప్తిస్థానములని చెప్పుచున్నారు. పైఁ జెప్పిన శ్రుతులయందు ఆధారత్వము కనఁబడుటచే నాడీ ద్వారా పురీతత్తునందుఁ బ్రవేశించి బ్రహ్మయందు నిద్రించుచున్నాఁడు. పురీతత్తు అనఁగా హృదయమునకుఁ బ్రాకారమువంటి యొకకోశము.

అతః ప్రబోధోఽస్మాత్ . 8

అతః = ఈకారణమువలన, (ఆత్మయందే నిద్రించియున్న కారణమువలన అస్మాత్ = ఈయాత్మనుండియే, ప్రబోధః = మెలకువ కలుగుచున్నది.

నాడులద్వారా పురీతత్తునుబొంది తద్ద్వారా హృదయములోనున్న ఆత్మయందు నిద్రించుచున్నాఁడు కనుకనే మరల మెలకువపొందునపుడు ఆత్మనుండియే మెలకువపొందుచున్నాఁడని "ఏతస్మా దాత్మనః సర్వే ప్రాణాః ప్రముత్తిష్ఠంతి" అని శ్రుతిలోఁ జెప్పఁబడినది. నాడులు, పురీతత్తు ప్రత్యేకముగా

సుషుప్తిస్థానములైనచో నచ్చటనుండి ప్రబోధమును బొందు చున్నట్లు చెప్పవలయునుగదా!.

స్వప్నము మిథ్యాజ్ఞానమని చెప్పుటచేతను సుషుప్తిలో నామిథ్యాజ్ఞానము లేదుకనుకను సుషుప్తి మిథ్యాజ్ఞానాభావ మాత్రమునఁ గొలదిగ బ్రహ్మసంపత్తి కలది యగుచున్నది. అనఁగా జీవుఁడు సుషుప్తిలో బ్రహ్మభావమునుబొందు నని తేలుచున్నది. సంపూర్ణముగా నజ్ఞానము నివర్తించినచో జీవుఁడు బ్రహ్మత్వమును బొందుననుట సిద్ధమైనదే.

3 కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము.

అవ:— పరమాత్మ సకాశమునుండి జీవుఁడు మెలకువ బొందుచుండుటచేఁ బరమాత్మయే సుషుప్తిస్థానమని నిర్ణయింపుట సరిగాలేదు. ఏమన సుషుప్తిపొందిన జీవుఁడే మరల లేచుచున్నాఁడని యెట్లు చెప్పఁగలము? సముద్రములో నొక జలబిందువును వేసి మరలఁ దీయఁబూనినచో నా జలబిందువే వచ్చునని చెప్పఁగలమా! అదియేవచ్చునో మఱియొకటి వచ్చునో! ఏమి తెలియును? అట్లే సుషుప్తినొందిజీవులు పరమాత్మను బొందినపుడు మేలుకొనుటలో నా జీవుఁడేయని చెప్పుట యెట్లు? మఱియొక జీవుఁడు మేలుకొని రావచ్చును గదా! అననీయధికరణ మారంభింపఁ బడుచున్నది.

స ఏవతు కర్మానుస్మృతి శబ్దవిధిభ్యః 9

కర్మ, అనుస్మృతి, శబ్ద, విధిభ్యః=కర్మము, అనుస్మృతి, శబ్దము, విధి, యను హేతువులవలన, సఏవతు= నిద్రించినయాజీవుఁడే సుషుప్తినుండి లేచుచున్నాఁడు. మఱియొకఁడు కాఁడు. ఇచ్చటఁ గొందఱు, కర్మ, అను,=ప్రత్యభిజ్ఞ, స్మృతి, శబ్ద, విధి, అవియైదు హేతువులనుగా విభజించిరి.

కర్మ:- నిన్నటిదినమున నొకపనిని ప్రారంభించి కొంత చేసి సుషుప్తిచెందినజీవుఁడు లేచి యీదినమున మరల ఆపనిని బూర్తిచేయుచున్నాఁడు. కావున నాతఁడే యీతఁడు కాని యన్యుఁడుకాఁడు. ఒకఁడు పగలుచేసియుంచిన పనిలో మఱియొకఁడు తనంతఁదాను బరిచితునివలెఁ బ్రవేశించి చేయలేఁడు.

అనుస్మృతి:- అను, స్మృతి, యనిరెండుగా విడఁదీసి చెప్పుదు. అను:- అనఁగా ప్రత్యభిజ్ఞ- ఏ నేను నిన్న కాశీనాథుని జూచితినో ఆ నేను నేఁడు మణికర్ణిక యందుంటిని. అని యనుకొనుట, రాత్రి సుషుప్తిచెంది లేచియును నిన్న ఏ నేను- నేఁడు ఆ నేను-అని యొక్కనిగనే తలఁచుచున్నాఁడు. ప్రబోధమునొందినవాఁ డన్యుఁడైనచో నిట్టి ప్రత్యభిజ్ఞ కుదరదు. అనుస్మృతి:- యని రెంటికీయున్నవాఁడు- "నిన్నటి దినమున నేను విశ్వేశ్వరుని దర్శించితిని. ఆతఁ డెంత చక్కనివాఁడు అనియుదాహరణము. ఇందు పూర్వానుభూతస్మరణము చేయు

చున్న వ్యక్తి పూర్వానుభవము పొందిన వ్యక్తికంటె, అన్యుఁడనుట తగదు. అనియర్థము.

శబ్దః— శబ్ద మనఁగా వేదము. వేదములో "పునఃప్రతిన్యాయం ప్రతియోన్యా ద్రవతి బుద్ధాన్తాయైవ" (బృ 4.3.14 అని చెప్పఁబడినది. నిద్రించినవాఁడు, జాగరముకొఱకు ప్రతి నియతమైన గమనము కలుగునట్లుగా, శరీరమును గుఱించి వచ్చుచున్నాఁడు. అనియు, "సర్వాః ప్రజాః అహరహర్గచ్ఛన్త్యః ఏతం బ్రహ్మలోకం నవిందంతి" (ఛాం. 8.3.2) సమస్త జీవులు ప్రతిదినము సుషుప్తియందుఁబొందుచున్నను నీబ్రహ్మలోకము నెఱుఁగరు. "త ఇహ వ్యాఘ్రోవా సింహోవా వృకోవా వరాహోవా (ఛాం 6.9.3) సుషుప్తినొందినపుడు వ్యాఘ్రముకాని, సింహముకాని, వృకము (తోడేలు) కాని, వరాహముకాని యేదయినను పరబ్రహ్మస్వరూపము నేపొందు చున్నది. మేల్కాంచినతరువాత పులి-పులి, సింహము సింహము ఏ ప్రాణి యాప్రాణియగును" అనియుఁ జెప్పఁబడినది. దీనిని బట్టియును మేల్కాంచినజీవుఁడు నిద్రించిన జీవుఁడే యగును.

విధిః— అనఁగా కర్మములను (జ్యోతిష్టోమాదులను) విద్యను (జ్ఞానమును) విధించు విధులు.

నిద్రనుండి మేల్కాంచినవాఁడు మఱియొకఁడన్నచోఁ గాలాంతరమందు ఫలమొసఁగువిధి వాక్యములు వ్యర్థములే

యగును. నిద్రపోయిన (సుషుప్తినొందిన) ప్రతిజీవుఁడు ముక్తుఁ డగును. ముక్తినొందుటకై చెప్పఁబడిన యోగాదివిధులు నిరర్థకములగును. జలబిందుదృష్టాంతములో వివేచనచేయు నేర్పు మనకులేకున్నను సుషుప్తిప్రబోధముల విషయములో కర్మ, అవిద్య, యను కారణమువలన వివేచనముచేయవగును. కనుక మేల్కొనువాఁడు ఆ నిద్రించినయాతఁడే కాని యన్యుఁ డుకాఁడు.

4 ముగ్ధేర్ధసంపత్త్యధికరణము 10.

ముగ్ధేర్ధసంపత్తిః పరిశేషాత్ . 10

అవ:- జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడవస్థలు వర్ణింపఁబడినవి. ముగ్ధావస్థయని మూర్ఛపొందినవానిని గుఱించి చెప్పెదరు. ఆ యవస్థ ఈ మూడవస్థలలో నంతర్భూత మైనదా? అతిరిక్తమైనదా? అన నీయధికరణమున వివరింపఁ బడుచున్నది.

పరిశేషాత్ = పరిశేషన్యాయమున, ముగ్ధే=మూర్ఛ నొందిన వాని యందు, అర్ధసంపత్తిః = సగమును బొందుట మాత్రమేకలదు.

మూర్ఛితునికి విశేషవిజ్ఞానములేదుకనుక మూర్ఛావస్థ జాగ్రత్స్వప్నావస్థలలో నంతర్గతముకాదు. సుషుప్త్యవస్థలోఁ గూడ నంతర్గతముకాదు. సుషుప్త్యవస్థలో సుఖము నిర్వి

లముగనుండును. ఉచ్ఛ్వాసములు సమప్రమాణములుగనుండును. కన్నులు మూసికొనియుండును. కొంచెముకదిపిన మేల్కొనును. మూర్ఛావస్థలో ముఖము భయంకరముగనుండును. ఉచ్ఛ్వాసనిశ్వాసములు విపరీతముగానుండును. కన్నులు భయంకరముగఁ బెద్దవిగానుండును. జీవించునా! జీవింపఁడా! అనుసందేహములో నుండును. అందుచేత నీమూర్ఛ సుషుప్తిలోఁ జేరదు. జీవితావస్థలో సగము మరణావస్థలో సగము పరిస్థితికల యీమూర్ఛావస్థ యతిరిక్తమైనది.

### 5 ఉభయలింగాధికరణము. (11-21)

అవ॥ స్వప్రకాశుఁడు. సర్వావస్థావినిర్ముక్తుఁడు, నిర్విశేషుఁడునైన త్వంపదార్థభూతుని ఉద్దేశించి తత్పదార్థభూతుని విధించుటచే ముందుగ నుద్దేశ్యభూత, త్వంపదార్థవిమర్శనముచేసి యిక దత్పదార్థమును నిరూపించుచు నతనికినిర్విశేషత్వమును నిరూపించుచున్నారు.

న స్థానతోఽపి పరస్య ఉభయలింగం సర్వత్ర హి. 11

శ్రుతులలో "సర్వకామ స్సర్వగంధ స్సర్వరసః" అని సవిశేషవచనములు. "అస్థూల మనణు," అశబ్ద మస్పర్శమరూపమ్" అని నిర్విశేషవచనములును గనఁబడుచుండుటచే బ్రహ్మ సవిశేషమా? నిర్విశేషమా? ఉభయవిధ శ్రుతివచనములవలన నుభయరూపమా? (మూర్ఛావస్థ సుషుప్తిమరణా

వస్థల రెండింటి ధర్మములను గలిగి యున్నట్లు బ్రహ్మస్వరూపము సవిశేష నిర్విశేష రూపములు రెండును గలిగినదా? అని సంశయముకలుగ వారించి నిర్ణయించుట కీయధికరణమారంభింపఁబడినది.

పరస్య = పరబ్రహ్మకు, స్థానతోఽపి = ఉపాధివలనఁ గూడ, ఉభయలింగం = ఉభయరూపత్వము, న = లేదు; ఒక్కనికి యథార్థముగ, విరుద్ధములగు రెండు రూపములుండుట యసంభవము కనుక ఉభయరూపత్వము లేదు. ఏకరూపమే యున్న అది సవిశేషమా! నిర్విశేషమా? అన్ననది నిర్విశేషరూపము. ఎందుచేత? సర్వత్రహి = బ్రహ్మప్రతిపాదక సందర్భములందంతటను "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం" (కాఠ-3-15) అని నిర్గుణస్వరూపమే ముఖ్యముగ నిరూపింపఁబడినది.

న భేదా దితిచేన్న ప్రత్యేక మతద్వచనాత్. 12

భేదాత్ = "చతుష్పాద్బ్రహ్మ" "షోడశకలంబ్రహ్మ" అని భేదముగాఁ జెప్పుటవలన, న=బ్రహ్మనిర్విశేషమే యనుట కూడదు, ఇతిచేత్ = అన్నచో, న = కాదు, అట్లనరాదు ప్రత్యేకం = వేఱుగా (ఔపాధికముగా) అతద్వచనాత్ = ఆ భేదమును జెప్పక పోవుటవలన (అభేదమునే చెప్పుటవలన) "యశ్చాయ మస్యాం పృథివ్యాం తేజోమయః అమృతమయః

పురుషో యశ్చాయ మధ్యాత్మగ్ం శారీర స్తేజోమయో ఒమృతమయః పురుషో యమేవ స యోయ మాత్మా" (బృ 2-5-1) అని బ్రహ్మకు పృథివ్యాది సర్వోపాధుల యందును వభేదమే చెప్పఁబడుచున్నది. ఈ పృథివియందుఁ దేజోమయుఁడు నాశరహితుఁడు నగు ఏపురుషుఁడు గలఁడో దేహము నాశ్రయించి యున్న యే జీవుఁడు గలఁడో అతఁడే సర్వకారణభూతుఁ డగు పరమాత్మ. అనియర్థము.

అపి చైవ మేకే. 13

అపిచ = మఱియు ఏకే = కొందఱు, ఏవం = ఈమాదిరిగనే చెప్పుచున్నారు. కఠశాఖీయులు భేదమును నిందించుచు బర బ్రహ్మ కభేదమునే చెప్పుచున్నారు. "మనసై వేద మాప్తవ్యం నేహ నానాస్తి కించన మృత్యోః స మృత్యు మాప్నోతి య ఇహ నానేవ పశ్యతి" (కా.4-11) శాస్త్రము చేతను ఆచార్యోపదేశముచేతను సంస్కరింపఁబడిన మనస్సు చేతనే పరబ్రహ్మస్వరూపము తెలిసికొనఁదగినది. బ్రహ్మస్వరూపమును దెలిసికొన్న తరువాత భేదబుద్ధిలేదు. అజ్ఞానవశము చేత నద్వయుఁడైన బ్రహ్మను నానారూపముగాఁ దలఁచిన వతఁడు మఱల మఱలజనన మరణములను బొందుచుండును.

అరూపవ దేవహి తత్ప్రధానత్వాత్ 14

అరూపవదేవ=పరబ్రహ్మము రూపము లేనటువంటిదే హి = ఎందుచేతననగా, తత్ప్రధానత్వాత్ "అస్థూలమనణు"

మున్నగు నిషేధవచనములు నిర్గుణబ్రహ్మ ప్రతిపాదన పరము లగుటవలన.

పరబ్రహ్మము రూపరహితము నిర్విశేషము నిర్గుణము అనియే చెప్పవలెను. "అస్థూల మనణు, అశబ్ద మస్పర్శం మున్నగు శ్రుతివచనములు నిర్గుణబ్రహ్మను జెప్పునవియే. సగుణ ప్రతిపాదక శ్రుతులు ఉపాసనాపరములు. వాక్యభేదము గలుగునుగాన ఉపాసనా వాక్యములును సవిశేషత్వమునఁ దాత్పర్యముకలవి కావు. కావున బ్రహ్మకు సవిశేషత్వము ప్రామాణికము కాదు.

## ప్రకాశవ చ్చావైయర్థ్యాత్. 15

పరబ్రహ్మకు ఆకారముకలదని చెప్పిన శ్రుతులు వ్యర్థములగునే యని శంకగలుగఁ జెప్పఁబడుచున్నది.

ప్రకాశవచ్చ = సూర్యచంద్రాది ప్రకాశమువంటిది యగుటవలన, అవైయర్థ్యాత్ = వ్యర్థములగునననది లేదు. కావున నిరర్థకములుకావు సూర్యచంద్రాదుల ప్రకాశము (ఎండ, వెన్నెల)లో వంకరగానున్నకఱ్ఱను పట్టుకునిచూపిన దానినీడ వంకరగా నుండును. మనచేతిఱ్రేలిని వంకరగాఁజూపిన దానినీడ వంకరగాఁగనిపించును. అట్లే పృథివ్యాదిరూపము లగు నుపాధుల సంబంధమువలనఁ బరమాత్మ ఆ ఉపాధుల

రూపాకారమును బొందినట్లుండును. కనుక సాకారశ్రుతులు ఔపాధికాకార పరములగుటచే వానికి వైయర్థ్యములేదు.

### ఆహచ తన్మాత్రమ్. 16

అ ఔపాధికాకారము వాస్తవమైనదేయనరాదా? దానినంటదని యారోపమేలచేయవలయును?
తన్మాత్రం = చైతన్యమాత్రునిగా ఆహచ = శ్రుతి చెప్పినది.

“పరమాత్మ యేవిధమైన రూపములేని చైతన్యమాత్రుఁడని ”స యథా సైంధవఘనో ఽనంతరో ఽబాహ్యః కృత్స్నో రసఘనఏవ-ఏవం వా అరేఽయ మాత్మాఽనంతరో ఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘనఏవ” (బృ. 4-5-13) ఉప్పుగడ్డయెట్లు లోపల వెలుపల నంతటను నిండిన ఏకరస స్వరూపమో అట్లే పరబ్రహ్మ (పరమాత్మ) యున్ను లోపల వెలుపల నంతటను నిండియున్న చైతన్యైక రస స్వరూపుఁడు. అని శ్రుతి చెప్పుచున్నది.

### దర్శయతిచ అథో అపిస్మర్యతే. 17

దర్శయతిచ = శ్రుతి, రూపాన్తరనిషేధమూలమున బ్రహ్మ చైతన్యైకరసస్వరూపుఁడని చూపుచున్నది. అథోఅపి స్మర్యతే = అట్లేస్మృతులలోఁగూడ చెప్పఁబడినది. “సఏష నేతినేతి”(బృ.3-9-26)”అన్యదేవ తద్విదితా దథో అవిదితా

వధి "(కేన1-3)మున్నగు(శుతులు" జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యజ్ఞాత్వా ఽమృతమశ్నుతే అనాది మత్పరం బ్రహ్మ నస త్తన్నాస దుచ్యతే")భగ. 13-12) అనిభగవద్గీతయును పరప్ర తిషేధ ముఖమున బ్రహ్మస్వరూపమును దెల్పుచు బ్రహ్మని ర్విశేషమని నీరూపమని తెల్పుచున్నవి.

అతఏవ చోపమా సూర్యకాదివత్. 18

అతఏవచ = ఈకారణమువల్లనే (ఆత్మనిర్విశేషుఁడు, భేదరహితుఁడు, రూపరహితుఁడు కనుకనే) సూర్యకాదివత్ = జలగతసూర్యునివంటివాఁడని, ఉపమా=పోలిక, చెప్పఁబడినది.

పరమాత్మ, నిర్విశేషుఁడు కనుకనే ఔపాధికమైన సవి శేషత్వమును దీసికొని జలమందు ప్రతిఫలించిన సూర్యునివంటి వాఁడని పోలిక చెప్పఁబడినది. జలములోఁ బ్రతిఫలించిన సూర్యుఁడు ఉపాధిభూతమైన జలముచలించినఁజలించును. జల మేరూపాకారముగనున్న నాయాకారముఁ గలిగియుండును. కాని సహజముగా సూర్యునికి చలనము ఆకారభేదమును లేదు. అట్లే పరమాత్మకును నౌపాధికముగు భేదమే కాని వాస్తవికభేదము లేదు. ఈవిషయమే "యథాహ్యయం జ్యోతి రాత్మా వివ స్వాన్ అపో భిన్నా బహుధైకోఽనుగచ్ఛన్ ఉపాధినా క్రియతే భేదరూపో దేవః క్షేత్రే ష్వేవమజో ఽయ మాత్మా" మున్నగువచ నములలోఁ జెప్పఁబడినది.

అంబువ దగ్రహణాత్తు న తథాత్వమ్. 19

అంబువత్ = ఉదకమునందువలె, అగ్రహణాత్ = గ్రహింపకపోవుటవలన, తథాత్వం = జలసూర్యసామ్యము, సంకుదురదు.

ఈదృష్టాన్తము సరిగాలేదు. సూర్యుని ప్రతిబింబమున కుపాధిభూతమైన జలము సూర్యునికంటె వేఱుగా దూర ప్రదేశమున మనకుఁ గనిపించుచున్నది. సూర్యుఁడు, జలము, మూర్త ద్రవ్యములు, ఆత్మ వ్యాపకుఁడు. సర్వవ్యాపకుఁ డగు ఆత్మకంటె వేఱుగా దూరస్థమై యుపాధి కనిపించుట లేదు. కావున, ఈ దృష్టాన్తము సరిగాలేదు.

వృద్ధిహ్రాసభాక్త్వమ న్తర్భావా దుభయసామంజస్యా దేవమ్. 20

అంతర్భావాత్ = జలప్రతిబింబితుఁడగుసూర్యుఁడు జలములోపలనుండుటవలన, వృద్ధిహ్రాస భాక్త్వమ్ = జలముయొక్క వృద్ధిక్షయములనుబొందుట, కలుగుచున్నది. ఏవం= ఈరీతిగా, ఉభయసామంజస్యాత్ = దృష్టాన్తదార్ష్టాన్తికములు (ఉపమానోపమేయములు) ఉపపన్నములగును గనుక నై యాక్షేపము లేదు.

నీటిలోఁబ్రతిఫలించినసూర్యుఁడు నీటిలో నుండుటవలన నీటికిఁజెందిన వృద్ధిహ్రాసచలనాదులను వతఁడుపొందునట్లుం

డునేకాని వాస్తవముగా సూర్యునికి వృద్ధిహ్రాసచలనాదులెట్లు లేవో అట్లే దేహాద్యుపాధులలోనుండుటవలన దేహాదిగతవృద్ధి హ్రాసాదులుఆత్మకున్నట్లుండునేగానిసహజముగా నిర్విశేషుండు నవికృతుండునగు పరమాత్మకు ఔపాధికములగు వృద్ధిహ్రాసాదులులేవు అన్నంతవఱకేసామ్యమునకు దృష్టాన్తదార్ష్టాన్తికభావముకాని సర్వాత్మనాకాదు. సర్వాత్మనాసామ్యమున్న చోనది దృష్టాన్తమే కాదు.

## దర్శనాచ్చ 21

అవ॥ సూర్యుండు జలాద్యన్తర్గతుండైనట్లు ఆత్మ దేహాద్యన్తర్గతుండైనట్లులేదే! అట్లున్నచో దేహాద్యుపాధిగతములైన వృద్ధిహ్రాసము లతనికి గలిగినవనవచ్చును అన్నచో దర్శనాచ్చ = పరమాత్మ దేహాద్యన్తర్గతుండైనట్లు శ్రుతులందు, గనిపించుచున్నందున నట్లు శంకింపరాదు.

"అనేనజీవే నాత్మనానుప్రవిశ్య" (ఛాం. 6-3-2) మున్నగు వచనములలోఁబరమాత్మ యుపాధులలోఁ బ్రవేశించినట్లున్నందున ఔపాధికములైన వృద్ధిహ్రాసాదిధర్మములు అతనికిఁ గలిగినవనవచ్చును.

## 6 ప్రకృతైతావత్త్వాధికరణము (22-30)

అవ :- నిషేధశ్రుతులచేత బ్రహ్మస్వరూపము నిర్విశేషమైనదిగా సిద్ధించినదిగా చెప్పినమాట యుక్తముకాదు. ఆశ్రుతులు బ్రహ్మస్వరూపమునే నిషేధించుచున్నవి. అని యాక్షే,

సంగతితో నీయధికరణ మారంభింపఁబడినది. "ద్వేవావ బ్రహ్మణో రూపే, మూర్తంచామూర్తంచ (బృ.2-3-1) అని బృహదారణ్యక బ్రాహ్మణమునందు నుపక్రమించి, బ్రహ్మకు మూర్తము అమూర్తము అని రెండురూపములు కలవు. అందుఁ గంటికిఁ గోచరించు పృథివ్యప్తేజస్సులను మూఁడు భూతములు మూర్తమనియు అగోచరములగు వాయ్వాకాశములు రెండును అమూర్తమనియును విభజించి, రెండింటి ధర్మములను దెలిపి, చివర రూపద్వయరహితుండగు బ్రహ్మయొక్క స్వరూపమును దెలుపుటకై, "అథాత ఆదేశో నేతి నేతి" (బృ. 2-3-6) అని చెప్పఁబడినది. ఇందు "నేతి నేతి" యని రెండు నకారము (నిషేధ వాచకములు) లుండుటచే నొక నకారము మూర్తామూర్త రూపద్వయమగు ప్రపంచమును మఱియొక నకారము బ్రహ్మను నిషేధించుచున్నదని యాశంక, కలుగ దాని నివారించుటకై యీయధికరణ మారంభింపఁ బడినది. "నేతి నేతి" యను, ఆనిషేధశ్రుతి బ్రహ్మను నిషేధించలేదు. దేనిని నిషేధించుచున్నదనఁగా,

ప్రకృతైతావత్త్వం హిప్రతిషేధతి తతో బ్రవీతిచ భూయః 22

ప్రకృతైతావత్త్వం = ప్రకృతమగు ఏతావత్త్వమును, ప్రతిషేధతి, హి, = నిషేధించుచున్నది. అనఁగాఇయత్తా

(ఇంతరూపము కలదియని) పరిచ్ఛిన్నమగు మూర్తామూర్త రూపములను రెంటింటిని నిషేధించుచున్నది. కాని బ్రహ్మను నిషేధించుటలేదు. బ్రహ్మను నిషేధించిన శూన్యవాదమగును. అయినచో నిరధిష్ఠానమైన భ్రమసంభవింపదు. అదికాక, తతః =తరువాత, భూయః = తిరిగి, బ్రవీతిచ = "నహ్యేతస్మాత్పరమస్తి" అనువాక్యముచే బ్రహ్మయున్నదని చెప్పుచున్నది.

"నేతినేతి"యనునిషేధశ్రుతి ప్రకృతములగు మూర్తామూర్తరూపములను నిషేధించుచున్నది కాని, బ్రహ్మను నిషేధించుటలేదు. "ద్వేవావ బ్రహ్మణోరూపే" అని ఆరెండు రూపములే ప్రకృతములు. ఈరూపద్వయ(ప్రపంచ)నిషేధానంతరము నేతినేతియని చెప్పిన బ్రహ్మకంటె నతిరిక్తముగా నితరమైన దేమియునులేదని నిర్వచనవాక్యములోఁ జెప్పెను. అనఁగా బ్రహ్మయున్నది. తద్వ్యతిరిక్తము లేదు. అనిభావము. మఱియును "అథ నామధేయం సత్యస్య సత్యం" అని బ్రహ్మస్వరూపమును నిరూపించెను. కావున "నేతినేతి"యని రెండు నకారములతోను వీప్సగా రూపద్వయమునే నిషేధించెను. "బ్రహ్మతే బ్రవాణి" అని ప్రారంభించి బ్రహ్మను జెప్పక నిషేధించెనని చెప్పుట యసంగత మగును.

తదవ్యక్త మాహహి. 23

బ్రహ్మయున్నచో నేల కనఁబడదు? అన నీసూత్రము సమాధానము. తత్ = ఆబ్రహ్మ, అవ్యక్తం = ఇంద్రియగో

చరముకాదు అని, ఆహహి = శ్రుతి చెప్పినది." నచక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవైః తపసా కర్మణా వా" (ముం.3-18) "అవ్యక్తోఽయ మచింత్యోఽయమ్" అని భ. 2-25 లోను చెప్పఁబడినది.

అపి సంరాధనే ప్రత్యక్షాను మానాభ్యామ్. 24

అపి = మఱియు, సంరాధనే = సమాధియందు, యోగీశ్వరు లీయవ్యక్త మగు బ్రహ్మస్వరూపమును జూతురని ప్రత్యక్షానుమానాభ్యాం = శ్రుతిస్మృతులచేతఁ దెలియఁబడు చున్నది.

శ్రుతిలో – పరాంచి ఖాని వ్యతృణ త్స్వయంభూః తస్మాత్ పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్ । కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్ష దావృత్త చక్షు రమృతత్వ మిచ్ఛన్(క.4-1)

అర్థము :- పరమేశ్వరుఁడు బహిర్విషయములందు, అనాత్మవిషయములకు శ్రోత్రాదీంద్రియములను హింసించెను. అనఁగా ఆత్మదర్శనమునకు సమర్థములు కానివానినిగా సృజించెను. అందుచేత లోకులెల్లరు బాహ్యవిషయము లనే చూడఁగలరుగాని అంతరాత్మను జూడలేరు. కాని యెవ్వఁడో యొకవివేకి, మోక్షాభిలాషియై ఇంద్రియములను మరల్చుకొని నిగ్రహించి, పరమాత్మను దర్శించెను. (సమాధియందు)

స్మృతిః- యం వినిద్రా జితశ్వాసా స్సంతుష్టా స్సంయ
తేంద్రియాః

జ్యోతిః పశ్యన్తి యుంజానా స్తస్మై యోగాత్మనే నమః।
మహా-భా-12-47-54

అర్థము:- యోగపరాయణులు నిద్రలేనివారై, ప్రాణాయామాదులచే వాయువును జయించి, యింద్రియనిగ్రహముగలవారై సంతోషముతో జ్యోతిస్స్వరూపుఁడగు నేపరమాత్మను జూతురో అట్టియా యోగస్వరూపునికి నమస్కారము. అని దర్శనము చెప్పఁబడినది.

ప్రకాశాదివచ్చావైశేష్యం, ప్రకాశశ్చ
కర్మణ్యభ్యాసాత్, 25

అవ:- జీవేశ్వరులకు ఆరాధ్యారాధకభావమును (ధ్యాతృధ్యేయభావమును) అంగీకరించినచో భేదమువచ్చుచున్నదే! యన చెప్పుచున్నారు.

ప్రకాశాదివత్ చ = సూర్యునిప్రకాశము మున్నగువానికివలె అవైశేష్యం = జీవాత్మపరమాత్మలకభేదమేగాని భేదములేదు. కర్మణి ప్రకాశశ్చ = ఔపాధికకర్మమునందు ప్రకాశమున్ను వేఱుగాఁదోచునుగాని వేఱుకాదు. సూర్య

కాంతిలో (వెలుతురులో) వ్రేళ్లుచాపిన వ్రేళ్ళయాకారముగ నా వెలుతురు వంకరగా నున్నట్లు ఔపాధికముగఁ గనిపించును. కాని యా వెలుతురు (ప్రకాశము) ఏకరూపమే కాని భిన్నము కాదు. అట్లే యవిద్యచేత వేఱుగా గోచరించుచున్న జీవాత్మపరమాత్మలకు భేదములేదు. ఎందుచేతననఁగా అభ్యాసాత్ = అభ్యాసమువలన, వేదాన్తములందంతటను "తత్త్వమసీ" తి వాక్యములచే మాటిమాటికి నభేదమే చెప్పఁబడుచున్నది.

### అతోఽనన్తేన తథాహి లింగమ్ 26

అతః = అందువలన, (భేదము ఔపాధికము గావున) అనన్తేన = అంతములేని పరమాత్మతో జీవుఁ డవిద్యానివృత్తి యగుటతో నేకత్వమును బొందుచున్నాఁడు. తథాహిలింగమ్ = అట్టి యర్థజ్ఞాపకమగు శ్రుతిగలదు. "బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి" బృ-4-4-6 స యో హ వై తత్పరమం బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి ముం-3-2-9 బ్రహ్మయగుచునే బ్రహ్మను బొందుచున్నాఁడు—ఎవ్వఁ డా పరబ్రహ్మ స్వరూపమును దెలిసికొనునో యతఁడు బ్రహ్మస్వరూపుఁడే యగుచున్నాఁడు.

### ఉభయవ్యపదేశాత్త్వహికుండలవత్ 27

ఉభయవ్యపదేశాత్తు = శ్రుతియందు జీవాత్మపరమాత్మలకు భేదాభేదములను రెండింటిని జెప్పుటవలన, అహికుండల

వత్ = చుట్టచుట్టుకొనియున్న పాముచుట్టకును పామునకును భేదాభేదము లెట్లో యట్లేయని గ్రహింపవలెను.

శ్రుతిలో - "తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః" ముం. 3-1-8 నిర్వికారుఁడగు పరమాత్మస్వరూపుని ధ్యానము చేయుచున్నవాఁడై జీవుఁ డతనిని జూచుచున్నాఁడు అని ధ్యాతృధ్యేయభావము చెప్పఁబడినది. "పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్" (ముం, 3-2-8) పరాత్పరుఁడైన ఆదివ్యపురుషుని బొందుచున్నాఁడు. అని గంతృగంతవ్యభావము చెప్పఁబడినది. "యస్సర్వాణి భూతాన్యంతరో యమయతి" బృ. 3.7-15. ఎవ్వఁడు లోపలనున్నవాఁడై సర్వభూతములను నియమించుచున్నాఁడో, యని, నియంతృ నియమ్యభావము చెప్పఁబడినది. ఇట్టి శ్రుతుల వలన భేదము చెప్పఁబడినది.

ఇక "తత్త్వమసి" ఛాం 6-8.7 నీవు పరమాత్మవైతివి. "అహం బ్రహ్మాస్మి" బృ 1-4-10 నేను బ్రహ్మనైతిని. బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి" బృ. 4-4.6 బ్రహ్మమే యగుచు బ్రహ్మను బొందుచున్నాఁడు మొదలగు శ్రుతులవలన నభేదము చెప్పఁబడుచున్నది.

ఈభేదాభేద కథనము - అహికుండలము వంటిది. అనఁగాఁ పాము ప్రాకుచున్నప్పుడు పామని యందురు. చుట్ట

చుట్టుకొని యున్నప్పుడు పాముచుట్ట యందురు. పామునకుఁ బాముచుట్టకును భేదములేదు. పాము అను వ్యవహారముచే అభేదము పాముచుట్ట యనువ్యవహారముచే భేదమును నెట్లు గలుగుచున్నవో అట్లు జీవాత్మపరమాత్మలకు భేదాభేదములు చెప్పఁబడినవి.

### ప్రకాశాశ్రయవద్వా తేజస్త్వాత్. 28

ప్రకాశాశ్రయవద్వా=ప్రకాశము ప్రకాశాశ్రయమగు సూర్యుఁడు వలెనైనను నీభేదాభేదము చెప్పవచ్చును-సూర్యుని ప్రకాశము సూర్యుఁడును కేవలము వేఱుగాదు. ఎందుచేత? తేజస్త్వాత్ = ప్రకాశత్వరూప ధర్మమువలన, అనఁగా ప్రకాశత్వరూప ధర్మమువలన సూర్యునికి సూర్యకాంతికిని భేదము లేకున్నను భేదమున్నట్లు తోచుచున్నమాదిరిగా జీవేశ్వరులకు భేదములేకున్నను భేదమున్నట్లు తోచును.

### పూర్వవద్వా 29

అథ:- ఈభేదాభేదపక్షముచేత, జీవేశ్వరులకు యథార్థముగా భేదమున్నదని చెప్పినచో నా భేదము, జ్ఞానమువలన గూడ నివర్తింపదుగాన మోక్షమను మాటయే కలుగదు. భేదము యథార్థముకాదు. జీవేశ్వరు లొక్కటే యని చెప్పినచో లోకములో జీవుఁడు ఈశ్వరుఁడు అని విభిన్నముగా వ్యవహరించుట పొసఁగదు. కావున భేదాభేద

పక్షము సరియైనదికాదు. ఇఁక సిద్ధాంతపక్షమేమనఁగాఁ జెప్పుచున్నారు.

1 పూర్వవత్ వా = వెనుక "ప్రకాశాదివ చ్చావై శేష్యం ప్రకాశశ్చ కర్మణ్యభ్యాసాత్ !" అనుసూత్రములోఁ జెప్పినరీతిని భేదము ఔపాధికము (అవిద్యామూలకము) అభేదము పారమార్థికము (యథార్థము) అన్నదియే సిద్ధాంతము.

ప్రతిషేధాచ్చ 30

ప్రతిషేధాత్-చ, ప్రతిషేధాచ్చ = "నాన్యోఽతోఽస్తి ద్రష్టా" (బృ-3-7-23) పరమాత్మకంటె వతిరిక్తుఁడగు ద్రష్ట లేఁడు, "అథాత ఆదేశో నేతినేతి" (బృ-2-2-6) పరమాత్మ (బ్రహ్మ) వ్యతిరిక్తమగు ప్రపంచము లేదని, నిషేధించుట వలనను పరమాత్మకన్న వతిరిక్తమేదియు లేదుకావున నిర్వికారుఁడగు పరమేశ్వరుఁ డొక్కఁడే యనుట సిద్ధాన్తము.

7- పరాధికరణము. (31-37)

అవ:- నేతినేతీత్యాది వాక్యములవలన పరబ్రహ్మాతిరిక్తమగు వస్తువులేదని నిర్ణయింపఁబడినది. సేతూన్మానాది వ్యపదేశమువలన వస్త్వన్తర మున్నట్లు తెలియుచున్నది. శ్రుతివాక్యములందలి విప్రతిపత్తివలన పరబ్రహ్మాతిరిక్తమగు తత్త్వము మఱియొకటి యున్నదా? లేదా! అని సంశ

యముగలుగ నా సంశయమును వారించుటకై యీయధి
కరణ మారంభింపఁబడినది.

పర మతః సేతూన్మాన సంబంధ భేదవ్యపదేశేభ్యః. 31

అర్థః- ఈపరమాత్మ స్వరూపముకంటె, పరం = మఱి
యొక తత్త్వముకలదు. ఎందుచేత ననఁగా, సేతూన్మాన
సంబంధ భేదవ్యపదేశేభ్యః = సేతువ్యపదేశము, ఉన్మాన
వ్యపదేశము సంబంధవ్యపదేశము, భేదవ్యపదేశములవలన,
వ్యపదేశమనఁగా, చెప్పుట (ప్రసిద్ధి)

సేతువ్యపదేశము :- "అథ యఆత్మా ససేతు ర్విధృ
తిః" ఛాం8-4-1 అని ఆత్మ నుద్దేశించి, అతఁడు జగమునంతను
ధరించునట్టి సేతువు(వంతెన) అని చెప్పఁబడినది. సేతువు రెం
డుగట్లకు నడుమనున్న కాలువ, నది, మున్నగు వానిని దాటి
యావలి గట్టును చేరుటకై నిర్మింపఁబడును. ఆత్మ సేతువని
చెప్పుటచే ఆవలియొడ్డువంటి వస్తువు మఱియొకటి యుండవలె
నని తోఁచుచున్నది.

ఉన్మాన వ్యపదేశము :- "తదేతద్బ్రహ్మ చతుష్పా
దష్టాశఫమ్ షోడశకలమ్" ఉపాసనసందర్భములో బ్రహ్మ
నాల్గుపాదములు కలది ఎనిమిదిశఫములు(డెక్కలు)కలది, పదు
నారుకళలు కలది యని వర్ణింపబడినది. నాల్గుదిక్కులు - ఒక
పాదము; భూమి సముద్రాకాశ స్వర్గములు- రెండవపాదము,

సూర్యచంద్రాగ్నులు - మూడవపాదము, చక్షుశ్శ్రోత్రప్రాణ మనస్సులు-నాల్గవపాదము, అని యీరీతిని ఉపాసనకై బ్రహ్మ చతుష్పాత్తు అని చెప్పఁబడినది. ఇందు నాల్గుపాదములు కలది యని చెప్పుట, ఉన్మానవాచకము. ఇంత తూకము కలది, ఇంతపరిమితి కలది, యని చెప్పుమాట, ఉన్మానవాచకము. హెచ్చుతగ్గులు గల పరిమితంలితరము ఉన్నప్పుడే ఇది యింత పరిమితి కలదని చెప్పుట సరిపడును. కనుక ఉన్మానత్వము చెప్పుటచేతఁగూడ ఆత్మకన్న మఱియొక వస్తువు కలదని తెలియుచున్నది.

సంబంధవ్యపదేశము:- "సతా సోమ్య! తదా సంపన్నో భవతి" (ఛాం 6-8-9) సద్రూపుఁడగు బ్రహ్మతో జీవుఁడుకలియుచున్నాఁడు. "ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః (బృ.4-3-21) సుషుప్తిలో ప్రాజ్ఞుడగు ఆత్మతో శారీరుఁడు (జీవుఁడు) కలిసినవాఁడై యున్నగువాక్యములచే బ్రహ్మకు సంబంధవ్యపదేశము చెప్పఁబడినది. కనుక దీనిచేతను నీశ్వరునికంటె నితరుఁడు జీవుఁ డున్నట్లు తెలియుచున్నది.

భేదవ్యపదేశము:-"ఆత్మావా అరే ద్రష్టవ్యః" బృ (2-4-5) పరమాత్మ చూడఁదగినవాఁడు అని చూచెడువానికన్న చూడఁబడు పరమాత్మ భిన్నుడనియు "అథ యఏషో న్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే" ఛాం. 1-6-6 అని ఆదిత్యాధారుఁడైన యీశ్వరుని దెలిపి తద్భిన్నముగా "అథ

యఏషో ఉన్తరక్షిణి పురుషోదృశ్యతే''అని యక్షి(కన్ను)యం దున్న పురుషుని జెప్పుచున్నది. ఈనాల్గు వ్యపదేశములచేతను నీశ్వరునికంటె వేఱుగా మఱియొక్క పురుషుఁడున్నట్లు తెలియుచున్నది. అనిపూర్వపక్షము.

### సామాన్యాత్తు 32

సేతుత్వవ్యపదేశమువలన బ్రహ్మకన్న వేఱుగా వస్త్వన్తరమున్నదనుట కుదరదు-ఏమన సామాన్యాత్తులోనితు శబ్దము పూర్వపక్ష వ్యావృత్త్యర్థము. సామాన్యాత్ = సేతుత్వ సామాన్యమువలన నట్లు చెప్పఁబడినదేకాని యది వస్త్వన్తర సూచకముకాదు. సేతువువంటివాఁడు కనుక ఆత్మ సేతువని స్తుతింపఁబడుచున్నాఁడు. మార్గమర్యాదకు(స్థితికి) నదీజలముల వలన భంగముకలుగకుండ సేతువు ఏవిధముగా విధారకము (నిలుపునది)అగుచున్నదో అట్లే ఈశ్వరుఁడును జగన్మర్యాదకు విధారకుఁడగుటచే సేతువువంటివాఁడని చెప్పఁబడినది కనుక ఈహేతువు వస్త్వన్తరసాధకముకాదు.

### బుద్ధ్యర్థః పాదవత్. 33

ఉన్మానవ్యపదేశముకూడ, బుద్ధ్యర్థః=ఉపాసనము కొఱకు; నిర్విశేషుఁడగు ఆత్మ బుద్ధియందుండుట కుదురదుకావున, ఉపాసనాద్వారా బుద్ధియందుండునని చెప్పుటకై "చతుష్పాదష్టాశఫః''మున్నగు ఉన్మానవ్యపదేశము చేయఁబడినది కాని వస్త్వన్తరసిద్ధికై కాదు. పాదవత్ = బంగారము ఏకముగా

ముద్దగా నున్నచో వ్యవహారయోగ్యము కాక, తులము, పాదము (నాల్గవవంతు) అనువ్యపదేశమువలన వ్యవహారయోగ్యమైనట్లు నిర్విశేషముగు బ్రహ్మ ఉపాసనాయోగ్యము కాదని, సగుణముగా చతుష్పాత్తని చెప్పఁబడినది.

### స్థానవిశేషా త్ప్రకాశాదివత్. 34

సంబంధవ్యపదేశము, భేదవ్యపదేశము, అను రెండును గూడ బ్రహ్మవ్యతిరిక్త వస్తుసాధకములు కావు. స్థానవిశేషాత్ = ఉపాధివిశేషమువలన నీవ్యపదేశములు రెండును సరిపడును. ఎట్లనగా, సుషుప్తియందు జీవుఁడు ఈశ్వరునితోఁ గలిసియున్నాఁడనఁగా, బుద్ధ్యాద్యుపాధి స్థాన విశేషమువలన గలిగిన విశేషవిజ్ఞానమునకు,ఉపాధిఉపశమించుటచే ఉపశమము గలుగగా సామాన్యవిజ్ఞానముతోఁ గలిసిపోయి భేదములేక పోవుటయే యనిభావము. ఘటాకాశము ఘటరూపోపాధి నాశమువలన మహాకాశముతోఁ గలసినట్లు కలియుటయే జీవుఁడు ఈశ్వరునితోఁ గలియుట యనుదానికర్థము. అహ్న్యాదిత్యరూప స్థానవిశేషముచేతఁ జెప్పఁబడినదేకాని వేఱు కాదు. అదియెట్లనఁగా, ప్రకాశాదివత్ = సూర్యకాంతిలోఁ జూపిన వ్రేళ్ళు మొదలగువానిని దీసివేసినచో ఔపాధికముగు సంబంధము భేదముపోయి యభేదమేతోచునట్లు అనియర్థము

ఉపపత్తేశ్చ. 35

ఉపపత్తేః + చ = ఉపపత్తివలనఁగూడ నిచ్చట జీవే శ్వరులసంబంధము ఇట్టిదే(ఔపాధికమే) కాని ముఖ్యముకాదు. "స్వమపీతో భవతి" ఛాం 6-8-11 అని స్వరూపసంబంధమునే చెప్పుచున్నది కాన స్వరూపము శాశ్వతము అనపాయమున గుటచే నుపాధికృతస్వరూపతిరోధానముచేతనే "స్వమపీతో భవతి" అన్నదియుపపన్నమగును. ఈయుపపత్తివలన సుషు ప్తిలో జీవేశ్వరులసంబంధము, ఔపాధికము. ఇట్లే భేదముకూడ ఔపాధికమే.

తథాన్యప్రతిషేధాత్. 36

తథా = అటూదిరిగా అన్యప్రతిషేధాత్ = అన్యవస్తు ప్రతిషేధమువలన, పరమాత్మకంటె నన్యమేదియును లేదని నిశ్చయింపఁబడుచున్నది.

"పురుష ఏవేదం సర్వమ్" శ్వే15 "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఛాం3-14-17 "నేహ నానాస్తి కించన "బృ(4-4-19) సఏవాధస్తాత్ అహమేవాధస్తాత్, ఆత్మైవాధస్తాత్ ఛా.7-25-2 మున్నగువాక్యములు - బ్రహ్మ వ్యతిరిక్తమగు వస్త్వంతరమును వారించుచున్నవి. కాన బ్రహ్మ అద్వితీయము.

అనేన సర్వగతత్వ మాయామశబ్దాదిభ్యః. 37

అవ॥ ఈసూత్రముచే నద్వితీయుఁడగు బ్రహ్మకు సర్వగతత్వ మును జెప్పుచున్నారు.

అనేన = ఈ సేతువ్యప దేశాదినిషేధము అన్యప్రతిషేధము మొదలగువానిచేత సర్వగతత్వం = పరమాత్మకు సర్వగతత్వము = అంతటవ్యాపించియుండుట, సిద్ధమైనది. ఈనిషేధము చేయకపోయినచో లోకప్రసిద్ధసేతువు వలెనే పరమాత్మకూడ అసర్వగతుండే అయియుండును. అదికాక పరమాత్మ సర్వగతుండనుటకుఁ బ్రమాణముకూడఁ గలదు. అదియేదియన-ఆయామశబ్దాదిభ్యః ఆయామశబ్దమునకు వ్యాపకమనియర్థము. "ఆకాశవ త్సర్వగతశ్చ నిత్యః" నిత్య స్సర్వగత స్థాణుః" మున్నగువాక్యములు పరమాత్మకు వ్యాపకత్వమును సర్వగతత్వమును దెలుపుచున్నవి. ఆవాక్యములవల్లను సర్వగతత్వము సిద్ధించుచున్నది.

## 8 ఫలాధికరణము. (38-41)

బ్రహ్మాతిరిక్తముగు వస్తువును నిషేధించుటచేతను బ్రహ్మనిర్విశేషమగుటచేతను కర్మఫలదాతృత్వము సంభవింపదనియాక్షేపముగలుగ వారించుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

### ఫల మత ఉపపత్తేః. 38

అవ॥ సంసారమునందు గోచరమగు ఇష్టానిష్ట మిశ్ర రూప ఫలము ప్రాణులకుఁ గర్మమువలనఁ గలుగుచున్నదా? పరమేశ్వరునివలన గలుగుచున్నదా? యనుసందేహముగలుగ నిందువివరించుచున్నారు.

ఫలం = కర్మఫలము, అతః = ఈయీశ్వరునివలన గలుగుచున్నది. ఎందుచేతననగా ఉపపత్తేః = ఉపపత్తివలన; సర్వాధ్యక్షుఁడు సృష్టిస్థితిలయకారకుఁడు, నగు పరమేశ్వరుఁడు సర్వజ్ఞుఁడు కనుక కర్మము లాచరించినవారికిఁ గర్మానుగుణమైన ఫలమునిచ్చుచున్నాఁడనుట యుపపన్నము. ఉత్తరక్షణమందు నశించుకర్మము కాలాన్తరమునందు ఫలమును గల్గించు ననుట యనుపపన్నము.

## శ్రుతత్వాచ్చ. 39

ఈశ్వరుఁడు కర్మఫలమునిచ్చువాఁడు అని "సవా ఏష మహానజ ఆత్మాన్నాదో వసుదానః" (బృ.4-4-24) అనగ మహాత్మ అన్నమునిచ్చువాఁడు ధనమునిచ్చువాఁడు అని యిటువంటి వాక్యములు వినఁబడుటచే నీశ్వరుఁడు ఫలదాత.

## ధర్మం జైమిని రతఏవ. 40

అతఏవ = ఈశ్రుత్యుపపత్తిమూలమువలననే (శ్రుతియుండుట, ఉపపత్తికనఁబడుట) యనునీహేతువులచేతనే జైమినిః= జైమినిమహర్షి, ధర్మం = యాగాదిరూపధర్మమును ఫలమునిచ్చుదానినిగాఁ జెప్పుచున్నాఁడు- కర్మము నశించునదియైనను అపూర్వమనొకదానిని గల్పించినశించును. అపూర్వద్వారా యాగమే ఫలమునిచ్చును. "స్వర్గకామో యజేత" మున్నగు విధులలో యాగమే స్వర్గఫలసాధకమని వినఁబడుచున్నది. సర్వసాధారణుఁడగు నీశ్వరునకు విచిత్రఫలప్రదానము పపన్నము

కాదుకావున నట్టిఫలదానముచే నతనికి వైషమ్య నైర్ఘృణ్యా దులు కలుగుననవలెను. కాన నీశ్వరుఁడు ఫలదాతయని యన రాదు. అపూర్వద్వారా కర్మమే ఫలదాయకము.

పూర్వంతు బాదరాయణో హేతువ్యపదేశాత్. 41

బాదరాయణః = వ్యాసమహర్షి, పూర్వంతు = మొదటఁజెప్పఁబడిన యీశ్వరునే ఫలదాతనుగాఁ దలఁచుచు న్నారు. ఏమన, హేతువ్యపదేశాత్ = ధర్మాధర్మములను జేయించువాఁడుకూడ ఈశ్వరుఁడేయని యీశ్వరుని హేతు వుగాఁ జెప్పుటవలన బాదరాయణులు ఈశ్వరుఁడే ఫలదాత యని తలఁచుచున్నారు. "ఏష హ్యేవ సాధుకర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీష తే౹ ఏష ఉ ఏవాసాధు కర్మ కారయతి తం యమధో నినీష తే" ఎవని నీలోకముల నుండి యుద్ధరింపఁ దలఁచినాఁడో యతనిచేఁ బరమేశ్వరుఁడు సాధుకర్మములు చేయించుచున్నాఁడు, ఎవ్వని నధోలోకములఁ బొందింపఁదలఁచెనో వానిచే నసాధుకర్మములను జేయించు చున్నాఁడు. అనియు "లభతేచ తతః కామాన్ మయైవ విహి తాన్ హి తాన్ "భగ-7-21 నాచేఁగల్పింపఁబడిన హితములనే పొందుచున్నాఁడు అనియుఁ జెప్పఁబడుటచే నీశ్వరుఁడే కర్మము లను చేయించుచున్నట్లును ఫలముల నిచ్చుచున్నట్లును దెలియు చున్నది. కనుక కర్మసాపేక్షముగ నీశ్వరుఁడే ఫలదాత యని సిద్ధాంతము.

ఈపాదమునందు 8 అధికరణములు గలవు. అందు మొదటి 4 అధికరణములలోను "త్వం" పదార్థశోధన

మొనర్పఁబడినది. స్వప్నసృష్టి మిథ్యయని చెప్పుటచేతను గర్తృత్వ మధ్యాసమూలక మనుటచేతను జీవుఁడసంగి యని మొదటి యధికరణమున నిరూపించి, రెండవదానిలో సుషుప్తియందు బ్రహ్మైక్యమును దెల్పి యా యసంగిత్వమును దృఢపఱచెను. మూఁడవదానిలో జ్ఞానముచే జీవున కనిత్యత్వ శంకను నిరసించి, మూర్ఛావిచారమూలకముగా మరణమందు జీవనాశశంకను నిరసించెను. ఈ విధముగా నీ నాల్గధికరణముల చేతను "త్వం" పదార్థ శోధనము చేసెను.

మిగిలిన నాల్గధికరణములందును "తత్" పదార్థశోధనము చేయఁబడినది. అందును మొదట బ్రహ్మకునీరూపత్వము తరువాత నిషేధావిషయత్వము, పిదప అద్వితీయత్వము, నిరూపించి, చివరియధికరణములో వ్యవహారదశయందు, ఫలదాతృత్వమును నిరూపించెను. ఈవిధముగ నిందు "త్వం పదార్థతత్పదార్థములు శోధింపఁబడినవి.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి విరచితమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను బ్రహ్మసూత్రవృత్తియందుఁ
తృతీయాధ్యాయమున
ద్వితీయపాదము.
అధి 8 సూ 41

---

శ్రీరస్తు

# బ్రహ్మ సూత్రార్థ దీపిక

## తృతీయాధ్యాయ తృతీయపాదము.

### 1 సర్వవేదాన్తప్రత్యయాధికరణము (1–4)

అవ॥ వెనుకటిపాదమున "తత్, త్వం" పదముల యర్థమును విమర్శించి బ్రహ్మమద్వితీయమని నిరూపింపఁబడినది. ఈపాదమునఁ బ్రతివేదాన్తమునకు విజ్ఞానములు (ఉపాసనములు విభిన్నములా? ఏకస్వరూపములేనా? అనువిషయము విచారణ చేయఁబడుచున్నది. బ్రహ్మపదార్థము ఏకము అద్వితీయము నిర్విశేషము సైంధవఘనము (ఉప్పుగడ్డ) వలె నేకరసమును గదా! అట్టి బ్రహ్మమునందు ఈ విజ్ఞానభేద విచారణప్రసక్తి యేమున్నది? అనవచ్చును. ఇచ్చటఁ జేయఁబడు విజ్ఞానభేదాభేద విచారణ సగుణబ్రహ్మసంబంధమైనది. సగుణ బ్రహ్మోపాసనమువలనఁ జిత్తముస్థిరమై శుద్ధమగును. అది నిర్గుణవిద్యయం దుపయోగించును. కావున ఇందు, సగుణవిద్యకును బ్రాసంగికముగా విద్యాన్తరములకును సంబంధించిన భేదాభేదవిచారము గావింపఁబడుచున్నది.

ఉపాసనలు కొన్ని దృష్టఫలములు కొన్ని యదృష్టఫలములు, కొన్ని సమ్యగ్దర్శన పూర్వకముగఁ గ్రమముక్తిఫలప్రదములు; ఇట్టి యీ యుపాసనలలో తైత్తిరీయకము, వాజసనేయకము, కౌథుమము, అని నామభేదములు కలవు. పంచాగ్ని

విద్యలోఁ గొందఱు అజవయగ్నిని గూడఁ జెప్పుదురు. కొందఱు విదగ్నులనే చెప్పుదురు. కొందఱు "శిరోవ్రతం విధివద్యైస్తు చీర్ణమ్"అని శిరోవ్రతమును జెప్పుదురు. ఇట్లు భేదములు కనిపించుచుండుటచే ప్రతివేదాన్తమునకు(ఉపాసనములు) విజ్ఞానములు వేఱా! అన్నిటికి నొక్క రకమైన వేనా! అని సందేహములుగలుగ వారించుట కీయధికరణ మారంభింపఁబడినది.

### సర్వ వేదాన్త ప్రత్యయం చోదనాద్యవిశేషాత్. 1

చోదనాద్యవిశేషాత్ = చోదన మొదలగు వానియొక్క అవిశేషమువలన (భేదములేకపోవుటవలన) సర్వవేదాన్త ప్రత్యయం— అన్ని వేదాన్తములయందలి విజ్ఞానము (ఉపాసనయు) ఒక్కటే। "అగ్నిహోత్రం జుహోతి" "యోహవై జ్యేష్ఠంచ శ్రేష్ఠంచ వేద" మున్నగువానిలో శాఖాభేదము పాటింపకయే చోదన (విధి) ఏకాకారముగఁ జెప్పఁబడినది. కనుక ప్రతివేదాన్తమునకు విజ్ఞానభేదములేదు. నామభేదము కర్మభేదము మున్నగునవి శ్రుత్యుక్తములు కావు.

### భేదాన్నేతిచేన్నైకస్యామపి. 2

భేదాత్ = భేదముండుటవలన, న ఇతిచేత్ = సర్వవేదాంతమున ఏకవిధ విజ్ఞానమనుట సరియైనది కాదన్నచో, న = అట్లనరాదు, ఏకస్యామపి = ఒక విద్యయందును గుణభేద ముండవచ్చును.

బృహదారణ్యకములో పంచాగ్ని విద్యయందు ఆరవ యగ్ని చెప్పఁబడినది. ఛాందోగ్యములో ఐదగ్నులే చెప్పఁబడినవి. ఇట్టి వేద్యభేద ముండుటచే విద్యాభేదముకూడ ఆవశ్యక మేకనుక సర్వవేదాన్త ప్రత్యయము ఒక్కటేయనుట యెట్లుపొసగును? పొసఁగదు. అన్నచో అట్లు కాదు. ఒక విద్యలోఁగూడ గుణభేదముండవచ్చును. "అతిరాత్రే షోడశినం గృహ్ణాతి" "నాతిరాత్రే షోడశినం గృహ్ణాతి" అని అతిరాత్రమునందు షోడశి గ్రహణాగ్రహణరూప గుణభేదములు లేవా! అట్లే యిచ్చటను గుణభేదమున్నను విద్యైకత్వము నంగీకరింపవచ్చును. కనుక నీ షోడశి గ్రహణాగ్రహణము లుపపన్నము లగుచున్నవి.

స్వాధ్యాయస్య తథాత్వేన హి సమాచారేఽధికారాచ్చ
సవవచ్చ తన్నియమః, 3

అవ: తేషా మేవైతాం బ్రహ్మవిద్యాం వదేత శిరోవ్రతం విధివ ద్యైస్తు చీర్ణమ్", (ము. (3-2-10) ఎవ్వరిచే యథాశాస్త్రముగా శిరోవ్రతము నిర్వర్తింపఁబడినదో వారికే యీబ్రహ్మవిద్యను చెప్పవలెను. అని ఆథర్వణికులు విద్యయందు శిరోవ్రతము నపేక్షించుటచేతను నితరు లపేక్షింపకపోవుటచేతను. ధర్మభేద మున్నది కావున విద్యాభేదము కలదని ప్రశ్న కలుగఁగా సమాధానము చెప్పుచున్నారు. ఈశిరోవ్రతమనునది, స్వాధ్యాయస్య = స్వాధ్యాయము

యొక్క ధర్మము. విద్యయొక్క ధర్మముకాదు. హి = ఎందు చేతననగా తథాత్వేన=స్వాధ్యాయధర్మముగా, సమాచారే= సమాచారమను పేరుగల వేదవ్రతోపదేశపరమైన గ్రంథము నందుండుటవలన, అధికారాచ్చ = అధికారమువల్లనున్ను ఇది స్వాధ్యాయవ్రతమేయని తెలియుచున్నది. "నైతదచీర్ణ వ్రతోఽధీతే" (ముం. 3-2-11) శిరోవ్రతమును నిర్వర్తింపక దీనినధ్యయనముచేయడు అని "ఏతత్" అని "అధీతే" అనియు నీవ్రతము అధ్యయన ధర్మముగాఁ జెప్పఁబడినది. తన్నియమః = దానియొక్క నియమము, సవవచ్చ= సవము లందువలెనే. అనఁగా, సౌర్యసవము మొదలుగాని శతౌదనము వఱకు నేడుసవములుగలవని అధర్వణికులు చెప్పుదురు. ఇతరవేదములందుఁ జెప్పఁబడిన త్రేతాగ్నుల సంబంధములేక ఏకాగ్ని సంబంధముగనే యీయేడు సవములు అధర్వణికు లకు నియమింపఁబడుచున్నవి. ఆ సప్తసవములవలెనే యీశిరో వ్రతమును అధర్వణికులకు అధ్యయనధర్మముగా నియమింపఁ బడుచున్నది. కావున నిది విద్యాధర్మముకాదు.

దర్శయతిచ 4

వేదముకూడ సర్వవేదాన్తములందు వేద్యైక్యోప దేశమువలన, విద్యైక్యత్వమునే చూపుచున్నది. "సర్వే వేదా యత్పద మామనన్తి" కా 2-15 "ఏతంహ్యేవ బహ్వృచా

మహత్యుక్థే మీమాంసన్తే। ఏత మగ్నా వధ్వర్యవ ఏతం మహావ్రతే ఛందోగాః" ఐ. ఆ. 3-2-3-12 అని ఇచ్చట విద్యైక్యము నిర్గుణ పరబ్రహ్మ పరమైనదేయైనను ప్రాయదర్శన న్యాయముచే తత్సాహచర్యముచేత సగుణ బ్రహ్మ విద్యైక్యముకూడ బోధింపఁబడినట్లయని తెలియవలెను.

### 2 ఉపసంహారాధికరణము

ఉపసంహారో ఽర్థాభేదా ద్విధిశేషవత్సమానేచ. 5

అవ॥ ఉపాసనైక్య విచారమునకుఁ బ్రయోజన మిందు నిర్ణయింపఁబడుచున్నది.

వాజసనేయకమునందు ప్రాణవిద్యా ప్రసంగములో "రేతోహోచ్చక్రామ" బృ 6-1-12 అని రేతస్సు అను నొక అధికగుణము చెప్పఁబడినది. అది ఛాందోగ్యములోఁ జెప్పఁబడలేదు. ఛాందోగ్యములోఁగూడఁ బ్రాణవిద్య చెప్పఁబడినది. ఆప్రాణవిద్యలో నీ రేతోగుణోప సంహారము చేయవలయునా? అక్కఱలేదా? యని నిర్ణయింపఁబడుచున్నది. సమానే = సమానమగు ఒకేవిధమగు విజ్ఞానమునందు ఉపసంహారః=ఉపసంహారము, కర్తవ్యః=చేయఁదగినది. ఛాందోగ్యమునందు ప్రాణవిత్త్వము రేతోగుణకథనము లేకున్నను దాని యుపసంహారమందును జేయవలయును. ఎందుచేతనన, అర్థాభేదాత్ = అర్థభేదము = విజ్ఞానభేదము లేదుకనుక, సర్వవేదాన్త ప్రత్యయాధికరణముచే విజ్ఞానైక్యము బోధింపఁబడి

నది కనుక, వాజసనేయక ఛాందోగ్యముల యందలి ప్రాణ విద్య యొక్కటే కనుక దాని యుపసంహారము ఛాందోగ్యము నను చేయవలయును. ఎట్లనఁగా, విధిశేషవత్ = అగ్ని హోత్రాది విధిశేషాంగములకు శాఖాంతరములం దుపసంహా రము చెప్పఁబడుచున్నట్లు విజ్ఞానమునకుఁగూడ అర్థభేదము లేక పోవుటచే నుపసంహారము చెప్పవలయును "కర్మభూయస్త్వాత్ ఫలభూయస్త్వమ్" అను న్యాయముచేత స్వశాఖోక్త గుణ ములవలె పరశాఖోక్తగుణములున్ను ఉపకారములే యగును.

### 8 అన్యథాత్వాధికరణము (-6-8)

అవ: "సర్వ వేదాన్త ప్రత్యయం చోదనా ద్యవిశే షాత్" అను సూత్రమువలన సర్వ వేదాన్తములకు విద్యైక్యము చెప్పఁబడినది. కాని అది సరియైనది కాదు విద్యాభేదము చెప్పవలెను. ఏమనఁ? - ఛాందోగ్యమునందును. బృహదారణ్యకము నందునుగూడ ప్రాణప్రశంస చేయుచుఁ బ్రాణవిద్య చెప్పఁ బడినది. ఆప్రాణవిద్య ఒక్కటేనా! వేర్వేరా? అన్నచో పైఁజెప్పిన "సర్వవేదాన్త ప్రత్యయంచోదనాద్య విశేషాత్" అను న్యాయముచే నొక్కటి యనవలసి వచ్చుచున్నది. కాని యట్లుకాదు అని దానిమీఁద ఆక్షేపమును చెప్పుచున్నారు.

**అన్యథాత్వం శబ్దాదితిచే న్నావిశేషాత్. 6**

అన్యథాత్వం= రెండింటియందుఁజెప్పిన ప్రాణవిద్య వేఱు ఎందుచేతనఁ శబ్దాత్ = ఆప్రాణవిద్యను చెప్పినశబ్దమువలన,

(బృహ 1-3-2)లో "త్వంన ఉద్గాయ, అనియు, ఛాం 1-2-7లో తముద్గీథ ముపాసాంచక్రిరే" అనియు భిన్నభిన్నములగు శబ్దములచేఁ జెప్పుటవలన - 'త్వంన ఉద్గాయ "అను బృ॥ వచనములో ప్రాణము' త్వం, అనికర్తగా పేర్కొనఁబడినది. "తముద్గీథ ముపాసాంచక్రిరే" అను ఛాందోగ్యవచనములో "తం ఉద్గీథం" అని ప్రాణముకర్మగాఁ జేర్కొనఁబడినది. ఈ కర్తృకర్మరూపమైన శబ్దభేదమువలన విద్యాభేదమును చెప్పవలెను. ఇతిచేత్ =" అన్నచో, న = కాదు. అవిశేషాత్ = ఇతరమైన విశేషమేమియును లేకపోవుటవలన, అనఁగా బృహదారణ్యక ఛాందోగ్యములు రెంటియందును దేవాసుర సంగ్రామోపక్రమము, అసురవధకొఱకు ఉద్గీథోపన్యాసము, వాగాదిసంకీర్తనము, వాగాది నిందాపూర్వకముగా ముఖ్యప్రాణము నాశ్రయించుట, ప్రాణబలముచే నసురవిధ్వంసనము, అశ్మలోష్టాది నిదర్శనము అను. పెక్కువిషయము లన్నియు సమానములుగా నుండుటచే నీ ప్రాణవిద్యయొక్కటే. ఛాందోగ్యములోని వాక్యమునందలి కర్మపదమును గూడ కర్తృపదముగ వ్యాఖ్యానించుటచే విద్యైక్యమనియే గ్రహింపవలెను.

కథ :- బృహదారణ్యకమునం దుద్గీథబ్రాహ్మణములో క్షేత్రజ్ఞునకుఁగల తామసవృత్తులు "అసురు"లనియు, సాత్త్వికవృత్తులు "దేవత"లనియు చెప్పి ఆ దేవాసురులకుఁ బరస్పరము స్పర్ధ కలిగినదనియు, తామసవృత్తు లుద్భవించిన సందర్భమున

సాత్త్వికవృత్తులుండవనియు సాత్త్వికవృత్తు లుద్భవించిన సందర్భమునఁ దామసవృత్తు లుండవనియుఁ జెప్పి, దేవతలు అసురవిజయము నొందఁదలఁచినవారై "సామభక్తిరూపమైన ఉద్గీథముచే నీవు మాకు ఔద్గాత్రము చేయుము దానిచే మేము అసురులను జయింతుము" అని వాక్కును, ఘ్రాణమును, చక్షుస్సును, శ్రోత్రమును, మనస్సును, వేడిరి. అవియు నట్లేయని యంగీకరించెను. దేవతలు కర్మప్రవృత్తులయిరి. ఈసంగతి నసురులు తెలిసికొని, వాగాదీంద్రియములను బాప మోదిరి.(అనఁగా తామస వృత్త్యుద్భవముచే వాగాదీంద్రియములు నిర్వీర్యములాయినవి) అంత దేవతలు వాగాదులను నిందించి ముఖ్యప్రాణము ను ద్గాతనుగాఁ జేసికొని దేవతలు ప్రవృత్తులుకాఁగా అసురు లీయుద్గాతనుగూడఁ జంపుటకు వేగముగా వచ్చిరి కాని గట్టిఱాతిని ఢీకొన్న మట్టిబెడ్డవలెఁ జితికిపోయిరి. అని యీకథలో ప్రాణమును స్తుతించి యుద్గీథకర్త యగు ప్రాణము నుపాస్యముగాఁ దెల్పినది. ఛాందోగ్యములోఁగూడ నీకథయంతయు నిట్లువర్ణింపఁబడినది. కావున విద్యైక్యమే యని యర్థము.

### న వా ప్రకరణభేదాత్పరోవరీయస్త్వాదివత్ . 7

పూర్వసూత్రముచే విద్యైక్యమేయని యభిప్రాయము కాగా సిద్ధాంతము చేయుచున్నారు. న, వా=విద్యైక్యమేయని లేదు. ప్రకరణభేదాత్ =ప్రకరణభేద ముండుటవలన. అనఁగా,

ఛాం 1 లో, "ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత" (1-1-1) అని యుపక్రమించి ఉద్గీథావయవ మైన ఓంకారమును ఉపాస్యమునుగాఁ జెప్పి, "అథఖల్వేతస్యై వాక్షర స్యోపవ్యాఖ్యానం భవతి" ఛాం. 1-1-10. అని తిరిగి యా యుద్గీథావయవ మైన యోంకారము ననువృత్తిచేసి, దేవాసురాఖ్యాయికను జెప్పి "తముద్గీథ ముపాసాంచక్రిరే" ఛాం 1-2-1 అని చెప్పఁబడినది. కనుక ఈ ఛాందోగ్యవచనములో ఉద్గీథశబ్దముచే తను ఉద్గీథా (సామ) వయవమైన ఓంకారమునకే గ్రహణము కాని సమస్తమైన యుద్గీథమునకు (సామభక్తికి) గ్రహణము లేదు. అట్లుకాక ఉద్గీథపదముచే సకలసామభక్తికి గ్రహణమన్నచో "ఉద్గీథం" అన్నకర్మకు కర్తృలక్షణ చెప్పవలయును. అదికాక ఉపక్రమోప సంహారములకు భేదము సంభవించును.

బృహదారణ్యకములో ఉద్గీథకర్తయైన ప్రాణ ముపాస్యముగాఁ జెప్పఁబడినది. కావున రెండింటిలోను విద్యాభేద మున్నది. ఈభేద మెట్లనఁగా, పరోవరీయస్త్వాదివత్=పరోవరీయ స్త్వమువంటిది. పరస్మా ద్వరీయాన్=పరోవరీయాన్ పరమైనదానికంటెను మిక్కిలిపరమైనది (శ్రేష్ఠమైనది) పరోవరీయము; దానిధర్మము పరోవరీయస్త్వము. (పరస్మాత్ పరః, వరాచ్చ వరతరః= పరోవరీయాన్) అనఁగా, అన్నిటి కన్నగొప్పది. పరమా త్మోపాసనత్వ సామ్యమున్నను "ఆకాశో హ్యేవైభ్యో జ్యాయా నాకాశః పరాయణమ్" అని

యును జెప్పుదురు. ఛాం 1-9-1 "స ఏష పరోవరీయా నుద్గీథః స ఏషోఽనన్తః" అని పరోవరీయస్త్వాది గుణవిశిష్టమైన ఉద్గీథోపాసనము, అక్ష్యాదిత్యగత హిరణ్య శ్మశ్రుత్వాది గుణవిశిష్టమగు నుద్గీథోపాసనముకంటె నెట్లుభిన్నమో అట్లే ఓంకారోపాసనము ప్రాణోపాసనముకన్న వేఱు. కనుక నీ విద్యలు రెండును భిన్నము లనిసిద్ధాంతము.

### సంజ్ఞాతశ్చే త్తదుక్త మస్తితు తదపి 8

సంజ్ఞాతశ్చేత్ = ఉద్గీథవిద్యయను నొకే సంజ్ఞవలన, ఈ బృహదారణ్య ఛాందోగ్యములలోఁ జెప్పఁబడిన యీవిద్య లొక్కటేయన్నచో, తదుక్తం = ఆసంగతి వెనకటి "నవా ప్రకరణభేదాత్" అనుసూత్రములో సంజ్ఞైకత్వము విద్యైకత్వ సాధకము కాదని చెప్పఁబడినది. అవి రెండును ఉద్గీథవిద్యలేయైనను, ప్రకరణభేదమువలన విద్యైక్యములేదు అని నిర్ణయింపఁబడినది. అస్తితుతదపి = ఈసంజ్ఞైకత్వము ప్రసిద్ధభేదము లందును గలదు. పరోవరీయస్త్వాద్యుపాసనలయందు ఉద్గీథవిద్యయని సంజ్ఞైకత్వమున్నది. పరస్పరభేదముకల అగ్నిహోత్ర దర్శ పూర్ణమాసాదులు కాఠకైకగ్రన్థ పఠితములగుటచేఁ గాఠకము లనియు సంజ్ఞైక్యమున్నది. అట్లే యిచ్చటను నుద్గీథసంజ్ఞైక్య మున్నను విద్యైక్యములేదు. భేదహేతువులేని సంవర్గవిద్యా యందు సంజ్ఞైకత్వమువలన విద్యైకత్వము చెప్పినను జెప్పము

వచ్చుననుగాని ఉపక్రమభేదాది భేదహేతువులుండుటచే నిట్టి స్థలములందు సంజ్ఞైకత్వమువలన విద్యైకత్వము చెప్పరాదు.

## 4 వ్యాప్త్యధికరణము

అవ॥ "ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత" (ఛాం 1-1-1) అన్నచోట అక్షరోద్గీథశబ్దములకు సామానాధికరణ్యమునుబట్టి విద్యాభేదము చెప్పఁబడినది. ఇపుడుద్గీథమున కక్షరవిశేషణత్వమును సమర్థించుట కీయధికరణ మారంభింపఁబడినది.

"ఓ మిత్యేత దక్షర ముద్గీథమ్" అనఁగానే అక్షరోద్గీథములకు సామానాధికరణ్యము తోఁచుచున్నది. ఆసామానాధికరణ్యము "నామబ్రహ్మేత్యుపాసీత" ఛా-7-1-5 అన్నచోటనామమ్న బ్రహ్మదృష్టివ దధ్యాసరూపమా? (నామమునందుబ్రహ్మదృష్టివలె నధ్యాసరూపమైనదా?) "యత్ రజతం సాశుక్తిః" "యశ్చోరః సస్థాణుః" అన్నట్లువలె అపవాదమా? "యోజీవః తద్బ్రహ్మ" అన్నట్లు ఏకత్వమా ! "యన్నీలం తదుత్పలమ్" అన్నట్లు విశేషణవిశేష్యభావమా? అని నాలుగువిధముల సందేహము కలుగుచున్నందున నిర్ణయము లేదు అనిరాఁగా.

## వ్యాప్తేశ్చ సమంజసమ్ 9

వ్యాప్తేశ్చ = వ్యాప్తివలన, ఓంకారము ప్రతిబుక్కునకు ప్రతియనువాకమునకుఁ బ్రతిసామమునకును ఆద్యంతములందు వ్యాపించియుండుటవలన, నిం దేయోంకార ముపా

స్యము? అను ప్రశ్నము కలుగఁగా "సమంజసం" = విశేషణ విశేష్య భావపక్షమును గ్రహించుటయే మంచిది. అనఁగా ఉద్గీథమును ఓంకారమునకు విశేషణముచేసి ఉద్గీథావయవ (సామవేదావయవ) మగు ఓంకారమునే ఉపాసింపవలెను. అని నిర్ణయము. అధ్యాస, అపవాద, ఏకత్వము అనుపక్షములను గ్రహింపరాదు. వానిని గ్రహించినచోఁ బ్రత్యేక ఫలకల్పనముకూడఁ గల్పింపవలసివచ్చును.

## 6-సర్వాభేదాధికరణము.

అథ :- వాజసనేయకమందు, ఛాందోగ్యమునందు, ప్రాణసంవాద సందర్భములో ముఖ్యప్రాణము నుపాసనచేయవలెనని చెప్పి, వాక్కు మొదలగు నింద్రియములకు వసిష్ఠత్వాది గుణములు చెప్పఁబడినవి. అనఁగా వాక్కునకు-వసిష్ఠత్వము, "వాచోవాహి వసిష్ఠత్వం" వాగ్మినోలోకే సుఖేన వాసదర్శనాత్ అనియు చక్షుస్సునకు, ప్రతిష్ఠాత్వమనుగుణమును - చక్షుష్మతః సుఖేన పాదప్రతిష్ఠాదర్శనాత్ అనియు శ్రోత్రమునకు సంపత్త్వము శ్రుతాత్మనిర్ధారణేన పరమసంపత్తిదర్శనాత్ అనియు, మనస్సునకు - ఆయతనత్వమును భోగ్యాకారవృత్తిద్వారా భోగ్యానామాయతనత్వం అనియును. రేతస్సునకు - జనిమత్త్వము - పురుషాద్యాకారేణ పరిణమమానం రేతో జనిమదితి మంతవ్యమ్ అనియును గుణములు చెప్పఁబడినవి.

కౌషీతక్యాది శాఖలయందును ప్రాణసంవాదములందు "అథాతో నిశ్శ్రేయసాదానం ఏతా హ వై - దేవతాః అహం శ్రేయసే వివదమానాః అని శ్రేష్ఠత్వము చెప్పఁబడినదే కాని వసిష్ఠత్వాదిగుణములు చెప్పఁబడలేదు. ఒకశాఖలోఁ జెప్పఁబడిన వసిష్ఠత్వాదిగుణములకు ఇక్కడ నుపసంహారమున్నదా? లేదా యను ప్రశ్న కలుగగా ఇందు సమాధానము చెప్పుచున్నారు.

సర్వాభేదా దన్యత్రేమే. 10

సర్వాభేదాత్ = సర్వశాఖలయందును ప్రాణోపాసనమునకు భేదములేదు కనుక, అన్యత్ర = ఈవసిష్ఠత్వాదిగుణములు లేనిచోట, ఇమే = ఈవసిష్ఠత్వాది గుణములుపసంహారముచేయఁదగినవి. ప్రాణోపాసన మన్నిటియందును నొక్కటే కనుక కౌషీతక్యాది శాఖలయందుఁ జెప్పఁబడకపోయినను వసిష్ఠత్వాదిగుణములచ్చటను నుపసంహారము చేయఁదగినవే. ఒకేవిద్యయందు ఒకచోట వసిష్ఠత్వాది గుణాపేత కలదని యొకచోట లేదనియనుటతగదు.

6 ఆనందాద్యధికరణము. (11-13)

అవ॥ ఆనందో బ్రహ్మ, తై 3-6., "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" తై (2-1.) అని తైత్తిరీయమునందు బ్రహ్మకు ఆనందము సత్యము మొదలగుధర్మములు చెప్పఁబడినవి. ఇట్లే మరికొన్నిచోట్ల బ్రహ్మవిద్యా ప్రతిపాదనసందర్భము

లందు బ్రహ్మకు విజ్ఞానఘనత్వము, సర్వగతత్వము పరాత్మత్వము మొదలగుగుణములు చెప్పఁబడినవి. వీనిలో ఏసందర్భమున నేగుణములు చెప్పఁబడినవో! ఎన్ని చెప్పఁబడినవో! అవిమాత్రమే యచ్చట గ్రహింపవలెనా! లేక యొచ్చటఁ జెప్పిన గుణములనైనను సర్వత్ర గ్రహింపవచ్చునా? అని సందేహముగలుగఁగా, నీయధికరణమున నిర్ణయించుచున్నారు.

ఆనందాదయః ప్రధానస్య. 11

ప్రధానస్య= ప్రధానమైనబ్రహ్మయొక్క ఆనందాదయః= ఆనందాదిధర్మము లెచ్చట నేవి చెప్పినను వానినన్నిటిని సంతటను గ్రహింపవచ్చును. ఏమనఁగా వెనకఁజెప్పిన సర్వాభేదాధికరణముచే బ్రహ్మయొక్కటే గనుక.

ప్రియశిరస్త్వాద్యప్రాప్తి రుపచయాపచయౌ హి భేదే. 12

ప్రియశిరస్త్వాద్యప్రాప్తిః= తైత్తిరీయకములో ఆనందమయుఁడగు ఆత్మ నుపక్రమించి "తస్య ప్రియమేవ శిరః మోదో దక్షిణః పక్షః, ప్రమోద ఉత్తరః పక్షః ఆనంద ఆత్మా, బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా, తై 2-5, అని చెప్పఁబడిన ప్రియమే శిరస్సు. మోదము దక్షిణపక్షము ప్రమోదము త్తరపక్షము, ఆనందము ఆత్మ. అను ప్రియశిరస్త్వాది ధర్మములకు బ్రహ్మయందుఁ బ్రాప్తిలేదు, హి=ఎందుచేతననఁగా, ఉపచయాపచయౌ=హెచ్చుతగ్గులు, భేదే=భేద మున్నప్పుడు చెప్పుటకు వీలయినవి. ఆనందాది బ్రహ్మధర్మములనన్ని

టని బ్రహ్మవిద్యయందు సర్వత్ర గ్రహింపవచ్చునని పూర్వ సూత్రమున జెప్పుటచే, తైత్తిరీయకములోఁ జెప్పిన ప్రియశిరస్త్వాది ధర్మములనుగూడ పరబ్రహ్మకుఁ జెప్పవచ్చునందురేమోయని యీసూత్రమున నట్లుచెప్పరాదని నిషేధించుచున్నారు. ప్రియ, మోద, ప్రమోదా, నందాదిగుణములు, తారతమ్యము (హెచ్చుతగ్గులు) గలవికనుక భేదప్రధానములగుటచే భేదరహితమైన యద్వితీయ పరబ్రహ్మ స్వరూపమునందు సంభవింపవు! ఏక మే వాద్వితీయం బ్రహ్మ" ఛాం 6-2-1 అని బ్రహ్మ యద్వితీయము. అవికాక ప్రియశిరస్త్వాదులు కోశధర్మములుకాని బ్రహ్మధర్మములు కావని "ఆనందమయోభ్యాసాత్" బ్ర సూ. 1-1-12.' అన్నచోటఁ జెప్పఁబడినది. పరబ్రహ్మయందు మనస్సు నవతరింపఁజేయుటకు సాధనములుగా నివిచెప్పఁబడినవేకాని, ద్రష్టవ్యములుగాఁ జెప్పినవికావు. సూత్రకారులు ప్రియశిరస్త్వాదులను బ్రహ్మధర్మములనుగాఁ జేసి న్యాయ మాత్రము చూపిరి. దీనికుదాహరణము వేఱు. ఉపకోసలవిద్యయందు సంయద్వామత్వాది ధర్మములు చెప్పఁబడినవి. దహరవిద్యయందు సర్వకామత్వాదులు చెప్పఁబడినవి. అచ్చట నొకవిద్యయందుఁ జెప్పఁబడిన గుణములకు మరొక విద్యయందు ఉపసంహారము (ప్రాప్తి) లేదనుట యీ సూత్రమునకు ఉదాహరణము. ఉపాస్యమగు బ్రహ్మయొక్క భేదమైనను ప్రక్రమ భేదముచే నుపాసన వేఱు.

ఇతరే త్వర్థసామాన్యాత్. 13

ఇతరేతు= ఇతరములైన ఆనందాదిధర్మములైతే, అర్థసామాన్యాత్ = ప్రతిపాద్యమగు బ్రహ్మముయొక్క సామాన్యము (ఏకత్వము) వలన, ఉపసంహరింపఁదగినవి. ఉపాసనావిధిపరములయిన వాక్యములందు వ్యవస్థకాని, అద్వితీయ పరబ్రహ్మప్రతిపాదక వాక్యములందు సర్వధర్మములను సర్వత్ర సమన్వయముగా నింపవచ్చును.

## 7 అధ్యానాధికరణము (14-15)

అవి కాఠకమునందు - "ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః అర్థేభ్యశ్చ పరంమనః మనసస్తు పరా బుద్ధిః బుద్ధే రాత్మా మహాన్పరః, మహతః పర మవ్యక్తం అవ్యక్తాత్పురుషః పరః, పురుషా న్నపరం కించిత్, సా కాష్ఠా సా పరా గతిః; కా.3-10-11 అనికలదు.

దీనియర్థము:- మనస్సుచేత అర్థములను ఆకళించుకొని యింద్రియములద్వారా అర్థములందు మనుజుఁడు ప్రవర్తించునుగావున నింద్రియములకన్న నర్థములు అంతరములు. అర్థములకంటె అఖిలాహాత్మికమైన మనోవృత్తి యాంతరము. మనోవృత్తికంటెను వృత్తిమత్తైన బుద్ధి అంతరమైనది. ఆబుద్ధికన్నను దానికుపాదానభూతుఁడును, మహచ్ఛబ్దవాచ్యుఁడును హిరణ్యగర్భరూపుఁడగు ఆత్మ యాంతరుఁడు. ఆహి

రణ్యగర్భాత్మకంబును తదుపాదానమైన అవ్యక్తమను మూలా
జ్ఞానము అభ్యన్తరము. ఆ అవ్యక్తముకంటెను దధిష్ఠానభూతుం
డైన చిద్రూపుఁడగు పురుషుఁడు అభ్యంతరుఁడు. ఆపురుషుని
కన్న అభ్యంతరమైనది మఱియొకటేదియును లేదు. ఆపురుషుఁడే
అభ్యంతరములలోఁ దుదివాఁడు, పరమగతియైనవాఁడును
నతఁడే.

ఇందు ఒకదానికంటె నొకటి యాంతరమైనదని చెప్పఁ
బడినది. అన్నిటికంటెను బురుషుఁ డాంతరుఁడని చెప్పఁబడి
నది. సర్వాంతరుఁడైన పురుషుని జెప్పుటయే యిందుఁబ్రధా
నమా? అన్నిటికిని అంతరత్వము చెప్పుట యిందుఁబ్రధా
నమా? అనిసంశయముగలుగ నిర్ణయించుటకై యీయధికరణ
మారంభింపఁబడినది.

ఆధ్యానాయ ప్రయోజనాభావాత్ .14

ఆధ్యానాయ - ధ్యానపూర్వకమైన సమ్యగ్జ్ఞానముకొఱకు, పురు
షుఁడే యన్నిటికంటెఁ బరుఁడని చెప్పఁబడుచున్నది. మిగిలిన
వాని నొకదానికంటెనొకటి పరమని చెప్పుట ప్రధానముకాదు.
ఏమనఁగా, ప్రయోజనాభావాత్ = ప్రయోజనములేమికతనక -
పురుషుని సర్వాంతరుఁడని తెలిపిన నతనిని దెలిసికొన్న నవి
ద్యనివర్తించుటయును ప్రయోజనముకలదు. మోక్షసిద్ధికలు
గును. "నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే"=అని కఠ

3-15 చెప్పుచున్నది. అంతేకాని యర్థాదు లోకదానికంటె నొకటి యూంతరమని చెప్పుటవలనఁ బ్రయోజనములేదు. ఫల కల్పనము చేయవలయును. వాక్యభేదము నంగీకరింప వలసి వచ్చును. అట్లుకాక ఏకవాక్యత నంగీకరించి వీనియన్నిటి కంటెఁ బురుషుఁడు పరమైనవాఁడని చెప్పుటయే సఫలము ప్రధానమును.

## ఆత్మశబ్దాచ్చ-15

ఆత్మశబ్దాచ్చ=ఆత్మశబ్దమువల్లనుగూడ ఇంద్రియాదు లోకదానికంటె నొకటి పరమని చెప్పుట పురుషప్రతిపత్త్యర్థమే యని తెలియుచున్నది. ఏమన, ప్రకృతమైన యీపురుషునే "ఆత్మ"యను శబ్దముతోఁ జెప్పుటవలన; కాఠకములో— "ఏష సర్వేషు భూతేషు గూఢోత్మా నప్రకాశతే, దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః" కాఠ 3 12

దీని యర్థము :— సర్వాభ్యంతరుఁడై గూఢముగా నున్న యీయాత్మ బహిర్ముఖులకు గోచరింపఁడు. అంతర్ముఖులై సూక్ష్మతత్త్వ దర్శనశీలులగువారుమాత్రమే యోగాభ్యాసముచే అగ్ర్యమైన = ఏకాగ్రత నొందింపఁబడిన సూక్ష్మమగు బుద్ధితో జూఁడగలరు.

అని ప్రకృత పురుషుని ఆత్మశబ్దముచే గ్రహించి అతఁడు దుర్విజ్ఞేయుఁడని చెప్పి, అతనిని దెలిసి కొనుటకై,

"యచ్ఛే ద్వాఙ్మనసీ ప్రాజ్ఞః" (బుద్ధిమంతుఁడు వాఙ్మనస్సులను నియమింపవలెను) అని యోగము చెప్పఁబడినది. ఇంత ప్రయాసపడి శ్రుతి చెప్పుట పురుష జ్ఞానము కొఱకే. ఇంద్రియాది పరంపర కాధ్యంతరత్వమును చెప్పుట బహిర్ముఖముగు చిత్తమును బురుషుని యందుఁ బ్రవేశింపఁజేయుటకు సాధన ప్రదర్శనార్థము.

### 8 ఆత్మగృహీత్యధికరణము. (16-17)

ఐతరేయకములో "ఆత్మా వా ఇద మేక ఏవాగ్ర ఆసీత్, నాన్యత్ కించన మిషత్ స ఈక్షత లోకాన్ను సృజా ఇతి, స ఇమాన్ లోకా నసృజత" ఐ. 1-1-2 అని కలదు. ఇచ్చట ఆత్మపదమునకు హిరణ్యగర్భుఁడర్థమా? పరమాత్మ యర్థమా? అని సందేహము కలుఁగగా — హిరణ్యగర్భుఁడని యర్థము చెప్పవలెను. ఏమన? "స ఈక్షత లోకాన్ను సృజా ఇతి" అని లోకసృష్టిని మాత్రమే చెప్పెను. పంచ భూతముల సృష్టిని జెప్పలేదు. మార్కండేయ పురాణములో "స వై శరీరీ ప్రథమః స వై పురుష ఉచ్యతే ఆదికర్తా స భూతానాం బ్రహ్మాగ్రే సమవర్తత" మార్కం. 45-65. అని శరీరధారియైన వారిలో మొదటివాఁడు సృష్టికర్తయని చెప్పఁబడినది. కావున నైతరేయములోని ఆత్మపదమునకు శరీరియైన హిరణ్యగర్భుఁడనియే యర్థము చెప్పవలెను.

అశరీరుఁడైన పరమాత్మయని యర్థము కాదు. అని పూర్వ పక్షము గలుగఁగా సిద్ధాంతమును జెప్పుచున్నారు.

ఆత్మగృహీతి రితరవ దుత్తరాత్ 16

ఇతరవత్ = ఇతరములైన "తస్మాద్వా ఏ తస్మా దాత్మన ఆకాశః సంభూతః" మొదలగు సృష్టి వాక్యములందు వలె ఇచ్చట "ఆత్మావా ఇద మేక ఏవ" అను వాక్యములోని ఆత్మపదమునకు, ఆత్మగృహీతిః = పరమాత్మయను అర్థమును గ్రహించుట యుక్తము. ఎందుచేతననఁగా ఉత్తరాత్ = ఉత్తర సందర్భమును బట్టి. "స ఐక్షత" అను ఈక్షాపూర్వక స్రష్టృత్వము, పరమాత్మ ధర్మముగా నిందుఁ జెప్పఁబడినది. కాన, ఈ ఆత్మపదమునకు, బరమాత్మ యనియే యర్థము.

అన్వయా దితిచే త్స్యాదవధారణాత్ 17

అన్వయాత్ = ఇచ్చటి వాక్యమున కన్వయము, హిరణ్య గర్భుడని యర్థము చెప్పిన పక్షముననే చక్కఁగఁ గుదురుచున్నందున, ఇతిచేత్ = హిరణ్యగర్భుఁడనియే యర్థ మన్నచో, అట్లుకాదు. అవధారణాత్ = "ఆత్మావా ఇద మేక ఏ వాగ్ర ఆసీత్" సృష్టికిఁ బూర్వమందు ఈ యాత్మ యొక్కఁడే యుండెను అని యవధారణము, (నిర్ధారణము) చేయుటవలన నీ యాత్మపదమునకుఁ బరమాత్మ యనియే యర్థము చెప్పవలెను.

ఈ 16, 17, సూత్రములకు రెండింటికిని మఱియొక విధముగా నర్థము చెప్పవచ్చును.

ఆత్మగృహీతి రితరవ దుత్తరాత్ 16

బృహదారణ్యకములో – "కతమ ఆత్మా" 4-3-7-1 అని ప్రారంభించి యాత్మను గుఱించి విస్తారముగాఁ జెప్పఁ బడినది. ఛాందోగ్యములో "సదేవ సోమ్య! ఇద మగ్ర ఆసీత్" ఛాం. (6-2-1) అని ప్రారంభించి సత్ పదార్థము వివరింపఁ బడినది. ఆ, ఆత్మపదార్థము ఈ సత్పదార్థమును ఒక్కటేనా? రెండును వేర్వేఱా? అని సందేహము గలుగగా భిన్నార్థములు గనుకఁ రెండును వేఱేయని పూర్వపక్షమురాఁగాఁ సిద్ధాంతమును జెప్పుచున్నారు. ఇతరవత్ = బృహదారణ్యకము నందువలెనే, ఛాందోగ్యము నందును, ఆత్మగృహీతిః = సత్ శబ్దమునకు ఆత్మయను అర్థమును గ్రహించుట యుక్తము. ఎందుచేతననఁగా, ఉత్తరాత్ = "స ఆత్మా తత్త్వమసి" ఛాం. 6-8-7 అని యుత్తర గ్రంథమున సచ్ఛబ్దవాచ్యుని ఆత్మగాఁ జెప్పుటవలన.

అన్వయా దితిచేత్ స్యాదవధారణాత్ 17

అన్వయాత్ = ఉపక్రమానురోధముగా నన్వయించుట వలన, ఉపక్రమములో (ఛాందోగ్యమున) ఆత్మశబ్దము లేదు కనుక, సత్పదమునకు ఆత్మపరముగా అర్థము చెప్పుట, కుదురదు

ఇతిచేత్ అన్నచో, అవధారణాత్ =పత్పరము ఆత్మానాత్మ సాధారణమైనను "స ఆత్మా తత్త్వమసి" అను వాక్యశేష మున ఆత్మావధారణము చేయుటవలన, స్యాత్ = పత్పదాత్మ పదములకు ఒకటే యర్థము అగును.

## 9 కార్యాఖ్యా నాధికరణము 18

వాజసనేయకము (బృహదారణ్యకము) లో ప్రాణసం వాదమునందు, ప్రాణము వాగాదీంద్రియముల నుద్దేశించి నాకుఅన్న మేమి? వస్త్ర మేమి? అని ప్రశ్నింపగా అవి క్రిమికీట పతంగ జంతువుల కన్నిటికి నేదియున్నదో యదియే నీకును నన్నము. ఉదకములే వస్త్రము అని బదులుపలికినవి. అందు చేత శ్రోత్రియులైన విద్వాంసులు భోజనము చేయుటకుముం దును తరువాతను నుదకములతో నాచమనముచేయుదురు, అని యున్నది.

"త ద్విద్వాంసః శ్రోత్రియా అశిష్యన్త ఆచామ న్త్యశిత్వా చాచామన్తి ఏత మేవ తదన మనగ్నం కుర్వన్తో మన్యన్తే" బృ 6-1-14 ఛాందోగ్యములోఁగూడ "తస్మాద్వా ఏత దశిష్యన్తః పురస్తా చ్చోపరిష్టా దద్భిః పరిదధతి" ఛాం 5-2-2 భోజనము చేయుటకు ముందును తరువాతను నుద కములతో పరిధానము చేయుదురు అని యున్నది. ఇక్కడ, ఆచమనము విధేయమా? వాసన్త్వధ్యానము (ఉదకమును

వస్త్రముగా భావించుట) విధేయమా? అని సంశయము కలుగఁగా వారించుటకై యీయధికరణ మారంభింపఁబడినది.

## కార్యాఖ్యానాదపూర్వమ్ 18

కార్యాఖ్యానాత్ = స్మృతులందు సకలానుష్ఠానాంగముగా శుద్ధ్యర్థమై ఆచమనము నిత్యము కార్య మని "ద్విజో నిత్య ముపస్పృశేత్" మున్నగువాక్యములచేఁ జెప్పఁబడుట చేత, ఈ ప్రాణవిద్యయందును ఆ ఆచమనకార్యము విధిప్రాప్తమే యగుటవలన (స్మృతులు శ్రుతిమూలములే కనుక) నిచట ఆచమనము విధేయము కాదు. అపూర్వం = అపూర్వమైన వాసస్త్వధ్యానమే విధేయము. "తదన మనగ్నం కుర్వంతః" అన్నచోట అనశబ్దమునకు అన్నమనియర్థము. అదియే ప్రాణముగా వివక్షచేయఁబడినది. దానికి నగ్నతానివృత్తికై యుదకముల నాచ్ఛాదించుట. ఇట అపూర్వమైన వాసస్త్వధ్యానమే విధేయము అని భావము. ఇచ్చట ఆస్మృతికి ఈశ్రుతియే మూలమేమో అనరాదు. ఇది ఉపాసనాప్రకరణములోని దగుటచేత సామాన్యవిషయక మగు నాస్మృతికిది మూలముగాదు.

## 10 సమానాధికరణము

వాజసనేయశాఖలో అగ్నిరహస్య బ్రాహ్మణమునందు శాండిల్యవిద్యకలదు. అందు "స ఆత్మాన ముపాసీత, మనో మయం ప్రాణశరీరం భారూపం [illegible]

క్షిణం మనోజవం సత్యసంకల్పం సత్యధృతిం సర్వగంధం, సర్వరసం, సర్వాదిశో ఽనుప్రభూతం, సర్వమిద మభ్యాప్త మవాక్యనాదరమ్" శతపథ 10-6-32 అని గుణములు వివరింపఁబడినవి.

ఈశాఖలోనే బృహదారణ్యకములో మఱల "మనోమయోఽయం పురుషో భాస్సత్యస్తస్మిన్నన్తర్హృదయే యథా వ్రీహిర్వా యవో వా సఏష సర్వస్యేశానః సర్వస్యాధిపతిః సర్వమిదం ప్రశాస్తి, యదిదం కించ" (బృ.5-6-1) అని యీ శాండిల్యవిద్య చెప్పఁబడినది. అగ్నిరహస్యమందు బృహదారణ్యకము నందును శ్రూయమాణమగు నది, యిది, రెండొకటే విద్యలా? గుణోపసంహారము కలదా? భిన్నములా? గుణానుపసంహారమేనా? అని సంశయము గలుగ, ఒకే శాఖయందు ప్రతిపత్తి (తెలిసికొనువాని) భేదము లేకుండుటచేతను, పునరుక్తియందుఁ బ్రామాణ్యము కలుగ కుండుటచేతను అభ్యాస న్యాయమునే విద్యాభేదమే ప్రాప్తమగుచున్నది. అని ప్రశ్న రాఁగా, సమాధానముగా ఈయధికరణము చెప్పఁబడుచున్నది.

### సమాన ఏవం చాభేదాత్ 19

భిన్న శాఖలయం దొకచోట ఉత్పత్తివిధి మఱియొకచోట గుణవిధి యని యీ రెండింటికిని ఏకత్వము చెప్పఁబడి నట్లు - ఏవం = ఈమాదిరిగా సమానే = ఒకేశాఖయందును విద్యైక్యమే. విద్యాభేదముకాదు, ఎందువలననఁగా, అభేదాత్ = ఉపాస్యమునకు భేదములేదుకనుక. రెండుస్థలము

లందును మనోమయత్వాది గుణకమగు బ్రహ్మమే ఉపాస్యము. కర్మమునకు ద్రవ్యదైవతములవలె నీయుపాస్యము విద్యారూపము. అగ్నిరహస్యమందుఁ జెప్పఁబడిన "సఆత్మాన ముపాసీత, మనోమయం ... అనాదరం" అను శ్రుతిలో బహుగుణశ్రవణమున్నది కనుక భూయస్త్వ న్యాయముచే నది యుత్పత్తివిధి. బృహదారణ్యకములో నిది గుణవిధి. అగ్నిరహస్యవిద్యయు నిదియు నొకటేయను ప్రత్యభిజ్ఞకలుగుటకై యచ్చటఁ జెప్పఁబడిన మనోమయత్వాది గుణములను గొన్నింటి ననువాదచేసి సర్వేశానత్వాది గుణములుకొన్ని యిచ్చటఁజెప్పఁబడినవి. కావున రెండింటియందును శాండిల్య విద్య యొక్కటియే గుణోపసంహారమున్ను గలదు.

## 11 సంబంధాధికరణము (20-22)

బృహదారణ్యకములో సత్యవిద్యయందు "సత్యం బ్రహ్మ" అని ప్రారంభించి, "తద్య త్తత్సత్యం అసౌస ఆదిత్యః, యఏష ఏతస్మిన్మండలే పురుషః,యశ్చాయం దక్షిణేఽక్షిన్ పురుషః" బృ.5-5-2అని సత్యబ్రహ్మకు, అధిదైవతము, అధ్యాత్మము, అని రెండుస్థానములను జెప్పి వ్యాహృతి శరీరత్వమును గల్పించి, "తస్యోపనిష దహరితి" ఇత్యధిదైవతమ్,తస్యోపనిష దహమితి, ఇత్యధ్యాత్మమ్- అని రెండుపనిషత్తులు చెప్పఁబడినవి. ఇందు మొదటిది అహర్నామకము, అహశ్శబ్దము, ప్రకాశవాచకము. రెండవది అహంనామకము. అహంశబ్దము

ప్రత్యగాత్మవాచకము. ఈ అహరహం శబ్దములు క్రమముగా ఆదిత్యచాక్షుష పురుషులకు నామములు. ఈసత్యవిద్యలో నామవ్యవస్థచే ధ్యానముచేయవలయునా? నామద్వయమునకుం బురుషద్వయమునందు నుపసంహారము చేయవచ్చునా? అని సంశయము గలుగం జెప్పుచున్నారు.

## సంబంధా దేవ మన్యత్రాపి 20

సంబంధాత్ = ఏకశాఖయందు అగ్నిరహస్య బృహదారణ్యకములలో విభాగముగం జెప్పంబడిన శాండిల్యవిద్యయందు ఏకవిద్యాత్వ సంబంధమువలన, గుణోపసంహార మెట్లు చెప్పంబడినదో; ఏవంఅన్యత్రాపి = ఈలాగుననే మఱియొక చోటను అనంగా ఈసత్యవిద్యయందును పురుషద్వయమునందును నామద్వయమునుపసంహారముచేయవచ్చును. అనిపూర్వపక్షము.

## నవా విశేషాత్ 21

నవా = పురుషద్వయమునకు నామద్వయమునందు ఉపసంహారము చేయరాదు. ఎందువల్లననంగా విశేషాత్ = స్థానవిశేషము ఉండుటవలన.

"య ఏష ఏతస్మిన్మండలే పురుష స్తస్యాహరితి నామ" బృ 5-5-2 అనితచ్ఛబ్దముచే ఆదిత్యమండలస్థ పురుషునే పరామర్శించుటవలన నతనికే అహర్నామత్వము. ఇట్లే

చాక్షుషపురుషునకే అహంనామత్వము. అని నామవ్యవస్థయే కాని పురుషద్వయమునందు నామద్వయోపసంహారము లేదు. అని సిద్ధాంతము.

దర్శయతిచ 22

చ = ఈలాటిధర్మములకు వ్యవస్థయని లింగమును (హేతువును) జూపుచున్నారు. "తస్యైతస్య తదేవరూపం, యదముష్యరూపం, యావముష్యగేష్ణౌ తౌగేష్ణౌ యన్నామ తన్నామ" ఛా 0.1.7.5 అక్షిస్థానమునందలి పురుషుఁడొకఁడు ఆదిత్యమండలమందలి పురుషుఁడొకఁడు ఇరువురుభిన్నులు, ఇరువురిధర్మములును భిన్నములు. ఆదిత్యపురుషగతధర్మములను అక్షిపురుషుని యందతిదేశించి "తస్యైతస్య తదేవ రూపమ్" అని చెప్పుచున్నారు. ఈచెప్పుటవలన భిన్నస్థానముగల భిన్నపురుషులకు అతిదేశములేనిచో పరస్పరగుణోపసంహారములేదు. అని దెలియుచున్నది. కాన ఇచ్చట నామద్వయమునకు బురుషద్వయమునందు ఉపసంహారము లేదు. వ్యవస్థయే అని యభిప్రాయము.

## 12 సంభృత్యధికరణము.

అవ॥ రాణాయనీయుల ఖిలగ్రంథములలో "బ్రహ్మజ్యేష్ఠా వీర్యా సంభృతాని బ్రహ్మాగ్రే జ్యేష్ఠం దివ మాతతాన." దీనియర్థము. వీర్యా = పరాక్రమ విశేషరూపము లయిన వియదాదులు, బ్రహ్మజ్యేష్ఠా = బ్రహ్మయే, జ్యేష్ఠమైన =

అనన్యాపేక్షమైన కారణము కలవి. లౌకికుల పరాక్రమముల వలె బ్రహ్మయొక్క వీర్యములు (పరాక్రమకృత్యములు) భంగము నొందనివి. = అనిభావము) సంభృతా= సంపాదింపఁబడినవి. జ్యేష్ఠంబ్రహ్మ= ఆజ్యేష్ఠమైన బ్రహ్మ, అగ్రే= మొదట (ఇంద్రాదులకంటె) దివం ఆతతాన = స్వర్గము నాక్రమించెను. ఇందు బ్రహ్మకు పరాక్రమసంభరణము స్వర్గవ్యాపనము. అనుగుణములు వినిపించుచున్నవి. ఈ గుణము లీశాఖయుల యుపనిషత్తులలోఁ జెప్పఁబడిన శాండిల్యవిద్య మొదలగు వానియందును వర్తించునా? ఆ విద్యలు నిదియునొక్కటా? భిన్నములా? అని సంశయముకలుగ, నీ యధికరణము చెప్పఁబడుచున్నది.

## సంభృతి ద్యువ్యాప్త్యపి చాతః 23

సంభృతి ద్యువ్యాప్తీ+అపిచ=సంభృతి=సంభరణము ద్యువ్యాప్తీ=స్వర్గ వ్యాపకత్వము ననుగుణములున్న, అతః= ఈస్థానభేదమువల్లనే, శాండిల్యవిద్యాదులయందు ఉపసంహరింపఁదగినవి కావు.

స్థానభేదమువలన నామములకు భేదవ్యవస్థ చేసినట్లు స్థానభేదమువల్లనే సంభృత్యాదులున్న శాండిల్యవిద్యయందుపసంహరింపఁబడవు. శాండిల్యవిద్యలో "ఏషమ ఆత్మాంతర్హృదయే" ఛాం, 3-14-3. అని బ్రహ్మకు హృదయము

ఆయతనము (స్థానము) గాఁ జెప్పఁబడినది. దహరవిద్యలో దహరం పుండరీకం వేశ్మ దహరేస్మి న్నంత రాకాశః" ఛాం. 8-1-1 ఆకాశము స్థానము అనియు, ఉపకోసలవిద్యలో "య ఏషోఽక్షిణి పురుషో దృశ్యతే" ఛాం (4-15-1) లో అక్షిస్థానమనియు భిన్నభిన్నముగ స్థానము చెప్పఁబడినది. వీని యందెచ్చటను సంభృత్యాది గుణములు చెప్పఁబడలేదు కాన నీగుణముల కచ్చట ఉపసంహారములేదు.

## 13 పురుషవిద్యాధికరణము.

ఛాందోగ్యమున తాండినాయన పైంగిరహస్య బ్రాహ్మణములందును పురుషయజ్ఞము చెప్పఁబడినది. "పురుషో వావ యజ్ఞః తస్య యాని చతుర్వింశతి వర్షాణి త త్ప్రాతస్సవనమ్ ఛాం. 3-16-1. "అథ యాని చతుశ్చత్వారింశద్వర్షాణి తన్మాధ్యందినం సవనమ్". ఛా 3-16-3. అథ యాన్యష్టాచత్వారింశద్వర్షాణి తత్తృతీయసవనమ్". ఛాం. 3-16-5 "స యదశిశిషతి యత్పిపాసతి యన్నరమతే సా దీక్షా. అథ యద్ధసతి జక్షతి తేస్తుతశస్త్రై. ఛాం. 3-17-1-3. ఈపురుషయజ్ఞములో "పురుషోవావ యజ్ఞః" అని పురుషుఁడుయజ్ఞముగాఁ గల్పింపఁబడినాఁడు. పురుషుని ఆయువును మూఁడువిధములుగ విభజించి మొదటి 24 సం॥లు ప్రాతస్సవనమనియు తరువాతి 44 సం॥లు మాధ్యందినసవనమనియు, తరువాత 48 సం॥ల వయస్సు మూఁడవ సవనమనియుఁ గల్పింపఁబడినది.

ఈ పురుష విద్యావేత్త 116 సం॥ జీవించును. అతని యాకలి దప్పికలు దీక్ష. నవ్వు, తిండి, స్తుతి శస్త్రములు, అని యీ విధముగాఁ గల్పింపఁబడినది.

తైత్తిరీయకములోఁగూడ "తస్యైవం విదుషో యజ్ఞ స్యాత్మా యజమానః శ్రద్ధా పత్నీ శరీరమిధ్మ మురో వేది ర్లోమాని బర్హిర్వేదిః । నారా॥ శ్రీ. అని పురుష యజ్ఞము చెప్పఁబడినది. పైన ఛాందోగ్య తాండి పైంగి బ్రాహ్మణము లలోఁ జెప్పఁబడిన పురుష విద్యా గుణంబులు తైత్తిరీయక మునందుఁగూడ నుపసంహరింపఁబడ వచ్చునా? రెండును బురుషవిద్యలే కావున నుపసంహరింపఁబడ వచ్చునని యభి ప్రాయము రాఁగా, ఈయధికరణ మారంభింపఁబడినది.

పురుష విద్యాయామివచేతరేషా మనామ్నానాత్. 24

పురుషవిద్యాయామివ = తాండి పైంగి రహస్య బ్రాహ్మణములలోని పురుష విద్యయందువలె, ఇతరేషాం = తైత్తిరీయ శాఖీయుల పురుషవిద్యయందు, అనామ్నా నాత్ = ధర్మములను నన్నిటిని జెప్పకపోవుటవలన వాని కచ్చట ఉపసంహారము లేదు. "మరణమే అవభృథమని" యేదో కొద్దిపోలికయున్నను శేషధర్మములలో విశేషభేద ముండుటవల్లను ఆ ధర్మముల నచ్చట చెప్పకపోవుట చేతను రెండును భిన్నములు. తాండిశాఖాస్థ విద్యలోఁ బురుషుఁడే యజ్ఞము పొమ్యుఁడని చెప్పఁబడినది.

తైత్తిరీయములో పురుషుఁ డాచరించు యజ్ఞమున ఆత్మాదులయందు యజమానత్వ కల్పనమని భేదము కలదు. అదికాక తైత్తిరీయములో "తస్యైవం విదుషః" అని బ్రహ్మ విద్యాప్రశంస చేయఁబడినది. అచ్చట ఉపాసన చెప్పఁబడినది కనుక రెండును భిన్నములు.

## 14 వేధాద్యధికరణము

ఆవ॥ అథర్వణికు లుపనిషదారంభమునందు "సర్వం ప్రవిధ్య హృదయం ప్రవిధ్య ధమనీః ప్రవృజ్య శిరోఽభిప్ర వృజ్య" మొదలగు అభిచారిక మంత్రములను బఠింతురు. తాండినాయన శాఖీయులు "దేవసవితః ప్రసువ యజ్ఞమ్ ఛాం. బ్రా 1-1 అను మంత్రమును బఠింతురు. శాట్యాయనులు శ్వేతాశ్వోహరితసీలోసి" అనియు, కఠులు, తైత్తిరీయులును "శంనోమిత్రః శ్శంవరుణః తై. 1-1-1. అనియు, వాజసనే యులు "దేవాహవై సత్రం నిషేదుః" శత. 14-1-1-1 అని ప్రవర్గ్యబ్రాహ్మణమును కౌషీతకులు "బ్రహ్మవా అగ్నిష్టోమః బ్రహ్మైవ తదహః బ్రహ్మణైవ బ్రహ్మోపయన్తి" అని యగ్ని ష్టోమబ్రాహ్మణమును బఠింతురు. ఈవిధముగ నీశాఖీయులు పనిషదారంభమునందు పఠించు ప్రవిధ్యాది మంత్రములు, ప్రవర్గ్యాది కర్మములున్ను తత్తద్విద్యల యం దుపసంహరింపఁ బడునా! అని సంశయముగలుఁగ విద్యా ప్రధానములగు ఉపనిషద్గ్రంథములకు సన్నిధిలో=సమీపమునఁ బఠింపఁబడు

టచే సన్నిధి సామర్థ్యమున విద్యలలో వీనికి నుపసంహారము కలదు. అని యభిప్రాయము కలుగుచుండఁగా నీయధికరణము ప్రారంభింపఁబడినది.

## వేధా ద్యర్థ భే దాత్ 25

వేధాది + అర్థభేదాత్ = వేధ మొదలగు (హృదయమును వేధించి, ధమనులను వేధించి) అర్థభేదము ఉండుట వలన వీనికి విద్యలలో ఉపసంహారము లేదు. హృదయ వేధాది మంత్రములకు లింగముచే అభిచారిక కర్మములయందు వినియోగము. ప్రవర్గ్యాదులకును నగ్నిష్టోమాదులయందు వినియోగము. లింగవాక్యములు సన్నిధికంటె బలవత్తరములు. కనుక వీనికి విద్యాంగత్వము లేదు.

## 15 హాన్యధికరణము

అవ॥ ఛాందోగ రహస్యములో "అశ్వ ఇవ రోమాణి విధూయపాపం, చంద్ర ఇవరాహోర్ముఖాత్ప్రముచ్య, ధూత్వాశరీరం, అకృతం కృతాత్మా బ్రహ్మలోక మభిసంభవామి" ఛాం. 8-13-1. అని యున్నది. ఇట్లే అథర్వణశ్రుతిలోఁ గూడ "యథానద్య స్స్యందమానా స్సముద్రేఽస్తం గచ్ఛన్తి నామరూపే విహాయ తథా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్య ముపైతి" ము. 3-1-3 అని యున్నది.

(1) గుఱ్ఱము రోమములను విదల్చుకొని స్వచ్ఛమైనట్లు నేను పాపమునంతను విదల్చుకొని స్వచ్ఛమైనవాఁడనై, చంద్రుఁడు రాహుముఖమునుండి విడువఁబడినవాఁడై ప్రకాశమానుఁడగునట్లు నేనీయనాదిసిద్ధమగు దేహమునువిడిచి ప్రకాశించువాఁడనై సాక్షాత్కృతమైన ఆత్మకలవాఁడనై బ్రహ్మలోకమును బొందుదును.

(2) నదులుప్రవహించుచు సముద్రమునుబొంది తమ నామరూపములనువిడిచి సముద్రములో నైక్యముహొందునట్లు, విద్వాంసుఁడు(జ్ఞాని)పుణ్యపాపములనువిడిచి, నిరంజనుఁడై పరమాత్మసామ్యమును బొందుచున్నాఁడు,-అనియర్థము.

శాట్యాయనులు-“తస్యపుత్రా దాయ ముపయన్తి సుహృద స్సాధుకృత్యాం ద్విషన్తః పాపకృత్యామ్”అనిపఠించుచున్నారు. అనఁగా, మృతుఁడైన జ్ఞానియొక్క పుత్రులు సహృదయులు సాధుకృత్యమును, ద్వేషించువారు పాపకృత్యమునుగా దాయమునుబంచుకొని పొందుచున్నారు. అని యర్థము. కౌషీతకీయములో “తత్సుకృతదుష్కృతే విధూనుతే తస్యప్రియా జ్ఞాతయ స్సుకృత ముపయన్త్యప్రియా దుష్కృతమ్” కౌ1-4-

ఈపై వాక్యములలో శాంట్యాథర్వణములలోఁ బుణ్యపాప త్యాగమాత్రమేవినఁబడుచున్నది. శాట్యాయనబ్రాహ్మణములో నతనిపుత్రులు దాయమును దీసికొనుచున్నారు అని

ఉపాయనము చెప్పఁబడినది. కౌషీతకీయములో సుకృత దుష్కృత విధూననము, దానినిజ్ఞాతులు తీసికొనుట, (ఉపాయనము) చెప్పఁబడినది. జ్ఞాని పుణ్యపాపములను విడిచిపెట్టుట, జ్ఞాతులు మొదలగువారు తీసికొనుట యని రెండువిషయములు చెప్పినశ్రుతులలో విచారింపవలసిన యంశము లేదు. కేవలముపాయనము చెప్పిన శ్రుతిలోఁగూడ త్యాగము లేనిదే ఉపాయనము సంభవింపదుగాన త్యాగముఆక్షిప్తమగు చున్నది. కాన నచ్చటను విచారణీయాంశము లేదు. ఇఁక కేవలత్యాగమునే చెప్పిన శాంఢ్యాథర్వణములలో, ఆజ్ఞాని (విద్వాంసుఁడు) విడిచిపెట్టిన ఆపుణ్యపాపములకు ఇతరత్రచెప్పిన ఉపాయన సంబంధము = అతని జ్ఞాతులుమున్నగువారు గ్రహింతురని చెప్పిన యంశము, సంబధింపఁజేయవలయునా? అక్కఁరలేదా? అని విచారింపవలయును. ఇక్కడ చెప్పఁబడలేదు గాన సంబంధింపఁజేయ నక్కఱలేదు. అని రాఁగా, చెప్పుచున్నారు.

హానౌ తూపాయనశేషత్వాత్ కుశాచ్ఛంద స్స్తుత్యుప
గానవత్తదుక్తమ్ 26

హానౌతు = హానిమాత్రము (పుణ్యపాపములనువిడిచిపెట్టుటమాత్రము) వినఁబడుచున్నశ్రుతులయందు ఉపాయనము = జ్ఞాతులు వానిని గ్రహించుట ఉపసంహరింపఁదగినది. (సంబంధింపఁజేయఁదగినది) ఎందుచేతననఁగా? ఉపాయన శబ్ద శేషత్వాత్ =ఉపాయనశబ్దము హానశబ్దమునకు శేషముగనుక

అనఁగా హానోపాయనములు రెండును చెప్పఁబడినచోట ఉపాయనము హానమున కంగముగాఁ జెప్పఁబడుచున్నది కనుక అనియర్థము. ఒక్కహాని మాత్రమే చెప్పఁబడినను రెండవదగు ఉపాయనమును సంబంధింపఁ జేయవలయును.

ఈ హానోపాయనములను చెప్పుట విద్యాస్తుతికొఱకు ఆహా! ఈతని విద్య ఎంతగొప్పది! అవిద్యాసామర్థ్యముచేత పుణ్యపాపములను విడుచుచున్నాఁడు. అవి మిత్రామిత్రుల యందు సంక్రమించుచున్నవి. అని స్తుతికొఱకుఁగాన హానమున్నచోట నుపాయనమును ఉపసంహరింపఁ జేయవలయును. ఈవిద్యాప్రశంసవలన నింతవిద్యనభ్యసించిన యీపండితుఁడు (జ్ఞాని) మహాత్ముఁడు ఎంతగొప్పవాఁడు! అని మెచ్చుకొనుచు నతనియెడల నప్రమత్తులుకాకుండుట ప్రయోజనము. గుణోపసంహారమునుచెప్పు సందర్భములో స్తుత్యుపసంహారరూపమైన యీసూత్రము చెప్పఁబడినదని సంగతి.

ఇచ్చట ఈశాఖలో చెప్పఁబడకపోయినను ఇతరశాఖలోఁ చెప్పఁబడినను ఉపాయనమును ఇచ్చట నుపసంహరింపవలెననుటకు దృష్టాంతమును చెప్పుచున్నారు. కుశాచ్ఛందస్స్తుత్యుపగానవత్ = కుశా = భాల్లవశ్రుతిలో "కుశా వానస్పత్యాస్థ తా మా పాత" అనియొక వాక్యముకలదు. యజమానుఁడు కుశలను బ్రార్థించుచున్నాఁడు, హేకుశాః సమిద్రూపాః, సమిద్రూపములైన ఓ కుశలూ! మీరు, వానస్పత్యాః =

వనస్పతి సంబంధముకలవారై యుండుడు, మా పాత = నన్ను రక్షించుడు. అనుప్రార్థనలో కుశలకు సామాన్యముగా వాన స్పత్యా అని వనస్పతి (వృక్ష) సంబంధము చెప్పఁబడినది. కాని ఆవృక్షమేదో చెప్పఁబడలేదు. అయినను శాట్యాయనీయ శాఖాంతరములో "ఔదుంబరాః కుశాః" అని చెప్పియుండుటచే, ఆవాక్యము నదీసికొని యిచ్చట ఔదంబర (మేడి చెట్టు) సంబంధమైన సమిధలను గ్రహించుచుండిరి. అట్లే శాఖాంతరములోఁ జెప్పఁబడిన ఉపాయనమును ఈహానమువద్దఁ గూడఁ జెప్పుకొనవలెను. ఇట్లే చెప్పఁబోవు మిగిలినదృష్టాంతములందును సమన్వయముచేసికొనవలెను.

ఛంద=ఛందోదృష్టాన్తము, "ఛందోభిస్తువతే" అను చోట, దేవాసురచ్ఛందస్సులకు, ఏది ముందు! ఏదితరువాత! అని విశేషముగాఁ జెప్పకపోయినను, శాఖాంతరమగు పైంగి శ్రుతిలోఁ జెప్పఁబడిన "దేవచ్ఛందాంసి పూర్వాణి" అను దానినిబట్టి ముందు దేవస్తుతి నిర్ణయముచేయఁబడుచున్నది.

స్తుతి=స్తుతిదృష్టాంతము = షోడశియను పాత్రవిశేషము గ్రహించినప్పుడు తదంగభూతమగు స్తోత్రము నెప్పుడు చేయవలెను! అను విషయమును ఛందోగులకుఁ గాలవిశేషము "సమయాధ్యుషితే సూర్యే షోడశినస్తోత్ర ముపాకరోతి" అను తైత్తిరీయక వాక్యమువలన నిర్ణయింపఁబడుచున్నది.

ఉపగానవత్ = ఉపగానదృష్టాంతము. "ఋత్విజ ఉపగాయన్తి" అనిసామాన్యముగా ఋత్విక్కులకులందఱకు ఉపగానము ప్రాప్తించుచుండగా "నాధ్వర్యు రుపగాయతి" అను శాఖాంతరీయవాక్యము ననుసరించి, అధ్వర్యువర్జితులైన ఋత్విజులే యుపగానముచేయవలెనని నిర్ణయింపఁబడినది. ఈ దృష్టాన్తములన్నిటిలోను శాఖాంతరీయ విషయము నిచ్చట సంబంధింపఁ జేసికొన్నట్లు, ప్రకృతమగు పుణ్యపాపములను విడిచిపెట్టుటయను విషయమున, ఉపాయనమునుగూడ (అతని ప్రియాప్రియులు వీనిని స్వీకరింతురనుదానిని, సంబంధింపఁజేయ వలయును.

ఈ విషయము జైమినిమహర్షికిని సమ్మతమని చెప్పుచున్నారు. 'తదుక్తమ్' ఆవిషయము జైమినిచేతను జెప్పఁబడినది. "అపితు వాక్యశేషస్యాత్ అన్యాయ్యత్వాత్ వికల్పస్య విధీనా మేకదేశ స్స్యాత్" (జై, సూ, 10-8-1) శ్రుత్యంతరగతమగు విశేషము శ్రుత్యంతరములో సంగీకరింపఁ బడకున్న వికల్పము సంభవించును. వేఱేగతి యున్నపుడు వికల్పము న్యాయముకాదు. అని "యజతిషు యేయజామహంకరోతి నానుయాజేషు" అనుచోట వికల్పమును బరిహరించుటకై యీసూత్రము చెప్పఁబడినది.

ఈసూత్రమునకు మఱియొకవిధముగా నర్థము.

పై నుదాహరించిన "సుకృతదుష్కృతే విధూనుతే" అన్న వాక్యములో "విధూనుతే" అనుదానికిఁ బుణ్యపాపములను

విడిచిపెట్టుట యని యర్థమా? లేక చలింపఁజేయుట యని యర్థమా? అని సంశయము గలుగ, "ధూఞ్ కంపనే" అని ధాతువునకు కంపన మర్థము. కంపనమనఁగాఁ జలింపఁజేయుట యనియే యర్థము. ప్రస్తుతములో పుణ్యపాపములను జలింపఁ జేయుటయనఁగా వానియొక్క ఫలము నీయకుండఁగాఁ జేయుట యని యర్థము. అని పూర్వపక్షము గలుగ, అట్లుకాదు "విధూనుతే" అనుదానికి విడిచిపెట్టుట యనియే యర్థము చెప్పవలయును. ఏమన ఉపాయనశబ్ద శేషత్వాత్ = ఉపాయనశబ్దముతో నేక వాక్యత కావలయును గనుక, హానిలేని దే ఉపాయనము కుదరదు కావున, విధూనుతే అనుదానికి విడిచిపెట్టుట యనియే యర్థమని సిద్ధాంతము. మిగిలినదంతయు సమానము.

## 16 సాంపరాయాధికరణము. (27-28)

అవ॥ పూర్వాధికరణములోఁ జెప్పఁబడిన సుకృత దుష్కృత త్యాగము, మరణానంతరము దేవయానమార్గముచే బ్రహ్మలోకమునకు వెళ్లుచున్న వానికి మార్గమధ్యమునందుఁ గలుగునా! లేక మరణసమయమునందే బ్రతికియుండఁగనే కలుగునా? అని సందేహము గలుగ మధ్య మార్గమునందుఁ గలుగును. ఎందుచేత? కౌషీతకులు పర్యంకవిద్యలో "సఏతం దేవయానం పంథాన మాపద్యాగ్ని లోక మాగచ్ఛతి, ... ... స ఆగచ్ఛతి విరజాంనదీం తాం మనసైవాత్యేతి. తత్సుకృతదుష్కృతే విధూనుతే" అని పఠించుచున్నారు.

పర్యంకస్థ బ్రహ్మోపాసకుఁడు బ్రహ్మప్రాప్త్యర్థమై పోవుచు విరజానదిని మనస్సుచేతనే అతిక్రమించును. (అందుచే) పుణ్య పాపములను విడిచిపెట్టును' అని యర్థము. దీనిచే మధ్య మార్గమునఁ బుణ్యపాప త్యాగము చేయునని రాఁగా సిద్ధాంతము చెప్పుచున్నారు.

సాంపరాయే తర్తవ్యాభావా త్తథా హ్యన్యే. 27

సాంపరాయే = మరణసమయమునందే (బ్రతికియుండఁగనే) పుణ్యపాపములను విడుచును. ఎందుచేతననఁగా, తర్తవ్యాభావాత్ = తరింపఁదగినది (పొందఁదగినది) లేదుకనుక, ఉపాస్యమాన మగు విద్యాసామర్థ్యముచే విద్యానంతరమే సుకృత దుష్కృత క్షయము గలుగును. క్షయముకలుగక యర్చిరాదిమార్గ గమనము సంభవింపదు. మార్గములోఁ గొంతదూరము వఱకుఁ బుణ్యపాపములు అనువర్తించుటలోఁ బ్రయోజనము లేదు. అగ్నిహోత్ర యవాగూన్యాయముగ పూర్వభావి త్యాగము తరువాతఁ జెప్పఁబడినది. తథాహ్యన్యే = తాండిన శాట్యాయన శాఖీయులును "అశ్వ ఇవ రోమాణి విధూయ" అనియుండే పుణ్యపాప త్యాగమును జెప్పుచున్నారు.

ఛందత ఉభయావిరోధాత్. 28

ఛందతః = స్వేచ్ఛచేతను, కర్మక్షయమును జీవించి యుండఁగనే కావచ్చును. యమనియమాది సహితమగు

విద్యానుష్ఠానము తాను జీవించియుండఁగనే సంభవించును. కాని చనిపోయిన తరువాతఁగలుగదు. విద్యానుష్ఠాన హేతుక మగు సుకృతదుష్కృత కర్మక్షయముగూడ జీవించియుండఁగనే సంభవించును. హేతువుండఁగాఁ గార్య మేలకలుగదు? బ్రహ్మప్రాప్తి దేహత్యాగముగలుగక సంభవింపదు గాన దేవయాన ప్రస్థితుఁడగు నతనికిఁగలుగును. అని విద్యాకర్మ క్షయములకు నిమిత్త నైమిత్తికత్వము చెప్పిన, ఉభయావిరోధాత్ = తాండినాయన శాట్యాయన శాఖీయులి రువురతో విరోధము లేకుండును.

## 17 గతేరర్థవత్త్వాధికరణము. 29-30

అవ: పుణ్యపాపములను విడిచిపెట్టుటను చెప్పినసందర్భ ములో ఒక్కచోట దేవయాన మార్గము చెప్పఁబడినది. ఒక చోట చెప్పఁబడ లేదు. అచ్చటఁగూడ నీ మార్గమున కుప సంహారము చెప్పవలయునా? అని సందేహము కలుగఁ జెప్పఁబడుచున్నది.

గతే రర్థవత్త్వ ముభయథాఽన్యథాహి విరోధః 29

గతేః = దేవయాన మార్గమునకు, ఉభయథా = రెండువిధములుగా విభాగముచేయుటచేత, అర్థవత్త్వం = సార్థకత, అన్యథా = అలాకాకపోయినచో, విరోధోహి = శ్రుతివిరోధముకలుగును.

ఉపాసనాపద్ధతిలో దేవయాన మార్గముకాని నిర్గుణ విద్యాసందర్భములో దేవయానమార్గములేదు. అవిద్యాక్షయ మగుటతో నచ్చటనే యతఁడు "నిరంజనః పరమం సామ్య ముపైతి పుణ్యాం" ము. (5-1-3) నిరంజనః = భావిజన్మరహి తుఁడై, పరమాత్మ స్థితినిబొందును. అందుచే నతనికి మార్గా పేక్షలేదు. అచ్చటఁగూడ మార్గమున్నదని చెప్పినచో, పైనచూపిన "పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యము పైతి" యను శ్రుతి విరోధము వచ్చును.

ఉపపన్న స్తల్లక్షణార్థోపలబ్ధే ర్లోకవత్. 30

ఉపపన్నః = ఉపాసనయందే దేవయానమార్గ సంబం ధము, నిర్గుణవిద్యలో ఆమార్గసంబంధములేదు అని చెప్పుట, తగియున్నది. ఎందుచేతననఁగా, తల్లక్షణార్థోపలబ్ధేః = తత్ + లక్షణ + అర్థ + ఉపలబ్ధేః = తత్ = ఆగతి, లక్షణ = కారణముగాఁగల, అర్థ = సగుణవిద్యా ఫలరూప మయిన యర్థముయొక్క, ఉపలబ్ధేః = పొందుటవలన, సగుణ విద్యకు లోకాంతరస్థమగు బ్రహ్మప్రాప్తి ఫలముగాఁజెప్పినట్టి విషయము శ్రుతులలోఁ గనఁబడుచున్నందున అచ్చట దేవ యానమునుజెప్పుట యుపపన్నమైన విషయము. ఎట్లనఁగా, లోకవత్ = లోకములోవలె, దూరస్థలమం దున్నదానిని బొందఁదలఁచినవానికి మార్గాపేక్షకాని, దగ్గరనున్న దానిని బొందఁదలచినవానికి మార్గాపేక్షలేదు. సేతువునొద్ద నున్న

వారు గంగకుఁబోవలెనన్న, ఆమార్గము ననుసరింపవలెను, గంగదగ్గఱ నేయున్న వారికి మార్గమనుసరింప నక్కఱలేదు.

### 18 అనియమాధికరణము

అవ: సగుణ విద్యయందు దేవయానమార్గమునకు అర్థవత్త్వము (సార్థకత) కాని నిర్గుణ బ్రహ్మవిద్యలో దేవయానమార్గమునకుఁ బ్రసక్తి లేదని నిర్ణయింపఁబడినదికదా! సగుణ బ్రహ్మవిద్యలలోఁగూడ, కొన్నిటియందు ఈ దేవయానము వినఁబడుచున్నది. కొన్నిటియందు వినఁబడుటలేదు. పర్యంకవిద్య, పంచాగ్ని విద్య, ఉపకోసలవిద్య, దహర విద్యలయందు దేవయానమున్నది. మధు విద్య, శాండిల్య విద్య, వైశ్వానర విద్యలలో లేదు. ఈ మార్గమును జెప్పని మధు విద్య మున్నగువానిలోఁగూడ నీ దేవయాన మార్గమును జెప్పవలయునా? అక్కఱలేదా? అనఁగా నీ యధికరణమునఁ జెప్పఁబడుచున్నది.

అనియమ స్సర్వేషా మవిరోధ శ్శబ్దానుమానాభ్యామ్ 31

అనియమః = నియమములేదు. సర్వేషాం = సమస్తమైన సగుణవిద్యాస్థలములకు దేవయానమును సంబంధింపఁజేయుటలో, అవిరోధః = విరోధము లేదు, ఎందుచేతననఁగా, శబ్దానుమానాభ్యామ్ = శ్రుతిస్మృతులవలన, శ్రుతిస్మృతులు ప్రమాణముగా నుండుటవలన సర్వసగుణోపాసనలకు దేవయానమార్గ ప్రసక్తి చెప్పవచ్చును.

శ్రుతి :— తద్య ఇత్థం విదుః యే చేమేఽరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే తేఽర్చిష మభిసంభవన్తి" ఛాం. 5-10-7. ఎవరీ విధముగా పంచాగ్ని విద్య నూహింతురో ! ఎవ్వ రరణ్యములందు, శ్రద్ధ, తపస్సు, మొదలగు ధర్మములు కలవారై యుపాసన చేయుదురో వారందఱు అర్చిరాదిమార్గమును బొందుదురు. అని దీని యర్థము.

ఈ విషయములో స్మృతికూడఁగలదు.

శుక్లకృష్ణే గతీహ్యేతే జగతశ్శాశ్వతే మతే,
ఏకయా యాత్యనావృత్తి మన్యయాఽవర్తతే
పునః॥ భ.గీ. 8-26.

కావున ఉపాసన లన్నిటియందును దేవయానముకలదు.

19 యావదధికారాధికరణము

అః॥ నిర్గుణవిద్యలో జ్ఞానికి దేహపాతానంతరము ముక్తిసంభవించుట నియతమా? పాక్షికమా? అని సంశయము గలుగ, పాక్షికము. అపాంతరతమః ప్రభృతులకు దేహాంతర స్వీకారదర్శనము కనఁబడుచున్నది. కాన—వేద ప్రవర్తకుఁడగు అపాంతరతముఁడను నొక యాచార్యుఁడు శ్రీ మహావిష్ణువు నాజ్ఞచే కలిద్వాపర సంధికాలమున కృష్ణద్వైపాయనుఁడై పుట్టెను. ఈశ్వరుని యాజ్ఞచే సనత్కుమారుఁడు కుమారస్వామియై పుట్టెను. నారదవసిష్ఠాదులు జన్మించినట్లు

కలదు. కావున జ్ఞానులకును ఈ శరీరపాతానంతరమే ముక్తి కలుగుననుట నియతముకాదు. అని పూర్వపక్షము రాగా సిద్ధాంతమును జూపుటకై యీయధికరణముపక్రమింపఁ బడినది.

యావదధికార మవస్థితి రాధికారికాణామ్. 32

అధికారికాణాం = ఈశ్వరాజ్ఞచే నాయాయధికారము లందు నియుక్తులైన వారికి, యావదధికారం = ఆ యధికార మున్నంతవఱకు, (ఆయధికార సంపాదకమగు కర్మము క్షయము నొందువఱకు) అవస్థితిః = ఆ యధికారమునందుం డుట, తదనంతరము ముక్తి.

"తస్య తావదేవచిరం, యావన్న విమోక్ష్యేథ సంపత్స్యే"
ఛాం. 6-14-2 అను శ్రుతివలన.

అధికారమున నియుక్తులైనవారికి ఆ యధికార సంపాదకమగు కర్మము పెక్కుజన్మము లెత్తినఁ గాని నశింపదు. ఇతరులకు విద్యోత్పాదక శరీర నాశానంతరమే ముక్తి కలుగును.

## 20 అక్షరధ్యధికరణము

అవి! బృహదారణ్యకములో యాజ్ఞవల్క్యుఁడు గార్గి నుద్దేశించి చెప్పుచు "ఏతద్వైతదక్షరం గార్గి బ్రాహ్మణా

అభివదన్తి, అస్థూల మనణు అహ్రస్వ మదీర్ఘమ్" బృ. 3-8-8 అనియు ఇట్లే ఆధర్వణికములోఁగూడ, "అథ పరా యయా తదక్షర మధిగమ్యతే యత్త, దద్రేశ్య మగ్రాహ్యమగోత్ర మవర్ణ మచక్షుశ్శ్రోత్రం త దపాణిపాదమ్" ముండ. 1-2-6 అనియు ఇట్లే "అశబ్ద మస్పర్శమ రూప మవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ" కాఠ-1-3-15 అని చెప్పఁబడినది. ఈ నిషేధ శ్రుతులలో, ఒక నిషేధశ్రుతిలో లేని నిషేధములకు మిగిలిన నిషేధశ్రుతులలో ఉపసంహారమున్నదా? లేదా? అని సంశయము గలుగగా ఆనందాదులవలె నిషేధములు బ్రహ్మస్వరూపములు గావుకనుక ఉపసంహారము లేదు అని పూర్వపక్షము రాఁగా సిద్ధాంతముచేయుచున్నారు.

అక్షరధియాం త్వవరోధః సామాన్యతద్భావాభ్యాం
ఔపసద వత్తదుక్తమ్. 33.

అక్షరధియాం = అక్షరబ్రహ్మవిషయక నిషేధబుద్ధులకు, అవరోధః = ఉపసంహారము సర్వత్రకలదు. ఎందుచేతననఁగా సామాన్య తద్భావాభ్యాం = సామాన్య తద్భావముల చేత-సామాన్యమనఁగా, సమానస్యభావః సామాన్యం=విశేష నిరాకరణ రూపమైన బ్రహ్మప్రతిపాదన ప్రకారము అంతటను సమానముగనేయున్నది. ఈసమానస్థితియే సామాన్యము. తద్భావమనఁగా తత్ = ఆబ్రహ్మయొక్క, భావము = తత్త్వ, ఇచ్చటఁజెప్పఁబడినదియు ఆబ్రహ్మస్వరూపమేయనుప్రత్య

భిన్న, ఈ సామాన్య శబ్దాభావముల చేత ఉపసంహారము కలదు. నిషేధము స్వరూపప్రతిపాదకము కాకపోయినను ఉపలక్షణముగా స్వరూపప్రతిపత్త్యర్థమే -ఔపసదవత్ = ఉపసత్సంబంధి మంత్రములవలె అని నిరూపణము. అనగా, యజుర్వేదమున "జమదగ్నిః పుష్టికామ శ్చతూరాత్రేణాయజత" అని యుత్పన్నమైన జామదగ్న్యాహీనమునందు "పురోడాశిన్య ఉపసదో భవన్తి" అని పురోడాశయుక్తములైన ఉపసదిష్టుల యందు "అగ్నే ర్వేర్హోత్రం వేరధ్వరం" అను మంత్రములుపదేశింపఁబడినవి. ఈమంత్రము లుద్గాతృవేదోత్పన్నములు పురోడాశప్రదానములునైనవి. ఉద్గాతృ వేదోత్పన్నములగుటచే ఉత్పత్తివిధిచే ఉద్గాతృప్రయోగార్హములా? పురోడాశప్రదానమున వినియోగముకనుక పురోడాశము సధ్వర్యుడిచ్చుచున్నాఁడుకనుక సధ్వర్యుఁడు ప్రయోగింపవలసినవా? అని సందేహముకలుగ, స్వరూపమాత్రబోధకమైన యుత్పత్తివిధికంటె వినియోగవిధి ప్రబలము ముఖ్యమునని, ముఖ్యానురోధముచే సధ్వర్యుప్రయోగార్హములని నిర్ణయింపఁబడినది. ఇందు ఎచ్చటనోయున్నవైనను అధ్వర్యుకర్తృక పురోడాశవిశేషములకు అధ్వర్యునితోనే సంబంధమును చెప్పినట్లు ఇచ్చటగూడ ఎచ్చటనోయున్నవైనను అక్షరప్రమితివిశేషములైన "అస్థూలమనణు" మొదలగు నిషేధములకక్షరునితోనే సర్వత్రసంబంధము చెప్పవలెనని దృష్టాన్తము. తదుక్తమ్= అది జైమినిమహర్షి చేతనుగూడ "గుణముఖ్యవ్యతిక్రమే తద

ర్థత్వాత్ ముఖ్యేన వేదసంయోగః జై. 3-3-5 అనుసూత్రమునఁ జెప్పఁబడినది. అచ్చట అధానగత వారవన్తీయసామములందు ఉపాంశుస్వరమా? ఉచ్చైస్స్వరమా? అనివిచారణముచేసి గుణ ముఖ్యవ్యతిక్రమన్యాయముచే, ఉపాంశుస్వరమే నిశ్చయింపఁ బడినది. అట్లే ఇచ్చటను, ప్రధానమగు అక్షరసంబంధమువలన నంతటను సర్వనిషేధోపసంహారము చెప్పవలెను.

## 21 ఇయదధికరణము.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానంవృక్షం పరిషస్వజాతే, తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి, అనశ్నన్నన్యో అభిచాకశీతి, ముం-3-1-1 అని అధ్యాత్మాధికారములో ఆథర్వణికులు పఠించుచున్నారు. కాఠకములో ఋతంపిబన్తౌ సుకృతస్యలోకే గుహాంప్రవిష్టౌ పరమే పరార్ధే ఛాయాతపౌ బ్రహ్మవిదోవదన్తి పంచాగ్నయో యేచ త్రిణాచికేతాః॥ కా॥ 3-1-

అని యున్నది- ఈ రెండింటియందును జెప్పఁబడినవి రెండువిద్యలా? ఒక్కవిద్యయేనా? అని సంశయము. మొదటి దానిలో "అనశ్నన్నన్యః" అనియు, రెండవదానిలో "ఋతంపిబంతౌ" అనియు నుండుటచే మొదటిదానిలో నొకనికి భోక్తృత్వము రెండవవానికి అభోక్తృత్వము తెలియుచున్నది. రెండవమంత్రములో, ఋతంపిబంతౌ అని యిరువురకు భోక్తృత్వము చెప్పఁబడినది. వేద్యభేదముచే విద్యాభేదమని

పూర్వపక్షముగాఁగా సిద్ధాన్తము చెప్పుచున్నారు - రెండు మంత్రములలోను చెప్పఁబడినది యొక్కటే విద్య. విద్యా భేదము లేదు. ఎందు చేతననఁగా,

ఇయదామననాత్ 34

ఇయత్త్వావచ్ఛిన్నము ద్వితోపదేశమునకు వేద్య రూపమును, రెండుచోట్లను నభిన్నముగనే తెల్పుటవలన, విద్యాభేదము లేదు. ఇచ్చట రెండు మంత్రములందును భోక్తయగు జీవు ననువదించి పరమాత్మాభేదము చెప్పఁబడి నది. "ఋతంపిబంతౌ" అనుచోట ద్వివచనము ఛత్రిన్యాయ మునఁ జెప్పఁబడినది. అందుచే విద్యైక్యము. వెనుకటి గుహాధి కరణమున కిది ప్రపంచ భూతము.

22 అంతరత్వాధికరణము (35-36

బృహదారణ్యకములో "అథహైన ముషస్తశ్చా క్రా యణః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ, యత్సాక్షా ద పరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరః తం మే వ్యాచక్ష్వ బృ- 3-4-1 అని ఉషస్తబ్రాహ్మణములోను,

"అథహైనం కహోలః కౌషీతకేయః పప్రచ్ఛ యాజ్ఞ వల్క్యేతిహోవాచ॥ యదేవసాక్షాత్ బృ 3-5-1 అని కహోలబ్రాహ్మణము నందును చెప్పఁబడినది.

ఇందు మొదటిదానిలో చాక్రాయణుఁడగు ఉషస్తుఁడను వాఁడు యాజ్ఞవల్క్యుని సర్వాంతరుఁడగు ఆత్మస్వరూపమును చెప్పుమని వేడెను. అతఁడు కార్యకారణరహితుఁ డాత్మయని చెప్పెను.

ఇట్లే కౌషీతకేయుఁడగు కహోలుఁడు ప్రశ్నింపఁగా నతనికి అశనాయాద్యతీతుఁడు (ఆకలిదప్పులులేనివాఁడు) ఆత్మయని చెప్పెను.

ఈ రెండింటియందును చెప్పఁబడినవాడు ఒక్కఁడేనా! ఇరువురా? చెప్పఁబడినవిద్యయొక్కటేనా! లేక రెండును భిన్నవిద్యలా? అని సంశయముగలుగ "పునరామ్నానా దభ్యాసన్యాయేన" జై 2-2-2 అని మరలఁజెప్పుటవలన రెండును రెండువిద్యలని భేదమురాగా, విద్యైకత్వమేయని సిద్ధాంతమును చెప్పుచున్నారు.

అంతరా భూతగ్రామవత్ స్వాత్మనః 35

స్వాత్మనః = స్వాత్మకు, అంతరా = రెండు బ్రాహ్మణములందును సర్వాంతరత్వమును ఆమ్నానాత్ = (వెనకటి సూత్రమునుండి తెచ్చుకొనవలెను) చెప్పుటవలన విద్యైకత్వమేకాని భేదముకాదు. ఎట్లనఁగా, భూతగ్రామవత్ = మతియొక శ్రుతిలో, "ఏకో దేవ స్సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా (శ్వేతా 6, 11) అని సమస్తభూతములందు సర్వాంతరుఁడైనవాఁ డొక్కఁడేయని చెప్పుట

వలన నిచ్చట రెండు బ్రాహ్మణములందుఁ జెప్పఁబడినవాఁడును ఒక్కఁడేకాని భిన్నులుకారు. కాన విద్యైక్యమే.

అన్యథా భేదానుపపత్తిరితిచే న్నోపదేశాన్తరవత్ 36

అన్యథా = ఈ రెండును వేర్వేఱువిద్యలని చెప్పక పోయినచో భేదానుపపత్తిః = భేదముపపన్నముకాదు. రెండువిధములుగాఁ జెప్పుట నిరర్థకము. ఇతిచేత్ = అని యన్నచో, న = కాదు ఉపదేశాన్తరవత్ = ఛాందోగ్యములో "తత్త్వమసి అనుచోట తొమ్మిదిపర్యాయములు, అభ్యాసముగాఁ జెప్పినను విద్యాభేదములేనట్లు ఇచ్చటను విద్యాభేదము లేదు.

28 వ్యతిహారాధికరణము.

అవి ఐతరేయు లాదిత్యపురుషు నధికరించి, "తద్యోఽహం సోఽసౌ యోఽసౌ సోఽహమ్ ఐ. ఆ. 2-2-4-6, అనిపఠించుచున్నారు. దేహేంద్రియాది సాక్షిభూతుఁడైన యే జీవుఁడు కలఁడో! అతఁడే ఆదిత్యమండల వర్తియగు పరమాత్మ! ఆదిత్యమండలవర్తియగు పరమాత్మ యెవ్వఁడో అతఁడే మన దేహాదు లందున్నవాఁడు. అని యర్థము. ఇట్లే జాబాలురు, "త్వంవా అహమస్మి భగవో దేవతే" అహంవై త్వమసి భగవో దేవతే!" జా. శ్రు. అని పఠించు చున్నారు. ఓపూజ్యురాలవైన దేవతా నీవే నేను, నేనేనీవు.

ఇచ్చట — ఈశ్వరునితో ఏకత్వవిషయమగు ఏకరూప చింతనమే విధింపఁబడుచున్నదా? లేక జీవేశ్వరుల కన్యోన్యాను వాదముచేత, అన్యోన్యాత్మకత్వరూప వ్యతిహారముచే (మార్పుచే) ఉభయ విషయమగు చింతనము విధింపఁబడు చున్నదా? అని సంశయము గలుగ, జీవబ్రహ్మైక్య లక్షణ మగు వస్త్వైక్యముకొఱకు నేకరూపమైన చింతనమే విధింపఁ బడుచున్నది. అనిరాగా, చెప్పుచున్నారు.

వ్యతిహారో విశింషంతి హీతరవత్ 37

వ్యతిహారః = వ్యతిహారమే (వినిమయమే) ఇచ్చట ఉపాస్యముగా విధింపఁబడుచున్నది. ఇతరవత్ = ఇతరము లైన, సర్వాత్మత్వాది గుణము లెట్లుపాస్యములుగా విధింపఁ బడుచున్నవో అట్లే ఇచ్చట, విశింషన్తిహి = జీవపర మాత్మలు అన్యోన్యాత్మకత్వరూప వ్యతిహారముచే నుపాస్య ముగా, నుభయరూపచింతనమును జెప్పుచున్నారు. ఏకరూప చింతనమే యున్నచో జీవున కీశ్వరునితో నైక్యబోధకమగు ఉపాస్యాంశమునకు సార్థకతకలుగునుగాని ఈశ్వరునికి జీవు నితో నేకత్వబోధకాంశమునకు అర్థవత్త్వములేదు. వ్యతిహార మునం దుభయాంశములకు సార్థక్యము కలుగును.

## 24 సత్యాద్యధికరణము.

బృహదారణ్యకములో, హృదయాఖ్యుఁడగు హిరణ్య గర్భు నుద్దేశించి "స యో హైతన్మహద్యక్షం ప్రథమజం

వేద సత్యమ్ బ్రహ్మేతి జయతీమాన్ లోకాన్" బృ 5-4-1 అని సత్యవిద్యను విధించి, తదంగముగా "తదేత త్త్ర్యక్షరగుం సత్యం ... తద్యత్సత్య మసౌ స ఆదిత్యః, య ఏష ఏతస్మిన్మండలే పురుషో యశ్చాయం దక్షిణేఽక్షన్ పురుషః బృ 5-5-2 అని చెప్పఁబడెను.

ఇచ్చట, ఈసత్యవిద్యలు రెండును వేర్వేరా? ఒక్కటియేనా? అని సందేహము గలుగుచున్నది, మొదటిసత్య విద్యకు "జయతీమాన్ లోకాన్" అని ఫలము చెప్పఁబడినది. రెండవదానికి "హన్తి పాప్మానం" అని ఫలము చెప్పఁబడినది. విభిన్న ఫలములను జెప్పినవి కావున నీవిద్యలు రెండును విభిన్నము లని పూర్వపక్షము గలుగుచుండ సిద్ధాంతము చెప్పుచున్నారు.

## సైవహిసత్యాదయః 38

సైవ = ఆ సత్యవిద్యయే యీసత్యవిద్య. రెండు వాక్యములందుఁ జెప్పఁబడిన సత్యవిద్యయు నొకటే, హి = ఎందుచేతననఁగా, సత్యాదయః = పూర్వ ప్రకృతములైన సత్యాదులే ఉత్తరవాక్యములో, "తద్యత్సత్యమ్" అని ఆకర్షింపఁబడినవి. అందుచే నొకటేవిద్య. ఫలభేదమువలన భేదమనరాదు. పాపనాశనము ఫలమంగఫలము. అని చెప్ప వచ్చును. లేదా లోకజయము, పాపనాశము అను రెండును గలిసియే సత్యవిద్యకు ఫలము.

## 25 కామాద్యధికరణము.

ఛాందోగ్యములో "దహరోస్మి న్నంతరాకాశః అని మొదలిడి "ఏష ఆత్మా అపహతపాప్మా విజరో విమృత్యు ర్విశోకః, విజిఘత్సో ఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః ఛాం 8-1-5 అనికలదు.

బృహదారణ్యకములో "స వా ఏష మహానజ ఆత్మా! అని మొదలిడి, యఏషో ఽన్తర్హృదయ ఆకాశ స్తస్మిన్ఛేతే సర్వస్యవశీ" బృ 44-22 అని చెప్పఁబడినది.

ఇందు ఛాందోగ్యములో ఉపాసనవిద్య, వాజసనేయములో (బృహ) నిర్గుణవిద్య చెప్పఁబడుటచే విద్యాభేదమున్నది కనుక, నిచ్చటిగుణముల కచ్చట అచ్చటిగుణముల కిచ్చట నుపసంహార మున్నదా? లేదా? అని సంశయము కలుగుచున్నది. విద్యాభేదమువలన గుణోపసంహారము లేదనిరాఁగా చెప్పుచున్నారు.

కామాదీతరత్ర తత్ర చాయతనాదిభ్యః 39

కామాది = సత్యకామత్వము మొదలగుగుణములు, ఇతరత్ర = వాజసనేయక మందును, అచ్చటనున్న, సర్వవశిత్వాదికము, తత్రచ = ఛాందోగ్యమునందును ఉపసంహరింపఁ దగును. ఎందుచేతననఁగా. ఆయతనాదిభ్యః = హృదయమాయతన మని బ్రహ్మ ఉపాస్యుఁ డని, బ్రహ్మ సేతువని, ఆయతనాదులు రెండింటియందును సమానములుగా నున్నవి కనుక.

సగుణ నిర్గుణ విద్యలని భేదమున్నను విద్యాస్తుత్యర్థమై గుణోపసంహారము చేయవచ్చును.

## 26 ఆదరాధికరణము. (40-41)

ఛాందోగ్యములో వైశ్వానరవిద్యయందు" తద్యద్భక్తం ప్రథమ మాగచ్ఛేత్ తద్ధోమీయం, సయాం ప్రథమామాహుతిం జుహుయాత్ జుహుయాత్ ప్రాణాయ స్వాహేతి॥ ఛాం 5-19-1 అని ప్రాణాగ్నిహోత్రము కలదు. ముందుగావచ్చిన అన్నము హోమసంబంధమైనది. ప్రథమాహుతిని హోమముచేయునప్పుడు "ప్రాణాయస్వాహా" అని హోమముచేయవలెను. అని యభిప్రాయము. ఇచ్చట భోజనమునకు లోపము కలిగినప్పుడు ప్రాణాగ్నిహోత్రమునకును లోపము గలుగునా? లోపముగలుగదా? అని సంశయము. లోపముగలుగదు. అని పూర్వపక్షము, ఎందుచేత?

### ఆదరా దలోపః 40

ఆదారాత్ = ఆదరమువలన అనగా జాబాల శ్రుతిలో వైశ్వానరవిద్యయందు "పూర్వోఽతిథిభ్యో శ్నీయాత్" అని వైశ్వానరోపాసకునికి అతిథులకంటె ముందు భుజింపవలెనని విధింపబడినది. ముందుగానతిథి భోజనమును నిందించినది. అతిథులకంటె ముందుభోజనము చేయవలెనని ఆదరముచూపుటవలన భోజనలోపము కలిగినను,

ప్రాణాగ్నిహోత్రమునకు లోపములేదు. ఉపవాసకుం డుదక పానము మొదలగువానిచే ప్రాణాగ్నికి హోమము చేయ వచ్చును. అని పూర్వపక్షము వచ్చినది. (ఇది పూర్వపక్ష సూత్రము) సిద్ధాంతము చెప్పుచున్నారు.

ఉపస్థితే౽త స్తద్వచనాత్ 41

ఉపస్థితే=భోజన ముపస్థితము (సన్నిహితము) అగు చుండగా, అతః= ఆసన్నిహితద్రవ్యమువల్లనే ప్రాణాగ్ని హోత్రహోమము చేయవలయును. తద్వచనాత్=ఆశ్రుతి వచనమువలన, శ్రుతిలో "తద్యద్భక్తం ప్రథమమాగచ్ఛే త్తద్ధోమీయమ్" అని చెప్పుటవలన మొదటగావచ్చిన దే భక్తము అన్నము) కలదో అది హోమసంబంధమైనది. అని సన్నిహితమైన భోజనద్రవ్యముతోనే హోమమును చేయ వలెనని చెప్పుటచే, భోజనలోపము సంభవించిన ప్రాణాగ్ని హోత్రలోపము కలుగును. భోజనపక్షములో ఆదరము ప్రాథమ్యార్థము.

27 తన్నిర్ధారణానియమాధికరణము.

అథ "ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత" ఛాం 1-1-1. అనునవి మొదలుగాగల కర్మాంగభూతములగు ఉద్గీ థాదుల నాశ్రయించిన ఉపాసనములందు సంశయముకలుగు చున్నది. ఈ యుద్గీథాద్యుపాసనములు పర్ణమయీత్వా దులవలె నిత్యములా! గోదోహనాదులవలె ననిత్యములా!

అని. అవ్యభిచరితక్రతు సంబంధముకల ఉద్గీథాదులకు సంబం ధించుటచేఁ క్రత్వర్థములు గాన పర్ణమయీత్వాదుల వలె నిత్యములు. "యస్య పర్ణమయీ జుహూర్భవతి నసపాపగ్ం శ్లోకం శృణోతి" తై.సం.3.5.72. అను వనారభ్యాధీతమునకు అవ్యభిచరిత జుహూద్వారా ప్రకరణ పఠితమునకువలె కర్మ సంబంధముకలదు. (కాన) క్రత్వర్థమగుటచే నిది నిత్యము. అట్లే క్రియా సంబంధముకల ఉద్గీథాలకు సంబంధించినవగుటచే నీ యుపాసనములను నిత్యములు అనిరాఁగాఁ జెప్పుచున్నారు.

తన్నిర్ధారణానియమః తద్దృష్టేః పృథగ్ఘ్యప్రతిబంధః ఫలమ్ 42

తన్నిర్ధారణా + అనియమః = తన్నిర్ధారణ = తత్తద్గుణ విశిష్టోద్గీథాద్యుపాసనకు అనియమః = నియమము లేదు. ఎందుచేతననఁగా, తద్దృష్టేః = అనియమము లేకపోవుట శ్రుతి లోఁగనఁబడుటవలన, "తేనోభౌ కురుతే యశ్చైతదేవం వేద యశ్చ న వేద" ఛాం 1-1-10 అని యనుపాసకునకుఁగూడ కర్మ మున కర్తృత్వానుజ్ఞయుండుటచే ఆనిర్ధారణమునకు నియమము లేదని భావము. హి = ఏకారణముచే, పృథక్, అప్రతిబంధః, ఫలమ్ = కర్మనాశమునుండి అప్రతిబంధము ఫలముగా విని పించుచున్నది. అప్రతిబంధము (ప్రతిబంధాభావము) అనఁగా, కర్మమునకు శీఘ్రముగా ఫలముగలుగుట.

"యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీ ర్యవత్తరం భవతి" ఛాం 1-1-10 వీర్యవత్తరమ్ అనుచోటఁ

గలతన(ప్రత్యయమునకు) అద్ధులేక శీఘ్రముగా ఫలముగలుగుట యని యర్థము.

"కల్పన్తే హాస్మై లోకాః" ఛాం 2-2-3 అని అంగో పాసనలకు వేఱేఫలము చెప్పఁబడుటచే గోదోహనాదులు అనిత్యములు.

## 28 ప్రదానాధికరణము

అవ॥ బృహదారణ్యకము నందు ఛాందోగ్యమునందును కూడసంవర్గవిద్యలో, వాగాదులకంటె ప్రాణము శ్రేష్ఠమైనదనియు, అగ్ని, ఆదిత్యుఁడు మున్నగు దేవతలకంటె వాయువు శ్రేష్ఠుఁడనియు నిర్ణయింపఁబడినది. ఈవిషయములో సంశయము గలుగుచున్నది. ఈవిద్యలో వాయువునకు ప్రాణమునకు ఒకటే ప్రయోగమా? వేఱువేఱు ప్రయోగములా? అని సందేహము. పూర్వాధికరణములో ఫలభేదమువలన ఉపాసనలకు నిత్యత్వానిత్యత్వ లక్షణముగు ప్రయోగభేదము చెప్పఁబడినది. ఇందు రెండింటియందు వాయుప్రాప్తియే ఫలముగుటచేతను వాయువునకు ప్రాణమునకు పేరువేఱు కాని స్వరూప మొక్కటే కనుకను వేద్యభేదములేదు కనుక నేక విద్యయే యగుటచేతను ప్రత్యుదాహరణముగా ప్రయోగైక్యమే యని రాగాఁ జెప్పుచున్నారు.

## ప్రదానవదేవ తదుక్తమ్ 43

ప్రదానవదేవ = పురోడాశ ప్రదానము వంటువలెనే యిచ్చటను ప్రయోగభేదము చెప్పవలెను. "ఇంద్రాయ రాజ్ఞే

పురోడాశ మేకాదశకపాలం ఇంద్రాయాధిరాజాయ ఇంద్రాయ స్వరాజ్ఞే" తై. సం 2-3-6-1 అని యాయుష్టియందు ఇంద్రుఁడొక్కఁడేయైనను, రాజ్ఞే, అధిరాజాయ స్వరాజ్ఞే అనిరాజాది గుణభేదముచే తద్విశిష్ట దేవతాభేదము నాశ్రయించి పురోడాశప్రదాన (ప్రక్షేప) భేదము చెప్పబడినది. అట్లే యిచ్చటను వాయువన్నను ప్రాణమన్నను ఒక్కటేయైనను, అధ్యాత్మ కాధిదైవికభేదముచే ప్రయోగభేదము చెప్పవలెను. తదుక్తమ్ = అవిషయము, దేవతాకాండమునందు "నానా వా దేవతా పృథక్ జ్ఞానాత్" గుణములచే వేఱువేఱుగా తెలిసికొనుటవలన, దేవతయున్ను అనేకరూపములు గలదియగును. అనిచెప్పబడినది.

### 29 లింగభూయస్త్వాధికరణము (44-52)

### లింగభూయస్త్వాత్తద్ధిబలీయస్తదపి 44

వాజసనేయులు అగ్నిరహస్యములో మనస్సుయొక్క ప్రాదుర్భావమును వర్ణించి, యామనస్సునుద్దేశించి, ఇట్లుపఠించుచున్నారు. "షట్త్రింశత్సహస్రాణ్యపశ్యదాత్మనో గ్నీనర్కాన్ మనోమయాన్ మనశ్చితః శ. ప. 10-5-3-8 అనగా, పురుషునికి సామాన్యముగా ఆయుర్దాయము నూరుసంవత్సరములు. సంవత్సరమునకు 360 దినములు. 100 సం॥ లకు $360 \times 100 = 36000$ ముప్పదియారువేల (షట్త్రింశత్సహస్రములు) దినములు. ఒకరాత్రి పగలుగలిపి ఒకదినము.

ఇట్టి దినములు మానవజీవితములో 36 వేలుకలవు. మన స్సనం దనేకాలోచనలుపుట్టుచుండును. వానినిమనోవృత్తు లందురు. ఒకదినమున, మనస్సునందు, కలిగిన వృత్తులన్నిటి యుందును దినగతమగు నేకత్వమునారోపించి, ఒకవృత్తిగా భావింపవలెను. యిట్టి వృత్తులు జీవితములో 36 వేలుసంభవిం చును. ఈ వృత్తులను అగ్నులుగా ధ్యానించిన నగ్నులగును. ప్రత్యగాత్మస్వరూపములనుగా ధ్యానించిన ప్రత్యగాత్మస్వరూ పములగును. ఈధ్యానింపఁబడినవి మనస్సుచేత చింతింపఁబడు చున్నవి. కనుక మనశ్చితః అనబడును. అనఁగా మనస్సుచేతఁ జింతింపఁబడి సంపాదింపఁబడినవి మనశ్చితః అనఁబడును. మనము వేనినిగా ధ్యానించిన నీ వృత్తులు అవియే యగును. అగ్నులని ధ్యానింపవచ్చును. ఆత్మస్వరూపము లని ధ్యానింప వచ్చును. అర్కులు (సూర్యులు) అని ధ్యానింపవచ్చును. ఇవ న్నియు మనస్సుచేఁజింతింపఁబడినవి, మనోవికారములును, ఇట్టివానినిజూచెనని "షట్త్రింశత్సహస్రాణి అపశ్యత్ ఆత్మనః అగ్నీన్ అర్కాన్, మనోమయాన్ మనశ్చితః" అనిచెప్పిరి. ఇట్లే వాగాదీంద్రియములుకూడ స్వస్వవృత్తులను అగ్నులు మొదలగువానినిగా జూచినవని యావృత్తులను "వాక్చితః ప్రాణచితః చక్షుశ్చితః శ్రోత్రచితః" అనిపెక్కుఅగ్నులు కర్మ ప్రకరణములోఁ జెప్పఁబడినవి.

ఇప్పుడు — మనశ్చిదాదులగు నీయగ్నులు కర్మాంగ భూతములా లేక స్వతంత్రములా (ప్రత్యేక ఫలప్రదములా) ?

అని సంశయము కలుగుచున్నది. పూర్వాధికరణములో వాయుప్రాణము లొక్కటే యైనను ప్రయోగభేదము చెప్పఁబడినది. ఇచ్చట మనశ్చిదాద్యగ్నులు ప్రకరణము వలన కర్మాంగభూతములని పూర్వపక్షము రాఁగా, చెప్పఁబడుచున్నది.

లింగభూయస్త్వాత్-తద్ధి-బలీయః-తదపి

ఈయగ్నులు స్వతంత్రములు ఎందుచేత? లింగభూయస్త్వాత్ = స్వతంత్రములని చెప్పుటకుఁదగిన గుర్తులు పెక్కులుండుటచేత, "యత్కించేమాని భూతాని మనసా సంకల్పయన్తితి తేషామేవాగ్నీనాం సాకృతిరితి, తాన్ హైతా నేవం విదే సర్వదా సర్వాణి భూతాని విచిన్వన్తి అపిస్వపతే" 10-5-3 అని లింగభూయస్త్వము కలదు.

దీనియర్థము :-సమస్త భూతములు సర్వదా మనస్సుతో దేనినో సంకల్పించుచునే యుండును. ఆ సంకల్పమే అగ్నిసంపాదనము. సర్వజంతువుల మనోవృత్తులను అగ్నులనుగా ధ్యానము చేయుట అన్నది యొక లింగము. కర్మాంగమైనచో నేదోయొక కర్మమును చేయుట సర్వాంగ మెట్లగును? ఇట్లే ఈ యగ్నిసంపాదనమును దెలిసినవాఁడు నిద్రించుచున్నను మెలకువతో నున్నను నతనికి సర్వదా సర్వభూతములు నీ యగ్నులను సంపాదించుచునే యుండును. అన్నది మఱియొక లింగము. కర్మాంగమైనది సర్వదా అనుష్ఠింపఁబడదు గదా? తత్-హి-బలీయః. ప్రకరణముకంటె

లింగము బలవత్తరమైనది. కనుక ప్రకరణమును బట్టి కర్మాంగ మవరాదు, తదపి, ఆ విషయము కూడ "శ్రుతిలింగ వాక్య ప్రకరణ స్థాన సమాఖ్యానాం పారదౌర్బల్య మర్థవిప్రకర్షాత్. అని చెప్పఁబడినది.

పూర్వ వికల్పః ప్రకరణా త్స్యాత్ క్రియా మానసవత్. 45

పై సూత్రముచే సిద్ధాంతము చేసి యీ సూత్రముచే మరల పూర్వపక్షము చేయుచున్నారు.

ఇది ప్రకరణమునుబట్టి "ఇష్టకాభి రగ్నిం చినుతే" అని ప్రారంభింపఁబడిన క్రియామయమగు అగ్నికి సంబంధించినది కనుక సంకల్పాత్మకములగు మనశ్చిదాద్యగ్నులు స్వతంత్రములు కావా ? యను విషయమునకుఁ జెందినది కాదు.

ప్రకరణాత్ = ప్రకరణము (సందర్భము) వలన, క్రియాస్యాత్ = క్రియయగును. పూర్వవికల్పః - పూర్వమందుఁ జెప్పఁబడిన క్రియామయమగు అగ్నికి వికల్ప విశేషోపదేశము. వికల్పమనగా ప్రకారము. ఇది మనశ్చిదాద్యగ్నుల స్వాతంత్ర్య విధ్యాత్మకమగు నుపదేశము కాదు.

ప్రకరణముకంటె లింగము ప్రబలముకదా యన్న, నిజమే కాని యిచ్చటిలింగము ప్రకరణముకంటె దుర్బలము. ఎందుచేతననఁగా, లింగము సామర్థ్యము, అన్యార్థదర్శనము అని రెండువిధములు, విధ్యుద్దేశగతమగు లింగము సామర్థ్యరూపము. అది స్వతంత్రముగఁ బ్రమాణమైనది. అర్థవాదగత

మగులింగము అన్యశేషవాక్యమున నుండుటవలన అన్వార్థ దర్శనమనఁబడును. అది తాత్పర్యరహితము కావున స్వతంత్ర ముగాఁ బ్రమాణము కాదు. ప్రమేయసాధకమగు ప్రమాణాం తరములోఁ గేవలము తోడ్పడును. ఇచ్చటి యీలింగము (లింగభూయస్త్వాత్ అని చెప్పఁబడినది) మానసికాగ్నిస్తుతి పరము, అర్థవాదస్థము నగుటచేత అన్వార్థదర్శనరూపము. దీనికి విధ్యేకవాక్యత లేదు కనుక దుర్బలము. కనుక లింగ భూయస్త్వమునుబట్టి మనశ్చిదాద్యగ్నులు స్వతంత్రవిద్యాత్మ కములని యనరాదు. ప్రకరణమును బట్టి మనశ్చిదాదులు కర్మాంగ భూతములనియే చెప్పవలెను. ఈ విషయములో దృష్టాంతమును జెప్పుచున్నాఁడు. మానసవత్ = మానస పాత్రకువలెనే అంగత్వము, చెప్పవలెను అనఁగా "అనయా త్వాపాత్రేణ సముద్రం రసయా ప్రాజాపత్యం మనోగ్రహం గృహ్ణామి" త్వా = త్వాంసముద్రం, అనయాపృథివ్యా పాత్రేణ ప్రజాపతిదేవతాకం మనోగ్రహం గృహ్ణామి ధ్యాన మయం గ్రహ మాపాద్య గృహ్ణామీత్యర్థః అన్నచోట ద్వాదశాహ మధ్యపాతియైన దశమాహమునకు మానసము అంగమని చెప్పినట్లు ఈమనశ్చిదాది మానసి కాగ్నులు కర్మాంగములు. అనిభావము.

అతిదేశాచ్చ 46

అతిదేశమువల్లనున్ను ఈయగ్నులు క్రియాంగము లని తెలియుచున్నది.

“షట్త్రింశత్సహస్రా ణ్యగ్నయోऽర్కా స్తేషామేకైక ఏవతావా న్యావానసౌ” శ. ప. 10-3-11 ఈముప్పది యారువేలయగ్నులు అర్కాః = అర్క్యాః (ఛాందసముగుటచే వర్ణవ్యత్యయము) పూజింపఁదగినవి. వానిలో నొక్కొక్కటే పూర్వమందుఁజెప్పఁబడిన ఇష్టకాచితాగ్నియంతటిది. అని మనశ్చిదాద్యగ్నులకు పూర్వము చెప్పిన ఇష్టకాచితాగ్ని సాదృశ్యము నతిదేశించుచున్నారు. ఈయతిదేశము వలనఁ గర్మాంగత్వము సిద్ధించుచున్నది.

విద్యైవతు నిర్ధారణాత్. 47

విద్యైవతు = ఈ మనశ్చిదాద్యగ్నులు, స్వతంత్రమైన విద్యాత్మకములే, కర్మాంగభూతములుకావు. ఎందుచేతననఁగా, నిర్ధారణాత్ = నిర్ధారణమువలన. శ్రుతిలో “తేహైతే విద్యాచితఏవ, విద్యయాహైవైతే ఏవంవిదశ్చితా భవన్తి. శ. 10-5-3-12 అని నిర్ధారణము చేయుటవలన స్వతంత్రములు.

దర్శనాచ్చ. 48

దర్శనాచ్చ = పూర్వమందుఁ జూపించిన లింగభూయస్త్వదర్శనమువల్లనున్న మనశ్చిదాదులు స్వతంత్రములు.

శ్రుత్యాదిబలీయస్త్వాచ్చ నబాధః. 49

శ్రుత్యాదిబలీయస్త్వాచ్చ = శ్రుతి, లింగ, వాక్యములు, ప్రకరణముకంటె బలవత్తరములగుటచేతనున్న నబాధః =

ప్రకరణముచే మనశ్చిదాద్యగ్నులకు స్వాతంత్ర్యబాధ లేదు.
ఎట్లనగా

శ్రుతి:- "తేహైతే విద్యాచితఏవ" శ.10-5-3-13-1
లింగము:-"సర్వదా సర్వాణిభూతాని చిన్వన్త్యపి స్వపతే"
శ.10-5-3-13. అని వెనుక చెప్పబడినది. ఇచ్చటిలింగము
అన్వార్థదర్శనము. అర్థవాదస్థమగుటచే నిది దుర్బలము "అని
చెప్పబడినను ప్రత్యక్షమైన విధి వేఱేయున్నప్పుడు అర్థవాద
ములోనున్న లింగము శక్త్యాపక ప్రమాణాపేక్ష కలిగిదానికి
శేషమై అన్వార్థదర్శన మగును. ఇచ్చట ప్రత్యక్షమగు విధి
లేదు. ఇదియే యపూర్వార్థబోధకము. అందుచేనిది యర్థ
వాదముకాదు అన్వార్థదర్శనమునుగాదు. భాష్యకారులు
గూడ "యుతవిస్పష్టో విధాయకో లింగాదిరుపలభ్యతే యుక్తం
తత్ర సంకీర్తనస్యార్థవాదత్వమ్"-అని చెప్పిరి.

వాక్యము:- "విద్యయాహైవైత ఏవంవిదశ్చితాభ
వన్తి" అనువాక్యములో"ఏవంవిదః" అని విద్యాసంబంధమే
కాని కర్మసంబంధము చెప్పబడలేదు. కనుక శ్రుతిలింగవాక్య
ప్రాబల్యముచే మనశ్చిదాదులు కర్మాంగములుకావు. అను
పక్షమేన్యాయ్యము.

అనుబంధాదిభ్యః ప్రజ్ఞాన్తరపృథక్త్వవత్, దృష్టశ్చ
తదుక్తమ్. 50

అనుబంధాదిభ్యః = అనుబంధము మున్నగువానివల్లను
మనశ్చిదాదులకు కర్మాంగత్వములేదు, అనుబంధమనగా

అనుబధ్యతే ఇత్యనుబంధః కర్మాంగభూతపదార్థములకు మనో వ్యాపారముతో సంబంధము. "మనసైవాధీయన్త మనసాచీయన్త మనసైవగ్రహాః అగృహ్యన్త మనసాస్తువన్ మనసాశంసన్ యత్కించ యజ్ఞేకర్మక్రియతే యత్కించయజ్ఞియం కర్మ మనసైవ తేషుతన్మనోమయేషు మనశ్చిత్సు మనోమయమేవ క్రియతే" శ. 10-5-3_3 అనికర్మాంగములకు మనస్సంపాద్యత్వమును చెప్పుచు నీశ్రుతి అనుచింతనమునకుఁ ప్రాధాన్యమును బోధించుచున్నది. కర్మాంగములైనచో ప్రత్యక్షసిద్ధములుకనుక మనస్సుచే సంపాదనమనర్థకము.

అనుబంధాదియను ఆదిపదముచే అతిదేశాదులను గ్రహించునది. "తేషా మేకైకఏవ తావాన్ యావానసౌ పూర్వః" అని. ఇష్టకాచితాగ్నిరొక్క మాహాత్మ్యమును జ్ఞానమయాగ్నులలో నొక్కొక్కదానికే గలదని యిష్టకాగ్నియందనాదరమును సూచించుచున్నది.

ప్రజ్ఞాన్తరపృథక్త్వవత్ = శాండిల్యవిద్య మొదలగు ప్రజ్ఞాన్తరములకు కర్మములకంటె పృథక్త్వమున్నట్లు వీనికిని పృథక్త్వముకలదు కాన నివి స్వతంత్రములు.

ఇవి స్వతంత్రములన్నచోఁ గర్మప్రకరణముకంటె నుత్కర్షమువచ్చుటనుబాధలేదే యన్నచో, దృష్టశ్చ = చూడఁబడినది. "రాజాస్వారాజ్యకామో రాజసూయేన యజేత" అని రాజసూయము నుపక్రమించి, "ఆగ్నేయోష్టాకపాలో హిరణ్యందక్షిణా" అని బ్రాహ్మణాది కర్తృకమైన అవేష్టికి

రాజమాత్రకర్తృక రాజసూయప్రకరణముకంటె నుత్కృష్టము చెప్పఁబడినది.

తదుక్తమ్ = ఆవిషయము "క్రత్వర్థాయామితి చేన్న వర్ణసంయోగాత్" అని జై. సూ. 11.4-12 వద్దఁజెప్పఁబడినది.

"న సామాన్యాదప్యుపలబ్ధేర్మృత్యువన్నహిలోకాపత్తిః 51

సామాన్యాదపి = వెనుక 45 వ సూత్రములో, మానసవత్ అని మానసగ్రహ సామాన్యమువలనఁగూడ, న = మనశ్చిదాదులకు క్రియాశేషత్వములేదు. ఉపలబ్ధేః = చెప్పిన శ్రుతిలింగ వాక్యములవలన స్వాతంత్ర్యము ఉపలబ్ధమగుచున్నందువలన,

మృత్యువత్ = "స ఏష ఏవమృత్యుః, య ఏష ఏతస్మిన్మండలే పురుషః" 10-5-2-3 అని ఆదిత్యపురుషునియందు మృత్యుశబ్దమును ప్రయోగించినను అత్యంతసామ్యము లేనట్లు "అగ్నిర్వైమృత్యుః" బృ. 3-2-10 అని యగ్నియందు మృత్యుశబ్ద ప్రయోగముచేసినను అగ్నికి సర్వథామృత్యు సామ్యము లేనట్లును, మానససామ్యము లేదు. నహిలోకాపత్తిః= అసౌవైలోకోఽగ్నిర్గౌతమ!" బృ. 6-2-9 అన్నచోట లోకమునకు అగ్నిభావాపత్తియు లేనట్లు, ఇక్కడకూడ మానసకల్పనా సామాన్యమువలనఁ గర్మాంగత్వ సిద్ధిలేదు.

పరేణ చ శబ్దస్య తాద్విధ్యం భూయస్త్వాత్త్వనుబంధః 52

పరేణచ = పరము, పూర్వము నైన సందర్భము చేతను, శబ్దస్య = శబ్దమునకు, తాద్విధ్యం = తద్విధత్వము స్వతంత్ర విద్యావిధిత్వమే కనఁబడుచున్నది. కర్మాంగవిద్యావిధిత్వము కనఁబడుట లేదు. ఈమానసికాగ్ని బ్రాహ్మణమునకు పరమందున్న "అయం వావలోక ఏషోఽగ్నిశ్చితః 6-10-5-4-1 అను బ్రాహ్మణమునందు, పూర్వమునందున్న "ఏత న్మండ లం తపతి'' శ-10-5-2-1 అను బ్రాహ్మణమునందును, విద్యాప్రాధాన్యమే గనిపించుచున్నది. "సోఽమృతో భవతి'' "విద్యయా తదారోహన్తి'' అను పూర్వోత్తర సమభివ్యాహారములవలన నీబ్రాహ్మణమునందును విద్యాప్రాధాన్యమునే చెప్పవలెను.

ఈబ్రాహ్మణములో మానసికాగ్నివిద్యకే ప్రాధాన్యము చెప్పినచో కర్మప్రక్రమ మేల? అని యందురేని — "భూయస్త్వాత్, తు, అనుబంధః''=మానసికాగ్నివిద్యయందు సంపాద్యములగు కర్మాంగములు పెక్కులుండుటవలన, నీయనుబంధము, (చెప్పుట) కావున నీమానసికాగ్ని విద్య స్వతంత్ర పురుషార్థ హేతువు.

30 శరీరవ్యతిరేకాధికరణము (53-54)

అవ॥ పూర్వాధికరణములో మనశ్చిదాద్యగ్నులు పురుషార్థ హేతువులని నిరూపింపఁబడినవి, ఆపురుషుఁడెవఁడు? అని ప్రసంగముగా నీయధికరణమున విమర్శించుచున్నారు.

ఏక ఆత్మనః, శరీరే, భావాత్. 53

ఏకే = కొందఱు (లోకాయతికులు) ఆత్మనః = శరీరముకంటె, అతిరిక్తుఁడులేఁడు అని చెప్పుదురు. ఆత్మ అనఁగా దేహమేనా? దేహాతిరిక్తుఁ డెవ్వఁడైనఁ గలఁడా? అని సంశయముకలుగ లోకాయతికులు దేహమే ఆత్మ దేహాతిరిక్తుఁడు లేఁడు అని చెప్పుదురు. ఏమన? శరీరే, భావాత్ = శరీరే సతి చైతన్యసుఖాదీనాం భావాత్ = శరీరముండఁగా చైతన్యము సుఖము మొదలగు శరీరధర్మములు కలుగుచున్నవి. శరీరములేనిచో చైతన్యసుఖాదులు లేవు. అగ్నియున్నచో వెచ్చఁదనమున్నది. అగ్నిలేనిచో వెచ్చదనములేదు. వెచ్చఁదనము అగ్నిధర్మము. అట్లే శరీరమున్నచో చైతన్యాదులు కలవు. శరీరములేనిచో చైతన్యాదులులేవు కనుక చైతన్యాదులు శరీరధర్మములు. శరీరముకంటె అతిరిక్తుఁడుగా ఆత్మయని లేఁడుఅని వీరి సిద్ధాంతము. అని పూర్వపక్షమురాఁగా,

వ్యతిరేక స్తద్భావాభావిత్వా న్నతూపలబ్ధివత్ 54

నతు = అట్లుకాదు. దేహాతిరిక్తుఁడగు ఆత్మ లేనిచో స్వర్గమోక్షాదిబోధక శాస్త్ర మెందులకు? వ్యతిరేకః = శరీరముకంటె నతిరిక్తుఁడగు ఆత్మకలఁడు. ఎందుచేత? తద్భావాభావిత్వాత్ = తత్ భావ = ఆశరీరము యొక్క భావము=శరీరము ఉండఁగా, అభావిత్వాత్=లేకపోవుటవలన, చైతన్యాదులు శరీర మున్నప్పుడుండి శరీరములేనప్పుడు

లేకపోవుచున్నవి కనుక నవి శరీరధర్మములే. ఆత్మధర్మములు కావు అనిచెప్పిరి. కాని శరీరమున్నప్పుడు ఆ చైతన్యాదులుండుటలేదు కనుక శరీరధర్మములుకావు. మరణసమయములో మృతశరీరమున్నది. చైతన్యాదులు లేవు. ఇవి శరీరధర్మములేనైనచో శరీరమున్నది కాన నివియు నుండవలయును. ఉండుటలేదు కాన నివి శరీరధర్మములుకావు. రూపాదులు శరీరధర్మములు, రూపము శరీరమున్నంతవఱకు నుండును. చైతన్యాదు లట్టివికావు. ఇవి ఆత్మధర్మములు. ఉపలబ్ధివత్ = ఉపలబ్ధివలె, ఉపలబ్ధియనఁగా జ్ఞానము. ఎదురుగా ఘటమున్నప్పుడు ఘటవిషయకముగు ఉపలబ్ధి మనకుఁగలుగుచున్నది. అందు ఘటము వేఱు. ఉపలబ్ధి వేఱు. ఇట్లే శరీరవిషయకముగు నట్టియుపలబ్ధిలోఁగూడ, శరీరము వేఱు, ఉపలబ్ధి వేఱు అని చెప్పవలెను. ఆఉపలబ్ధియే ఆత్మ. అని దేహావ్యతిరిక్తముగు ఆత్మ సిద్ధించినది.

### 31 అంగావబద్ధాధికరణము.

అవ॥ "ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత" ఛాం. 1-1-1 మొదలగు కర్మాంగాశ్రయవిద్యలు (ఉపాసనలు) ప్రతి వేదమునందు ప్రతిశాఖయందును చెప్పఁబడుచున్నవి. అవి ఆశాఖాగతమైన యుద్గీథాదులయందే యాదృష్టితో నుపాసన చేయవలయునా? శాఖాన్తరగతములైన యుద్గీథాదుల యందును నాదృష్టితో నుపాసన చేయవచ్చునా? అని సంశయముగలుగ సన్నిధానము (సామీప్యము) వలన శత్ర

చ్ఛాఖామాత్ర విషయములే యని రాఁగా నిర్ణయించు చున్నారు.

అంగావబద్ధాస్తు న, శాఖాసు, హి ప్రతివేదమ్ 55

అంగావబద్ధాస్తు=కర్మాంగాశ్రయములగు నీ యుపాసనవిద్యలు, న = స్వశాఖల యందే యునిలేదు. ప్రతివేదం, శాఖాసు = అన్ని వేదశాఖలయందును బ్రవర్తించును. ఏమన, సన్నిధికంటె, "ఉద్గీథముపాసీత" = అను ఉద్గీథశ్రుతి ప్రబలము.

మంత్రాదివద్వా ఽవిరోధః 56

మంత్రాదివద్వా = శాఖాన్తరోక్త మంత్రాదులకువలె, అవిరోధః = విరోధములేదు. శాఖాన్తరోక్తమంత్రములు శాఖాన్తరవిహిత కర్మాంగములైనట్లే, శాఖాన్తరోద్గీథాదులయందును శాఖాన్తరోపాసనలు గలుగును. ఒకచోఁ జెప్పఁబడినను తండులపేషణార్థము అశ్మాదాన మంత్రము శాఖాన్తరమున వినియోగింపఁబడుచున్నది. ప్రయాజ లొకచోఁజెప్పఁబడినను శాఖాన్తరమునందును జెప్పఁబడుచున్నవి. అట్లే ఒకశాఖయందుఁజెప్పిన ఉపాసనలున్ను శాఖాన్తరీయోద్గీథాలయందు ప్రాప్తింపవచ్చును. విరోధములేదు.

32 భూమజ్యాయస్త్వాధికరణము.

ఛాందోగ్యములో వైశ్వానరవిద్యాఖ్యాయిక యొకటి కలదు. వైశ్వానరవిద్యను దెలిసికొనుట కొఱకై ప్రాచీన

శాలుఁడు మున్నగు ఋషులు అర్గురు కేకయరాజు నొద్దకు వచ్చిరి. రాజు నడిగిరి. అతఁడు వారి కావిద్యను జెప్పెను. ఆచెప్పిన సందర్భములో "ఔపమన్యవ! కం త్వ మాత్మాన ముపాస్సే ఇతి దివమేవ భగవో రాజన్! ఇతి హోవాచ. ఏషవై సు తేజా ఆత్మా వైశ్వానరః యం త్వ మాత్మాన ముపాస్సే" ఛాం. 5-12-1 అని వ్యస్తోపాసనము గనిపించుచున్నది. అక్కడే- "తస్యహ వా ఏతస్య ఆత్మనో వైశ్వానరస్య మూర్ధైవ సు తేజాః చక్షుర్విశ్వరూపః ప్రాణః పృథగ్వర్త్మా" ఛాం. 5-18-2 అని సమస్తోపాసనమును గనిపించుచున్నది.

ఇందు మొదటిదానిలో, ద్యులోకము సూర్యుఁడు, వాయువు మొదలగు వ్యస్తములందు వైశ్వానరోపాసన చెప్పఁబడినది. రెండవదానిలో సమస్తస్వరూపుని యుపాసన చెప్పఁబడినది. ఇప్పుడు ఈవ్యస్త సమస్తోపాసనా ద్వయము నిచ్చటవిధేయమా? లేకసమస్తోపాసనమేనా? అని సంశయము గలుగుచున్నది. రెండువిధములయిన యుపాసనలకు ఫలము వినిపించుచున్నది. కనుక ఉభయము విధేయమని పూర్వ పక్షము వచ్చినది. ఉభయ విధానములో వాక్యభేదము వచ్చును. సమస్తోపాసన యొక్కటే యున్నచో వాక్యభేద ముండదు. వాక్యభేదముదోషము అనిరాగా నిర్ధారణకై యీ యధికరణము చెప్పఁబడినది.

భూమ్నః, క్రతువత్ జ్యాయస్త్వం, తథాహి, దర్శయతి. 57

భూమ్నః = పదార్థోపచయాత్మకము సమస్తము నగు వైశ్వానరోపాసనమునకే యిచ్చట జ్యాయస్త్వం = ప్రాధాన్యము వివక్షితము. ప్రత్యేకోపాసనమునకుఁగాదు. క్రతువత్ = దర్శపూర్ణమాసాది క్రతువునకువలె. సాంగమైన దర్శపూర్ణమాసాదిక్రతువునకే ప్రయోగవిధి కాని తదవయవములైన ప్రయాజాదులకు వ్యస్తములకు వేఱుగా ప్రయోగములేనట్లు. ఎందుచేత? తథాహిదర్శయతి శ్రుతి యట్లు చూపించుచున్నది. "భూమైవజ్యాయాన్" అను శ్రుతి పదార్థోపచయాత్మక మగు సమస్తమునకే జ్యాయస్త్వమును (ప్రాధాన్యమును) చెప్పుచున్నది.

ప్రాచీనశాలప్రభృతులకు మొదట ద్యుసూర్యాద్యేకైకోపాసనమును చెప్పి తరువాత ద్యులోకాదులకు మూర్ధాదిత్వమును చెప్పుసందర్భమునకు ఏకవాక్యత కనఁబడుచుండుటచే సమస్తోపాసనమే యిచ్చట విధేయముకాని ప్రత్యేకోపాసన (వ్యస్తోపాసన)ము విధేయముకాదు. అట్లైన వాక్యభేదము వచ్చును. వ్యస్తోపాసనకుఁ జెప్పినఫలము సమస్తోపాసనస్తుత్యర్థమే యగును. "మూర్ధా తే వ్యపతిష్యత్ యన్మాం నాగమిష్యః" ఛాం. 5-12-2 అని వ్యస్తోపాసనలో నిందకూడఁ గనిపించుచున్నది.

ఉపక్రమములో "కోనఆత్మా కింబ్రహ్మ" ఛాం౫_11-1 అని కృత్స్నబ్రహ్మవిషయకమగు ఉపాసనమే ఉపక్రమింపఁ

బడినది. ఉపసంహారములోఁగూడ "తస్యహవా ఏతస్యాత్మనో వైశ్వానరస్య మూర్ధైవ సుతేజాః" ఛాం. 5-18-2 అని సమస్తోపాసనము స్పష్టముగాఁ జెప్పఁబడినది ఉపక్రమోపసంహారములనుబట్టియును నిచట సమస్తోపాసనమే వివక్షితము.

### 33 శబ్దాదిభేదాధికరణము.

అవ। పూర్వాధికరణములో సమస్తోపాసనమే ప్రధానమైనదని నిర్ణయింపఁబడుటచే నిట్లే ఛాందోగ్యములోని శాండిల్యవిద్య దహరవిద్య మధువిద్య మున్నగువిద్య లన్నియు నొక్కటే. వీనియందు వేద్యుఁడగు నీశ్వరునికి నానాత్వములేదు కనుక యని సంగతిచే సంశయము గలుగ నీయధికరణ మారంభమైనది.

### నానా, శబ్దాదిభేదాత్. 58

నానా = ఛాందోగ్యాదులందుఁ జెప్పఁబడిన శాండిల్యాది విద్యలు విభిన్నములేకాని యన్నియు నొక్కటి కావు. ఎందుచేతననఁగా, శబ్దాదిభేదాత్ = ఒకచోట "వేద" యనియు నింకొక్కచోట "ఉపాసీత" అనియు "స క్రతుంకుర్వీత" అనియు శబ్దభేదము, గుణభేదము కనిపించుచున్నది. వేద్యుఁడగు నీశ్వరుఁ డొక్కఁడేయైనను గుణభేదముచే భేదముండును. ఇవన్నియు నొకే విద్యయన్నచో విద్యకు ఇయత్త (పరిమితి) లేకపోవును సర్వవిధోపాసనలు నొక్కటే యన్నచో సమష్ఠాన

మశక్యమై యప్రామాణ్యమును గలిగించును. కావున విద్యలు వేర్వేరేయనుట సమంజసము.

## 34 వికల్పాధికరణము

అవ॥ పూర్వాధికరణముచే విద్యానానాత్వము సిద్ధించినది. కాన, సగుణబ్రహ్మవిద్యోపాసనలలో స్వేచ్ఛగా వికల్ప సముచ్చయములతో ననుష్ఠానము చేయవచ్చునా! లేక వికల్పముగానే అనుష్ఠానము చేయవలెనా? అని సంశయము గలుగుచున్నది. విద్యోపాసనయందుఁ బ్రవృత్తి స్వేచ్ఛాధీనము గాన యావజ్జీవము నేదోయొకే విద్య నుపాసింపవలెనని కాని రెండు మూడు విద్యల నుపాసింపవలెనని కాని నియమము లేదు. అని అనియమము రాగాఁ జెప్పుచున్నారు.

### వికల్పోఽవిశిష్టఫలత్వాత్ 59

వికల్పః = శాండిల్యాద్యుపాసనవిద్యలయందు, వికల్పమే. ఎందుచేతనవనఁగా, అవిశిష్ట,ఫలత్వాత్ =అవిశిష్టమైన (అభిన్నమైన) ఫలముకలవి యగుటవలన, ఈవిద్యలకు ఉపాస్యదేవతా సాక్షాత్కారమే ఫలము, ఏదో యొకవిద్య నుపాసించుటచే నుపాస్యసాక్షాత్కారము కలుగుచుండ విద్యాంతరోపాసనము నిష్ఫలము. విరుద్ధోపాస్య ద్వయ సాక్షాత్కారమునేక కాలమునందు సంభవింపదు. కాన విద్యాంతరము వ్యర్థము. భగవద్గీతలలోఁగూడ "తంత మేవైతికాం

చేయు సదా తద్భావభావితః" అని యేకవిద్యానుష్ఠానమే చెప్పఁబడినది. కానన్నిర్గోయుకేవిద్య యుపాసన చేయఁదగినది.

## 35 కామ్యాధికరణము.

అవి ప్రతీకోపాసనలయందుఁ గూడ పూర్వవిధముగా వికల్పమే ప్రాప్తించుచుండఁగా నీయధికరణము చెప్పఁబడినది. కామ్యాస్తు, యథాకామంసముచ్చీయేరన్, నవా, పూర్వ

హేత్వభావాత్, 60

కామ్యాస్తు="నామ బ్రహ్మేత్యుపాస్తే" ఛాం 7-1-5 అని చెప్పఁబడిన ప్రతీకోపాసనలైతే, యథాకామం=ఇష్టము వచ్చినట్లు, సముచ్చీయేరన్=సముచ్చయముగా రెండుమూడు పాసనలుచేయువచ్చును. లేదా, నవా=నవానముచ్చీయేరన్ = సముచ్చయముగా ఉపాసన చేయకపోవచ్చును. ఎందుచేత, పూర్వహేత్వభావాత్=వెనుకటి అవిశిష్టఫల మను హేతువు లేదుకనుక.

ఉపాసనలు— రెండురకములు, అహంగ్రహోపాసనలు, ప్రతీకోపాసనలునని. అహంగ్రహోపాసనలకు ఈశ్వర ఉపాస్యదేవతా) సాక్షాత్కారము ఫలము. ఇది "దేవో భూత్వా దేవానప్యేతి" బృ -4-1-2 అనిచెప్పఁబడినది. అనఁగా నిరంతరము ఉపాస్యదేవతను హెచ్చుగా భావించుచుండినచో నాభావనాబలముచే ఉపాస్యముయొక్క సాక్షా

త్కారమునుబొంది ముక్తుఁడై దేవత్వమునుబొందును అని భావము. కావున నీయుపాసనలలో సముచ్చయము పనికిరాదు. వికల్పమేయని పూర్వాధికరణమునఁ దెల్పఁబడినది. కొంత కాల మొకయుపాసనచేసి (దానిని విడిచిపెట్టి) మఱికొంత కాలము మఱియొకయుపాసనచేయుచున్నచో చిత్తవిక్షేపము కలిగి పురుషునకు సాక్షాత్కారము కలుగదని యొకేయుపాసనము చేయవలెనని వికల్పము చెప్పఁబడినది.

ప్రతీకోపాసన లనఁగా "నామ బ్రహ్మేత్యుపాస్తే" మొదలగునవి. వీనియందు సాక్షాత్కార రూప ఫలములేదు. భోగ్యవస్తుప్రాప్తియే ఫలము. కావున నీయుపాసనలను సముచ్చయముగా (రెండు, మూడు కొంతకాల మొకటి, మఱి కొంతకాలము మఱియొకటి) చేసినను నీయుపాసనమువలన నపూర్వద్వారా ఫలముగలుగును. కావున కామ్యములగు వీనిని యథాకామముగా నాచరింపవచ్చును.

### 36 యథాశ్రయభావాధికరణము (61-66)

ప్రతీకములు, రెండువిధములు, లౌకికములు, వైదికములు నని. లౌకికములలో పూర్వాధికరణమున యథాకామాచరణము నిర్ణయింపఁబడినది. వైదికములలో కర్మాంగములైన ఉద్గీథాదులయందలి యాశ్రితవిద్యలు సముచ్చయానుష్ఠేయములా? యథాకామానుష్ఠేయములా? అని సంశయము కలిగి సముచ్చయానుష్ఠానమునందు ఫలబాహుళ్యముండును. యథా

కామానుష్ఠానములోఁ బ్రయోగ సౌకర్యముండును. అని రాఁగాఁ జెప్పుచున్నారు.

అంగేషు యథాశ్రయభావః 61

అంగేషు = ఆశ్రయములైన అంగములయందు, యథా = ఏప్రకారముగా సముచ్చయానుష్ఠానమో అట్లే అంగావబద్ధములైన ఆశ్రితవిద్యలయందును సముచ్చయానుష్ఠానమే కర్తవ్యము. ఆశ్రితములాశ్రయ తంత్రములుకనుక.

శిష్టేశ్చ 62

అంగములకువలె తదాశ్రితోపాసనలకును బ్రతివేదము సముచ్చయ విధానముండుటవల్లను సముచ్చయ విధానము.

సమాహారాత్ 63

"హోతృషదనాద్ధైవాపి దురుద్గీథ మనుసమాహరతి" ఛాం 1-5-5 హోత, దురుద్గీథమును = స్వరదుష్టమైన యుద్గీథమునుగూడ, హోతృషదనాత్ = ప్రణవము ఉద్గీథము నొకటేయను "యః ప్రణవ స్స ఉద్గీథః" "య ఉద్గీథ స్స ప్రణవః" అను విజ్ఞానమువలన, అనుసమాహరతి = సమాధానపరచుచున్నాఁడు అని ఐక్యవిజ్ఞానమును బ్రశంసించుటవలన, సర్వవేదోదిత ప్రత్యయసంహారమును సూచించుటవల్లను సముచ్చయానుష్ఠానమే కర్తవ్యము.

గుణసాధారణ్యశ్రుతేశ్చ. 64

గుణస్య సాధారణ్యశ్రుతిః = గుణస్య = గుణమైన (ఆశ్రయమైన) ఓంకారమునకు సాధారణ్యశ్రుతేః = వేదత్రయ సాధారణమగు శ్రుతివల్లను "ఓమిత్యాశ్రావయతి ఓమితి శంసతి ఓమిత్యుద్గాయతి" ఛాం. 1-1-9 అను ఆశ్రయసాధారణ్యమును దెలుపు శ్రుతివల్లను ఆశ్రిత సాధారణ్యము తెలియుచున్నది. కనుక ఆశ్రితములగు నుపాసనలకు సముచ్చయానుష్ఠానమే అని పూర్వపక్షము రాఁగా సమాధానమును ముందుసూత్రములచేఁ జెప్పుచున్నారు.

న వా తత్సహభావాశ్రుతేః. 65

తత్సహభావాశ్రుతేః = ఆశ్రయమునకు, ఆశ్రితమునకు సహభావమును దెలుపు శ్రుతిలేకపోవుటవలన, నవా = సముచ్చయానుష్ఠానముకాదు. వేదత్రయ విహితములగు అంగములకు, స్తోత్రములకు సహభావశ్రుతి కలదుకాని ఆశ్రితములకు ఆశ్రయములకు సహభావశ్రుతిలేదు. కాని నీ ఆశ్రితములగు ఉపాసనలకు సముచ్చయములేదు.

దర్శనాచ్చ. 66

దర్శనాచ్చ = శ్రుతియందు సముచ్చయములేకపోవుట గనఁబడుటవల్లను గూడ నీయుపాసనలకు (వైదిక) సముచ్చయములేదు. యథాకామముగా సముచ్చయముగనో వికల్పముగనో అనుష్ఠింపవచ్చును.

"ఏవంవిద్ధ వై బ్రహ్మ యజ్ఞం యజమానం సర్వాంశ్చ ఋత్విజో ఽభిరక్షతి" ఛాం 4-17-10 అని శ్రుతికలదు. జ్ఞానవంతుండగు బ్రహ్మ యజ్ఞమును యజమానుని ఋత్విజులను సంరక్షించునని గావున — పైనం జెప్పినట్లు సర్వప్రత్యయోపసంహారమే యున్నచో సంరక్షణ మన్నియుం దెలిసినవారే యగుదురుగావ జ్ఞానవంతుండగు బ్రహ్మచే నితరు లందఱును రక్షింపఁబడుదురనుట యనుపపన్నమగును. దీనిచే సర్వప్రత్యయోపసంహారము లేదని తెలియుచున్నది. అందుచేత సముచ్చయానుష్ఠానమే యను నియము లేదు.

ఇది శ్రీ వారణాసి గంగాధరశాస్త్రి కృతమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్ర వృత్తియందు
తృతీయాధ్యాయ
తృతీయపాదము.
అధి36—సూ66

---

శ్రీరస్తు

# బ్రహ్మ సూత్రార్థ దీపిక

## తృతీయాధ్యాయ చతుర్థపాదము

### 1 పురుషార్థా ధికరణము 1-17

అవ॥ వెనుకటిపాదములో సగుణ నిర్గుణ బ్రహ్మవిద్యలకు గుణోపసంహారము కావింపఁబడినది. ఈ పాదములో నావిద్యలు కర్మ నిరపేక్షములుగనే పురుషార్థసాధనము లని నిరూపింపఁబడుచున్నది. కర్మనిరపేక్షములగు నీవిద్యలకంగము లేవి? యని యాకాంక్షకలుగ, యజ్ఞాదులు బహిరంగములు, శమాదు లంతరంగములు నని నిరూపింపఁబడును. అందు మొదటి యధికరణమున, ఔపనిషద మగు ఆత్మజ్ఞానము కర్మసహకృతమై పురుషార్థసాధనమగునా? కర్మనిరపేక్షముగ, స్వతంత్రముగనే పురుషార్థసాధకమా? అని సంశయముకలుగ, సిద్ధాన్త నిరూపణముతోఁ బ్రారంభించుచున్నారు.

**పురుషార్థోఽతశ్శబ్దా దితి, బాదరాయణః**

అతః = ఈస్వతంత్రమైన ఔపనిషదమగు ఆత్మజ్ఞానము వలననే, పురుషార్థః = మోక్షము సిద్ధించును. ఎందుచేత ననఁగా, శబ్దాత్ = "తరతి శోక మాత్మవిత్" ఛాం 7-1-6 "సయోహవై తత్పరమం బ్రహ్మ వేద బ్రహ్మైవభవతి" ముం. 3-2-9 "బ్రహ్మవిదాప్నోతి పరమ్." తై. 2-1-1. "ఆత్మావా

అరే ద్రష్టవ్యః" బృ 4-5-6. అని మొదలిడి చెప్పిన "ఏతావదరేఖల్వమృతత్వం" బృ. 4-5-15 మొదలగు శబ్దముల వలన, ఇతి = అని బాదరాయణః = బాదరాయణాచార్యులు తెలుపుచున్నారు.

శేషత్వాత్పురుషార్థవాదః యథాన్యేష్వితి జైమినిః 2

అవః కర్మ నిరపేక్షముగనే ఆత్మజ్ఞానము పురుషార్థ సాధనము అని చెప్పిన దానిమీఁద పూర్వపక్షము చేయుచున్నారు.

శేషత్వాత్ = పురుషుఁడు కర్త యగుటచేఁ గర్మ శేషుఁడు గావున, పురుషార్థవాదః = పై చెప్పినశ్రుతి, పురుషునియందర్థవాదము. యథా అన్యేషు = ఇతరములైన ద్రవ్య సంస్కారక కర్మములందు ("యస్య పర్ణమయీ జుహూర్భవతి నస పాపగ్‌శ్లోకం శృణోతి" మున్నగు) వలె, ఇతి = అని, జైమినిః = జైమిన్యాచార్యులు తలఁచుచున్నారు.

ఆచారదర్శనాత్. 3

ఆచారదర్శనాత్ = ఆచారము కనఁబడుట వల్లను, జ్ఞానము స్వతంత్ర పురుషార్థ సాధనముగాదు "జనకోహ వై దేహో బహుదక్షిణేన యజ్ఞేనేజే" బృ. 3-1-1. మున్నగు శ్రుతులయందు బ్రహ్మవేత్తయైన జనకుఁడు. కర్మానుష్ఠానము చేసినట్లు కనఁబడుచున్నది. కేవలజ్ఞానమువల్లనే పురుషార్థము సిద్ధించుచుండ కర్మాచరణ మెందులకు?

## తచ్ఛ్రుతేః. 4

తచ్ఛ్రుతేః = (తత్ + శ్రుతేః) విద్య, కర్మశేషము అనశ్రుతివలన కేవలవిద్య, (జ్ఞానము) పురుషార్థసాధకము గాదు. "యదేవ విద్యయాకరోతి శ్రద్ధయా ఉపనిషదా తదేవ వీర్యవత్తరం భవతి" ఛాం. 1-1-10

## సమన్వారంభణాత్ 5

"తంవిద్యాకర్మణీ సమన్వారభేతే" బృ. 4-4-2 అని ఫలారంభములో విద్యాకర్మములు రెండును గలిసి పరలోకమును గుఱించి వెళ్ళునతని ననువర్తించును అని సాహిత్యదర్శనమువలన కేవలజ్ఞానమునకుఁ బురుషార్థ సాధనత్వము లేదు.

## తద్వతో విధానాత్. 6

తద్వతః = సమస్తవేదార్థజ్ఞానముకలవానికి, విధానాత్ = కర్మాధికారమును విధించుటవలన "వేద మధీత్య స్నాయాత్" ఛాం 8-15-1 (అను శ్రుతులవలన) విద్యకు స్వాతంత్ర్యము లేదు. 'అధీత్య' అనుదానికి ఫలవదర్థావబోధ పర్యంతము నధ్యయనముచేసి యని యర్థము.

## నియమాచ్చ. 7

"కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషే చ్ఛతగ్ం సమాః ఏవం త్వయి నాన్యథే తోఽస్తి నకర్మ లిప్యతే నరే" ఈశ 2.

అని యావజ్జీవము కర్మాచరణనియమమువల్లను విద్య కర్మ
శేషమే కాని స్వతంత్రము కాదు.

అవ॥ ఇంతవఱకు, జ్ఞానము స్వతంత్రముగాఁ బురుషార్థ
సాధనము కాదు, అని సప్రమాణముగా నిరూపించి పూర్వ
పక్షము చేయఁగా సిద్ధాంతము నిఁకఁ జెప్పుచున్నారు.

అధికోపదేశాత్తు బాదరాయణస్యైవం తద్దర్శనాత్. 8

ఇచట తు, అనుదానికి నిషేధమర్థము తు=విద్య
కర్మశేషము—కాదు. బాదరాయణస్య= బాదరాయణుని
యొక్క మతము, జ్ఞానము స్వతంత్రముగాఁ బురుషార్థసాధక
మని. ఇది సరియైనది. ఎందుచేత? అధికోపదేశాత్ =
వేదాన్తములందు, కర్మకర్త, కర్మశేషుఁడు, సంసారి, యగు
శారీరకునికంటె, అధికుఁడగు, అకర్త అసంసారి చిన్మా
త్రుఁడు నగు నీశ్వరునియొక్క, ఉపదేశమువలన. అనఁగా
వేదాన్తములందుఁ జెప్పఁబడిన ఆత్మజ్ఞానము, చిన్మాత్రాశ్ర
యము కాన, ఏవం = ఈరీతిగా శ్రుతులర్థవాదములును
గావు. ఆత్మజ్ఞానమువలనఁ బురుషార్థము సిద్ధించునన్నదే
యుక్తము, తద్దర్శనాత్=అధికుఁడగు నీశ్వరుని చెప్పినట్లుగా
"యస్సర్వజ్ఞ స్సర్వవిత్" ముం 1-1-9. మున్నగు శ్రుతు
లగపడుటవలన. నిత్యశుద్ధ బుద్ధముక్తాత్మ జ్ఞానము కర్మోప
యోగి కాదు. కాన నాఫలశ్రుతు లర్థవాదములుగావు.

తుల్యంతుదర్శనమ్ 9

జనకాదులు కర్మాచరణముచేసినట్లు కనంబడుటవలన జ్ఞానముకర్మాంగము అనిచెప్పినదానికి సమాధానము చెప్పు చున్నారు.

దర్శనం తు=శ్రుతిదర్శనమైతే, తుల్యం= సమానము- జ్ఞానముకర్మశేషముకాదు అనువిషయమునను శ్రుతి కనిపించు చున్నది.

"ఏతంవై తమాత్మానం విదిత్వా బ్రాహ్మణాః పుత్రైషణాయాశ్చ, విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ, వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి బృ. 3.5.1 అని.

అసార్వత్రికీ. 10

"యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా ఉపనిషదా" అనిచెప్పినశ్రుతి సార్వత్రికముకాదు. ఉద్గీథవిద్యాప్రకరణ ములో చెప్పుటవలన తద్విషయకమే కాని సర్వవిద్యావిష యకముకాదు. కనుక తచ్ఛ్రుతేః" అని చెప్పినహేతువు సరి కాదు.

విభాగశ్శతవత్. 11

"సమన్వారంభణాత్" అనుదానికిసమాధానము చెప్పు చున్నారు.

శతవత్ = నూరురూప్యములను వీరిరువురకిమ్మనది యన్నపుడు విభజించి చెరియేబదియిచ్చినట్లు, "తం విద్యా

కర్మణీ సమన్వారభేతే" అన్నశ్రుతి విద్య యొకనిని, కర్మ
మతియొకనిని అనుసరించును అని యర్థము చెప్పుకొనవలెను.

అధ్యయన మాత్రవతః 12

"తద్వతో విధానాత్" అనుదానికి సమాధానము. అధ్యయనమాత్రవతః = అధ్యయనము మాత్రమే కలవానికి కర్మాధికారమును విధించునదికాని, ఆత్మజ్ఞానము కలవానికి కర్మాధికారమును విధించునదికాదు.

నావిశేషాత్ 13

"కుర్వన్నేవేహ కర్మాణి" అన్నచోట, అవిశేషాత్ జ్ఞానికే అను విశేషము లేకపోవుటవలన, న=జ్ఞానికిఁగాదు.

స్తుతయే నుమతిర్వా 14

"కుర్వన్నేవేహ కర్మాణి" అన్నది ప్రకరణమునుబట్టి జ్ఞానియును గర్మములుచేయుచునే యని సంబంధింపఁజేసినను, స్తుతయే = జ్ఞానమును స్తుతించుటకొఱకు, అనుమతిర్వా = కర్మానుమతి యనియైనను జెప్పవచ్చును. విద్వాంసుఁడు (జ్ఞాని) కర్మములు చేయుచున్నను గర్మలేపమును బొందఁడు అని విద్యాస్తుతి.

కామకారేణ చైకే 15

ఏకే = కొందఱు (వాజసనేయులు) కామకారేణచ - స్వేచ్ఛచేతనుగూడ గృహస్థాశ్రమ త్యాగమును జెప్పుచు

న్నారు. అనఁగా విద్యాఫలమును ప్రత్యక్షముగాఁ జేసికొన్నట్టి వారగు కొందఱు "పూర్వేవిద్వాంసః ప్రజాం నకామయన్తే కిం ప్రజయాకరిష్యామః యేషాం నోఽయ మాత్మాఽయం లోకః" బృ 4-4-22

ఈయుపరోక్షాత్మయే ప్రత్యక్ష ఫలముగాఁగల మనకుఁ బ్రజతో (సంతతి) ఫలమేమి? అని అగ్నిహోత్రాది కర్మము లను జేయురైరి. అని దీనియర్థము. దీనిని బట్టి విద్యాప్రాధా న్యముతోఁచుచున్నది. కాన విద్య కర్మ శేషముకాదు.

ఉపమర్దంచ 16

కొందరు విద్వాంసులు, ఉపమర్దమునున్ను జెప్పుచు న్నారు. ఉపమర్ద మనఁగా సర్వ వ్యవహారోపరమము. "యత్రత్వస్య సర్వ మాత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్ బృ. 2-4-14.

కర్మాధికారమునకు హేతువు, క్రియాకారక ఫల లక్షణము, అవిద్యాకృతము నగు ప్రపంచమున కంతకును విద్యా సామర్థ్యమువలన ఉపమర్దమును (అభావమును) జెప్పు చున్నారు. దీనిచేతను, విద్య కర్మాంగము కాదని తెలియు చున్నది.

ఊర్ధ్వరేతస్సు చ శబ్దేహి 17

ఊర్ధ్వరేతస్సుచ = ఊర్ధ్వరేతస్కులయందును (యతు లయందును) బ్రహ్మ విద్య శ్రుతమగుచున్నది. యతుల

కగ్నిహోత్రాది కర్మములు లేవు కనుక, వారి విద్య కర్మాంగముకాదు. కావున బ్రహ్మవిద్య కర్మాంగముకాదు. ఊర్ధ్వరేతస్కులు గలరనుటకుఁ బ్రమాణమేమన? శబ్దేహి=వేదమునందూర్ధ్వరేతసులున్నట్లు ప్రమాణములు గలవు.

"ఏతమేవ ప్రవ్రాజినో లోక మిచ్ఛన్తః ప్రవ్రజన్తి". బృ. 4-4-22 కనుక బ్రహ్మవిద్య స్వతంత్రముగ పురుషార్థసాధనమని తెలియుచున్నది.

## 2 పరామర్శాధికరణము, 18-20

అవ. బ్రహ్మవిద్య స్వతంత్రముగ పురుషార్థసాధనము యత్యాశ్రమమందు దానికి కర్మాంగత్వములేదు అని చెప్పఁబడినది. యత్యాశ్రమమున్నదా? లేదా? అది అనుష్ఠేయమా? కాదా? అని యీ యధికరణమున విచారింపఁబడుచున్నది.

పరామర్శం జైమిని రచోదనా చాపవదతిహి 18

శ్రుతిలో "త్రయో ధర్మస్కంధాః యజ్ఞోఽధ్యయనం దానమితి ప్రథమః తప ఏవ ద్వితీయః బ్రహ్మచా ర్యాచార్యకులవాసీ తృతీయో ఽత్యంత మాత్మానం ఆచార్యకులేవసాదయన్ సర్వఏతే పుణ్యలోకాభవన్తి బ్రహ్మసంస్థోఽమృతత్వ మేతి" ఛాం. 2-23-1.

ఇచ్చట స్కంధశబ్దమునకు ఆశ్రమమని యర్థము. యజ్ఞాది ధర్మప్రధానమైన గార్హస్థ్యాశ్రమము మొదటిది.

తపః ప్రధానమైన వానప్రస్థాశ్రమము రెండవది. ఆచార్య కులవాసముగల బ్రహ్మచర్యము మూడవది. ఈ మూడాశ్రమముల వారికి పుణ్యలోకములు కలుగును. బ్రహ్మసంస్థుడమృతత్వమును బొందును. అని దీనియర్థము.

ఇందు ఆశ్రమ విధి యున్నదా? లేదా? అని సంశయముగలుగ "పరామర్శం జైమినిః=పరామర్శమును (అనువాదమును) మాత్రమే జైమిని తలఁచుచున్నాఁడు. ఇదియనువాదమే కాని విధి కాదు. ఎందుచేతననఁగా అచోదనా=విధిని దెలియఁజేయు లిఙాదిప్రత్యయము లేదు కనుక ఈశ్రుతి అచోదన, చోదనారహితము. విధిని గల్పింపరాదా? యనిన అపవదతిచ=సంన్యాసవిధిని వేదము నిందించుచున్నది. "వీరహా వా ఏష దేవానాం యోగ్ని ముద్వాసయతే" తై. 1-5-2-1. అగ్నినుద్వాసన చేసినవాఁడు (అగ్నిహోత్రములు మానినవాఁడు) వీరహుఁ డనఁబడును. అని సన్యాసాశ్రమమును నిందించుచున్నది. కనుక విధి కల్పనము చేయ వీలుపడదు.

అనుష్ఠేయం బాదరాయణః సామ్యశ్రుతేః 19

బాదరాయణః = బాదరాయణాచార్యులు, అనుష్ఠేయం=సన్యాసాశ్రమము అనుష్ఠింపఁదగినదని చెప్పుచున్నారు. ఎందుచేతననఁగా, సామ్యశ్రుతేః = గృహస్థాశ్రమముతో సామ్యము వినఁబడుటవలన "త్రయో ధర్మస్కంధాః" అను

శ్రుతిలో గృహస్థ, వానప్రస్థ బ్రహ్మచర్యాశ్రమములను మూడింటిని చెప్పి యీమూడాశ్రమములవారికిఁ బుణ్యలోకములు కలుగునని చెప్పి చివర "బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి" అని చెప్పఁబడినది. "బ్రహ్మసంస్థః" అనుదానికి బ్రహ్మణి = ప్రత్యగ్రూపే, సంస్థా=సమ్యక్ నిష్ఠా యస్య, అని పరబ్రహ్మమందు నిష్ఠకలవాఁడు అనఁగా సన్న్యాసియని యర్థము అతఁడమృతత్వము నొందును. అని యతనికి నిత్యఫలము చెప్పఁబడినది. మిగిలిన ముగ్గురికి అనిత్యములగు పుణ్యలోకముల ఫలమే చెప్పఁబడినది. కనుక ఈశ్రుతిలో గృహస్థాశ్రమముతోఁ దుల్యముగా యత్యాశ్రమముకూడఁ జెప్పఁబడినదికాన సన్న్యాసాశ్రమముకూడ శ్రుతిసిద్ధము. అనుష్ఠేయము అని బాదరాయణునిమతము.

లిఙాది విధిబోధక ప్రత్యయము లేదంటిరి కదా యన-విధిబోధకము లేకున్నను ఆవాక్యమనువాదపరమైనను దానిచే విధిని గల్పింపవచ్చును.

"వీరహా వా ఏష దేవానాం యోఽగ్నిముద్వాసయతే" అని శ్రుతి సన్న్యాసాశ్రమమును నిందించుచున్నదని యంటిరేయన—ఆశ్రుతి అజ్ఞానము వలన అగ్నులను విడిచిపెట్టిన వారివిషయముకాని జ్ఞానవైరాగ్యము సన్న్యసించిన పరివ్రాజకుల విషయముకాదు. అదికాక "బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్" జా. ఉ. ౪. మున్నగువానివల్లను పరివ్రాజకాశ్రమము విధింపఁబడుచున్నది.

## విధిర్వా ధారణవత్ 20

"త్రయోధర్మస్కంధాః" అను వాక్యమున, విధిర్వా= విధియే, అనువాదము కాదు. జైమిని చోదనలేదని యిది యనువాదమాత్రమనెను. కాని విధికల్పనము చేయవలెను. ఎందుచేత? అప్రాప్తము కనుక.

అయినచో - త్రయోధర్మస్కంధాః ఏ తేపుణ్యలోకఫలాః బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి అని ప్రతీతమగు ఏకవాక్యతకు భంగము కలుగును. నాల్గవయాశ్రమమును జెప్పిన వాక్యభంగము కలుగదాయెను, అప్రాప్తమగుటచే విధికల్పనము అవశ్యకము కాన వాక్యభేదము నంగీకరింపవలెను. ఎట్లనగా ధారణవత్ = ధారణమువలె అనగా మహాపితృయజ్ఞమునందు "అధస్తాత్సమిధం ధారయన్ అనుద్రవే దుపరి హి దేవేభ్యో ధారయతి" అన్నచోట అధోధారణ విధితో నేకవాక్యతయున్నను ఉపరిధారణము అప్రాప్తము కనుక వాక్యభేదముచే విధి నంగీకరించినట్లు ఇచ్చటను వాక్యభేదమున్నను అప్రాప్తమగుటచే విధి నంగీకరింపవలెను. "విధిస్తు ధారణేఽపూర్వత్వాత్". జై. ౩-4-15.

"బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి" అన్నచోట బ్రహ్మసంస్థః అనుదానికి యౌగికార్థము నాశ్రయించి యే ఆశ్రమములోనున్నవాడయినను అమృతత్వమును బొందునా? సన్యాసి

యేనా? అని సంశయము కలుగ, త్రయోధర్మస్కంధాః అని ప్రారంభించి "ఏతే పుణ్యలోకాభవన్తి" అని వారికిఁ బుణ్యలోక ఫలమును జెప్పి, బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి" అని చెప్పుటచే బ్రహ్మసంస్థునికి మోక్షము ఫలము. ఏ యాశ్రమములో నున్నవానికయినను బ్రహ్మసంస్థత్వము కలుగదా యనరాదు. సన్యాసియే బ్రహ్మసంస్థుఁడు, అన్యుఁడు కాఁడు. సంస్థ పదమునకు సమాప్తి యర్థము. బ్రహ్మయందు సమాప్తి యున్కఁగా వేరే వ్యాపారము లేకుండుట. అది ఆ సన్యాసికిఁ దక్క ఆశ్రమాంతరులకు సంభవింపదు. కాన సన్యాసియే బ్రహ్మసంస్థుఁడు అని (భాష్యములో వినిర్ణీతము).

### 3 స్తుతిమాత్రాధికరణము (21-22)

### స్తుతిమాత్రముపాదానాదితిచే న్నాపూర్వత్వాత్ 21

"సఏష రసానాం రసతమః పరమః పరార్ధ్యోఽష్టమో యదుద్గీథః" ఛాం.1-1-3 మున్నగు శ్రుతులలో రసతమత్వాది కీర్తనము, ఉద్గీథాదిస్తుతికొఱకా? ఉపాసనము కొఱకా? అని సంశయము కలుగ నిర్ణయింపఁబడుచున్నది.

రసతమత్వాది కీర్తనము, ఉపాదానాత్ = కర్మాంగములు, స్తుత్యములు, అగు ఉద్గీథాదులయొక్క ఉపాదానము వలన, స్తుతిమాత్రం = స్తుతికొఱకే, ఇతిచేత్ = అని చెప్పినచో, న = కాదు. అపూర్వత్వాత్ = అప్రాప్తమగుట

వలన, విధియనియే చెప్పవలెను. అంగవిధి సాన్నిధ్యము లేదుకాన నర్థవాదములును గావు.

భావశబ్దాచ్చ 22

"ఉద్గీథముపాసీత" ఛాం. 1-1-1 మొదలగు విధి శబ్దము వల్లనున్న నిట్టివానికుపాసనా విధిత్వమే చెప్పవలెను.

4 పారిప్లవార్థాధికరణము. (23-24)

పారిప్లవార్థా ఇతిచేన్న విశేషితత్వాత్. 23

"అథహయాజ్ఞవల్క్యస్య ద్వేభార్యే బభూవతుః మైత్రేయీచ, కాత్యాయనీచ" బృ. 4.5.1 మొదలగు ఆఖ్యాయికలు వేదాన్తములందు వినఁబడుచున్నవి.

ఇవిపారిప్లవార్థములా? సన్నిహితవిద్యాస్తుత్యర్థములా? అని సంశయము గలుగుచున్నది. పారిప్లవమనఁగా అశ్వమేధయాగములో రాత్రులందు రాజును సకుటుంబముగాఁ గూర్చుండబెట్టి అధ్వర్యుఁడు వైదికములగు కథలను జెప్పుట. ఇదిపారిప్లవమనుకర్మము. "సర్వాఖ్యానాని పారిప్లవే" అనిపారిప్లవమందు సర్వాఖ్యాయికలకును వినియోగమును జెప్పుటవలన నివిపారిప్లవార్థములేయని పూర్వపక్షము రాఁగా, ఇతి చేత్ + న = అన్నచో గాదు. పారిప్లవార్థములని చెప్ప రాదు. విశేషితత్వాత్ = "పారిప్లవమాచక్షీత" అనిప్రారంభించి "మనుర్వైవస్వతో రాజా" అని కొన్నికథలనుమాత్రమే

చెప్పుటవలన, ఆచెప్పఁబడినవే పారిప్లవార్థములుకాని యాఖ్యాన నివదనములగు కథలన్నియును ప్లారిప్లవార్థములుగావు.

తథాచైకవాక్యతోపబన్ధాత్. 24

తథాచ=అలాచెప్పుటవలన, ఏకవాక్యతోపబన్ధాత్=సన్నిహితవిద్యలతో ఏకవాక్యతాప్రతీతివలన, సన్నిహిత విద్యాంగత్వము చెప్పుటయే యుక్తము.

5 అగ్నీన్ధనాద్యధికరణము.

అతఏవచాగ్నీన్ధనాద్యనపేక్షా 25

బ్రహ్మవిద్య మోక్షసాధనమని చెప్పఁబడినది. అట్లు బ్రహ్మవిద్య మోక్షమును గలిగించుటలోఁ గర్మములను అపేక్షించునా? అపేక్షింపదా? అని సంశయముగలుగ నీయధికరణము నిర్ణయించుచున్నది.

అతఏవచ=ఈహేతువువల్లనే అనఁగా పురుషార్థో ఽతశ్శబ్దాత్ 3-4-2 అను సూత్రములోఁ జెప్పఁబడిన, "విద్య స్వతంత్రముగాఁ బురుషార్థహేతువు" అనుటవల్లనే, అగ్నీన్ధనాది= అగ్నులు, ఇన్ధనములు=కట్టెలు, ముఖ్యముగా శ్రావలయు కర్మములయొక్క అనపేక్షా= అపేక్షలేకపోవుట, బ్రహ్మవిద్య మోక్ష సిద్ధిని గలిగించుటలోఁ గర్మముల నపేక్షింపదు అని మొదటి యధికరణఫలము నుపసంహరించు చున్నారు.

## 6 సర్వాపేక్షాధికరణము (26-27)

### సర్వాపేక్షా చ యజ్ఞాదిశ్రుతే రశ్వవత్. 26

విద్యోత్పత్తిలోఁ గర్మములయపేక్ష యున్నదా? లేదా? అని సంశయముగలుగ వారింప నీయధికరణమారంభింపఁబడినది.

యజ్ఞాదిశ్రుతేః = "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన, దానేన తపసా నాశకేన." 4-4-22 అను శ్రుతివలన, సర్వాపేక్షా చ = సమస్తమైన ఆశ్రమకర్మములయొక్కయు అపేక్ష కలదు. బ్రహ్మవిద్య ఫలమును గలిగించుటలోఁ గర్మముల నపేక్షింపకున్నను, స్వోత్పత్తిలోఁ గర్మముల నపేక్షించును. అనఁగా స్వస్వవిహిత కర్మముల నొనరించుటవలన చిత్తశుద్ధిద్వారా వివిదిష = జ్ఞానేచ్ఛ కలుగును. ఎట్లనగా అశ్వవత్ = గుఱ్ఱమువలె గుఱ్ఱము నాఁగలికట్టి దున్నుట కుపయోగపడకున్నను రథమును లాగుట కుపయోగపడునట్లు కర్మములు విద్యాఫలము నందుపయోగ పడకున్నను విద్యోత్పత్తియం దుపయోగ పడును.

### శమదమాద్యుపేతః స్యాత్ తథాపితు తద్విధేస్తదం గతయా తేషామవశ్యానుష్ఠేయత్వాత్ 27

జ్ఞానోత్పత్తిలో బహిరంగసాధనములను ప్రకృతి రూపములును నగు కర్మములను దెలిపి, యంతరంగసాధనము

లును నివృత్తిరూపములును నగు శమదమాదులను జెప్పుచున్నారు.

తథాపితు=అలా యజ్ఞాదికర్మముల ననుష్ఠించిన వాడైనను విద్యాసాధకుఁడు, శమదమాద్యుపేతః= శమముదమము మొదలగు గుణములతోఁ గూడినవాఁడు స్యాత్ =కావలయును. తదంగతయా=విద్యాంగముగా, తద్విధేః = శమదమాదివిధియుండుటవల్లను, తేషాం=ఆశమదమాదులు, అవశ్యానుష్ఠేయత్వాత్ =ముఖ్యముగా ననుష్ఠింపఁ దగినవగుటవల్లను, శమదమాద్యుపేతుఁడు కావలయును. "తస్మా దేవం విత్ శాంతో దాన్త ఉపరత స్తితిక్షుః సమాహితః శ్రద్ధావిత్తో భూత్వా ఆత్మన్యేవాత్మానం పశ్యేత్" - బృ. 4-4-23. అని విద్యాసాధనములుగా శమదమాదులను విధించుటచేత, నివి యంతరంగములు, ఇచ్చట, పశ్యేత్ అని విధిస్పష్టముగా నున్నది. యజ్ఞాదివాక్యములందు విధిముఖ్యముకాన నవి బహిరంగసాధనములు.

## 7 సర్వాన్నానుమత్యధికరణము. (28-31)

### సర్వాన్నానుమతిశ్చ ప్రాణాత్యయే తద్దర్శనాత్ -28

ఛాందోగ్యములో ప్రాణవిద్యయందు "నహవా ఏవం విది కించన అనన్నం భవతి" ఛాం. 5-2-1 అనియున్నది. ప్రాణోపాసకునకు అన్నము కానిది (అభక్ష్యమైనది) ఏదియు

నుచేదని యర్థము. ఈ సర్వాన్నానుజ్ఞానము శమాదులను విధించినట్లు విద్యాంగముగా విధించుటయా? లేక, ప్రాణోపాసనను స్తుతించుటయా? అని సంశయము కలుగ, అప్రాప్తముకనుక ప్రాణవిద్యాంగముగ విధానమేయని పూర్వపక్షము రాఁగాఁ జెప్పుచున్నారు. "యదిదం కించ ఆశ్వభ్యః, ఆకృమిభ్యః ఆకీటపతంగేభ్యః తత్తేన్నమ్". అని శ్వాది మర్యాదముగాఁ ప్రాణమునకన్నము అని విధించి "నహవా ఏవం విది కించన అనన్నం భవతి" అని చెప్పఁబడినది. శ్వాది మర్యాదమైన (కుక్కలు నక్కలు తినునట్టిది) అన్నము మనుష్య దేహముతోనున్న ప్రాణికుపయోగింప వీలుపడదు కదా! అప్పుడు ఇది విధి యెట్లగును? కావున ఇది ప్రాణాన్న విద్యాస్తుతిపరము అని చెప్పవలెను. అయినచో అభక్ష్య భక్షణమొనరింపరాదా? యనిన — కాదు. ప్రాణాత్యయే సర్వాన్నానుమతిశ్చ = ప్రాణాత్యయే - ప్రాణాపాయము సంభవించినపుడు, సర్వాన్నానుమతిః = నిషిద్ధమును విడిచి సర్వవిధ భక్షణముచేసియైనను ప్రాణమును నిలుపుకొనవచ్చును. తద్దర్శనాత్ = శ్రుతిలో అట్లు కనిపించుటవలన "చాక్రాయణోనామ ఋషిః హాస్తిపకేన అర్ధభక్షితాన్ కుల్మాషాన్ ప్రాణాత్యయే భక్షయామాస ఇతి "మటచీహతేషుకురుషు" ఛాం. 1-10 1.

పూర్వము కురుదేశములందు దుర్భిక్షము కలిగి తిండి దొరకక బాధపడిరి. అప్పుడు చాక్రాయణుఁడను ఋషి క్షుధా

తుఁడై దేశాంతరముపోయి యచ్చట హస్తిపకుఁడొకఁడు (మావటీడు) కుల్మాషములు = కుచ్ఛితమాషములు (పాడయి పోయిన మినుములు) తినుచుండ వానివద్ద కొన్నిటి నామిను ములను బుచ్చుకొని తిని ప్రాణమును నిలుపుకొనెను. ఇదిగో మంచినీరు త్రాగుము అని హస్తిపకుఁడనఁగా నీరు త్రాగరాదు. అని చెప్పెను. మినుములెట్లు తింటివి? యని వాఁడడుగ ప్రాణము పోవుచున్నదిగాన ఆపత్సమయముగాన తింటిని. నీరు ఏచెరువులోనైన దొరకును. ఇప్పటికి ప్రాణము నిలిచినది. అని యాతఁడు బదులుపలికెను. కాన దీనినిబట్టి ప్రాణాపాయ సమయముననే నిషిద్ధభక్షణమును వర్జించి దేనినైనను భక్షించి ప్రాణమును నిలుపుకొనవచ్చును.

అబాధాచ్చ. 29

భక్ష్యాభక్ష్య నిర్ణయశాస్త్రము ఈ విధముగాఁజెప్పిన బాధితము కాదు కనుకను

అపిచస్మర్యతే. 30

స్మృతియందుఁగూడ ఆపత్సమయమందు జ్ఞానికి నజ్ఞానికిని సర్వాన్నానుమతిని దెలుపుచున్నది.

జీవితాత్యయమాపన్నో యోన్న మత్తి యతస్తతః
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా. మ. 10-104

శబ్దశ్చాతో ఽకామకారే. 31

అకామకారే = కామనకరణమును (స్వేచ్ఛగా సర్వ భక్షణముచేయుటను) నివర్తింపఁజేయుటకై (అకామకారే అన్నది నిమిత్త సప్తమి) శబ్దశ్చ "(బ్రాహ్మణో న సురాం పిబేత్" అను శబ్దమున్ను అతః = సర్వాన్నానుమతి యనునది యర్థవాదమనుటవలన అసంకుచిత "నిర్బాధ" మగుచున్నది.

8 ఆశ్రమకర్మాధికరణము (32-35)

అవ. అగ్నిహోత్రాది కర్మములనువివిదిషార్థము, నిత్యాధికారసిద్ధ్యర్థము, రెండు పర్యాయములు చేయవలయునా? ఒక పర్యాయముచేసినఁ జాలునా? అని సంశయము కలుగ ప్రయోజనభేదముండుట వలన రెండు పర్యాయములు చేయఁదగినవి అని పూర్వపక్షము రాఁగాఁ జెప్పుచున్నారు.

విహితత్వాచ్చాశ్రమకర్మాపి. 32

విహితత్వాచ్చ=విధింపఁబడుటవల్లను, ఆశ్రమకర్మాపి= ఆశ్రమకర్మమున్ను అగును. అనఁగా "యావజ్జీవ మగ్నిహోత్రం జుహోతి" అని నిత్యకర్మత్వసిద్ధికొఱకు "తమేతం వేదానువచనేన" అని వివిదిషార్థమును అగ్నిహోత్రము రెండు పర్యాయములు చేయనక్కఱలేదు. వివిదిషార్థము చేయుచున్నచో అది ఆశ్రమకర్మమున్ను అగును కాన సకృదాచరణము చేతనే రెండు ప్రయోజనములును సిద్ధించును.

సహకారిత్వేనచ. 33

సహకారులగుటచేతను, రెండు పర్యాయములు చేయ నక్కఱలేదు. ఈ అగ్నిహోత్రకర్మములు, విద్యాసహకారకములు. అనగా జ్ఞానార్థమున్ను చోద్యమును. ఒకేకర్మము యావజ్జీవశ్రుతిచే నిత్యమును, "తమేతం" అను శ్రుతిచే కామ్యమును నగునా! ప్రయోజనద్వయాపేక్ష విరోధము కాదా? అన్నచో కాదు, "ఖాదిరో యూపో భవతి" "ఖాదిరం వీర్యకామస్య" అని రెండు శాస్త్రములవలన ఖాదిరమునకు (చండ్రకఱ్ఱకు) క్రత్వర్థముగా నిత్యత్వము వచ్చుచున్నది. పురుషార్థత్వముచే అనిత్యత్వమును వచ్చుచున్నది. ఇచట నొకే ఖాదిరమునకు నిత్యత్వ పురుషార్థత్వములు గలిగినట్లు ప్రకృతమున నగ్నిహోత్రములకు నిత్యత్వకామ్యత్వములు గలుగవచ్చును. కామ్యానుష్ఠానముచేతనే నిత్యత్వమును సిద్ధించును.

సర్వథాపి తఏవోభయలింగాత్. 34

సర్వథాపి = సర్వవిధములచేతను, తఏవ = అవియే, ఆశ్రమకర్మములన్నను, విద్యాసహకారకములన్నను, అవే అగ్నిహోత్రములు కాని వేఱు కావు. ఎందుచేత? - ఉభయలింగాత్ = రెండువిధములైన లింగములు నుండుటవలన, శ్రుతిలింగము - "యజ్ఞేన దానేన" అన్నది - స్మృతి

లింగము "అనాశ్రితః కర్మఫలం కార్యంకర్మ కరోతియః" గీ. 6.1. అనునదియును.

అనభిభవంచదర్శయతి. 35

బ్రహ్మచర్యాది సాధనసంపన్నునికి రాగాదిక్లేశముల చేత, అనభిభవంచ=అభిభవము (తిరస్కారము) లేకుండుటను తిరస్కరింపబడకుండుటను, దర్శయతి=శ్రుతి చూపుచున్నది. "ఏష ఆత్మా న నశ్యతి, యం బ్రహ్మచర్యేణానువిన్దతే" ఛాం 8-5-3. బ్రహ్మచర్యాద్యాశ్రమకర్మము చిత్తశుద్ధి ద్వారా జ్ఞానసాధకమై ఆత్మజ్ఞానమునకు సహకారకమగును. కాని ఆత్మజ్ఞానము చెడదు. అని ఆశ్రమకర్మములు జ్ఞాన సాధనములని సహకారిత్వమును చెప్పుచున్నది.

9 విధురాధికరణము (36-39)

అన్తరాచాపితు తద్దృష్టేః. 36

విధురునికి (ఆశ్రమము లేనివానికి) బ్రహ్మవిద్యాధికారమున్నదా ? లేదా ? అని సందేహము కలుగ నీయధికరణ మారంభింపఁబడుచున్నది.

అన్తరాచాపి = ఆశ్రమమును (బ్రహ్మచర్యగృహస్థాదికమును) దేనిని స్వీకరింపనివాఁడు, భార్య చనిపోయినవాఁడును విధురుఁడనబడును. వీరికే అనాశ్రములు. (ఆశ్రమమేదియును లేనివారు) అనియు వ్యవహారము. ఈ అనాశ్రమిత్వావస్థ

యందును విద్యాధికారమున్నది. తద్దృష్టేః = రైక్వుఁడు మొదలగు వారికి అనాశ్రములకు బ్రహ్మవిద్యాధికారమున్నట్లు కనఁబడుటవలన. గురుకులమునుండివచ్చిన రైక్వాదులకు వివాహముకన్న ముందు సంవర్గవిద్యయందధికారమున్నట్లు శ్రుతిలోఁ గనిపించుచున్నది కనుక విధురులకును బ్రహ్మవిద్యాధికారము కలదు.

అపిచస్మర్యతే. 37

అనాశ్రములైన సంవర్తాదులకు మహాయోగిత్వము ఇతిహాసమునందుఁ గనిపించుచున్నది.

విశేషానుగ్రహశ్చ. 38

ఆ విధురాదులకు, జపము, ఉపవాసము, దేవతారాధనము మొదలగు ధర్మవిశేషములచే విద్యయందు అనుగ్రహము కలదు.

"జప్యేనైవతు సంసిద్ధ్యే ద్బ్రాహ్మణో నాత్రసంశయః
కుర్యా దన్యన్నవాకుర్యా న్మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే"

అని జన్మాంతరానుష్ఠితము లైన యాశ్రమ కర్మములచే విధురాదులకు విద్యానుగ్రహము కలుగును.

అతస్త్వితరజ్జ్యాయో లింగాచ్చ. 39

అతః = ఈ అనాశ్రమిత్వావస్థకంటె, ఇతరత్ = ఆశ్రమియైయుండుట, జ్యాయః = శ్రేష్ఠమైనది, లింగాచ్చ =

శ్రుతి, స్మృతి లింగములవలనను. శ్రుతిలింగము - "తేనైతి బ్రహ్మవిత్ పుణ్యకృత్" = బృ. 4-4-9. స్మృతిలింగము = "అనాశ్రమీ నతిష్ఠేత దినమేకమపి ద్విజః".

## 10 తద్భూతాధికరణము

తద్భూతస్యతు నాతద్భావః, జైమినేరపి నియమా తద్రూపా
భావేభ్యః. 40

"బ్రహ్మచర్యం సమాప్య గృహీభవేత్ గృహాద్వనీ భూత్వా ప్రవ్రజేత్" జాబా. ౪. అని ఆశ్రమములకు ఆరోహాక్రమము వివరింపబడుచున్నది. ఆరోహాక్రమమువలె అవరోహాక్రమముకూడ నున్నదా? యతి, గృహస్థాశ్రమము స్వీకరింపవచ్చునా? కూడదా? అని సంశయము కలుగ నీయధికరణ మారంభింపఁబడినది.

తద్భూతస్యతు = యతియైనవానికి మరల, అతద్భావః = యతి కాకుండపోవుట (యత్యాశ్రమమునుండి చ్యుతిపొందుట) న = కూడదు. జైమినేరపి = ఈ పక్షము, జైమినికిన్ని, బాదరాయణునకున్ను కూడ సమ్మతము. ఎందుచేతననఁగా, నియమ, అతద్రూప, అభావేభ్యః = నియమ — "అత్యన్త మాత్మాన మాచార్యకులే౽వసాదయన్" ఛాం. 2-23-2. "అరణ్యమియాత్" "బ్రహ్మచర్యం సమాప్య గృహీభవేత్" జాబా. 4. "బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్"

అని ఆరోహక్రమనియమముచేతను, అతద్రూప = ఆరోహ సమానమైన అవరోహనియమము లేకపోవుటచేతను, అభావేభ్యః = శిష్టాచారము లేకపోవుట యను నీ మూడు హేతువులవల్లను, యతియైనవానికి గృహస్థాశ్రమ స్వీకారము కూడదు.

## 11 అధికారికాధికరణము (41-42)

నచాధికారికమపి పతనానుమానాత్తదయోగాత్. 41

ఆరోహక్రమముగా యత్యాశ్రమము గ్రహింపవచ్చునుగాని యతి ప్రత్యవరోహక్రమముగా పతనము పొందరాదు అని చెప్పఁబడినది. ఒకవేళ ప్రమాదమునఁ బ్రత్యవరోహము నొందిన నైష్ఠికునకుఁ బ్రాయశ్చిత్తము కలదా? లేదా? అని సందేహము కలుగఁ జెప్పుచున్నారు.

అధికారికమపి = అధికారి లక్షణమందు నిర్ణయింపఁబడిన ప్రాయశ్చిత్తమున్ను, న = లేదు ఎందుచేత ? పతనానుమానాత్ = పతన శ్రుతిని ఊహింపఁజేయు స్మృతివలన, తదయోగాత్ = ప్రాయశ్చిత్తము లేకపోవుట వలన.

అనఁగా ఊర్ధ్వరేతస్కతను (యత్యాశ్రమమును) పొంది భ్రష్టుఁడైనవానికిఁ బ్రాయశ్చిత్తము లేదు. "బ్రహ్మచార్యవకీర్ణీ నైఋతం గర్దభమాలభేత్" అను ప్రాయశ్చిత్తము కూడ నైష్ఠికునకు లేదు.

"ఆరూఢో నైష్ఠికం ధర్మం యస్తు ప్రచ్యవతే పునః
ప్రాయశ్చిత్తం న పశ్యామి యేనశుద్ధ్యేత్స ఆత్మహా"

అని యుండుటచే నితనికి ప్రాయశ్చిత్తము కూడ లేదు.

ఉపపూర్వమపి త్వేకే భావమశనవత్తదుక్తమ్ 42

ఏకే = కొందఱు, ఉపపూర్వం అపితు = నైష్ఠికునికి సంభవించిన యవకీర్ణిత్వ దోషమును (యతియై భ్రష్టుడయిన పాపమును) ఉపపూర్వమైన పాతకమునుగానే తలంచుచున్నారు. అనగా నిది ఉపపాతకమే కాని గురుదారాగమనాదులవలె మహాపాతకము కాదు అని చెప్పుచున్నారు. భావం = ప్రాయశ్చిత్తముయొక్క స్థితిని కోరుచున్నారు. అనగా ప్రాయశ్చిత్తము లేకనుట తగదు. ఉపకుర్వాణకునికి వలె నైష్ఠికునకును ప్రాయశ్చిత్తముంటను గోరుచున్నారు. ఇరువురికి బ్రహ్మచారిత్వము అవకీర్ణిత్వము సమమే. అవకీర్ణి అనగా యోనియందు వడబడిన రేతస్సు గలవాడు. (నియమభ్రష్టుడు).

మైవిషయమున కుదాహరణము చూపుచున్నారు. అశనవత్ = బ్రహ్మచారి మధుమాంసభక్షణము చేసినచో ప్రాయశ్చిత్తముచే శుద్ధిని జెప్పినట్లు ఉపపాతకములలో దీనిని గణించి ప్రాయశ్చిత్తము నిరూపించుట తగును. "ప్రాయశ్చిత్తం న పశ్యామి" యనుమాటకు గతియేమి? అనగా ప్రాయశ్చిత్తము చేసికొన్నను నతనితో సహావ్యవహారములు సలుప

కుండుటకు సత్పురుషులు ప్రయత్నాధిక్యమును చూపుటకని తెలియుచున్నది. తదుక్తమ్ = ప్రమాణ లక్షణమందు, అవిష యము చెప్పఁబడినది. "సమా విప్రతిపత్తిస్స్యాత్" పూ. మీ. 1-3-8. "శాస్త్రస్థావాతన్నిమిత్తత్వాత్" 1-3-9 అనుచోట వానప్రస్థపరివ్రాజకులకుఁ గూడ వ్రతభంగమునందుఁ బ్రాయశ్చిత్తము స్మరింపఁబడుచున్నది. "వానప్రస్థో దీక్షా భేదే కృచ్ఛ్రం ద్వాదశ రాత్రిం చ రిత్వా మహాకక్షం వర్ధయేత్ భిక్షు ర్వానప్రస్థ వత్సోమవల్లి వర్జమ్. అని. కావున నైష్ఠికునకుఁ బ్రాయశ్చిత్తమున్నది.

## 12 బహిరధికరణము.

బహిస్తూభయథాపి స్మృతే రాచారాచ్చ. 43

ప్రాయశ్చిత్తానంతరము నైష్ఠికునకితరులతో సంవ్యవహార్యత్వమున్నదా? లేదా! అనఁ బ్రాయశ్చిత్తముచేశుద్ధుఁడగుటచేత సంవ్యవహార్యతయున్నది అని రాఁగా నీయధికరణ మారంభింపఁబడుచున్నది.

ఉభయథా = అవకీర్ణిత్వము మహాపాతకమైనను, రెండువిధములనుగూడ బహిస్తు= అవకీర్ణి (పతితుఁడు) బహిష్కార్యుఁడే. ఎందుచేతననఁగా స్మృతేః= స్మృతివలన, ఆచారాచ్చ=ఆచారము వల్లనున్ను, అతఁడు ప్రాయశ్చిత్తానంతరమందును బహిష్కార్యుఁడే.

స్మృతి:-"ఆరూఢో నైష్ఠికం ధర్మం" అని వెనుకఁ జెప్పినది కాక

ఆరూఢపతితం విప్రం మండలాచ్చ వినిస్సృతమ్
ఉద్బద్ధం కృమిదష్టంచ స్పృష్ట్వా చాంద్రాయణం చరేత్

అని స్మృత్యంతరమునుగలదు. ఆచారము-శిష్టులు పతితునితో సహాయజ్ఞాధ్యయన వ్యవహారములు సలుపరు. పరలోక ప్రతిబంధపరిహారమునకే ప్రాయశ్చిత్తము.

## 13 స్వామ్యధికరణము. (44-46)

### స్వామినః ఫలశ్రుతే రిత్యాత్రేయః. 44

అంగావబద్ధోపాసనములు (అంగాశ్రితోపాసనములు) యజమానకర్తృకములా? ఋత్విక్కర్తృకములా? అనిసందేహముకలుగఁజెప్పుచున్నారు. ఫలశ్రుతేః = ఫలశ్రవణము వలన, అంగాశ్రితోపాసనలయందు, కర్తృత్వము, స్వామినః=స్వామికే (యజమానునికే), ఇతి=అని, ఆత్రేయః=ఆత్రేయుఁడు చెప్పుచున్నాఁడు.

కర్మాధికృతుఁడు యజమానుఁడుకనుక, ఫలము యజమానునికేఁగలుగుటన్యాయ్యము కనుకను, కర్తృత్వముకూడ యజమానునిదేయని ఆత్రేయాచార్యునియభిప్రాయము.

### ఆర్త్విజ్య మౌడులోమి స్తస్మై హి పరిక్రీయతే. 45

ఔడులోమిః = ఔడులోమియను ఆచార్యుడు, ఆర్త్వి

జ్యం=ఋత్విక్కర్తృకమునుగానే చెప్పుచున్నారు. ఎందుచేత ననఁగా. హి=ఎందువలన, తస్మై = దానికొఱకు = సాంగమగు నా కర్మముకొఱకు, ఋత్విక్ పరిక్రీయతే=ఋత్విక్కు పరిక్రయము చేయఁబడుచున్నాఁడు సాంగమగు (అంగసహితమగు) కర్మమును నెఱవేర్చుటకు యజమానుఁడు ఋత్విక్కును కొనుక్కొనుచున్నాఁడు. కనుక అంగాశ్రితమగు నుపాసనకు కర్త ఋత్విక్కు అయినను, ఫలము ఋత్విక్కుద్వారా యజమానుని ప్రయోజక కర్తను బొందును. (గోదోహనాదికమునవలె).

## శ్రుతేశ్చ. 46

శ్రుతివలనఁగూడ ఋత్విక్కర్తృకకర్మముల ఫలము యజమానుని బొందునని తెలియుచున్నది. "యాంవై కాంచన యజ్ఞే ఋత్విజ ఆశిషమాశాసతే ఇతి యజమానస్యైవ తామాశిష మాశాసతే ఇతిహోవాచ" "తస్మాదుహైవంవి దుద్గాతా బ్రూయాత్ కంతే కామ మాగాయాని" ఛాం. 1-7-8 అనుశ్రుతులవలన, ఋత్విక్కర్మముల వలన ఫలము యజమానుని బొందునని తెలియుటచే అంగావబద్ధోపాసనములు, ఋత్విక్కర్తృకములు.

## 14 సహకార్యంతరవిధ్యధికరణము (47-49)

అవ. బృహదారణ్యకములో కహోళబ్రాహ్మణమున "తస్మాత్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య, బాల్యేన, తిష్ఠా

సేత్, బాల్యంచ పాండిత్యంచ నిర్విద్యాథమునిః అమౌనంచ మౌనంచ నిర్విద్యాథ బ్రాహ్మణః" 3.5.1 అనియున్నది.

దీనియర్థము :- బ్రహ్మభావము పరమ పురుషార్థమని తలంచి పూర్వులగు బ్రాహ్మణు లెల్లరు నేషణాత్రయమును విడిచి బ్రహ్మభావమును పొందిరి. కాన నిప్పుడును గూడ బ్రాహ్మణుఁడు బ్రహ్మభావమును పొందఁదలచినవాఁడై ఉపనిషత్తాత్పర్యార్థ నిర్ణయరూపమైన శ్రవణము (పెద్దలవలన వినుట) అను పేరుగల పాండిత్యమును, నిర్విద్య = నిశ్శేషముగాఁబడసి, బాల్యేన = బాలభావముచేత = కామాది నిర్ముక్తిచేత = శుద్ధాంతఃకరణత్వముచేత, తిష్ఠాసేత్ = ఉండుటకిష్టపడవలెను. అట్టి బాల్యమును పాండిత్యమునుగడించి, మునిః = మననశీలుఁడు కావలయును, అనఁగా నిదిధ్యాసనము చేయవలయును. అమౌనం = మౌనముకంటె వేఱయిన బాల్యమును (పాండిత్యమును,) మౌనంచ = నిదిధ్యాసనమును గడించి, బ్రాహ్మణః = "బ్రహ్మైవాహం" అని బ్రహ్మసాక్షాత్కారమును పొందినవాఁడు గావలయును.

ఈవాక్యములో "అమౌనం మౌనంచ, నిర్విద్య" అని యున్నదేకాని విధి లేదుకనుక, ఇచ్చట మౌనము విధేయమగునా? కాదా? అని సంశయము గలుగ, వివరించుచున్నారు. విధి లేదుకనుక విధేయము కాదు, అని తాఁగాఁ జెప్పుచున్నారు.

సహకార్యన్తరవిధిః పక్షేణ తృతీయం తద్వతో విధ్యాదివత్ 47

సహకార్యన్తరవిధిః=విద్యా సహకారియగు మౌనము (నిదిధ్యాసనము) యొక్క విధి యుందు అంగీకరింపవలెను. ఎందుచేత? అప్రాప్తముకనుక, తద్వతః = ఆ విద్యకలవానికి (సంన్యాసికి) తృతీయం = బాల్యపాండిత్యములకంటె మూడవదియైన, మౌనము, పక్షేణ = పాక్షికముగా, నియమవిధిగా విధింపఁదగినది. అపూర్వవిధి కాకున్నను నియమవిధియని యైన విధింపవలెను. విధ్యాదివత్ = దర్శపూర్ణమాసప్రధానమైన "దర్శపూర్ణమాసాభ్యాం స్వర్గకామో యజేత" యను విధియందు సహకారిగా అగ్న్యాధానాదికమగు నంగజాతము విధింపఁబడినట్లు, ఇచ్చట విధిప్రధానమగు నీవాక్యమున మౌనవిధి సహకారిగా విధింపఁబడవలెను.

అవ॥ బాల్యాదివిశిష్టమైన సంన్యాసాశ్రమమున నుండవలెనని యిట్లుపదేశించుచుండ, ఛాందోగ్యములో, "అభిసమావృత్య కుటుంబే శుచౌ దేశే స్వాధ్యాయ మధీయానః" అని గృహస్థాశ్రమము నుపక్రమించి, "సఖల్వేవం వర్తయన్ యావదాయుషం బ్రహ్మలోక మభిసంపద్యతే, నచపునరావర్తతే" ఛాం 8.15.1 అని గృహస్థునికి మోక్షము చెప్పి ముగించుట వలన గృహస్థాశ్రమాతిరిక్తమైన యాశ్రమము లేదేమో యను శంక గలుగుచున్నదే! యనఁ జెప్పుచున్నారు.

కృత్స్నభావాత్తు, గృహిణోపసంహారః. 48

గృహిణా = గృహస్థాశ్రమముతో, ఉపసంహారః= ముగించుట, కృత్స్నభావాత్తు=కృత్స్న (సమస్త) మైనయాశ్రమముల కర్మములు శమాదులు, గృహస్థాశ్రమమునందున్న వనుభావముచే నట్లుపసంహారము చేయఁబడినదికాని సంన్యాసాశ్రమములేదను నభిప్రాయముతోఁ గాదు.

మౌనవదితరేషామప్యుపదేశాత్. 49

మౌనవత్ =సన్యాసాశ్రమమువలె (ఇదిగృహస్థాశ్రమమునకును నుపలక్షణము) గృహస్థ సన్యాసాశ్రమములవలె, ఇతరేషామపి= మిగిలినబ్రహ్మచర్య వానప్రస్థములకును నుపదేశముండుటవలన నివి రెండేయాశ్రమము లనుకొనరాదు. అవియును ననుష్ఠేయములే యనియర్థము. "తప ఏవ ద్వితీయః బ్రహ్మచార్యాచార్యకులవాసీ తృతీయః" ఛాం -2-23-1 అనిశ్రుతిచే నవియునుగలవు. మిగిలినవి రెండేకదా ఇతరేషాం అని బహువచన మెందులకన్న నవాంతర భేదాపేక్షముగాఁ జెప్పఁబడినది. బ్రహ్మచర్య వానప్రస్థములలోఁ బ్రత్యేకముగా నాలుగేసి భేదములుకలవు.

15 అనావిష్కారాధికరణము.

అవ॥ "బాల్యేన తిష్ఠాసేత్" బృ. 3.5.1 అనుచోట బాల్యమనఁగాఁ బాలునిభావము బాల్యమా? బాలునికర్మము

బాల్యమా! కామచారకామవాదాదికమగు బాలకర్మము బాల్యమే, ప్రరూఢేంద్రియుఁడు కాకపోవుటచే దంభదర్పాద్య భావసహిత భావనైర్మల్యము బాల్యమే. ఇందేవిధమైన బాల్యము గ్రహింపవలెను? అని సంశయముగలుగ, చెప్పుచున్నారు.

అనావిష్కుర్వన్నన్వయాత్. 50

బాలుఁడింద్రియప్రాబల్యము కలవాఁడు కాకపోవుటచే దంభదర్పాదులను ఆవిష్కరింపక శుద్ధభావుఁడై యెట్లుండునో అట్లే సంన్యాసియును, అనావిష్కుర్వన్ = దంభాదుల నావిష్కరింపక బాలునివలె శుద్ధభావుఁడై యుండవలెను. ఎందుచేతననఁగా అన్వయాత్ = పూర్వాపరవాక్యములకు అట్టియర్థమునందే అన్వయము కుదురునుగనుక.

16 ఐహికాధికరణము.

అవ॥ ఇంతవఱకు జ్ఞానహేతునిరూపణముచేసి యిపుడు జ్ఞానోత్పత్తికాలమును దెలుపుచున్నారు. జ్ఞానము ఈజన్మము నందుఁగలుగునా! జన్మాంతరమందుఁగలుగునా? సాధనములు న్నప్పుడు సాధ్యము కలుగవలయునుగాన జ్ఞానసాధనములగు శ్రవణాదులున్నవి కనుక ఈజన్మమునందే జ్ఞానముకలుగును. అని రాగాఁ జెప్పుచున్నారు.

ఐహికమప్యప్రస్తుతప్రతిబంధే తద్దర్శనాత్. 51

అప్రస్తుతప్రతిబంధే = ప్రస్తుత ప్రతిబంధము, లేకుండ నున్నప్పుడు, ప్రస్తుతమైన శ్రవణాదిసాధనమునకు కర్మశేష

ముచే ప్రతిబంధకము లేకయున్నప్పుడు, ఐహికమపి = ఈజన్మము నందును జ్ఞానముకలుగును. కర్మము విచిత్రపరిపాకము కలది కనుక, ప్రతిబంధకమేదయినకలిసినచో జన్మాంతరమునందును జ్ఞానము కలుగును. తద్దర్శనాత్ = అట్టి ప్రమాణములు కనఁబడుటవలన. "గర్భస్థఏవ వామదేవః ప్రతిబుబుధే" గర్భమునందుండగనే వామదేవుఁడు జ్ఞానియయ్యెను, జన్మాంతర శ్రవణమువలన వతనికి గర్భమునందుండఁగనే జ్ఞానముకలిగినది. అని తెలియుచున్నది. "శ్రవణాయాపి బహుభిర్యోనలభ్యః శృణ్వన్తోపి బహవోయంనవిద్యుః" కఠ 2.7. ఇత్యాదులవలనఁ ప్రతిబంధకములును గలవని తోఁచుచున్నది.

### 17 ముక్తిఫలానియమాధికరణము.

ఏవం ముక్తిఫలానియమ స్తదవస్థావధృతేః తదవస్థావధృతేః 52

విద్యాఫలమగు ముక్తియందుఁగూడ, తారతమ్యమున్నదా? లేదా? అను సంశయము గలుగ, స్వర్గరూప ఫలములో తారతమ్యమువలె జ్ఞానఫలమగు ముక్తిలోను దారతమ్యముండునని బాగాఁ జెప్పుచున్నారు.

ఏవం = ఈరీతిగా, జ్ఞానము, ఈజన్మమునందా పరజన్మమునందా? అన్న భేదమున్నట్లు, ముక్తి ఫలానియమః = ముక్తిరూప ఫలమునందు నియమములేదు, తారతమ్య నియమములేదు. ఎందుచేతననఁగా, తదవస్థావధృతేః "బ్రహ్మవేద బ్రహ్మైవభవతి" ముం. 3,2,9 అని బ్రహ్మభావరూప

ముగా ముక్తి చెప్పఁబడుటవలన. నిత్య నిరతిశయసుఖ స్వరూపమగు బ్రహ్మమునందుఁ దారతమ్యములేదు. కనుక జ్ఞానఫలమగు ముక్తియందుఁ దారతమ్య భావములేదు. తదవస్థావధృతేః అనుదానికి ద్విరుక్తి యధ్యాయ సమాప్తిద్యోతనము కొఱకుఁ జేయఁబడినది.

ఇతి శ్రీ మద్భగవద్బాదరాయణప్రణీత శారీరకమీమాంసా
సూత్రములకు, భారద్వాజసగోత్ర పవిత్రవారణాస్యన్వ
వాయ సుధాపయోధి రాకా కౌముదీ సుధాకరులగు
శ్రీ మదచ్యుతాంబా వేంకటేశ్వరుల తనూజుఁడగు
గంగాధరశాస్త్రి రచించిన బ్రహ్మసూత్రార్థ
దీపికయను బ్రహ్మసూత్ర వృత్తియందుఁ
దృతీయాధ్యాయమునఁ జతుర్థ పాదము.
తృతీయాధ్యాయము ముగిసెను.
ఈపాదమున అధి 17. సూ. 52.
ఈ యధ్యాయమున అధి 66 సూ. 186

శ్రీరస్తు

# బ్రహ్మసూత్రార్థ దీపిక

## చతుర్థాధ్యాయ ప్రథమపాదము

### 1 ఆవృత్త్యధికరణము (1-2)

వెనుకటి యధ్యాయమునఁ బరాపర విద్యలయందు సాధనాశ్రయమగు విచారము కావింపఁబడినది. ఈ యధ్యాయమున ఫలవిచారము చేయఁబడుచున్నది. అందును ప్రథమపాదమున శ్రవణాద్యావృత్తిచే నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారము నొందువానికిని, ఉపాసనచే సగుణబ్రహ్మ సాక్షాత్కారము నొందువానికిని ప్రారబ్ధకర్మాతిరిక్త పుణ్యపాపనివృత్తి రూపమగు జీవన్ముక్తి చెప్పఁబడుచున్నది.

సాక్షాత్కార సాధనములుగా శ్రవణమననాదులు చెప్పఁబడినవి. అందొక సంశయము కలుగుచున్నది. శ్రవణాదుల నొక్కపర్యాయమే చేయవలయునా? ఆవృత్తిగాఁ జేయవలయునా? అని? ఏమన. ప్రయాజాదులవలె శ్రవణాదికము నొక్కపర్యాయమే చేయవలయును. "సకృత్కృతే కృతః శాస్త్రార్థః" అను న్యాయముచే శాస్త్రము చరితార్థమగును. అని పూర్వపక్షము రాఁగాఁ జెప్పుచున్నారు.

ఆవృత్తిరసకృదుపదేశాత్. 1

ఆవృత్తిః = శ్రవణాద్యావృత్తి చేయవలయును. ఎందుచేతననఁగా, అసకృదుపదేశాత్ = ఆవృత్తి నుపదేశించుట

వలన. "శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" బృ. 4.5.6 అని ఆత్మవిషయక శ్రవణాద్యావృత్తి నుపదేశించుటవలన ఆవృత్తి చేయవలయును. "సకృత్కృతే కృతశ్శాస్త్రార్థః". అను న్యాయము అదృష్ట విషయము. బ్రహ్మ సాక్షాత్కార రూపమైన దృష్టఫలము కనఁబడుచుండ నదృష్టఫలకల్పనము నిరర్థకము. అవఘాతాదులు (ధాన్యము దంచుట మొదలగు నవి)తండులనిష్పత్తి పర్యవసానములు(బియ్యమగువఱకు దంచ వలసినవి) అయినట్లు, శ్రవణాదులు సాక్షాత్కార పర్యవసా నములు, బ్రహ్మ సాక్షాత్కార మగువఱకు శ్రవణాదుల నా వృత్తిచేయు చుండవలెను. "నిదిధ్యాసితవ్యః" అన్న నిదిధ్యా సనము ఆవృత్తిగుణకము. కనుక ఫల పర్యంతము ఆవృత్తి చేయవలెననుట న్యాయసిద్ధము.

లింగాచ్చ. 2

లింగమువల్లనున్ను ఆవృత్తి చేయవలెనని తెలియు చున్నది. ఉద్గీథవిద్యలో "ఆదిత్య ఉద్గీథః" ఛాం. 1.5.1 అని ప్రారంభించి, ఏకపుత్రతాదోషముచే దానిని నిందించి "రశ్మీం స్త్వం పర్యావర్తయాత్" అని బహుపుత్రతాసంపత్తి కై విధించు ఉపాసనోపదేశము, ఆవృత్తిని సూచించుచున్నది. కేవలాదిత్యునినే ఉపాసన చేయుటవలన నొక్కఁడే పుత్రుఁడు గలుగును. ఆదిత్యరశ్ములను (కిరణములను) ఆదిత్యుని వేర్వే రుగా ఉపాసనము చేయుము. నీకుఁ బెక్కండ్రు పుత్రులు గలు గుదురు. అని బహుపుత్రావాప్తికై యుపాసన చెప్పఁబడి

నది. ఆదిత్యుని ఆదిత్యరశ్ములను వేర్వేరుగా ఉపాసన చేయుము అనుటలో ఒక్కొక్క కిరణముగా సహస్ర కిరణములను ఉపాసన చేసిన ఆవృత్తిగా చేయుటయే యగును. ఇది యుద్గీథోపాసనములోఁ జెప్పినను సామ్యముచే మిగిలిన యుపాసనములలోను ఇట్లే యావృత్తిగాఁ జేయవలెననుటకిది లింగము. ఈ లింగమువల్లను బ్రకృతమున శ్రవణాదుల నావృత్తిగాఁ జేయవలయును.

## 2 ఆత్మత్వోపాసనాధికరణము.

### ఆత్మేతితూపగచ్ఛన్తి గ్రాహయన్తిచ. 3

నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపుఁడగు పరమాత్మను నేను అని అహంప్రత్యయముచే గ్రహించి యుపాసనచేయవలయునా! మఱియొక విధముగా (మదన్యుఁ డనుబుద్ధితో) జేయవలయునా అని సందేహముకలుగఁ జెప్పుచున్నారు.

ఆత్మేతితు = ఆత్మయనియే (నేను అనియే) ఉపగచ్ఛన్తి = పరమాత్మను బొందుచున్నారు. సేవించుచున్నారు. "త్వంవా అహమస్మి భగవో దేవతే, అహంవా త్వమసి భగవో దేవతే!" పరమాత్మస్వరూపమును అహమనియే గ్రహించుచున్నారు. పరమాత్మ నిత్యసుఖ, అపహతపాప్మత్వాది గుణములుకలవాఁడునుగదా! అట్టి పరమాత్మయును, దుఃఖియుఁ బాపియునగు జీవుఁడును నొక్కఁడే యనుటెట్లు! నీవే నేను అని

అహంగ్రహోపాసన మెట్లు? అనఁగాఁ బరమాత్మస్వరూపుఁడే యగు జీవునకు అంతఃకరణరూపమగు ఉపాధివలన దుఃఖిత్వాది ధర్మములున్నట్లు తలఁచుచుండెనేగాని వాస్తవముగ లేవు కనుక జీవునకుఁబరమాత్మకును భేదములేదు కనుక అహంగ్రహముచే నుపాసన చేయవచ్చును. కనుకనే "అహం బ్రహ్మాస్మి" అని సేవించుచున్నారు. గ్రాహయన్తిచ = "తత్త్వమసి" ఛాం. 6,8,7 మున్నగు వాక్యములును అట్లే గ్రహింపఁ జేయుచున్నవి.

### 3 ప్రతీకాధికరణము.

### న ప్రతీకే న హి సః. 4

"మనో బ్రహ్మేత్యుపాసీత," ఆదిత్యో బ్రహ్మేత్యుపాసీత" ఛాం 3-18-1 మున్నగు ప్రతీకోపాసనములందు, సంశయము కలుగుచున్నది. ప్రతీకములు బ్రహ్మకార్యములు కనుక జీవుఁడు బ్రహ్మభిన్నుఁడే కనుక, అహంగ్రహముచే ఆత్మత్వేన ఉపాసనము చేయవలయునా? ప్రతీకత్వేన గ్రహించి యుపాసనము చేయవలయునా? అని సంశయము కలుగుచున్నది. దానిని వారించుచున్నారు.

ప్రతీకే= ప్రతీకమునందు, మనస్సు, ఆదిత్యుఁడు మున్నగు బ్రహ్మకార్యములయందు బ్రహ్మవికారములయందు),న=బ్రహ్మబుద్ధిచేయఁదగదు. హి=ఎందుచేతననఁగా సః= ఆ ఉపాసకుఁడు, న=ప్రతీకస్వరూపుఁడు కాఁడు.

కటక మకుటములకు సువర్ణత్వేన ఐక్యమున్నను స్వరూపముచే నైక్యములేనట్లు ప్రతీకములకు బ్రహ్మత్వేన ఐక్యమున్నను ఉపాసకరూపత్వేన ఐక్యములేదు. కావున వీనియందు అహంగ్రహోపాసనము చేయరాదు.

### 4 బ్రహ్మదృష్ట్యధికరణము

**బ్రహ్మదృష్టి రుత్కర్షాత్. 5**

మనో బ్రహ్మేత్యుపాసీత, ఆదిత్యో బ్రహ్మేత్యుపాసీత, మున్నగు వానిలో, మనస్సు మొదలగువానియందు బ్రహ్మదృష్టి నుంచి యుపాసనము చేయవలయునా? బ్రహ్మమందు మనస్సు మొదలగువాని దృష్టినుంచి యుపాసన చేయవలయునా? అని సందేహము కలుగుచున్నది. నియమము లేదు కనుక బ్రహ్మప్రధానమైనదికనుకను బ్రహ్మయందు మనోదృష్టి నుంచి యుపాసన చేయవలెనని రాఁగాఁ చెప్పుచున్నారు.

ఉత్కర్షాత్ = ఉత్కృష్టమైనది (గొప్పది) కనుక, బ్రహ్మదృష్టిః = మనస్సు మొదలగువానియందు బ్రహ్మదృష్టి నుంచి యుపాసన చేయవలెను. నికృష్టమైన మనస్సు మొదలగువానియందు ఉత్కృష్టమైన బ్రహ్మదృష్టినుంచి యుపాసన చేయవలయును. లోకములోఁగూడ నికృష్టులగు భృత్యులను రాజు అని ప్రశంసించి కార్యసిద్ధిని బొందుచున్నారు. అది కాక, "మనోబ్రహ్మేత్యుపాసీత" అన్నచోట ఇతి శబ్దము

బ్రహ్మశబ్దము తరువాత నున్నది కాని, మనశ్శబ్దముతో లేదు. ఇతి శబ్దము దృష్టిలక్షణము. అందుచే బ్రహ్మదృష్టినుంచి మనః ప్రభృతుల నుపాసన చేయవలయుననియే యర్థము.

### 5 ఆదిత్యాదిమత్యధికరణము.

ఆదిత్యాది మతయశ్చాంగ ఉపపత్తేః. 6

"య ఏవాసౌ తపతి తముద్గీథ ముపాసీత" ఛాం. 1.3.1 మొదలగు అంగావబద్ధోపాసనములందు సందేహము కలుగుచున్నది. ఆదిత్యునియందు ఉద్గీథదృష్టి చేయవలయునా? ఉద్గీథమునందు ఆదిత్యదృష్టిని జేయవలయునా! అని, ఉద్గీథము ఫలహేతువగుకర్మము. ఆదిత్యుఁడు సిద్ధరూపుఁడు, ఫలహేతువగుటచేఁ గర్మముత్కృష్టమని, ఉత్కర్షన్యాయముచే నాదిత్యునియందుత్కృష్టమగు ఉద్గీథకర్మబుద్ధినుంచి యుపాసింపవలెనని రాగాఁ జెప్పుచున్నారు.

అంగే=అంగమైన ఉద్గీథాదికర్మమునందు. ఆదిత్యాదిమతయశ్చ=ఆదిత్యాదిబుద్ధులు, కర్తవ్యాః=(అధ్యాహారము) చేయఁదగినవి. ఉద్గీథాదికర్మమునందు ఆదిత్యాదిబుద్ధిని జేయవలయును. ఎందుచేతననఁగా, ఉపపత్తేః= ఉపపత్తివలన, కర్మసమృద్ధిరూపమైన ఫల ముపపన్నమగుటవలన, అనియర్థము. ప్రోక్షణమువలన వ్రీహ్యాదులు సంస్కరింపఁబడినప్పుడు అపూర్వముపుట్టినట్లు ఉద్గీథాదికర్మములు ఆదిత్యాదిమతిచే సంస్క-

రింపఁబడినప్పుడు వీర్యవత్తరములై ప్రకృతకర్మమునకు ఫలాధిక్యమును గలిగించును.

## 6 ఆసీనాధికరణము. (7-10)

### ఆసీనస్సంభవాత్. 7

ఈయుపాసనలలో, ఉపాసకుఁడు కూర్చుండి యుపాసనచేయవలయునా? నిలఁబడి యుపాసనచేయవలయునా? ఎట్లు చేయవలయును? అని సందేహము కలుగుచున్నది. అంగావబద్ధము లగు కొన్ని యుపాసనములలో నియమ మానము లేకున్నను గొన్ని యుపాసనములందు సందేహము కలుగుచున్నది. కానఁ జెప్పుచున్నారు.

ఆసీనః=కూర్చున్నవాఁడై యుపాసనచేయవలయును. ఎందుచేతననఁగా, సంభవాత్=సంభవమువలన అనఁగా పరుండి యుపాసనచేసిన నిద్రవచ్చును. నడచుచుఁ జేసిన చిత్తవిక్షేపము గలుగును. నిలఁబడిచేసిన పడిపోదుమేమో యని శరీరధారణముపై దృష్టికలుగును. కావున కూరుచుండిచేసిననే చిత్తనైశ్చల్యము సంభవించునుగాన గూరుచుండియే యుపాసనచేయవలయును.

### ధ్యానాచ్చ. 8

ఉపాసనమనఁగా ధ్యానము. ధ్యానము చిత్తైకాగ్రత యున్నప్పుడే కలుగును. బక ధ్యానము లోకములోఁ దెలిసినదే.

కూర్చుండియున్నపుడే చిత్తైకాగ్రతకలుగునుగావునను ధ్యాన మనుటవల్లనున్ను కూరుచుండియే యుపాసన చేయవలెనని భావము.

అచలత్వం చాపేక్ష్య. 9

“ధ్యాయతీవ పృథివీ” ఛాం. 7-6-1 అనిచెప్పఁబడి నది. అనఁగా, పృథివీ=భూమి, ధ్యాయతీవ=ధ్యానముచేయు చున్నదివలెనున్నది. అనిచెప్పఁబడినది. కదలిక మెదలిక లేక స్థిరముగా నుండుటచే ధ్యానముచేయుచున్నదా! అనిపిం చినది. అనఁగా ధ్యానముచేయుటకు నిశ్చలత్వము సాధనము. అదికూర్చుండియున్నప్పుడే కలుగును.

స్మరన్తి చ. 10

స్మృతులలో “శుచౌదేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మనః” గీ. 6.11. అని ఉపాసనకు అంగముగా ఆసనము చెప్పఁ బడినది కావున ఆసీనుఁడయేయుపాసన చేయవలెను.

7 ఏకాగ్రతాధికరణము.

యత్రైకాగ్రతా తత్రావిశేషాత్॥

ఉపాసనకు దేశకాలవిశేషనియమము కలదా! యని శంకించుకొని చెప్పుచున్నారు.

యత్ర=ఏప్రదేశమునందు, ఏకాలమునందును, ఏకా గ్రతా=మనస్సునకు ఏకాగ్రత, కలుగునో తత్ర=అప్రదేశ

మున, ఆసమయమున, కోరుచున్నవాఁడై యుపాసనచేయ వలయును. అవిశేషాత్ = "సమేదర్శపూర్ణ మాసాభ్యాం యజేత" మొదలగు దేశకాలవిషయక విశేష ముపాసన ములలో లేదు కనుక నానియమములేదు.

అయితే, "సమే శుచౌ శర్కరా వహ్ని వాలుకావి వర్జితే శబ్దజలాశ్రయాదిభిః" శ్వే-2-10. అని విశేషముకనఁ బడుచుండ, అవిశేషాత్, అనిచెప్పుట యెట్లుపొసఁగును, అన దిక్కాలకృతమగు అవాన్తరవిశేషము లేదని భావము. మన స్సునకెచ్చట నేకాగ్రతగలుగునో యచ్చట గూరుచుండి యుపాసనచేయవలెనని తాత్పర్యము.

8 ఆప్రాయణాధికరణము.

ఆప్రాయణా త్తత్రాపిహి దృష్టమ్. 12

అభ్యుదయఫల హేతువు లగు అహంగ్రహోపాసన ములు కొంతకాలము ఆవృత్తిగాఁ జేసినఁ జాలునా? చివర వఱకుఁ జేయుచుండవలయునా? అని సందేహము కలుగఁ జెప్పు చున్నారు.

ఆప్రాయణాత్ = మరణపర్యన్తము, ఉపాసనావృత్తి చేయవలయును. హి = ఎందువలననఁగా, తత్రాపి=అజ్యోతిష్టో మాదులందును, అపిశబ్దమువలన ప్రకృతోపాసనములందును, పొందఁదగిన ఫలజ్ఞానము మరణకాలమునందు గలుగునని

శ్రుతిలోఁగనఁబడుచున్నది. "యచ్చిత్త స్తేనైష ప్రాణమాయాతి ప్రాణ స్తేజసా యుక్తః, సహాత్మనా యథాసంకల్పితం లోకంనయతి" ప్ర॥ 3.10 అనిశ్రుతి. అనఁగా యచ్చిత్తః= ఏవిషయమునందు ఈతనికి చిత్తముండునో, తేన= హృదయమందభివ్యక్తమైన ఆ విషయముతో, ప్రాణమాయాతి= ప్రాణమునుబొందును. ప్రాణః=అప్రాణము, తేజసా=తేజో దేవతాకమైన యుదానవాయువుతోను, సహాత్మనా= భోక్తయగు ఆత్మతోను, యథాసంకల్పితంలోకం నయతి=సంకల్పానుగుణమగు లోకమును బొందించును అనిశ్రుతిలో నుండుటచే మరణపర్యన్తము ఉపాసనచేయవలయును. యాగాదులకువలె అదృష్టద్వారా ఉపాసనములకును ఫలముగలుగుననరాదాయెను, దృష్టమగు ఫలము కనఁబడుచుండ అదృష్టఫలకల్పనము తగదు. స్మృతులలోఁగూడ నిట్లున్నది.

"యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కళేబరమ్,
తంతమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః" గీ. 8. 6.

### 9 తదధిగమాధికరణము.

**తదధిగమ ఉత్తరపూర్వాఘయో రశ్లేషవినాశౌ తద్వ్యపదేశాత్. 13**

తృతీయాధ్యాయ శేషమగు ఉపాసన చింత ముగిసినది. ఇఁక ఫలచింత చేయఁబడుచున్నది.

బ్రహ్మసాక్షాత్కారముచేత పాపమంతయు నశించునా! నశింపదా! అనిసంశయముకలుగ, నశింపదు; ఎందుచేత! కర్మములు ఫలార్థములుకనుక ఫలమునీయకుండ కర్మములు నశింపవు. "నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటిశతైరపి" అనుటవలన ప్రాయశ్చిత్తముచేసికొనఁబడని కర్మములు ఫలమునొసఁగక నశింపవు. అనిపూర్వపక్షము కలుగగాఁ జెప్పుచున్నారు.

తత్ +అధిగమే = ఆ బ్రహ్మజ్ఞానము (బ్రహ్మసాక్షాత్కారము) కలుగుచుండఁగా, ఉత్తర=ముందురాబోవునది, పూర్వ= వెనుకవచ్చినదియునగు, అఘయోః=పాపములకు, అశ్లేష=సంబంధములేకపోవుట, (అంటకపోవుట) వినాశౌ= నశించిపోవుటయును, భవతః=కలుగుచున్నవి. (అని అధ్యాహారము) క్రమముగా నుత్తరపాపమంటదు. పూర్వపాపముండదు. ఎందుచేతననఁగా, తద్వ్యపదేశాత్ = అట్లుశ్రుతిలోఁ జెప్పుటవలన "యథా పుష్కరపలాశే ఆపో నశ్లిష్యన్తే ఏవమేవంవిది పాపంకర్మ నశ్లిష్యతే" ఛాం. 4.14.3. అనియు )తామరాకునందు నీరుఅంటనట్లుగా బ్రహ్మజ్ఞానము కలవానియందు పాపకర్మము అంటదు.) "తద్యథేషీకాతూల మగ్నౌ ప్రోతం ప్రదూయేతైవం హాస్య సర్వేపాప్మానః ప్రదూయన్తే" ఛాం. 5-24.3. అనియును (దూదిపింజ అగ్నిలో భస్మమైనట్లు బ్రహ్మజ్ఞాని పాపకర్మములు జ్ఞానాగ్నిలో భస్మములగును) శ్రుతులు చెప్పుచున్నవి.

## 10 ఇతరాసంశ్లేషాధికరణము.

### ఇతరస్యాప్యేవ మసంశ్లేషః పాతేతు. 14

బ్రహ్మజ్ఞానము కలిగినవానికి పాపాసంశ్లేషవినాశములు చెప్పఁబడినవి. అట్లే పుణ్యమునకుఁగూడ అసంశ్లేషవినాశములు గలుగునా? కలుఁగవా! అని సందేహము కలుఁగఁ జెప్పుచున్నారు.

ఇతరస్యాపి = పాపముకంటె ఇతరమైన పుణ్యమునకున్ను, ఏవం = ఇట్లే పాపమునకువలెనే, అసంశ్లేషః = అంటకపోవుటయు, నాశమున్ను కలవు, అనఁగా బ్రహ్మజ్ఞానికి పాపమువలెఁ బుణ్యమున్ను నంటదు నశించిపోవును. కాన తన్నిమిత్తమైన శరీరప్రాప్తి మొదలగునవియునుండవు. "క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" ముం 2-2-8 అని, సర్వకర్మములకు క్షయముచెప్పఁ బడినది. "ఉభే ఉహ్యైవైష ఏతే తరతి" బృ 4.4.22 అని పుణ్యపాపములను రెండింటిని దరించును. రెండింటికి నాశము చెప్పఁబడినది. కనుక బ్రహ్మజ్ఞానికి పుణ్యపాపకర్మసంబంధ మేమియు నుండదు. పాతేతు = శరీరపాతమైనతరువాత మోక్షమే కాని, మరలజన్మము లేదు.

## 11 అనారబ్ధకార్యాధికరణము.

### అనారబ్ధకార్యే ఏవతు పూర్వే తదవధేః. 15

అవి॥ బ్రహ్మజ్ఞానికిఁ బుణ్యపాపకర్మములు అన్నియు నశించును అని చెప్పఁబడినది. అందు ఆరబ్ధకార్యములు,

అనారబ్ధకార్యములు నను పుణ్యపాపకర్మము లన్నియు నశించునా? అనారబ్ధకార్యములే నశించునా? అని సందేహము కలుగఁ జెప్పుచున్నారు.

తమ ఫలమునిచ్చుట కారంభించిన కర్మములు ఆరబ్ధకార్యములు, ప్రారబ్ధములు అని చెప్పఁబడును. తద్వ్యతిరిక్తములు అనారబ్ధకార్యములు.

అనారబ్ధకార్యే=ఆరంభింపఁబడని (విద్వచ్ఛరీరాంతఃఫలమగు) కార్యముగల పూర్వేవ=పూర్వోక్తములగు పుణ్యపాపములే అనఁగా ప్రారబ్ధవ్యతిరిక్తములగు పుణ్యపాపములే నశించును. ఎందుచేతననఁగా, తదవధేః = అది యవధిగాఁ జెప్పుటవలన. అనఁగా "తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే" ఛాం. 6. 14. 2 తస్య=ఆబ్రహ్మజ్ఞానికి, యావత్=ఎంతవఱకు, నవిమోక్ష్యే=యావత్ దేహప్రాణైర్నవిమోక్ష్యతే=దేహము ప్రాణములతో విడిచిపెట్టఁబడదో, తావదేవచిరం = అంతవఱకే మోక్షముకలుగుటకు ఆలస్యము. ప్రాణవియోగముకలుగఁగనే, అథసంపత్స్యే=సంపత్స్యతే=బ్రహ్మమునుబొందుచున్నాఁడు, నవిమోక్ష్యేఁ సంపత్స్యే అనుచోట పురుషవ్యత్యయము ఛాందసము. జ్ఞానికి ప్రారబ్ధప్రాప్తమగు శరీరము పడిపోవువరకు మోక్షవిలంబనము కలుగును. తరువాత మోక్షము కలుగును.

ధానుష్కుఁడు తన అమ్ములపొదిలో నున్న బాణములను దీయుటకు, తీయకపోవుటకును సమర్థుఁడుగాని, విడిచి

పెట్టిన బాణమును దగ్గించుటకు సమర్థుడు గాడు, దాని వేగము పూర్తికాగానే అది పడిపోవును. అట్లే జ్ఞాని అనారబ్ధ కర్మములను నాశ మొనర్చుకొనునుగాని ప్రారబ్ధకర్మమును నాశ మొందించు కొనలేడు. ప్రారబ్ధప్రాప్తమగు శరీరనాశ ముతోనది నశించును. అంతవఱకు నా జ్ఞాని సంసారిగనే యుండును. అతడు జీవన్ముక్తుడు, ఉపదేష్టయును. జ్ఞానము కలుగగనే మోక్షము నొందుచున్నచో ఉపదేష్టయే యుండడు.

## 12 అగ్నిహోత్రాద్యధికరణము. (16-17)

అగ్నిహోత్రాదితు తత్కార్యాయైవ తద్దర్శనాత్. 16

నిత్యాగ్నిహోత్రాదికమగు కర్మము బ్రహ్మజ్ఞానముచే నశించునా? నశింపదా? అని సంశయము కలుగ జెప్పు చున్నారు.

అగ్నిహోత్రాదితు=నిత్యాగ్నిహోత్రము మొదలగు కర్మము తత్కార్యాయైవ=విద్యాద్వారా విద్యా (జ్ఞాన) కార్యమగు మోక్షముకొఱకే యగుటవలన, నాశము లేదు. తద్దర్శనాత్ = "తమేతం వేదానువచనేన" బృ. 4.4.22 మున్నగు వచనములవలన విద్యాద్వారా మోక్షహేతుత్వము అగపడుటవలన, కర్మములు ఫలప్రదములు కనుక చిత్తశుద్ధి ద్వారా జ్ఞానమును గలిగించి కర్మము నశించును. ఫలము

నీయక నశించుటయే నాశముకాని ఫలమునిచ్చి నశించుట నాశముకాదు. జ్ఞానార్థములగుటచే నిత్యకర్మములు అనుష్ఠింపఁ దగినవే.

అవి నిత్యకర్మములు జ్ఞానార్థములైనచో "తస్యపుత్రా దాయముపయన్తి. సుహృదస్సాధుకృత్యాం, ద్విషన్తః పాప కృత్యామ్" అని చెప్పఁబడిన వినియోగ వాక్యమునకు విషయ మేమి? అని ప్రశ్నము కలుగఁ జెప్పుచున్నారు.

అతోఽన్యాపిహ్యేకేషా ముభయోః. 17

హి=ఏకారణమువలన, అతః = ఈనిత్యాగ్నిహోత్రా దికములకంటె, అన్యాపిహి = ఇతరమైనదగు కామ్యరూపమైన దేసాధుకృత్యముకలదో అది స్వర్గాదిఫలమునపేక్షించిచేయఁ బడునది. అనఁగా కామ్యకర్మమని భావము. ఏకేషాం=కొందఱి మతములో, ఆకామ్యకర్మము "సుహృదః సాధుకృత్యా ముప యన్తి" అనుదానికి విషయము. ఉభయోః, కామ్యమగుసాధు కృత్యముజ్ఞానానుపకారకమనుట జైమిని బాదరాయణుల కిరువురకును సమ్మతము.

13 విద్యాసంయుక్తకర్మవీర్యవత్త్వాధికరణము.

యదేవవిద్యయేతిహి. 18

అవి నిత్యకర్మములు. అంగావబద్ధోపాసనాయుక్తము లనియు, ఉపాసనారహితములనియు రెండువిధములు. రెండు విధములైన కర్మములకుజ్ఞానమునందు వినియోగమా! లేక

విద్యాసహిత (ఉపాసనాసహిత) కర్మములకే జ్ఞానమునందు వినియోగమా? అని సంశయము కలుగఁ జెప్పుచున్నారు.

యదేవవిద్యయా = యదేవవిద్యయా కరోతి తదేవ వీర్యవత్తరం భవతి" ఛాం. 1-1-10 అను శ్రుతి, ఇతిహి = ఉపాసనావిశిష్ట మగుకర్మము అధికవీర్యముకలది అని "వీర్యవత్తరమ్" అను పదమునందలి తరప్ప్రత్యయముచేఁ జెప్పుచున్నది. దానిచేత ఉపాసనా రహితము వీర్యము కలదియని యర్థము వచ్చుచున్నది. కనుక ఉపాసనాసహితములు, ఉపాసనారహితములు అను రెండు విధములగు కర్మములకు జ్ఞానమునందు వినియోగము కలదు. రెండును తారతమ్యభేదముచే జ్ఞానసాధనములు. అని యభిప్రాయము.

### 14 ఇతరక్షపణాధికరణము.

భోగేన త్వితరే క్షపయిత్వా సంపద్యతే. 19

అ॥ జ్ఞానము (బ్రహ్మసాక్షాత్కారము) కలిగినవానికి అగ్నిహోత్రాదినిత్యకర్మములు జ్ఞానార్థముచేయుటచే నవి జ్ఞానముచేనివర్తింపఁబడవు. అనారబ్ధకార్యములగు పుణ్యపాపములు (సంచితములు) జ్ఞానముచే నివర్తింపఁబడును. ప్రారబ్ధమగు కర్మము ఎట్లునశించునో చెప్పుచున్నారు.

భోగేనతు = అనుభవముచేత, ఇతరే = ఆరబ్ధకార్యములగు పుణ్యపాపములను, క్షపయిత్వా = నాశముగావించి,

సంపద్యతే = బ్రహ్మను బొందుచున్నాఁడు. ముక్తిని బొందుచున్నాఁడు.

బ్రహ్మజ్ఞానముపొంది ముక్తికధికారియై ప్రారబ్ధముచే దేహపాతమువఱకు సంసారిగా నున్నట్లు దేహపాతానంతరము నందును ప్రారబ్ధోపభోగముకొఱకు బహుదేహములను స్వీకరింపవలసినచో నందుఁ బూర్వము గలిగిన జ్ఞానము చెడిపోయి ముక్తి కలుగకపోవునా? అని సందేహము కలుగునని, దానినివారించుటకై యీయధికరణము చెప్పుచున్నారు. బ్రహ్మజ్ఞానము కలుగుటచే అనారబ్ధకార్యములగు పుణ్యపాపములు నశించినవి. ఆరబ్ధము అనునది "తస్య తావదేవచిరం యావన్న విమోక్ష్యే" అను శ్రుతివలన దేహపాతమువఱకే యుండును. కావున బహుదేహస్వీకారావశ్యకత లేదు. దేహపాతానంతరము "అథసంపత్స్యే" అనుటచే ముక్తి పొందును.

ఇది శ్రీ వారణాసి గంగాధరశాస్త్రి విరచితమగు
బ్రహ్మసూత్రార్థదీపికయను బ్రహ్మసూత్ర
వృత్తియందుఁ జతుర్థాధ్యాయమునఁ
ప్రథమపాదము.

అధి. 14-సూ 19

శ్రీరస్తు

# బ్రహ్మ సూత్రార్థ దీపిక

## చతుర్థాధ్యాయ ద్వితీయపాదము.

### 1 వాగధికరణము (1-2)

**వాఙ్మనసి దర్శనాచ్ఛబ్దాచ్చ. 1**

అవ: వెనుకటి పాదములోఁ దుది యధికరణమున ఆత్మసాక్షాత్కారముకలవానికి, ఉత్క్రాంత్యనపేక్షముగ పరంజ్యోతిస్సంపత్తి (నిర్గుణబ్రహ్మసంపత్తి) చెప్పఁబడినది. ఈపాదమున పరమాత్మసాక్షాత్కారములేనివానికిఁ గార్యబ్రహ్మలోకప్రాప్తిని జెప్పుచు దానికిముందు విద్వదవిద్వత్సాధారణమగు ఉత్క్రాంతిని జెప్పుచున్నారు.

ఛాందోగ్యములో "అస్యసోమ్య! పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే, మనఃప్రాణే, ప్రాణస్తేజసి, తేజఃపరస్యాం దేవతాయామ్" ఛాం. 6.8.6 అని ఉత్క్రమణక్రమము చెప్పఁబడినది. ఓసౌమ్యుఁడా! ప్రయతః = చనిపోవుచున్న, అస్యపురుషస్య = ఈపురుషునికి, వాక్ = వాక్కు మనసి, సంపద్యతే = మనస్సునందు లయమగుచున్నది. మనః ప్రాణే = మనస్సు ప్రాణమునందులయమగుచున్నది. ప్రాణస్తేజసి=ప్రాణము తేజస్సునందు లయమగుచున్నది. అనియీరీతిగా ఉత్క్రాంతి క్రమము చెప్పఁబడినది. ఇందుసందేహముకలుగుచున్నది.

వాక్కు మనస్సునందు లయ మగుచున్నద న్నప్పుడు వాక్కులయమగుచున్నదా! వాగ్వృత్తిలయమగుచున్నదా! అని సందేహము. తన యుపాదాన (కారణ) మందుఁ దాను లయమగుట న్యాయము. శ్రుతిలో వృత్తి శబ్దము లేదు. కావున వాక్కే మనస్సునందు లయ మగుచున్నది అని యర్థము రాఁగా

వాక్ = వాగ్వృత్తి, మనసి=మనస్సునందు లయమగు చున్నది. ఎందువలన? దర్శనాత్ = మనోవృత్తి యుండగనే వాగ్వృత్తి లయము గనఁబడుచున్నందున.

వాగాదులను గుఱించి మనస్సుడుపాదానము (కారణము) కాకపోవుటచే, ఉపాదానమునందే కార్యము స్వరూప లయమును బొందుట మృత్ ఘటములయందుఁగనఁ బడుటవలన వాక్కుమనస్సునందు లయమునుబొందుటకాదు. వాగ్వృత్తి మనస్సునందు లయమునుబొందుచున్నదనియే యర్థము. వృత్తి యుపాదానముకానిదానియందును లయమగును. అంగారముల (బొగ్గుల) యందున్న దాహప్రకాశాత్మకమగు వహ్ని వృత్తి అనుపాదానమగు జలమందు లయమగుచున్నది.

శ్రుతిలో వృత్తిపదము లేదు. "వాక్, మనసి" అని యున్నది. కదా! అన్నచో, శబ్దాచ్చ=వాక్ అనుశబ్దమున్ను వృత్తి వృత్తిమత్తుల కభేదము చెప్పుటవల్ల ఉపపన్నమగుట

వలన, వాక్ శబ్దమునకు వాగ్వృత్తియని యర్థము. వృత్తికే మనస్సున లయము.

అతఏవచ సర్వాణ్యను 2

అతఏవచ= వాగ్వృత్తిమాత్రమే స్వోపాదానమైన మనస్సునందు లయమగునని చెప్పుటచేత, సర్వాణి-చక్షురాది సర్వేంద్రియములునుగూడ, స్వోపాదానమైన మనస్సునందు స్వస్వవృత్తిలయ మాత్రముచే, అను=అనుసరించును. అనఁగా చక్షురాదిసర్వేంద్రియములును మనస్సునందు వృత్తిలయమునుబొందును. స్వరూపలయమును బొందవు. ఇందులకుఁ బ్రమాణము "తస్మా దుపశాన్త తేజాః పునర్భవ మింద్రియైర్మనసి సంపద్యమానైః" ప్ర. 3. 9. అనుశ్రుతి, తస్మాత్ = ఉత్క్రమణము తరువాత, ఉపశాన్తతేజాః తగ్గిపోయిన దేహౌష్ణ్యముకలవాఁడై పునర్భవం = పునర్జన్మమును ద్దేశించి, మనసి సంపద్యమానైః = మనస్సునందున్న ఇంద్రియములతో, ప్రాణమును బొందునని యర్థము. సర్వేంద్రియములకు మనస్సునందు వృత్తిలయ మీశ్రుతివలనఁగనఁబడుచుండ నొక్క వాక్కునకేయని సూత్రములోఁ జెప్పుట వాఙ్మనసి" అనుపూర్వోదాహృతశ్రుతి ననుసరించి యనిగ్రహించునది.

2 మనోధికరణము

తన్మనః ప్రాణ ఉత్తరాత్ 3

"వాఙ్మనసి సంపద్యతే మనః ప్రాణే" అని వెనుకఁ జెప్పినఛాం. 6.8.6 శ్రుతిలో వాక్పదమునకు వాగ్వృత్తి

యనియర్థము చెప్పఁబడినది. అట్లే ఆశ్రుతిలోనున్న "మనః ప్రాణే" అనుదానిలో మనఃపదమునకు మనోవృత్తియనియే యర్థమా? మనస్సు అనియర్థమా? ఏమన "అన్నమయంహి సోమ్య! మనః! ఆపోమయః ప్రాణః" అను శ్రుతివలన మనస్సునకు అన్నము కారణమనియు, ప్రాణమున కుదకములు కారణమనియుఁదెలియుచున్నది. సర్వము తనయుపాదానమందు (కారణమందు) తాను లయమగుట న్యాయసిద్ధమనుటచే నిచట అన్నజలములు మనఃప్రాణముల కుపాదానములు గనుకను, "అపశ్చాన్న మసృజన్త" ఛాం 6-2-4 అను శ్రుతి వలన ఉదకములన్నమునకుఁ గారణమని తెలియుచున్నది కాన, అన్నాత్మకమైన మనస్సునకు, ఉదకాత్మకమైన ప్రాణమునందు స్వరూపలయము న్యాయసిద్ధమగుటచే "మనఃప్రాణే" అన్నచోట స్వరూప లయమనర్థము అగుచున్నదియని శంకగా చెప్పుచున్నారు.

తత్=ఆవాగ్వృత్తిలయా శ్రయభూతమైన. మనః=మనస్సు, ప్రాణే=ప్రాణమునందు, వృత్తిరూపముననే లయమగును, స్వరూపతఃలయమునొందదు. ఎందుచేతననఁగా, ఉత్తరాత్=ఉత్తరవాక్యమువలన, ఇచ్చట మనస్సునకు ప్రాణము ముఖ్యమగు ఉపాదానముకాదు. మనస్సునకుఁ గారణమైన అన్నమును, ప్రాణములకుఁ గారణమైన ఉదకములును గారణములని చెప్పుటచే నీకార్యకారణ భావము ముఖ్యముగాదు.

అందుచే మనోవృత్తికే ప్రాణమునందు లయమని యర్థము చెప్పవలెను.

### 3 అధ్యక్షాధికరణము. (4-6)

### సోధ్యక్షే తదుపగమాదిభ్యః 4

"ప్రాణస్తేజసి" అను పై శ్రుతిలోని వాక్యమును వివరించుచున్నారు.

సః=ఆప్రాణము, తదుపగమాదిభ్యః=తత్ ఉపగమ+ఆదిభ్యః = తత్ ఆజీవుని, ఉపగమ=పొందుట (లయమగుట) ఆది=మొదలగు విషయములను జెప్పుశ్రుతులవలన, అధ్యక్షే=దేహేంద్రియపంజరాధ్యక్షుఁడగు జీవునియందు, లయమగుచున్నది. శ్రుతి" ఏవమేవే మమాత్మాన మన్తకాలే సర్వే ప్రాణా అభిసమాయన్తి యత్రైత దూర్ధ్వోచ్ఛ్వాసీభవతి. బృ. 4.3.38. ఇందు ప్రాణములు జీవునియందు లయమగునని చెప్పఁబడినది. "తముత్క్రామన్తం ప్రాణోనూత్క్రామతి ప్రాణ మనూత్క్రామన్తం, సర్వే ప్రాణా అనూత్క్రామన్తి" బృ. 4.4.2. ఇందు ప్రాణమునకు జీవానువృత్తి చెప్పఁబడినది.

### భూతేషుతచ్ఛ్రుతేః 5

"ప్రాణస్తేజసి" అను శ్రుతిలో ప్రాణము తేజస్సునందు లయమగుననియుండఁగా ప్రాణముజీవునియందు లయమగునని చెప్పఁబడినదే ఆశ్రుతి విరోధముకలుగదా! అన చెప్పుచున్నారు.

తచ్ఛ్రుతేః=ప్రాణస్తేజసి= అను శ్రుతికి, భూతేషు=తేజ
స్సహచరితములగు భూతసూక్ష్మములందు ప్రాణసహితుఁ
డగుజీవుఁడు అంతకాలమున నుండుననియర్థము. అందుచే నా
విరోధములేదు.

నైకస్మి న్దర్శయతో హి 6

"ప్రాణస్తేజసి'' అని, శ్రుతిలోనుండఁగా భూతములం
దుండుననుట యెట్లు? అనఁగాఁ జెప్పుచున్నారు.

అంతకాలమునందు. జీవుఁడు, ఏకస్మిన్=ఒక్క తేజస్సు
నందే, న=ఉండఁడు. హి=ఎందుచేతననఁగా, "పంచమ్యా
మాహుతా వాపః పురుషవచసో భవన్తి'' ఛాం. 5. 3. 3 అను
చోట ప్రశ్నసమాధానములు సర్వభూతసూక్ష్మావస్థానమును
దర్శయతః=చూపుచున్నవి.

4 అసృత్యుపక్రమాధికరణము.

సమానా చాసృత్యుపక్రమా దమృతత్వం చానుపోష్య. 7

ఉత్క్రాన్తి చెప్పఁబడినది. అది ఉపాసకునకు, అనుపా
సకునకును సమానమా? భేదమున్నదా! అనిసంశయముగలుగ
దహరవిద్యలో "అమృతత్వమేతి'' ఛాం 8-6-6 అని సగుణ
బ్రహ్మజ్ఞానికి మోక్షఫలమును జెప్పుటచే, నీయుత్క్రాన్తి
అనుపాసకునకే (అజ్ఞానికే) అని పూర్వపక్షముగాఁ జెప్పు
చున్నారు.

సమానా చ=ఈ ఉత్క్రాన్తి, ఉపాసకునికి, అనుపా
సకునికి, సమానము. విద్వదవిద్వత్సాధారణము. ఎందువల్ల

వనంగా అస్మృత్యుపక్రమాత్ = అస్మృతి+ ఉపక్రమాత్ = క్రియతే=ప్రాప్యతే బ్రహ్మలోకః అనయా ఇతి సృతిః = దేవయానమార్గము. అసృతి = దేవయానమార్గమవధిగా, ఉపక్రమాత్ ఉపక్రమించుటవలన.

సగుణబ్రహ్మజ్ఞానికి మూర్ధన్యనాడీప్రవేశము ఉత్తరమార్గోపక్రమము కలుగును. జ్ఞానరహితునికి నాడ్యంతరప్రవేశము దక్షిణమార్గోపక్రమము కలుగును. ఆమార్గపర్యంతము ఉపాసకుండగుజ్ఞానికి అజ్ఞానికిని భూతసూక్ష్మాయనము సమానము. దేవయానగమనములేకుండా బ్రహ్మలోకప్రాప్తి సగుణబ్రహ్మజ్ఞానికిని సంభవింపదుగావున నితనికిని ఉత్క్రాంతి ఆవశ్యకము.

అమృతత్వంచ= "అమృతత్వమేతి" అని ఉపాసకునికి జెప్పిన యమృతత్వము, అనుపోష్య=అవిద్యాక్లేశాదులనునాశ మొందింపక, అనంగా ఈయమృతత్వము అవిద్యాక్లేశాదులను (రాగాదులను) నాశమొందించి పొందునట్టి అమృతత్వము కాదు. ఆపేక్షికమగు నమృతత్వము.

## 5 సంసారవ్యపదేశాధికరణము. (8-11)

### తదాపీతే స్సంసారవ్యపదేశాత్. 8

"అస్యసోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే, మనః ప్రాణే, ప్రాణస్తేజసి, తేజః పరస్యాం దేవతాయామ్" ఛాం 6.8.6 అన్నచోట, తేజఃప్రభృతులగుభూతములకు,

పరమాత్మయందు లయము చెప్పఁబడినది. ఆ లయము స్వరూపలయమా! వృత్తిలయమా! అని సంశయము గలుగ—పరమాత్మ భూతముల కుపాదానముకనుక స్వరూపలయమని పూర్వపక్షము రాగా, చెప్పుచున్నారు.

తత్ =ఆ తేజస్సు మొదలగు భూతసూక్ష్మము, ఆపీతేః ఆ+అపీతేః=సంసార మోక్ష పర్యన్తము, తత్త్వజ్ఞానమువలన మోక్షముకలుగువఱకునుండును. ఎందుచేతననగా, సంసార వ్యపదేశాత్ =మరణానంతరము కూడసంసారమును చెప్పుట వలన.

“యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః । స్థాణుమన్యేనుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్” కఠ 5.7 అని మరణానన్తరముకూడ సంసారమును చెప్పుచున్నది. మరణానన్తరమే మోక్షముకలుగునన్నచో విధినిషేధశాస్త్రములు వ్యర్థములు. కనుక తేజఃప్రభృతులకుఁ బరమాత్మయందు లయము సుషుప్తివలె భూతసూక్ష్మావస్థావశేష మేయని తెలియునది.

సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః 9

ఈశరీరమునుండి పోవుచున్న జీవుని కాశ్రయభూతమగు తేజస్సు ప్రమాణతశ్చ= ప్రమాణమునుబట్టి స్వరూపమును బట్టియు, సూక్ష్మం=సూక్ష్మమైనది. తథా=అప్రకారముగా, ఉపలబ్ధేః=ఉపలబ్ధమగుటవలన, నాడీనిర్గమనాది శ్రుతుల వలన సూక్ష్మమని తెలియుచున్నది.

నోపమర్దేనాతః 10

అతః=సూక్ష్మమైనదగుటవల్లనే. ఉపమర్దేన=స్థూల శరీరమునకు ఉపమర్దముచేత, న=సూక్ష్మశరీరమున కుపమర్దము లేదు.

అస్యైవచోపపత్తే రేషఊష్మా 11

ఏషః ఊష్మా=ఈస్థూలశరీరమునందుపలభ్యమానమగు ఉష్మా=ఆవిరి, అస్యైవ= ఈసూక్ష్మశరీరమునకు సంబంధించి నదే. ఏమన? ఉపపత్తేః = ఉపపత్తివలన, సూక్ష్మశరీరము న్నప్పుడే ఈ ఊష్మముగనిపించుచున్నది. మృతదేహము నందు ఊష్మము కనబడుటలేదు. కనుక-ఇది సూక్ష్మశరీర ధర్మమే యనిభావము.

6 ప్రతిషేధాధికరణము. (12-14)

ప్రతిషేధాదితి చేన్న శారీరాత్ 12

నిర్గుణబ్రహ్మజ్ఞానము కలవానికిఁగూడ ఉత్క్రాన్తి ఉన్నదా? లేదా? అని సంశయముకలుగ నిర్ణయించుటకీ యధికరణమారంభింపఁబడినది.

ప్రతిషేధాదితిచేత్ =నిర్గుణబ్రహ్మసాక్షాత్కారముకల వానికి ఉత్క్రమణములేదు. "నతస్యప్రాణా ఉత్క్రామన్తి" 4.బృ. 4.6. అని ప్రతిషేధించుటవలన నతనికిఁబ్రాణోత్క్ర మణములేదన్నచో, న=కాదు. అట్లనరాదు. శారీరాత్ =

శారీరుని (జీవుని) నుండి యీ యుత్క్రమణనిషేధముకాని శరీరమునుండి కాదు. కనుక శరీరమునుండి యాతనికిని ఉత్క్రమణముకలదు. ఈప్రతిషేధము శారీరునినుండియని యెట్లు తెలియుచున్నది? అనగా "నతస్మాత్ ప్రాణా ఉత్క్రామన్తి "బృ. మా. 4-4-8 అనిమాధ్యందినశాఖలో జీవునినుండియే యుత్క్రమణనిషేధము గనబడుచున్నదికనుక, పరబ్రహ్మజ్ఞానికిప్రాణాదిసహితుఁడగు జీవునికే ఉత్క్రమణము. అని రాగా, సిద్ధాన్తముచేయుచున్నారు.

## స్పష్టోహ్యేకేషామ్ 13

హి=ఎందువలన, ఏకేషాం=కొందఱైన కాణ్వశాఖీయులకు, దేహమునుండియే ప్రాణముల ఉత్క్రాన్తిప్రతిషేధము, స్పష్టః=స్పష్టముగాఁగనఁబడుచున్నది.

ఆర్తభాగప్రశ్నములో, "యత్రాయం పురుషోమ్రియతే, యదస్మాత్ ప్రాణాఃక్రామన్తి ఆహో! నేతి? బృ.3.2.-12అన్నచోట "నేతిహోవాచ యాజ్ఞవల్క్యః" బృ.3.2.12 చనిపోవువానికిఁ బ్రాణములుత్క్రమణము చెందునా? చెందవా? అనియడుగ, చెందవుఅని యాజ్ఞవల్క్యుడనెను. ప్రాణములుత్క్రాంతిని చెందకపోయినచో నితఁడుమృతుఁడు కాఁడే అనుశంకకలుగ, "అత్రైవ సమవలీయన్తే" అనిప్రాణములకు ఇచ్చటనే వినాశమును ప్రతిజ్ఞచేసి (చెప్పి) ఆ వినాశము సిద్ధించుటకై, "సఉచ్ఛ్వయత్యాధ్మాయత్యాధ్మాతో మృత

శ్చైతే" అని దేహము ఉచ్ఛ్వయనమును (ఉబ్బుట) పొందిఆధ్మాతము (బాహ్యవాయువుతో బూరింపబడి, తడిసినతోలువలె, వివిధధ్వనులను)చేయుచు, తరువాతమృతమై భూమిమీదఁబరుండును. (పడును) అని చెప్పఁబడినది. కనుక విద్వద్దేహమునండియే ప్రాణోత్క్రమణము చెప్పుటవలన విద్వజ్జీవునికి ప్రాణోత్క్రమణముకాని, మార్గముకానిలేదు.

స్మర్యతేచ 14

మహాభారతమునందును ఈవిషయము బ్రహ్మసాక్షాత్కారముకల విద్వాంసునికి మార్గోత్క్రమణములులేవని స్మరింపఁబడుచున్నది.

"సర్వభూతాత్మ భూతస్య సమ్యగ్భూతాని పశ్యతః
దేవాఅపిమార్గేముహ్యన్తి అపదస్యపదైషిణః"॥.

మ॥భా॥ 12-270.22.

పదమనఁగా గంతవ్యమగుస్థానము. అపదస్య=గంతవ్యమగుస్థానములేని(బ్రహ్మజ్ఞానియొక్క మార్గే = మార్గమునందు బ్రహ్మప్రాప్తి సాధనమైన జ్ఞానమునందు) దేవతలున్నముహ్యన్తి=మోహమునుబొందు చున్నారు. ఎఱుగకున్నారు అతనికి మార్గములేక పోవుటచేత నని. భావము.

7. కలాప్రళయాధికరణము.

తానిపరే తథాహ్యాహ. 15

అవ॥ బ్రహ్మవేత్త కుత్క్రమణములేదనియు నతఁడు బ్రహ్మనుబొందుననియుఁ జెప్పఁబడినది. అతనివాగాదీంద్రియ

ములు, భూతములున్ను పరబ్రహ్మయందులయమగునా? లేక స్వస్వప్రకృతియందులయమగునా? అని సంశయముకలుగ, "గతాః కలాః పంచదశప్రతిష్ఠాః" ముండ 3.2.7. అనుశ్రుతి చేత వాగాదీంద్రియములు స్వస్వకారణములందు లయమగు నని చెప్పఁబడుటచేతను (కలాః=ఇంద్రియములు, ప్రతిష్ఠాః = కారణములను. అనియర్థము) "యత్రాస్యపురుషస్య అగ్నిం వాగప్యేతి, వాతంప్రాణః, చక్షురాదిత్యమ్, అనుశ్రుతిలోఁగూడ వాగాదీంద్రియములు తత్తత్కారణములను బొందునని చెప్పుట చేతను, స్వస్వప్రకృతులయందులయమగును. అని తెలియు చుండ సిద్ధాన్తమును జెప్పుచున్నారు.

తాని=ఆ యింద్రియములు భూతములున్ను, పరే= పరబ్రహ్మమునందేలయమగును. ఎందుచేతనఁగా, తథా హ్యాహ=శ్రుతియట్లుచెప్పుచున్నది.

శ్రుతి:- యథేమానద్యః స్యందమానాః సముద్రాయణాః సముద్రంప్రాప్య అస్తం గచ్ఛన్తి, భిద్యేతే తాసాం నామరూపే, సముద్రఇత్యేవ ప్రోచ్యతే, ఏవమేవాస్య ద్రష్టుః ఇమాఃషోడశకళాః పురుషాయణాః పురుషం ప్రాప్యాస్తంగచ్ఛన్తి, భిద్యేతేతాసాం నామరూపే పురుష ఇత్యేవప్రోచ్యతే" ప్రశ్న 6-5 నదులన్నియు సముద్రమును బొంది తమనామరూపములులేక సముద్రమనియే చెప్పఁబడినట్లు సర్వత్ర ప్రత్యగ్రూపమైన బ్రహ్మస్వరూపమునే చూచుచున్న

బ్రహ్మవేత్తయొక్క యింద్రియములు అపరోక్షానుభవ జ్ఞాతుడగు పురుషునిబొంది తమనామరూపములు లేక లయమగును. (అనియర్థము) అనుటచే పరబ్రహ్మమునందే ఈ బ్రహ్మవేత్త యింద్రియములు లయమగును.

### 8 కలాఽవిభాగాధికరణము.

### అవిభాగో వచనాత్. 16

ఈ బ్రహ్మజ్ఞానియొక్క యింద్రియలయము ఇతరులయింద్రియలయమువలె సావశేషమా? నిరవశేషమా? అని సందేహము కలుగఁ జెప్పుచున్నారు.

అవిభాగః=విభాగము (శేషము) లేనిలయము = ఈ బ్రహ్మజ్ఞానియొక్క యింద్రియలయము నిశ్శేషమైనది. ఎందుచేతననఁగా, వచనాత్=భిద్యేతేచాసాంనామరూపే" ప్ర6.5 అని యీతనియింద్రియముల నామరూపములు భేదమునొందును. నామరూపములు లేకుండగానశించును అనిచెప్పుటచేత నిశ్శేషలయమనిభావము.

### 9 తదోకోఽధికరణము.

తదోకోఽగ్రజ్వలనం, తత్ప్రకాశితద్వారో
విద్యాసామర్థ్యాత్ తచ్ఛేషగత్యనుస్మృతియోగాచ్చ హార్దాను
గృహీతశ్శతాధికయా. 17

అవ॥ ప్రాసంగికమగు పరవిద్యాచింతనమును ముగించి
యపరవిద్యావిషయములో వెనుక "సమానాచాసృత్యుపక్ర
మాత్" బ్ర. సూ. 4.2.7 అనుసూత్రములోఁ జెప్పిన విద్వద
విద్వత్సాధారణమగు ఉత్క్రాన్తిలో విద్వాంసునికి విశేష
మును జెప్పుచున్నారు.

తదోకోఽగ్రజ్వలనం=తత్ + ఓకః + అగ్ర + జ్వలనం =
తత్ + వాగాదీంద్రియ కలాపముపసంహృతమై ఉత్క్రమ
ణము పొందఁదలఁచియున్న జీవునియొక్క, ఓకః =
నివాసమైన హృదయముయొక్క అగ్ర = అగ్రభాగము
యొక్క, జ్వలనమ్ = ప్రకాశించుట, తత్ప్రకాశితద్వారః =
తత్ = ఆప్రకాశముచేత = ప్రకాశిత = స్పష్ట
పఱుపఁబడిన ద్వారః = చక్షురాదిస్థానద్వారముకలవాఁడై
జీవుఁడుత్క్రమణము చెందుట, యనువిషయము అందరికిని
సమానము కావున, ఉపాసకునికి ఇతరులకంటెవిశేషమేమియు
నులేదు అని రాఁగా, ఉపాసకుఁడు మూర్ధన్యమైన నాడీ
ద్వారా ఉత్క్రమించిపోవును. ఉపాసకులుకానివారు ఇతర
మార్గములద్వారా ఉత్క్రమింతురు. ఎందుచేతననఁగా విద్యా
సామర్థ్యాత్ =సగుణబ్రహ్మోపాసనాసామర్థ్యమువలన, తచ్ఛే
షగత్యనుస్మృతియోగాచ్చ=తత్ =అసగుణవిద్యకు శేష=శేష
మైనగతి = మూర్ధన్యనాడీద్వారకగమనముయొక్క, అనుస్మృతి
యోగాచ్చ=ధ్యానసంబంధమువలనను, హార్దానుగృహీతః=
హార్ద=హృదయమునందున్న, చక్కఁగా నుపాసన చేయఁబడిన

బ్రహ్మచేత, అనుగృహీతః = అనుగ్రహింపఁబడినవాఁడై తద్భావమును (బ్రహ్మభావమును) బొందినవాఁడై, ఉపాసకుఁడగు విద్వాంసుఁడు, శతాధికయా = నూరునాడులకంటెనధికమైన మూర్ధన్యనాడిచే నిష్క్రమించును. అమృతత్వమునుబొందును.
ప్రమాణశ్రుతులు:— ఉత్క్రమణము పొందనున్నజీవుఁడు ప్రతివాఁడును, ఉపసంహరింపఁబడిన (తగ్గింపఁజేయఁబడిన) వాగాదీంద్రియములు కలవాఁడై హృదయమునందు మాత్రమే యుండును. "స ఏతాస్తేజోమాత్రాః సమభ్యాదదానః హృదయమే వాన్వవక్రామతి" బృ. 4-4-1 ఉత్క్రమణముపొందనున్నజీవునికి హృదయముప్రకాశించుననియుఁ దద్ద్వారా సూచింపఁబడిన మార్గముద్వారా నిష్క్రమించుననియు ననుటకు. "తస్యహైతస్య హృదయస్యాగ్రం ప్రద్యోతతే, తేన ప్రద్యోతనేన ఏష ఆత్మా నిష్క్రామతి చక్షుష్టో వా, మూర్ధ్నో వా, అన్యేభ్యోవా శరీర దేశేభ్యః బృ 4-4-2.

హృదయనాడులు శతసంఖ్యములనియనుటకు:- శతం చైకా హృదయస్య నాడ్యః, తాసాం మూర్ధాన మభినిస్సృతైకా, తయోర్ధ్వ మాయన్న మృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి" ఛాం. 8.6.6.

### 10 రశ్మ్యనుసార్యధికరణము. (18-19

### రశ్మ్యనుసారీ 18

మూర్ధన్యనాడీనిర్గతునకు రశ్మిసంబంధమున్నట్లు "అథైతైరేవ రశ్మిభి రూర్ధ్వ మాక్రమతే" ఛాం 8-6-5 అనుశ్రుతి

చెప్పుచున్నది. ఈ రశ్మిసంబంధము రాత్రి, పగలు, అను భేదములేక ఎప్పుడు చనిపోయినను ఉండునా? పగలు చనిపోయినవానికే యుండునా? అను సంశయముకలుగ, రాత్రి, పగలు, అనుభేదములేక ఎప్పుడు చనిపోయినను, రశ్ములను (కిరణములను) అనుసరించినవాఁడై సూర్యమండలమును బొందును. అని సిద్ధాన్తము.

నిశినేతిచేత్ న సంబంధస్య యావద్దేహభావిత్వాత్
దర్శయతిచ. 19

మూర్ధన్యనాడిచే నిర్గతుఁడైనవానికి రశ్మి (సూర్యకిరణ) సంబంధము చెప్పఁబడినది. ఆసంబంధము నిశినేతిచేత్ =రాత్రి యందు సూర్యుఁడులేఁడు కనుక సూర్యకిరణ సంబంధముకూడ లేదన్నచో, న=అట్లుకాదు. నాడీరశ్మిసంబంధస్య=మూర్ధన్య నాడులకు రశ్ములకుఁ గల సంబంధము, యావద్దేహభావిత్వాత్=దేహమున్నంతవఱకు నుండునది. ఈవిషయమునే, దర్శయతిచ = శ్రుతిచూపుచున్నది. "అముష్మా దాదిత్యా త్ప్రతాయన్తే। తా ఆసునాడీషు సృప్తాః అభ్యోనాడీభ్యః ప్రతాయన్తే। తేఽముష్మిన్నాదిత్యే సృప్తాః ఛాం. 8.6.2 అని సూర్యకిరణములకు నాడులకు సంబంధము తెలియుచున్నది. ప్రతాయన్తే = విస్తృతములు చేయఁబడుచున్నవి. సృప్తాః= సంబద్ధములై=అనియర్థము. వేసవికాలమునందు రాత్రులందు సంతాపము అనుభవింపబడుచుండుటచే రాత్రులందుఁగూడ సూర్యకిరణసంబంధ మున్నట్లే మనమూహించుచున్నాము.

ఇతర ఋతువులందును శైత్యాదులచే నభిభూతమగుటచే సూర్యరశ్మి ఉన్నట్లు మనకుఁ దెలియదు గాని యుండును. కనుక రాత్రులందు మృతుఁడైనను సూర్యకిరణములను బొందునని సిద్ధాన్తము.

## 11 దక్షిణాయనాధికరణము. (20-21,

### అతశ్చాయనేపి దక్షిణే-20

అ॥ దక్షిణాయనమునందుఁ జనిపోయిన యుపాసకునకు బ్రహ్మలోకప్రాప్తి యున్నదా! లేదా? అని సంశయము గలుగ, ఉత్తరాయణము బ్రహ్మలోక మార్గమనుటచేతను, భీష్ముఁడు ఉత్తరాయణము వచ్చువఱకు చనిపోకుండనుండుట చేతను దక్షిణాయనమృతునకు బ్రహ్మలోకప్రాప్తి లేదని రాఁగాఁ జెప్పుచున్నారు.

అతశ్చ= ఈవిద్యాఫలము నియతమైనదగుటవల్లనే, దక్షిణేఅయనేపి=దక్షిణాయనము నందు మృతుఁడైనవానికిని బ్రహ్మలోకప్రాప్తి కలదు.

ఉత్తరాయణశబ్దమునకుఁ గాలమనియే యర్థము కాదు. అతివాహిక దేవత యర్థమని చెప్పఁబడును. కాలాభిమానిని యగు ఆదేవత సర్వకాలములందును నుండును. మృతున కుత్తరాయణము చాలామంచిదని దానిప్రశస్తిని ప్రకటించుట యజ్ఞానుల విషయమైనది.

భీష్ముఁడుత్తరాయణము వచ్చువఱకు ప్రాణములను వదలక నిరీక్షించుట ఆచారపరిపాలనమునకును, పితృప్రసాద

లబ్ధమగు స్వచ్ఛన్దమరణసామర్థ్యమును వెల్లడించుటకు నని భావము.

యోగినః ప్రతిచస్మర్యతే స్మార్తేచైతే. 21

అవ॥ భగవద్గీతలలో

యత్రకాలే త్వనావృత్తి మావృత్తించైవయోగినః
ప్రయాతాయాన్తి తంకాలం వక్ష్యామిభరతర్షభ! 8.23

అని కాలమును ప్రధానముగా నెంచి కాలవిశేషము చెప్పఁబడు టచే దక్షిణాయనమునందు రాత్రులందును మృతుఁడైనవానికి బ్రహ్మలోకప్రాప్తి కలదని చెప్పుట యెట్లు! అనఁగాఁ జెప్పు చున్నారు.

యోగినః ప్రతిచ=యోగులనుద్దేశించియే, స్మర్యతే= కాలవిశేషముభగవద్గీతలయందు స్మరింపఁబడుచున్నది. ఏతే= ఈయోగసాంఖ్యములు రెండును స్మార్తేచ=స్మార్తములు= స్మృతిప్రోక్తములు. శ్రౌతములుకావు. విషయభేద మున్నది కనుక నీస్మార్తమగు కాలవినియోగమునకు శ్రుతిసంబంధ మగు విజ్ఞానములందు సంబంధములేదు. ఒకవేళ... అగ్ని ర్జ్యోతి రహశ్శుక్లః" అను భ. 8.24 గీతావాక్యములకు ఆతి వాహికములగు వగ్న్యాదిదేవతలే యర్థమని చెప్పినచో నప్పుడు శ్రుతిస్మృతులకు విరోధమేలేదు.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రివిరచిత మగు బ్రహ్మసూత్రార్థదీపిక యను బ్రహ్మసూత్రవృత్తి యందుఁ జతుర్థాధ్యాయమున ద్వితీయపాదము.

అధి 11 సూ 21

శ్రీరస్తు

# చతుర్థాధ్యాయ తృతీయపాదము.

## 1 అర్చిరాద్యధికరణము.

### అర్చిరాదినా తత్ప్రథితేః 1

ఇంతవఱకు ఉత్క్రాంతివిషయకమగు విచారణచేయఁబడినది. ఇంక దేవయానమార్గమును చెప్పుటకై యీపాదమారంభింపఁబడుచున్నది.

బ్రహ్మలోకమును బొందు మార్గములవిషయములో శ్రుతిలో బహువిప్రతిపత్తిగలదు. నాడీసంబంధ రశ్మిరూపమార్గమొకచోటఁ జెప్పఁబడినది. ఒకచోట "తేర్చిషమభిసంభవ న్త్యర్చిషోహః ఛాం.5.10.1అని "అగ్న్యాదిరూపమార్గము చెప్పఁబడినది. మఱియొకచోట "సూర్యద్వారేణ తే విరజాః ప్రయాన్తి" ముం. 1-2-11. సూర్యద్వారేణ, అని యుత్తరాయణమార్గము చెప్పఁబడినది. విరజాః= విరజసః అనఁగా విధురులు. (క్షీణపుణ్యపాపకర్ములు) ఇంకొకచోట "యదావై పురుషోఽస్మాల్లోకాత్ప్రైతిసవాయుమాగచ్ఛతి" బృ5-10-1 పర్యంకవిద్యలో కౌషీతకులు, "సఏతం దేవయానంపంథానమాపద్య అగ్నిలోకమాగచ్ఛతి" కౌషీ. 1-3. ఇట్లనేకచోట్ల నెక్కుడుమార్గములు చెప్పఁబడినవి.

ఇందు, ఈమార్గములన్నియుఁ బరస్పరనిరపేక్షములు విభిన్నములునా? లేక, అనేక విశేషణవిశిష్టమైన యొకటే

మార్గమా? అని సంశయము గలుగుచున్నది. భిన్నప్రకరణ పఠితములగుటచేతను ఆయా విద్యలకు ఫలభూతమైన బ్రహ్మ లోకమును బొందుటకు ఇవి పరస్పరనిరపేక్షములగుటచేతను, నివన్నియు మార్గములేకాని ఇవన్నియుఁగలిసి యొక్కటే మార్గముకాదు. అని రాఁగాఁ జెప్పుచున్నారు.

అర్చిరాదినా = ఉపాసకుఁడైనవాఁడు ప్రతివాడును, ఒక్క అర్చిరాది మార్గముచేతనే బ్రహ్మలోకమును బొందు చున్నాఁడు. ఎందుచేతననఁగా, తత్ప్రథితేః = సర్వవిద్యల యందును అర్చిరాది మార్గమొక్కటే ప్రసిద్ధముగా నుండుట వలన, పంచాగ్ని విద్యయందు, వాక్యశేషములో "యఇత్థం విదుర్యేచేమేఽరణ్యేశ్రద్ధాతపఇత్యుపాసతే। తేర్చిష మభిసంభ వన్తి ఛాం- 5.10.1 అని యర్చిరాదిమార్గము చెప్పఁబడినది. విద్యాన్తరములందును అర్చిరాదిమార్గమే చెప్పఁబడినది. వాయ్వాదిమార్గములకుఁ గూడ గుణోపసంహారన్యాయమున నిందే యుపసంహారము.

ఏయేవిద్యలయం దేమార్గమునుచెప్పఁబడక యుండునో యచ్చట అర్చిరాదిమార్గమున బ్రహ్మలోకప్రాప్తియనియు, నేదేనిమార్గము చెప్పఁబడినచోఁదద్ద్వారా బ్రహ్మలోకప్రాప్తి యనియుఁ జెప్పరాదా? యనిన నీమార్గములన్నియు విభిన్న ములైనచో అట్లుచెప్పవచ్చును కాని ఇవన్నియు నొక్కటే మార్గము. విద్యాభేదమున్నను గంతవ్యభేదములేదు. "తేర్చి

రభిసంభవన్తి" బృ. 6-2-15, అని అర్చిరాదిమార్గమే చెప్పఁబడుటవలన నదియొక్కటియేమార్గము.

## 2 వాయ్వధికరణము.

అవ॥ ఉపాసకుల కందఱకు నర్చిరాదిమార్గ మొక్కటే యని వెనుకటియధికరణములో నిశ్చయింపబడినది. ఇందు ఆమార్గమునందలి ఆతివాహిక దేవతలను (ఉపాసకుఁడగుజ్ఞానిని తత్తల్లోకములకుఁ దీసికొనిపోవు దేవతలను) దెలుపుచుఁ గ్రమమును నిర్ణయించుచున్నారు. కౌషీతకులు "సఏతం పంథాన మాపద్య అగ్నిలోక మాగచ్ఛతి స వాయులోకం సవరుణలోకం స ఇంద్రలోకం స ప్రజాపతి లోకం స బ్రహ్మలోకం" కౌ॥ 1-3. అని దేవయానమార్గ మనుపేరుతో నుపాసకుడు పోవుమార్గమును దెలిపిరి.

ఛాందోగ్యబృహదారణ్యకములలో అర్చిరాదిమార్గ మనియిట్లు చెప్పఁబడినది. "తేఽర్చిష మభిసంభవ న్త్యర్చిషోఽహః । అహ్న ఆపూర్యమాణపక్షం ఆపూర్యమాణపక్షాత్ యాన్షడుదఙ్ఙేతి । మాసాంస్తాన్. మాసేభ్య స్సంవత్సరం సంవత్సరా దాదిత్యం ఆదిత్యాచ్చంద్రమసం చంద్రమసో విద్యుతం తత్పురుషోఽమానవ స్సఏతాన్బ్రహ్మ గమయతి" ఛాం. 5.10-1.2. అని దీని నర్చిరాదిమార్గమని యిందుఁ జెప్పిరి. కౌషీతకులు చెప్పిన అగ్నియున్నను నిందలియర్చియున్నను నొక్కటే. ఈయగ్ని

యనుగుర్తుచేతనే రెండుమార్గములునొక్కటేయనియు నర్చిరాది మార్గమనియు నిరూపింపఁబడినది.

ఇఁక, కౌషీతకులు చెప్పిన దేవయాన మార్గములో రెండవది వాయులోకమని యున్నది. ఛాందోగ్యములోని అర్చిరాదిమార్గములో వాయులోకము లేనేలేదు. ఇందా వాయులోకమును చేర్పవలెనా? అక్కఱలేదా? చేర్పవలసినచో దేనితరువాతఁ జేర్పవలెను? అని సంశయము కలుఁగ, అగ్నియను గుర్తువలన మార్గములు రెండు నొక్కటే యని చెప్పినట్లు ఆగుర్తువల్లనే యగ్నితరువాతనే యుందును. వాయువును చేర్పవచ్చును అని రాఁగా నిర్ణయము చేయుచున్నారు.

వాయుమబ్దాదవిశేషవిశేషాభ్యామ్. 2

వాయుం=వాయువును. అబ్దాత్ = సంవత్సరముతరువాత, ఆదిత్యునకుఁ బూర్వమునందుఁ జేర్పవలయును. ఎందుచేత? అనఁగా, అవిశేషవిశేషాభ్యాం = కౌషీతకి శ్రుతిలో విశేషములేకపోవుట, బృహదారణ్యకశ్రుతిలో ఆదిత్యునికిఁ బూర్వమునందు అనివిశేషముండుట యనువానివలన సంవత్సరమునకుఁదరువాత ఆదిత్యునికిఁబూర్వమునందు వాయువును జేర్చి వాయువుద్వారా సూర్యునిఁబొందునని చెప్పవలెను.

"యదావై పురుషోఽస్మాల్లోకాత్ప్రైతి స వాయుమాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే యథా రథచక్రస్య ఖంతేన

సహోర్ధ్వమాక్రమతే, సఆదిత్య మాగచ్ఛతి,'' బృ 5-10. అనియు, "మాసేభ్యో దేవలోకం. దేవలోకా దాదిత్యమ్'' బృ.6-2-15. అనియు శ్రుతులుగలవు. కనుక బ్రహ్మలోకము నకుఁబోవు ఉపాసకుఁడు నాడీరశ్మిప్రవేశానన్తరము, అర్చిరాది మార్గమునఁబ్రవేశించి వరుసగా అహస్సును, ఆపూర్యమాణ (శుక్ల) పక్షమును, మాసములను సంవత్సరమును, బొందియట నుండి దేవలోకమును, వాయులోకమును, అచట వాయువుచేఁ గల్పింపఁబడిన బండిచక్రముకంటె వాయుచక్రములో మధ్య గల రంధ్రమునుండి దానిపూర్ధ్వమునఁ గల ఆదిత్యలోకమును నటనుండివరుసగా బ్రహ్మలోకమును బొందును.

3 వరుణాధికరణము

తడితోఽధివరుణస్సంబంధాత్ 3

కౌషీతకశ్రుతిలోఁ జెప్పఁబడినవరుణాదులకు అర్చిరాదిమార్గ ములో సంబంధమును జెప్పుచున్నారు.

తడితోఽధి=విద్యుత్తుతరువాత, వరుణః=వరుణుఁడు, స్థానముకల్పింపఁదగినవాఁడు. ఏమన, సంబంధాత్ = తటిత్సం బంధము వరుణునకుఁగలదుగావున, విద్యుల్లోకము తరువాత వర్షజలము కురిపించుమేఘములున్నట్లును జలమునకువరుణుఁ డధిపతియైనట్లును ప్రసిద్ధికలదు కావవరుణునకు విద్యుత్తుతో సంబంధముకలదు. అందుచేత విద్యుత్తుతరువాత వరుణుని,

వరుణునితరువాత నింద్రప్రజాపతులకు "ఆగంతూనా మన్తే నివేశః॥ అనున్యాయముచే స్థానకల్పనము చేయుటచే నర్చిరాదిమార్గమున లోకవ్యవస్థకలిగినది.

## 4 అతివాహికాధికరణము (4-6)

అవ॥ అర్చిరాదిమార్గమునఁ జెప్పఁబడిన, అర్చిరాదులు బ్రహ్మలోకమునకుఁబోవు ఉపాసకునకు మార్గముతెలియుటకై మార్గస్థములగు గుర్తులనుజెప్పుటా? లేక, వెళ్లునట్టియుపాసకునకు విశ్రాన్తి, సుఖముపొందుభోగలోకములా? లేక యుపాసకుని దీసికొనిపోవువారా? అనిసంశయముకలుగఁ జెప్పుచున్నారు.

### అతివాహికాస్తల్లింగాత్, 4

అతివాహికాః=అర్చిరాదులు, మార్గమున కూడనుండి తీసికొనివెళ్లువారు. ఎందుచేత? తల్లింగాత్ = అలాటిలింగము ఉండుటవలన "చంద్రమసోవిద్యుతం తత్పురుషోఽమానవ స్సఏతాన్ బ్రహ్మగమయతి" ఛాం. 5-10-2. అని చిట్టచివర చెప్పఁబడిన అమానవుఁడగు విద్యుత్పురుషునకు "బ్రహ్మగమయతి" యని నేతృత్వమును జెప్పుటవలన, విద్యుత్పురుషుఁడు వీరికి బ్రహ్మలోకనేతయనుటచే నతనికిదిగువవారును నట్లే తత్తల్లోకములకు నేతలగు అతివాహికులు అని తెలియుచున్నది. విద్యుత్పురుషుని "అమానవః" అనిచెప్పుటచే మిగిలినవారు మానవపురుషులని తెలియనగును.

ఉభయవ్యామోహాత్ తత్సిద్ధేః -5

అవ|| "అమానవ స్స ఏతాన్‌బ్రహ్మగమయతి" అను నది లింగమైనను వెనుకటి అర్చిరాదులకు నేతృత్వగమకము కాదే! అనఁజెప్పుచున్నారు.

ఉభయవ్యామోహాత్ = ఉభయులకు, అర్చిరాదులకు, వెళ్లునట్టి యుపాసకులకును, ఇరువురకును, వ్యామోహము (అజ్ఞానము) వలన, తత్సిద్ధేః = అర్చిరాదులకు నేతృత్వము సిద్ధించుటవలన, లింగము గమకమగును.

అనఁగా, ఉపాసకులు వెళ్ళునట్టి అర్చిరాదిమార్గములు అచేతనములగుటచేత వ్యామోహితములు. వెళ్లునటువంటి యుపాసకులు, విద్వాంసులేయైనను ఇప్పుడు దేహరహితులు, లీనేంద్రియులు (సంపిండితేంద్రియ గ్రాములు) నగుటచే వ్యామోహితులు. కనుక, ఉభయవ్యామోహాత్ = గంతృగమయితలిరువురు వ్యామోహముకలవారగుటచే మార్గజ్ఞానము లేనివారుకనుక బ్రహ్మలోకగమనమే సంభవింపదు కావున ఉపసంహారమునందు "సఏతాన్‌బ్రహ్మగమయతి" అని విద్యుత్పురుషునికి గమయితృత్వము (నేతృత్వము, చెప్పినట్లు ఉపక్రమమునందు అర్చిరాదులకును నేతృత్వము చెప్పవలెను. చెప్పినచో, గమయితలగు అర్చిరాదులు ఆతివాహిక దేవతలని సిద్ధించుచున్నవి.

అర్చిరాదులు దేవతలన్నచో ఉపాసకుఁడు దక్షిణాయనమునఁ జనిపోయినను, రాత్రిచనిపోయినను దేవతలుసర్వ

కాలమున నుండురుగాన వరనికి బ్రహ్మలోక ప్రాప్తి కాటంకము లేదు.

వైద్యుతేనైవ తతస్తచ్ఛ్రుతేః 6

అప॥ విద్యుల్లోకానన్తరమందు "అమానవః పురుషః ఏతాన్ బ్రహ్మగమయతి" అని చెప్పుటచే వైద్యుతుఁడైన ఆ యమానవపురుషుఁడొక్కఁడే అక్కడనుండి బ్రహ్మలోకము వఱకుఁదీసికొనిపోవును అని చెప్పుటచే వరుణాదులు అతివాహికులుగారు అని రాగాఁ చెప్పుచున్నారు.

తతః = విద్యుల్లోకానన్తరము, వైద్యుతేనైవ = వైద్యుతపురుషునిచేతనే ఉపాసకులు బ్రహ్మలోకముఁ పొందింపఁ దగినవారు. ఎందుచేతననఁగా, తచ్ఛ్రుతేః="సఏతాన్ బ్రహ్మగమయతి" అని యాశ్రుతివలన, ఈశ్రుతినిబట్టి, వైద్యుతుఁడే బ్రహ్మలోకపర్యన్తము తీసికొని వెళ్లును. వరుణాదులు అనుకూలముగా నుండుటమాత్రముచేతనే అతివాహికులగుదురు.

5 కార్యాధికరణము. (7-14)

కార్యం బాదరిరస్యగత్యుపపత్తేః 7

ఇంతవఱకు వెళ్లఁదగినమార్గమును నిరూపించి యిపుడు పొందఁదగినబ్రహ్మ స్వరూపమును వివరించుచున్నారు.

"స ఏతాన్ బ్రహ్మగమయతి" ఛాం.4.15.6. అని చెప్పిన గంతవ్యబ్రహ్మ పరబ్రహ్మస్వరూపమా ! కార్యబ్రహ్మస్వరూపమా! అనిసంశయముగలుగ సిద్ధాంతము చెప్పుచున్నారు.

బాదరిః=బాదరాయణాచార్యులు, కార్యం= కార్యబ్రహ్మమే (చతుర్ముఖబ్రహ్మస్వరూపమే) పొందదగినదియని చెప్పెను. అస్య=ఈ కార్యబ్రహ్మమునకే, గత్యుపపత్తేః= గతి=పొందుట, ఉపపన్నమగునుగనుక, పరబ్రహ్మ సర్వగతుండు, ప్రత్యగాత్మభిన్నుండు నగుటచే నతనినిబొందుట యనుపపన్నము

విశేషితత్వాచ్చ. 8

"బ్రహ్మలోకాన్‌గమయతి" బృ. 6. 2. 15. అని అవస్థాభేదముచే బహువచనాన్తమగు విశేషణము కార్యబ్రహ్మమునందు సరిపడునుగాని అవస్థారహితము నిర్గుణము నగు పరబ్రహ్మమునందు అవస్థాభేదముతగదు, బహువచనము కుదరదు" ఈవిశేషణమువలనను కార్యబ్రహ్మ అనితేయర్థము.

సామీప్యాత్తు తద్వ్యపదేశః 9

కార్యబ్రహ్మమందు బ్రహ్మశబ్దము ముఖ్యమెట్లగును? అనంగా చెప్పుచున్నారు.

సామీప్యాత్ = పరబ్రహ్మసామీప్యమువలన, అపరబ్రహ్మకును, తద్వ్యపదేశః = ఆ బ్రహ్మశబ్దవ్యపదేశము. సత్యకామత్వాది విశుద్ధోపాధికము పరబ్రహ్మ, ఉపాస్యమాపరబ్రహ్మ.

కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిధానాత్. 10

అ॥ ఉపాసకుఁడు కార్యబ్రహ్మనే పొందునెడల అనావృత్తిశ్రుతివిరోధము గలుగును. దేవయాన (అర్చిరాది) మార్గముచే బ్రస్థితులైన వారికి శ్రుతి "ఏతేనప్రతిపద్యమానా ఇమంమానవ మావర్తంనావర్తన్తే" ఛాం. 4-15-5 అని అనావృత్తిని జెప్పుచున్నది. అదికాక, "తయోర్ధ్వ మాయన్నమృతత్వ మేతి" ఛాం. 8-6-6 అని ముక్తి శ్రవణముకూడఁ గార్యబ్రహ్మయందు సంభవింపదు అనఁజెప్పు చున్నారు. కార్య+అత్యయే=కార్యబ్రహ్మయొక్క ప్రళయముసంభవించినప్పుడు, తదధ్యక్షేణసహ=కార్యబ్రహ్మలోకాధ్యక్షుఁడైన హిరణ్యగర్భునితోఁగూడ అతఃపరం = ఈసగుణబ్రహ్మకంటె నుత్తమమువిశుద్ధమునైన పరబ్రహ్మస్వరూపమును బ్రహ్మజ్ఞానముకలిగినవారై పొందుచున్నారు. అభిధానాత్=శ్రుతిలో అనావృత్తి, క్రమముక్తులను జెప్పుటవలన నీవిషయముఅంగీకరింపఁబడుచున్నది. అర్చిరాదిమార్గగమనముచేత వెంటనేపరబ్రహ్మప్రాప్తి కలుగదు.

స్మృతేశ్చ. 11

స్మృతివలనఁగూడనీయర్థమే వచ్చుచున్నది.

"బ్రహ్మణాసహ తేసర్వే సంప్రాప్తే ప్రతిసంచరే
పరస్యాన్తే కృతాత్మానః ప్రవిశన్తి పరం పదమ్"

ప్రతిసంచరే = మహాప్రళయము, సంప్రాప్తే = సంభవించినదగుచుండఁగా, పరస్య = హిరణ్యగర్భబ్రహ్మకు, అన్తే=అధికారపమాప్తియగుచుండఁగా, తేపర్వే=ఆబ్రహ్మలోక (కార్యబ్రహ్మ) నివాసులందఱును, బ్రహ్మణాసహ=ఆబ్రహ్మతోఁగూడ, కృతాత్మానః = కలిగింపఁబడిన శుద్ధబ్రహ్మవిషయకబుద్ధికలవారై, పరంపదంప్రవిశన్తి = పరమపదమును బొందుచున్నారు.

పరం జైమినిర్ముఖ్యత్వాత్. 12

అవః సిద్ధాన్తవిషయమును జెప్పి యిప్పుడు పూర్వపక్షమును జెప్పుచున్నారు. జైమినిః = జైమినిమహర్షి, పరం="సఏతాన్ బ్రహ్మగమయతి" అను చోట బ్రహ్మపదమునకు పరబ్రహ్మయనియే యర్థమును, ముఖ్యత్వాత్=నపుంసకమైన బ్రహ్మశబ్దమునకు ముఖ్యమైనయర్థము పరబ్రహ్మయే యగుటవలనఁ, జెప్పుచున్నారు.

దర్శనాచ్చ-1

"తయోర్ధ్వ మాయ న్నమృతత్వమేతి" ఛాం 8-6-6 అనుశ్రుతి గతిపూర్వకముగు నమృతత్వమును జూపుచున్నది. ఈయమృతత్వము పరబ్రహ్మమునందే యుపపన్న మగును గాని నశించునట్టి కార్యబ్రహ్మయందుపపన్నము కాదు.

నచ కార్యే ప్రతిపత్త్యభిసంధిః 14

అవః "ప్రజాపతేః సభాం వేశ్మప్రపద్యే" ఛాం 8-14-1 అనుశ్రుతివలన, ఉపాసకుఁడు మరణకాలమున బ్రహ్మ

యొక్క సభను ప్రవేశింతునని సంకల్పించుకొనుటచే, కార్యబ్రహ్మయనియే యర్థము స్పష్టమగుచున్నది. అనఁ జెప్పుచున్నారు.

ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే" అనునది, కార్యే= కార్యబ్రహ్మవిషయకమైన ప్రతిపత్త్యభిసంధిః = పొందుటను దెలియఁజేయునది నచ=కాదు "నామరూపయోర్నిర్వహితా తే యదన్తరా తద్బ్రహ్మ" ఛాం. 8-14-1 అని కార్యవిలక్షణుఁడైన పరబ్రహ్మమే ప్రకృతమైన వాఁడగుటచేఁబర బ్రహ్మయనియే యర్థము. ముందు పూర్వపక్షము- తరువాత సిద్ధాంతము చెప్పక - ముందు సిద్ధాన్త సూత్రముగ "కార్యం బాదరిరస్య గత్యుపపత్తేః "బ్ర 4. 3. 7. అనుదానిని జెప్పి పిదప "పరం జైమినిర్ముఖ్యత్వాత్" అని పూర్వపక్షసూత్రమును జెప్పుట శిష్యబుద్ధిపరీక్షార్థమని తెలియఁగునది.

### 6 అప్రతీకాలంబనాధికరణము. (15-16)

అప్రతీకాలంబనాన్నయతీతి బాదరాయణ

ఉభయథాఽదోషాత్తత్క్రతుశ్చ. 15

అవ॥ ఇంతవఱకుఁ గార్యబ్రహ్మవిషయకమగు గతి నిరూపింపఁబడినది. ఇఁక నందలి విశేషమును జెప్పుచున్నారు. "సఏతాన్ బ్రహ్మగమయతి" ఛాం. 4 - 17 - 5 అనుచోట

ఉపాసకుల నందఱిని బ్రహ్మనుపొందించునని యర్థమా! లేక ప్రతీకోపాసకవ్యతిరిక్తుల నని యర్థమా? అని సంశయము కలుగుచుండ, విశేషము లేమికనుక సర్వోపాసకులను బొందించును అని యర్థముగాఁ జెప్పుచున్నారు.

అప్రతీకాలంబనాన్=ప్రతీకాలంబనములను విడిచిపెట్టి, పంచాగ్నివిద్య, దహరవిద్య, పర్యంకవిద్య, వైశ్వానరవిద్య, మొదలగు విద్యల నుపాసించువారిని, నయతీతి=అమానవుఁడగుపురుషుఁడు బ్రహ్మలోకమును బొందించునని, బాదరాయణః = బాదరాయణాచార్యులు తలంచుచున్నారు. ఉభయథా=రెండువిధములను అనగాఁ గొందఱిని బ్రహ్మను బొందించును. గొందఱిని బ్రహ్మను బొందింపఁడు, అని రెండు విధములను అంగీకరించినచో, దోషాభావాత్ = దోషము లేమికనుక, తత్క్రతుశ్చ = ఎవఁడు ఏయుపాసన చేయునో అతఁడు దానిని బొందును, అనువిషయము శ్రుతిస్మృతి సిద్ధము కావున తదుపాసకులకే బ్రహ్మప్రాప్తి. "నామబ్రహ్మేత్యుపాసీత" మొదలగు ప్రతీకోపాసనలయందు, బ్రహ్మ ప్రతీకమును గుఱించి విశేషణము కావున ప్రతీకమే ప్రధానము కావునను తదుపాసకులకు బ్రహ్మోపాసకత్వము లేదు. "తంయథాయథోపాసతే తదేవభవతి" అని శ్రుతి. పంచాగ్నివిద్యోపాసనము కూడ అబ్రహ్మోపాసనమే యైనను శ్రుతి బలమున తదుపాసకులకు బ్రహ్మప్రాప్తి కలదు.

## విశేషంచ దర్శయతి 16

విశేషంచ = నామాది ప్రతీకోపాసనలయందు ఫలవిశేషమునున్న, దర్శయతి = చూపించుచున్నారు. యావన్నామ్నోగతం తత్రాస్య యథాకామచారోభవతి, ఛాం. 7-1-5 అని నామబ్రహ్మోపాసకునకు, నామవిషయక మగు శబ్దశాస్త్రాది లక్షణమందు స్వాతంత్ర్యము కలుగుననియు, వాగ్వావనామ్నోభూయసీ, ఛాం 7-2-1 "యావద్వాచోగతం తత్రాస్య యథాకామచారోభవతి" మనోవావవాచోభూయః ఛాం 7-3-1 ఇమాదిరిగా పూర్వ పూర్వముకంటె ఉత్తరోత్తరోపాసనమునందు ఫలవిశేషమును శ్రుతిచూపుచున్నది. ఈ ఫలవిశేషము ప్రతీకమూలకము గనుక ప్రతీకోపాసకులకు మాత్రమే యుపపన్నమగును. బ్రహ్మోపాసకులకు బ్రహ్మప్రాప్తి సంభవించును.

ఇది శ్రీవారణాసి గంగాధరశాస్త్రి విరచితమగు
బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్ర వృత్తియందు
చతుర్థాధ్యాయమున
తృతీయపాదము.
అధికరణములు - 6, సూత్రములు - 16

---

శ్రీరస్తు

# బ్రహ్మసూత్రార్థ దీపిక

## చతుర్థాధ్యాయము - చతుర్థపాదము.

### 1 సంపద్యావిర్భావాధికరణము. (1-3)

అవ॥ మూడవపాదములో సగుణవిద్యోపయోగియగు గతి, గంతవ్యము, గంత, అను విషయము చెప్పఁబడినది. ఈ నాల్గవపాదములో నిర్గుణ విద్యాఫల బ్రహ్మభావావిర్భావము, సగుణవిద్యాఫలమగు ఈశ్వరతుల్యభోగభాక్త్వము వివరింపఁ బడుచున్నవి.

శ్రుతిలో, "ఏష సంప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ, పరంజ్యోతి రుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే" ఛాం. 8-12-3 అని యున్నది. ఏష సంప్రసాదః=ఈజీవుఁడు (సమ్యక్ ప్రసీదతి ఉపాధిశాన్త్యా ఇతిసంప్రసాదః=జీవః) అస్మాత్ శరీరాత్సముత్థాయ = ఈశరీరమునుండి లేచి, (శరీరాభిమానమునువిడిచి) పరంజ్యోతి రుపసంపద్య = పరబ్రహ్మమునుబొంది, స్వేనరూపేణాభినిష్పద్యతే=ముక్తరూపములో నిష్పన్నుఁడగుచున్నాఁడు.

ఇందుముక్తి స్వర్గాదులవలెఁ జన్యమా? కాదా? అనుసంశయము కలుగ, ఫలత్వావిశేషమువలన జన్యమేఅనిరాఁగాఁ జెప్పుచున్నారు.

## సంప ద్యావిర్భావ స్స్వేనశబ్దాత్. 1

సంపది="సంపద్య తే" అను శ్రుతిలో, ఆవిర్భావః=సచ్చిదానంద స్వరూపావిర్భావము (లేక) సంపది=అజ్ఞాననివర్తకమగు జ్ఞానము కలుగుచుండఁగాఁ అనియు నర్థము, సంపద్య, ఆవిర్భావః = అనియు విభాగము చేయవచ్చును. అప్పుడు, సంపద్య = స్వప్రకాశస్వరూపుఁ డగు ఆత్మను సాక్షాత్తుగా అనుభవించి, ఆ విర్భావః = తన సచ్చిదానందరూపముతో ఆవిర్భావము, అనియర్థము. ఎందుచేత? స్వేనశబ్దాత్=స్వేన అను శబ్దమును చెప్పుటవలన, ఇది పూర్వసిద్ధమగు రూపమునే అనువదించును. ఆగన్తుకధర్మము కాదని తెలుపును, అజ్ఞానముచే స్వస్వరూపము ఇదివఱలోఁ దిరోహితమై యున్నది. ఇప్పుడు అజ్ఞాననివృత్తి కాఁగా స్వరూపావిర్భావము గలిగినది. కాన ముక్తిజన్యము కాదు.

## ముక్తః ప్రతిజ్ఞానాత్. 2

అవ॥ ముక్తి పూర్వసిద్ధమే యైనచో సంసారావస్థకును దీనికిని భేద మేమి? అన్నచోఁ జెప్పుచున్నారు.

సంసారదశలో అవిద్యచే బంధింపఁబడెను. జ్ఞానము కలిగినపిదప అవిద్యనశించినది కనుక శుద్ధుఁడై ముక్తుఁడగుచున్నాఁడు ఇంతియేవిశేషము. ఎందుచేతననఁగా ప్రతిజ్ఞానాత్="ఏతం త్వేవ తేభూయో౽ నువ్యాఖ్యాస్యామి"

ఛాం. 8-9-3. అని అవస్థాత్రయ దోషహీనమగు ఆత్మను వ్యాఖ్యేయముగాఁ బ్రతిజ్ఞచేసి, "అశరీరం వావసంతం న ప్రియాప్రియే స్పృశతః" ఛాం. 8-12-1 అని చెప్పి, "స్వేన రూపే ణాభినిష్పద్యతే" స ఉత్తమః పురుషః ఛాం. 8- 12- 3 అని యుపసంహరించుటచే ముక్తుఁడని నిశ్చయింపఁ బడు చున్నది.

ఆత్మా ప్రకరణాత్ . 3

అవః జ్యోతిశ్శబ్దము భౌతికసంబంధముగదా జ్యోతిస్సంపత్తిచే ఆత్మకుముక్తిని చెప్పుటయెట్లు పొసఁగును? అనఁ చెప్పుచున్నారు.

ప్రకరణాత్ = ప్రకరణమునుబట్టి, ఆత్మా=జ్యోతిశ్శబ్దమునకు ఆత్మయనియర్థము, జ్యోతిశ్శబ్దమునకు భౌతికమగు జ్యోతియని యర్థముకాదు. "య ఆత్మాఽపహతపాప్మా" ఛాం. 8-7-1 అని ఆత్మప్రకరణమగుటవలన జ్యోతిశ్శబ్దమునకిచ్చటఆత్మయను యర్థము, "తద్దేవా జ్యోతిషాం జ్యోతిః" బృ.4-4-16 మొదలగు శ్రుతులలో జ్యోతిశ్శబ్దమును ఆత్మయందు ప్రయోగించుట కలదు. కనుక, ముక్తి యనునది పూర్వసిద్ధమే కాని జన్యముకాదు.

2. అవిభాగేనదృష్టత్వాధికరణము

అవిభాగేన దృష్టత్వాత్ . 4

అవః "పరంజ్యోతి రుపసంపద్య స్వేనరూపే ణాభినిష్పద్యతే" అనిచెప్పఁబడిన ముక్తుఁడుపరబ్రహ్మకంటె భిన్నుఁడుగా

యుండునా? పరబ్రహ్మవిభాగముగా (ఏకరూపముగా) నుండునా? అని సంశయముకలుగ బ్రహ్మాభిన్నుఁడుగా నుండునను భ్రాన్తిని వారించుచున్నారు.

అవిభాగేన=ముక్తుఁడు బ్రహ్మావిభాగముచేత, అనఁగా బ్రహ్మతో విడఁదీయుటకు వీలులేక నిరతిశయానంద బ్రహ్మస్వరూపుఁడుగా నుండును. ఎందుచేతనన, దృష్టత్వాత్ = "బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి" "తత్త్వమసి" "అహంబ్రహ్మాస్మి" మున్నగు శ్రుతులలో అట్లవిభాగముగానున్నట్లు కనఁబడుట వలన ముక్తుఁడు బ్రహ్మాభిన్నుఁడుకాఁడు.

### 3. బ్రాహ్మాధికరణము. (5-7)

#### బ్రాహ్మేణ జైమిని రుపన్యాసాదిభ్యః. 5

అవు! ముక్తుఁడు సత్యమైన సర్వజ్ఞత్వాదులు కలవాఁడై యుండునా? లేక సచ్చిన్మాత్రరూపుఁడుగా నుండునా? ఆగన్తుకమైన మఱియొకరూపముతో నుండునా? సవిశేషుఁడా? నిర్విశేషుఁడా? అని సంశయముకలుగఁ దెలుపుచున్నారు.

ముక్తుఁడు, బ్రాహ్మేణ = బ్రహ్మసంబంధి సర్వజ్ఞత్వాది రూపముతో నుండును అని, జైమినిః = జైమిన్యాచార్యుఁడు తలఁచుచున్నాఁడు. ఎందుచేతననఁగా ఉపన్యాసాదిభ్యః = ఉపన్యాసాదులవలన, ఉపన్యాసమనఁగా నుద్దేశము, ఆదిశబ్దముచే అజ్ఞాతజ్ఞాపనము, వ్యపదేశము, వివక్షింపబడినవి.

"యఆత్మా అపహతపాప్మా విజరోవిమృత్యుః విశోకోఽ విజిఘత్సోఽ పిపాసః సత్యకామ స్సత్యసంకల్పః. ఛాం 8-7-1 అన్నది ఉద్దేశము "య ఆత్మా" అని యచ్ఛబ్దముతోఁ ప్రారంభించుటచే ఏయాత్మ అప హతపాప్మయో అనుటచే ఆత్మ యింతకుమున్నే మఱియొక విధముగా సిద్ధమైయుండె ననియు నతని నుద్దేశించి సోఽన్వేష్టవ్యః అని చెప్పుచుండుట చేతను నిది యుద్దేశమని యర్థము.

"స తత్ర పర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః" ఛాం. 8-12-3 ఇది అజ్ఞాత జ్ఞాపనము. అనఁగా మనకుఁ దెలియని దానిని దెలుపుట. ఇందు యచ్ఛబ్దము లేదుగాన నిదియుద్దేశము కాదు. మనకుఁ దెలియనిఫలరూపమైన యైశ్వర్యమును (క్రీడనము రమణము మొదలగు వానిని) తెలుపుచున్నది కనుక నిది యజ్ఞాత జ్ఞాపనము. "సర్వజ్ఞ స్సర్వేశ్వరః" మొదలగునది వ్యపదేశము.

ఈవిధముగ ఉపన్యాసాజ్ఞాత జ్ఞాపన, వ్యపదేశముల వలన ముక్తప్రాప్యుఁడగు బ్రహ్మ సగుణుఁడు (సవిశేషుఁడు) అనుటచే ముక్తుఁడుగూడ సవిశేషుఁడు అని జైమిని మతము.

చితితన్మాత్రేణ తదాత్మకత్వా దిత్యౌడులోమిః 6

ఔడులోమిః = ఔడులోమి యను నాతఁడు, చితితన్మాత్రేణ = ముక్తుఁడు చైతన్యమాత్ర స్వరూపముతో

నుండునని చెప్పుచున్నాఁడు. ఎందుచేతననఁగా, తదాత్మక
త్వాత్ = బ్రహ్మ చైతన్యాత్మకుఁడు గాన, "సత్యం జ్ఞానమ
నన్తం బ్రహ్మ" తై. 2-1 "ఏవంవా అరేఽయమాత్మా
ఽనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ" బృ 4-5-13
"బ్రహ్మవేద బ్రహ్మైవభవతి" ము 3-2-9 "తరతి శోక
మాత్మవిత్" ఛాం 7_1-3 మొదలగు శ్రుతులవలన బ్రహ్మ
చైతన్యస్వరూపుఁడగుటచే బ్రహ్మముఁబొందు ముక్తుఁడును చైతన్య
స్వరూపుఁడేయని యాతని యభిప్రాయము. సత్యకామత్వా
దులు ఉపాధి సంబంధములగుటచే చైతన్యస్వరూప భూత
ములుకావు. "జక్షత్ క్రీడన్రమమాణః" అన్నది కూడ దుఃఖా
భావమాత్రాభిప్రాయకము. ద్వితీయసాధ్యములగు క్రీడాదుల
ద్వితీయ పరబ్రహ్మమునం దుపపన్నములుకావు. ముక్తుఁడు
అద్వితీయ బోధస్వరూపముతో నుండును.

ఏవమప్యుపన్యాసాత్పూర్వ భావాదవిరోధం బాదరాయణః.7

ఏవమపి = ఈలాగునఁ జెప్పినను ముక్తుఁడు చైతన్య
మాత్రస్వరూపుఁడు, అని చెప్పినను, ఉపన్యాసాత్ = ఉప
న్యాసము (ఉద్దేశము అజ్ఞాతజ్ఞాపనము, వ్యపదేశము, అను
వానివలన, పూర్వభావాత్ = పూర్వ=వెనుకఁ జెప్పిన సత్యసం
కల్పత్వాది లక్షణమగు బ్రాహ్మైశ్వర్యముయొక్క భావాత్
=స్థితివలన, బద్ధపురుషదృష్ట్యా,ముక్తుని యందు సంభవించుట
వలన, బాదరాయణః=బాదరాయణాచార్యులు, అవిరోధం=

సగుణ నిర్గుణశ్రుతులకు విరోధము లేకుండుటను, తెలుపుచున్నారు.

సగుణత్వము, నిర్గుణత్వము, అనునవి పరస్పరవిరుద్ధములు కనుక ముక్తిదశయందు ఒక్కమారుగా సంభవింపవు కాన కాలభేదముచే వ్యవస్థచేయఁదగినవి అనిరాఁగా, అట్లు కాదు. కాలభేదముచే వ్యవస్థ కాదు. ప్రతిపత్తృభేదమువలన వ్యవస్థచేయవలెను. అట్లుచేసిన నీరెండునునొక్కమారే సంభవించును. ప్రతిపత్తయనఁగా జ్ఞాత. జ్ఞాతృభేదముచే యౌగపద్యము=రెండునునొక్కపర్యాయము, ఉండుట సంభవించును.

ముక్తుని దృష్ట్యా బ్రహ్మ నిర్విశేషము. (నిర్గుణము) ముక్తుడు, నేను సర్వజ్ఞత్వాది సత్యసంకల్పత్వాది లక్షణములు గలబ్రహ్మను అని యనుకొనఁడు అట్లనుకొనుటకుఁ గారణమగు అవిద్య యతనికి నశించినదే యతఁడు ముక్తుఁడైనాఁడు ఇఁక బద్ధుఁడవిద్యాయుక్తుఁడుగనుక, నతనిదృష్ట్యా బ్రహ్మ సర్వజ్ఞత్వాది గుణవిశిష్టము(సవిశేషము). ఔడులోమి సత్యకామత్వాదులను తుచ్ఛములనును, బాదరాయణుఁడు వ్యావహారిక సత్యములనును.

### 4. సంకల్పాధికరణము (8-9)

### సంకల్పాదేవతు తచ్ఛ్రుతేః 8

వెనుకటిమూఁడధికరణములచేతను పరవిద్యాఫలమును విచారించి యిప్పుడుసగుణవిద్యాఫలమును వివరించుచున్నారు.

అర్చిరాదిమార్గమున బ్రహ్మలోకమును బొందిన యుపాసకునికి భోగ్యవస్తువులను సృష్టించుటయందు ప్రయత్నాంతరసహితమగు సంకల్పము హేతువా? సంకల్పమాత్రము చాలునా? అనఁగాఁ జెప్పుచున్నారు.

సంకల్పాదేవ=భోగ్యవస్తువులయుత్పత్తి (సృష్టి) సంకల్పాదేవ=సంకల్పమాత్రమువల్లనే కలుగును, సాధనాన్తరాపేక్ష యక్కఱలేదు. ఎందుచేత? అనఁగా, తచ్ఛ్రుతేః=అట్టి శ్రుతి యుండుటవలన, "స యది పితృలోకకామో భవతి సంకల్పాదేవాస్య పితరస్సముత్తిష్ఠన్తి" ఛాం. 8-2-1-అని సంకల్పమాత్రమువల్లనే భోగ్యవస్తూత్పత్తి యగును.

అతఏవ చానన్యాధిపతిః 9

అతఏవచ=ముక్తుఁడు సత్య (అమోఘ) సంకల్పుఁడు గావుననే అనన్యాధిపతిః= తనకు మఱియొక అధిపతి (ప్రభువు) లేనివాఁడుగానున్నాఁడు. స్వతంత్రుఁడని భావము.

"అథ య ఇహాత్మానమను విద్య వ్రజన్త్యేతాంశ్చ సత్యాన్ కామాన్ తేషాం సర్వేషు లోకేషు కామచారో భవతి" ఛాం 8-1-6 అని శ్రుతి స్వాతంత్ర్యమును దెలుపుచున్నది.

5 అభావాధికరణము (10-14)

అవ॥ ముక్తుఁడు సంకల్పముచేతనే సకల భోగ్యములను సృజించును. అని చెప్పుటచే సంకల్పసాధనమైనమనస్సున్నది.

ఇతరములైన ఇంద్రియములు శరీరమునున్నవా? లేవా? అని సంశయము కలుగఁ జెప్పుచున్నారు.

అభావం బాదరి రాహహ్యేవమ్. 10

బాదరిః = బాదరి మహర్షి అభావం = ఇంద్రియములు శరీరము ముక్తునకు లేవు అని తలఁచుచున్నాఁడు. ఎందుచేతనన, ఏవంహ్యాహ శ్రుతి రాహ = శ్రుతి యీ మాదిరిగాఁ జెప్పినదికనుక "మనసైతాన్ కామాన్ పశ్యన్రమతే" ఛాం 8-12-5 "యఏతే బ్రహ్మలోకే" ఛాం 8-13-1 అని మనసా అనువిశేషణముచేత, శరీరము ఇంద్రియములు లేవని తెలియు చున్నది.

భావం జైమిని ర్వికల్పామననాత్ 11

జైమినిః = జైమిని మహర్షి భావం = ముక్తునకు, శరీరేంద్రియముల భావమును, ఉండుటను తలఁచుచున్నాఁడు. ఎందుచేత, వికల్పామననాత్ = వికల్పమును జెప్పుటవలన, "సఏకధా భవతి, త్రిధా భవతి" ఛాం 7-26-2 అని శ్రుతిలో అనేకవిధత్వమును జెప్పుటవలన, శరీరాదులున్నవని జైమిని మతము. ఒకే ఆత్మయందు శరీరభేదమున్ననే అనేకవిధత్వము పపన్నమగునుగాని శరీరభేదములేక కుదరదు.

ద్వాదశాహవదుభయవిధం బాదరాయణోఽతః 12

అతః = రెండువిధములైన శ్రుతులు కనిపించుటవలన "మనసా" అను విశేషణము వలన, వికల్పామననము వలన ద్వాదశాహవత్ ద్వాదశాహమువలె, బాదరాయణః = బాదరాయణులు, ఉభయవిధం = జ్ఞానియగుముక్తుని యైశ్వర్యమును రెండువిధములైనదానినిగాఁ దలఁచుచున్నారు.

"ద్వాదశాహమృద్ధికామా ఉపేయుః" అని ఉపేయ చోదనవలన ద్వాదశాహక్రతువునకు సత్రత్వమున్ను "ద్వాదశాహేన యాజయేత్" అని అహర్గణనచేసిన అహీనత్వమున్ను అని ఉభయవిధత్వము సిద్ధించునట్లు సశరీరత్వమును సంకల్పించిన సశరీరత్వమున్ను, అశరీరత్వమును సంకల్పించిన అశరీరత్వమున్ను ముక్తునకు ఉభయవిధత్వము సంభవించునని బాదరాయణుని మతము.

తన్వభావే సంధ్యవదుపపత్తేః 13

తను + అభావే = శరీరములేనప్పుడు, సంధ్యవత్ = స్వప్నమునందువలె, ఉపపత్తేః = ఉపపన్నమగుటవలన, అనగా, శరీరమును సంకల్పింపనపుడు = మనస్సుచేతనే స్వప్నమందువలె భోగముల ననుభవించును.

భావేజాగ్రద్వత్. 14

భావే = శరీరమున్నపుడు, జాగ్రద్వత్ = జాగ్రదవస్థయందువలె, భోగముల ననుభవించునని యర్థము.

న శరీరత్వము వలసినపుడు సంకల్పమాత్రముచే దానినిబొంది జాగ్రదవస్థయందువలె భోగములననుభవించును.

## 6. ప్రదీపాధికరణము (1516)-

ప్రదీపవదావేశ స్తథాహి దర్శయతి. 15

"భావం జైమిని ర్వికల్పామననాత్" బ్ర. 4-4-11వ సూత్రమున ముక్తునకు సశరీరత్వము చెప్పఁబడినది" సఏక ధా భవతి త్రిధా భవతి పంచధా సప్తధా" అను ఛాం. 7-26-2. శ్రుతివలన, ఏకకాలమున ననేకశరీరపరిగ్రహ మైచ్ఛికముగాఁ జెప్పఁబడినది. ఈయనేకశరీరములను ధరించిన పక్షమున నాశరీరములన్నియు మనశ్శరీరములవలె ఆత్మతోఁ గూడినవేనా! లేక దారుయంత్రములవలె నిరాత్మకములా! అనిసంశయముగలుగ వారించుటకీయధికరణమారంభింపఁబడినది.

సర్వశరీరములును మనస్సుతోఁ గూడినవి. సమనస్కములుగాన సాత్మకములు. ఎందుచేతననగా, అట్టికల్పన సంభవింపవచ్చును. శ్రుతికూడ కనిపించుచున్నది.

ముక్తుఁడు ఆత్మభోగమునకై కావలెనని సంకల్పింపఁ బెక్కు దేహములుగలుగును. ఒకేయాత్మతోను ఒకేమనస్సుతోను బెక్కు దేహములందు భోగానుభవము సంభవింపదు కావునఁ బెక్కు ఆత్మలను బెక్కు మనస్సులనుగల్పింపవలెను. అయినచో అనన్తములగు ఆత్మలుకల్పింపఁబడునా! యన్నచో,

కాదు. ప్రదీపవత్ - ఆవేశః = ప్రదీపమువలె ఆవేశించును. అనఁగా దీపమొక్కటేయయ్యును పెక్కువత్తుల నంటుకొని పెక్కుదీపములుగా నగుచున్నట్లు విద్వాంసుఁడు (జ్ఞాని అగు ముక్తుఁడు తానొక్కఁడే యయ్యు, తనయైశ్వర్యము (శక్తి)చే పెక్కు రూపములొంది పెక్కుశరీరముల నావేశించును. ఒక్క మనస్సుతో సంకల్పించినంతనే, సంభవించిన పెక్కుమనస్సులతోఁ బెక్కుఆత్మలు గలుగ నాశరీరముల నన్నిటిని యూవేశించును. సహజముగా ఆత్మయొక్కటైనను, మనోభేదముచే ఆత్మభేదము సంభవించినది. దానివలన శరీరములన్నియు, మనస్సు, ఆత్మ కలిగిన భోగసాధనములైనవి. ఈ విషయమును, "స ఏకధా భవతి త్రిధా భవతి, పంచధా సప్తధా!! ఛాం. 7-26-2. అను శ్రుతి తెలుపుచున్నది.

స్వాప్యయసంపత్త్యో రన్యతరాపేక్ష మావిష్కృతంహి. 16

అవ॥ ముక్తుఁడు పెక్కుశరీరములధరించి సమనస్కములు సాత్మకములునగువానితో విహరించునని చెప్పినచో "తత్కేన కం విజానీయాత్" బృ. 4-5-15 అను విశేషవిజ్ఞానాభావ శ్రుతితో విరోధము గలుగదా? అనఁ జెప్పుచున్నారు.

స్వాప్యయ సంపత్త్యోః = స్వాప్యయమనఁగా, సుషుప్తి, సంపత్తి అనగాఁ గైవల్యము. ఆ రెండింటిలో, అన్యతరాపేక్షం = ఏదోయొకటియైన యవస్థను (సుషుప్తినిగాని కైవల్యమునుగాని) అపేక్షించి, ఆవిష్కృతంహి = "తత్కేనకంపశ్యేత్" అను విశేషవిజ్ఞానాభావము ప్రకటింపఁబడినది.

సుషుప్తినిగాని కైవల్యమునుగాని యపేక్షించి విశేష విజ్ఞానాభావము చెప్పఁబడినది. ఇచ్చట సగుణవిద్యాఫలమగు విశేషము వర్ణింపఁబడినది. ఇది స్వర్గమువంటిది. కాన నీరెంటికిని విరోధములేదు.

"యత్రసుప్తో నకంచన కామంకామయతే నకంచన స్వప్నంపశ్యతి" బృ. 4-3-19 అన్నది. సుషుప్తిలోఁ బ్రమాణము.

"యత్రత్వస్య సర్వ మాత్మైవాభూత్ తత్కేన కంపశ్యేత్ కేనకం విజానీయాత్" బృ. 2-4-14. అన్నది, సంపత్తిలోఁ బ్రమాణము.

### 7 జగద్వ్యాపారవర్జాధికరణము. (17-22)

**జగద్వ్యాపారవర్జం ప్రకరణా దసన్నిహితత్వాచ్చ. 17**

అవ॥ బ్రహ్మలోకగతులగు ముక్తులకు సంకల్పమాత్రమున నీశ్వరసాయుజ్యము పొందినవారికి జగత్సృష్ట్యాదికర్తృత్వముకూడ నున్నదా? అని సంశయముగలుగఁ జెప్పుచున్నారు. ముక్తులు అప్రతిహత సంకల్పప్రభావము కలవారు కనుక జగత్సృష్టికర్తృత్వము కూడ వారికిఁగలదుఅని రాఁగా, జగద్వ్యాపారవర్జం=జగమునుసృష్టిచేయు వ్యాపారమునువిడిచి పెట్టి ఉపాసకులకు ఈశ్వర సమానైశ్వర్యముకలదు. సృష్టి చేయుటదక్క ఈశ్వరునితో సమానమైన అణిమాదిశక్తి, ముక్తులకుఁ గలదని భావము. ఎందుచేతననఁగా, ప్రకరణాత్ = ప్రకరణమువలన, పరమేశ్వరుఁడే జగద్వ్యాపారమున నధికృతుఁడు, పరమేశ్వరు నుద్దేశించి "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర

ఆసీత్, నాన్య త్కించనమిషత్, సఈక్షతలోకాన్నుసృజా ఇతి సఇమాన్ లోకానసృజత 2. 1-1- అని సృష్టిని జెప్పుటవలనను, అసన్నిహితత్వాచ్చ = ఇతరులైన ముక్తులు సన్నిహితులు కాకుండుటవల్లనున్ను, పరమాత్మయేస్రష్ట యని చెప్పఁబడుచుండెనుగాని యోగులు (ముక్తులు) ఎవ్వరును స్రష్టలని చెప్పఁబడియుండలేదు. అనేకు లీశ్వరులయినచో వారు పరస్పరవిరుద్ధ సంకల్పులగుటచే నేపనియు నెఱవేఱదు.

ప్రత్యక్షోపదేశా దితిచే న్నాధికారికమండలస్థోక్తేః. 18

ప్రత్యక్షోపదేశాత్ = "ఆప్నోతి స్వారాజ్యమ్" తై 1-6-2 సర్వేస్మై దేవా బలిమావహన్తి తై 1-5-3 "తేషాం సర్వేషులోకేషు కామచారోభవతి" ఛాం. 8.1-6 అని శ్రుతులచేఁ బ్రత్యక్షోపదేశమువలన, ఈశ్వర సమానైశ్వర్యము కలుగుచుండ, జగద్వ్యాపారమున్ను గలుగును. ఇతి చేత్ + న = అన్నచోఁగాదు, అధికారికమండలస్థోక్తేః = అధికారిక (అధికారములలోనున్న బ్రహ్మయొక్క మండల = లోకమునందు, స్థ + ఉక్తేః = ఉన్నట్లు చెప్పుటవలన జగద్వ్యాపారము వీరికిలేదు.

అధికారికబ్రహ్మయొక్క మండలమునందుపాసకులున్నట్లు చెప్పుటవలన వీరికిఁగలుగు స్వారాజ్యాదికమంతయు నాయాధికారికబ్రహ్మయొక్క యధీనమైనదే కాని వీరికిస్వతంత్రమైనది కాదు. నిత్యసిద్ధుఁడగు నీశ్వరునధీనములోనిదే వీరి స్వాతంత్ర్యమని భావము.

వికారావర్తిచ తథాహి స్థితిమాహ. 19

వికారావర్తి చ = పరమేశ్వరరూపము. వికారావర్తి యున్న. వికార+అవర్తి=వికారమునందు మాత్రమే యుండనిది అనఁగా సవితృమండలాద్యధిష్ఠాన మైనదియే కాదు. నిత్యమైనదియు నని భావము — తథాహిస్థితిమాహ = పరమేశ్వరరూపము సగుణము నిర్గుణము (లేక) వికారి, నిత్యము, అని రెండు విధములుకలదిగా శ్రుతి చెప్పుచున్నది. "ఏతావానస్య మహిమా" అని సగుణత్వమును జెప్పి "అతోజ్యాయాగ్ శ్చ పూరుషః" అని నిర్గుణత్వము కలదిగాఁ జెప్పుచున్నది. ద్విరూపుఁడగు పరమేశ్వరునియందలి నిర్గుణత్వమును సగుణోపాసకులు పొందలేనట్లు సగుణస్వరూపములోని నిత్యసిద్ధేశ్వరత్వమునుజగత్సృష్ట్యాదికమును బొందలేరు.

దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే. 20

ప్రత్యక్షమనఁగా శ్రుతి అనుమానమనఁగా స్మృతి. ప్రత్యక్షానుమానే = శ్రుతిస్మృతులు ఏవం = ఈవిధముగా వికారావర్తిత్వమును (నిర్గుణత్వమును దర్శయతః = చూపుచున్నవి.

శ్రుతి:—"నతత్ర సూర్యోభాతి నచంద్రతారకం నేమా విద్యుతో భాన్తి కుతోయమగ్నిః। తమేవభాన్త మను భాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి క. 5-15

స్మృతి:—నతద్భాసయతే సూర్యో నశశాంకో నపావకః। యద్గత్వా ననివర్తన్తే తద్ధామ పరమంమమ" భ.15-6

భోగమాత్రసామ్య లింగాచ్చ 21

ఉపాసకులకు బ్రహ్మలోకములో నిత్యసిద్ధుఁడగు పరమేశ్వరునితో భోగమాత్రముయొక్క సామ్యమును దెలుపు లింగమువల్లనున్నూ జగద్వ్యాపారము లేదు.

"యథైతాం దేవతాం సర్వాణిభూతాన్య వన్త్యేవం హైవం విదం సర్వాణిభూతాన్యవన్తి బృ1-5-20 హిరణ్యగర్భునకు త్రిల్లోకస్థములగు భూతములెట్లు భోగసాధనములో యుపాసకులకును నవియట్లే భోగసాధనములు. వీరికి జగత్సృష్ట్యాదులు లేవు. వీరియైశ్వర్యము సాతిశయమని భావము.

అనావృత్తిశ్శబ్దాద నావృత్తిశ్శబ్దాత్. 22

అవ॥ ఉపాసకులయైశ్వర్యము సాతిశయమేయైనచో నంతవత్త్వకనుక వీరికిఁగూడ మఱల ఆవృత్తి గలుగునా? యను సమాధానము చెప్పుచున్నారు.

నాడీరశ్మిసమన్వితమగు అర్చిరాదిమార్గముచే బ్రహ్మలోకమునుబొందిన యుపాసకులకు, శబ్దాత్ ="తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి" ఛాం. 8-6-6 "ఏతేం ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తన్తే" ఛాం.4-15-5 "బ్రహ్మలోక మభిసంపద్యతే నచపునరావర్తతే" ఛాం. 8-15-1 మొదలగు శ్రుతిశబ్దములవలన, అనావృత్తిః=తిరిగివచ్చుటలేదు. "కార్యాత్యయే-బ్ర॥సూ॥ 4-3-10. లో చెప్పినట్లు కార్యబ్రహ్మ

ప్రళయమందు వీరు బ్రహ్మజ్ఞాన ముదయించినవారై తల్లోకాధ్యక్షుఁడగు హిరణ్యగర్భునితోఁ సహా పరబ్రహ్మస్వరూపమును బొందుదురు. నిర్గుణబ్రహ్మజ్ఞానుల కావృత్తి శంకయే లేదు. సూత్రమున కావృత్తిచెప్పుట శాస్త్రసమాప్తిద్యోతనార్థము.

ఇది శ్రీమద్భారద్వాజస గోత్రపవిత్ర వారణాస్యన్వయ వాయః
కలశ పాథోరాశి రాకాకౌముదీ సుధాకరాయమాణ
శ్రీమదద్యశాంబా వేంకటేశ్వరుల యాత్మజుఁ
డును శ్రీవేంకట నరసింహ సూర్యనారాయణ
లక్ష్మీనారాయణ శాస్త్రి వర్యులయనుజుఁడును
శ్రీరాజమహేంద్రవర గౌతమీవిద్యాపీఠ
సంస్కృత కళాశాలాధ్యక్షుఁడునునగు
శ్రీగంగాధర శాస్త్రిచే విరచిత
మగు బ్రహ్మసూత్రార్థ దీపికయను
బ్రహ్మసూత్రవృత్తియందుఁ
చతుర్థాధ్యాయమునఁ
చతుర్థపాదము. అధి 7 సూ 22
గ్రన్థము సమాప్తము.
మొత్తము అధి 191 సూ 555
శుభం భూయాత్.
ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః
ఓమ్ తత్సత్

---

రాజమహేంద్రవరమున సరస్వతీ పవర్ ప్రెస్ నందు
శ్రీ అడ్డేపల్లి నాగేశ్వరరావుగారిచే ముద్రింపఁబడినది.

శ్రీరస్తు

# బ్రహ్మసూత్ర వర్ణాను క్రమణిక


| | | | |
|---|---|---|---|
| అంశో నానా | 2-3-43 | అతఃప్రబోధో | 3-2-8 |
| అకరణత్వాచ్చ న | 2-4-11 | అతశ్చాయనేపి | 4-2-20 |
| అక్షరధియాం | 3-3-33 | అతస్త్విత రజ్జ్యా | 3-4-39 |
| అక్షరమంబరాంత | 1-3-10 | అతిదేశాచ్చ | 3-3-46 |
| అగ్నిహోత్రాది | 4-1-16 | అతో౽న్తేన | 3-2-26 |
| అగ్న్యాదిగతి | 3-1-4 | అతో౽న్యాపి | 4-1-17 |
| అంగావబద్ధాస్తు | 3-3-55 | అత్తాచరా | 1-2-9 |
| అంగిత్వానుప | 2-2-8 | అథాతో బ్రహ్మ | 1-1-1 |
| అంగేషుయథా | 3-3-61 | అదృశ్యత్వాది | 1-2-21 |
| అచలత్వంచా | 4-1-9 | అదృష్టానియ | 2-3-51 |
| అణవశ్చ | 2-4-7 | అధికంతుభేద | 2-1-22 |
| అణుశ్చ | 2-4-13 | అధికోపదేశా | 3-4-8 |
| అతఏవచనిత్య | 1-3-29 | అధిష్ఠానానుప | 2-2-39 |
| అతఏవచసర్వా | 4-2-2 | అధ్యయనమాత్ర | 3-4-12 |
| అతఏవచాగ్ని | 3-4-25 | అనభిభవంచ | 3-4-35 |
| అతఏవచానన్యా | 4-4-9 | అనవస్థితేర | 1-2-17 |
| అతఏవచోప | 3-2-18 | అనారబ్ధకార్యే | 4-1-15 |
| అతఏవనదేవ | 1-2-27 | అనావిష్కుర్వన్న | 3-4-50 |
| అతఏవప్రాణః | 1-1-23 | అనావృత్తిశ్శబ్దా | 4-4-22 |

అనియమస్సర్వా 3-3-31
అనిష్టాదికారి 3-1-12
అనుకృతేస్తస్య 1-3-22
అనుజ్ఞాపరి 2-3-48
అనుపపత్తేస్తు 1-2-3
అనుబంధాది 3-3-50
అనుష్ఠేయంబా 3-4-19
అనుస్మృతేర్బా 1-2-30
అనుస్మృతేశ్చ 2-2-25
అనేనసర్వగ 3-2-37
అన్తరఉపప 1-2-13
అన్తరాచాపి 3-4-36
అన్తరాభూత 3-3-35
అన్తరావిజ్ఞాన 2-3-15
అన్తర్యామ్యధి 1-2-18
అన్తవత్త్వమస 2-2-41
అన్తస్తద్ధర్మోప 1-1-20
అన్త్యావస్థితే 2-2-36
అన్యత్రాభావాచ్చ 2-2-5
అన్యథాత్వం 3-3-6
అన్యథానుమితౌ 2-2-9
అన్యథాభేదా 3-3-36
అన్యభావవ్యా 1-3-12
అన్యాధిష్ఠితేషు 3-1-24
అన్యార్థస్తు 1-4-18
అన్యార్థశ్చ 1-3-20
అన్వయాదితిచే 3-3-17
అపరిగ్రహాచ్చా 2-2-17
అపిచసప్త 3-1-15
అపిచస్మర్యతే 1-3-23
,, ,, ,, 2-3-45
,, ,, ,, 3-4-30
,, ,, ,, 3-4-37
అపిచైవమేకే 3-2-13
అపిసంరాధనే 3-2-24
అపీతౌతత్ప్రసం 2-1-8
అప్రతీకాలంబ 4-3-15
అబాధాచ్చ 3-4-29
అభావంబాదరి 4-4-10
అభిధ్యోప 1-4-24
అభిమానివ్యప 2-1-5
అభివ్యక్తేరిత్యా 1-2-29
అభిసంధ్యాది 2-3-52
అభ్యుపగమే 2-2-6

అ


| | |
|---|---|
| అంబువదగ్రహా | 3-2-19 |
| అరూపవదేవ | 3-2-14 |
| అర్చిరాదినా | 4-3-1 |
| అర్భకౌకస్త్వాత్ | 1-2-7 |
| అల్పశ్రుతేరితి | 1-3-21 |
| అవస్థితివైశే | 2-3-24 |
| అవస్థితేరితి | 1-4-22 |
| అవిభాగేన | 4-4-4 |
| అవిరోధశ్చం | 2-3-23 |
| అశుద్ధమితి | 3-1-25 |
| అశ్మాదివచ్చ | 2-1-23 |
| అశ్రుతత్వాదితి | 3-1-6 |
| అసతిప్రతిజ్ఞో | 2-2-21 |
| అసదితిచేన్న | 2-1-7 |
| అసద్వ్యపదేశా | 2-1-17 |
| అసంతతేశ్చా | 2-3-49 |
| అసంభవస్తు | 2-3-9 |
| అసార్వత్రికీ | 3-4-10 |
| అస్తితు | 2-3-2 |
| అస్మిన్నస్యచ | 1-1-19 |
| అస్యైవచోప | 4-2-11 |
| ఆకాశస్తల్లిం | 1-1-22 |
| ఆకాశేచావి | 2-2-24 |
| ఆకాశోర్థాంతర | 1-3-41 |
| ఆచారదర్శ | 3-4-3 |
| ఆతివాహిక | 4-3-4 |
| ఆత్మకృతేః | 1-4-26 |
| ఆత్మగృహీతి | 3-3-16 |
| ఆత్మనిచైవం | 2-1-28 |
| ఆత్మశబ్దాచ్చ | 3-3-15 |
| ఆత్మప్రకర | 4-4-3 |
| ఆదరాదలో | 3-3-40 |
| ఆదిత్యాది | 4-1-6 |
| ఆధ్యానాయ | 3-3-14 |
| ఆనందమయో | 1-1-12 |
| ఆనందాదయః | 3-3-11 |
| ఆనర్థక్యమితి | 3-1-11 |
| ఆనుమానిక | 1-4-1 |
| ఆపః | 2-3-11 |
| ఆప్రాయణాత్ | 4-1-12 |
| ఆభాసఏవచ | 2-3-50 |
| ఆమనన్తి | 1-2-32 |

| | |
|---|---|
| ఆర్త్విజ్యమి | 3-4-45 |
| ఆవృత్తిరస | 4-1-1 |
| ఆసీనస్సంభ | 4-1-7 |
| ఆహ చ తన్మా | 3-2-16 |
| ఇ | |
| ఇతరపరామ | 1-3-18 |
| ఇతరవ్యపదే | 2-1-21 |
| ఇతరస్యా | 4-1-14 |
| ఇతరేతర | 2-2-19 |
| ఇతరే త్వర్థ | 3-3-13 |
| ఇతరేషాం చా | 2.1-2 |
| ఇయదామన | 3-3-34 |
| ఈ | |
| ఈక్షతికర్మ | 1-3-13 |
| ఈక్షతేర్నా | 1-1-5 |
| ఉ | |
| ఉత్క్రమిష్యత | 1-4-21 |
| ఉత్క్రాన్తిగత్యా | 2-3-1 |
| ఉత్తరాచ్చేదా | 1-3-19 |
| ఉత్తరోత్పాదే | 2-2-20 |
| ఉత్పత్త్యసంభ | 2-2-42 |
| ఉదాసీనానా | 2-2-27 |
| ఉపదేశభేదా | 1-1-27 |
| ఉపపత్తేశ్చ | 3-2-25 |
| ఉపపద్యతే చా | 2-1-36 |
| ఉపపన్నస్తల్లక్ష | 3-3-30 |
| ఉపపూర్వమపి | 3-4-42 |
| ఉపమర్దం చ | 3-4-16 |
| ఉపలబ్ధివద | 2-3-37 |
| ఉపసంహారదర్శ | 2-1-24 |
| ఉపసంహారోర్థా | 3-3-5 |
| ఉపస్థితేఽతః | 3-3-41 |
| ఉపాదానాత్ | 2-3-35 |
| ఉభయథా చ | 2-2-16 |
| ,, ,, | 2-2-23 |
| ఉభయథాపి న | 2-2-12 |
| ఉభయవ్యపదే | 3-2-27 |
| ఉభయవ్యామోహా | 4-3-5 |
| ఊ | |
| ఊర్ధ్వరేతస్సు చ | 3-4-17 |
| ఏ | |
| ఏక ఆత్మనః | 3-3-53 |
| ఏతేన మాత | 2-3-8 |
| ఏతేన యోగః | 2-1-3 |

ఏతేనశిష్టా 2-1-12
ఏతేనసర్వే 1-4-28
ఏవంచాత్మా 2-2-34
ఏవంముక్తిఫ 3-4-52
ఏవమప్యుప 4-4-7

ఐ

ఐహికమప్య 3-4.51

క

కంపనాత్ 1-3-39
కరణవచ్చేన్న 2-2-40
కర్తాశాస్త్రార్థ 2-3-33
కర్మకర్తృవ్యప 1-2-4
కల్పనోపదే 1-4-10
కామకారేణ 3-4-15
కామాచ్చనాను 1-1-18
కామాదీతరత్ర 3-3-39
కామ్యాస్తుయథా 3-3-60
కారణత్వేన 1-4-14
కార్యంబాదరి 4-3-7
కార్యాఖ్యానా 3-3-18
కార్యాత్యయే 4.3-10
కృతప్రయత్నా 2-3-42
కృతాత్యయేను 3-1-8
కృత్స్నభావాత్తు 3-4-48
కృత్స్నప్రసక్తి 2-1-26
క్షణికత్వాచ్చ 2-2-31
క్షత్రియత్వ 1-3-35

గ

గతిశబ్దా 1-3-15
గతిసామా 1-1-10
గతేరర్థవ 3-3-29
గుణసాధా 3-3-64
గుణాద్వా 2-3-25
గుహాంప్రవి 1-2-11
గౌణశ్చేన్నా 1-1-6
గౌణ్యసంభ 2.3-3
,, ,, 2-4-2

చ

చక్షురాదివత్తు 2-4-10
చమసవద 1-4-8
చరణాదితి 3-1-9
చరాచర 2-3-16
చితితన్మా 4-4-6

| | |
|---|---|
| **ఛ** | |
| ఛందత ఉభ | 3-3-28 |
| ఛందోభిధా | 1-1-25 |
| **జ** | |
| జగద్వాచి | 1-4-16 |
| జగద్వ్యాపా | 4-4-17 |
| జన్మాద్యస్య | 1.1-2 |
| జీవముఖ్య | 1.4-17 |
| జీవముఖ్య | 1-1.31 |
| జ్ఞేయత్వా | 1-4-4 |
| జ్ఞోఽతఏవ | 2-3.18 |
| జ్యోతిరాద్య | 2-4-14 |
| జ్యోతిరుప | 1.4-9 |
| జ్యోతిర్దర్శ | 1-3-40 |
| జ్యోతిశ్చర | 1-1-24 |
| జ్యోతిషి భా | 1.3-32 |
| జ్యోతిషై కే | 1.4-13 |
| **త** | |
| తఇంద్రియాణి | 2-4--7 |
| తచ్ఛ్రుతేః | 3-4-4 |
| తడితోఽధి | 4-3-3 |
| తత్తుసమన్వ | 1-1-4 |
| తత్పూర్వక | 2-4-4 |
| తత్ప్రాక్ఛ్రుతేశ్చ | 2-4-3 |
| తత్రాపిచ | 3-1-16 |
| తథాచదర్శ | 2-3-27 |
| తథాచైకవా | 3-4-24 |
| తథాన్యప్రతి | 3-1-36 |
| తథాప్రాణాః | 2-4-1 |
| తదధిగమ | 4-1-13 |
| తదధీనత్వా | 1-4-3 |
| తదనన్యత్వ | 2-1-14 |
| తదన్తర ప్రతి | 3-1-1 |
| తదభావని | 1-3-37 |
| తదభావో నా | 3-3-7 |
| తదభిధ్యానా | 2-3-13 |
| తదవ్యక్త | 3-2-23 |
| తదాపీతేః | 4-2-8 |
| తదుపర్యపి | 1-3-26 |
| తదోకోఽగ్ర | 4-2-17 |
| తద్గుణసార | 2-3-29 |
| తద్ధేతువ్యప | 1-1-14 |
| తద్భూతస్యతు | 3-4-40 |
| తద్వతోవిధా | 3-4-6 |

| | | | |
|---|---|---|---|
| తన్నిర్ధారణా | 3-3-42 | దహరఉత్త | 1-3-14 |
| తన్నిష్ఠస్య | 1-1-7 | దృశ్యతేతు | 2-1-16 |
| తన్మనఃప్రాణ | 4-2-3 | దేవాదివద | 2-1-25 |
| తన్వభావే | 4-4-13 | దేహయోగాద్వా | 3-4-6 |
| తర్కాప్రతి | 2-1-11 | ద్యుభ్వాద్యా | 1-3-1 |
| తస్యచనిత్య | 2-4-16 | ద్వాదశాహ | 4-4-12 |
| తానిపరే | 4-2-15 | ధ | |
| తుల్యంతు | 3-4-9 | ధర్మంజైమిని | 3-2-40 |
| తృతీయశబ్దా | 3-1-21 | ధర్మోపప | 1-3-9 |
| తేజో౽తః | 2-3-10 | ధృతేశ్చమహి | 1-3-16 |
| త్రయాణామే | 1-4-6 | ధ్యానాచ్చ | 4-1-8 |
| త్ర్యాత్మకత్వా | 3-1-2 | న | |
| ద | | నకర్మావిభాగా | 2-1-35 |
| దర్శనాచ్చ | 3-1-20 | నచకర్తుఃకర | 2-2-43 |
| ,, ,, | 3-2-21 | నచకార్యేప్రతి | 4-3-41 |
| ,, ,, | 3-3-48 | నచపర్యాయా | 2-2-35 |
| ,, ,, | 3-3-66 | నచస్మార్తమత | 1-2-19 |
| ,, ,, | 4-3-13 | నచాధికారిక | 3-4-41 |
| దర్శయతి | 4-4-20 | నతుదృష్టాన్త | 2-1-9 |
| దర్శయతిచ | 3-3-4 | నతృతీయేతథో | 3-1-18 |
| ,, ,, | 3-3-22 | నప్రతీకేనహి | 4-1-4 |
| దర్శయతిచాథో | 3-2-17 | నప్రయోజన | 2-1-32 |

| | |
|---|---|
| నభావో౽నుప | 2-2-30 |
| నభేదాదితి | 3-2-12 |
| నవక్తురాత్మో | 1-1-29 |
| నవాతత్సహ | 3-3-65 |
| నవాప్రకరణ | 3-3-7 |
| నవాయుక్రియే | 2-4-9 |
| నవావిశేషాత్ | 3-3-21 |
| నవియదశ్రు | 2-3-1 |
| నవిలక్షణ | 2-1-4 |
| నసంఖ్యోప | 1-4-11 |
| నసామాన్యా | 3-3-51 |
| నస్థానతో౽పి | 3-2-11 |
| నాణురత | 2-3-21 |
| నాతిచిరేణ | 3-1-23 |
| నాత్మాశ్రుతే | 2-3-17 |
| నానాశబ్దాది | 3-3-58 |
| నానుమాన | 1-3-3 |
| నాభావఉప | 2-2-28 |
| నావిశేషాత్ | 3-4-13 |
| నాసతో౽దృ | 2-2-26 |
| నిత్యమేవచ | 2-2-14 |
| నిత్యోపలబ్ధ్య | 2-3-32 |
| నియమాచ్చ | 3-4-7 |
| నిర్మాతారం | 3-2-2 |
| నిశినేతి | 4-2-19 |
| నేతరో౽నుప | 1-1-16 |
| నైకస్మిన్దర్శ | 4-2-6 |
| నైకస్మిన్నసం | 2-2-33 |
| నోపమర్దే | 4-2-10 |
| **ప** | |
| పంచవృత్తి | 2-4-12 |
| పటవచ్చ | 2-1-19 |
| పత్యాదిశబ్దే | 1-3-43 |
| పత్యురసా | 2-2-37 |
| పయో౽ంబు | 2-2-3 |
| పరంజైమిని | 4-3-12 |
| పరమతస్సేతూ | 3-2-31 |
| పరాత్తుతత్ | 2-3-14 |
| పరాభిధ్యా | 3-2-5 |
| పరామర్శం | 3-4-18 |
| పరేణచశబ్ద | 3-3-52 |
| పారిప్లవా | 3-4-23 |
| పుంస్త్వాది | 2-3-31 |
| పురుషవిద్యా | 3-3-24 |

| | | | |
|---|---|---|---|
| పురుషార్థో | 3-4-1 | ప్రదానవదేవ | 3-3-43 |
| పురుషాశ్మవ | 2-2-7 | ప్రదీపవదా | 4-4-15 |
| పూర్వంతు | 3-2-41 | ప్రదేశాదితి | 2-3-53 |
| పూర్వవద్వా | 3-2-29 | ప్రవృత్తేశ్చ | 2-2-2 |
| పూర్వవికల్పః | 3-3-45 | ప్రసిద్ధేశ్చ | 1-3-17 |
| పృథగుపదే | 2-3-28 | ప్రాణగతేశ్చ | 3-1-3 |
| పృథివ్యధి | 2-3--2 | ప్రాణభృచ్చ | 1-3-4 |
| ప్రకరణాచ్చ | 1-2-10 | ప్రాణవతా | 2-4-15 |
| ప్రకరణాత్ | 1-3-6 | ప్రాణస్తథా | 1-1-28 |
| ప్రకాశవచ్చా | 3-2-15 | ప్రాణాదయో | 1-4-12 |
| ప్రకాశాదివచ్చా | 3-2-25 | ప్రియశిరస్త్వా | 3-3-12 |
| ప్రకాశాదివన్నై | 2-3-46 | ఫ | |
| ప్రకాశాశ్రయ | 3-2-28 | ఫలమత | 3-2-38 |
| ప్రకృతిశ్చ | 1-4-23 | బ | |
| ప్రకృతైతా | 3-2-22 | బహిస్తూభయ | 3-4-43 |
| ప్రతిజ్ఞాసిద్ధేః | 1-4-20 | బుద్ధ్యర్థః | 3-2-33 |
| ప్రతిజ్ఞాహాని | 2-3-6 | బ్రహ్మదృష్టి | 4-1-5 |
| ప్రతిషేధాచ్చ | 3-2-30 | బ్రాహ్మేణజై | 4-4-5 |
| ప్రతిషేధాదితి | 4.2-12 | భ | |
| ప్రతిసంఖ్యా | 2-2-22 | భాక్తంవా | 3-1-7 |
| పత్యక్షోప | 4-4-18 | భావంజైమి | 4-4-11 |
| ప్రథమేఽశ్రవ | 3-1-5 | భావంతుబాద | 2-3-33 |

భావశబ్దాచ్చ 3-4-22
భావేచోప 2-1-15
భావేజాగ్ర 4-4-14
భూతాదిపాద 1-1-26
భూతేషుత 4-2-5
భూమాసంప్ర 1-3-8
భూమ్నఃక్రతుం 3-3-57
భేదవ్యపదేశాచ్చ 1-1-17
భేదవ్యపదేశా 1-1-21
భేదవ్యపదేశాచ్చా 1.1-21
భేదవ్యపదేశాత్ 1-3-5
భేదశ్రుతేః 2-4-18
భేదాన్నేతి 3-3-2
భోక్త్రాపత్తే 2-1-13
భోగమాత్ర 4-4-21
భోగేనత్వితర 4-1-19

మ

మధ్వాదిష్వసం 1-3-31
మంత్రవర్ణాత్ 2-3-44
మంత్రాదివద్వా 3-3-56
మహద్దీర్ఘ 2-2-11
మహద్వచ్చ 1-4-7
మాంసాదిభౌమం 2-4-21
మాంత్రవర్ణిక 1-1-15
మాయామాత్రం 3-2-3
ముక్తఃప్రతి 4-4-2
ముక్తోపసృ 1-3-2
ముగ్ధేఽర్ధసం 3-2-10
మౌనవదిత 3-4-49

య

యత్రైకాగ్రతా 4-1-11
యథాచతక్షో 2-3-40
యథాచప్రాణా 2--120
యదేవవిద్య 4-1-18
యావదధి 3-3-32
యావదాత్మ 2-3-30
యావద్వికారం 2-3-7
యుక్తేశ్శబ్దా 2-1-18
యోగినఃప్రతి 4-2-21
యోనిశ్చహి 1-4-27
యోనేశ్శరీరం 3-1-27

ర

రచనానుప 2-2-1
రశ్మ్యనుసా 4-2-18
రూపాదిమ 2-2-15

| | | | |
|---|---|---|---|
| రూపోపన్యాసా | 1-2-23 | విభాగశ్శత | 3-4-11 |
| రేతస్సిగ్యోగో | 3-2-26 | విరోధఃకర్మ | 1-3-27 |
| | | వివక్షితగుణో | 1-2-2 |
| ల | | విశేషంచదర్శ | 4-3-16 |
| లింగభూయస్త్వా | 3-3-44 | విశేషణభేద | 1-2-22 |
| లింగాచ్చ | 4-1-2 | విశేషణాచ్చ | 1-2-13 |
| లోకవత్తు | 2-1-33 | విశేషానుగ్ర | 3-4-38 |
| వ | | విశేషితత్వా | 4-3-8 |
| వదతీతి | 1-4-5 | విహారోప | 2-3-34 |
| వాక్యాన్వయా | 1-4-19 | విహితత్వా | 3-4-32 |
| వాఙ్మనసి | 4-2-1 | వృద్ధిహ్రాస | 3-2-20 |
| వాయుమబ్దా | 4-3-2 | వేధాద్యర్థ | 3-3-25 |
| వికరణత్వా | 2-1-31 | వైద్యుతేనైవ | 4-3-6 |
| వికల్పోఽవిశిష్ట | 3-3-59 | వైధర్మ్యాచ్చ | 2-2-29 |
| వికారావర్తి చ | 4-4-19 | వైలక్షణ్యాచ్చ | 2-4-19 |
| వికారశబ్దా | 1-1-13 | వైశేష్యాత్తు | 2-4-22 |
| విజ్ఞానాది | 2-2-44 | వైశ్వానరస్సా | 1-2-24 |
| విద్యాకర్మణో | 3-1-17 | వైషమ్యనై | 2-1-34 |
| విద్యైవతు | 3-3-47 | వ్యతిరేకస్త | 3-3-54 |
| విధిర్వాధార | 3-4-20 | వ్యతిరేకాన | 2-2-4 |
| విపర్యయేణ | 2-3-14 | వ్యతిరేకోగం | 2-3-26 |
| విప్రతిషేధాచ్చ | 2-2-45 | వ్యతిహారో | 3-3-37 |
| విప్రతిషేధాచ్చా | 3-2-10 | | |

| | |
|---|---|
| వ్యపదేశాచ్చ | 2-3-36 |
| వ్యాప్తేశ్చ | 3-3-9 |
| **శ** | |
| శక్తివిపర్య | 2-3-38 |
| శబ్దఇతిచే | 1-3-28 |
| శబ్దవిశేషాత్ | 1-2-5 |
| శబ్దశ్చాతో | 3-4-31 |
| శబ్దాచ్చ | 2-3-4 |
| శబ్దాదిభ్యో | 1-2-26 |
| శబ్దాదేవ | 1-3-24 |
| శమదమాద్యు | 3-4-37 |
| శారీరశ్చోభ | 1-2-20 |
| శాస్త్రదృష్ట్యా | 1-1-30 |
| శాస్త్రయోని | 1-1-3 |
| శిష్టేశ్చ | 3-3-62 |
| శుగస్యతద | 1-3-34 |
| శేషత్వాత్పురు | 3-4-2 |
| శ్రవణాధ్యయ | 1-3-38 |
| శ్రుతత్వాచ్చ | 1-1-11 |
| ,, ,, | 3-2-39 |
| శ్రుతేశ్చ | 3-4-46 |
| శ్రుతేస్తుశబ్ద | 2-1-27 |
| శ్రుతోపని | 1-2-16 |
| శ్రుత్యాదిబలీ | 3-3-49 |
| శ్రేష్ఠశ్చ | 2-4-8 |
| **స** | |
| సంజ్ఞాతశ్చే | 3-3-8 |
| సంజ్ఞామూర్తి | 2-4-20 |
| సంయమనేత్వ | 3-1-13 |
| సంస్కారపరా | 1-3-36 |
| సఏవతుకర్మా | 3-2-9 |
| సంకల్పాదేవతు | 4.4.8 |
| సత్త్వాచ్చావర | 2.1-16 |
| సంధ్యేసృష్టి | 3-2-1 |
| సప్తగతేర్వి | 2.4.5 |
| సమన్వారం | 3-4-5 |
| సమవాయా | 2-2-13 |
| సమాకర్షాత్ | 1-4-15 |
| సమాధ్యభా | 2-3-39 |
| సమానఏవం | 3-3-19 |
| సమాననామ | 1-3-30 |
| సమానాచాసృ | 4-2-7 |
| సమాహారాత్ | 3-3-63 |
| సముదాయఉభ | 2-2-18 |

| | | | |
|---|---|---|---|
| సంపత్తేరితి | 1-2-31 | సామీప్యాత్తు | 4-3-9 |
| సంపద్యావిర్భ | 4-4-1 | సాంపరాయే | 3-3-27 |
| సంబంధాదేవ | 3-3-20 | సుకృతదుష్కృ | 3-1-11 |
| సంబంధానుప | 2-2-38 | సుఖవిశిష్టాభి | 1-2-15 |
| సంభృతిద్యు | 3-3-23 | సుషుప్త్యుత్క్రాం | 1-3-42 |
| సంభోగప్రా | 1-2-8 | సూక్ష్మంతుత | 1-4-2 |
| సర్వత్రప్రసి | 1-2-1 | సూక్ష్మంప్రమా | 4-2-9 |
| సర్వథానుప | 2-2-33 | సూచకశ్చహి | 3-2-4 |
| సర్వథాపితే | 3-4-34 | సైవహినస | 3-3-38 |
| సర్వధర్మోప | 2-1-37 | సోధ్యక్షేతదు | 4-2-4 |
| సర్వవేదాంత | 3-3-1 | స్తుతయేనుమ | 3-4-14 |
| సర్వాన్నానుమ | 3-4-28 | స్తుతిమాత్రముపా | 3-4-12 |
| సర్వాపేక్షాచ | 3-4 2 | … శేషాత్ | 3 2 34 |
| సర్వాభేదాద | 3-3-10 | స్థానాదివ్యప | 1-2-14 |
| సర్వోపేతా | 2-1-30 | స్థిత్యదనాభ్యాం | 1-3-7 |
| సహకారిత్వేన | 3-4-33 | స్పష్టోహ్యేకేషామ్ | 4-2-13 |
| సహకార్యంతర | 3-4-47 | స్మరంతిచ | 2-3-47 |
| సాక్షాచ్చోభయా | 1-4-25 | ,, ,, | 3-2-14 |
| సాక్షాదప్యవి | 1-2-28 | ,, ,, | 4-1-10 |
| సాచప్రశాస | 1-3-11 | స్మర్యతేచ | 4-2-14 |
| సాభావ్యాపత్తి | 3-1-22 | స్మర్యతేపిచ | 3-1-19 |
| సామాన్యాత్తు | 3-2-32 | స్మర్యమాణ | 1-2-25 |

| | |
|---|---|
| స్మృతేశ్చ | 1-2-6 |
| ,, ,, | 4-3-11 |
| స్మృత్యనవకాశ | 2-1-1 |
| స్యాచ్చైకస్య | 2-3-5 |
| స్వపక్షదోషాచ్చ | 2-1-10 |
| ,, ,, | 2-1-29 |
| స్వశబ్దోన్మా | 2-3-22 |
| స్వాత్మనాచో | 2-3-20 |
| స్వాధ్యాయస్య | 3-3-3 |
| స్వాప్యయసంప | 4-4-16 |
| స్వాప్యయాత్ | 1-1-9 |
| స్వామినఃఫల | 3-4-44 |
| హ | |
| హస్తాదయస్తు | 2-4-6 |
| హానౌతూపాయ | 3-3-26 |
| హృద్యపేక్ష | 1-3-25 |
| హేయత్వావచ | 1-1-8 |

# బ్రహ్మసూత్రార్థ దీపిక

## — సవరణలు —

77-5-వృ-వృః

,,-6-షః-వృ

84_1-ర్యా-ర్యై

86_9-ధన-జల

,,-16-గ్నిర్య-గ్నిర్య

117-15-స్త్ర-స్త్ర

125-19-పటు-పట్టు

127-7అ-అ

136-11యులో-యుములో

,, ,,

146-8-కేతుడు-కేతుండు

146-2-ప్రహో-ప్రిహో

197-5-గార్య-కార్య

199-9-తిక్ష-తిరిక్ష

208_5_విచిత్రత్రై-త్రై విచిత్ర

210-13-అప్రధు-అప్రధా

216-18_నర్శ్య-దర్శ్య

230_16-సముదా-సమునా

242-17-యుక్త్య-యుక్త్యక్త్వ

261-21-వియుం-వింయు

328-19-విద్యా-విద్య

,,-20-ము-ము (లేదు)

361_2-హిం-హాం

364_12-కాహా-కాష్ఠా

375_19-వౌ-రౌ

370_1-ర-వ

411-18-దర్శ-దర్శన

482-12-కర్శ్మ-శ్మక

495_7-పాకు-పానకు

503_22-యుము-యునము

509_15-బ్రహా-బ్రహ్మా

511-8-శాయ-స్థాయ

273_9_ఖ-క్త్ర

R. SK. S. LIBRARY
Acc. No.: 1639
Class No. ..........

## మా ఇతర గ్రంథములు

## శ్రీకృష్ణనాగశాస్త్రి పుస్కరణము :-

ఇది ...గంధీతరు శంకరాద్వైత సిద్ధాన్తాను గుణమగు

ఆంధ్రపద్యానువాదము

భావము ప్రతివారికిని దెలియునట్లు పద్యములు
సులభశైలిలో నుండును. 5-00

శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము

ఇది శంకర భాష్యముతోసహా ఆంధ్రమున టీక వ్రాయం
బడినది. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ మాహా
త్మ్యము ... అందలి విశేషములతో దనుగూపిన పీఠికతో
ప్రకటింపబడినది. అచ్చులో 5-00

...లింగేశ్వర శతకము " 1-00

గోదావరీ పుష్కర మాహాత్మ్యము 1-00

త్రిలింగవైభవము 1-50

- వ్యాకరణము 1-50

...యమ్ము శిష్య 1-50

ప్రశ్నోత్తరి అచ్చులో 1-50

హరనాథ స్తుతి :- 0-50

ప్రతులకు

వారణాసి గంగాధరశాస్త్రి

సీతంపేట - రాజమహేంద్రవరము 1

(బ్రాంచి) కొవ్వూరు, ప. గో. జిల్లా